Rs. 15

మరోజన్మ

ప్రత్యేక సంచిక

అఖిల

అఖిల భారత పత్రిక

జనవరి 2010

4.4.2009 — 4.4.2010

శ్రీఅరవిందులు పాండిచ్చేరి చేరుకుని నూరు వసంతాలు నిండిన సంవత్సరము.

19.9.2009 — 19.9.2010

శ్రీఅరవింద సొసైటీ స్వర్ణోత్సవ సంవత్సరం.

విషయసూచిక

నూతన జన్మ

అమ్మ మనకు ఇచ్చే నూతన జన్మ	4
ఆధ్యాత్మిక నూతన జన్మ	5
నవజీవనానికి అవకాశం ఉంది	8
సాక్షిక చైతన్యంలో నుంచి బయటపడు	10
చైత్యపురుష వినూత్న జన్మ	12
నిశ్చయాత్మకమైన మార్గాన్ని అనుసరించు	13
అహానికి బదులు దివ్యచేతన నుద్ధరించు	15
చెరనుంచి బయటపడు	16
నూతన జన్మకు మార్గము	18
యోగమంతా స్వాభావికంగా ఒక కొత్త జన్మ	19
జీవాత్మ జన్మపరంపర	22
రెండు దశలలో కూడిన కొత్త జన్మ	23
దీని నొక నవజీనంగా భావించు	24
శ్రీఅరవిందుల ఆశీసు ్సలు	28
పరమోన్నత ఆధ్యాత్మిక పునర్జన్మ	28
సమాచార పత్రం	30

<u>గమనిక</u>

అక్టోబరు 2009 సంచిక కవరు పేజీపై ముద్రించిన పుష్పమునకు ఆధ్యాత్మిక ప్రాచుర్యము:

"Imagination", – not "Descent of Light"

సవరణను గమనించగలరు



ఆశీస్సు

అసతో మా సద్గమయ
తమసో మా జ్యోతిర్గమయ
మృత్యోర్మామృతం గమయ
ఓం శాంతిః శాంతిః శాంతిః

(బృహదారాణ్యక ఉపనిషత్తు)

అసత్యము నుంచి సత్యస్థితికి
చీకటి నుంచి వెలుగు లోనికి
మృత్యువు నుంచి అమృతత్వానికి — నడిపించు
ఓం శాంతిః శాంతిః శాంతిః

(బృహదారణ్యక ఉపనిషత్తు)

తథాస్తు

శ్రీఅరవిందులు

అమ్మ మనకు ఇచ్చే నూతన జన్మ

సాధారణ సత్యాలను, సుస్పష్టంగా కనిపించే తేడాలను తెలుసుకోలేని అశక్తత నీవు రాసిన లేఖవల్ల నాకు స్పష్టమవుతున్నది. 'X' అనే వ్యక్తికి భౌతికజన్మ నిచ్చిన స్త్రీ ఆమె జీవితకాలంలో అతనికి తల్లి. సందేహం లేదు. కాని ఇక్కడ ఉన్న శ్రీమాతకు, 'X' కు మధ్యనగల సంబంధం చైత్య, ఆధ్యాత్మిక మాతృత్వ బాంధవ్యం. అదే బంధం ఆమెను తల్లిగా ఆమోదించినవారికి ఆమెకు మధ్య వర్ధిల్లుతున్నది. ఒక శిశువుకు జన్మనిచ్చిన మామూలు స్త్రీకి గల సంబంధంకన్న మహోన్నతమైనది అది. మానవ మాతృత్వం ఇచ్చేదంతా ఇస్తుంది. ఆమె (శ్రీమాత) అయితే అది మరింత ఉన్నతశ్రేణిలో వుంటుంది. అందులో ఇంకా యెంతో అనంతమైనది ఉంది. శ్రీమాతతో బంధం మరింత మహనీయమైనది. మరింత పరిపూర్ణమైనది. అందు చేత భౌతికబంధాన్ని తీసుకొని, దాని స్థానంలో బాహ్య, ఆంతరంగిక జీవితశ్రేణులలో ఆ బంధం స్థిరపరుస్తుంది. లోకజ్ఞానం, అరమరికలులేకుండా సూటీగా పోయే మనసు ఉన్నవాళ్లు గందరగోళపడ నవసరం లేదు. భౌతికబంధానికి చెందిన వాస్తవం మరింత గొప్పదైన చైత్య, ఆధ్యాత్మిక సత్యానికి ఎంతమాత్రమూ అడ్డు నిలవలేదు. అది వాస్తవం కాకుండా చేయలేదు. ఈమె తనకు నిజమైన తల్లి అని 'X' అన్నప్పుడు, అతను, నిజమే చెపుతున్నాడు. ఆంతరంగిక జీవితంలో ఆమె అతనికి కొత్త జన్మను ప్రసాదించింది. ఒక దివ్యతర జీవనవికాసం కోసం అతనిని నవ్యరూపంగా ఆమె మలుస్తోంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: యజ్ఞన్న

ఆధ్యాత్మిక నూతన జన్మ

నూతన జన్మగా పిలవబడేది యెప్పుడంటే ఆధ్యాత్మిక జీవనం, ఆధ్యాత్మిక చైతన్యం మనిషిలో పుట్టినప్పుడు. వైయక్తికంగా ఆత్మ ద్వారా వ్యక్తిలో యేదో దివ్యస్పందన ప్రవేశమే అది. అప్పటి నించి అదే ఆ వ్యక్తి వునికిపై ఆధిపత్యాన్ని సాధించి జీవితాన్ని శాసించగలుగుతుంది. కాని అతిమానస ప్రపంచంలో ఆ దివ్యశక్తే సమస్త విశ్వానికి అధిపతి. తన సమస్త అభివ్యక్తులు, సమస్త భావవ్యక్తీకరణలు ఏ ప్రేరణ లేకుండానే చైతన్యవంతంగా సహజంగా మారిపోతాయి.

వ్యక్తి వునికిలో అంతా దీనికి విరుద్ధంగా వుంటుంది. ఒకడు యెంతకాలం దివ్య శక్తి గురించి కేవలం మాట్లాడుతాడో అంతకాలం యేదో చదివినదే చెప్పగలుగుతాడు. దాని వునికి గురించి అస్పష్టంగానే తప్ప నిర్దుష్టంగా ఆ చైతన్యం యొక్క వాస్తవరూపం తెలిసినవాడు కాదు. అంటే దానర్థం అతడు ఆధ్యాత్మికంగా నూతన జన్మ నెత్తినవాడు కాదు. వ్యక్తి ఆధ్యాత్మికంగా జన్మించినట్టయితే అది పదార్థ ప్రపంచంకంటె స్పష్టంగా జీవం తొణికిసలాడుతూ వాస్తవికంగా, వివరంగా వుంటుంది. ఇది జీవుల మధ్య అవసరమయిన తేడాలను సృష్టిస్తుంది. అది నవనవోన్మేషమయిన వాస్తవము. సత్యము, యదార్థము అయిన వునికి. వ్యక్తి హాయిగా వూపిరి పీల్చుకోగలిగిన వాతావరణము. అప్పుడే మనిషికి తెలుస్తుంది తాను అవతలి వైపుకు చేరినట్టు. కాని యెంతకాలం అస్పష్టంగా, గందరగోళంగా వుంటుందో అంతకాలం దాని గురించి వింటావు. దాని వునికీ నీకు తెలుస్తుంద. కాని అది స్పష్టమైన వాస్తవం మాత్రం కాదు. సరే! దీనర్థం కూడా యింకా ఆధ్యాత్మికంగా నూతన జన్మ నెత్తలేదనే. ఎంతకాలం — ఇది నేను చూడగలను. తాకగలను. ఈ బాధ అనుభవిస్తున్నాను. ఆకలితో దహించుకుపోతున్నాను. ఈ నిద్ర నాకు చాలా భారంగా వుంది. ఇది యదార్థం. ఇది స్పష్టం. (శ్రీమాత నవ్వుతారు) యివన్నీ అనుకుంటున్నావంటే, నువ్వింకా అవతలి తీరం చేరలేదని. ఆధ్యాత్మికంగా జన్మించలేదని అర్థం.

(నిశ్శబ్దం)

నిజానికి చాలామంది కిటికీలు, ద్వారాలు అన్నిటి తలుపులూ మూసుకుని ఖైదీల్లాగా వుంటూ వుక్కిరిబిక్కిరవుతూ వుంటారు. ఇది యెంతో సహజం. ఆ తలుపు తెరచే



తాళంచెవి వాళ్ల దగ్గరే వుంటుంది. కాని అది వాళ్ళు వుపయోగించరు. వాళ్ళ దగ్గరే ఆ తాళంచెవి వున్నట్టు వాళ్ళకు తెలియదు. కాని చాలా రోజుల తరువాత అది వాళ్ళు తెలుసుకుంటారు. లేదా తెలియజేయబడతారు. అప్పుడు హడావిడిగా అది వుపయోగించాలనుకుంటారు. కాని అక్కడ కూడా వాళ్ళకి సంశయం యేమిటంటే యీ తాళంచెవి సాయంతో తాము ఆ తలుపులు తెరవగలమా? అని. అయినా "మహా అయితే యేమవుతుంది? మంచి జరిగితే జరగవచ్చు" అనుకుంటారు. అంటే యింకా వాళ్ళకి కొంత భయం వుండనే వుంది. ఈ కిటికీలు, ద్వారాలు తెరిస్తే యేమవుతుంది? వెలుగులో, గాలిలో స్వేచ్ఛగా వుండడానికి భయపడతారు. 'మేము' అనుకుంటూ అలా వుండిపోడానికే యిష్టపడతారు. వాళ్ళ స్వభావం అలా వుండటానికి యిష్టపడి దాన్నే అంటిపెట్టుకుని వుంటుంది. అలాంటి వాళ్ళకి యిప్పటికీ వున్న నమ్మక మేమిటంటే వాళ్లకి ఉన్న పరిమితుల్లేకుండా ఒక్క క్షణమైన వుండలేమని.

అందుకే ఆ ప్రయాణం అంత సుదీర్ఘ మైనది; ప్రయాసతో కూడినది. కాబట్టి, వ్యక్తి తాను తన కేవల భౌతకి అస్తిత్వానికి స్వస్తి పలికేందుకు, నిజంగా, అంగీకరించనవాడే కనుక అయితే, అపుడు అతనికి ప్రతీదీ యెంత సులువుగా, వేగవంతంగా, ప్రకాశవంతంగా, ఆనందమయంగా ఉంటుందో! అయితే ఇది అందరూ అర్థం చేసుకొనే ఆనందం, సౌలభ్యం లాంటిది కాదు. నిజానికి పోరాటాన్ని ఆనందించని వాళ్లు బహుకొద్దిమంది ఉంటారు. చీకటి లేకపోవటాన్ని అంగీకరించేవాళ్లు బహు కొద్దిమంది. వెలుగు, చీకటికి విరుద్ధమనే తప్ప మరోలా భావించేవాళ్లు బహు కొద్దిమంది. "నీడ లేకుండా బొమ్మ ఉండదు. పోరాటం లేకుండా విజయము వుండదు. బాధ లేకుండా ఆనందం లేదు." — వాళ్లీ ఆలోచనా విధానం ఈ విధంగా ఆలోచించినంత వరకు, వ్యక్తి ఇంకా ఆత్మజీవనుడుగా జన్మించవలసిన వాడుగానే ఉంటాడు.

మూలం: శ్రీమాత

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

సుదూరమైన లేక ఉన్నతంగా ఉద్ధరింపబడే పారవశ్యం కలిగిస్తూ ఒంటరిగా అజ్ఞేయంగా నిలిచే జీవితమేకాక, మన యోగానికి కార్యరంగం జీవితం (సర్వమూ). మన బాహ్య, సంకుచిత అసంపూర్ణ, మానవ జీవన విధానానికి సంబంధించిన ఆలోచన, దృష్టి, ఉద్వేగం, మరియు అస్తిత్వములు — లోతైన ఒక సువిశాల ఆధ్యాత్మికచేతన లోనికి పరిణామం — బాహ్యాంతర సత్వాల సమీకృత అస్తిత్వం — సాధారణ మానవజీవనం దివ్యజీవనంగా పరిణామం — ఇదీ యోగానికి ప్రధానమైన ప్రయోజనం.

సాధారణ మానవుని జీవనవిధానం అసంబంద్ధంగా ఉంటుంది. ఈ జీవనం కొంత స్థిరమైన కొంత అస్థిరమైన మూలకాల సమాహారం. దీనికి సంబంధించినవే అపరిపూర్ణంగా శాసించే ఆలోచనలు, అవగాహనలు, సంవేదనలు, ఉద్రేకాలు, కామనలు, ఆనందాలు, పునరావృతమయే యాంత్రికచర్యలు. ఇవన్నీ కొంతమేరకే గమనశీలంగాను, స్వయంప్రకాశితంగాను ఉంటాయి. కాని వీటన్నిటికీ కేంద్రం బాహ్య అహం. ఈ క్రియాకలాపాల చలితచాలనాల మొత్తం అభివృద్ధి ఆంతరికంగా ఈ జీవనంలోనే పనిచేస్తూ కొంతమేరకు దృశ్యమానవుతుంది. మరికొంత బీజరూపంలో రాబోయే జీవనానికి పురోగమనశీలంగా ఉంటుంది. ఈ చైతన్యవికాసం, విస్తృతి, ఇతోధిక ఆత్మవ్యక్తీకరణ, శారీరక అవయవ సామరస్య సక్రమవికాసం — ఇదీ బ్రతుకుకి పరిపూర్ణ సార్ధకత. ఇదే సారభూతమైనది కూడా. బుద్ధి, ఇచ్ఛాశక్తి, మానసికోద్వేగం, కోరిక, క్రియ, మరియు అనుభవం — వీటివల్ల పొందే సార్ధక చైతన్య క్రమవికాసంతో, తుదకు, పరమోత్కృష్ట ఆత్మావిష్కరణం పొందవలసినవాడు, శరీరధారియై బుద్ధిజీవనుడుగా ఉన్న మానవుడు. మిగిలినదేదైతే ఉందో అదంతా అందుకు విధేయంగా సహకరించేదే అయి ఉండాలి. అలా కాకపోతే అది యాదృచ్ఛికంగా సంభవించేదయి నిరర్ధకం అవుతుంది. స్వభావ పరిణామక్రియకి దోహదం చేసేది, జీవాత్మ వికాసానికి తోడ్పడేది, అందుకు ఆసరాగా ఉండేది — ఏదో అదే గణనీయమైనదిగా ఉంటుంది.

ఇక్కడ మన ఉనికికి, మన అస్తిత్వానికి సర్వోన్నత ఆదర్శం అదే. దానిని వేగవంతం చేయటమే మన యోగలక్ష్యం. అంతకు ఏమాత్రం తక్కువైనది కాదు.

సాధారణ సహజ ప్రకృతి పరిణామ ప్రక్రియలో ఈ లక్ష్యసాధన మందకొడిగాను, గందరగోళంగాను సాగుతుంది. అందుకే మన యోగం ఈ పద్ధతిని వెనక్కి నెట్టివేస్తుంది. ఎందుకంటే సాధారణ ప్రకృతి పరిణామంలో జీవుని వికాసం క్రమబద్ధంగా ఉండదు. సందేహాస్పదంగా ఉంటుంది. పరిసరాల ఒత్తిడికి లోబడి మరుగున పడిపోతూంటుంది. క్రమశిక్షణ లేక చీకట్లో వెతుకులాట అవుతుంది. చేసే కృషి అజ్ఞానంతో కూడినదిగా ఉండి ప్రయోజనకరంగా ఉండదు. అవకాశాలు వినియోగించుకోవటంలో తత్తరపాటు, తెలివితక్కువతనం ఉంటుంది. ఊహించని సంఘటనలు, పరిస్థితులు, మార్పులు — వీటితో కూడి ఉంటుంది. అయితే ఒకటి నిజం. అక్కడ నిగూఢంగా, తెర మరుగున ఉంటూ, మార్గనిర్దేశం చేసే దైవం యొక్క జోక్యం అసలు ఉండకపోదు. ఈ తికమకతో కూడిన వక్రమైన పీతనడకకి ప్రత్యామ్నాయమే మన యోగం. ఇది శీఘ్రగమనం కలది. స్వయంచోదక పరిణామప్రక్రియ ఇది. సరళమయినది. సూటిమార్గాన నిర్దేశిత గమ్యానికి తీసుకెళ్ళటానికి ప్రణాళికాబద్ధమైన కార్యాచరణ విధానం కలది. అయితే ఒక్క విషయం. ఇక్కడ, తక్షణ లక్ష్యసాధన ప్రస్తావన కూడదు. ఈ పురోగమనం అనంతంగా సాగేది. అయినా కూడా ఇంతవరకు సాధించినదానిని పురస్కరించుకొని, దాని కతీతంగా ఒక సన్నిహిత గమ్యాన్ని, భవిష్య లక్ష్యాన్ని సూత్రబద్ధం కావించుకుని, సాధించేందుకు జీవాత్మ ఆకాంక్ష ఉంటుంది. మనిషి కొత్త జన్మపొందే అవకాశం ఉంది. సత్త్వము ఊర్ధ్వగమనంలో ఉన్నత శిఖరాల నధిరోహించి, తిరిగి కిందికి దిగి తన తోటివాళ్లని రూపాంతరీకరణ దిశగా ఉద్ధరించే అవకాశం ఉంది. విస్తృత ఆధ్యాత్మిక వికసిత చైతన్యంతో సంస్కరింపబడిన శక్తిగా మానవుడు జీవన్ముక్తుడు కావటానికి అవకాశం ఉంది. ఈ పరిణామం వ్యక్తిని అధిగమించి, విస్తృతిచెంది, దివ్యజీవన సమాజంగా ఆవిర్భవించి, అతిమానసజాతిని సంఘటితపరచే అవకాశం ఉంది. ఈ నవ మానవ జాతి అవతరణయే మా లక్ష్యం. మా యోగానికి పరిపూర్ణ పరమార్థం దివ్యచేతనా వికాసం. సాధారణ జీవనం నుంచి దివ్యజీవనం లోనికి జీవుని పరివర్తన — తన ప్రాకృతిక సర్వ విభాగాలతో సహా.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

సాక్షిక చైతన్యంలోంచి బయటపడు

ఏది నిజం? ఈ భూమి మీద యెందుకున్నాం? జీవిత పరమార్థం ఏమిటి? ఏమిటీ (శరీర) రూపకల్పన? ఏమిటీ బ్రతుకు? ఏ ఒక్కసారి కూడా తమలో తాము ఈ ప్రశ్నలు వేసుకోకుండా జనబాహుళ్యం బ్రతుకుతూ ఉంటుంది. ఉన్నత వర్గాలలో ఏ కొద్దిమంది మదిలోనో ఈ ప్రశ్నలు తలెత్తుతాయి. ఇందుకై సమాధానాలు అన్వేషించేవారు మరీ కొద్దిమంది. శ్రీఅరవిందుల లాటి మహర్షి, తత్త్వవేత్తలు, అన్వేషకులు — అందుకు అంకితమైనవారి మహనీయుల గ్రంథాలు అధ్యయనం చేసే అదృష్టం లభ్యమైతే తప్ప సమాధానాలు అంత సులువుగా దొరకవు. ఎన్నో కోట్ల మంది జనాలు ఉన్నట్లే మనమూ ఈ సాధారణ లోకంలో ఉంటున్నాం. ఎప్పుడో చాలా అరుదుగా ఏదో మతాన్ని గురించి, దేవతల గురించి వింటూ ఉంటాం. అదేనా ఏదో ఒక ఆచారవ్యవహారంగానే తప్ప, విశ్వాసం ఉండి కాదు. అప్పుడేనా కూడా — మనం ఇక్కడ యెందుకున్నాం అనేదానికి సమాధానం అరుదుగా వింటాం. అలాటపుడు మనం మన ఉనికి గురించిన స్పృహ మనకెంత మాత్రమూ రాదు. యాంత్రికంగా జీవిస్తూ ఉంటాం. బాల్యంలో ఆటల ధ్యాస, తిండి ధ్యాస. తర్వాత చదువుసంధ్యల వ్యాపకం. ఆ పైన జీవనపరిస్థితుల గురించిన యాతన. అలాటపుడు, "అయితే మనం ఇక్కడ యెందుకున్నాం?" అనే సమస్య నెదుర్కొనే అవకాశ మెక్కడ ఉంటుంది? ఎంతమందికీ ఆలోచన కలుగుతుంది?

అదెపుడో ప్రత్యేక పరిస్థితులలో మాత్రమే — అందులో చాలవరకు అవి వ్యధాపూరితంగానే ఉంటాయి. దురదృష్టవశాన — ఆ ఆలోచన వస్తుంది. లేకుంటే అలా ముందుకు సాగిపోతూనే ఉంటుంది. అయితే మనిషి అంతరాంతరాళాలలో చైత్యపురుష సత్త ఉన్నది. అది చైతన్యాన్ని జాగృతం చేయుంట కోసం, సమైక్యతను పునరుద్ధరించటానికి అన్వేషణ కావిస్తూనే ఉంటుంది. అయితే, ఆ యెరుక ఎవరికీ ఉండదు.

జీవితాన్ని కదిలించే ఏదో ఒక శక్తి, ఒక ప్రచోదన, ఒక కదలిక, ఒక ఆకర్షణ, ఒకటేదో ఉన్నదనే అనిశ్చిత భావన, తెలిసీతెలియని యెరుక — జీవితాన్ని ముందుకు నడిపిస్తోంది. అయినా అది ఇంకా అస్పష్టంగా, సందిగ్ధంగా పొగ కమ్మినట్లు, మసకగానే ఉంటోంది. ఈ అస్పష్టం, సందిగ్ధతలకు, జీవితం గురించిన పరమార్థానికి, స్పష్ట

మైన దార్శనికతకు, అవగాహనకు మధ్య, ఎంతో అగాధం ఉంది. ఇదిగో ఇలాటి సందిగ్ధ పరిస్థితిలో మాత్రమే వ్యక్తి విషయాల యదార్థాన్ని అవలోకించటానికి ప్రయత్నిస్తాడు. విధి నిర్దేశాన్ని అవగాహన చేసుకోగలగటానికి ప్రయత్నిస్తాడు. లక్ష్యమేమిటో, దానినెలా చేరుకోవాలో విచారిస్తాడు. ఇది, వరుసగా వచ్చే అంతరంగ ప్రేరణల ద్వారా, సంభావ్యం కాగలుగుతుంది. కొత్త దిశలకు దశలకు అకస్మాత్తుగా తలుపులు తెరిచినట్లుంటుంది. ఇదీ నిజంగా లోతైన స్థిరమైన నిజచైతన్యం లోనికి పునర్జన్మ.

అంతవరకూ నిస్సహాయంగా బలీయమైన విధికి లోబడి, నలిగిపోతూ ఉంటావు. ముసిరిన చీకట్లలో కన్ను కానక వెతుకుల్లాడుతూ ఉంటావు. బ్రతుకు భారమై వంగిపోతావు, లేచి నిలబడి జీవనబంధాలైన మార్గనిర్దేశక జీవనతంతువు లన్నిటినీ కూడ తీసుకుని, ఏకోన్ముఖం చేసి, ముందుకు, స్పష్టమైన సాక్షాత్కార స్థితి వైపు సాగటానికి బదులు, దీనంగా కిందనే డేకుతూ ఉంటావు.

పాక్షిక చైతన్యం, సాధారణంగా, సహజ చైతన్యంగా పరిగణింపబడుతుంది. ఇందు నుంచి వ్యక్తి, బయట పడాలి. ఇది నీ "మామూలు" సాధారణస్థితిలో ఉండే సత్వము. దీనియొక్క అనిశ్చితత్వాన్ని, అస్పష్టతను, తగురీతిలో చూడగలగాలి. అందుకు ఓ అడుగు వెనక్కి వేయాలి. అనిశ్చితత్వాన్ని, అస్పష్టతని దర్శించి, ఆశ్చర్యచకితుడవు కాగలగాలి. వ్యక్తి నిదానంగా, స్థిరంగా, క్రమపద్ధతిలో అన్వేషిస్తూ ఉన్నట్లు తెలిసినపుడు, అదేదో ఎంతో అసాధారణ, "క్రమ విరహిత" పరిస్థితిగా కనిపిస్తుంది. కాని ఈ విధంగానే, ఈ పరిస్థితిలోనే వ్యక్తి వాస్తవంగా జీవించటం ప్రారంభిస్తాడు.

మూలం: శ్రీమాత

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

చైత్యపురుష వినూత్న జన్మ

ఆత్మ, చైత్యపురుషసత్వము, దివ్య మహాసత్యంతో ప్రత్యక్ష సంబంధం కలిగి ఉంటుంది. కాని మనిషిలో ఆత్మను, మనో ప్రాణిక, భౌతిక కోశాలు కప్పివేస్తాయి. యోగసాధన ద్వారా మనుష్యులు, హేతువులో వికాసం పొందవచ్చును. ఏవరైన శక్తిని సాధించి, ప్రాణికంలో ఎన్నో ఆనంద అనుభవాలు పొందవచ్చును. ఆశ్చర్యాక రమైన భౌతికసిద్ధులను కూడా సుస్థిరం చేసుకోవచ్చు. కాని, మన ఆంతర్యంలో వున్న ఆత్మశక్తి అభివ్యక్తం కాకపోతే, చైత్యపురుషసత్వం అగ్రస్థానంలో నిలపడక పోతే, సత్సిద్ధిని పొందనట్లే. పూర్ణయోగంలో నిజమైన అతిమానస జ్యోతిర్మయ శిఖరాల వైపు, చివరికి మహోత్కృష్ట ఆనందార్ణవతీరాల వైపు మనల్ని నడిపేది చైత్యపురుషుడే. మనస్సు తనదైన ఉన్నత తీరాలకు తెరుచుకుంటుంది. తనకు తాను ప్రశాంతమై, అవ్యక్తిగతంలోకి (అమూర్తం) విస్తరించగల్గుతుంది. నిష్క్రి యాత్మక విముక్తి, లేదా, నిర్వాణం పొంది మనస్సు తనను తాను ఆధ్యాత్మికీక రించుకోవచ్చును. ఆధ్యాత్మకీకృతమైన మనస్సులో మాత్రమే సరియైన ఆధారాన్ని అతిమానసం పొందలేదు. అంతరాంతరాలలోని ఆత్మ మేలుకొంటే, మానస, ప్రాణిక, భౌతికకోశాల నుండి చైత్యపురుష చేతనలోకి కొత్తగా జన్మిస్తే, అపుడు ఈ యోగ సాధన చేయవచ్చును. లేకపోతే కేవలం మనస్సు శక్తితో కాని, మరే ఇతర శక్తు లతో కాని ఈ సాధన చేయడం అసంభవం. మేధస్సులో సాధించిన జ్ఞానం, మనోభావాలు, ప్రాణిక కోరిక బలంగా లాగుతున్నప్పుడు, చైత్యపురుషుని వినూత్న జన్మను తిరస్కరిస్తే శ్రీమాత నుండి కొత్తగా పుట్టిన శిశువుగా మారడానికి తిరస్క రిస్తే, ఈ సాధన విఫలమవుతుంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: యజ్ఞన్న

నిశ్చయాత్మకమైన మార్గాన్ని అనుసరించు

ఎవరైనాగానీ, తాము ఆత్మసాక్షాత్కారాన్ని పొందామా లేదా అని తమను తాము ప్రశ్నించుకుంటూ అనుమానంతో సందేహిస్తున్నారంటే వారికింకా ఆత్మసంసిద్ధి లభించలేదనే అర్థం. ఎందువల్లనంటే అటువంటి దివ్యఘటనే సంభవిస్తే దానితో బాటు ఒక అనిర్వచనీయమైన, సునిశ్చితమైన వినూత్న అనుభూతి కలిగి సందేహాలనేవి రానే రావు. వాస్తవానికి అది (అక్షరాలా నూటికి నూరు పాళ్లు) ఒక కొత్త జన్మే.

నీ వొక కొత్త మనిషిగా తయారవుతావు. ఆ తర్వాత ఏ మార్గాన్ని అనుసరించవలసివచ్చినా, అది ఎంత కష్టతరమైనా ఆ అనుభూతి మాత్రం నిన్ను విడవకుండా నీతోబాటుగానే ఉంటుంది. అది మిగతా అనుభవాల మాదిరి జరిగిపోయాక తెర మరుగైపోవటం, స్మృతిపథంలో అస్పష్టంగా మిగిలిపోవడం, గుర్తుచేసుకున్నా అనిశ్చితంగా ఉండటం — ఇలా ఉండదు.

నీవొక నూతన వ్యక్తివి. అంతే. ఏమైనా అది మారదు. నీ మనస్సు ఎంత దుర్బలమైనా, ప్రాణికదేహంలో కష్టాలు కలిగినా, దేహం తామసస్థితికి లోనైనా అవేవీ కూడా నీ కొత్త అనుభూతిని మార్చలేవు. ఈ కొత్త స్థితి నీ చైతన్యజీవితంలో ఒక నిర్ణాయక మార్పు. అంతకు పూర్వపు వ్యక్తీ ఈ నూతన వ్యక్తీ పూర్తిగా వేరు. ఈ విశ్వంలో అతని పూర్వస్థానం దానితో అతనికున్న సంబంధం, జీవితంలో అతని పూర్వస్థానం అతని సంబంధం, అవగాహనలోనూ తత్సంబంధంలోనూ ఏమీ సామ్యముండదు. అది ఒక సత్యమైన పరివర్తన; మళ్లీ ఎప్పుడూ మారని మార్పు. అందువల్లనే నేను అంటాను: ఎవరైనా వచ్చి "నా ఆత్మతో నాకు అనుబంధం ఏర్పడిందో లేదో తెలుసుకోవాలనుంది" అంటే ఈ ప్రశ్న అడగటమే ఆ అనుబంధం లేకపోవటానికి గుర్తు. నీకు వేరే సమాధానం అక్కర్లేదు అని. అది అంతటితోనే సరి.

నీవు గనక ఈ మార్గంలో పురోగమించాలనుకుంటే వినమ్రుడవై ఈ కొత్త జన్మ దిశగా నడక ప్రారంభించు. ఇక అతిమానసపు అనుభవం పొందగలవనే భ్రమ కలిగే లోపలనే అది సాధించు.

నీకు ఉపశాంతి కలిగే ఒక మాట చెపుతా విను. ఈ సమయంలో నీవు ఈ

భూమ్మీద ఉన్నావంటే నీకు ఆ విషయం తెలిసినా తెలియకపోయినా, నీవు కోరినా కోరకపోయినా ప్రతి క్షణం నీవు పీల్చే గాలితో బాటుగా ఇప్పుడిప్పుడే భూవాతావరణంలో వ్యాపిస్తున్న ఈ నూతన అతిమానస పదార్థాన్ని కూడా విలీనం చేసుకుంటున్నావు. అది నీ లోపల్లోపల సంసిద్ధమవుతూ, ఎప్పుడైతే నీవు నిర్ణాయకమైన ముందంజ వేస్తావో అప్పుడు హఠాత్తుగా అభివ్యక్తమవుతుంది.

ఇది నీ నిర్ణయాత్మకమైన ముందు అడుగు వేయటానికి సహాయపడుతుందో లేదో అదే వేరే విషయం. అందువల్ల ఇటువంటి విషయాల మీద భరోసా పెట్టుకోకుండా శుద్ధమైన మనస్సుతో ఆధ్యాత్మిక జననం పొందటంలో నిమగ్నుడివి కావడం ప్రారంభించు.

అప్పుడు జీవితమంటే నీవు ఏర్పరుచుకున్న వైఖరి భిన్నంగా ఉండి, ఆధ్యాత్మికంగా జీవించటమంటే ఏమిటో బోధపడుతుంది. అప్పుడే నీ కొక మహత్తర విషయం తెలుస్తుంది. అదే అహంకారరహిత జీవితమనే గొప్ప విషయం.

అంతవరకూ అది అర్థం కాదు. ఎందువల్లనంటే సాధారణ జీవితమంతా అహంతోనే ముడిపడి నడుస్తుంది కాబట్టి అహం లేకుండా జీవించడం, పనిచేయడం అసంభవంగా తోస్తుంది. కానీ ఈ ఆధ్యాత్మిక జననం తర్వాత నీకే నవ్వొచ్చి "ఓ అహంకారమా!, ఇక నాకు నీతో పనిలేదు" అంటావు.

ఇదంతా ఆధ్యాత్మిక జీవితం వల్ల కలిగే ఫలితమే. దానివల్ల నీకు స్వేచ్ఛ కలిగినటువంటి నిశ్చితభావం కనిపిస్తుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: అమరవాది ప్రభావతి; అమరవాది వెంకటరామ శాస్త్రి

అహానికి బదులుగా దివ్యచేతన నుద్ధరించు

యుగయుగాలుగా మానవజాతి ఈ సమయం కోసం వేచి ఉంది. ఇపుడు ఆ సమయం ఆసన్నమయింది. కాని ఇది క్లిష్టమైంది.

విశ్రాంతి కోసమో ఆనందించుటకో మేము ఈ భూమి మీద ఇక్కడ ఉన్నామని నేను మీకు చెప్పను. అందుకు ఇది తరుణము కాదు. నూతన సృష్టి కొరకు మార్గాన్ని సిద్ధపరుచుటకు మేమిక్కడున్నాము.

నీవు ఇక్కడ అంటే ఈ భూమి మీద ఈ క్షణంలో ఉండాలని ఒకప్పుడు నీవు తీసుకున్న నిర్ణయమే ఇది. ఇప్పుడు అది ఏమాత్రము నీకు జ్ఞాపకము లేకపోవచ్చు. అందుకే నీవు ఇప్పుడు ఇక్కడ ఉన్నావు. అది నాకు తెల్సు. ఈ ప్రత్యేక కార్యాన్ని నిర్వహించే ఎత్తుకు నీవు ఎదగాలి. అన్ని బలహీనతలతో, పరిమితులతో నీవు తప్పక పోరాడి గెలవాలి. అన్నిటికీ మించి, "నీ సమయం అయిపోయింది", అని నీ అహానికి నీవు చెప్పాలి. అహం స్థానంలో దివ్యచైతన్యం కావాలి మాకు. అహంలేని జాతి కావాలి మాకు. ఆ జాతి స్వయంసమృద్ధి చెందాలి. దివ్యచైతన్య అనుమతితో అతిమానసజీవి ఆవిర్భావమే మేము కోరేది.

*

మొదటగా మానవజాతి సృష్టి జరిగినపుడు అహం, జాతిని సమైక్యపరిచే ఒక మూల పదార్థంగా ఉండేది.

జీవియొక్క అనేక భూమికలు ఈ అహం చుట్టూ గుమిగూడి ఉన్నాయి. కాని అతిమానసజాతి సృష్టి జరుగుతున్న ఈ తరుణంలో మానవదేహంలో నెమ్మదిగా దైవంయొక్క జోక్యంతో అహం తప్పక అదృశ్యమై చైత్యపురుషునికి మార్గం సుగమం చేయాలి.

చైత్యపురుషుని ప్రభావంతో దైవం మనిషిలో అభివ్యక్తమై అతిమానసజాతి వచ్చుటకు రంగం సిద్ధం చేస్తుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: సిద్ధులగారి త్రివేణి

అతిమానస చైతన్యపథంలో ఒక్క అడుగైనా వేయబోయే ముందు ప్రప్రథమంగా తుడిచివేయవలసినది వ్యక్తులను విమర్శించే అలవాటు. ఎందుకనగా అది భౌతిక పురోగతికిగాని లేక శారీరక వికాసానికిగాని దోహదపడేది కాదు. అది కేవలం ఒక అల్పాతి అల్పమైన మానసిక ఆలోచనాసరళిలో ఒక ముందడుగు. నీ మనస్సును అంటిపెట్టుకుని యున్న ఈ రకమైన అజ్ఞానాన్ని సమూలంగా తుడిచివేయనంత వరకు అతిమానసచైతన్య పథంలో కాలిడ లేవు.

ఉచ్ఛనీచములనే భావపరిజ్ఞానము, మంచిచెడులు, ఉచ్ఛనీచములు అనే ఊహ లన్నీ అజ్ఞాన మానవబుద్ధి విన్యాసాలు. ఎవరైనా దివ్యజీవన సంపర్కం నిజంగా అభి లషిస్తే ఆతను ఈ అజ్ఞానము నుండి పూర్తిగా విముక్తుడవ్వాలి. ఇలాంటి వాటికి అతీత అస్తిత్వ చైతన్యం లోనికి ఎదగాలి. అప్పుడు ఉత్కృష్ట, నికృష్ట భావనలు అంతరించి, వాటి స్థానే అందుకు పూర్తిగ భిన్న మైన స్వభావమే నీలో కుదురుకుం టుంది. బాహ్య దృగ్గోచర దృశ్యాలను వడగట్టి, ముసుగుమాటున అంతర్హితంగా నుండే వాటిని గ్రహించి, దృక్పథంలో మార్పు తేగల ఒక విధమైన సత్తా అదే.

ఇవి ఉత్తుత్తి మాటలు కావు. ప్రతి ఒక్కదాని బాహ్య రూపురేఖలు మార్పు చెందుతాయి. మరియు జీవితము, వస్తుజాలము పైకి కనిపించేవాటి రూపాలకు భిన్న మైనవనుట పరమసత్యము.

ఈ సంబంధము, ప్రపంచముపై మనకుండే ఈ సాధారణ అవగాహన అంతా దాని తన నైజాన్ని కోల్పోతుంది. ఇదే మనకు భ్రాంతిని కలిగిస్తుంది. అసహజమైన దిగ, మోసపూరితమైనదిగ, లేనిది ఉన్నదిగ గోచరిస్తుంది. కాని మరొకటి ఏదో ఉంది — ఏదో ఒక అత్యంత భౌతికపరమైనది, వాస్తవికమైనది, ప్రకృతి సహజమై నది — అదే వాస్తవిక అస్తిత్వంగా రూపొందేది. దీనికీ, సాధారణ దృష్టికి కనిపించేదానికీ సారూప్య ముండదు. ఇట్టి అవగాహన ఎవరికైనా కలిగినదంటే — దివ్యశక్తి యొక్క కార్యాచరణ స్ఫూర్తి, కనిపించే ఆకృతి వెనుక, ఆకృతి వెలుపల, ఆకృతి ద్వారా చోటుచేసుకుంటున్న కదలికల స్ఫూర్తి — ఆ వ్యక్తి సర్వసాధారణ మిధ్యాజీవన శైలి కన్నా సత్యమైనదానికి చేరువైన జీవనాన్ని గడుపుటకు సంసిద్ధమవుతున్నా డన్న మాట. అంతకు ముందు మాత్రం కాదు.

ఎంతకాలమైతే నీ మనస్సే యదార్థమనే భావన నీకు ఉంటుందో, నీ ఆలోచనాధోరణే నీకు సత్యమైనది, వాస్తవమైనది, పటిష్టమైనదిగా తోస్తుందో అంతవరకు నీవు ఆ (ఉన్నత) స్థాయికి చేరలేదని రూఢిగా చెప్పవచ్చు. ముందుగా నీవు వీటిని దాటి ఆవలిగట్టుకు చేరాలి. అటు పిమ్మటనే నేను చెప్పేదేమిటో నీవు అర్థం చేసుకోగలుగుతావు.

అలాగని వ్యక్తి మానసిక ప్రవృత్తి మరింత స్పష్టంగా ప్రస్ఫుటమవుతుందనో లేక బహిర్గతమవుతుందనో కాదు — అతను లోపల మూయబడి ఉన్నాడు — మూసివేయబడి ఉన్నాడు — సున్నితమనస్కులకు అదిమివేయబడి ఉక్కిరిబిక్కిరి అవుతున్న అనుభూతి కూడ కలుగుతుంది. బయటపడాలనే ప్రయత్నంలో అడ్డుగోడలాంటి ఆటంకం ఎదురైనట్టి అనుభూతి కలుగుతుంది. లో ప్రవేశానికి అతను తలుపు దబదబా తట్టుతాడు. కాని ప్రవేశించలేడు.

ఆ విధంగా లోపల మూయబడివున్నంత కాలం అతను మిథ్యలో మునిగివున్నట్లే. దైవకృప వల్ల ఆ మూసివుంచిన గట్టిచిప్పను పగులకొట్టుకొని, బయటికి, దివ్యకాంతిలోకి ఎపుడు ప్రవేశించకలుగుతాడో, అపుడే ఆతనికి స్వేచ్ఛ.

ఇది అకస్మాత్తుగా సంభవించవచ్చు. సహజంగాను, అనూహ్యంగాను కూడ సంభవించవచ్చు.

ఎవరైనా దీనిని ఒక క్రమపద్ధతిలో అనువర్తించగలరని నేననుకోను. ఇదేదో నెమ్మది నెమ్మదిగ రూపుమార్చబడి, పల్చబడి, తద్వారా వీక్షించబడగలిగేదని నేననుకోను. ఇలాంటి సందర్భం నా కిప్పటివరకు తటస్థించ లేదు. బహుశ, లోలోపల ఒక విధమైన శక్తి సమీకరణము జరుగవచ్చు. అవసరము తీవ్రతరమైనట్టి సందర్భము ఏర్పడవచ్చు. భయాందోళనలను, అంచనాలను అతిక్రమించి తెగింపుతో చేసే కృషి కావచ్చు. పర్యవసానాలను పరిగణించనంతటి పటుతరమైన అవసరమేర్పడవచ్చు. ఏదీ, నిరోధించ వీలులేని పేలుడుపదార్థంలాగ, వ్యక్తి తయారవుతాడు. కాంతిమయజ్వాలలను చిందిస్తూ తన చెరను ఛేదించుకొని బయటపడతాడు.

ఆ తర్వాత అతడు మళ్ళీ వెనుకడుగు వేయలేడు.

అది నిజంగా ఒక నవ్య జన్మ.

మూలం: శ్రీమాత

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

నూతన జన్మకు మార్గం

యోగసాధనలో మనం నిర్వహించవలసిన కార్యం: బాహ్యదృష్టి కలిగిన పరిమిత అహంకారాన్ని బహిష్కరించగల, దాని స్థానంలో, మనలో అంతర్నివాసిగా మనల్ని పాలించు ప్రభువుగా భగవంతునికి పట్టంగట్టడం. దీని అర్థం ముందు, కోరికలను నిర్వీర్యం చేయటం. కోరికలను సంతృప్తిపరచుకొని ఆనందించే బలమైన ప్రేరణకి లోబడకుండా, కోరికల పాలనకి స్వస్తి చెప్పటం. ఆధ్యాత్మిక జీవనం తన మనుగడకు కావల్సిన పోషకవిలువలను, కోరికల నుంచిగాక, తన అస్తిత్వమూలం యొక్క విశుద్ధ, నిస్వార్థ ఆధ్యాత్మిక ఆనందం నుండి స్వీకరించాలి. కోరిక లక్షణంగా కలిగిన ప్రాణికస్వభావం మాత్రమే గాక, మానసిక అస్తిత్వం గూడ ఒక నూతన జన్మనెత్తాలి. దాని రూపం కూడ మారిపోయేంత మార్పున కది లోనుగావాలి. విభజనకు లోనైన మన ఆహంకారిక, పరిమిత మరియు అజ్ఞానయుత ఆలోచన, తెలివి అదృశ్యం గావాలి. వెదకులాటగా సాగే అర్థసత్య జీవనం నుండి తడబడుతూ సాగే పొరపాట్ల జీవనం నుండి స్వేచ్ఛ కలిగిన స్వయంభూః పరమ సత్య-చేతన లోనికి, సహజసిద్ధ చేతన లోనికి, పర్యవసించే, ఛాయారహిత దివ్యప్రకాశం యొక్క దోషరహిత క్రీడ, సార్వజనీనత పతాకస్థాయిగా గల చేతన మన జీవితంలో చోటు చేసుకోవాలి. భ్రమకు, కలవరపాటుకు లోనయ్యే, అహంకారాన్ని కేంద్రంగా చేసుకొని పరిభ్రమించే అల్పభావనలకు ఆలవాలమైన సంకల్పం,కర్మ ముగిసి, స్పష్టంగా, తనకు తానుగా అన్యప్రేరణ లేకుండా స్వతఃగా దివ్యమైన కదలికకు, వైఫల్యమెరుగని దివ్యక్రియాశక్తికి తావివ్వాలి. మన సర్వకర్మలందు, ఒక మహోన్నత, నిర్వ్యక్తిక, దోషరహితమైన,, తడబడని సంకల్పం, ప్రయత్నరహితంగా, ఏ యిబ్బంది లేకుండా, దైవసంకల్పంతో ఐక్యమై, ప్రతిష్ఠితమై మన సర్వకర్మలకు శక్తి నిచ్చి నడిపించాలి. మన బలహీన అహంకారిక భావోద్వేగాల యొక్క అసంతృప్త ఉపరితల క్రీడను అంతమొందించి, దానికి బదులుగా, వాటి వెనుకనే సమయం కోసం వేచిచూస్తున్న ఒక రహస్య, ప్రగాఢ మరియు విశాల చైత్య హృదయాన్ని ఆవిష్కరించాలి. ఆంతర, హృదయ చైత్యంలో నివసిస్తున్న ఈ దైవం చేతనే ప్రచోదించబడే మన సమస్త అనుభూతులు, ద్వివిధ ప్రేమావేశం మరియు బహుముఖ దివ్యానందం నిశ్చల మరియు తీవ్ర చలితచాలనంగా మారిపోవాలి. ఒక

దివ్య మానవజాతి లేదా ఒక అతిమానసజాతికిది నిర్వచనం. అతిశయోక్తిగా చూపించబడిన లేదా మహోన్నతంగా ఉద్ధరింపబడిన మానవ మేధో క్రియాసామర్థ్యం కాదు యిది. మన యోగం ద్వారా పరిణమించాలని మనం కోరుకొనే అతిమానసజీవి నమూనా ఇది.

*

దైవానికి మన సమస్త స్వీయప్రకృతి యొక్క ఆత్మార్పణం ద్వారా మాత్రమే ఈ మహోన్నత శిఖరస్థాయి నందుకోగలం. మనలో గల దైవానికి, విశ్వమయుడైన సర్వవ్యాపికి, విశ్వాతీతుడైన పరాత్పరునకు, ఎట్టి దాపరికాలు లేకుండా సమస్తాన్నీ అర్పించాలి. మన సంకల్పంయొక్క, హృదయంయొక్క, చింతనయొక్క (కర్మ, భక్తి, జ్ఞానాలయొక్క) పరిపూర్ణ ఏకాగ్రతా లక్ష్యం ఆ ఏకైక మరియు బహు పార్శ్వముల దైవం. మన సమస్త అస్తిత్వం ఎట్టి మినహాయింపు లేకుండా ఆ దైవానికి మాత్రమే ఆత్మార్పణం గావించుకోవాలి. తనకన్న అనంతంగా మహామహిమోపేతమైన "తత్" వైపునకు, అహంకారం, దాని ఆత్మనివేదన, అనివార్య సమర్పణ అటు మళ్ళించుకొని తీరవలసిన ఒక నిశ్చయాత్మక ఆంతరిక ఉద్యమం ఇది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం; కె.వి. రావు

యోగమంతా స్వాభావికంగా ఒక కొత్త జన్మ

స్వాభావికపరంగా యోగమంతా ఒక కొత్త జన్మ. ఇది ఒక అసాధారణ పునర్జన్మ. బుద్ధిపరమైన మానవ భౌతికజీవనం ఉత్కృష్టమైన ఆధ్యాత్మికచేతన లోనికి ఇంకా మరింత మేలైన ఆధ్యాత్మికసత్వము లోనికి తిరిగి జన్మించటం. మరింత విస్తృతమైన ఆధ్యాత్మిక ఆవశ్యకతకి, ఉనికికి బలమైన ప్రేరణ లేకుండా, ఏ యోగమూ కూడా విజయవంతంగా చేపట్టబడి, ముందుకు కొనసాగింపబడదు. లోతైన, విస్తృతమైన ఈ అంతరంగ పరిణామానికి ప్రేరేపింపబడిన జీవాత్మ, ఆ దారికి, పలుమార్గాలలో మళ్లవచ్చు. తన స్వీయసహజ వికసనంలోనే తనకు తెలియకుండా తాను

ప్రేరణ పొందవచ్చు. ఏదో ఒక మతప్రభావం వల్లనో, ఒక తాత్విక ఆకర్షణతోనో ఆధ్యాత్మిక అంతరంగ పరిణామానికి దారి మళ్లవచ్చు. లేదా, క్రమవిజ్ఞాన వెలుగు వల్ల, లేదా, ఏదో ఒక ఆకస్మిక సంసర్గంతో కూడిన సాహసప్రయత్నం వల్ల, లేదా, ఒక రకమైన ఆఘాతంతో, లేకపోతే బాహ్యపరిస్థితుల వొత్తిడి వల్ల, లేక, అంతరంగ అవసరం కొరకు, మనోఫలకంపై గాఢముద్ర వేసే ఒక్క మాట, లేదా, దీర్ఘవిచారణ తో, లేదా, ఎక్కడో సుదూరంలో వ్యవహరించేవాని ఆదర్శం ద్వారా, లేదా, ఆ సంసర్గంతో కలిగే నిత్యప్రభావం వల్ల — అంతరంగ పరిణామానికి పిలుపు లేదా ఆదేశం రావచ్చు. స్వభావము, పరిస్థితుల తోడ్పాటు — వీటి ననుసరించి కూడా పరిణామం రావచ్చు.

అయితే మరి ఇది, యే రకంగా వచ్చినా, మనోసంకల్పం, ఇచ్ఛాశక్తి, తత్ఫ లితంగా సార్ధకమైన ఆత్మార్పణ — ఇది తప్పనిసరి. ఒక 'నవ్య ఆధ్యాత్మిక' భావ నాబలం, సత్యానికొక ఊర్ధ్వదిశానిర్దేశం, ఒక జ్ఞానోదయం, ఒక పరివర్తన, ఒక మలుపు, హృదయాకాంక్ష — వీటిని స్వాయత్తం చేసుకునే ఇచ్ఛాశక్తి — ఇదీ ప్రబలమైన చర్య. యోగఫలితాలన్నీ బీజరూపంలో ఇందు నిక్షిప్తమై ఉన్నాయి. ఉన్నతోన్న తంగా, అతీతంగా ఉన్నదాని యొక్క అన్వేషణ కేవలం బుద్ధిపరమైన భావనాబ లంతో సఫలం కాదు. మానసికమైన ఆసక్తి ఎంతగానో ఉండవచ్చు. పట్టుపట్టి హృదయం, దానిని తనకు ప్రియమైనదానినిగా స్వంతం చేసుకొనకపోతే మాత్రం అది నిష్ప్రయోజనమే. ఇచ్ఛాశక్తికి కూడా, తాను, తప్పక స్వంతం చేసుకో తగినది, తనకు అపేక్షణీయమైనది ఇదొక్కటే కావాలి. ఆధ్యాత్మిక సత్యమనేది ఊహల ఊయలలో ఊగులాడేదిగా ఉంటే సరిపోదు. అది జీవింపబడాలి. అలా జీవించటానికి కావల్సి నది సత్యములో సమైక్య ఏకోన్ముఖ ఆలోచన. యోగము నిర్దేశించిన అంతటి మహత్తర ఉత్కృష్ట పరిణామం, విభక్తమై చెల్లాచెదురుగా వ్యవహరించే ఇచ్ఛాశక్తి వల్ల లేదా కొద్దిపాటి అసంపూర్ణశక్తి వల్ల లేదా సందేహాస్పదమైన బుద్ధివల్ల రాదు. దైవాన్వేషకుడు దైవానికి మాత్రమే అంకితమైనవాడుగా ఉండాలి — కేవలం దైవా నికి మాత్రమే. అంతే.

ఇందులో కొంత పురోగతి, బలమైన కృషి, మరింత నిర్మలత్వం సాధించవ చ్చు. మహత్తరం కానివి, అగ్రగణ్యమైనవి కానివి, ఎన్నో అనుభవాలు సంతరిం చుకోవచ్చు. అలా జీవితం కొంతవరకు సిద్ధం కావించుకోవటానికి, ఒక స్థాయికి

చేరుకోవటానికి మాత్రమే పనిచేయటమవుతుంది. బుద్ధి కొంతమేరకు అసమగ్ర ప్రచోదనాశక్తితో ముందుకు సాగుతుంది. తనకు వీలైనంతవరకు తను చేసిన కృషితో అది అసంతృప్తి చెందవచ్చు. లేదా, నిమ్నజీవనానికి వెనుకడుగు వేయటం కూడా సంభవించవచ్చు. అదే — యోగపరిభాషలో పతనం. అసలైన ఆధారకేంద్రం లోపభూయిష్టమై ఉన్నప్పుడు ఈ పతనం సంభవిస్తుంది. మనసు మళ్లీ ఆసక్తి కలిగే ఉంటుంది. హృదయాకర్షణా ఉంటుంది. కృషిలో దృఢసంకల్పానికేమీ లోటుండదు. కాని స్వభావం సంపూర్ణంగా దైవానికి అధీనమై ఉండదు. కృషి, ఆసక్తి ఆకర్షణ — ఇవి ఆమోదిస్తాయి. యోగం ఓ ప్రయోగంలా, కుతూహలంతో చేసే ప్రయోగం మాత్రంగానే ఉంటుంది. నిరాకరించ కూడని ఒక ఆదర్శానికి, జీవాత్మ తప్పనిసరి అవసరానికి అక్కడ పరిపూర్ణ ఆత్మసమర్పణ ఉండదు. అయితే అలాటిది అసమగ్రయోగమే — అయినా కూడా అది వృధా కాదు. ఉన్నతదిశగా చేరుకునేందుకు చేసే కృషి వ్యర్థం కాదు. తాత్కాలికంగా విఫలం కావచ్చు. కొంతవరకు సిద్ధమయిన స్థాయికి, లేదా, ప్రాథమిక సిద్ధికి చేరుకోవచ్చు. ఏమైనా ఇది జీవాత్మ భవితవ్యం నిర్ధారించేదిగా ఉంటుంది.

కాని జీవితం ఇచ్చిన అవకాశాన్ని పరిపూర్ణంగా సఫలం కావించుకోవాలని అభిలషించినా, మనం దర్శించిన లక్ష్యాన్ని సాధించా లనుకున్నా, అది మనం అందుకున్న ఆదేశానికి ఏదో కాస్తంత దరికి చేరుకోవటం కాకూడదు. చాలినంతగా తగురీతిలో ప్రతిస్పందించాలి, కోరుకోవాలి. అపుడక్కడ పరిపూర్ణ ఆత్మసమర్పణ అత్యావశ్యకం అవుతుంది. జీవితంలో సాధించవలసినవి, ఎన్నో లక్ష్యాలు — అందులో ఇది కూడా ఒకటిగా ఉండకూడదు. అది కూడా మనలో ప్రముఖ భాగంగానూ కూడా కాదు. ఇది తప్ప మరో ధ్యేయం ఉండకూడదు. సర్వజీవనమూ అదే కావాలి. యోగానికి విజయరహస్యం ఇదే.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

జీవాత్మ జన్మపరంపర

అవశ్యం గుర్తుంచుకొనవలసిన విషయం — సాధకుడు ఊర్ధ్వంగా ఉన్మీలనుడై ఉండటమనేది కేవలం ప్రశాంత, నిశ్శబ్ద శాశ్వతానందప్రదాయక నిర్వాణస్థితికి మాత్రమే అవశ్యంగా మార్గదర్శకమవుతుంది, అని కాదు. తద్వారా సాధకుడు ఓ విశిష్టమైన, క్రమరీతిలో సాగి కట్టకడకు దృశ్యమానంగా శిరోపరిభాగము నుండి సమస్త భౌతిక భౌతికాతీత స్థరాల లోనికి చొచ్చుకుపోయే అనంత శాంతిని, నిశ్శబ్దతని, విస్తృతిని సువేద్యంగా ఎరుకపర్చుకొనటమేకాక, ఇంకా మరెన్నో విషయాలు ఆతనికి ఎరుకపడగలవు. సకల సామర్థ్యములు తనలో పదిలపరచుకొన్న ఓ అపార శక్తిసంవేద్యమవుతుంది. సకల జ్ఞానాన్ని తనలో నిక్షిప్తం చేసుకొన్న ఓ అనంత తేజస్సు దర్శన మిస్తుంది. పరమానందాన్నీ, సమస్త ఆనందపరవశతనీ తనలో దాచుకొన్న అపరిమితానందం అనుభవైకవేద్య మవుతుంది. తొలుత అవి అత్యావశ్యకమైనవిగా, అపరిమితమైనవిగా, సమమైనవిగా, కేవలమైనవిగా ద్యోతకమై, వీటిలో వేటితోనైనా సంవీలనం కావటం సంభావ్యమనిపిస్తాయి, విశ్వాసాన్ని పాదుకొలుపుతాయి. అయితే ఈ దివ్యశక్తి సకలశక్తుల సమాహారమని, ఈ దివ్యతేజస్సు సకల తేజోసంకలనమని, ఈ దివ్యానందం సమస్త సుఖసంతోషాల, సకల భోగభాగ్యాల సమైక్య రూపమని మనకు గోచరమవుతుంది. సువేద్యమై ఇదంతా మనలో సంలీనం కావటం, అంటే అవిగా మనం రూపాంతీరకణం చెందటం సంభావ్యమేనని ఎరుకపడుతుంది. కేవలం శాంతి ఒక్కటే కాదు, ఇందులో ఏ ఒక్కటైనా లేదా అన్నీ కలసికట్టుగా భువిపైకి దిగిరావచ్చు. అయితే పరిపూర్ణమైన శాంతి, ప్రశాంతతలను తొలిగా భువి పైకి అవరోహణ చేయటం సురక్షితమైనది. ఎందుకంటే మిగతావాటి అవరోహణ భద్రంగా ఉంటుంది. అలా కానిచో బాహ్యప్రకృతికిఅంతటి దివ్యతేజోశక్త్యానందాలను , జ్ఞానాన్ని, ఏకధాటిగా భరించటం లేదా ఇముడ్చుకోటం దుష్కరమవుతుంది. ఇవన్నీ సంయుక్తంగా సమ్మిళితమై విరాజిల్లటమే మనం పిలిచే అత్యున్నత ఆధ్యాత్మిక లేదా దివ్యచైతన్యం. ఈ ఊర్ధ్వ ఉన్మీలనం పరిపూర్ణ పురుషోత్తమత్త్వంతో ప్రత్యక్ష సంబంధాన్ని సమకూర్చిపెడుతుంది. అంతేకాదు

మనలో దివ్యచైతన్యస్థితిని పాదుకొల్పటానికి దోహదపడగలిగి మరో జన్మను లేదా ఆత్మోద్ధ వికసనాలను ప్రసాదించగలదు.

మూలం శ్రీఅరవిందులు
అనువాదం: అ. ఆదిశేషయ్య

రెండు దశలతో కూడిన కొత్త జన్మ

ఇటువంటి పరివర్తన — మానవత్వం నుండి దివ్యత్వానికి, విభజన నుండి ఏకత్వానికి, ఇంద్రియగ్రాహ్య సంఘటనల నుండి కాలాతీత సత్యం వైపు — కల్గే — ఒక సంపూర్ణ పునర్జన్మ లేదా జీవాత్మకి ఒక కొత్త జన్మ. ఈ పరివర్తనలో తప్పక రెండు దశ లుంటాయి: (1) ఆత్మ, దాని ఉపకరణాలు, తగిన రీతిలో పరిపక్వం చెంది అర్థం కావటం. (2) ఆత్మ వెలుగును పొంది, తనకు తాను — తన ఉపకరణ ముల ద్వారా — తెల్సుకోవడం (లేదా గుర్తించడం) ఈ రెండు దశలను — నిజం చెప్పాలంటే — వేరుచేసి చూపే ఖచ్చితమైన సరిహద్దురేఖ ఏదీ లేదు, కాలప్రవాహంలో, అవి అవసరం ఒకదాని కొకటి, ఈ రెండు చర్యలు ఒకేమారు కొనసాగుతూ ఉంటాయి.

ఎందుకంటే, ఆత్మ సంసిద్ధమైన మేరకే, దాని వెలుగు కూడా వృద్ధి చెందుతుంది. అదే పరిమాణంలో — ఇంకా ఉన్నత, ఉన్నతతర — సంపూర్ణ, సంపూర్ణతర — (ఎరుక కల్గిన) స్థితులకు అది యెదుగుతుంది. అదే విధంగా, ఈ వెలుగులు, ఈ (ఎరుకలు) గుర్తింపులు, వృద్ధిచెందిన పరిమాణంలోనే, ఆత్మ సంసిద్ధమవడం; అదే విధంగా దాని ఉపకరణాలు కూడ, వానికి నిర్దేశించబడిన పనులు చేయడానికి, తగిన అర్హత పొందడం జరుగుతుంది. ఈ స్థితులు పొందడానికి, వెలుగులు లేని సంసిద్ధి కార్యక్రమాలు గల ఆత్మ-ఋతువు లున్నాయి. అదే విధంగా, వెలుగులో వృద్ధిచెంది — ఆ వెలుగును — తక్కువ లేదా సుదీర్ఘకాలం పొందిన — అనుభూతులతో ముగిసే — ఆత్మ-క్షణాలున్నాయి, మేఘంలో మెరుపువలె క్షణకాలమే ఉంటూ — ఐనా, జీవుని ఆధ్యాత్మిక భవిష్యత్ అంతటినీ, సంపూర్ణంగా మార్చగల — ఆత్మ-క్షణా లున్నాయి. అలాగే, సుదీర్ఘ ఆత్మ-క్షణాలు — ఎన్నో మానవ గంటలు, రోజులు, వారాలు — స్థిరమైన కాంతి, లేదా మిరుమిట్లుగొల్పే సత్యసూర్యుని

కాంతితో నిండిన — ఆత్మ-క్షణా లున్నాయి. వీటన్నిటి ద్వారా — ఒకమారు దైవం వైపు మళ్ళిన ఆత్మ — పరిపక్వత, స్థిరత్వము, నిజ అస్థిత్వముగల తన కొత్త జన్మల వైపు — ఎదుగుతుంది.

ఇలా ఆత్మ సిద్ధం కావడానికి — సత్వపు అన్ని భాగాలు పరిశుద్ధి కావటం మొట్టమొదటి అవసరం. సమగ్రమైన పరిశుద్ధి తప్పక ఉండాలి.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: యస్. వై. సోమయాజులు

దీనినొక నవజీవనంగా భావించు

ఇప్పుడు ప్రపంచం వున్న స్థితిలో, పరిస్థితులు నిరంతరం కష్టంగానే వుంటున్నవి. ప్రపంచంలో సత్యం మరియు జ్ఞానప్రకాశ శక్తులు ఆవిర్భవించడానికి ప్రయత్నిస్తున్నాయి. కాని యిచట స్థిరంగా తిష్ఠవేసికొని వున్న వ్యతిరేక దుష్టశక్తులు మారుటకు యిష్టపడవు. ఈ దైవీ, ఆసురీశక్తుల మధ్య ప్రపంచం నిరంతరం పోరాటాలతో, వివాదాలతో సతమతమవుతోంది. సహజంగా ప్రతివ్యక్తి ఆటంకాలతో, కష్టాలతో బాధపడుతూనే వున్నాడు.

ఈ పరిస్థితుల నుండి బైటపడటానికి మీకున్నది ఒకే ఒక మార్గం. అది పరిపూర్ణ ఆత్మసమర్పణం. అంటే యేమంటే, నీ కార్యాలను, నీ కోరికలనే గాక, నీ అనుభూతులను, భావాలను, నీది అనుకునేదాన్నంతా ప్రత్యేకంగా దైవం కొరకే ఆచరించు. ఫలితాన్ని దైవానికే వదిలిపెట్టు. అప్పుడు నీ చుట్టుపట్ల పరిస్థితులకు, అచటి మానవుల ప్రతిస్పందనలకు నీవు అతీతంగా వుండిపోతావు. అంతే కాదు వాటి నుండి నీవు దైవానుగ్రహం వలన రక్షింపబడుతావు. నీకు కోరికలు, సంబంధబాంధవ్యాలు లేకపోతే, ఒక పరాత్పరుని నుండి తప్ప ఎలాంటి మానవాళి నుండియైనా సరే, యెలాంటి బహుమతిని కోరకుంటే, బాహ్యసంబంధమైన మనుషులతో నున్న సంబంధాలను తెంచుకొంటే, అపుడు నీకు నీ హృదయంలో నిరంతరం వుంటున్న అనుగ్రహాన్ని, దైవశక్తిని, దైవసాన్నిధ్యాన్ని అనుభూతిని పొందగలుగుతావు.

ఇది తప్ప వేరే పరిష్కారమార్గం లేదు. ఇదే, ఇదొక్కటే ప్రతివారికీ యెలాంటి

మినహాయింపు లేని ఏకైక పరిష్కారమార్గం. బాధపడేవారి బాధ లన్నింటికి కారణం వారి ఆత్మసమర్పణం పరిపూర్ణంగా లేకపోవడమే. నీలో "గట్టి బాధ లేక దెబ్బ" కలిగితే "ఓ, ఇది మంచిది కాదు" అని కాని, లేదా "ఈ పరిస్థితి చాల కష్టమైనది" అని కాని భావించక, "నా ఆత్మసమర్పణం పరిపూర్ణంగా లేదు" అని చెప్పుకో. అపుడన్నీ సరిపోతాయి. అనుగ్రహాన్ని అనుభూతి పొందుతావు. అనుగ్రహం నీకు సహాయపడి నిన్ను నడుపుతుంది. ముందుకు సాగిపోగలగుతావు. ఏదో ఒక రోజు నీలో శాంతి నెలకుంటుంది. ఎలాంటి బాధ నిన్ను బాధించదు. అప్పుడు నీవు దైవానుగ్రహంపై పరిపూర్ణ విశ్వాసంతో వ్యతిరేకశక్తులకు, వ్యతిరేక స్పందనలకు, అభిప్రాయభేదాలకు, దుష్టసంకల్పాలకు, చిరునగవుతో సమాధానం చెప్పగలుగుతావు. కనుక కష్టాల నుండి బయటపడడానికి యీ ఒక్క మార్గమే తప్ప మరొకటి లేదు.

ఈ ప్రపంచం పోరాటాల నిలయం; బాధలమయం; కష్టాల కాణాచి. ఇదింకా పరివర్తన చెందలేదు. మార్పు చెందడాని కింకా సమయం పడుతుంది. బయట పడడానికి ప్రతి ఒక్కరికీ ఒకే ఒక్క అవకాశం వుంది. పరాత్పరుని అనుగ్రహాన్ని అంటిపెట్టుకొనివుండే ఒకే ఒక మార్గం.

మానవుల నుండి మెప్పుదలను, పొగడ్తలను ఆశించకండి. ఎందుకంటే దేనినైనా యే ఆధారాలతో మెచ్చుకోవాలో వారికి తెలీదు. మీరు వారికన్న ఉన్నతస్థానంలో వున్నారంటే వారికి సరిపడదు.

ప్రశ్న: అలాంటి బలాన్ని ఎక్కడి నుండి పొందడం?

నీలోనే. దివ్యసన్నిధి నీలోనే వుంది. దీని కోసం నీవు బైట చూస్తున్నావు. వద్దు. లోపల చూడు. అది నీలోనే వుంది. దివ్యసన్నిధి అక్కడే వుంది. బలాన్ని పొందడానికి ఇతరుల మెప్పును నీవు కోరుతావు. కాని అలా దాన్ని పొందనే లేవు. బలం నీలోనే వుంది. నీకు పరమగమ్యంగా, పరమకాంతిగా, పరమజ్ఞానంగా, పరమప్రేమగా గోచరించే వీటినే నీవు ఆకాంక్షించవచ్చు. కాని అది నీలోనే వుంది. అది నీలోనే వుండకపోతే నీవు దానితో సంబంధాన్ని పెట్టుకోలేవు. నీవు అంతరాంతరాల్లోకి వెళ్ళితే అక్కడ నిరంతరాయంగా ఊర్ధ్వముఖంగా వెలుగుతుండే జ్యోతిని కనుగొనగలవు.

అలా చేయడం చాల కష్టమని నమ్మకు. ఎల్లపుడు నీవు బాహ్యదృష్టినే కలిగి వుంటున్నావు. కనుక ఆ దివ్యసన్నిధిని అనుభూతి నందుట లేదు. ఆధారం కోసం,

సహాయం కోసం, బైటివైపు చూడకుండా, నీ లోపల వున్న పరమజ్ఞానాన్ని ఏకాగ్ర తతో ప్రార్థించు. ప్రతి క్షణం యేమి చెయ్యాలో, యెలా చెయ్యాలో తెలిసికొనుట కొరకై, నీ సర్వస్వం ఆత్మసమర్పణం చేసికొంటే నీవు చేసేదంతా పరిపూర్ణత కొరకే చేస్తే, అప్పుడు నిరంతరం నీకు మార్గం చూపుతూ నడిపిస్తూ వున్న ఆధా రాన్ని, సహాయాన్ని నీలోనే అనుభూతి చెందెదవు. నీవు కష్టాలను, దుష్టసంకల్పాల ను, దురభిప్రాయాలను, దుష్ట ప్రతిస్పందనలను యెదుర్కోవలసివస్తే, వాటితో పోరాడడానికి బదులు, ఆ సమస్య లన్నింటినీ ఆ పరాత్పరుని పరం చేసేయ్. నీవు సమగ్రంగా సమర్పణ చేసికొనగలిగితే, ఆ పై నీకు వాటితో యెలాంటి బంధం వుండబోదు. అప్పుడా విషయం ఆ పరాత్పరునికి చెందుతుంది. ఆ విషయాలను యెలా పరిష్కరించాలో అందరికన్న ఆయనకే గొప్పగా తెలుసు. ఓ బిడ్డా! బయ టపడడానికి యిదొక్కటే మార్గం సుమా!

ప్రశ్న: ఒక్క విషయం. నేనేమి చేసినా, నా వారికే నచ్చడం లేదు.

ప్రతివాని వలెనే మీవారు సైతం మంచిచెడుల సమ్మేళనమే.

ప్రశ్న: నేనేమి చేస్తున్నా యితరుల బలవంతంతో చేస్తున్నా. అంటే నాకు నేనుగా యేదీ చేయడం లేదు.

ఏమి? ప్రపంచం నిన్నర్థం చేసికోవాలని ఆశిస్తావా?

ప్రశ్న: కాదు. వాళ్ళు నన్నర్థం చేసికోలేకపోవచ్చు. నా పనికై నేను యెలాంటి స్తుతి లేక గుర్తింపు కోరడం లేదు. కాని ఆటంకాలు... చూడండి.

నేను నిన్నర్థం చేసికొని, నిన్ను తెలిసికొనగలనని నీవు నమ్మితే నీకు నా సంపూర్ణ సహకారం వుండగలదు. నీవు చెడుగా ప్రవర్తిస్తున్నావని నేనెప్పుడు చెప్ప లేదే? మనుష్యులు అహంకారరహితులై, పరాత్పరునికి సంపూర్ణ ఆత్మసమర్పణం చేసికొన్న యోగులైతే తప్ప, సరిగా అర్థం చేసికోలేరు. వారంతా బాహ్యదృష్టితో, బాహ్యజ్ఞానంతో, బాహ్యరూపాలనే చూస్తారు. వాళ్ళు లోపల చూళ్ళేరు. మనం మనుషుల నుండి గుర్తింపు ఆశించకపోతే, ఫిర్యాదు చేయవలసిన అవసరం వుండదు కదా? వాళ్ళు, వాళ్ళకు మంచిదని తోచినదాన్నే గుర్తిస్తారు, అది వారి వ్యవహార మే. మనం వాళ్ల గుర్తింపుకై పని చెయ్యం. ఏ పని అయినా చెయ్యాల్సి వుంది అని భావిస్తాం కనుకనే చేస్తాం.

ప్రశ్న: మాతా! నేనెప్పుడూ పొగడ్తలను ఆశించలేదు.

ఆ స్థితిని పొందుటకు పరిస్థితులు నిన్ను ఒత్తిడి చేస్తుండొచ్చు. ఎందుకంటే అదే స్వేచ్ఛ. నిజమైన స్వేచ్ఛ

ప్రశ్న: నేను స్వాభావికంగా సాధువును. నా కేదీ అవసరం లేదు.

అది సరే. కాని, నీకు నీ కుటుంబంవారి పొగడ్త అవసరం కూడ వుండరాదు.

ప్రశ్న: నాలో ఓటమిలు, బలహీనతలు వున్నా, నాకేదీ అవసరం లేదు. నాకే పొగడ్త అవసరమూ లేదు.

ఐతే నీవు బాధపడవు. ఎందుకంటే నీ కవసరమైనది ఒక్కటే. దైవసహాయం. అది నీవు పొందివున్నావు. కనుక బాధపడజాలవు.

ప్రశ్న: కాని నేను చాల బాధపడుచున్నాను.

నీలో యేదో పోరాటం సాగుతోంది. నీ చేతనలో ఒక భాగం దైవాన్ని యెరుక కలిగి వుంది. మరో భాగం పరిస్థితులకు బానిసగా వుంటుంది.

(నిశ్శబ్దం)

నీలో పరాత్పరుని కోసం, సంపూర్ణ స్వేచ్ఛ కోసం, మార్పు వస్తున్నది. దానిని దైవానుగ్రహంగా తీసికొంటే నీవు దాని ఫలితాన్ని అనుభవించగలవు. శాంతి — యేదీ భంగపరుపజాలని శాంతి, పరిపూర్ణ సమత్వం, అజేయమైన బలం, అనుభవించగలవు.

(దీర్ఘ నిశ్శబ్దం)

దీనిని యీ దినం నీ నూతన జన్మదినంగా, నూతనజీవిత ప్రారంభంగా గ్రహించు.

మూలం: శ్రీమాత

అనువాదం; బి. నరసింహయ్య

శ్రీఅరవిందుల ఆశీస్సులు

కొత్తజన్మ నీ హృదయంలో అభివ్యక్తమయి, ప్రశాంతతను, ఆనందాన్ని ప్రసరింప చేయు గాక; అది నీ సత్తాలో అన్ని భాగాలను — బుద్ధిని, దృష్టిని, ఇచ్ఛను, అను భూతులను — జీవితాన్ని, శరీరాన్ని — తన అధీనంలోకి తెచ్చుకొనును గాక; నీ లోనిదంతా, శ్రీమాత బిడ్డగా మారే వరకు — నీ జీవితంలో ప్రతి రోజు — ఆ కొత్త జన్మ యొక్క — ఇంకా పూర్ణతర, ఎదుగుదలతో కూడిన జన్మదినమగు గాక. నీ బాహ్యాంతరముల లోనిదంతా — ఆ కొత్తజన్మ యొక్క — దివ్యశాంతి, శక్తి, ఆనందముల ప్రకటనతో కూడిన ఒకే ఉద్యమంగా భాసించే వరకు — దివ్య వెలు గు, దివ్యశక్తి, దివ్యసాక్షాత్కారము — నిన్ను ఆవరించి సంరక్షించి, పోషించి, నీకు అండగా ఉండు గాక.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: యస్. వై. సోమయాజులు

పరమోన్నత ఆధ్యాత్మిక పునర్జన్మ

వర్ణించ వీలులేని దైవము నీకు చెందిన ఈ నమ్రత యొక్క ఘనాతిఘన విజయా లలో ఒకటి పైకి అదివ్యముగా కన్పించే పదార్థము యొక్క రూపాంతరీకరణము. ఈ సత్తా లోనికి తీసుకురావలసిన అతిమానస శరీరం నాలుగు ముఖ్య లక్షణాలు కలిగి ఉంటుంది. అవి భారరాహిత్యం (తేలిక) ఆమోదము, మృదుత్వం, ప్రకాశ వంతం. భౌతికశరీరం ఎప్పుడైతే దివ్యత్వాన్ని పూర్తిగా సంతరించుకున్నదో అపుడు అది గాలిలో నడయాడుతున్న అనుభూతి కలిగి వుంటుంది. తామసము లేదా భారంగా ఉండడం లేదా అచేతనత్వమునకు లోనుగావడం లాంటివి ఇకపై ఉండ వు. అంతేగాక ఏ పరిస్థితులకైనా తను సిద్ధం కాగలిగే శక్తికి పరిమితు లుండవు. ఆత్మవికాసమును అడ్డగించేలా పదార్థము మీద మోపబడు తామసమును, అసమ ర్థతను ఇంక ఏమాత్రము అంగీకరించే అవసరం కలగదని దానికి తెలుసు గనుక ఏ పరిస్థితులు ఎదురైనా ఏ షరతులు విధించబడినా అది ఆమోదించుటకు సిద్ధ ముగా ఉండును. అతిమానసమృదుత్వమును ఏ దివ్యశక్తి ఛిద్రము చేయజాలదు.

ఆ శక్తుల ద్వారా వచ్చు దాడులను విజయవంతంగా ఎదుర్కొనుటలో ఏమాత్రం వెనుదీయక ఆ దాడులను నిర్వీర్యంచేయుటగాని, ఆ దాడులు వచ్చినవి వచ్చినట్లే అణగారిపోవునట్లుగాని చేయును. ఆ విధంగా అవి ఏమాత్రం అపాయకరం గాకుండా వాటంతటవి సమసిపోవును. చివరికి అవి తేజస్సుగా పరిణతిచెంది ప్రతికణము ద్వారా అతిమానసశోభలను ప్రసరింపజేయును. తద్వారా బాగా అభివృద్ధి చెంది సూక్ష్మదృష్టి కలిగివున్నవారికేగాక అతిసామాన్యమానవులకు గూడ ఈ తేజోప్ర భలు దృగ్గోచరములగును. ఇదందరికీ స్పష్టంగా తెలిసే వాస్తవం. రూపాంతరీకర ణకిది స్థిరమైన నిరూపణ. ఎంతటి సంశయాత్మకునైనా ఒప్పించే విషయం ఇది.

భౌతిక పరివర్తన మనునది పరమోత్కృష్ట పునర్జన్మ. అది సాధారణ గతము నంతటిని నిశ్శేషముగా ఊడ్చివేయును. ఆధ్యాత్మిక పునర్జన్మ అంటే మన గత బంధములను, పరిస్థితులను పూర్తిగా నిర్మూలించి, జీవితంలో ప్రతి క్షణమును నూతన జన్మ ఆరంభంగా అనుభవము లోనికి తెచ్చును. మన గత క్రియాకలాప స్రవంతి నుంచి విముక్తి. మరో విధంగా చెప్పాలంటే ప్రకృతి సహజంగా మనకు సంక్రమించే గతానుగత కార్యకారణ బంధవిముక్తి. మన చేతన గతం నుంచి దిగ్విజయంగా తెగతెంపులు చేసుకున్నపుడు మన ద్వారా జరిగిన పొరపాట్లు, తప్పులు, అవకతవకలు, మనస్మృతులలో ఇంకా మిగిలిపోయి మన జీవధారలను జలగలా పీల్చుకుని కృశింపజేయు క్రియకు స్వస్తి పలికి మనకు ఆనందదాయక మైన స్వేచ్ఛను ప్రసాదించును. స్వేచ్ఛ కేవలం బుద్ధిపరమైనది కాదు, క్రియాశీ లంగా భౌతిక వాస్తవంగా కూడా పటిష్టంగా నిలిచి ఉంటుంది. మనం నిజంగానే స్వేచ్ఛగా జీవిస్తాం. మనల్ని ఏదీ బంధించజాలదు. మనల్ని ఏదీ ప్రభావితం చేయదు. నిజంగా స్వేచ్ఛ కలిగి ఉంటాం. పిశాచంలా పట్టి పీడించే బరువుబాధ్య తలు వుండవు. మనం గతాన్ని అధిగమించి యెదగాలన్నా, గతాన్ని నిర్మూలిం చాలన్నా, విఫలం చేయాలన్నా, అనుతాపం లేదా పశ్చాత్తాపంలాటివల్ల కాదు. పరివర్తన చెందని గతం ఒకటి వుండేది అనే విషయమే మర్చిపోవాలి. వివేకవంత మైన చేతనాస్థితికి చేరుకోవాలి. అదే మనలను కట్టిపడేసి ఉంచే బంధాలను సడలి స్తుంది. తిరిగి జన్మించడం అంటే, ముందు చైత్యపురుషచేతన లోనికి ప్రవేశించటం. అప్పుడు అక్కడ దైవంతో సమైక్యమవుతాం. చైత్యపురుషజ్ఞానం లేకుండా ఇది సంభవం కాదు. ఒక్కసారి దైవానికి దాసోహం అయిన జీవాత్మ చైతన్యం కలిగి

స్థిరపడినవాళ్ళమై ఉంటే మాత్రం ఇక అంతా బంధవిముక్తియే. ఇక అపుడు నిరంతర నవ్యజీవనారంభమే. గతం మనలను ఇక యెంతమాత్రం అంటిపెట్టుకుని ఉండదు. విశ్వమంతా నిరంతరము అదృశ్యమవుతూ, క్షణక్షణం నిత్యనూతనంగా సృష్టింపబడుతూ ఉన్నట్లు కలిగే ఎడతెరిపిలేని అనుభూతి — ఇదీ నేను మీకు చెప్పాలంటే — పునర్జన్మకి పరాకాష్ఠ.

మూలం: శ్రీమాత

అనువాదం కె. భాస్కరరావు


సమాచార పత్రం

సావిత్రి అధ్యయన శిబిరం: 2010 ఫిబ్రవరి 22-28 వరకు సొసైటీ బీచి ఆఫీసు ప్రాంగణంలో 'సావిత్రి' అధ్యయన శిబిరం, డా. అలోక్ పాండేగారిచే నిర్వహింపబడుతుంది. సాయంకాలం 5 గం. 15 ని.ల నుంచి 7 గం.ల వరకు — మధ్య 15 నిముషాలు విరామంతో జరుగుతుంది. ఇందుకు అందరూ ఆహ్వానితులే.

మహరాష్ట్ర, గోవా: కేంద్రాలు, బ్రాంచీల వార్షిక సమావేశాలు గోవా సొసైటీ బ్రాంచిలో, సెప్టెంబరు 2009, 5,6,7 తేదీలలో నిర్వహింపబడినవి. 13 కేంద్రాలు, బ్రాంచీల నుంచి 45 మంది ప్రతినిధులు హాజరయారు. సర్వశ్రీ ప్రదీప్ నారంగ్, కైవల్య స్మార్టు, దీపక్ డిసౌజా గారలు కార్యక్రమ సమన్వయకర్తలుగా వ్యవహరించారు. వేర్వేరు కేంద్రాల, బ్రాంచీల కార్యక్రమాలను, శ్రీఅరవింద సొసైటీ స్వర్ణోత్సవాలు, శ్రీఅరవిందులు పాండిచేరి రాకను పురస్కరించుకొని జరుపుకునే శతజయంతి ఉత్సవాలు, అందులకై చేబట్టవలసిన కార్యక్రమాల గురించి చర్చించారు. పాల్గొన్న యువకులు, మానసిక పరిపూర్ణతలు — నిజాయితీ, విశ్వాసము, భక్తి, ధైర్యము, సహనము — అంశాలపై సంక్షిప్త ప్రసంగాలు చేశారు.

హిందీజోన్‌కు సంబంధించిన కేంద్రాలు, బ్రాంచీల: వార్షిక సమావేశాలు అక్టోబరు 2009, 10-11 తేదీలలో పాటియాలా నగరంలో జరిగాయి. ప్రారంభోత్సవ కార్యక్రమానికి 450 మంది హాజరయారు. శ్రీ కిట్టు రెడ్డి, డా. జె. పి. సింగ్, శ్రీ మనోజ్‌శర్మ, శ్రీ పవాన్ గారలు పాల్గొని ప్రసంగించారు. 118 మంది ప్రతినిధులు 25 నగరాల నుంచి, పాటియాలా నుండి పదిమంది పాల్గొన్నారు.

Rs. 15



ఆంతరంగిక దృక్పథం

అఖిల

అఖిల భారత పత్రిక

ఫిబ్రవరి 2010

4.4.2009 — 4.4.2010

శ్రీఅరవిందులు పాండిచ్చేరి చేరుకుని నూరు వసంతాలు నిండిన సంవత్సరము.

19.9.2009 — 19.9.2010

శ్రీఅరవింద సొసైటీ స్వర్ణోత్సవ సంవత్సరం.

విషయసూచిక

ఆంతరంగిక దృక్పథం

నీకిది క్రొత్త దిశలు తెరుస్తుంది	3
అంతరంగ వైఖరి, విశ్వాసము — మాత్రమే ఎన్నదగినవి	4
సరియైన అంతరంగ దృక్పథం	4
సక్రమ దృక్పథానికుండే శక్తి	7
'విశ్వాసము — నమ్మకము' — అంతరంగ దృక్పథం	9
నిజాయితీకి కావల్సిన అంతరంగ దృక్ఫథం	13
'సహనశక్తి, ఉల్లాసము' — కావల్సిన అంతరంగ దృక్పథం	16
వినయం, కృతజ్ఞత – లకు సంబంధిత ఆంతరంగ దృక్ఫథం	20
కర్మ పట్ల కావల్సిన అంతరంగ దృక్పథం	23
భగవంతుని నుంచి మనకు కావల్సినది పొందడమెలా?	24
ఇష్టాయిష్టాలు లేకుండా ఉండట మెలా?	26

అనుబంధం

గరుడుని కారుణ్యం (కథానిక)	29
కాంతి కిరణాలు	32

ఎవరైతే మనస్ఫూర్తిగా, చిత్తశుద్ధి కలిగి ఉంటారో, వారు ఎల్లప్పుడూ భగవంతుని తోడు కలిగి ఉంటారు.

శ్రీమాత



నీకిది క్రొత్త దిశలు తెరుస్తుంది

జీవితం యొక్క సర్వ విషయ కార్యకలాపాల, పరిస్థితుల ప్రభావము, వ్యక్తిచైతన్యముపై ఉంటుంది. ఆ ప్రభావం కేవలం వ్యక్తి దృక్పథంపై ఆధారపడి ఉంటుంది. ఈ సంగతి వ్యక్తి ఏదో ఒక దశలో గ్రహించకపోడు. విషయములు వాటికవి మంచివిగానో, చెడ్డవిగానో ఉండవు. వాటితో మనకు ఉన్న అనుబంధమును బట్టి అలా ఉంటాయి. ఏదో క్షణంలో వ్యక్తికది యెరుకపడుతుంది. పూర్తిగా వీటిపై మనకున్న దృక్పథానికి అనుగుణంగా వాటి ప్రభావం మనపై ఉంటుంది. ఒకే విషయం — అదే మాదిరి — ఏ తేడా లేనిది — మనం దానిని — దివ్యకృపతో, దివ్యసామరస్య ఫలితంగా లభ్యమైన భగవత్ప్రసాదంగా స్వీకరించినట్లైతే, మనం మరింత చైతన్యవంతంగా, శక్తివంతంగా, నిజాయితీగా ఉండటానికది సహకరిస్తుంది. సరిగ్గా అదే పరిస్థితిలో, దానిని మనమొక విధికల్పితమైన ఆఘాతంగా, మనకు దుష్ప్రభావం కలిగించేదిగా తీసుకుంటే, అది మనలని కృంగతీస్తుంది. ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. మనలోని శక్తి సామరస్య చైతన్యాలన్నిటినీ హరింపచేస్తుంది. దాని పరిస్థితిలో మాత్రము అది ఏ తేడా లేకుండా సరిగ్గా ఒకటే. ఇలాంటి అనుభవం నీకు కలుగుతే యెంత బాగుండును అనుకుంటాను. ఇది కలిగి ఉంటే మీరు మీపై స్వాధిపత్యం కలిగి ఉంటారు. అంతే కాదు. మీ జీవితపరిస్థితులన్నీ మీకు వశమై ఉంటాయి. అయితే ఇది మీ దృక్పథంపై పూర్తిగా, సమగ్రంగా ఆధారపడి ఉంటుంది. ఇది మానసిక అనుభూతి కాదు — అక్కడే మొలకెత్తినా. ఇదొక శారీరక అనుభవంగా మీకు అనుభావ్యమవుతుంది.

ఇది నీకు క్రొత్త దిశలకు ద్వారాలు తెరుస్తుంది. ఇదే మార్గము. రూపాంతరీకరణకు నిర్దేశించే ఒక ముందడుగు.

మూలం: శ్రీమాత

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

అంతరంగ వైఖరి, విశ్వాసము — మాత్రమే ఎన్నదగినవి

సర్వమూ అంతరంగ వైఖరి మీద ఆధారపడి ఉంటుందని సాధకుడు సదా గుర్తుంచుకోవాలి. దైవకృప మీద అతనికి సంపూర్ణమైన విశ్వాసం ఉన్నట్లై న అడుగడుగునా దైపకృప అతనిచే ఉచితమైనదానిని చేయిస్తుందని అతను కనుగొంటాడు.

కాని అలా జరగాలంటే నీలోని మరియే ఇతర చలితచాలనం చేత ఖండింపబడని, లోతుగా వేళ్ళూని విశ్వాసం. నీ అస్తిత్వమంతా పరివ్యాప్తమై ఉండాలి. ఇది సహజంగానే కష్టమైంది. పైగా నీ మీద నీకు నమ్మకం కలిగి ఉండగలగాలి. కాని నీ చుట్టూ ఉన్నవారు, నీ వైఖరిలో పాలుపంచుకోరు. అయినా కూడా (దీనిని నీవు భరిస్తూ) ఈ నీ వైఖరి, నమ్మకం మాత్రమే ఎన్నదగినవి అనే సంగతి గుర్తుంచుకోవాలి.

బాహ్యమైనవన్నీ అర్థరహితంగా నిరుపయోగమైనవని నిరూపణ కాబడేవి. దైవకృప మాత్రమే నిన్ను కాపాడేది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం; సిద్దులగారి త్రివేణి

సరియైన అంతరంగ దృక్పథం

ప్రశ్న: ఏది సరియైన దృక్పథం?

శ్రీమాత: అది విషయాన్ని బట్టి ఉంటుంది బిడ్డా! తాను పరిపూర్ణతను సంతరించుకోవాలనే ఇచ్ఛ, లేదా, తాను ప్రశాంతంగా ఉండాలనే ఇచ్ఛ, ఇలా పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. అంటే, ప్రతీ సందర్భంలోను, దానికి తగిన ఒక అంతరంగ దృక్పథ ముంటుంది. ఉండాలి తప్పనిసరిగా. నీకు ఉండవలసినది ఇదే. ఇది విషయానుగుణంగా ఉంటుంది.

ఉదాహరణకు, తాను భౌతికంగా ఒక రకమైన అస్థిరతను,అనుభూతి పొంది, రాబోయే అనారోగ్యాన్ని పసిగట్టిన వెంటనే — సరైన అంతరంగ దృక్పథంపై దృష్టి కేంద్రీకరించడం అంటే — తన అంతరంగ ప్రశాంతతపై దృష్టి కేంద్రీకరించడమే. దైవకృపపై నమ్మకం కల్గి ఉండడమే. భౌతిక సుస్థిరత మంచి ఆరోగ్యాన్ని

కల్గి ఉండాలని ఇచ్ఛగించడమే. ఇదే సరైన దృక్పథం. వేరొక సందర్భంలో, ఒక కోపావేశ తరంగం, లేదా క్షణికాహంకారం, పెల్లుబికి పైకి వస్తున్న అనుభూతి కల్గు తుంది; అప్పుడతడు తప్పనిసరిగా, వెనుకడుగు వేసి, — అంతరంగ ప్రశాంతత వైపుగా దృష్టి మరల్చుకోవాలి. కృత్రిమ విషయాలకు దూరంగా, — ఊర్ధ్వభూమిక నుండి వచ్చేదానిని మాత్రమే ప్రకటించాలనే ఇచ్ఛతో, దైవేచ్ఛకు ఎల్లపుడూ విధేయుడై ఉండాలి. ఇదే సరైన అంతరంగ దృక్పథం. ఇలాగే ఉంటుంది, ఇంచుమించు, ప్రతి సందర్భంలో. సహజంగా, అదెల్లప్పుడు తిరిగి అక్కడికే వస్తుంది. ప్రతి ఒక్కరు దైవాన్ని తప్పక జ్ఞాపకముంచుకోవాలి. అతని సేవకు అంకితమవాలి. 'దైవేచ్ఛయే' తన ఇచ్ఛ కావాలి.

కాని ఒక సందర్భంలో నీవు ప్రశాంతతను కోరవచ్చు వేరే సందర్భంలో శక్తిని కోరవచ్చు; ఇంకొకప్పుడు ఆరోగ్యాన్ని కోరవచ్చు; అలాగే బాహ్యం నుండి వచ్చే వత్తిడిని నిరోధించేదేదో నీవు కోరవచ్చు

నీవు సందిగ్ధంలో ఉన్నపుడు — సరైనదాని నేదో ఎంపిక చేయవల్సి వచ్చినపుడు — వానిలో ఏది సరైనదో తెలియనప్పుడు — అట్టి సందర్భంలో — తప్పనిసరిగా — సాధ్యమైనంతవరకు — నీకు నీవుగా — నీ చైత్యపురుషసత్తాతోను, నీలోని దైవసాక్షాత్కారంతోను, అనుబంధమేర్పర్చుకోవాలి; సమస్యను చైత్యపురుష,చేతనకు ఎరుకపర్చాలి. దానిపై సత్యవెలుగును, — దైవేచ్ఛకు అత్యంత సన్నిహితంగా ఉండే, సత్య నిర్ణయాన్ని కోరాలి. ఆ నిర్ణయాన్ని శ్రద్ధతో వినడానికి,(దాని నుండి) ఉత్తేజం పొందడానికి ప్రయత్నించాలి.

ప్రతి సందర్భంలోను, ఇదే సరైన అంతరంగ దృక్పథం అని గమనిస్తావు.

ప్రశ్న; ప్రియమైన మాతా! ఇక్కడ శ్రీఅరవిందులు చెప్తారు, "సరైన దృక్పథంలో ఎదుర్కొన్న కష్టాన్ని అధిగమించాక, ఒక ఆటంకం అదృశ్యమైనట్లనిపిస్తుంది." ఏది సరైన అంతరంగ దృక్పథం?

శ్రీమాత: ఆ! ఈ ప్రశ్న వస్తుందని ఊహించా ముందే. ఈ దిగువ వాక్యంలో వారు (శ్రీఅరవిందులు) ఏది వివరించారో అదే సరైన అంతరంగ దృక్పథం. తన నమ్మకాన్ని సడలనీయకుండా, ప్రశాంతంగా ఉండడం, — ఇంకా కొంచెం దూరంలో



రాధ ప్రార్థన

తొలి చూపులోనే నిన్ను నా ప్రభువు, దైవమని తెలుసుకున్నాను. నా నివేదనను స్వీకరింపుమో స్వామీ!

నా ఆలోచనలు, ఆవేశములు, నా హృదయభావనలు, సంవేదనలు, జీవన సర్వచలితచాలనలు, శరీరములోని ప్రతి జీవకణము, ప్రతి రక్తబిందువు — సర్వ స్వము — ఏ మినహాయింపులేక అంతయు నీదే స్వామీ! నా నుంచి నీవేమి అభిల షిస్తున్నావో అదే నేను కాగలను. జీవన్మరణములు, సుఖదుఃఖములు, ఖేదమోదములు — ఏది నా కొరకు నీవు నిర్ణయించినా దానిని నేను స్వాగతీకరిస్తాను. నీ వందిం చిన ఏ పురస్కారమైనా, అది నాకు దైవపురస్కారమే; బ్రహ్మానందదాయకమే.

శ్రీమాత

ఉందనుకుంటా --ఆకస్మికదాడి దాటిపోయేవరకు, ఓర్మితో, నమ్మికతో, నిరీక్షించ డం.

ఏది ఏమైనా, సరైన అంతరంగ దృక్పథం అంటే, ధైర్యం పోగొట్టుకోకుండా ఉండడం; నమ్మకం పోగొట్టుకోకుండా ఉండడం; అసహనంగా ఉండకుండడం. నైరాశ్యంలో మునగకుండా ఉండడం; చాల నిబ్బరంగా, ప్రశాంతంగా ఉండడం; ఎంత ఎక్కువ ఆకాంక్షతో ఉండగలరో, అంత ఎక్కువ ఆకాంక్షతో ఉండడం. ఏది జరుగుచున్నప్పటికీ, ఆందోళన చెందకుండా ఉండడం. ఇది, తప్పక వైదొలగుతుందని అంతా బాగుంటుందని, నిశ్చయం కల్గి ఉండడం — ఇదే, నిజంగా ఉత్తమమైనది.

మూలం: శ్రీమాత

అనువాదం యస్. వై. సోమయాజులు

సక్రమ దృక్పథాని కుండే శక్తి

ఎప్పుడూ మంచే జరుగుతుందా? మంచయినా చెడయినా జరిగేది జరిగే తీరుతుంది. ఇదందరికీ తెలుసు. మరోలా జరగడం కుదరదు. ప్రపంచధర్మాన్ని (వైశ్వానిక నియతివాదం) బట్టి అది జరిగే తీరాలి. అయితే అది జరిగిన తరువాత మన మనుకోవాలి. అంతకు ముందు కాదు. ఒక దేశానికైనా లేదా ఒక వ్యక్తికైనా సంభవించే విషయమేదైనా అంటే వ్యక్తిగత విషయం సర్వోత్కృష్టంగా జరగవచ్చు. అదంతా వ్యక్తిగతమైన దృక్పథాన్ని బట్టి వుంటుంది.

ఏదైనా జరగడానికి అదే సమయంలో ఆ పరిస్థితులలో నువ్వు అత్యున్నతమైన అనుకూల దృక్పథంతో ఆ విషయాన్ని తీసుకోగలిగినట్టయితే అంటే దానర్థం నీ సమర్థతకి తోడు నీ సర్వోన్నత చైతన్యం నీకు అందుబాటులో ఉండి నీకు కలిసి వస్తే అది తప్పకుండా యెంతో సర్వోన్నతంగా జరుగుతుంది. నీకు జరిగిన మంచిలో కెల్లా ఎంతో ఉత్కృష్టమైనది అదవుతుంది. కాని నువ్వు నీ సమర్థతని పూర్తిగా ఉపయోగించక కింది స్థాయికి దిగజారిపోయినట్టయితే అది తప్పకుండా అంత బాగా జరగకపోవడం తథ్యం. ఆ చిన్న కారణమే నువ్వు ఆ పని సరియైన

అవగాహనతో చెయ్యలేదనడానికి నిదర్శనం. సక్రమ దృక్పథానికి ఉండే శక్తి ఎలాటి దంటే — అది ఏలాటి పరిస్థితినైనా అనుకూలంగా మార్చగలగటమే కాకుండా, తక్షణ ప్రభావితం కాబోయే భూమికలో, అసలు పరిస్థితియే పూర్తిగా మారిపోతుంది. ఇది నేను నొక్కి చెప్పగలను.

ఉదాహరణకి ఒక వ్యక్తి నిన్ను చంపటానికి వచ్చాడనుకుందాం. నువ్వు ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తూ వుండే నీ స్వభావానికి విరుద్ధంగా మామూలు మనిషిలా సామాన్యమైన బుద్ధితో విపరీతంగా భయపడిపోయినట్టయితే వాడు తను వచ్చిన పనిని విజయవంతంగా కానిచ్చుకుంటాడు. అలా కాకుండా లోపల భయపడుతున్నా బయటికి కొంచెం ధైర్యం తెచ్చుకుని దేవుడి మీద భారం వేసినట్టయితే వాడి గురి తప్పిపోవచ్చు. చిన్న గాయంతో బయటపడొచ్చు. ఇంకా దైవబలం నీ చుట్టూ వుండి నిన్ను కవచంలా కాపాడుతున్నాడని నమ్మినట్టయితే, పరిస్థితిని చక్కగా అవగాహన చేసుకుని సక్రమ దృక్పథంతో ప్రవర్తించినట్లైన, నీ చిటికిన వ్రేలును కూడా తాకలేడు.

ఈ వాస్తవమే మొత్తం పరిణామ క్రమ సమస్యకి పరిష్కారం. ఎల్లప్పుడూ భగవంతుడి ధ్యానంలో వుండు. దైవబలాన్ని భూమి మీదకి తెప్పించడానికి ప్రయత్నించు. అలా చేసినట్టయితే ఎప్పుడూ గొప్ప మేలు జరుగుతుంది. ప్రపంచం ఒక్కసారి మారిపోవడం కుదరదనుకో. కాని యెంత వేగంగా వీలయితే అంత వేగంగా మారగలుగుతుంది. దీనిని యీ విధంగానే అనే తిన్నని యోగమార్గంలో పెట్టినట్టయితేనే సాధ్యమవుతుంది. ఇది మాత్రం మరచిపోకు. నట్టడివిలో వున్నట్టు నిస్సహాయంగా తిరుగుతూ దారి తప్పిపోయి పక్కదారి పట్టకుండా వుండాలి.

మీరు ప్రతి ఒక్కరూ మీరు చెయ్యగలిగినదంతా చేస్తే అప్పుడది సరియైన సహకారమై ఫలితం యెంతో వేగంగా పొందగలం. నా దగ్గర యెన్నో వుదాహరణలున్నాయి. సక్రమమైన అవగాహన శక్తి గురించి ఒకే వ్యక్తి సరియైన దృక్పథం వల్ల కొన్ని వందలమంది అనేక వుపద్రవాల నించి రక్షించబడడం నేను చూసేను. కొన్ని కొన్ని చోట్ల యిటువంటి అవగాహన బొత్తిగా లేకపోవడంచేత మామూలు ప్రతిచర్యలకి శరీరం గురవుతుంది. ఇంకా 'భగవంతుడే చూసుకుంటాడులే'అని గొప్పగా యే ప్రయత్నం చెయ్యకుండా వుండిపోతే కూడా నువ్వలాగే చంపబడతావు. నీ శరీరం దైవతలంపే లేక భయంతో వణికిపోతూ వుంటుంది. శరీరంలో

నిజమైన చైతన్యం వుంటే భయమన్నది కాస్త కూడా వుండదు. సరి కదా పరిపూర్ణ దివ్యప్రశాంతితో వుంటుంది. అప్పుడసలు ప్రమాదమన్నదే వుండదు. మనుషుల దాడినించే కాదు. ఏనుగు లాంటి బలమైన, క్రూరమైన జంతువుల దాడి నించి ఇంకా పంచభూతముల దాడినించి కూడా తప్పించుకొని బయటపడగలవు. నీకో చిన్న వుదాహరణ యిస్తాను. ఒక భయంకరమైన తుఫాను రాత్రి వర్షం కుండపో తగా కురుస్తున్నది. మెరుపులు, వురుములతో భయంకరమైన శబ్దాలతో వాతావర ణమంతా అల్లకల్లోలంగా వుంది. శ్రీఅరవిందుల గదికి పోయి గాలికి కొట్టుకుంటున్న కిటికీ వెయ్యడంలో ఆయనకి సహాయపడాలనుకున్నాను. వెళ్లి ఆ గది తలుపులు తీసి చూసేసరికి, ఆయన తను వ్రాసుకునే బల్ల వద్ద కూర్చుని ప్రశాంతంగా వ్రాసుకుంటూ వుండడం చూసేను. బయట ప్రళయ బీకరంగా వున్న గాలివాన అలజడి మచ్చుకైనా అక్కడ లేదు. ఎంతో ప్రశాంతంగా వుంది. ఆ గదిలో వున్న వాళ్ళకి బయట అంత గాలివాన వున్నట్టు కలలో కూడా వూహించలేనంత ప్రశాం తత. కిటికీ తలుపులన్నీ పూర్తిగా తెరిచే వున్నాయి. ఒక్క వాన చుక్క కూడా లోపలకి రావడం లేదు.

మూలం: శ్రీమాత

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

'విశ్వాసము, నమ్మకము', ఆంతరంగిక దృక్పథం

కార్యశూరులు, ఆవిష్కర్తలు, పరిశోధకులు, జ్ఞాన సృజనశీలురు, ఋజువు దొరికే దాకా, లేదా అనుకొన్నది సాధించేదాకా విశ్వాసంతో ముందుకు సాగుతుంటారు. నిరాశ, భంగపాటు, ఖండన మండన లెదురైనా వారు ముందుకే పోతుంటారు. ఎందుచేతనంటే, ఇదే సత్యం, దీన్నే అనుసరించి సాధించుకోవాలి అని యేదో లోనుంచి వారికి తెలియజేస్తూ వుంటుంది. అంధవిశ్వాసం మంచిది కాదు గదా అంటే, ఉండవలసిందే అంధవిశ్వాసం, గ్రుడ్డిదైతేనే అది విశ్వాసం లేకపోతే అది మరేదో తర్కసారాంశమో, చర్చ ద్వారా ఒప్పించబడిన విషయమో లేదా తనకు

తానుగా ధృవపరచుకొన్న విషయమో అవుతుంది అని చెప్పేంత దాకా వెళ్ళాడు, రామకృష్ణుడు.

ఇంకా అభివ్యక్తంగాని, సాధించబడని, లేదా వాస్తవీకరించబడనిదానికి అంతరాత్మ యొక్క సాక్షి, విశ్వాసం. కాని మనలోని దివ్యజ్ఞాని ఇంకా, ఏ సూచనలు లేనప్పుడు గూడా అదే యదార్థమని, లేదా దాన్ని అనుసరించడం, లేదా సాధించడం అన్నింటినీ మించిన మహనీయ విషయమనీ అనుభూతి చెందుతుంటాడు. మనస్సులో ఒక స్థిరమైన నమ్మకం లేనప్పుడు గూడా, ప్రాణికం సంఘర్షించినా, ఎదురుతిరిగినా, తిరస్కరించినా, ఆంతర్యంలో వున్న ఈ విశ్వాసం సజీవంగా ఉంటుంది. ఇటువంటి సమయాలు, అంటే నిరాశతో కూడిన, వైఫల్యం యెదురైన, అపనమ్మకం, అంధకారంగల సుదీర్ఘ సమయాలులేని యోగసాధకు లెవరైనా ఉన్నారా? అతను నమ్మినా, నమ్మకపోయినా, అతనిలో ఇటువంటిదేదో వుండి అతన్ని సజీవంగా ఉంచుతోంది. ఎందుచేతనంటే అతనిలో ఉన్నది తాను అనుసరించేదే — ఏదేలా వున్నా — యదార్థముగాని, అనుభూతిని మించిన గ్రహింపు వుంటుంది. దైవం ఉన్నాడు, మనం అనుసరించవలసింది కేవలం దైవాన్నే; దానితో పోల్చినపుడు జీవితంలో మరేదైనా అంతకుమించి విలువ కలిగినది కాదు — అనేదే యోగ సాధనలో ఉండితీరవలసిన ప్రాథమిక విశ్వాసం. అట్టి విశ్వాసం మనిషి కున్నంత కాలం అతడు ఆధ్యాత్మిక జీవితాని కర్హుడవుతాడు. అంతేకాదు, అతని స్వభావం ఆటంకాలతో నిండి వున్నా, తిరస్కారాలు, యిబ్బందులు, యిబ్బడి ముబ్బిడిగా వున్నా అనేక సంవత్సరాల పైనుగులాట ఉన్నా, ఆధ్యాత్మిక జీవితంలో విజయం సాధించిగలవానిగా గుర్తింపబడ్తాడు.

మూలం: శ్రీఅరవిందులు

*

ఒక పరిశుద్ధ విశ్వాసం, సర్వశక్తివంతమై నిరోధించజాలనిదై ఉంటుంది. సర్వశక్తివంతమైవున్న, నిరోధించజాలని విశ్వాసం మనకు తరుచు కనపడదు, అంటే అది విశుద్ధమైన విశ్వాసం కాదన్న మాట. ఈ సమస్యను ఈ విధంగా చూద్దాం. మనలో ప్రతివానికీ ఒక విశ్వాసమంటూ వుంటుంది. ఉదాహరణకు దేనియందో ఒకాదానియందు విశ్వాసం, మనలో దైవసన్నిధికి సంబంధించిన విశ్వాసం అనుకొందాం. మన విశ్వాసం శుద్ధమైనదైతే, మనలో ఉన్న ఈ దైవసాన్నిధ్యాన్ని తత్ క్షణమే

తెలుసుకో గలుగుతాం. ఈ ఉదాహరణ అర్థం చేసుకోవడం తేలికే, దైవసన్నిధి ఉన్నదనే విశ్వాసం నీకుంది, కాని నీకు దాని అనుభవం కలుగలేదు, యెందుకని? విశ్వాసం నిష్కళంకమైనది కానందుచేత. విశ్వాసం గనుక విశుద్ధమైనదై వుంటే, వెన్వెంటనే పని జరిగిపోతుంది. ఇది చాలా యదార్థం. వెంటనే పని జరుగలేదని నీవు తెలుసుకొన్నప్పుడు, "ఎందుకని నా విశ్వాసాన్ని వాస్తవం చేసుకోలేకపోయాను? నా విశ్వాసం యెటువంటిదై వుంటుంది?" అని పర్యావలోకించటం ప్రారంభిస్తావు. అదే చిత్తశుద్ధితో చూసుకుంటూపోతుంటే అందులో చాలా అల్పవిషయాలున్నట్లు — ఎంతో పెద్దవి కాదు — యేవగింపు కలిగిందే చాలా అల్పవిషయాలున్నట్లు తెలుసుకొంటావు. అల్పవిషయాలు, చాలాసార్లు ఒక అల్ప డాంభికభావం ప్రవేశిస్తుంది, తరువాత ఒక కోరిక — అది అంత తీవ్రమైనదై వుండాలని లేదు — తన్ను తాను గొప్పగా కాననీయకుండా ప్రవేశిస్తుంది. అది నీకిచ్చే ప్రాముఖ్యత అది నీ కిచ్చే శక్తి, అది నీ కిచ్చే సంతృప్తి....

*

ఆకాంక్ష తప్పనిసరి. కాని కొంతమంది, విశ్వాసమూ, అవిశ్వాసముల మధ్య, దృఢనమ్మకమూ, అపనమ్మకముల మధ్య, అంతస్సంఘర్షణతో ఆకాంక్షిస్తుంటారు. విజయం తథ్యమనే ఆశావాదమూ, ఎప్పుడూ ఏ విపత్తు సంభవిస్తుందోననే నిరాశావాదమూ, మధ్య అంతస్సంఘర్షణతో ఆకాంక్షిస్తుంటారు. ఈ సంఘర్షణ గనుక నీలో వుంటే, ఆకాంక్ష వున్నప్పటికీ, నీకేదీ ప్రాప్తించదు.

మంచిది. దివ్యక్రియాశక్తికై ఆకాంక్షిస్తే, దైవసహాయానికై అర్థిస్తే, తప్పకుండా లభిస్తుందనే దృఢసంకల్పంతో అర్థిస్తే, అది లభించకపోవడం అసాధ్యం. తప్పక లభిస్తుంది. ఇటువంటిది... అవును, నిజంగా ఈ సంపూర్ణ దృఢనమ్మకం కలిగివుండటమే ఒక ఆంతరంగిక ఉన్మీలనం అవుతుంది. కొంతమంది యెల్లప్పుడూ తమను తాము తెరిచి వుంచుకొనే వుంటారు. దేన్నైనా స్వీకరించే అవకాశం వచ్చినపుడు, స్వీకరించడానికి సిద్ధంగా వీళ్ళక్కడుంటారు. ఇంకొంతమంది వున్నారు, వాళ్ళకేదైనా సాయం చేద్దామని ఒక శక్తి దిగివచ్చినపుడు వాళ్ళందుకు సిద్ధంగా వుండరు. ఆ క్షణంలో మూసుకుపోయి వుంటారు. పసిబిడ్డలా దృఢనమ్మకం కలిగిన ఇతరులు సదా సరైన సమయంలో స్వీకరించ సిద్ధంగా వుంటారు.

ఇది చిత్రంగా లేదూ, బాహ్యంగా చూస్తే, వాళ్ళ మధ్య భేదం కన్పించదు.

వాళ్ళకు సరిగ్గా ఒకే విధమైన శుభసంకల్పం వుండవచ్చు, ఒకే విధమైన ఆకాంక్ష వుండవచ్చు, మంచి చేయాలనే ఒకే రకమైన అభిలాష ఉండవచ్చు. కాని లోలో మందహాసంతో కూడిన నమ్మకం కలవాళ్ళు ప్రశ్నించరు, దక్కుతుందా, దక్కదా అనిగాని, దైవం సమాధానం ఇస్తాడా లేదా అని గాని, మధనపడరు — ఆ ప్రశ్నే వాళ్ళకుత్పన్నం కాదు. "నాకేది అవసరమో, అది నాకు తప్పక లభిస్తుంది. నేను వేడుకొంటే నాకు సమాధానం వస్తుంది. నేనేదైనా యిబ్బందిలో వుండి సాయం కోసం అర్థిస్తే, తప్పక అందుతుంది" అనేదేదో వాళ్ళ కర్థమయ్యే వుంటుంది.... అప్రయత్నమైన, నిష్కపటమైన, ఏ ప్రశ్నా తలెత్తని దృఢనమ్మకం వుంటే అది అన్నింటికన్న ఉత్తమంగా పనిచేస్తుంది. ఫలితాలు అద్భుతంగా వుంటాయి. ఓహ్! ఇది అసాధ్యం. ఈ సంకటం నుండి నేను బయటపడలేను. ఇపుడున్న — నేనాశిం చని — ఈ స్థితి ఇంకా గనుక పెచ్చుమీరితే అధ్వాన్నంగా తయారైతే నేనింకా, యింకా, యింకా దిగజారిపోతుంటే, ఇలా అయితే, అలా అయితే, మరోలా అయితే.... ఈ విధంగా మనస్సులో చెలరేగే వైరుధ్యాలవల్ల, సంశయాలతో — ఒకడు సంకటపిస్థితుల్లో వున్నపుడు ఇటువంటి దురభిప్రాయం కలుగుతుంది — మొత్తాన్ని నాశనం చేసుకుంటూ తనకూ, తాను స్వీకరించవలసివున్న శక్తికీ మధ్య ఒక అడ్డుగో డను నిర్మించుకొంటాడు. అద్భుతమైన విధంగా, ఛాయాలేశం కూడా లేకుండా ఏ విధమైన వాదప్రతివాదాలకు తావు లేకుండా, మరో అభిప్రాయం లేకుండా, మన లోని చైత్యపురుషుడీ దృఢనమ్మకంతో వుంటాడు. అలా వున్నపుడు పరిష్కారం లభించని ప్రార్థనంటూ యేదీ వుండదు, వాస్తవం చేసుకోలేని యే ఆకాంక్షా వుండ దు.

మూలం: దివ్యమాత

అనువాదం: కె. వి. రావు

నిజాయితీకి కావల్సిన అంతరంగ దృక్పథం

నిజాయితీ అంటే,

మన సర్వ ఆలోచనలు, అనుభూతులు, సంవేదనలు క్రియాకలాపాలు మన సత్వము యొక్క ప్రధాన దివ్యసత్యమును వ్యక్తీకరించాలి. ఇదే పరిపూర్ణ నిజాయితీ అని నా భావన.

*

సత్వముయొక్క సర్వచలిత చాలనాలను సర్వోత్కృష్ట చేతనాస్థాయికి ఉద్ధరించటం, అప్పటి వరకు సాధించినవాటిని ఫలప్రదం చేయటం — ఇదీ నిజాయితీకి అర్థం.

సత్వము యొక్క సర్వ భాగాల సామరస్య సమైక్యతలతో తనలోని కేంద్రీకృత దివ్య ఇచ్ఛాశక్తిని అన్ని వైపులా పనిచేసేటట్లు నిర్బంధిస్తుంది, నిజాయితీ.

*

ఆచరణలో నిజాయితీ: కోరిక, ఆకర్షణ, అనుకూల ప్రతికూలతలు, వ్యామోహం, జుగుప్స, ఇష్టాయిష్టాలు, — ఇవేవీ లేకుండా ఉండటం పరిపూర్ణ నిజాయితీకి అత్యావశ్యకం. విషయాలపట్ల వ్యక్తికి పరిపూర్ణ సమగ్రదృష్టి ఉండాలి. వాస్తవిక దృష్టితో కూడిన దృక్పథం కావాలి. అపుడు విషయాలు వక్రీకరింపబడవు. ఈ కార్యక్రమాన్ని సాధించటం మానవునికి చాలా కష్టమైనదనేది స్పష్టమే. తనలో గూడు కట్టుకుని ఉన్న వైరుధ్యాల నుంచి విడివడి స్వేచ్ఛగా ఉండటం చాలా వరకు అసాధ్యమే — తాను దైవీసంభూతుడుగా మారాలని నిర్ణయించుకొనకపోతే వీటిని తనలో భరిస్తూ ఉన్నంతకాలం వ్యక్తి పరిపూర్ణమైన నిజాయితీతో ఉండలేడు. క్రియాకలాపాలన్నీ — మానసిక, ప్రాణిక, శారీరకమైనవి అన్నీ – పెడదారి పడతాయి. శారీరకంగా కూడా అని ఎందుకన్నానంటే, ఇంద్రియ క్రియకలాపాలు కూడా వక్రీకరింపబడుతవి. రుచి, వాసన, దృష్టి, గ్రహణశక్తి — ఇవి యథాతథంగా, వాస్తవంగా గ్రహింపబడవు — మనలో ఇష్టాయిష్టా లున్నంతవరకు. ఇష్టాయిష్టా లుంటాయి. కొన్నిటి పట్ల ఆకర్షితులమవుతాం. కొన్నిటి పట్ల జుగుప్స కలిగి ఉంటాం. అలాటపుడు విషయాల వాస్తవరూపాన్ని దర్శించలేం. మనకు ప్రీతికరమైనవాని కనుగుణంగా ఇంద్రియాలు దారి తప్పుతాయి. అలాగే సంవేదనలు, ఉద్వేగాలు, ఆలోచనలు వక్రంగా

వర్తిస్తాయి. పరిపూర్ణ నిర్లిప్త భావన ఇక్కడ అవసరం. దృష్టి, ఆలోచన, అనుభవం, సక్రమమైనదిగా ఉండాలి. అలా ఉండటం అంత సులువు కాదు. అంతవరకు నీ అవగాహన పూర్తిగా వాస్తవంగా ఉండదు. కాబట్టి అంతవరకు అక్కడ చిత్తశుద్ధి ఉండదు.

*

సత్వము యొక్క సర్వమూలకాలు, సర్వ చలితచాలనాలు (ఆంతర్యం లోనివైనా, బాహ్యమైనవైనా), అన్ని భాగాలు — అన్నీ కూడా ఒకే ఇచ్ఛాశక్తి కలిగి ఉండి, దైవానికి మాత్రమే చెంది ఉండటం, దైవము కోసం మాత్రమే మనుగడ సాగించడం, దైవము ఇచ్ఛగించినది మాత్రమే తనూ ఇచ్ఛగించటం, దైవేచ్ఛను మాత్రమే వ్యక్తీకరణ చేయటం, దైవీసంభూతశక్తి మాత్రమే మూలాధారశక్తిగా కలిగి ఉండటం తప్ప మరియే ఇతర శక్తీ లేకుండా ఉండటం — ఇవే నిజాయితీలో ఉండే మౌలిక లక్షణాలు. దైవీసంబంధితమైనవి తప్ప అన్యమైన ఏ ఇతర మౌలిక లక్షణాలు నిజాయితీలో ఉండవు.

దైవాన్ని మోసగించటాన్ని పూర్తిగా నిరాకరించటం కోసం నీ నిజాయితీని తీవ్రతరం చేయవలసిన, నిన్ను నీవు సరిదిద్దుకోవలసిన అవసరం నీకు ఎప్పుడూ ఉంటుంది. ఒక్క క్షణం ఆ అవసరం నీకు రాకుండా ఉండదు. ముందు నిన్ను నీవు మోసం (ఆత్మద్రోహం) చేసుకోకు. భగవంతుని నెవ్వరూ మోసగించలేరనే విషయం అందరికీ తెలుసు. ఎంత తెలివితో కూడిని అసురుడైనా, దైవాన్ని మోసగించలేడు. ఇది తెలిసి కూడా తరుచుగా వ్యక్తి ఏదో సమయంలో తనకే తెలియకుండా, అనుకోకుండా, యాంత్రికంగా తనను తాను మోసం చేసుకునే ప్రయత్నం చేస్తాడు. తన మాటలను, చేతలను, చేసిన ప్రతి పనినీ సమర్థించుకోటానికి అనుకూలంగా సాకులు ఎప్పుడూ చెప్తూనే ఉంటాడు. ఇది ముందు జరిగే పని. పోట్లాటల్లో ఎప్పుడూ జరిగే విషయాలలో — "తప్పు వాడిదే" — అనే మాటలు ఎప్పుడూ వినిపించేవే. నేను వాటిని ప్రస్తావించను. దైనందిన జీవనంలో జరిగే అల్పవిషయాలు గురించి మాట్లాడుతున్నాను.

తలుపును గుద్దుకొని ఆ తలుపును గట్టిగా తన్నిన ఓ కుర్రవాడు నాకు తెలుసు. అలాటిదే ఇది. ఎప్పుడూ యెదుటివాడిదే తప్పు. పొరపాటు చేసినది వాడే. నీవు పెద్దవాడివై, కొంత వివేకం కలిగినవాడివై ఉన్నప్పుడు కూడా, తెలివితక్కు

వగా సాకులు చెప్తూనే ఉంటావు: "వాడు అలా చేసి ఉండకపోతే నేను ఇలా చేసి ఉండేవాడిని కాదు". కాని ఇది అటు నుంచి ఇటుగా చెప్పుకోవాలి.

నిష్కపటంగా ఉండటమంటే ఇదీ: నీవు ఒకరితో ఉన్నపుడు వాడు పొరపాటే కనుక చేసినా, నీవు నిజంగా నిజాయితీపరుడవైతే, వెంటనే, నీ ప్రతిక్రియ సవ్యమైనదిగా ఉండాలి — నీ తోటివాడు అలా లేకున్నా కూడా. అత్యంత సాధారణ విషయం — కోపంగా ఉన్నవాని సంగతే తీసుకో. వానికి బాధ కలిగించేటట్లు తిరిగి మాట అనకుండా, నిశ్శబ్దంగా, నిశ్చలంగా ఉండు. కోపం అంటురోగం. అది వాని నుంచి నీకు అంటదు. ఇది ఏమైనా అంత సులువుగా సాధించగలిగే సంగతేనా, అనేది, నీకు నీవే గమనించి తెలుసుకో. ఇది అతి ప్రాథమికమైన విషయం. నీవెంత నిష్కపటమైనవాడివో తెలుసుకునేందుకు ఇది ఒక చిన్న ప్రారంభం. ప్రతి అంటురోగాన్ని సంక్రమింపచేసుకునే వాళ్ల గురించి — ముతక హాస్యం — అదే రకమైన మూర్ఖత్వాన్ని తమకు సంక్రమింపచేసుకునే వాళ్ళని గురించి — నేను మాట్లాడటం లేదు.

నీవు సాధారణ దృక్పథంలో నిజాయితీగా ఉండే ప్రయత్నం చేస్తున్నప్పటికీ కూడా, నిన్ను నీవు నిశితంగా గమనించుకుంటే, లెక్కలేనన్ని విషయాలలో, నీలోని నిజాయితీ లోపించటం గమనించగలవు. ఇదెంత జటిలమైనదో కూడా తెలుసుకోగలుగుతావు.

నిజాయితీ ఉన్న చోట ఎక్కడైనా అక్కడ సహకారం, మార్గనిర్దేశం, నీకు ఉంటూనే ఉంటుంది. పరిష్కారం చూపే దైవకృప ఎప్పుడూ నీకు ఉంటుంది. నీవు పొరపాటుగా ప్రవర్తించే అవకాశం ఉండదు.

*

ముఖ్యమైన సంగతి. మరింతగా నిజాయితీని పాటించు. ఎల్లవేళలా నిష్కపటంగా ఉండు. అప్పుడు నీ ఆకాంక్ష సమగ్రంగా ఉంటుంది. నీకు నీవు ద్రోహం చేసుకోలేవు.

ఈ రకమైన నిజాయితీ వల్ల, నీకు దైవకృపతో కూడిన దివ్యసహకారం తప్పకుండా అందుతుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

సహనశక్తి, ఉల్లాసము
(కావల్సిన అంతరంగ దృక్పథము)

ప్రగాఢ విశ్వాసము నాకాంక్షించు. — ఇంతకు మించి నీ నుంచి నేనేమి అభిలషిస్తాను? ఒకింత నిలకడ, సాధనా పద్ధతిలో మరింత సమగ్రత — అంతే. ఓ రెండు రోజులు ప్రగాఢ ఆకాంక్ష కలిగి ఉండి, తర్వాత వైరాగ్యంతో, ఏముంది ఇక – జగమే మాయ, బ్రతుకే మాయ — అంటూ ఓ నిరాశా గీతాన్ని ఆలపించకు. దైవం లీలా వినోది. ఆయనకు పరిపూర్ణ అవకాశం ఇయ్యి. ఆయన నీలో ఓ చిరు దీపం వెలిగించినపుడు, లేదా, ఆందుకు సిద్ధపడినపుడు నిరాశతో తడిసిన దుప్పటిని ఆ అల్పమైన దీపం మీద కప్పటానికి సిద్ధం కాకు. 'అదో కొవ్వొత్తి మాత్రమే కదా! అంతకంటే ఏముంది', అంటావు. అయితే అలాంటి విషయాలలో మానవునిలో, శారీరక, ప్రాణిక, మానసికంగా ముసురుకున్న చీకట్లను చెదరకొట్టటానికి, ప్రారంభంగా, ఓ కొవ్వొత్తి మాత్రమే. ఆ తర్వాత ఒక చిరుదీపం. ఆ పిమ్మట ఒక రవి కిరణం — ఇదీ వరస. పరిణామదశలో ఆ దిశగా ప్రారంభాన్ని ముందుకు కొనసాగనివ్వాలి. సహజ పరిణామం తడవ తడవలుగా వచ్చే అనుభవాలతో కూడి ఉంటుంది. వాటిని దుఃఖం, సంశయం, నిరాశ — వీటితో అవరోధం కలిగించ కూడదు. ప్రారంభంలో, చాలా కాలం వరకు అనుభవాలు కాస్తంత, తగు మాత్రంగానే, అడపాతడపా వస్తూ పోతూ ఉంటాయి. వాటి మానాన, వాటిని వదిలేయాలి. అపుడు అలా ఉండీ ఉడిగీ వచ్చే అనుభూతులు అవిచ్ఛిన్నంగా సాగే ఆధ్యాత్మిక వికసనంగా కొనసాగుతుంది. కాని నువ్వు ఇంతవరకు అందుకు అసలైన అవకాశం ఇవ్వనే లేదే. మధ్య మధ్య సంశయాలు, నిరాకరణలు. తగు మాత్రంగా వచ్చే అనుభవాలు మరీ అరుదైపోయినై. ఆరంభం, అలా, ఆరంభంగానే మిగిలిపోయింది. ఇతరములైన ఎన్నో అవరోధాలను నీవు యెదుర్కొన్నావు. తిరస్కరించావు. ఈ కష్టాన్ని నీవు మరింత ముద్దుచేసి లాలించావు. అందువల్ల అది మరింత బలపడింది. పట్టువీడని కృషితో దానిని సాధించాలి. అపుడంతా నిశ్శేషంగా సందేహరహితమవుతుందని నేను అనను. సాధనకు సందేహం శత్రువు. ఇది పట్టు విడువకుండా దాడి చేస్తుంది. ఈ దాడిచేసే శత్రువును నీ నేస్తంగా చేరనీయకు. తలుపులు తెరిచి లోపలికి రానీయకు. నీ పక్కన, దానికి చోటీయకు. అన్నిటికీ మించి, లోనికి

ప్రవేశించే దైవాన్ని వెనుతిరిగి పోనీయకు. నిరుత్సాహపరిచే నిరాశ, నిర్వేదాల తడి దుప్పటి కప్పుకోకు.

నిశ్చయంగా నీవు చేయవలసినది యిదే. నేను నీకు నొక్కి చెప్తున్నాను. నీకై మిగిలి ఉన్నది ఇదొక్కటే. లేదా ఈ నేల. అంతే. ఇంతకు మించి ఏమీ లేదు. దీనిని దాటి బయటికి పోతే ఏముంది? బయట భూకంపాలు, హిట్లర్లు. కూలిపోతూన్న నాగరికత. ప్రళయం. ఇదే మరింత ప్రబలమైన కారణం. నీవు చేయవల్సినది చెయ్యటానికి. ఇందుకు సహకరించటానికే నీవు నియమింపబడినావు. ఇది చాల కష్టమైనది. దూరప్రయాణం. ప్రోత్సాహం అంతగా లేదు. అంటావా? అయితే ఏమి? ఘనకార్యాలు అంత సులువుగా పరిష్కారం కాగలుగుతాయని నీ వెందుకు అనుకుంటావు? శీఘ్ర విజయం లేదా అసలేమీ వద్దు అనుకోవటం సరి కాదు. కష్టాల నెదుర్కోవాలి. ఎంత ఉల్లాసంగా నీవు వాటి నెదుర్కొంటే అంత శీఘ్రంగా విజ యాన్ని సాధిస్తావు. ఎప్పుడూ విజయమంత్రాన్ని జపిస్తూ ఉండు. ఇదే నీవు చేయ వలసినది. దృఢసంకల్పం, దృఢనిర్ణయం. నాకిది తప్పనిసరిగా కావాలి. దీనిని నేను అందుకుంటాను, 'ఇదీ నీ దృఢమైన నిర్ణయం. అసాధ్యం? అసాధ్యమనేదేదీ లేనే లేదు. ఉన్నవల్లా — కష్టాలు, నిరంతర సుదీర్ఘ పరిశ్రమ — అంతే. అసంభ వాలు కావు. చేయాలి అనే దృఢనిశ్చయం, సత్సంకల్పం ఉండాలే కాని, చేయా లనుకున్నది — ఇప్పుడో, ఎప్పుడో — తప్పక జరుపబడుతుంది. నీ నిరాశాంధకారాన్ని తరిమికొట్టు. ధైర్యంగా నీ యోగప్రస్థానంలో ముందుకు సాగిపో. చీకట్లు అదృశ్య మయే కొలదీ లోలోపలి ద్వారాలు తెరుచుకుంటాయి.

ప్రశ్న: ఆనందం లేదు. శక్తి లేదు. చదవాలని, వ్రాయాలని అనిపించదు. జీవచ్ఛవం కదులుతున్న రీతి. పరిస్థితి అర్థమైందనుకుంటాను. స్వీయానుభవం ఏమైనా?

సరిగా అర్థం చేసుకోగలను. చంపేస్తుంది — అనిపించే అనుభవం. నేనూ అనుభవించాను. ఇలా ఉండే వాళ్ళందరికీ నేనెప్పుడూ చెప్పే సలహా — ఊరట పొందు. హుషారుగా ముందుకు సాగు. ఉల్లాసంగా, త్వరపడి ముందుకు సాగు తూ, 'రోము నగరం ఒక దినంలో నిర్మాణం కాబడలేదు,' అని అనుకోగలిగితే అలా అనుకో. లేదూ — మరి ఉషోదయమయి, పక్షుల కిలకిలారావాలు వినపడేవర కూ, అలా విచారిస్తూ ఉండు. తర్వాత అంతా సర్దుకుంటుంది.

అయినా, నాకు అనిపిస్తోంది, నీవు వైరాగ్యంలో శిక్షణ పొందుతున్నావేమోన

ని. నేనైతే వైరాగ్యం జోలికే పోను. the beastly thing. దానికి నేనెప్పుడూ దూరమే. అయినా కొంతవరకూ యిది తప్పనిసరి. సమత — a better trick. కాకపోతే మరి, 'సమత' కష్టం. వైరాగ్యం సులువు. హేయమైనది, విషాదపూరితమైనది, ఇబ్బందికరమైనది.

మూలం: శ్రీఅరవిందులు

*

సహనం — నీకు ఇదే ప్రముఖ సంకేత వాక్యం కావాలి. నీలోని ప్రాణిక శక్తికి, ప్రాణిక సత్వానికి నేరం చెప్పవద్దని బోధపర్చు. ఒక ఘనకార్యం సాధించడానికి సహించవలసినదంతా సహించాలని నచ్చచెప్పు. ప్రాణిక సత్వం, చపలచిత్తంతో కూడిన ఇష్టాయిష్టాలను వదిలిపెట్టడం నేర్చుకోవాలి. సహనానికి అంతస్సారం ఇదే. సంకట పరిస్థితులలో మనోనిబ్బరాన్ని నిలబెట్టుకుని ఉండాలి. నీ పట్ల మొరటుగా ఎవరైనా ప్రవర్తించినపుడు లేదా నీ అసాధ్యం నుంచి బయటపడే అవకాశం నీకు లేనపుడు నువ్వు చీకాకు పడకు. స్థిమితంగా ఉండు. నిన్నేదీ ఏమాత్రం కలత పెట్టనీయకు. నీ ప్రాణిక సత్వం నీ ఈతిబాధలను గోరంతలు కొండంతలుగా చేస్తుంది. పట్టించుకోకు. ఈ లోకంలో ఉన్నవాళ్లలో చాలామందికంటె నీ వెంత ఆనందంగా ఉన్నావో గమనించు. గత యుద్ధంలో పోరాడిన సైనికులు పడిన బాధల నొకపర్యాయం విచారించు. అలాంటి బాధలే కనుక నీవు పడవలసివస్తే నీ అసౌకర్యం గురించిన భావన ఎంత తెలివితక్కువదో తెలుసుకుంటావు. అలాగని నీవు కష్టాలు కొనితెచ్చుకోమని కాదు. నీ జీవితానికి సంబంధించిన సాధారణ అసౌకర్యాలు అంతగా చెప్పుకోతగినవి కావని నీవు గ్రహించాలి. ఇదీ నేను కోరేది.

సహనశక్తి లేక ఉత్కృష్టమైనదేదీ సాధ్యపడదు. మహనీయుల జీవితాలను అధ్యయనం చేస్తే నీకు తెలుస్తుంది. తమ ప్రాణికసత్వ బలహీనతలను యెదురొడ్డి చెకుముకిరాయిలా ఎలా నిలిచారో నీకు తెలుస్తుంది. సహనం ద్వారా ప్రాణిక, శారీరక బలహీనతలను అదుపులో పెట్టుకోవాలి. మన నేటి నాగరికత పరమార్థం భౌతికంగా ఆధిపత్యం సాధించటం. సాహసం, క్రీడాస్ఫూర్తి, అన్ని జీవితరంగాలలోను వ్యక్తమవుతున్న వైపరీత్యాలను ధైర్యంగా యెదుర్కోవటం — ఇదీ ఆదర్శ సహనానికి ప్రధానాంశాలు. శాస్త్రవిజ్ఞాన అభివృద్ధి, సాఫల్యాలు ఎన్నో కష్టమైన పరిశోధనలు ప్రయత్నాలతో కూడుకున్నది. అలాగే మన ఆశ్రమంలో నిర్వహిస్తున్న

ప్రముఖమైన కార్యక్రమం ఏమంత తక్కువ సహనంతో కూడుకున్నది కాదు. నీ ప్రాణికసత్వం ఎప్పుడు ఎదురుతిరిగినా దానిని అదుపులో పెట్టడం నీవు తప్పనిసరిగా చేయవలసిన పని. శరీరానికి సంబంధించినంతవరకు కొంత వెసులుబాటుతో జాగ్రత్తలు తీసుకోవలసిన అవసరం ఉంది. ప్రాణిక సత్వంతో వ్యవహరిస్తున్నప్పుడు మాత్రం అది ఎదురు తిరిగినప్పుడల్లా, నీ నుంచి అది తాపులు తినవలసినదే. మరో మార్గం లేదు. దివ్యసత్య కాంతులు కోరవలసిన ప్రాణికసత్వము, ఐహిక భోగభాగ్యాల కోసం ప్రాకులాడినట్లైతే, అపుడు నిమ్నచేతనను అదుపు చేయవలసినదే. తప్పదు మరి.

అగ్ని (జీవాత్మ యొక్క రూపాంతీరకరణ ప్రభావం) ప్రభావం వల్ల నీ ప్రాణిక సత్వము పరివర్తన చెందుతుంది. ఇందుకొక చెప్పుకోతగిన నిదర్శనం — నీ కష్టాలను, అవరోధాలను నువ్వు చిరునవ్వుతో యెదుర్కొంటావు. నీ పొరపాట్లకు, విచారంగా కూర్చుని దుఃఖపడవు. అయ్యో! నేను తగినట్లుగ లేనే అని దిగులుపడవు. చిరునవ్వుతో నీ అధైర్యాన్ని తరిమి కొట్టేస్తావు. నూరు పొరపాట్లు చేసినా ఏమీ బాధపడవు. చేసిన పొరపాట్లు గుర్తిస్తావు. అవి పునరావృతం కాకుండా శ్రద్ధ తీసుకుంటావు. నీలో అధైర్యాన్ని, విచారాన్ని సృష్టించేవి ప్రతికూలశక్తులు. నిన్ను అలా విచారంగా ఉంచటం వాటికి సరదా. నమ్రత, డీలాపడిపోయి ఉండటం ఒకటే కాదు. రెండూ వేర్వేరు స్థితులు. నమ్రత దైవీచాలనం. నిరుత్సాహం పైశాచిక శక్తికి వ్యక్తీకరణ. అందుచేత కష్టాలను ఆనందంగా స్వీకరించు. ఆటంకాలను తప్పనిసరిగా ఉత్సాహంగా యెదుర్కో. ఎందుకంటే అవి నీ రూపాంతరీకరణ మార్గానికి అవరోధాలు. శత్రువును ఓడించే ఉత్తమోత్తమ పద్ధతి, నవ్వుతో తనని యెదుర్కొనటమే. రోజుల తరబడి నీ శత్రువుతో పెనుగులాడు. అయినా తరగని శారీరకశక్తితో ఉంటూనే ఉండవచ్చు. అతన్ని చూసి పరిహాసంగా ఓ నవ్వు రువ్వు. వెనుతిరిగి పరుగెడతాడు, చూడు. ఆత్మవిశ్వాసం, దైవం పైన నమ్మకంతో కూడిన నవ్వు — శత్రువును చిత్తుచేసే బలం కలిగిస్తుంది. నిన్ను దిగ్విజయమార్గం వైపుగా నడిపిస్తుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

భగవదనుగ్రహాన్ని మానవులు గుర్తించలేరు. ఎపుడో ఆపదలు వచ్చినపుడు తప్ప — అంటే ఆపద రాబోతున్నప్పుడో లేక దాని నుండి తప్పించుకొన్నపుడో ఈశ్వర కారుణ్యం గుర్తుకువస్తుంది. కానీ క్షేమంగా ప్రయాణించినపుడు దాని ఉనికి నెవ్వరూ గుర్తించలేరు. అయినా ఏ ఆపదా లేకుండా ప్రయాణం జరగటం అనంతమైన, ఉత్కృష్టమైన దైవకృపావిశేష మనుకోలేరు. కానీ మనిషి మాత్రం ఆ ప్రయాణం సహజంగా జరిగిన దనుకుంటాడు తప్ప సృష్టిలో అది గొప్ప సమున్నత సామ రస్య మనుకోలేడు. ఒక రోగం నుండో, రొష్టు నుండో బయటపడ్డాడనుకో. అప్పు డెంతో కృతజ్ఞతాభావంతో అనుగ్రహం గుర్తుకు వస్తుంది. సహజసిద్ధంగా ఆరోగ్యమున్నపుడదేమీ గుర్తుకు రాదు. కానీ — అదే మరింత గొప్ప అద్భుతం. ఏ ఆపద, రోగం లేకుండా జీవితం సాగిపోవటం ఆయన అనుగ్రహం తప్ప — వేరేమిటి? అనుకోలేడు.

*

కృతజ్ఞత

భగవదనుగ్రహాన్ని ప్రేమతో స్వీకరించటం (కృతజ్ఞత) దైవం నీకు చేసిన — చేస్తు న్నదానిని వినయవిధేయతతో స్వీకరించటం.

ఈ కృతజ్ఞతాపూర్వకమైన భావన దానంతటదే హృదయంలో స్పందిస్తుంది. ఆయన అనుగ్రహానికి నేను అర్హుడనా? అన్న ప్రశ్నకు కలిగించే భావన అది. దైవా నుగ్రహానికి మరింత అర్హుడివిగా నీవు ఉండేటట్లుగా, నీవు చేయగలిగినంత నీ చేత చేయించేది.

*

నిరంతరమూ భక్తి ననుసరించవలసిన మరొక స్పందన ఉన్నది. ఆ కృతజ్ఞతాభా వన నిత్యం భగవంతుడున్నాడన్న దృష్టితో నిండి వుంటుంది. ఈ భావనతో నీ మనస్సంతా కృతజ్ఞతా భారంతో బరువెక్కి, నిమ్నాపిరాడనీయనంత సంతోషంతో నింపుతుంది. ప్రపంచమంతా ఆయనే వ్యాపించి వున్నాడన్న ఆలోచన చాలు, నీ వానందించటానికి. లోకం భయంకర రాక్షసి కాదు. భగవన్మయం. 'దైవంబున్నది

నిత్యమై' — అహర్నిశలూ ప్రతి చిన్న విషయమూ నీకిది జ్ఞప్తికి తెస్తుంది ప్రత్యక్షం గానూ — పరోక్షంగానూ — నీకా సత్యస్ఫురణ కల్గుతుంది; కలగాలి. ఇది నిన్ను వెన్నాడుతుంది. నీలో సంతోషం ఊటబావిలో నీరులాగ ఊరుతుంది. ఈ కృత జ్ఞతాదృష్టితో చూడు. సమస్త వస్తుప్రపంచమెంత ఆనందమయంగా కన్పిస్తుందో!

ఈ కృతజ్ఞత నుండి కలిగే సంతోషంతో సాటియైనది మరొక్కటి లేదు. ఒక కోకిల పాట — గాలిలో పూల నాట్యం — పసిపాప బోసినవ్వు — దానధర్మాల అందం — సుందరవాక్య శ్రవణం — సంధ్యాకాల సౌందర్యం — ఇలాంటి వాటి లోనూ — ఈ కృతజ్ఞతాభావ స్పర్శ నందవచ్చు. ఆ ఆనందోద్రేకం — పర మాత్మ ఉనికి వల్లనేనని గుర్తించటమే కృతజ్ఞత. ఈ సర్వసృష్టికి పరోక్షంగా ఉన్నదొక్కటే పరమేశ్వర జ్యోతి.

*

కొందరుంటారు. వారు సహజసిద్ధంగా కృతజ్ఞతామూర్తులు సున్నితహృదయం కలవారు కావటంవల్ల వారు భక్తిశ్రద్ధలకు, సంతోషాది స్నిగ్ధభావాలకు తేలికగా స్పంది స్తారు. వారికి సర్వజీవశక్తీ పరమాత్మ స్పందనగానే కనపిస్తుంది. ప్రతి అల్పవస్తువు నకూ వెనుక — ప్రతి చిన్నఘటనతోనూ ఈ ఆనందమైన భగవదనుగ్రహాన్ని — సౌందర్య సార్వభౌమత్వాన్ని గుర్తించగలరు. అనుభవించగలరు.

కొందరిని చూచాను. వారు విద్యావంతులు కారు కదా — చాలా అమాయ కులు. సాధారణమైనవారైనా వారిలో ఈ కృతజ్ఞతా బుద్ధి ఎంత జాగృతమై ఉంటుం దంటే ఏమాత్రం స్పర్శకైనా ఇట్టే పరవశులైపోతారు. వారికున్న కృతజ్ఞతా విధేయతలు చెప్పలేం.

వారిలో చైత్యపురుషుడు మేల్కొని వుంటాడు. వారికా స్పర్శ — తరచుగా కలిగినా, వారి శక్తి మేరకు — కలిగినా కొద్దో గొప్పో దాని అనుభూతి పొందగలరు. ఫలితంగా తమను తాము ఉన్నతస్థాయికి — ఊర్ధ్వస్థితికి – అతీతస్థాయికి, చేర్చబడుతున్నామన్న భావన కలిగి వుంటారు.

*

ఎక్కడ ఈ కృతజ్ఞత హఠాత్తుగా అప్పటి కప్పుడే కల్గుతుందో అది అన్నిటి కంటె అధిక సంతోషాన్నిస్తుంది.

అందులో నేనన్న భావన — అహంకార స్ఫురణ లేశమైనా వుండదు. —

అదొక ప్రత్యేకమైనది. అది ప్రేమా కాదు — స్వాత్మ సమర్పణా కాదు. నిండైన సంతోషం పొంగి పొర్లిపోతుంది — అదొక ప్రత్యేకమైన అద్భుతమైన స్పందన. దానికదే సాటి. అది నిన్ను విస్తృతపరుస్తుంది — నిన్ను సంపూర్ణవ్యక్తిగా మలుస్తుంది. ఎంతో ప్రకాశమానమైనది. మానవచేతన కందుబాటులో ఉండే సర్వచలిత చాలనాలలో కెల్లా ఇదొక్కటే నిన్ను తప్పనిసరిగా అహంకార విముక్తిని కలిగించేది. దీని స్వచ్ఛ స్పందనలో నీవు ప్రవేశిస్తే చాలు. అదొక మహా దివ్యప్రేమ స్పందనయని వెంటనే గుర్తిస్తావు. దానికి పరిధులు లేవు. తుదిగా, కృతజ్ఞత ఒక్కటే సారభూతమైన దివ్యానురాగ స్పందన. ప్రేమ స్పందనకు సమానమైన రంగు — కొంచెం మార్పుతో.

*

వినయసంపద కలిగి ఉండటం అంటే, దైవం వినా, మనోప్రాణిక శరీరాలు ఏమీ కావు. ఏమీ చేయలేవు. — అజ్ఞానం, అల్లకల్లోలం, అశక్తత, — తప్ప ఇవి మరేమీ కావు. దైవము మాత్రమే దివ్యసత్యం, దివ్యజీవనం, దివ్యశక్తి, దివ్యప్రేమ, దివ్యానందము.

కాబట్టి మనోప్రాణికశరీరాలు ఎప్పటికీ తెలుసుకోవాలి, సంవేదించాలి — సారభూతంగానే కాక — ఆయన యొక్క అభివ్యక్తీకరణ, క్రియాకలాపాలలో — తాము దైవమును అవగాహన చేసుకోలేము. విచారించి తీర్పు చెప్పలేము — అని.

ఇదే వాస్తవమైన వినయమంటే — అప్పుడే నీకు శాంతి, ప్రశాంతతలు లభిస్తాయి. ఇదే నీకు ప్రతీప శక్తులు — విఘ్నాల నుండి రక్షించే కవచం. అహంకార ద్వారం నుంచే విరుద్ధశక్తులు నీలోనికి ప్రవేశిస్తాయి. వాటి ప్రవేశానికీ ద్వారం తెరుచుకుని ఉంటుంది.

మూలం: శ్రీమాత
అనువాదం: టి. కోటేశ్వరరావు

కర్మపట్ల ఆంతరంగిక దృక్పథం

ఎవరు యే కర్మ చేసినా, ఆ పనిలో సత్యచేతన యొక్క వెలుగురవ్వ నింపితే అది ప్రయోజనమైన కార్యమవుతుంది.

ఒకరు నిర్వహించే పనికన్న, ఆ కర్మ వెనక అతనికున్న చైతన్య భావన యెక్కువ ప్రధానమైనది. వ్యర్థమైన కార్యాలుగా బైటికి కనిపించే పనులు కూడా నిజమైన చేతనతో నిర్వహించబడితే అవి చక్కగా సఫలీకృతం కాగలవు.

*

ఆధ్యాత్మిక దృష్టితో చూస్తే, నీవు చేసే పని ప్రధానం కాదు, దాన్ని నువెలా ఆచరిస్తావో, యెలాంటి చైతన్యభావనతో ఆచరిస్తావో అన్నదే ముఖ్యం. నిరంతరం దైవాన్ని జ్ఞప్తి యందుంచుకుని చేసే పనంతా దివ్యసన్నిధిలో వ్యక్తీకరణ అవుతుంది.

*

నిరంతరరాయంగా దివ్యసన్నిధిలో జీవించు. నిన్ను నడుపుతూ నీ ప్రతి పనిని చేస్తున్నది ఆ దివ్యసన్నిధియే అని భావించు. నీ స్పందనలను, నీ భావాలను, సాధారణమైన నీ బాహ్యకర్మలను సహా ఆ దివ్యసన్నిధికే సమర్పించు.

*

బుద్ధిపరమైన, క్రియాత్మకమైన అన్ని కార్యాల్లోను, 'స్మరించు, సమర్పించు' అన్నదే నీకు మంగళా శాసనం కావాలి. నీవేమి చేసినా అదంతా దైవార్పణగా నిర్వహించు. ఇది నీకు అత్యుత్తమ క్రమశిక్షణ కాగలదు. నీవు వ్యర్థమైన, తెలివితక్కువ పనులు చేయకుండా, అది నివారిస్తుంది.

*

నీ పని పరిపూర్ణతకు ఏమాత్రం కొరత రానిదిగా వుండాలన్నది నీ ఆదర్శంగా వుండనీ. అంత నీవు తప్పక నిజమైన దైవోపకరణంగా వుండగలుగుతావు.

మూలం: శ్రీమాత

అనువాదం: బి. నరసింహయ్య

భగవంతుని నుంచి మనకు కావల్సినది పొందట మెలా?

ప్రశ్న: మాతా! ఎవరికైనా ఏదైనా అవసరం కలిగినదానిని భగవంతుని దగ్గర నుండి పొందాలనుకున్నప్పుడు — ఏదైనా తెలుసుకోవాలన్నా తెలియచెప్పే మార్గని ర్దేశం కావాలనుకున్నా — వారి నుంచి కావల్సినది పొందడం ఎలా?

అది భగవంతుని అడగాల్సిందే. ఆయనను అడగకుండా ఎలా వస్తుంది? పూర్తి విశ్వాసంతో భగవంతుని వైపు మరలి ఆయన్ని అడిగితే నీకు కావలసింది తప్పక లభిస్తుంది. అయితే అది నీవు అనుకున్నట్లుగా కాకపోవచ్చు. కాని నిజంగా నీకు అవసరమైనది మాత్రం నీకు దొరుకుతుంది. నువ్వు అడగాలి, అంతే.

నీవు చిత్తశుద్ధితో అలా చేసి చూడు. కానీ నీవు మిగిలిన అన్ని రకాల బాహ్యప ద్ధతుల ద్వారా పొందే ప్రయత్నంతో, భగవంతుని మాత్రం అడక్కుండా, ఆ తర్వాత ఆయనే నీకు సమకూరుస్తాడని అనుకోవద్దు. నిజానికి నీకు ఎవరి దగ్గ ర్నుంచైనా ఏమైనా కావాలనుకుంటే వారి నడుగుతావు కదా! కానీ భగవంతుడు మాత్రం నీవు కోరకుండానే కోరిక తీరుస్తాడని ఎలా అనుకుంటావు?

సాధారణ చైతన్యంలో దీనికి విరుద్ధంగానే జరుగుతుంది. నీ మనస్సులో "నా కిది కావాలి" — అంటూ అనేకం కోరుకుంటావు. "భగవంతుడు అది ఇచ్చి తీరాలి. ఇవ్వనప్పుడు ఆయన దేవుడెట్లా అవగలడు" — ఈ విధంగా విషయాన్ని తలక్రిందులు చేస్తావన్న మాట.

మొదటి విషయం "నాకు కావాలి" అని చెప్పు. నీకు అది నిజంగా అవస రమా? అది నీ భావనా, లేక వాంఛా, లేక ఒక అనాలోచిత కదలికా? అంటే దాన్ని గురించి నీకేమీ తెలియదు.

రెండవ విషయం — కేవలం నీ ఇచ్ఛను భగవంతుని నెత్తిన రుద్ది — "నా కిది కావాలి అంటావు". అంతే తప్ప కనీసం ఆయన్ని అడగను కూడా అడగవు. "నా కిది ఇయ్యి" అంటావు. "నా కిది తప్పనిసరిగా కావాలి; తానంతటదే సహ జంగా రావాలి. నా కేమి కావాలో అవన్నీ ఇవ్వడం భగవంతుని పని", అంటావు.

కానీ సర్వసాధారణంగా జరిగేది ఏమంటే నీకేం కావాలో నిజంగా నీకు తెలి యదు. అది నిజంగా నీ భ్రమే కానీ నిజం కాదు. పైగా నీవు దాని కోసం నీ చుట్టు ప్రక్కలే ప్రయత్నం చేస్తావు గానీ, భగవంతుణ్ణి తలుచుకోవు, ఆయనతో ఎటు

వంటి లావాదేవీలు పెట్టుకోవు. అసలు ఏ కాస్త విశుద్ధ వైఖరి కూడా ఆయన పట్ల పెట్టుకోకుండా ఆయనను ఏమీ అడక్కుండా ఉంటే ఆయనకి కూడా నీ కివ్వవలసిన అవసరం ఏమీ ఉండదు.

కానీ నీవు దైవాన్ని అడిగినప్పుడు మాత్రం ఆయన దైవం కాబట్టి, నీకు ఏది అవసరమనేది నీ కంటె ఆయనకి కొంచెం ఎక్కువ తెలియడం వల్ల నీకు కావలసింది ఇస్తారు.

అట్లాకాక నీవు పట్టుబట్టి ఆయనను ఇబ్బంది పెడితే మాత్రం నీకు తెలియచెప్పటానికని అది నీకు ఇవ్వవచ్చు, తద్వారా నీకు నిజంగా అవసరమైనది అది కాదని నీ పొరపాటు నీకు తెలియచెప్పి నీకు బుద్ధివికాసం కలిగించాలనకోవచ్చు. (ఒక వేళ అది నీకు హానికరంగా ఉంటే) అప్పుడు నీవు తిరిగి ఆయన మీద నేరం ఆరోపిస్తూ అనవచ్చు — నీవంటే నీవు అనే కాదు, సాధారణ ప్రజానీకం —“నాకు హాని చేసేదాన్ని భగవంతుడు నా కెందు కిచ్చినట్టు”. అది కోరింది నీవే అనే విషయం మరిచిపోయి అలా అంటావు.

రెండు సందర్భాల్లోనూ ఆయననే తప్పు పడతావు. నీ వడిగింది ఇచ్చిన ప్పుడు అది నీకు నష్టకరంగా ఉన్నా ఆయన్నే అంటావు. ఇవ్వకపోయినా ఆయ ననే తప్పు పడతావు. “నాకు అవసరమని అడిగినది ఇవ్వలేదు” అని.

పాపం రెండు సందర్భాలలోనూ భగవంతుడే నిందితుడు.

ఇదంతా లేకుండా నీలోనే ఆకాంక్ష పెంచుకో. నీలోని దివ్యసత్యాన్ని తెలుసు కోవాలనే తపనతో అదే నీలో దివ్యసత్యమనే విషయం స్పష్టంగా తెలిసికొని, అదే అన్నిటికీ మూలాధారమైన సత్పదార్థము, మనం కోరిన వాటి కన్నిటికీ సమాధాన ము, మన సమస్య లన్నిటికీ పరిష్కారం, అని తెలుసుకోవాలనుకుంటే, అదే అవస రమని ఆకాంక్షిస్తే, అది సిద్ధించాలనే తపన నీలో వుంటే ఇక భగవంతుని, “నాకు ఇది కావాలి, అది కావాలి”, “ఇది ఇయ్యి, నా కది ఉండవలసిందే”, ఇటువంటివి అడగనే అడగవు. ఇలా అంటావు: “నాకేది అగత్యమో అది చేసి నా వ్యక్తిత్వసత్యాన్ని తెలుసుకునే దారి చూపించు; నీ సర్వజ్ఞత్వముతో నాకేది కావాలో చూసి దాన్ని ప్రసాదించు స్వామీ!”

అట్లా చేసినప్పుడు నీవిక పొరబడే అవకాశము ఉండదు. నీకు హానికరమైనవాటిని ఆయన ఈయనే ఈయడు.

ఇంతకు మించిన పై మెట్టు వేరే ఉన్నది కానీ దానితో మొదలుపెట్టడం కొంచెం కష్టమే.

ముందు చెప్పినట్లు భగవంతుని, " నా కిది కావాలి, ఇయ్యి", అనేదానికంటే మంచి పద్ధతి మొదటిది. ఎందువల్లనంటే "చాలా కొద్దిమందికి మాత్రమే వారికి కావలసిం దేమిటో తెలుస్తుంది". దానికి నిదర్శనంగా చాలామంది వాళ్ళ అభీష్టం నెరవేర్చుకోటానికే పాటుబడుతూ ఉంటారు. ఒక కోరిక తీరగానే తృప్తి లేకుండా ఇంకొకటి తీర్చుకోటానికి ప్రయత్నాలు మొదలుపెడతారు.

ఇట్లా వెతుక్కుంటూ, పొరపాట్లు చేసుకుంటూ కష్టాలు పడుతూ, భంగపడి విసుగుచెందిన తర్వాత కొద్దిగా తెలివి తెచ్చుకుంటారు. అప్పుడు దీనికి పరిష్కారమేమిటా అని ఆలోచిస్తారు. తన అజ్ఞానం లోనించి బయటపడే మార్గమేదైనా ఉందా అని తెలుసుకోవాలనుకుంటారు.

అటువంటి సమయమే వస్తే (శ్రీమాత చేతులు చాచి చూపుతూ) "నన్ను స్వీకరించి, సత్యమార్గంలో నన్ను నడిపించు ప్రభూ", అనుకోవచ్చు.

అప్పట్నుంచీ అంతా బాగా జరగటం ప్రారంభమవుతుంది.

మూలం: శ్రీమాత

అనువాదకులు: అమరవాది ప్రభావతి, అమరవాది వెంకటరామ శాస్త్రి

ఇష్టాయిష్టాలు లేకుండా ఉండటం ఎలా?

ప్రశ్న "ఇష్టాయిష్టాలు కలిగి యుండరాదు" — దీనిని మనం ఎలా అర్థం చేసుకోవాలి? అవ్యవస్థకు బదులు వ్యవస్థను, అశుభ్రత బదులు శుభ్రతను మనం కోరుకోవాలి కదా? అటువంటి ఇష్టాయిష్టాలు (preferences) లేకపోవడం అంటే ప్రతి ఒక్కర్నీ ఒకే విధంగా చూడాలనా?

మాటల గారడీ అంటే ఇదే! నువ్వు అభిమతం అంటావు. అదే నేను ఎంపిక (choice) అంటాను. నువ్వెల్లప్పుడూ ఎంచుకునే స్థితిలో ఉండాలి. నిన్ను అధఃపతనంలోకి తోసివేసేదానికి, నిన్ను ఉద్ధరింపచేసేదానికి మధ్య, నీకు పురోగతి సాధించేదానికి, తిరోగతిని తెచ్చిపెట్టేదానికి మధ్య జీవితంలో ప్రతి క్షణం నువ్వు ఎంపిక

చేస్తూండాలి. దీనినే నేను (choice) అంటాను. ఎంచుకోవడం. ప్రతి క్షణం మనిషి ఎంచుకోవాలి. పరిశుభ్రత, అపరిశుభ్రతల మధ్య, నైతికమూ, భౌతికమూ — మధ్య, ఎంపిక అనివార్యము. నీకిది క్షణం క్షణం నీ ముందుంటుంది — సదా. నువ్వు ఒక మెట్టు క్రిందకుగాని, పైకిగానీ వెళ్లవలసి రావచ్చు. ముందుకుగానీ, వెనుకకుగానీ కదలవలసి రావచ్చు. ఈ యెంపిక నీకు నిరంతరం ఉంటుంది. ఎప్పుడూ జాగ్రుతుడవై ఉండాలి. కాని, ఇది ఇష్టాయిష్టాలు కాదు. ఇష్టాయిష్టాలు (preferences) అంటె ఎంపిక మాత్రం ఎంతమాత్రం కానే కాదు. నువ్వు సానుభూతి లేదా అయిష్టత, వికర్షణ, ఆకర్షణ ప్రదర్శించేది ఏదో వుంటుంది. ఏ కారణం లేకుండా, గుడ్డిగా నీకు ఒక విషయం పట్ల బంధం ఏర్పడుతుంది. లేక, నీకొక సమస్య వస్తే, ఈ విధంగానో, ఆ విధంగానో పరిష్కారం ఉండాలని నువ్వు కోరుకుంటావు. అది ఎంపిక (choice) అవదు. వాస్తవమైనదానిని గురించి ఏ ప్రశ్నా రాదు. అక్కడ అభిమతం మాత్రమే ఉంటుంది. నాకు మాత్రం ఆ మాట అర్థం స్పష్టమవుతోంది. అభిమతం అన్నది ఏదో గుడ్డిగా కనిపించేది. అదొక ప్రచోదన, అనుబంధం, అచేతనామయమైన చలనం. అదొక భయంకరమైన మొండిపట్టు.

నువు ఏవో పరిస్థితులలో ఉంటావు. ఏదో జరుగుతుంది. నీ కంటూ ఒక ఆకాంక్ష వుంటుంది. ఒక మార్గదర్శకత్వాన్ని అపేక్షిస్తావు. నీలో నీకు పరిష్కారం ఈ రకంగా ఉంటే బాగుంటుందనిపిస్తుంది. అలా కాక ఇలా ఉంటే బాగుంటుందనే సూచన నీలో కలుగుతుంది. ఇదంతా (choice), ఎంపికకి సంబంధించినది కాదు. ఇష్టాయిష్టాలకు సంబంధించినది. నీ ఇచ్ఛ ప్రకారం నీ ప్రార్థనకు, నీ ఆకాంక్షకు జవాబు రాకపోతే, ఈ అభిమతం (preference) నిన్ను ఇబ్బంది పెడుతుంది. నీకు బాధ కలిగిస్తుంది. ఆ పరిష్కారాన్ని, నువ్వు స్వీకరించలేవు. అందుకొరకు పోరాడాలి. ఇష్టాయిష్టాలంటూ నీకేమీ లేకపోతే, నీ ఆకాంక్షకు ఏ పరిష్కారం వచ్చినా నీకది ఆనందంగా స్వీకారయోగ్యమే అవుతుంది. లేకపోతే ఏది వచ్చినా నువ్వు దానిని అతి కష్టంతో ఆమోదించాలి. ఈ విధంగా కాక, ఆ విధంగా ఉండాలని అపేక్షిస్తావు. కాని, అది మరి ఏమాత్రము యెంపిక అవదు. ప్రతి నిమిషము (choice) వుంటుంది – ఆరోహణ, అవరోహణకి, పురోగతి, తిరోగతికి. అంటే అది నీ ఇష్టాయిష్టాల కనుగుణంగా విషయాలుండా లనుకోవటం కాదు. అనుక్షణం నీకు తటస్థపడే వాస్తవం ఇది. నువ్వు వహించే వైఖరి.

గరుడుని కారుణ్యం

(కథానిక)

(ఉన్నత భావగర్భితంగా ఎంతో ప్రాధాన్యత నిచ్చే నీతికథలు కోకొల్లలు. కాని వాటిలోని అసలు విషయానికి బదులు, అసంగతమైనదానికి ప్రాధాన్యత నిస్తే, అపార్థానికి దారితీసే అపాయం వుంది. అలాంటిదే ఈ క్రింది కథ. ఇందులోని ఉద్దేశ్యం — కర్మసిద్ధాంతం, విధిలిఖిత — వివరణ కాదు. అంతకు మించి, ఒక నిజభక్తుని వైఖరి ఎలా వుంటుందా! దానిని ప్రధానంగా ప్రస్తుతించుటయే దీని ముఖ్యోద్దేశము — అతని ఆశయాలను, ఆచరణలను మహత్తరమైన భగవత్ప్రణాళికాబద్ధంగా మలచుటకు అతని కృషి ఎలా వుండాలి అని.)

ఆశ్చర్యకరమైన అద్భుత శోభలతో అలరారుతున్న కైలాసంలో — సామాన్య మానవదృష్టికి గోచరముకాని గుప్త కైలాసము — మహాశివుని ఆవాసం నెలకొని వుంది. అదో సాయంసమయం. అక్కడికి విష్ణుమూర్తి శివదర్శనార్థం వెళ్లాడు — తన సజీవ గరుడవాహనంపై. ప్రకృతిసిద్ధమైన సుందర శిలాతోరణముతో విరాజిల్లుతున్న శివనిలయ ముఖద్వారము ముందు విడిచాడు గరుడ వాహనాన్ని.

గరుడుడు ఆ పరిసరాల సొబగులను విస్మయ మొందుచూ ఒంటరిగ చూస్తూ కూర్చుని ఉన్నాడు — అందరికి కనిపించే ఆ భౌతిక పరిసరాలను అస్తమిస్తున్న భానుని కాంతికిరణాలు ఆ ఉత్తుంగ శిఖరాలను ఆవరించుకొని వున్న నీటి తుంపరలతో నిండిన మంచుపై సప్తవర్ణాలను ప్రసరింప చేస్తున్నాయి.

అకస్మాత్తుగా ఆ శిలా తోరణంపై కూర్చొని వున్న ఒక అందమైన ప్రాణి, ఒక చిన్న పక్షిపై ఆతని దృష్టి పడింది. "ఎంత అద్భుతమైనదీ సృష్టి! ఈ మహోన్నత హిమాలయాలను మలిచినవాడే, ఈ చిన్న పక్షిని కూడ సృజించాడు కదా! రెండూ సమానమైన అద్భుతాలుగానే ఉన్నాయే!" అని అనుకోసాగాడు.

అదే సమయంలో విధికి, మృత్యువుకు అధిదేవతయగు యమధర్మరాజు శివదర్శనార్థం కాబోలు, ద్వారంలోకి ప్రవేశించాడు. ద్వారాన్ని దాటి ఆవలి వైపుకు అడుగిడేటప్పుడు, ఆ పక్షిపై, ఆయన కళ్లు పడ్డాయి. ఆశ్చర్యంతో అతని కనుబొమలు పైకెగిసాయి. అంతలోనే దృష్టి మరల్చుకొని, లోనికి ప్రవేశించాడు.

ఇది గమనించిన గరుడుడు ఇలా అనుకున్నాడు, "యమధర్మరాజు పక్షిని అంత శ్రద్ధగ గమనించాడంటే దాని అర్థం ఒకటే; పక్షికి కాలం చెల్లిందన్న మాట! తిరిగి వెళ్లేటప్పుడు, బహుశ, దాని ప్రాణాన్ని గొనిపోవచ్చు!"

గరుడుని హృదయం పక్షిపై కరుణతో నిండిపోయింది. పొంచివున్న మృత్యువు నుండి ఆ పక్షిని రక్షించాలనుకున్నాడు. మళ్లీ స్వగతంగా అనుకున్నాడు. "విధి అనుశాశిత నియమాలు వాటి పనిని అవి నిర్వర్తిస్తున్నాయి. అందులో జోక్యం అనవసరం."

ఒక్క క్షణం గడిచింది. గరుడుని భావావేశం చల్లారలేదు. "ఆ పక్షిని నేను రక్షించగలినవాడనైనప్పుడు నేనెందుకు ఆ పని చేయకూడదు?" అని ఆ బాధ్య తను తనపై కెత్తుకున్నాడు.

మరుక్షణమే ఆతనిలోనిదే మరొక గళం పలికింది, "ఇది నా అహంభావానికి చెందిన ప్రేరణ. ఎవరినైనా రక్షించటానికి నేనెవరిని?"

ఉన్నట్టుండి అతని గుండె లోతుల్లో నుండి అంతర్వాణి సున్నిత కంఠం వినిపించింది. "నేను కార్యాచరణకు పూనుకొనుటా లేక మానుకొనుటా, ఏది ఉత్తమమో ఈ క్షణాన ఖచ్చితంగా తేల్చుకోలేకున్నాను. ఈ అనిశ్చితస్థితిలో నేను ఏది చేసినా అది ఆ భగవంతుని బృహత్ప్రణాళికలో భాగం కావాలని ప్రార్థిస్తున్నాను. ఓ ప్రభూ! నా మనోభావాలను, చర్యలను నీకు నివేదిస్తున్నాను."

మరుక్షణం, అతను ఆ పక్షిని తీసుకొని మెరుపువేగంతో దండకారణ్యాం చేరి, అచ్చట ఒక సెలయేటి ప్రక్కన వున్న రాతిపై దానిని వదిలి కైలాసం తిరిగి వచ్చి విష్ణుమూర్తికై వేచి ఉన్నాడు.

కొద్దిసేపటికే యమధర్మరాజు బయటకు వచ్చి గరుడుని చూచి ఓ చిరునవ్వు నవ్వాడు. గరుడుడు ఆయనకు నమస్కరించి అన్నాడు. "నేను మిమ్ములను ఓ ప్రశ్న అడుగవచ్చా? లోపలికి వెళ్లేటప్పుడు మీరొక పక్షిని చూసి క్షణకాలం చింతాక్రాంతులైనట్లగుపించారు. ఎందుకు?"

"ఓ. అదా! దాని గురించి అంతా మరిచిపోయాను. నా చూపులు దానిపై పడ్డప్పుడు, కొద్ది క్షణాల్లో అది బహుదూరాన వున్న దండకారణ్యంలో ఓ సెలయేటి ప్రక్కన ఓ కొండచిలువచే మ్రింగివేయబడి మరణించనున్నట్లు నా కగుపించింది. అంత సుదూర తీరాన్ని యింత స్వల్ప వ్యవధిలో ఎలా చేరుతుందా అని ఆశ్చ

ర్యపడ్డాను. తరువాత ఆ విషయం మరచాను. తప్పనిసరిగా ఏదో విధంగా అది జరిగి వుండాలి. ఆ చిన్న ప్రాణికి నూతన జన్మ పొందే సమయం ఆసన్నమైంది."

యమధర్మరాజు చిరునవ్వు చిందిస్తూ వెళ్లిపోయాడు. ఈ విషయంలో గరుడుడు పోషించిన పాత్ర అతనికి తెలిసిందా? ఏమో, మనకు తెలియదు.

గరుడుడు నిశ్చేష్టుడైయాడు. విచారించాలో లేక సంతోషించాలో తెలియలేదు. త్వరలోనే ఆ రకమైన మానసికస్థితి నుంచి తేరుకొని యిలా అనుకున్నాడు. "ఓ, ప్రభూ! మీకు వాహికను నేను — క్రియ, నిష్క్రియలు రెండింటిలోను. నన్ను అలానే ఉండనీయండి స్వామీ!" స్వీయ జ్ఞానోదయపూరిత సమచిత్తతను తిరిగి పొందాడు.

ఆంగ్లమూలం విందుసార్ (With courtesy *The Heritage*, July, 1987)

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

పుస్తక అనుబంధం:

కాంతి కిరణాలు

సహృదయత (Goodwill)

అందరి పట్ల సహృదయత, అందరి నుంచి సహృదయత, శాంతిసామరస్యాలకు ఆధారం.

ఆగస్టు 14, 1969

*

నిజంగా తన చైతన్యంలో సహృదయత వహించినవానికి పరోక్షంగా సర్వత్రా దాగి ఉన్న సహృదయత తనంత తానుగా ఆవిష్కృతమవుతుంది.

ఇదే నిర్మాణాత్మకమైన సంవేదన. దివ్యభవితకి రహదారి.

"Peace and stillness are the great remedies for diseases. When we can bring peace in our cells we are cured. The body should reject illness as energetically as the mind will reject falsehood."

With best compliments from:

A. PRABHAVATI

Rs. 15

అఖిల

అఖిల భారత పత్రిక

మార్చ్ 2010



4.4.2009 — 4.4.2010

శ్రీఅరవిందులు పాండిచ్చేరి చేరుకుని నూరు వసంతాలు నిండిన సంవత్సరము.

19.9.2009 – 19.9.2010

శ్రీఅరవింద సొసైటీ స్వర్ణోత్సవ సంవత్సరం.

కవరు పైన ఉన్న పుష్పం:

సాక్షాత్కారము

దైవేచ్ఛ యొక్క శక్తిచైతన్యంతో దానికి వశమైనది
(ఆధ్యాత్మిక ప్రాధాన్యత – శ్రీమాత వివరణ)

విషయసూచిక

పుట్టినరోజులు గురించి

జన్మదిన పరమార్థము	3
పుట్టినరోజున ఉండే గ్రహణశక్తి	5
కాలచక్రము	7
శ్రీమతి ఆర్. జన్మదిన సందర్భమున	9
సర్వేశ్వరశక్తిచే ప్రచోదింపబడవలసినవారమే మనం	11
చోదకునిపై విశ్వాసంతో సుదూరసాగరానికి ఆవల అన్వేషిస్తూ సాగిపో	15
మన నౌకను నడిపించే అధిపతి సమర్థుడు	17
దైవకృపను నమ్ము — దైవం నిన్ను నడిపించనీ	20
అల్లకల్లోలాల కావల వేచి ఉన్న ఉజ్వల భవితవ్యాన్ని చూడు	22
నీ జన్మ సఫలం కావించుకో	23
సాధకులకు పుట్టినరోజు సందేశాలు	28
జీవితంలో ఎన్నడూ మరువరానిది	30
సమాచార పత్రం	31

ప్రతి అంశంలోను చర్మచక్షువులకు వినిపించని ఒక లయ ఉంటుంది. ఆ లయబద్ధంగానే విషయాలు తమ ఉనికిని చాటుకుంటూ ఉంటాయి.

శ్రీఅరవిందులు



జన్మదిన పరమార్థము

(శ్రీమాతతో సంభాషణ — మోనా సర్కారు గుర్తుచేసుకున్నది)

రేపు నీ పుట్టినరోజు!

సాధకుడు: అవును మదర్.

నీకెన్నేళ్లొస్తాయి?

సాధకుడు: ఇరవైయారు మదర్.

సరే. నువ్వు రేపు రా. నీకేదో అసాధారణమైనది ఇస్తాను. నీకే తెలుస్తుంది. కాని ఇది వస్తురూపంలో ఉండేటటువంటిది కాదు. నిజంగా చాలా ముఖ్యమైనది. రేపు నీకే తెలుస్తుంది. ఇప్పుడు నువ్వు ఇంటికి వెళ్లి నిశ్చలంగా ఉండు. మనస్సు కుదుటపరచుకొని నేనిచ్చే కానుకను అందుకునేందుకు తయారుగా ఉండు.

సాధకుడు: సరే మదర్.

పుట్టినరోజుకి అర్థమేమిటో, ఇక్కడ మనం పుట్టినరోజు శుభాకాంక్షలు ఎందుకు అందిస్తామో నీకు తెలుసా?

సాధకుడు: మామూలుగా తెలుసు మదర్? కాని మీరు నాకు వివరించనున్న ప్రత్యేక అర్థం తెలీదు.

అవును. నిజానికి అది ఒక ప్రత్యేకమైన రోజు. ప్రతి సంవత్సరం వచ్చే అది ముఖ్యమైన రోజు. ఆ రోజు దైవశక్తి మనలోకి దిగివచ్చే రోజు. అంటే మనం దైవంతో, ముఖాముఖి ఉండే రోజు — మన ఆత్మ ఆ అనంతశక్తితో కలిసే రోజు. మనం ఏ మాత్రం సచైతన్యంగా ఉన్నా ఆ దైవంయొక్క ఉనికిని మనలో అనుభూతం చేసుకోగలం. ఈ రోజు మనం ఏ కొంచెం ప్రయత్నించినా, ఏ కార్యం తలపెట్టినా అది మెరుపువేగంతో అనేక జన్మలకు సరిపడినంత కార్యాలను చేయగల శక్తిని కలిగి ఉంటాం. అందుకే నేను జన్మదినానికి అంత ప్రాముఖ్యత నిస్తాను — ఎందుకంటే ఆ ఒక్క రోజు సాధించేది అసాధారణమైంది. ఆ రోజు నువ్వు సాధించ గలిగినది మరి దేనితోనూ పోల్చలేనిది. అందుకోసం నేను మీలోని చేతనాశక్తిని మరింత ఉన్మీలనం చేసేందుకు, ఆ దైవశక్తికి అభిముఖంగా నిలవడానికి తోడ్పడే పని చేస్తారు. మై చైల్డ్! — ఇది చాలా చాలా ప్రత్యేకమైన రోజు, నీ జాతకం మారిపోయే రోజు. ఈ అనంతచైతన్యంతో సాయుజ్యమయ్యే రోజు. ఎందుకంటె ప్రభువు

మనల్ని ఉన్నతచేతనాశక్తులకు ఆ అనంతజ్వాలలో ఒక భాగమైన మన అంత రాత్మ సంసిద్ధతను బట్టి చేయూతనిచ్చి మూలశక్తిని చేరే విధంగా ముందుకు నడి పించగలడు. అనంతశక్తిలో భాగమైన అంతరాత్మ ఆ శక్తిలో చేరి తాదాత్మ్యం పొందగలదు.

ఈ రోజు నిజానికి జీవితంలో ఒక గొప్ప అవకాశం. వ్యక్తి తాను ఆ దైవశక్తికి ఉన్మీలనమై దేనినైనా జీర్ణించుకోగలిగే రోజు. ఆ రోజు నేనెంతో చేయగలను. అందుకే అది ముఖ్యమైనది అన్నాను.

దైవమే తన ద్వారం తెరిచి మనని ఆ సన్నిధికి ఆహ్వానించే రోజు. ఆయన మనలోని ఆకాంక్షజ్వాలని మరింత ప్రకాశవంతం చేయడానికి, తిరిగి ఆ జ్వాలను వెలిగించడానికి సంభవమైన రోజు. ఆయన మన కొసగిన అతిముఖ్యమైన రోజుల్లో ఒకటి. అయితే మనం కూడా శ్రద్ధాసక్తులతో సంసిద్ధమై ఆ స్థితిని చేరడానికి ప్రయ త్నించవచ్చు. కాని అదంత సులువైన పని కాదు. చాల కష్టపడాలి. అయితే పుట్టి నరోజు మాత్రం ప్రతి మనిషికి దైవం ఇచ్చిన ఒక గొప్ప ఛాన్సు. దైవమిచ్చిన వరం. ఆ రోజు దైవకృప నిన్ను అనుగ్రహిస్తుంది. అతిముఖ్యమైన రోజు.

*

మరో సందర్భాన శ్రీమాత వ్యాఖ్య

ఈ అనుభవం సాధారణంగా పుట్టినరోజునాడే కలుగుతుంది. కాని మన చైత న్యానికిది అందదు. ఇది తప్పనిసరిగ జరుగుతుంది. జీవాత్మ, ఇహలోక సంబం ధిత సామగ్రి నంతటిని వెనక్కి ఉంచి, ఊర్ధ్వముఖంగా పైకి అధిష్ఠిస్తుంది. పరమాత్మలో కలుస్తుంది. మహత్తరమైన శక్తిని తిరిగి పూరించుకుని క్రిందికి దిగివచ్చి ఆయన యొక్క వరప్రసాద లబ్ధిలో మనుగడ సాగిస్తుంది. వ్యక్తికి ఇవేమీ అవగాహనలోకి రావు. సచైత్యంగా ఉండడు కాబట్టి.

*

ఇది మనకు తెలియకుండా సంభవించే ఒక మార్మిక సత్యం. ఈ రోజు మాత్రం ప్రత్యేకంగానే ఉంటుంది. ప్రతి ఏడూ వినూత్నమై ఆవిర్భవిస్తుంది. ఆత్మ శరీ రాన్ని వదలి పైకెగసి మూలశక్తితో కలసి తనకుతాను తిరిగి శక్తివంతం చేసుకుని, పరిపుష్టి పొంది, ఆ అనంతశక్తితో చేరి ప్రకాశవంతమై అలరారుతుంది. అపుడు

శక్తి, ప్రకాశం, ఆనందాలతో పునరుద్ధరింపబడి ఒక ఏడాదిపాటు మళ్లీ నా నూతన తేజం వినూత్నశక్తితో సాగుతుంది. ఇలాగే ఏడాది తరువాత ఏడాది, మళ్ళీ, మళ్లీ సాగే ప్రక్రియ. మానవజన్మలో అతిముఖ్యమైన పండుగ పుట్టినరోజు. జీవితాన్ని అనంతశక్తి సన్నిధికి నడిపించే, ఆత్మశక్తిని ఉజ్వాలింపచేసే గొప్ప రోజు.

మూలం: శ్రీమాత

అనువాదం: డి. సత్యవాణి; కర్రా వెంకటేశ్వర్లు

పుట్టినరోజు నాడు ఉండే గ్రహణశక్తి

ప్రశ్న: ప్రియమైన మాతా, మానవుని జన్మదిన పరమార్థ మేమిటో తెలుసుకోవాలని ఉంది. ఇక్కడ అది ప్రధానమైన రోజు కదా!

జవాబు: అంతరంగ ప్రవృత్తి దృష్ట్యా యేటికేడాది ప్రతి పుట్టినరోజున, వ్యక్తికి గ్రహణశక్తి ఉచ్చదశలో ఉంటుంది. ఆ విధంగా ప్రతి సంవత్సరం అది నూతన ప్రగతికి దోహదపడుతుంది.

ప్రశ్న: ప్రియమైన మాతా! వ్యక్తి పుట్టినలోజును జ్ఞాపకం చేసుకునే విశిష్ట లక్షణంతో పాటు, దానికున్న పరమార్థమేమిటి? ఈ సందర్భాన్ని వ్యక్తి యెలా ప్రయోజనకరంగా మలుచుకోగలడు?

జవాబు: విశ్వశక్తుల ప్రాబల్యాలకు సంబంధించి, వాటి నియతిలో, వ్యక్తి ప్రతి సంవత్సరం తన జన్మదినం నాడు ప్రత్యేక గ్రహణశక్తి కలిగి ఉంటాడు అనుకోవటం ఉంది. కాబట్టి ఈ గ్రహణశక్తిని అవకాశంగా తీసుకుని తన సమగ్ర అభివృద్ధిమార్గంలో ప్రగతి సాధించేందుకు తను తీర్మానించుకోగలడు.

ప్రశ్న: ఈ రోజు నా పుట్టినరోజు. ఆధ్యాత్మికజీవితం కోసం ఇతోధికంగా చేసే ప్రయత్నానికిది అంకురార్పణ కావాలనుకుంటున్నాను. కాబట్టి నేను ఏదయినా చేయాలి. ఏది తప్పనిసరిగా చేయాలో దయచేసి నాకు చెప్పండి.

జవాబు: ఏది చేయాలో అనుకుని ఆలోచించి నిర్ణయించేది కాదు. చిత్తశుద్ధితో కూడిన స్థిరమైన నిరంతర ఆకాంక్షలో ఎప్పుడో హఠాత్తుగా దానికదే అతిశయించే చలితచాలనం.

ప్రశ్న: ప్రియమైన మాతా! దర్శనరోజులు — డిశంబరు5, 9, మరియు తన యొక్క పుట్టినరోజు, వ్యక్తి ఎలా జరుపుకోవాలి?

సాధారణ జ్ఞానాన్ని కాక సత్యజ్ఞానాన్ని అన్వేషిస్తూ — అయిదు, తొమ్మిదవ తేదీలనాడు మృత్యువుని గురించిన అవగాహనతో —

పుట్టినరోజునాడు జీవితపరమార్థాన్ని తెలుసుకుంటూ —

మూలం: శ్రీమాత

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

*

ప్రశ్న: జన్మదినాలలో సాధకులకు శ్రీమాత దర్శన మివ్వటంలో ప్రత్యేక ప్రాముఖ్యత ఏమైనా ఉన్నదా?

జన్మదినములకు సంబంధించి — అప్పుడక్కడ ప్రపంచశక్తుల క్రీడావిన్యాసాల పరస్పర సామరస్యం ఉంటుంది. అది సూర్యుడు, గోళాలతో సమన్వయం కలిగి ఉంటుంది. అది పుట్టినరోజును పునరుజ్జీవింప చేసే అవకాశం ఉంది. అపుడు సత్త్వమునకు మరింత మృదుత్వాన్ని సంతరించుకునే అవకాశం కలుగుతుంది. ఈ కారణంగానే వ్యక్తులకు పుట్టినరోజులలో శ్రీమాత దర్శనం ఇస్తారు.

ప్రశ్న: మరి వేరే రోజులలోకంటె పుట్టినరోజులలో భౌతికసత్త్వము మరింత గ్రహణశక్తి కలిగి శ్రీమాతకు మరింతగా ఉన్మీలనమై ఉంటుందని మీరు వ్రాశారు. అందుకేనా ఆమె మాకు మా పుట్టినరోజుల నాడు ప్రత్యేక ఆశీస్సులు అందచేస్తారు?

జవాబు: ఇది శారీరక లేదా భౌతిక జన్మదినం అనే విషయం కాదు. కాక, ఇది జీవితానికి మరొక నూతన సంవత్సర ఆవిష్కారం — అంతరంగంలో నూతన జన్మవికాసంతో — ఇదీ శ్రీమాత భావన, పుట్టిన రోజు గురించి.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

కాలచక్రము

(శ్రీఅరవిందుల *'The Synthesis of Yoga'* గ్రంథంలోని "సాధన చతుష్టయము" అనే అధ్యాయం శ్రీమాత చదువుతూ, ఒక సాధకుడు అడిగిన ప్రశ్నకు ఇచ్చిన సమాధానం.)

ప్రశ్న: మధుమయీ! ఇక్కడ చివరగా, "కాల" మొక ఉపకరణము కాగలదు. ఎందుకంటే, ఇక్కడ జరిగే ప్రతి సన్నివేశము కాలము యొక్క లయకు బద్ధమై ఉంటుంది. దివ్యప్రేరణను అనుసరిస్తుంది. ఈ దివ్యప్రేరణ అంటే ఏమిటండీ?

అది ప్రతి వస్తువుకు భిన్నంగా వుంటుంది. ప్రతి చర్యకు ప్రతి సిద్ధికి, ప్రతిచలనానికి ఒక నిర్ణీతకాలముంటుంది. అది దానికి ప్రత్యేకంగా ఉన్నప్పటికి మొత్తం కలగాపులగమై వుంటాయి. కాని ప్రతి వస్తువు దాని లయతో క్రమబద్ధం చేయబడుతుంది.

బాహ్యజీవన సౌలభ్యం కోసం మనిషి కాలాన్ని తన ఇచ్ఛవచ్చిన రీతిలో సంవత్సరాలుగా, నెలలుగా, వారాలుగా, రోజులు, గంటలు, నిమిషాలు, సెకండ్లుగా విభజించి ఒక కొలమానాన్ని తయారుజేసుకున్నాడు. అయితే కాలాన్ని మనం యేథేచ్ఛగా కొలుచుకోవచ్చు. ఏ కొలమానాన్ని అవలంబించినప్పటికీ కాలంలో ఒక వాస్తవం ఉంది. అది విశ్వజనీన గతులకు సంబంధించిన విషయము. ఉదాహరణకు అందుకే మనం జన్మదినాలు జరుపుకుంటాం. ప్రతి మనిషి జీవితంలోను ఒక నిర్దిష్టమైన లయ వుంటుంది. జన్మించిన పరిస్థితులకు అనుగుణంగా క్రమపద్ధతిలో పరిస్థితుల చక్రభ్రమణాలవల్ల ఈ లయ స్థిరపడుతుంది.

అన్ని గతులలో — సంఘటనల చలనాలలో ఒక లయ కనిపిస్తుంది. అంతర్గత చైతన్య కదలికలు అవి. అవగాహన దృష్ట్యా మాత్రమే కాదు. వ్యక్తిగత ప్రతిస్పందనలు, పురోగతిలో ఎత్తుపల్లాలు, కష్టాలు, దోహదాలు క్రమపద్ధతిలో నిర్దిష్టవ్యవధిలో తిరిగి రావడం — వాటిలో పురోగతులు, ప్రతిఘటనలు వుంటాయి. కాని ప్రతి వ్యక్తి శ్రద్ధగా వుంటే తన లయ పూర్ణంగా తనదేనని గుర్తిస్తాడు. ప్రక్కవాడి లయవంటిది కాదు అది. ఋతువులకు ఒక లయ వున్నట్లే వ్యక్తిగత జీవితంలో కూడా అటువంటి ఋతువులు ఉన్నాయి. తనకు తాను శ్రద్ధగా పరిశోధించుకున్న వ్యక్తి క్రమపద్ధతిలో నిర్దిష్ట వ్యవధులలో ఒకే రకం పరిస్థితులు పునరావృతాన్ని గమనించవచ్చును. వారంలో కొన్ని రోజుల్లో, రోజులో కొన్ని గంటల్లో తాము తమ పనుల్ని తేలికగా

చేయగలమని సున్నితమనస్కులు తెలుసుకుంటారు. దీనికి విరుద్ధంగా కొందరికి కొన్ని నిర్దిష్ట క్షణాలలో మరింత చక్కని ఆవేశం, ఉత్తేజం కలుగుతుంటాయి. కాని ప్రతివ్యక్తి పరిశీలన ద్వారా ఈ విషయం తెలుసుకోవచ్చును. అది నిరపేక్షం కాదు. కఠినమైనది కాదు. అది బాధాకరమైనదైతే, దానిని తేలికగా, గట్టి సంకల్పంతో వది లించుకోవచ్చును. సహాయపడితే దానిని మనం వాడుకోవచ్చును. ప్రతి వస్తువుకు లయ వుంటే, అది చాలా సంక్లిష్టమైన లయల గజిబిజిగా తయారవుతుంది. ఇప్పుడు మనం చూస్తున్న లోకం అదే. అసలు లయ అనేది లేనట్లుగా కనిపిస్తుంది. ఎందుకంటే అది సంక్లిష్టమైనది. అత్యంత గహనమైనది.

ప్రశ్న; మనం ఈ కాల లయగతిని ఎలా ఉపయోగించుకోవాలి?

మనం యోగం గూర్చి మాట్లాడుతుంటే, నీలో పరిస్థితులు పునరావృతమవుతున్నట్లు నీవు కనుగొంటే, ఉదాహరణకు — కొన్ని నిర్దిష్ట పరిస్థితులలో రోజులో ఒక నిర్దిష్ట సమయంలో, ఒక నిర్దిష్ట ఘడియలో నీకు సాధన చేయడం, ఏకాగ్రతను సాధించడం మరింత తేలిక అని నీవు భావిస్తే, ఆ నిర్దిష్ట సమయంలో ఆ ఘడియను ఉపయోగించుకోవాలి. కాని, నీవు దానికి బానిస కారాదు. దానిని ఉపయోగించుకోవచ్చు, కానీ అది అవసరం కారాదు. ఆ గంట గడిచిపోతే ధ్యానం చేయలేకపోవచ్చు. కాని, అది మంచి సహాయకారి. ఆ సహాయం పొందవచ్చును — అంతా మన పరిశీలనలపై ఆధారపడుతుంది.

వ్యక్తిగత పరిస్థితులవల్ల కాకుండా, ప్రకృతిలో పరిస్థితులవల్ల సంవత్సరంలో నిర్దిష్ట వ్యవధులు వస్తున్నట్లు నీ పరిశోధనలో నీవు గుర్తిస్తావు. సాధనలో మరిన్ని కష్టాలు ఎదురవుతాయి. విజ్ఞానం, చైతన్యం వికాసం వైపు నీలో మరింత ఉత్తేజం, ఉద్వేగం పొందిన సమయాలు కొన్ని వుంటాయి. ఒకవేళ నీకు ప్రత్యేక కష్టాలు ఎదురైనా, సాధన ఆగిపోయినా, విచారిస్తూ కూర్చొనడానికి బదులు — “ఎందుకలా జరిగింది? అది మామూలు సమయమే. ఈ సంవత్సరంలో నిర్దిష్ట వ్యవధిలో నేను ఉన్నాను” అని నీకు నువ్వు చెప్పుకోవాలి. ఆ సమయం గడిచిపోయే దాకా వేచివుండు. సహనంతో నీవు చేయగలిగిన పని నీవు చెయ్యి. కాని నిరుత్సాహపడ వద్దు.

“నేను పురోగతి చెందలేకపోతున్నాను” అని నీలో అనుకో. సహేతుకంగా ఆలోచించడానికి ఇది తోడ్పడుతుంది. సహజంగా నువ్వు మరో అడుగు ముందుకు

వెయ్యవచ్చు. బాహ్యపరిస్థితుల ప్రభావానికి సంబంధం లేని జాగ్రత్తలు (అంతర్గత జాగ్రత్తలు) తీసుకో. అయితే నువ్వు సాధనలోని పూర్ణదశలో, ఒక స్థాయికి చేరుకున్నప్పుడు అందులో నైపుణ్యం సాధించినప్పుడు conscious master వైతే అప్పుడు ఈ జాగ్రత్తలు తీసుకోగల్గుతావు. ఆ దశ తరువాత వస్తుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: కె. యజ్ఞన్న

శ్రీమాత ఆర్. జన్మదిన సందర్భమున

పునరుక్తంబగు తమదు సొగసైన వత్సరంబులు
    దెచ్చునని మరల తమదు జన్మ ప్రభాతంబును
యౌవ్వన శిఖరాగ్రంబున గనపడు తమదు జీవనంబు, —
    పైకెగసెడి యొక కెరటంబు (వోలె).

నట్టనడి శతసాగర సమూహంబున
    సమ్మర్థంబగు సాగరంబున యొక కెరటంబు
లయబద్ధంబున తీరంబును జేరునటులన్
    మన జీవనము యుండవలె తదనుగుణంబుగన్

కదలాడెడి యావచ్ఛక్తి యంతయు సాగర ఉద్ధృతంబే
    అజేయమై, నిరంతరంబున, స్వేచ్ఛయై యుండునది.
ఆ తాకిడికిన్ యొప్పించునది తనదు గతినిన్
    అనివార్యంబుగన్

ఆ అత్యాంతాద్భుత మహత్ శక్తిచే
    యాతని యిచ్ఛా గమ్యంబు దిక్కునన్ తరలించు మనలను,

చేపట్టునది మనదు చుక్కానినిన్, విప్పారిన ఔదార్య తెరచాపను
      నింపునతని గంభీర ఉచ్ఛ్వాస నిశ్వాసంబునున్

యౌవ్వనపు సొగసు శక్త్యాంశంబులన్ గాంచి ఉప్పొంగుచున్,
      సాగర సుదూర గమ్యంబున యొప్పించున్;
నావికుని బలుకుల నమ్ముచున్, యా గురుదేవుల కనికరంబు
      మనల నాక్రమించున్.

ఆనందింపుడు, భీతిల్లరాదు, తరంగాల అలజడికిన్,
      అల్లకల్లోలంబగు తుఫాను గర్జనల, గాలి దూమారంబుల తాకిడికిన్;
మనదు నావికుండు పదిలంబరచుకొను చుక్కానిని,
      నిదురించ డాతను ఎన్నటికిని.

అపరిమిత అల్లకల్లోల సాగర పీడనంలో
      నీవు గగనంబును నీటి తుంపర్లవల్ల కానగలేకున్నను
భీతిల్లకు. తేజోభాస్కరుడున్నాడు నీతో
      రేయంబవళ్ళు.

విజయోత్సవ వెల్లువలో మునిగిన వారలు,
      ఏడపోయెదరు? మహనీయుని హృదయము లోనికి (తప్ప).
కొందరికి మంచిని, జయంబు, ఆనందములన్ అందించు నాతడు
      ఇచ్చును మరికొందరికి విశ్రాంతిని.

కానీ, ఉరవడిని పొరలిపోవు తుఫాను వర్షంబుల కావల
      ప్రజ్వరిల్లు దినంబుల జూడుడు,
ఆహ్లాదకరంబగు విధిని గాంచితి
      తమదు రూపంబును ప్రజ్వలింపజేయుచున్.
విశ్వసింపు దివ్యుని యనుగ్రహంబు, ప్రతీక్షింపు మాతని ఇచ్చను;

లక్ష్యము మఱుగై యున్నను, మార్గదర్శి కానిండు ఆతనిని,
గాంచు మాతని, సంఘటనల, సఫలీకృతంబు లందంతయు
తమదు జన్మకారణంబదియే యగు.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: సునీతి పంతులు

(*SABCL* Vol. 5, p. 75)

నీ హృదయంలో నూతన జన్మ అభివ్యక్తమయి ప్రశాంతంగా, ఆనందంగా ప్రకాశించనీ. అది నీ సత్వములో అన్ని భాగాలను — బుద్ధి, సమ్యక్ దృష్టి, ఇచ్ఛాశక్తి, సంవేదన, జీవనవిధానము, శరీరము — తన స్వాధీనములోనికి తీసుకుని కొనసాగించనీ, నూతన జన్మలో నీ జీవనం దినదిన ప్రవర్ధమానంగా నీ సర్వస్వమూ శ్రీమాత పెంపకంలో శిశువు అవనీ. దివ్యకాంతి, దివ్యశక్తి, దివ్యసాక్షాత్కారము, నిన్ను కప్పివేయనీ. సంరక్షించనీ. పోషించనీ. నీ బాహ్య, అంతర అస్తిత్వాలు, నీ శక్తి, శాంతి, దివ్యానందాల వ్యక్తీకరణ సర్వమూ ఒకే సమైక్య సంచాలనంగా సాగనీ.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

సర్వేశ్వర శక్తిచేత ప్రచోదింపబడవలసినవారమే మనం

మన కర్మలకు ప్రేరకుడు, అధినాథుడు అయినవాడు ఏకైకుడు, విశ్వమయుడు, పరముడు, నిత్యుడునైన అనంతుడు. అతడు మనకు ఊర్ధ్వమున విలసిల్లు అజ్ఞాత, అజ్ఞేయ, అవ్యక్త, అనభివ్యక్త, సర్వాతీత పరబ్రహ్మము. అంతియే కాక అతడు సకల భూతరాంతరాత్మయై నిఖిల భువనాధీశ్వరుడై, సర్వాతీశాయి యగుచు, పరమజ్యోతి, పరమగురువు, పరమ సుందరుడు, పరమ ప్రేమరసైకమూర్తి కూడ. మన చుట్టునూ సృష్టివిలాసమును ప్రదర్శించుచున్న యీ విశ్వశక్తియు విశ్వాత్మయును నాతడే. అతడే మనలో అంతర్యామియై గూడ వెలుగొందుచున్నాడు. ఉన్నది సమస్తమూ ఆతడే. ఈ ఉన్నదాని కంటె మించి ఉన్నవాడునూ ఆతడే.

మనకు తెలిసినను, తెలియకపోయిననూ మన మందరము కూడ అతని సత్తలోని సత్తయు, శక్తిలోని శక్తియును అయి, అతని నుండియే సంక్రమించిన చైతన్యస్వరూపులము. ఈ మన మర్త్యస్వరూపము గూడ ఆతని యందలి పదార్థము నుండి రూపొందించబడినట్టిదే. మన లోపల అమర్త్యము, నిత్యమునై భాసించు దివ్యానంద, దివ్యజ్యోతి విస్ఫులింగ మొకటి కలదు.

2). అన్వేషకునికి వెన్వెంటనే కర్మాధినాథుడు తనకు తానై వెల్లడి కాడు. అయినప్పటికీ పనిచేసేది పరోక్షంగా యెల్లప్పుడూ ఆయన దివ్యశక్తియే. అది అభివ్యక్తమయేది, పనిచేస్తున్నది నేనే అనే అహాన్ని పరిత్యజించినపుడు మాత్రమే. ఈ పరిత్యాగము పరిపూర్ణమయే కొలదీ, తదనుగుణంగా దానియొక్క (దివ్యశక్తియొక్క) ప్రత్యక్షక్రియాకలాపము అభివృద్ధి చెందుతూ ఉంటుంది. దివ్యశక్తికి మన అర్పణ పరిపూర్ణమైనపుడు మాత్రమే, ఆయన పరిపూర్ణ సాక్షాత్కారంలో మనం, మన మనుగడ సాగించే హక్కు కలిగి ఉంటాం.

3) ప్రతి మానవుడు తెలిసికాని తెలియకకాని విశ్వశక్తియొక్క ఒకానొక ఉపకరణమే. అంతరమున దివ్యసన్నిధి దీపించుట అటుంచినచో, ఒక పనికినీ ఇంకొక పనికినీ, ఒక ఉపకరణమునకునూ, ఇంకొక ఉపకరణమునకునూ మన అహంకారిక స్వాతిశయ ప్రవృత్తి రూపమైన అవివేకమును సమర్థనీయముగా చేయగల ముఖ్య భేదమేమీయును లేదు — ఆత్మయొక్క ఒకానొక అనుగ్రహ విశేషమే జ్ఞానమునకునూ, అజ్ఞానమునకునూ గల భేదము. ఈశ్వరశక్తి విశేషము ఈనాడు ఒకరి యందును, రేపు ఇంకొకరి యందును తన బలమును పూరించుచు పనిచేయుచుండును. కుమ్మరివాడొక కుండను వేరొక కుండకంటె బాగుగా తయారుచేసినచో ఆ తెలివి చేసినవానిదిగాని, కుండది కాదు. 'ఇది నా బలము' అని గాని, 'చూడండి నాలోగల ఈశ్వరశక్తి' అని గాని, ఈ విధమైన దృష్టి మన మనస్సున కుండరాదు. ఈ మనస్సులోను, శరీరములోను ఒకే విశ్వశక్తి పనిచేయుచున్నది. సకల మానవులలో, జంతువులలో, వృక్షములలో, లోహములలో, సచేతనములలో, అచేతనములైనవానిలో, అంతటా పనిచేయుచున్నది అదియే — అనే దృష్టి ఉండవలెను.

4) ఈ అనుసంధానము స్థిరపడిన మేరకు, తన శక్తికి అతీతమైన, తన అహంకారపూరిత కృషి, సామర్థ్యము — లకు అతీతంగా ఒక శక్తి తనలో ప్రవర్తిస్తూన్నదనే చైతన్యం, సంవేదన సాధకునికి కలుగుతుంది. క్రమేపీ ఈ దివ్యశక్తికి తనను

తాను అర్పణ చేసుకోవటం నేర్చుకుంటాడు. తన యోగసాధన దానికి స్వాధీనప రుస్తాడు.

5) నిజానికి ఎప్పుడూ పనిచేసేది, ప్రవర్తించేది, ఉన్నతతర దివ్యశక్తియే. వ్యక్తిగతంగా, నా కృషి, నా ఆకాంక్ష అనే సంవేదన కలిగేది ఎప్పుడంటే, దివ్యశక్తి క్రియాకలాపాలతో అహంకారికబుద్ధి పరిణతిలేని అపసవ్యమార్గంలో తాదాత్మ్యభావాన్ని ఏర్పర్చుకోవాలనే తాపత్రయం వల్ల. సాధారణ అనుభవాలకు ఉపయుక్తమయే సాధారణ మానసికనియమాలను, అతీత అసాధారణ భూమికకు సంబంధించిన అనుభవానికి ఉపయోగించాలని, అది, (వ్యక్తిగత కృషి) పట్టుపడుతుంది. అహంకారిక సంవేదనలోనే మనం ఈ ప్రపంచంలో ప్రవర్తిస్తాం. మనలో పనిచేసే వైశ్వానిక శక్తులు మన స్వంతమని భావిస్తాం. సర్వాతీతుడు పురోగమనశీలంగా రూపకల్పనచేసే విశిష్ట కార్యకలాపాలన్నీ మన వివేకం, మన ఇచ్ఛాశక్తి, మన సుగుణం — అని మన వ్యక్తిగత ప్రయోజకత్వంగా ప్రకటిస్తాం. అహంకారపూరిత ప్రాణిక, శారీరక, మానసిక ప్రవృత్తి అది. మనకు జ్ఞానోదయమయినపుడు, అహం కేవలం ఒక ఉపకరణము మాత్రమేననే యెరుక కలుగుతుంది. ఇవన్నీ సర్వోన్నత సమగ్ర అంతరాత్మకు చెందినవిగానే, మనకు దఖలుపడినాయి. ఇవేమీ ఉపకరణాత్మక అహానికి చెందినవి కావు. సర్వోన్నత సర్వాతీతమునకు చెందినవి — అనే సంవేదన, అవగాహన, మనకు కలగటం ఆరంభమవుతుంది. అప్పటి నుంచీ, మన పరిమితులు, మన వక్రతలు ఇవే — ఈ విధివిధానానికి మనం అందించే సహకారం. అక్కడ అందులో ఉండే వాస్తవమైన శక్తి దైవానిది. తన ఇచ్ఛాశక్తి ఒక ఉపకరణం, వివేకం ఒక అజ్ఞానం, తెలివితక్కువతనం, తన శక్తి పసివాని దేవిరింపు, తన సుగుణం ఒక డంభాచారం — అని మానవ అహం తెలుసుకున్నపుడు, అది, వీటి కతీతమైనదానిపై నమ్మకాన్ని పెంచుకుంటుంది. అదే అపుడు దానికి విముక్తి. పైకి మాత్రమే కనిపించే స్వేచ్ఛతో, పట్టిన పట్టు నెగ్గించుకోవాలనే పట్టు వదలనిది వ్యక్తిగత సత్వము. దీనిపై మన కెంతో ప్రగాఢమైన మమకారం. దీనిని అదుపులో పెట్టేవెన్నో భావాలు, ప్రేరణలు, శక్తులు దీని వెనుక దాగి ఉంటాయి. ఇవన్నీ మన అల్పజీవనానికి అసంబద్ధమైనవే. అహంకారం మన మెంతో స్వేచ్ఛాజీవులమని గర్వపడుతుంది. అలాటిది, నిజానికిది లెక్కలేనన్ని జీవులకు, శక్తులకు, అధికారాలకు, వైశ్వానిక దివ్యప్రకృతిలోని ప్రభావాలకు ఎప్పుడూ కీలుబొమ్మ, బానిస. దైవానికి, అహం

చేసే ఆత్మత్యాగం దానికి ఆత్మసిద్ధి, సాఫల్యత. తనకు అతీతమైనదానికి దాసో హమే అయి ఉండటం — ఇదే దానికి బంధాల నుంచి, అనుబంధాల నుంచి విముక్తి, పరిపూర్ణమైన స్వేచ్ఛ.

6) వ్యక్తిగతమైన ఇచ్ఛాశక్తి, నిమ్నప్రకృతిలోని అంధకారాన్ని, వికృతాలను నిరాకరించాలి. దృఢనిశ్చయంతో, గాఢంగా దివ్యప్రకాశం వైపుగా దృష్టి మరల్చి, ఉండాలి. ఇందుకు తగిన అంతర్గత కృషితో పెనుగులాడే సమయం, ఇచ్ఛాశక్తికి, అంతో యింతో వ్యవధిలో ఎప్పుడో ఒకప్పుడు వస్తుంది. మానసికశక్తులు, హృదయోద్వేగాలు, ప్రాణికకామనలు, మొత్తం భౌతికసత్వమును అంతా సక్రమ దృక్పథంలో నిర్బంధించాలి. సక్రమ ప్రభావాలకి ప్రవేశం కల్పించేలా ప్రతిస్పందిచేటట్లుగా వాటికి శిక్షణ నివ్వాలి. అప్పుడు మాత్రమే, ఇది వాస్తవంగా జరుపబడినపుడు మాత్రమే, నిమ్నప్రకృతి ఊర్ధ్వప్రకృతికి విధేయమై ఉండటం సాధింపబడుతుంది. ఎందుకంటే అపుడు నివేదన ఆమోదయోగ్యమై ఉంటుంది.

7) సాధకుడు తన ఇచ్ఛాశక్తితో అహంకారశక్తులను అదుపులోనికి తీసుకుని వాటిని సక్రమ దృక్పథం వైపు జ్ఞానప్రకాశం వైపు మళ్లించాలి. ఒక మారు అలా మరలిన పిమ్మట దానినే అంగీకరించి, దానినే అనుసరించేలా వాటికి శిక్షణ ఇవ్వాలి. ప్రగతి సాగిస్తున్న కొలదీ వ్యక్తి తన వ్యక్తిగత ఇచ్ఛాశక్తిని, వ్యక్తిగత కృషిని, వ్యక్తిగత సామర్థ్యాలను, దివ్యోన్నతశక్తికి ప్రతినిధులుగా వినియోగించటం తెలుసుకుంటాడు. అలాగే ఉన్నత దివ్యప్రభావానికి సచైతన్యంగా ఒదిగి వుండటమూ నేర్చుకుంటాడు. ఇంకా మరింత పురోగతి సాధిస్తున్నకొలదీ, తన ఇచ్ఛాశక్తి, కృషి, సామర్థ్యము — ఇవేవీ వేరుగా తన వ్యక్తిగత స్వంతానివిగా ఇక ఉండవు, సరి కదా, అవి, ఉన్నతతర దివ్యశక్తులకి, ప్రభావాలకి వొదిగి ఉండే ఉన్నత చలితచాలనాలుగా కొనసాగుతాయి. అయినప్పటికీ కూడా, దైవీమూలకానికి, మానవఘటిత సంఘటనల తీరుకు మధ్య ఒక రకమైన అగాథం లేదా యెడం ఇంకా ఉంటూనే ఉంటుంది. ఆ దిశగా తీసుకుపోయే ప్రక్రియ అస్పష్టమయి మార్గం ఎప్పుడూ అంత నిర్దుష్టంగా ఉండదు. వికృత మవుతూంటుంది. ఈ ప్రక్రియలో చివరికి క్రమానుగతంగా అహం, అజ్ఞానం, అశౌచం అంతర్ధానమవుతవి. ఈ చివరి వేర్పాటు

వైదొలగింపబడుతుంది. వ్యక్తిలోని సర్వస్వం దైవీక్రియాకలాపంగా సుసంపన్నమవుతుంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కమలాకర వెంకటరావు, కర్రా వెంకటేశ్వర్లు

చోదకునిపై విశ్వాసంతో సుదూర సాగరాని కావల అన్వేషిస్తూ సాగిపో

1) విశ్వాసము, ఓరిమి — ఇవి ప్రాథమిక అవసరాలు. స్వర్గసామ్రాజ్యాన్ని హఠాత్తుగా గట్టి పట్టు పట్టి అన్వేషించే గాఢ హృదయ భావావేశాలు, తీవ్ర ఇచ్ఛాశక్తి ఉగ్రతలు దుఃఖపూరిత ప్రతిక్రియలను యెదుర్కొనవలసి వస్తుంది — అవి వాటి తీవ్రతను నిరసించకపోతే. ఇవి (విశ్వాసము, ఓరిమి) మరింత అణకువ, ఓరిమితో కూడి సహకరించేవి. సుదీర్ఘము, జటిలము అయిన సమగ్ర యోగానికి, సమగ్ర విశ్వాసం, నిశ్చలమైన ఓరిమి తప్పనిసరి.

2) మన బుద్ధి యందును, హృదయము నందు, సంకల్పశక్తి యందు అసహనపూర్వకమగు తొందరపాటు చెలరేగుచుండు కారణమున నీ విశ్వాస సహనములను మిట్టపల్లములుగల ఇరుకైన యోగమార్గమునందు అభ్యసించుటయు అలవరచుకొనుటయు మిగుల కష్టము. మానవుని ప్రాణమయ ప్రకృతి యెల్లప్పుడునూ తన కృషి ఫలితము కొరకై వెంపరలాడుచుండును. ఆ ఫలితము తనకు నిరాకరింపబడుచున్నట్లు తోచినను, అది తనకు చేకూరుటకు దీర్ఘ విలంబనము జరుగుచున్నట్లు తోచినను, అయ్యది తన లక్ష్యమునందును, అద్దాని నేతృత్వమునందును విశ్వాసమును కోల్పోవును. ఏలయన, అతని బుద్ధి సదా ఆయా విషయజాతపు బాహ్యలక్షణములను బట్టి మాత్రమే నిర్ణయములు గావించుచుండును. ఎక్కడలేని నమ్మికతోనూ అతడు పట్టుకొని వ్రేలాడు హేతువాదధోరణికి పట్టుపడిన తొలి అలవాటు అదియే. దీర్ఘకాలము మనము బాధలకు లోనుగావలసి వచ్చినప్పుడుగాని, చీకటిలో దారి గానక తొట్రుపాటులు పడవలసి వచ్చినప్పుడుగాని, మన హృదయములో భగవంతుని నిందించుటకంటె సులభతరమైనది మనకు వేరొకటి

లేదు. మనము పెట్టుకొనిన లక్ష్యమును విడనాడుటయు అట్టి సందర్భములో కడు సులభమే.

ఏలయన, "ఆ పరమేశ్వరుని నేనెంతగానో నమ్మికొని యుంటిని. కాని, బాధలు, కలుషములు, ప్రమాదములు నాకు సంప్రాప్తమైనవి. నేను వంచితుడనై నాను". అని మన మందుము. లేక "ఒక లక్ష్యసిద్ధి కొరకై నేను నా జీవితమునెల్ల ఒడ్డితిని కాని, నా అనుభవమునకు వచ్చిన కఠిన సందర్భములు నా లక్ష్యమునకు విరోధులై నిరుత్సాహమును జనింపజేయుచున్నవి. ఇతరు లేరీతిని తమకుగల పరిమితులకు లోబడి తమ సాధారణానుభవపు స్థిరభూమిపై నడచుచున్నారో అట్లే నేనునూ చేసియుండిన బాగుండెడిది." --అని వక్కాణింతుము. అట్టి క్షణములందు, — ఇది ఒక్కొక్కప్పుడు కడు తరచుగా సంప్రాప్తమై దీర్ఘకాలముండుట గూడ సంభవించుచుండును. — అంతకు పూర్వము మనకు కలిగియుండిన ఘనతరానుభూతు లన్నింటినీ మనము మరిచిపోవుచుందుము. హృదయము తనను ఆవేశించిన కలతలో తాను నిమగ్నమైపోవును. ఇట్టి చీకటి సన్నివేశములలోనే దివ్యపరిశ్రమ నుండి పూర్తిగా మరలిపోవుటయు సంభవింపగల ప్రమాదమున్నది.

3) దీర్ఘకాలము నిలుకడగా సాధన కొనసాగించుటను సాధకుడు నేర్చుకొనిన యెడల, అతని హృదయమందలి విశ్వాసము ఎంతటి భయంకరమైన ప్రతికూల పరిస్థితియందైననూ సడలక నిలిచియుండ గల్గును. ఒకవేళ అది తొలుత మరుగుపడుటయు, లేక అణగారిపోయినట్లు తోచుటయు జరిగినను, అచిరకాలముననే మరల ప్రకటితమగుట తథ్యము. ఏలయన, హృదయము కంటెను, బుద్ధికంటెను పరతరమైన దొకటి ఎంతటి విపరీతపు తొట్రుపాటు లందైనను, ఎంతటి దీర్ఘమైన వైఫల్య స్థితి యందైనను అద్దానికి తమ ఊత మొసగి నిలువబెట్టును. కాని, యిట్టి తొట్రాపాటులు, మబ్బుతెరలు అనుభవశాలియగు సాధకుని పురోగతికి గూడ అవరోధమై పరిణమించుచుండుట కల్లదు. అట్టియెడ, ప్రారంభదశలోని సాధకుని కవి మిక్కిలి ప్రమాదకరములే కదా; కావున సాధకుడు మొదటి నుండియు గూడ ఈ మార్గములోని బహుళశ్రమను గుర్తించి, అంగీకరించి, బుద్ధికి అంధప్రాయముగా గనుపట్టినను, బుద్ధికంటె వివేకవంతమని చెప్పదగు విశ్వాసావశ్యకతను బాగుగా హృదయస్థ మొనర్చుకోవలసి యున్నది.

4) ఏలయన, ఈ విశ్వాసము ఊర్ధ్వమునుండి మనకు అందింపబడెడి చేయూత.

బుద్ధికి, దాని ప్రమాణములకు అతీతమై వెలయు ఒకానొక నిగూఢజ్యోతి యొక్క కాంతిమయచ్ఛాయావిశేషమది. బాహ్యదృశ్యములపై ఎంత మాత్రమూ ఆధార పడని నిగూఢజ్ఞానహృదయ మీ విశ్వాసము. పట్టుదలతో విశ్వాసమును మనము వీడక యుందుమేని, అయ్యది తన ప్రయోజనమును నిరూపించుకొనుచు ఉన్నతిని పొంది, కడకు దివ్యజ్ఞాన సాక్షాత్కారము లోనికి రూపాంతరము చెందును. "అనిర్విణ్ణమైన, — విషాదమున క్రుంగిపోని, — హృదయముతో యోగమును సతతముగ నభ్యసించుచుండవలె" నను గీతాబోధనను మనము సదా వీడక అనుష్ఠించుచుండుట అవసరము. "సర్వపాపముల నుండియు నీకు నేను తప్పక విమోచనము కల్పించెద" నని ఆ ప్రభువు చేసిన వాగ్దానమును సంశయాకులమగు బుద్ధికి మనము నిత్యమూ గుర్తు చేయుచుండవలెను. కట్టకడకు, విశ్వాసము చలించుట పూర్తిగా కట్టువడిపోయి, ప్రభుని సాక్షాద్దర్శనమును పొందినవారమై, అతని దివ్యసన్నిధిని సదా అనుభవించుచుండెడి స్థితికి మనము చేరుకోగలుగుదుము.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదము: కమలాకర వేంకటరావు (యోగసమన్వయము)

(*SABCL* Vol. 20, pp. 232-33)

మన నౌకను నడిపించే అధిపతి సమర్థుడు

మన కర్మల కధినాథుడైన ప్రభువు మన ప్రకృతిని ఒక వంక రూపాంతరము చెందించుచునే వేరొక వంక దానిని గౌరవించుచుండును. అతడు మన ప్రకృతి ద్వారా పనిచేయునే కాని ఏదో నిరంకుశ అస్థిర ధోరణిలో పనిచేయడు. దోషభూయిష్ఠము, అపరిపూర్ణము అయిన మన ప్రకృతి యందు పరిపూర్ణతకు తోడ్పడగల మూలకములున్నవి. కాని అవి ఒకే తీరుగా లేవు. క్రమరహితంగా కలగాపులగంగా, అస్తవ్యస్తంగా, అపరిపక్వంగా ఉన్నాయి. ఈ పదార్థము నంతనూ నెమ్మదిగా పరిశుద్ధమొనర్చి, క్రమపరచి, కొత్తగా పోతపోసి రూపాంతరము చెందించవలసి యున్నది. అంతియేకాని, దానిని చితగగొట్టి, ఛిన్నాభిన్నము చేసి, హతమార్చుటయు, బలవంతముగా తుడిచిపెట్టుటయు చేయరాదు. ఈ ప్రపంచము, అందు

నివసించు మనము ఆ ప్రభుని అభివ్యక్తరూపముగా అతనిచే సృజింపబడినవారము. అజ్ఞము, సంకుచితములైన మన మనస్సు అవగాహనమొనర్చుకోజాలని పద్ధతిలో ఆతడే, ప్రపంచముతోనూ, మనతోనూ వ్యవహరించును. మనస్సు మౌనముద్రాంకితమై దివ్యజ్ఞానమునకు ఉన్మీలితమైనగాని అతని పోకడలు దానికి తెలియజాలవు. మనము చేయు తప్పులకు మూలము నొక సత్యపదార్థము కలదు. తడుములాడుకొనుచున్న మన బుద్ధికి తన ఆంతర్యమును వెల్లడింపవలెనని అద్దాని ప్రయత్నము. తప్పులతో సత్యమును గూడ మానవబుద్ధి ఖండన మొనర్చి దాని స్థానమున సగము సత్యము, సగము తప్పునైన నొకదానిని నెలకొల్పుచుండును. ప్రతి తప్పు చాటుననూ నిక్షిప్తమైయున్న సత్యమును మనము తెలుసుకోగలుగు పర్యంతము, దివ్యజ్ఞానస్వరూపుడైన ఆ పరమేశ్వరుడు మన తప్పులను సహనముతో కొనసాగనిచ్చుచుండును. మనము చేయు పాపములు మనలో వెతుకులాడుచున్న ఒకానొక శక్తి, తప్పుదారిలో పడి, చేయు పదన్యాసములు మాత్రమే. అద్దాని లక్ష్యము పాపాచరణము కాదు. దివ్యగుణ విశేషముగ పేర్కొనదగిన ఒకానొక విశుద్ధతను సాధించుటయే అద్దాని లక్ష్యము. తరుచుగా నీ పాపములు ఒక గుణవిశేషమును కప్పిపుచ్చెడి మాయ ముసుగులు. వికృతమైన ఈ ముసుగు నూడ్చి అద్దానిని రూపాంతరము చెందింపవలసి యున్నది. అట్టు కానిచో, నిర్దుష్టమగు భూతసృష్టి విధానమునందు ఈ పాపములను ఉండనిచ్చుటయు, కొనసాగించుటయు జరిగి యుండెడిది కాదు. మన కర్మల కధినాధుడైన ఈశ్వరుడు పొరపాట్లు చేయునట్టివాడు కాదు. కొరమాలిన యీ పాపముల నందాసీనుడై తిలకించువాడును, భోగియై వాటితో సయ్యాటలాడువాడును గాదు. మన హేతువాద ప్రజ్ఞ కంటె మన గుణసంపద్విశేషము కంటెను అతడు వివేకశాలి.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కమలాకర వెంకటరావు

(*SABCL* Vol. 20, pp. 233-34)

*

2) అహంకారం ఎక్కడైతే ఉంటుందో అక్కడ ఆదిమ జంటలైన రాగద్వేషాలు ఉద్భవిస్తాయి. కోరికలను సంతృప్తిపరచేవాటి పట్ల ఇష్టము, వాటికి ప్రతికూలమైనవాటి పట్ల అయిష్టము, లాభనష్టాల సంవేదన, ఆహ్లాదము, అసహ్యము, ఆకర్షణ, వికర్షణ,

జాలి, క్రూరత్వము, ప్రేమ, ద్వేషము — ఈ ద్వంద్వాల నిత్యనిరంతర ఊరే గింపు ఉంటుంది. ఇందులో ఏ ఒక్క జంటకైనా ప్రవేశం కల్పించావా, ఇక మిగిలిన వన్నీ ఒకదాని వెనుక మరొకటి పరుగూ పాటుతో వచ్చేస్తాయి. అయితే సర్వభూతములలోను తనను తాను దర్శించుకునేవాడు ద్వేషించలేడు. ఎవ్వరినీ చిన్నచూపు చూడడు. అతనికి భయముకాని, జుగుప్సకాని ఉండవు.

*

ఈ బాహ్యమైన, "నువ్వు — నేను" భావన, కేవలం ముసుగులు ధరించిన వేష గాళ్లు మాత్రమే. వీరికి పరోక్షంగా ఉన్నది — ఏకః — ఒక్కడే అతను ఎవ్వరినీ చంపడు. తాను చంపబడడు. ముసుగు మనిషి ధర్మాధర్మ నిర్ణేతను పిలిచి అంటాడు — నా పాత్ర నేను పోషించాను. నీ పాత్ర నీవు పోషించు — అని. ఓ సనాతన యోగపుత్రా! సర్వభూతములలో ఆత్మసాక్షాత్కారాన్ని పొందు. దేనికీ భయపడ డకు. దేనినీ నిరసించకు. ఎవ్వర్నీ భయపెట్టకు. ఎవ్వర్నీ అసహ్యించుకోకు. నీవు పోషించవలసిన పాత్రను ధైర్యంగా, నిర్భయంగా పోషించు. నీవు మాత్రము అలాగే ఉండు. నీవు నిజానికి అదే. నీ విజయములో దైవము, నీ ఓటమిలో దైవము, నీ బాధామృత్యువులలోనూ దైవము — దైవమునకు ఓటమి లేదు. మృతి లేదు. భగవంతుడు దేనికి భయపడతాడు! ఆయన దుఃఖిస్తాడా? ఆయన భయకంపితుడు అవుతాడా? లేదు. నీలో, నీ మస్తిష్కంలో, శరీరంలో ఉండే సూక్ష్మజీవులు మాత్రమే కంపించేవి. వాటిలో ఉపవిష్టుడవై వున్న నీవు వాటిని, వాటి భయ, బాధలని, నిశ్చ లంగా దర్శిస్తూ ఉంటావు. వాస్తవాలుగా భావించే వాటియొక్క స్వప్నాల నీడలు మాత్రమే అవి. సర్వభూతాంతర్గత అంతరాత్మను తెలుసుకో. అంతరాత్మలో సర్వభూతములను అవలోకించు. అప్పుడు ఇక, ఆఖరికి, భయం నీ నుంచి భయ పడి పారిపోతుంది. బాధ నిన్ను అంటుతే, దాని కెక్కడ బాధ కలుగుతుందోనని అది నిన్ను తాకదు, మృత్యువు నీ దరి చేరితే అదెక్కడ చచ్చిపోతుందోనని, భయంతో నీ దగ్గరకే రాదు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

దైవకృపను నమ్ము — దైవం నిన్ను నడిపించనీ

మన మానవ ప్రకృతి, యిచ్ఛాశక్తి విలసనమున పొరపాట్లకు లోనగునది. జ్ఞానశక్తి విలసనమున తెలివిమాలినది మాత్రమే గాక, క్రియాశక్తి విలసనమున కడు దుర్బలము కూడ. కాని ఈశ్వరశక్తియందు మనము విశ్వాసముంచి, మన లోపములను, సామర్థ్యములను ఈశ్వరకార్యము కొరకు వినియోగింతుమేని, మనకు చేయూత యొసగి నడిపించి తీసుకొనిపోవుటకు ఈశ్వరశక్తి సిద్ధముగనే యున్నది. మనము వెంటనే సాధింపవలెననుకొన్న లక్ష్యము నొకవేళ సాధింపలేకపోయినచో, ఆ వైఫల్యము ఈశ్వరేచ్ఛచే కలిగినదే. మన వైఫల్యము తరచుగా మనలను సరియైన దారిలో పెట్టి, తక్షణ విజయము మనకు అందింపగలిగి యుండుదాని కంటె నిక్కమైన లక్ష్యసిద్ధికి మనకు సహాయకారి యగుచుండును. మనము బాధలకు గురికావలసి వచ్చుచో, దానికి కారణము మనలో నేదియో అపురూపమైన ఒకానొక ఆనందప్రాప్తికి సన్నద్ధము గావింపబడవలసి యుండుటయే. దారిలో మనము తొట్రుపాట్లు పడుచున్నచో, అయ్యది తుదకు మనము సరియైన నడక నేర్చుకోగలుగుటకే. శాంతిని, విశుద్ధిని పూర్ణసంసిద్ధిని సంపాదించుటకు అమిత తీవ్రతతో కూడిన తొందరపాటు మనకు కూడదు. శాంతిని మనము సాధింపలసినదే, — కాని అది శుష్కమైనట్టియు, నిష్ప్రచ్చరమైనట్టియు, అశాంతి ప్రకటన కసమర్థములుగా జేయబడిన వినష్టసామర్థ్యములు గలిగినట్టియు శాంతి కారాదు. అటులే, విశుద్ధి సాధనయు మనకు లక్ష్యము గావలసినదే. — కాని అది శూన్యస్థితిని వెల్లడించునట్టియు, కఠినమైన ఉదాసీనతను ప్రకటించునట్టియు విశుద్ధి కారాదు. అదే విధమున, పూర్ణసంసిద్ధియు మనము పొందితీరవలసినదే, — కాని అది సంకుచితమైన పరిమితుల లోపల బంధింపబడినట్టియు, అనంతుని అంతులేని విస్తృతికి అవధిని విధించునట్టియు సంసిద్ధి కారాదు. దివ్యప్రకృతి లోనికి పరివర్తనము చెందుట మన లక్ష్యము. కాని, యీ దివ్యప్రకృతి మానసికస్థితియో, నైతికస్థితియో కాదు. అయ్యది ఒకానొక అధ్యాత్మిక స్థితి. దానిని సాధించుట మిక్కిలి కష్టము. మన బుద్ధిచేత దానిని ఊహించుట సైతమూ మిక్కిలి కష్టమే. మన కర్మలకు, మన యోగసాధనకు అధినాథుడగు పరమేశ్వరునకు ఏమి చేయవలెనో తెలియును. ఆ చేయవలసినదాని

నాతడు తన సాధనములతో, తన పద్ధతి ప్రకారము చేయుట కవకాశ మిచ్చు టయే మనము చేయవలసిన పని.

2) అవిద్య యందలి మూలప్రవృత్తి అహంకార విశిష్టమై యుండును. మన అసమగ్రప్రకృతికిగల పరిచ్ఛిన్న మైన వెలుగును, శక్తిని పురస్కరించుకొని మనము కర్మప్రవృత్తుల మగుచున్నంత కాలము, అహంకారమును నిరోధించుటకంటె మనకు కష్టతరమైనది వేరొకటి లేదు. కర్మాచరణ ప్రవృత్తిని విడనాడుట ద్వారా అహంకార మును కృశింపజేయుటగాని, వ్యక్తిత్వపు సకల ప్రవృత్తినీ త్రుంచివేయుట ద్వారా దానిని హతమార్చుటగాని సులభమే. ఒకానొక శాంతిపారవశ్యములోనో, దివ్యప్రే మానందములోనో నిమగ్నమగునట్లు దానికి ఉన్నతి ఘటింపజేయుటయు సుల భమే. కాని, మనయందు నిక్కమైన పురుషునికి విమోచనము కలిగించి, దివ్యశక్తి విలంబనమునకు నిర్దుష్టసాధనముగను, దివ్యకార్యాచరణమునకు విశుద్ధోపకరణ ముగను దివ్యమానవత్వసిద్ధిని సాధించుటెట్లనునదే మన మెదుర్కొనుచున్న కఠిన తర సమస్య. ఇందుకు ఒక్కొక్క అడుగే స్థిరముగ వేసికొనుచు మనము ముందుకు సాగవలసి యున్నది. ఒక్కొక్క కష్టమును పూర్తిగా అనుభవించుచు క్రమముగా అన్నిటినీ పూర్తిగా వశీకరించుకోవలసి యున్నది. ఈ కార్యము మనకు ఒనగూడు నట్లు చేయజాలినది దివ్యజ్ఞానము, దివ్యశక్తి మాత్రమే. సంపూర్ణమైన విశ్వాసముతో దానికి మనము విధేయులమై, సుస్థిర ధైర్యముతోడను, సహనముతోడను దాని కార్యగతుల ననువర్తింపుచు ఆమోదించుచుందుమేని, తప్పక అది సమస్తమూ నిర్వహింపగలదు.

అనువాదం: కమలాకర వేంకటరావు

*

3) దైవాన్ని చేరుకునేందుకు లేదా తెలుసుకునేందుకు వ్యక్తి తీవ్రభావావేశంతో, సంకల్పశక్తితో ఆరంభిస్తాడు. దైవమే మొత్తం అంతా స్వాధీనం చేసుకునేటందు లకు తన సాధారణ వ్యక్తిగత భావాలు, కోర్కెలు, వ్యామోహాలు, అలవాట్లకు సంబం ధించిన క్రియాకలాపాల ప్రేరణలు క్రమక్రమంగా వదులుకుంటాడు. దాసోహం — అంటే, నిమ్నబుద్ధి, దాని తాలూకు మానసిక భావాలు, ఇష్టాయిష్టాలు త్యజించి దివ్యప్రకాశ, దివ్యజ్ఞానాలకి వశం కావటం — తత్తరబాటులో, కలవరమొందే అల్ప మైన, అజ్ఞానయుత వ్యక్తిగత ఇచ్ఛాశక్తిని, నిశ్చల ప్రశాంత కాంతివంతమైన,

దివ్యయిచ్ఛ, దివ్యశక్తి లోనికి, మన యొక్క అల్ప, అస్థిమిత, బాధాయుత స్పంద నలను సువిశాల తీవ్ర దివ్యప్రేమ ఆనందాల లోనికి మళ్లించి వదిలిపెట్టడం — దివ్యపురుషత్వముయొక్క అస్పష్టఫలితంగా తయారైవచ్చిన మన బాధా పరితప్త అల్పవ్యక్తిత్వమును ఏకైక దివ్యపురుషత్వము లోనికి పర్యవశింప చేయుట — (ఇదీ surrender అంటే). వ్యక్తి తన స్వీయభావాలు, హేతువాదాలతో ఉన్నత తర దివ్యవిజ్ఞాన జ్యోతిస్సుల నందుకోలేడు. అడుగడుగునా అల్పమైన ఆటంకా లు వాటి రాకకి అవరోధం కల్పిస్తాయి. వ్యక్తి తన వ్యక్తిగత కామనలను వ్యామోహాలను పట్టుకుని వ్రేలాడుతూంటే, ఉన్నత దివ్యతేజస్సులు తమ వాస్తవశక్తితో ప్రవర్తించలే వు. ఏమంటే వాటిని నీవు నీ కోర్కెలకు ఊడిగం చేయించడమవుతుంది. నికృష్ట సంవేదనలతో కూడిన, నీ పద్ధతులను త్యజించకపోతే, సర్వోన్నత దివ్యానందం, శాశ్వత దివ్యప్రేమ క్రిందికి దిగి రాలేవు. ఒకవేళ దిగివచ్చినా, అవి తమ స్వచ్ఛ తను కోల్పోతాయి. అపరిణతమై పొంగిపొరలే బావావేశపూరిత పాత్ర (శరీరం) లోనుంచి ఒలికిపోయి నష్టమవుతవి. అల్పమైన దానిని అధిగమించి, అనల్పమైనదానిని స్వీకరించాలి. ఈ ఆవశ్యకతను ఎంతటి హేతువాదము అయినా కాదని త్రోసిపార వేయలేదు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

అల్లకల్లోలాల కావల వేచి ఉన్న ఉజ్వల భవితవ్యాన్ని చూడు

భూమి మీద దివ్యజీవనమంటే సాధారణ భౌతిక అస్తిత్వంతో ఏ కాస్తంత సంబంధం లేకుండా ఎక్కడో ప్రత్యేకంగా ఉండేది కాదు. అది మానవుడిని, మానవజీవితాన్ని రూపాంతరీకరించ బడగలిగేదానిని సాధ్యమయినంతవరకు రూపాంతరీకరిస్తుంది. ఆధ్యాత్మికరించగలిగేటంత మేరకి ఆధ్యాత్మీకరిస్తుంది. తన ప్రభావ ప్రసరణంతో మౌలికంగా ఇతరత్రా ఉద్ధరింప బడవలసిన వాటిని ఉద్ధరిస్తుంది. వ్యక్తిగత, వైశ్వా నిక అంశాల మధ్య లోతైన సమన్వయాన్ని సాధిస్తుంది. ఆధ్యాత్మిక సత్యానికి, ఛాయామాత్రంగా ప్రకాశిస్తున్న ఆదర్శాన్ని సమున్నతంగా, మరింత ఉత్కృష్ట

ఉన్నతతర అస్తిత్వ దిశగా ఉద్ధరించడానికి సహకరిస్తుంది. మనస్సును ఇతోధికంగా దివ్యజ్ఞాన ఇచ్ఛాశక్తుల దిశలకి ఉద్ధరిస్తుంది. జీవనాన్ని మరింత లోతైన సత్యప్రదీప్త మానంగా, ఉద్వేగభరితం చేసి, ఉదారవంతమైన శక్తికి, ఉత్కృష్టతర లక్ష్యాలకి, ప్రేరణలకి ఉద్ధరిస్తుంది. తన పరిపూర్ణ సత్యసత్వము లోనికి ఉద్ధరింపబడలేనివి ఏవైనా కనుక ఇంకా ఉంటే, వాటిని పరిపూర్ణత దరికి చేరుస్తుంది. అసంపూర్ణ పరిణామ క్రమంలో, ఆ మాత్రం పరిణామానికీ కూడా సిద్ధంకాని వాటికి కూడా ఆత్మోద్ధరణకి సంసిద్ధం చేసేందుకు అవకాశం ఉంటే కల్పించేందుకు ప్రయత్నిస్తుంది. అతిమానస సంసర్గమును కనుక శరీరం భరించగలుగుతే శరీరం కూడా తన స్వీయ భౌతిక సత్యానికి సచేతనమై ఉంటుంది. శారీరక చైతన్యమనేది శరీరానికి ఉంటుంది. అది స్వీయ అంతరవ బోధన సత్యంతో — instinctive truth కూడుకొని ఉంటుంది. తనదైన సక్రమ కార్యాచరణ శక్తియుత పరిస్థితి దానికి ఉన్నది. ఒక రకమైన అవ్యక్త నిగూఢ పరిజ్ఞానం కలిగిన జీవకణాల, జీవధాతువుల సంవిధానంతో — ఏదో ఒకనాడు అది సచైతన్యమై భౌతికరూపాంతరీకరణ ప్రక్రియకి దోహదపడుతుంది. ఫలితంగా భూభౌతిక స్వభావంలో, చేతనలో, ఒక జాగృతి చోటు చేసుకోవటం తప్పనిసరి. అందులకై సార్థకమైన వాస్తవమైన ఒక సంసిద్ధత ప్రారంభం కాకపోయినప్పటికీ — ఒక నూతన దివ్యప్రపంచ తీరు దిశగా పరిణామానికి మొదటిసారిగా, కనీసం ఒక ముందడుగు వేయటానికి ఒక ప్రేరణ — తప్పనిసరి.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

నీ జన్మ సఫలం కావించుకో

ఇది నీ కర్తవ్యం. నీ అస్తిత్వ లక్ష్యం. ఇక్కడ నీ వున్నది దివ్య అతిమానసపురుషుడవు కావటానికి. దివ్యత్వమునకు అర్హమైన పాత్రవు కాగలగటానికి. అందుకు సంసిద్ధం కావటమే నీ కర్తవ్యం. ఆ పయనంలోనే ఆనందం. కాకపోతే, వైఫల్యం. ఏది ఏమైనా అంతా అదే. లక్ష్యం, ప్రయోజనం మాత్రం అందుకే. అందుకు నీ ఆ ప్రస్థానంలో, లక్ష్యంలో ఔన్నత్యముంది. మరి అదే నీ ఆనందం, లక్ష్యం. నీ లక్ష్యాన్ని చేరుకునే మార్గం (నీకు తెలిసి) నీతోనే ఉన్నది. ఉన్నత శిఖరాల ఆరోహణకు నీకు శక్తి కల్పిం

పబడే ఉంది. నీ శిఖరాలను నీవు అధిరోహించగలవు. అదే నీకు ఆనందం. అందుకే నీకు ఆనందం.

నీ కర్తవ్యమంటూ యేదైనా వుంటే, అది యిదే. నీ లక్ష్యం యేమిటని ప్రశ్నిం చావనుకో. దానికి జవాబు యిదే. నువ్వు ఆనందాన్ని కోరుకున్నట్లయితే యింతకు మించిన ఆనందం మరొకటి లేదు. నువ్వు ఆనందమని భ్రమిస్తున్న స్వప్నం, సుషుప్తి, ఆత్మవిస్మృతి యివన్నీ పరిమితమైనవి. విచ్ఛిన్నమయిపోయేవి. కాని యిది పరిపూర్ణానందం. నీ అసలు రూపం. నీ నిజస్వరూపమేమిటో తెలుసా? దైవమే. మిగిలినదంతా విచ్ఛిన్నకరమైనది, వికృతరూపమైనది. ఈ సత్యాన్నే నీ కళ్ల ముందర ఉంచుకొని, ప్రతి విషయంలోను, ప్రతి క్షణము దానికి విధేయమైపోవలసినదే.

మేలిముసుగులో వున్న మోమును, ఆ ముసుగు తొలగించి చూడడానికి బదులుగా ఆ ముసుగే ముఖమని నమ్మబలుకుతా డొకడు; కాని నీ లక్ష్యం మాత్రం నువ్వు మారడం. స్వీయ పరివర్తన మానవస్వభావంలోనే ఉంది. ఆత్మపరివర్తన అతడి నిజమైన స్వభావం. అదే నిజమైన ఆధ్యాత్మిక లక్ష్య మైన ఆత్మోత్థానం.

ఆత్మ అంటే యేమిటి? దానిని అధిగమించటం యేమిటి? ఆత్మపరివర్తనం అంటే యేమిటి? ఇక్కడే నువ్వు పొరబడి తప్పుచేయకూడదు. నిన్ను నీవు తెలుసుకోడంలో తప్పు జరిగిందంటే మాత్రం, అది నిన్ను సకల కష్టాలలోను ముంచెత్తి, సమస్త సందేహాలకు కారణమవుతుంది.

నువ్వు అధిగమించవలినది యేదంటే, యిప్పుడు బాహ్యంగా నీకు కనిపిస్తున్న, నీ వెరిగిన వ్యక్తి — పదార్థానికి, ప్రాణానికి బానిసయినవాడు, ఆ రెండూ కాకపోతే మనసుకి బానిసయిన మానసజీవిగా వుంటున్నవాడు. ఇది అతిగాఢమైన, ఘోరమైన పరాధీనత. మనస్సుకి బానిస కావడం అంటే మనకరూపాన్ని చూసి దానికి దాస్యం చేయడమే.

పరిణామం చెందవలసిన నీ ఆత్మ — పదార్థం, ప్రాణం, మనస్సు అనే తెరల వెనుక నీలోనే వున్నది. అదే ఆధ్యాత్మికశక్తులు కలిగిన దివ్యమానవుడు, పురుషోత్తముడు. బుద్ధిజీవిస్థాయి నధిగమించి, దివ్యమానవుడు కావడం కోసమే భౌతికజీవితం మీద ఆధిపత్యం సాధించాలి. ప్రస్తుతం యే ప్రకృతి చేతిలో కీలుబొమ్మగా వున్నావో ఆ ప్రకృతిని జయించిన రాజువు కావాలి. ఏ ప్రకృతి శక్తయితే, నిన్ను తన పాదాలక్రింద తొక్కి పట్టిందో దానిని యెత్తిపడేయాలి. బానిసగా కాక పరిపూర్ణ

దివ్యదీప్తిగాను, దుఃఖం బాధల దోబూచులాటలోకాక సంపూర్ణ దివ్యానందంగాను, దుర్బలత్వంతో పతనం చెందడం కాక, అమితశక్తివంతుడిగా ఔన్నత్యం సాధిం చాలి. పరిమితస్థాయి నధిగమించి అనంత జీవనం సాధించాలి. పరమాత్మగా అతడిలో ఐక్యం కావడమంటే అదే. నీకు నీవై ఉండటమే యిది. మిగిలినదంతా అందుండి ప్రసరించేదే.

నీలో నీవు స్వేచ్ఛగా ఉండు. తద్వారానే, నీ మనో, ప్రాణిక, దేహాలకు స్వేచ్ఛ. ఆత్మ స్వేచ్ఛాయుతమైనది.

దైవానికి, సర్వజీవులకు అనురూపంగా ఉండు. నీ నిజసత్వములో జీవించు — నీ అహంలో కాదు. అమృతత్వమూర్తివై ఉండు. మృత్యువును నమ్మకు. నీ దేహానికే మృతి గాని, నీకు మృతి లేదు. ఆత్మ నిత్యము.

జీవుడిలో అమృతత్వమే అనంతత్వం, జాగృతి, పరమానందం. పరమాత్మ అనంతుడు. పరిమిత జీవితాలు అనంతత్వం నుండి ఉద్భవించినవే.

సకల సృష్టిలో నీ వున్నావు. అందుచేత దానిలో యేదైనా నువ్వు కాగలవు. వాటిలో నువ్వు లేనట్లయితే, నీకు అస్తిత్వమే లేదు. నీలో యేదైతే వుందో అదే నీ జీవాత్మలో అభివ్యక్తమవుతుంది. బాహ్యంగా కనిపిస్తున్న నీ యీ రూపం, నీ నిజ రూపం కాదు. బాహ్యరూపానికి బానిసగా నువ్వెందుకుండాలి?

ఇంకా యెదుగు. నిన్ను నీవు అధిగమించు. పరివర్తన సాధించు. నువ్వు మని షివి. మనిషి సంపూర్ణ స్వభావం మన ప్రస్తుత తత్వం కంటె ఉన్నతంగా పరివర్తన చెందడం మొదట వ్యక్తి పశుప్రాయుడు. పశుప్రాయుడైనవాడు తరువాత స్థాయికి పరివర్తన చెందాడు. ఆలోచనాపరుడు, వస్తునిర్మాత, సౌందర్యాన్వేషకుడు అయ్యా డు. ఈ ఆలోచనాపరుడి స్థాయి నుంచి జ్ఞానసాధకుడు కావాలి. వస్తునిర్మాత స్థాయి నుంచి సృష్టికర్తగా, తన సృష్టికి తాను అధిపతి కావాలి. సౌందర్యాన్వేషణ స్థాయి నుంచి ఆ సౌందర్యంలో ఆనందాన్ని అనుభవించేవాడుగా, భౌతికత నుండి శాశ్వతత్వం సాధించాలి. ప్రాణికం నుండి జీవాత్మ అమృతత్వానికి, ఆ తర్వాత అనంతత్వశక్తిని సాధించాలి. మానసికమైన, పాక్షికజ్ఞానం నుంచి పరిపూర్ణదీప్తి వెను కగల దివ్యదర్శనాన్ని సాధించాలి.

ఇది సాధించిననాడు దివ్యమానవు డవుతాడు. అదే మానసికస్థితి నధిగమించిన అతిమానసానికి యెదుగుదల. దానిని దివ్యమానసమంటావో? దివ్యజ్ఞానమంటావో?



అతిమానసమంటావో? ఏ పేరుతో నైనా పిలువు. కాని అదే దైవేచ్ఛయొక్క దివ్య శక్తి, దివ్యదీప్తి, దివ్యచైతన్యం. అతిమానసం చేత లోకాలలో ఆధ్యాత్మికశక్తి తనని తాను సృష్టించుకొని చూసేడు. దాని ప్రభావం చేతనే అతడు తను సృష్టించిన దానిలో జీవించి పరిపాలిస్తున్నాడు. అందుచేతనే అతడు సర్వసామ్రాట్టుగాను, స్వపరిపాలకుడుగాను అయ్యాడు.

అతిమానసమే దివ్యపురుషుడు. అందుచేత సాధారణ మానసికస్థాయిని మించిన స్థితికి యెదగాలి.

దివ్యమానవుడిగా జీవించడమే దివ్యజీవనం. దేవత కావడం. ఈ దేవతలే పర మాత్మశక్తులు. మానవజాతిలో పరమాత్మ శక్తిగా వుండు.

పరమాత్ముని హృదయంలో స్థిరనివాస మేర్పరచుకొని ఆ చైతన్యంలో ఆనం దాన్ని మేళవించి ఆత్మజ్ఞానంతో సంకల్పాన్ని ముడిపెట్టే తత్వం నీ కలవడాలని, అది నీతో ఆటలాడుకోవాలని, నీ ద్వారానే, అది బహిర్గతం కావాలనే అర్థాన్ని స్ఫురింపజేసే అతిబలసంపన్నుడి రూపమిది.

'ఘనగిరిపై' వుంటున్న నీవు యిలా రూపాంతరం చెందడానికి కారణం, నీలోని మాధవుని, కనిపెట్టాలన్న తపనే. నిన్నే చరాచరసృష్టిలో చూచుకొని నీ మర్మాన్ని బయటపెట్టాలనే భావం ఈ అన్వేషణకు మూలకారణం. ఆయనలోనే వుంటూ, ఆయన అనుగ్రహించిన వెలుగులోనే ప్రకాశిస్తూ, ఆయన అధికారంతోనే ఆయన కనుసన్నలలో మెలగుతూ, ఆయన కటాక్షంతో లభ్యమయ్యే బ్రహ్మానం దంలో మునిగిపో. నీవు అగ్నిహోత్రుడై భాసించాలి. సూర్యుడై వెలుగుల్ని విరజి మ్మాలి. సాగరమై సంతోషాంతరంగుడివి కావాలి. ఆ సంతోషమంతా నీదే. ఆ గొప్పతనం కూడా నీకే దక్కాలి. ఆ సౌందర్యాన్ని కూడా నీవే కైవశం చేసుకోవా లి.

ఎప్పుడైతే, యిందులో ఏ కొంతైనా నీవు సాధించగలుగుతావో, అప్పుడే, దివ్యమానవుడు కావడానికి ప్రేరకమైన తొలిమెట్లు నీకు లభ్యమౌతాయి.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి, బి.యస్. రాఘవ

(*SABCL* Vol. 17, pp. 74-75)

సాధకులకు పుట్టినరోజు సందేశాలు

(శ్రీమాత ఎంతోమందికి సంక్షిప్తంగా వ్రాసిన పుట్టినరోజు సందేశాలలో మచ్చుకి కొన్ని)

నా ప్రియమైన బిడ్డా, సంవత్సరమంతా నా ప్రేమాశీస్సులు నీకు ఉంటాయి. అవి నీకు నీ దివ్యలక్ష్యసాధనా పురోగతికి మార్గదర్శక మయేందుకు సహకరిచు గాక!

*

భగవంతునికి, ఇతోధికంగా మరింత శ్రేయోదాయకంగా, నిన్ను నీవు అర్పణ కావించుకునేందుకు ఈ నీ పుట్టిన రోజు నీకు ఒక అవకాశమగు గాక. నీ భగవద ర్పణ మరింత పరిపూర్ణము, నీ భక్తి మరింత ఉత్సాహభరితము, నీ ఆకాంక్ష మరింత తీవ్రము — అగు గాక.

దివ్య నవకాంతికి ఉన్మీలుడవు అయి హర్షాతిరేకంతో ఈ మార్గంలో ముంద డుగు వెయ్యి.

ఇది ఇలానే కొనసాగాలని ఈ రోజు నిర్ణయించుకో. ఈ రోజు వృధా కాబోదు.

*

రవంత ఆచరణకి, కొండంత సిద్ధాంతాల కంటె విలువ.

ఓ ప్రభూ! నా యీ జన్మదిన వార్షికోత్సవ దినమున, నా అవగాహన శక్తి నన్ను నేను సమగ్రంగా రూపాంతరీకరించుకునే శక్తిగా మారేలా అనుగ్రహించు.

*

శుభ జన్మదినం. ఒక నవచేతన లోనికి నీ కొక కొత్త జన్మ కూడా. అల్పమైన వ్యక్తి గత ప్రతిచర్యల కతీతంగా, మనగలుగుతావు. ఎందుకంటే నీ హృదయంలో ఎప్పుడూ దైవం యొక్క ఉనికిని సంవేదిస్తూనే ఉంటావు. అది నీ అవరోధాలను, కష్టాలను, అల్పత్వాలను అధిగమింపచేయగలిగే శక్తిని ప్రసాదించు గాక!

ప్రేమ, ఆశీస్సులతో —

*

నీ చేతన, కర్మల నుంచి సర్వమూ వికృతపరిచే, తగ్గించే, అస్పష్టపరిచే, తుదకు నీ ప్రగతిని అవరోధపరిచే, ఆరోగ్యానికి హాని కలిగించే వాటి నన్నిటినీ నీ నుంచి

పారద్రోలేందుకు పునరుజ్జీవింపబడిన దృఢసంకల్పంతో — నీ వొక నవజీవనానికి నాంది పలకాలి, ఈ నీ నూతన సంవత్సర శుభారంభవేళ.

అంతరంగ వికాసం కోసం, స్వచ్ఛత కోసం నీ కృషిలో నిన్ను ఆదుకుని నీకు సహకరించేందుకు నా శక్తి, ఆశీస్సులు నీకు తప్పక ఉంటాయి.

*

నిరాటంకంగా రాత్రింబవళ్లు దివ్యసాక్షాత్కారము అక్కడ ఉంటుంది. అది చాలు నిశ్శబ్దంగా ఆంతర్యం లోనికి మళ్లటానికి. అది మేము కనిపెట్టాము. ఈ సంవత్సరం, నీదే ఈ అనుభవము అగు గాక.

ప్రేమాశీస్సులు నా ప్రియమైన బిడ్డకు.

*

అన్ని సమయాలలో నీవు మందస్మిత వదనారవిందంతో ఉండగలిగే శక్తి ఈ సంవత్సరము నీకు అందించు గాక. సూర్యరశ్మి మేఘాలను చెదరగొట్టేస్తుంది. అలాగే ఓ చిరుమందహాసం కష్టాలను చెల్లాచెదురు చేస్తుంది.

నా ప్రేమ, ఆశీస్సులతో

*

నా ప్రియమైన బిడ్డా! ఇదిగో ఇదీ ఈ సంవత్సరానికి నీ కార్యక్రమం. నీ సర్వోన్నత చైతన్యానికి చుట్టూ నీ సత్వమును ఏకీకృతం కావించు. మనసు క్రమరహితంగా వ్యవహరించనీయకు. సందేహంతో విశృంఖలంగా సరదాగా ఆడుకోకు. అదొక విషం. నెమ్మదిగా నెమ్మదిగా జీవాత్మను హరింపచేస్తుంది.

నా ప్రేమ, ఆశీస్సులతో —

— శ్రీమాత

*

నీ అంతరంగ ప్రగాఢ ఆకాంక్షకే ఎప్పుడూ ప్రాముఖ్యత నియ్యి. అది హృదయంలో గాఢతని, స్థిరత్వాన్ని పాదుకొలుపుతుంది. హృదయంలో వికసితమైన ప్రేమ ఆకాంక్షలతో ప్రాణిక మానసికస్థాయి అవరోధాలు వాటంతటవే వైదొలగి పోతాయి.

*

సుస్పష్టమైన విషయపరిజ్ఞానం, అంతరంగ ఆత్మదర్శనం, విధేయమై ఉండే అహం,

ప్రేమ, అంకితభావంతో నిస్వార్థకర్మలు, అత్యంత శ్రద్ధ — యోగరథానికివి నాలుగు చక్రాలు. ఇవి కలిగి ఉన్నవాళ్లు సురక్షితంగా యోగమార్గంలో ప్రగతి సాధిస్తారు.

శ్రీఅరవిందులు

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

జీవితంలో ఎన్నడూ మరువరానిది

1969 లో తన పుట్టినరోజు సందర్భంగా నిరోద్బరన్ శ్రీమాతకు వ్రాసిన ఒక ఉత్తరంలో అంటారు: "రేపు నా పుట్టిన దినమని బహుశా మీకు తెలియదనుకుంటాను. నా కేమి కావాలని మీరు నన్ను అడుగుతున్నట్లు సుధ కలగన్నది. జీవితంలో నేను యెన్నడూ మరువలేనిది ఏదైనా కావాలని కోరి ప్రార్థిస్తున్నాను."

శ్రీమాత సమాధానం: రేపు నీ పుట్టినరోజు అని నాకు తెలుసు. నా లిస్టులో నీవు ఉన్నావు. ఉదయం 9 గం. లకు రా. నీ వెన్నడూ మరిచిపోనిది ఏదో కావాలని అడిగావు:

"దైవముపై నమ్మకం."... ఇదెలా ఉంటుంది?

ప్రేమాశీస్సులతో
శ్రీమాత

మరుసటి ఉదయం తను ఆమె దగ్గరికి వెళ్లినపుడు కార్డుల రూపశిల్పి, చంపక్ లాల్ తయారుచేసిన దివ్యోపేతమైన కాగితం మడత ఒకటి నాకు ఇచ్చారు. అందు ఫ్రెంచి భాషలో అందమైన ఆమె చేవ్రాతలో —

"నిరోద్బర్నుకి జన్మదిన శుభాకాంక్షలు —
దైవంపై పరిపూర్ణ విశ్వాసం కలిగి ఉండాలని —
ప్రేమాశీస్సులతో"
శ్రీమాత

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

సహారాటికిరా (ఒరిస్సా) లో శ్రీఅరవిందులకు (పవిత్ర అవశేషాలు) రాజలాంఛనాలతో ఘనస్వాగతం

మహాయోగి శ్రీఅరవిందుల పవిత్ర అవశేషాలు (అస్థికలు కాదు — దేహాంశాలు) సహారాటికిరాకు (ఒరిస్సా) అరుదెంచిన సందర్భంగా ఆ ప్రాంతంనుంచి దాదాపు 10 వేలమంది ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనస్వాగతం పలికారు. ఒరిస్సా ప్రభుత్వం ఆ మహనీయునికి రాజలాంఛనాలతో స్వాగతం పలికింది.

ఈ పవిత్ర అవశేషాల పేటికను శ్రీఅరవిందాశ్రమ అంతేవాసి శ్రీ అద్దేపల్లి గాంధీ నుండిశ్రీ గొడవర్తి సూర్యనారాయణ (అరో-సత్సంగ కేంద్రం) స్వీకరించి మండపంలో ప్రతిష్టించారు.

అంతకు ముందు 12 కి.మీ దూరంలో నేషనల్ హై-వే – 6 నుండి శ్రీమాత పతాకాలు రెపరెపలాడుతుండగా వందకు పైగా మోటారు సైకిళ్ళతో ఎదురేగి దాదాపు 50 మోటారు కారులతో అరుదెంచిన శ్రీఅరవిందుల కాన్వాయ్‌కి స్వాగతం పలికారు. సహారాటికిరా నుండి బ్రాహ్మణపడా వరకు 70 మంది పుణ్యాంగనలు పసుపుకుంకుమ దుస్తులు ధరించి కలశాలను తలపై నిడుకొని ఎదురేగి హృదయపూర్వక స్వాగతం పలికి ఊరేగింపుకు అగ్రభాగాన నడిచారు. వారి వెనుక వందలాది శ్రీఅరవింద ఇంటిగ్రల్ స్కూల్ బాలబాలికలు అందమైన యూనిఫారాలతో 'వందేమాతరం' నినాదాలతో కదం తొక్కుతూ నడిచారు.

ఈ సందర్భంగా ఏర్పాటైన బహిరంగ సభకు శ్రీ బి. వెంకట్రామయ్య IAS రిటైర్డ్) తిరుపతి అధ్యక్షత వహించారు. శ్రీ కొంగర భాస్కరరావు (తెనాలి, ఆం. ప్ర); మాజీ రాష్ట్రమంత్రి మరియు పార్లమెంటు సభ్యులు శ్రీ వల్లభ పాణిగ్రాహి, శ్రీ రమేష్‌చంద్ర సాహు ప్రసంగించారు.



అఖిల

అఖిల భారత పత్రిక

ఏప్రిల్ 2010

శ్రీఅరవిందులు - క్షణదర్శనములు

మొదటి భాగము

4.4.2009 — 4.4.2010

శ్రీఅరవిందులు పాండిచ్చేరి చేరుకుని నూరు వసంతాలు నిండిన సంవత్సరము.

19.9.2009 — 19.9.2010

శ్రీఅరవింద సొసైటీ స్వర్ణోత్సవ సంవత్సరం.


విషయసూచిక

దేవుని పాదముద్రలు

దివ్యజన్మ మార్మికత	3
అదిగో! కాంతి పుట్టింది	5
దివికి భువికి మధ్య వారధి	8
ఆనందంగా త్యాగం	11
నిర్వాణము — ఆ పై స్థాయి	19
వాసుదేవ మిదం సర్వం	24
విప్లవ యోగి	25
అవ్యక్త నూతన దిశగా ప్రయాణం	28
తపో గుహ.	30
కాంతికిరణాలు	36
సమాచార పత్రం	38

ప్రతి అంశంలోను చర్మ చక్షువులకు వినిపించని ఒక లయ ఉంటుంది. ఆ లయబద్ధంగానే విషయాలు తమ ఉనికిని చాటుకుంటూ ఉంటాయి.

శ్రీఅరవిందులు



1. దివ్యజన్మలోని మార్మికత

పరమాత్ముని ప్రయాస

ఎవరు స్వర్గలోకాలను యీ భూమిపై ఆవిష్కరింపబూనుతారో, వారు స్వయంగా మానవశరీరం ధరించి, ఐహిక భారాలను భరించి, బాధాత్వదారులలో నడవాలి.

దైవాన్ని బలవంతంగా ఒప్పించి క్షుద్రభూమికి దిగివచ్చాను. అజ్ఞానంతో అలమటిస్తూ, కష్టాలను ఓరుస్తూ, జననమరణాల మధ్య పరిభ్రమిస్తూ, ఒక మానవునిగా పరిణతి పొందాను.

రోత గొలిపే మలిన పంకిలాల మధ్య దివ్య చైతన్య స్రవంతి ఒక సుశ్రావ్యగీతంగా సాగిపోవుటకై నిడువైన, లోతైన చాలు నొకదానిని త్రవ్వుతున్నాను. అమరమగు ఆత్మజ్యోతికి గూడు నొకదానిని ఏర్పరుస్తున్నాను.

అవతారము: రెండు విధాలుగా కనిపించేది

అవతారము సర్వదా దివ్యత్వానికి మరియు మానవత్వానికి చెందిన ఒక దివ్యఘటన. దైవమే స్వయంగా మానవ ప్రకృతిని దాని బాహ్య పరిమితులతోపాటు స్వీకరించి, వాటిని దివ్యచైతన్యానికి మరియు దివ్యశక్తికి అనువైన పరిస్థితులుగాను, సాధనాలుగాను, ఉపకరణాలుగాను మలచుకొంటారు. దివ్యజననానికి మరియు దివ్య కార్యాచరణకు నెలవైన పాత్రగా చేసుకుంటాడు. కాని, ఈ కార్యమంతా ఎంతో పకడ్బందీగ జరుగవలసి వుంటుంది. అలా కానట్లయితే అవతార ఆవిష్కరణ యొక్క లక్ష్యము నెరవేరదు; ఎందుకనగా, ఎన్నో పరిమితులతో కూడుకొనివున్న మానవజన్మను, దివ్యజననానికి మరియు దివ్యకార్యాచరణకు సాధనముగాను, ఉపకరణముగాను చేయవచ్చునని నిరూపించుటయే ఆ లక్ష్యము యొక్క ధ్యేయము కనుక.

*

ఇదంతా కూడ మానవమాత్రునిలో సైతము దైవము స్వయం వ్యక్తమయ్యే వీలున్నదని ప్రామాణికంగా నిరూపించినట్లయితే, దానిని మానవుడు తెలుసుకోగలిగి ఆ దిశగా ఎదిగే సాహసం చేయుటకు ఉద్యుక్తుని గావించుటకని చెప్పవచ్చు. అంతేగాక, ఆ విధంగా అభివ్యక్తమైనదాని యొక్క ప్రభావము ఇహలోకపు ప్రకృతి యందు ప్రకంపిస్తూ

నిలవాలని, ఊర్ధ్వదిశగా సాగే దాని ప్రయత్నం పై దాని అంతరాత్మ నియంత్రణ కలిగి వుండాలని, దీనికి తోడు దివ్యపురుషత్వ పరమగు ఆధ్యాత్మిక మూస నొకదాని ని సమకూర్చి, దానిలో అన్వేషణాయత్తమైన మానవ జీవాత్మ ఇమిడిపోయే వీలు కలిగి వుండాలని.

*

మొదటి నుండి మనము భౌతికంగా అతిమానస చైతన్యమునందు మనుగడ సాగించినట్లయితే మన దరిదాపులకు ఎవ్వరూ రాగలిగేవారు కారు. ఎలాంటి సాధన జరిగి వుండేది కాదు. మనకు ఈ భూమికి ఇతర మనుషులకు మధ్యన పరస్పర సంబంధం ఏర్పడే ఆశ అసలుండేది కాదు.

శ్రీఅరవిందులు

*

ఈ భూమి యొక్క చరిత్ర ప్రారంభమైనప్పటి నుండి అన్ని కాలాలలోను శ్రీఅరవిందులు ఏదో ఒక రూపంలో ఏదో ఒక పేరుతో ప్రధానమైన ప్రాపంచిక పరివర్తనలపై ఆధ్వర్యము వహించారు.

శ్రీమాత

*

భూమిపై పరమాత్మ జననం:

శ్రీఅరవిందులు గడచిపోయిన కాలానికి గాని, చరిత్రకు గాని చెందినవారు కారు. శ్రీఅరవిందులు విస్పష్టంగా అభివ్యక్తమగుటకు అడుగులు వేస్తున్న దివ్యభవిత.

*

ప్రపంచ చరిత్రలో శ్రీఅరవిందులు దేనికి ప్రాతినిధ్యం వహించారంటే, ఒక ఉపదేశానికి కాదు. ఒక దైవాంశ ప్రకటనకు కూడ కాదు; అది పరమేశ్వరుడి నిష్కర్షమైన చర్య.

*

శ్రీఅరవిందులు పరమాత్మనుండి భువి పైకి అరుదెంచినది, ఒక విశిష్టజాతి, ఒక వినూత్న ప్రపంచము, దివ్యచైతన్యము అభివ్యక్తమౌతాయని ప్రకటించుటకు.

*

ప్రశ్న: ప్రపంచ చరిత్రలో శ్రీఅరవిందుల జననము "శాశ్వత" మని మీరు

వక్కాణించారు. "శాశ్వత" మనుదాని యదార్థ భావమేమి?

సమా: ఈ అభిప్రాయాన్ని నాలుగు ఉన్నత స్తరాలకు చెందిన చైతన్యానికి అనుగుణంగా, నాలుగు భిన్న రీతులలో అర్థం చేసుకోవచ్చు:

1. భౌతికంగా, ఈ జన్మయొక్క పర్యవసానము ప్రపంచానికి ఒక శాశ్వత ప్రాముఖ్యతను కలిగి వుంటుంది.

2. మానసికంగా, విశ్వచరిత్ర స్మృతిపథంలో ఈ జన్మ శాశ్వతంగా నిలిచిపోయేదిగా వుంటుంది.

3. మనోవిజ్ఞానపరంగా, భూమిపై తరతరాలకు ఈ జన్మ పునరావిర్భావం అవుతుంది.

4. ఆధ్యాత్మికంగా, ఇది భూమిపైన దైవ ఆవిర్భావము.

మూలం: శ్రీమాత

అనువాదము: అందుగులపాటి కైలాసపతి, జానకి

2. అదిగో కాంతి పుట్టింది

మెరుపు వీర కిశోరుడు

ఉజ్జ్వల వేగంతో, అగ్ని పాదాలతో
అవనికి అవతరించాడొక మెరుపు వీర కిశోరుడు.
ఒక గర్భంలో వెలుగు జన్మించింది,
మేఘగర్జన శక్తిగా మారి
మానవాకారం ధరించింది.
స్వర్గ ప్రశాంత, మాధురీ మహత్వం,
వినిర్మల ఆకాంక్ష, రెక్కలు దాల్చిన మహాశక్తి
భువికి అధిరోహించింది.
సర్వదేవతలు మృణ్మయ దేహంలో మెరిసారు.
ఒకే దివ్యనామం ధరించారు.

*

కాంతి

(పదకొండో యేట, 1883 లో వ్రాసినది)

తొలి చీకటి గర్భం నుండి సూర్యుడు
ప్రభవించాడు శ్యామలమై, నగ్నమై,
నా సువర్ణ కేశజాలంతో ఆయన కోసం
పట్టు పీతాంబరం అల్లాను.

స్వర్గ విమోచనా ప్రణాళిక కాంతి దూతల
వీక్షణంలో నేను మెరవగానే,
మహోదయం గూర్చి మంత్రగానం చేస్తున్న వేళ,
జగద్రక్షకుడు అవతరించాడు —
బహిష్కృత మానవజాతికి ఆనందోత్సవ హేల

సంపన్నులకు, నిరుపేదలకు
సమాన వరాలు కురిపిస్తాను.
ధర్మ, అధర్మవర్తనులపై అవరోహిస్తాను.
అంధుల అశ్రు జలరాశిలో, చీకటి తెరలలో
నా చిరుదరహాసం వికసిస్తుంది.
ఒక స్నేహితుని అమృతహాసం వెల్లివిరుస్తుంది.

నా మహిమోజ్వల సాన్నిధ్యం
భువిపై అంతటి ఆనందం కలిగిస్తే,
అది కొన్ని క్షణాలే కావచ్చు —
అమర దేవతల స్వర్గధామంలో
ఎన్నెన్ని దీప్తుల విద్యున్మాలికలు...
దైవం దివ్యహాసంతో నిరంతరం జ్యోతిర్మయం!

*

ప్రపంచంలో సంక్షోభాలు, మహనీయి విప్లవ పరిణామాలు సంభవించగలవని, ఆ సమయంలో తను దైవనిర్దేశిత పాత్ర వహించవలసి వుంటుందని పదకొండు సంవత్సరాల ప్రాయంలోనే శ్రీఅరవిందులు గ్రహించారు. ప్రస్తుతం (ఇంగ్లండు నుండి తిరిగి వచ్చిన కొన్నాళ్లకు) ఆయన దృష్టి మళ్లింది. తన మాతృదేశ విముక్తికి పాటుపడాలన్న భావన ఆయనలో గట్టిపడింది. మరి నాలుగు సంవత్సరాలు ముగిసే నాటికి ఆ 'దృఢ నిర్ణయం' పూర్ణ ఆకృతి ధరించింది. ఈ నిర్ణయం కేంబ్రిడ్జికి వెళ్లినప్పుడు ఆయన తీసుకున్నారు. అక్కడ ఇండియన్ మజ్లిస్ కార్యదర్శిగా ఆయన విప్లవాత్మక ఉపన్యాసాలు నిప్పురవ్వలుగా కురిపించారు. అందువల్ల ఇండియన్ సివిల్ సర్వీసు నుండి అధికారులు ఆయన్ని తొలగించినట్లు తరువాత ఆయనకు తెలిసింది. గుర్రపు స్వారీలో విఫలమైనారన్నది కాకతాళీయం మాత్రమే. ఇండియాలోనే ఈ లోపాన్ని సరిదిద్దుకోడానికి ఇతర సంఘటనలచే ఆయనకు అవకాశం ఇవ్వబడింది.

మూలం: శ్రీఅరవిందులు

సరస్వతి

శతపద్మ విరాజిత సురలోకం నుండి
సరస్వతి పిలిచింది.
సతతం మంచు కురిసే శ్వేతసీమలకు
నన్ను రమ్మని పిలిచింది
అచ్చటనే దక్షిణ సాగరం వైపు
మందాకిని మందగమ్యమై సాగిపోతుంది.
ఆ హిమతీరాలలో సుందర సుధామయ
పారిజాతాలు విరిసి హసించె

(శ్రీఅరవిందులు 1892 లో వ్రాసిన కవిత)

(పదేళ్ల ప్రాయంలో శ్రీఅరవిందుల్ని ఆయన తండ్రి చదువు నిమిత్తం ఇంగ్లండ్ కు పంపారు. విద్యావ్యాసంగాన్ని పూర్తిచేసుకుని శ్రీఅరవిందులు 1893 ఫిబ్రవరిలో 21 వ ఏట ఇండియాకు తిరిగి వచ్చారు.)

అనువాదం: యజ్ఞన్న

4 దివికి భువికి మధ్య వారధి

లౌకిక — పారలౌకిక ప్రపంచాలు

నేను ఇండియా వచ్చినప్పటి నుంచి, నా జీవితము, నా యోగము ఏ ఒక్క లోకానికో సంబంధించినవిగా కాక, ఇహ, పర లోకాలకి రెంటికీ సంబంధించినవిగా ఉంటూ వచ్చాయి. మానవుల అభిరుచులన్నీ ఐహిక ప్రపంచానికి సంబంధించినవే అనుకుంటాను. వాటిలో రాజకీయాల్లాంటివి నా మనోభూమికలో చాలా వరకు చేరాయి. అయితే ప్రప్రథమంగా, బొంబాయిలోని అపోలో బందర్లో మాతృభూమిపై కాలు పెట్టినప్పటి నుంచి నాకు ఆధ్యాత్మిక అనుభవాలు కలగటం మొదలయాయి. అయితే ఈ ఆధ్యాత్మిక అనుభవాలు వ్యావహారిక ప్రపంచంతో సంబంధం లేనివి అనే భావన కల్గించలేదు. సరి కదా, అంతరంగంపై, అనంత ప్రభావాన్ని చూపాయి. దానివల్ల ఈ పదార్థ ప్రపంచంలో అనంతత్వం సర్వవ్యాప్తమై ఈ భౌతిక ప్రపంచంలోని ప్రతి వస్తువులో, ప్రతి ప్రాణిలో ఉన్నట్లుగా అర్థమైంది. ఎందుకంటే సర్వమూ పరబ్రహ్మమే. సర్వత్రా దైవాన్ని దర్శించాను.

కొన్ని ప్రారంభ అనుభవాలు — అద్భుత సూర్యోదయ కాంతులు

శ్రీఅరవిందులకు కొన్ని ఆధ్యాత్మిక అనుభవాలు కలిగినాయి. కాని ఆ అనుభవాలన్నీ ఆయనకు యోగం గురించి ఏమాత్రం తెలియనప్పుడు కలిగినవే. ఉదాహరణకి ఆయన చాలా ఏళ్ళ తరువాత బొంబాయిలోని అపోలో బందర్లో మాతృభూమిపై కాలు పెట్టినపుడు, ఓ సువిశాల నిశ్చల ఆధ్యాత్మిక ప్రశాంతత ఆయనను ఆవరించింది. (ఆ ప్రశాంతత చాలా రోజుల వరకు వారిని వీడలేదు). మరో అనుభవం కాశ్మీరులోని తక్తీ-సులేమాన్ (Takhti-Suleman) కొండపై నడుస్తున్నప్పుడు, అనంత శూన్యస్థితి యొక్క సాక్షాత్కార అనుభూతి కలిగింది. మరో అనుభవం నర్మదాతీరంలోని కాళికాదేవి ఆలయంలోని దేవియొక్క నిజరూప దర్శనం. మరో అనుభవం బరోడాలో ఉన్నప్పుడు మొదటి సంవత్సరంలో వారి గుర్రబ్బండి ప్రమాదానికి గురి అయినప్పుడు. అంతర్గత దివ్యశక్తి పైకి పెల్లుబికి ఒక్క తృటిలో ప్రమాదం తప్పించడం ఆయన పొందిన మరో దివ్యానుభవం. అయితే ఈ ఆధ్యాత్మిక అనుభవాలు హఠాత్తుగా, అప్రమేయంగా, అనుకోకుండా వాటంతట అవే సంభవించాయి. అవి

ఆయన సాధనలో భాగం కాదు.

ప్రశ్న: ఆ తరువాత మీరు గుజరాతులో ఉండగా యోగం ప్రారంభించలేదా?

అవును. అయితే లండన్‌లో ఉన్నప్పుడే దానికి అంకురార్పణ జరిగింది. ప్రథమంగా అపోలో బందర్ లో మాతృభూమిపై కాలు పెట్టినపుడు, ఆ అంకురం మొలకెత్తింది. బరోడాలోని మొదటి సంవత్సరంలో నా వాహనానికి ప్రమాదం సంభవించినప్పుడు అది వికసించింది.

మూలం:శ్రీఅరవిందులు

అనువాదం: డి. సత్యవాణి

అంతరంగంలోనుంచి దివ్యత్వం ఉప్పొంగే దృశ్యం

నా తల పైభాగాన కనబడినదొక శిరసు
నిత్యనిశ్చలత్వంతో కూడిన ముఖం
తన సర్వసార్వభౌమాధిపత్య విశాల ఆవరణలో
సమగ్ర శక్తివంతమైన చూపు — తీక్షణం — కనిపించేదానిని కట్టిపడవేసినది.
ఎండలో గాలిలో తూగాడే కురులు
లోకం ఆయన యెదలోనే ఉన్నది ఆయన (యెవరో కాదు) నేనే!
(బరోడాలో గుఱ్ఱపు బగ్గీ మీద వెడుతూన్నప్పుడు జరిగిన ప్రమాదప్పుడు శ్రీఅరవిందుల అనుభవం — వారి గీతం The Godhead లోనిది)

*

విశ్వమాత సాక్షాత్కార దృశ్యం

(గుజరాత్ కర్నాలిలో శ్రీఅరవిందులకు కలిగిన అనుభవాన్ని The Stone Goddess కవితలో వ్యక్తం చేశారు.)

ఓ పవిత్ర నదీతీరాన కాళీ దేవాలయం ముందు నిల్చుని ఏది దర్శిస్తావు? ఒక శిల్ప కళావైభవం. మళ్లీ అంతలోనే తెలియకుండానే ఏదో మాయగా అందుకు బదులు ఏదో, అక్కడ ఒక అస్తిత్వం; దివ్యశక్తి, నీ కళ్లలోకి చూసే ముఖవైఖరి — నీ అంతర్లోచనం విశ్వమాతను సభక్తికంగా భావిస్తుంది.

*

Shore Ghandes

ఒక దేవపురి. అందొక చిన్న దేవాలయం.
దైవము శిల్పాకృతిలో చూచినది నన్ను
ఒక సజీవ మృత్యురహిత దివ్యసాక్షాత్కారము
ఒక దివ్యరూపం — అమరం — అనంతానికి ఆశ్రయం
మహనీయమైన లోకమాత, బ్రహ్మాండమైన ఆమె ఇచ్ఛాశక్తి
గాఢసుషిప్తిలో ధరిత్రి నిండా వసించి యున్నది
ఉలుకదు పలుకదు సర్వేశ్వరి అంతు చిక్కదు
ఎడారి భూమ్యాకాశాగాధాల్లో — అంతటా నిశ్శబ్దం

*

లెక్కకు మించిన మెట్ల వరుస పైకి నడిచాక
కొండపై చూశాను సూర్యకాంతిలో
శిలాగృహంలో నిశ్చల శిలాదేవతను
ఏకాంత ధ్యానాకృతిలో.

ఆమె నక్కడ దేశకాలాల ఆధిపత్యాని కందని ఊర్ధ్వలోకాన
నిలిపిన హస్తాలు మహా మహి మోపేతమైనవి.
సజీవ నిశ్చల స్వచ్ఛ ఏకాంత శూన్యపరమాత్మ
తన నిరవధిక నిగూఢ స్వస్వరూపాన్ని వెల్లడి చేసినది.

(పూణె దగ్గర పార్వతీ కొండలపై తమకు కలిగిన అనుభూతిని శ్రీఅరవిందులు — The Hill-Top-Temple — కవితలో వ్యక్తీకరించారు.)

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

2. ఆనందంగా త్యాగం

అహాన్ని పరిత్యజించే సర్వసంగ పరిత్యాగి; ఆదర్శప్రాయుడు

(దినేంద్రకుమార్ రాయ్ స్మృతులు)

అరవిందో ఎప్పుడూ డబ్బును లెక్కచేయలేదు. నేను బరోడాలో ఉన్నప్పుడు, ఆయనకి చెప్పుకోతగినంత మంచి జీతమే వచ్చేది. ఆయన ఒంటరిగా ఉండేవారు. ఆయనకి ఏ విలాసజీవితమూ తెలియదు. అంతకు మించి దుబారా అసలే తెలియదు. కాని ప్రతి నెలా చివరలో అతని దగ్గర చిల్లుకానీ సైతం ఉండేది కాదు.

మాట్లాడేటప్పుడు అరవిందో మనసారా నవ్వేవారు.... ఆయనకి ముస్తాబు చేసుకునే అలవాటు లేదు. రాజదర్బారుకు వెళ్లేటప్పుడు కూడా ఆయన తన సాధారణ దుస్తులను మార్చుకోవడం నేనెప్పుడూ చూడలేదు. చాలా ఖరీదైన చెప్పులు, చొక్కాలు, టైలు, కాలర్ చొక్కాలు, మేలిరకం ఉన్ని చొక్కాలు, భారీ చొక్కాలు, రకరకాలైన కోట్లు, దొర టోపీలు, గుడ్డ టోపీల లాంటివేమీ ఆయనకి లేవు. నేనెప్పుడూ ఆయన దొర టోపీ వాడగా చూడలేదు.

ఆయన వేసుకునే దుస్తులు మాదిరిగానే, అతని పడక కూడా అతి సాధారణమై, సాదాగా ఉండేది. ఆయన వాడే ఇనుప మంచం ఎటువంటిదంటే ఒక చిన్న గుమాస్తా కూడా దాని మీద పడుకోవడానికి ఇష్టపడడు. ఆయన లావుపాటి మెత్తటి పరుపు వాడేవారు కాదు. ఎడారికి బరోడా చాలా దగ్గరలో ఉండటం మూలంగా వేసవి చలి కాలాలు రెండూ ఉధృతంగా ఉంటాయి; కాని అంతటి జనవరి నెల చలిలో కూడా ఆయన రజాయి వాడగా నేనెప్పుడూ చూడలేదు. చౌకైన సర్వసామాన్యమైన గొంగళే ఆయనకు సరిపోయేది. నేను ఆయనతో గడిపినంత కాలం, నాకు ఆయన అహాన్ని పరిత్యజించిన సర్వసంగపరిత్యాగి అయిన ఒక సన్యాసి (ఏకాంతవాసియైన తపస్వి), కఠోర నియమాలు ఆచరిస్తూ, ఇతరుల కష్టాలకు తీవ్రంగా చలించిపోయే వారుగా కనపడేవారు. జ్ఞానసముపార్జనే ఏకైక జీవితలక్ష్య మయినట్లుగా తోచేది. ఆ లక్ష్యాన్ని సఫలీకృతం చేసుకోడానికి చైతన్యవంతమైన ప్రాపంచిక జీవితపు కోలాహలం, రణగొణ ధ్వనుల మధ్య అతను తనను తాను తీవ్రమైనటువంటి సంస్కారవంతమైన శిక్షణతో నియంత్రించుకునేవారు.

అరవిందో మధ్యాహ్న భోజన సమయంలో న్యూస్ పేపర్లు చదివేవారు. మరాఠీ ఆహారం నేను ఇష్టపడేవాణ్ణి కాదు, కాని అరవిందో దానికి అలవాటు పడ్డారు. ఒక్కొక్కప్పుడు భోజనం ఎంత అధ్వాన్నంగా ఉండేదంటే నేను ఒక్క ముద్ద కూడా తినగలిగేవాడిని కాదు, కాని ఆయన మామూలుగానే తినేసేవారు. ఆయన వంటవాడి మీద చిరాకుపడటం నేనెప్పుడూ చూడలేదు. ఆయనకి బెంగాలీ వంటకాల మీద ఒక రకంగా మక్కువ ఉండేది.... ఆయన తీసుకునే ఆహారం చాలా తక్కువ; అదీ ఎందువల్లనంటే ఆయన మితంగా తినే అలవాటు వల్లను, ఆత్మసంయమన అభ్యాసం వల్లను. దాని ఫలితంగానే ఆయన ఎంత మానసిక పరిశ్రమనైనా సమర్థవంతంగా తట్టుకోగలిగేవారు. తన ఆరోగ్యం గురించి ఎంతో జాగ్రత వహించేవారు.... ప్రతి రోజూ సాయంత్రం ఒక గంట సేపు వరండాలో ఆ చివరి నుంచి ఈ చివరి వరకూ వడివడిగా నడుస్తూ ఉండేవారు. ఆయనకి సంగీతం అంటే ఎంతో ఇష్టం. కాని ఆయనకి పాటలు పాడటం కాని, ఏ వాయిద్యం వాయించటం కాని తెలియదు.

ఆయనకి వ్యావహారిక జ్ఞానం చాలా తక్కువ అవటం మూలంగా, ఎక్కువగా మోసగించబడేవారు. కాని ధనం మీద ఏమాత్రం వ్యామోహం లేకపోవడంవల్ల, మోసగించబడ్డా చింతించేవారు కాదు. బరోడాలోని అన్ని వర్గాలవారికి అతను తెలుసును, వారందరికి ఆయనంటే చాలా గౌరవం.... బరోడాలో విద్యాధికులైనవారు వారి అసాధరణ ప్రతిభాశక్తులకు తమ మనస్సులలో ఆయనకు ఎంతో ఉన్నతస్థానాన్ని ఇచ్చారు. బరోడా విద్యార్థులు ఆయనను దేవుడిలాగా భక్తిప్రపత్తులు చూపిస్తూ పవిత్రంగా భావించేవారు. బ్రిటిషుజాతికి చెందిన కాలేజి ప్రిన్సిపలు కంటె ఈ బెంగాలీ ఆచార్యుడంటేనే వారికెంతో గౌరవం, విశ్వాసం. వారు అతని బోధనా పటిమకు ముగ్ధులయేవారు.

అరవిందో ఎప్పుడూ కష్టసుఖాలకు, జయాపజయాలకు, పొగడ్తలకు, తెగడ్తలకు ఉదాసీనంగా ఉండేవారు. కష్టాలన్నింటిని ఆయన ఎంతో ఓర్పుతో చెక్కుచెదరని మనస్సుతో భరించేవారు; ఎల్లప్పుడు 'త్వయా హృషీకేశ హృదిస్థితేన, యధానియుక్తోస్మి, తథా కరోమి' అనే మహామంత్రాన్ని జపిస్తూ తాను భక్తితో ఆరాధించే ఆ భగవంతుని ధ్యానంలో పూర్తిగా నిమగ్నమైపోయేవారు. ఆ అగ్ని ఇంకొకరినైతే దగ్ధం చేసి బూడిద చేసేది, కాని, అది, ఆయనలోని అహాన్ని దగ్ధం చేసి, ఆయనను మరింత తేజోవంతునిగా చేసింది.

అరవిందో తన టేబులు వద్ద కూర్చుని, రాత్రి ఒంటి గంట వరకు భరించలేని దోమల బాధను కూడా లెక్కచేయకుండా, కిరసనాయిలు దీపం ముందర చదువుతూ ఉండేవారు. నేను ఆయనని, ఒక యోగి దైవధ్యానంలో బయట జరుగుతున్నదానిని పట్టించుకోకుండా సమాధిలో ఉపవిష్టుడైన విధంగా, చదివే పుస్తకం మీద దృష్టినంతా నిలిపి చివరి నిమిషం వరకూ ఒకే భంగిమలో కూర్చుని ఉండటం చూశాను. ఒకవేళ ఇంటికి నిప్పు అంటుకున్నా, ఆయన ఏకాగ్రతకు భంగం వాటిల్లబోదు. ఆయన ఆ విధంగా రోజూ అర్ధరాత్రి దాటేదాకా దీపం ముందర కూర్చుని, యూరోపియన్ భాషల పుస్తకాలన్నింటిని అవపోసన పట్టేవారు. అవి పద్య కవిత్వానికి, కాల్పనికకు, చరిత్ర, వేదాంతం వగైరాలకు సంబంధించినవి. సంఖ్యాపరంగా అవి ఎన్నో కూడా ఎవరికీ తెలియదు. ఆయన అధ్యయనంలో వివిధ భాషల పుస్తకాలు గుట్టల కొద్దీ పడి ఉండేవి. అవి ఫ్రెంచి, జర్మను, రష్యను, ఇంగ్లీషు, గ్రీకు మొదలైనవి కాగా, వాటి గురించి నా మటుకు నాకు ఏమీ తెలియదు.

ఒకసారి ఎవరైనా అరవిందోతో పది రోజులు గడిపితే ఆయనను ఎప్పటికీ మరచిపోలేరు. ఆయనతో రెండు సంవత్సరాలకు పైన కలిసి ఉండటం నాకు పట్టిన మహా అదృష్టం.

డి.కె. రాయ్

... నీవు ఏమనుకుంటున్నావు? శ్రీమాత లేదా నేను లేక మరెవరైనా కాని ఆధ్యాత్మిక జీవితంలోకి వచ్చామంటే మేము జీవితాన్ని ఆనందంగా అనుభవించ లేదనా? అందుకనే నంటావా శ్రీమాత దైవానికి తన ఆనంద స్వార్పణను అసలైన ఆధ్యాత్మిక త్యాగనిష్ఠగా చెప్పగలిగినది? లేకపోతే, మా ఆధ్యాత్మిక ప్రయాణంలో మొదటి మజిలీలలో గడిచిపోయిన ఉన్నత జీవితాలను నెమరువేసుకుంటూ గడిపామని, దాని తరువాతనే ఆధ్యాత్మిక త్యాగంలో ఆనందం పొందామని అనుకుంటున్నావా? అటువంటిదేమీ లేదు. మాకు, ఇంకా చాలామందికి, దేనినైనా త్యాగం చేయటం ఆవశ్యకం అనుకుని వదలివేసినా అది ఏ కష్టం లేకుండా గుండె నిబ్బరంతో చేయడం జరిగింది. ఆ తరువాత వాటికై ఇక ఏ దేవులింపూ లేదు.

శ్రీఅరవిందులు

అనువాదం: డా. టి. ప్రసన్న కృష్ణ

ధర్మపథం: దయార్ద్ర హృదయము — ఆదర్శ ప్రేమ

(శ్రీఅరవిందులు 30-8-1905 తమ ధర్మపత్ని మృణాళినీ దేవికి వ్రాసిన ఉత్తరము)

నీ తల్లిదండ్రులు మరల అదే దుఃఖానికి గురయ్యారన్న వార్త నాకు బాధ కలిగించింది. కాని వారి పుత్రుల్లో యెవరు మరణించిందీ నాకు తెల్పలేదు. అయినా బాధపడడం వల్ల ప్రయోజన మేమి? ప్రపంచంలో సుఖాన్వేషణ; సుఖాన్ని పొందడం — దీని మధ్య మనిషికి బాధ అనివార్యమవుతుంది. ఎందుకంటే బాధ యెల్లప్పుడు సుఖాన్ని పెనవేసికొనే వుంటుంది. ఈ నియమం సంతానాపేక్షలోనే గాక సకల భౌతిక కోరికలకు వర్తిస్తుంది.

ప్రస్తుతాంశానికి వస్తాను. నీ విధితో ముడిపడి వున్న వ్యక్తి ఒక విచిత్రమైనవాడని నీ కిప్పటికే తెలిసి వుంటుండవచ్చు. ఈ దేశ ప్రజల మనోభావన వారి జీవితాశాయాలు, వారి కార్యరంగముల కన్న నాది ఎంతో విస్తారంగా భిన్నమైన దృక్పథం. ఇది అన్ని విధాలా వేరైనది, అసాధారణమైనది. ఈ మనుషులు ఈ అసాధారణ భావాలను, అసమాన్య ప్రయత్నాలను, అసాధారణ ఆకాంక్షలను, యెలా చూస్తారో నీకు తెలుసు. వీటన్నింటికీ వారు ఉన్మాద ముద్ర వేస్తారు.

ఉన్మాదికి భార్య కావడం స్త్రీ దురదృష్టం. ఎందుకంటే మహిళల ఆశలన్నీ సంసారంలో సుఖదుఖాఃలకు పరిమితమై వుంటాయి. ఉన్మాది తన భార్యకు సుఖాన్నివ్వలేడు, సరి కదా బాధనే కలిగిస్తాడు.

భగవంతుడు నీకు ప్రసాదించిన జ్ఞానము, ప్రతిభ, ఉన్నత విద్య, సంపద, అంతా కూడ ఆయనకు చెందినదే అన్నది నా దృఢవిశ్వాసం. నా కుటుంబ కనీస అవసరాలకు మాత్రమే ఖర్చు చేయడానికి నాకు హక్కుంది. మిగిలినదంతా ఆయనకే తిరిగి యిచ్చివేయాలి. అలాగాక నా కోసం, నా స్వంత భోగలాలస కోసం ఖర్చు చేస్తే అపుడు నేను దొంగ నవుతాను.

దైవానికి డబ్బు యివ్వడమంటే ధర్మకార్యాలకై ఆ ధనాన్ని ఉపయోగించడం అవుతుంది. నేను సరోజినికి, ఉషకు డబ్బిచ్చినందుకు విచారించను. ఎందుకంటే పరోపకారమేర ధర్మము. నీ పై ఆధారపడినవారిని కాపాడడం గొప్ప ధర్మం. కాని ఒకరు తన స్వీయ సోదరీసోదరులకు మాత్రమే యిస్తే చాలదు. ఈ గడ్డురోజుల్లో, నా దేశమంతా నా ద్వారం వద్ద ఆశ్రయం కోరుతోంది. ఈ దేశంలో నాకు 30 కోట్ల

సోదరీసోదరులున్నారు. వారిలో చాలమంది ఆకలితో మరణిస్తున్నారు. చాలమంది బాధలతో సతమతమవుతూ జీవితాన్ని యెలాగో భారంగా లాగుతున్నారు. వారికి సహాయపడాలి.

నువ్వేమంటావు? ఈ విషయంలో నా యీ ధర్మంలో నీవు భాగస్వామినివి. మనకు అత్యంత ఆవశ్యకమైన వాటినే కొందాం, తిందాం, దుస్తులు ధరిద్దాం. మిగిలినది ఆ దైవానికిచ్చేద్దాం. ఇది నేను చేయదలచుకొన్నది. దీనికి నీ వంగీకరించి, త్యాగం చేయ్యగల్గితే, అపుడు నా తీవ్ర ఆకాంక్ష నెరవేరుతుంది. "ఏలాంటి అభివృద్ధి నేను పొందలేకపోతున్నాను" అని నీ వంటుంటావు కదా! నీవు అభివృద్ధిచెందుటకు మార్గాన్ని నేను సూచిస్తాను. నీవా బాటలో కొనసాగుతావా?

ఇక పోతే దేశాన్ని యితరులంతా జడప్రాయంగా యెంచి దాన్ని మైదానంగా, భూమిగా, అరణ్యాలుగా, పర్వతాలుగా, నదులుగా గ్రహిస్తే, నేను నా దేశాన్ని మాతృమూర్తిగా ఆరాధిస్తాను. తన తల్లి యెదపై, రాక్షసుడు కూర్చొని ఆమె రక్తం త్రాగ తయారవుతుంటే, ఆమె పుత్రుడు యేం చేస్తాడు? అతడు హాయిగా కూర్చుని, తృప్తిగా అన్నం తింటూ, భార్యాబిడ్డలతో కలసి విలాసంగా కాలం గడుపుతాడా? లేక తల్లిని కాపాడడానికై పరుగులు తీస్తాడా? ఈ పతనమైన జాతిని ఉద్ధరించగల సత్తా నాకుందని నాకు తెలుసు. అది శారీరక బలం కాదు. నేను ఖడ్గం తోనో, తుపాకితోనో యుద్ధం చేయబోను. జ్ఞానశక్తి సాయముతో పోరాడుతా. క్షాత్రతేజ మొక్కటే శక్తి కాదు. "బ్రహ్మ తేజోబలం బలం" అని ఒకటుంది. అది జ్ఞానం చేత సంస్థాపించబడింది. ఇది నా క్రొత్త అనుభూతీ కాదు, ఇటీవల ప్రారంభించబడిందీ కాదు. నేనా బ్రహ్మతేజోబలంతో జన్మించాను. అది నా ఎముకల్లో నిక్షిప్తమై వుంది. ఈ జీవిత ధ్యేయాన్ని పొందుటకై నేను భగవంతునిచే నియమింపబడినాను. నా 14 వ యేట ఆ విత్తనం నాలో మొలకెత్త ప్రారంభించింది. 18 వ యేడు వేళ్ళూని స్థిరపడింది.

ఈ విషయంలో నీవేమి చేయదలచావు?

నీ వనవచ్చు, "నా వంటి సాధారణ స్త్రీలు గొప్ప గొప్ప కార్యాల్లో యేమి చేయగలరు నాకు సంకల్పబలం కాని, తెలివితేటలు కాని లేవు. ఈ కార్యాల గూర్చి ఆలోచించేందుకే నాకు భయం కలుగుతోంది" — అని. దానికొక సూక్ష్మ పరిష్కారమార్గం ఉంది. దైవాన్నే శరణు పొందు. దైవసాక్షాత్కార మార్గంలో అడుగులు

వేయి. ఆయన నీ లోపాలన్నిటిని సరిచేయగలడు. దైవాన్ని శరణు వేడుకున్నవారిని భయం క్రమంగా వదలిపోతుంది. నీకు నాపై విశ్వాసం వుంటే, నీవు ఇతరులు చెప్పేది గాక, నేను చెప్పేదే వింటే, నేను నీకు నా శక్తినిస్తాను. శక్తి నిచ్చుట వల్ల అది తరగకపోగా వృద్ధిచెందుతుంది. అర్ధాంగి భర్తయొక్క శక్తి. అంటే భర్త భార్యలో తన ప్రతిబింబాన్ని చూస్తాడు. ఆమెలో తన ఉన్నత ఆకాంక్ష యొక్క ప్రతిధ్వనిని ఆలకిస్తాడు. తద్వారా ఆయన శక్తి ద్విగుణీకృతమవుతుంది.

— శ్రీఅరవిందులు

ప్రొఫెసర్‌గా విద్యార్థులకు శ్రీఅరవిందుల సందేశం: జాతి అభివృద్ధి చెందే పని చెయ్యండి

(బెంగాల్లోని జాతీయ కళాశాలను విడిచిపోతూ ఆయన 1907 ఆగష్టు 23 న విద్యార్థుల కొసగిన సందేశం)

ఇప్పుడు నేను మీ కివ్వదలచిన సలహా: ఈ కళాశాల స్థాపించుటకుగల ఆశయాన్ని మీరు కొనసాగించండి. ఈ ఆశయమేమిటో మీరీ పాటికి గ్రహించి వుంటారన్న విషయంలో నా కెలాంటి సందేహం లేదు. ఈ కళాశాల స్థాపించినపుడు మా యితర వృత్తులను, మా జీవిత సదవకాశాలను సైతం వదలుకొని దీనికే మా జీవితాలను అంకితం చేసికొన్నాం. అలా యెందుకు చేశామంటే తద్వారా నూతన భారతదేశ స్థాపనకు, ప్రధాన కేంద్రంగా దాని పాత్రను చూడాలని ఆశించాం. ఆన వీన భారతజాతి ప్రస్తుత బాధలను, దుఃఖాన్ని అధిగమించి ఆ మహత్తర దినాన ప్రపంచం కోసం పాటుపడడం జరుగుతుంది. మేమిక్కడ కోరేది మీ కేదో విషయపరిజ్ఞానాన్ని అందించాలనీ కాదు. మీ భవిష్యత్ జీవనానికి మీ బ్రతుకు తెరువు మీరు సంపాదించుకోవాలనీ కాదు. మన మాతృదేశం కొరకు పనిచేస్తూ, ఆమె కొరకు బాధపడగల బిడ్డలుగా మిమ్ములను తీర్చిదిద్దాలనేదే మా ధ్యేయం. ఈ కళాశాలను ప్రారంభించింది అందుకే. ఆ కార్యం కొరకే. మిమ్ములను మీరు ఆ ధ్యేయానికి అర్పణం చేసికోవాలని కోరుతాను. మా చేత అపరిపూర్ణంగా, అసంపూర్ణంగా ప్రారంభింపబడి విడువబడినదాని ఆశయ పరిపూర్ణతను మీరు పూర్తి చేయాలి. నేను తిరిగి వచ్చునప్పటికి మీలో కొందరిని శ్రీమంతులుగా చూడాలని కాంక్షిస్తున్నాను. కాని ఆ సంపద మీ కొరకు కాకూడదు. ఆ సంపదను మాతృదేశాన్ని

సుసంపన్నం చేసేందుకుగానే వుండాలి. మీలో మరి కొందరు గొప్పవారు కావాలని కాంక్షిస్తాను. కాని ఆ గొప్పదనం మీ కోసం, మీ అహాన్ని తృప్తిపరచుకోవడం కోసం కాకూడదు. అది మన మాతృభూమి భారతదేశం కొరకు, ఆమెను గొప్పగా చేసేందుకు, యీ భూమి మీద యితర జాతుల మధ్య తలెత్తుకొని నిలబడగల్గేందుకుగా వుండాలి. ఇంకను ప్రాచీనకాలంలో ప్రపంచం జ్ఞానభిక్షకై ఆమె వైపు దృష్టి సారించిన రీతిగా ఆమెను మహోన్నతమూర్తిగా నిలబెట్టేందుకుగా వుండాలి. పేదలుగా, అనామకులుగా వుండేవారు వుంటారు. వారి పేదరికము, అనామకత్వము సహా మాతృభూమికి అంకితం కావాలని నేను కోరుతాను.

ఒక్కొక్క జాతి చరిత్రలో భగవంతుడు ఒక్కొక్క సమయంలో ఒక్కొక్క నిర్దిష్ట కార్యాన్ని నిర్దేశిత ధ్యేయాన్ని జాతికి ముందు వుంచుతాడు. దాని సాఫల్యతకై తక్కినదంతా, అదెంత ఉన్నతమైనదైనా, ఘనమైనదైనా త్యాగం చెయ్యబడాలి. అలాంటి సమయం యిప్పుడు మన మాతృభూమికి ఆసన్న మైంది. ఆమె సేవకన్న మరేదీ మనకు ప్రియమైనది కాకూడని సమయం, ఆమె సేవకే సర్వస్వం వినియోగించవలసిన సమయం ఈ సమయం. మీరు అధ్యయనం చేస్తే ఆమె కొరకే చేయండి. ఆమె సేవ కొరకే మీ శరీర, మానస, ఆత్మలకు శిక్షణ నివ్వండి. మీ జీవనభృతిని సంపాదించుకోండి. కాని మీరు ఆమె కొరకై జీవించాలి. మీరు ఉన్నత విజ్ఞానార్జనకై విదేశాలకు వెళ్ళవచ్చు. కాని తిరిగి రాగానే, ఆ జ్ఞానసంపదను ఆమె కొరకే వినియోగించండి. ఆమె అభివృద్ధి కొరకే పనిచేయండి. ఆమె ఆనందం కొరకే బాధపడండి.

— శ్రీఅరవిందులు

ఉత్తేజపూరిత నాయకుడు

శ్రీఅరవిందులు తమ వద్దకు వచ్చే ప్రతివారికీ వారి వారి స్వభావమును, సామర్థ్యమును బట్టి తదనుగుణంగా ఉత్తేజపూరితులను చేసేవారు. అంతేకాని తమ భావాలను వారి వ్యక్తిగత పరిణామ క్రమాభివృద్ధికి వ్యతిరేకంగా బలవంతంగా వారిపై రుద్దేవారు కారు. ప్రతివారిని తమ సత్తా యొక్క స్వధర్మానికి, స్వభావానికి అనుగుణంగానే నడుచుకొని అభివృద్ధి చెందమని వారికి స్వేచ్ఛ నిచ్చేవారు. ఇది వారి నాయకత్వంలోని ప్రధాన లక్షణం. ఈ గుణం వారి అనుయాయులకు,

అనుచరులకు దిగ్భ్రమ కల్గించేది. ఎందుకంటే బహువిధ కార్యకలాపాల మధ్య, విభిన్న స్వభావం గలవారిని విభిన్న రీతుల్లో నడిపే సమయాన కూడ, శ్రీఅరవిందులు తమ నిశ్చల నీరవతలో, నిస్సంగంగానే వుండిపోవడం వారిని దిగ్భ్రమకు గురిచేసేది. ఆ గంతకులు తమ మనస్సునే కొలబద్దగా చేసికొని, యెంతగా ప్రయత్నించినా శ్రీఅరవిందుల చర్యలను అర్థం చేసికొనలేకపోయేవారు. నిజమే. ప్రవక్తలు మానవాళికి అంతుపట్టని రీతిలో పరస్పర వైవిధ్యంగా గోచరించే అవధూతలు!

— ఋషాబ్‌చంద్

ప్రాణాయామ విజయం

నేను దినానికి నాలుగైదు గంటలు ప్రాణాయామం చేస్తుండేవాడిని. అది వేరే విషయం. నేను ప్రాణాయామం చేసే సమయాన కొంత కాలం కవితాధార జాలువారుతూ వుండేది. నేను ప్రాణాయాం ఆపివేసిన చాలా కాలం తర్వాత కూడ, నేనేమీ చేయకుండా వూరకున్న కాలాన, ఏమీ చేయాలో పాలుపోని కాలాన, నా ప్రయత్నాలన్నీ విఫలమైన సమయాన కూడ కవితాధార వచ్చేది. కాని అది సంవత్సరాల తరబడి నేను చేసిన ప్రాణాయామం వల్లనో లేదా ఏకాగ్రత వల్లనో కాదు. ఆ కవిత అకారణంగా, అనాయసంగా ప్రవహించేదంటే, అది తాత్కాలిక గురువు అనుగ్రహం వల్లనో కాదు, (ఆయనే ఆ సంఘటనకు నివ్వెరపోయేవారు) పరబ్రహ్మ అనుగ్రహం, ఆ తర్వాత మహాకాళి, శ్రీకృష్ణ పరమాత్మల కృపవల్లనో సంభవించింది.

బ్రహ్మానంద స్వామి శిష్యుడైన ఒక ఇంజనీరు నాకు ప్రాణాయామం యెలా చెయ్యాలో చూపాడు. ఆ తర్వాత, నేను నా స్వంతంగానే ప్రారంభించాను. గణనీయమైన ఫలితాలు వచ్చాయి. తొలుత, నా చుట్టూ ఒక విధమైన విద్యుచ్ఛక్తి అనుభూతి పొందాను. రెండవమారు కొన్ని స్వల్ప దృశ్యాలు తటస్థించాయి. మూడవ పర్యాయం సీఘ్ర కవితాధార ప్రారంభమయింది. నాల్గవసారి ప్రాణాయామ అభ్యాసం ద్వారా శారీరకంగా లావెక్కాను. అంతుకు ముందు నేను సన్నగా వుండేవాణ్ణి. నా చర్మం కూడా నునుపుగా అందంగా తయారయింది. లాలాజలంలో వింతైన క్రొత్త పదార్థం తయారయింది. మరొక వింతైన విషయాన్ని గమనించాను. నేను ప్రాణాయామానికి కూర్చున్నప్పుడెల్లా నా చుట్టూ దోమలు ఝుంకారం చేస్తున్నా, ఒక్క దోమ కూడ నన్ను కుట్టిన పాపాన పోలేదు. ప్రాణాయామాన్ని మరింతగా

పెంచాను. కాని తర్వాత ఫలితాలేవి లేవు. అదే సమయాన నేను శాకాహారాన్ని అనుసరించాను. ఈ మార్పు నాకు తేలికతనాన్ని, పవిత్రతను సమకూర్చింది.

— శ్రీఅరవిందులు

అనువాదం: బి. నరసింహయ్య

నిర్వాణము — ఆ పై స్థాయి

నిశ్శబ్దంలోకి ఆరోహణ

"కూర్చో. పరిశీలించు. నీ ఆలోచనలు బయట నుంచి నీ లోనికి ప్రవేశించటం గమనిస్తావు. అవి నీలో ప్రవేశించకముందే వెనక్కి తోసిపారవేయ్." కూర్చున్నాను. పరిశీలించాను. ఆశ్చర్యంతో అదే గమనించాను. ఆలోచన శిరసు ఊర్ధ్వభాగం ద్వారా, మనసు లోనికి ప్రవేశించటం స్పష్టంగా గమనించాను. ఆలోచన లోనికి చేరకుండా ముందే నిజంగా వెనక్కి నెట్టివేయగలిగాను. మూడు రోజులలో — చెప్పాలంటే ఒక్క రోజులోనే — నా మనస్సు అంతా అనంత నిశ్శబ్దంతో నిండిపోయింది.

(బరోడాలో, లేలే మహరాజ్ మార్గదర్శకత్వంతో జనవరి 1908 లో తాము సిద్ధించుకున్న నిర్వాణం గురించిన శ్రీఅరవిందుల ప్రస్తావన)

స్వేచ్ఛా మేధ: విశ్వభావన

... ఆ క్షణం నించి, నాలో మానసిక జీవి వ్యక్తిగతమైన పరిమిత సంకుచిత పరిధులలో కాక, విశ్వభావన, స్వేచ్ఛా మేధస్సుతో ఒక యోచనా కర్మాగారంలో శ్రామికుడిగా మారిపోయింది. ఒక ప్రాణికి యెన్ని వందల శాఖలుంటాయో అన్ని వందల శాఖల నుండి జ్ఞానాన్ని స్వీకరించగలిగే గ్రహణశీలిగా మారింది. విశాలమైన దృష్టి సామ్రాజ్యం, యోచనా సామ్రాజ్యాల నించి తనకు నచ్చిన అంశాన్ని యెన్నుకునే స్వేచ్ఛ పొందింది.

స్థిర (సత్) మరియు చర (చిత్) బ్రహ్మ:

అదే సమయంలో ఒక అనుభవం మధ్యలో వచ్చింది. తన కంటె వేరయిన ఒక

అజ్ఞాతశక్తి యేదో తన చైతన్య ప్రక్రియని వశపరచుకుని (చేపట్టి) తన వ్యక్తిగత ప్రమేయం లేకుండా తన ద్వారా మాటలు, చేతలు జరుపుతున్నది. తన సాధన ప్రక్రియల ద్వారా తనని కదిలించిన ఈశ్వరతత్వాం, పరమేశ్వర చైతన్యం గుర్తించిన తరువాతగాని శ్రీఅరవిందులకు యీ అజ్ఞాతశక్తి యేదో తెలియలేదు. ఈ అనుభవాలు, వాటి ననుసరించి యితర అనుభవాలు అంటే తాను అన్నింటిలోను, తనలో అన్నీ, అన్నీ తనలాగే యింకా అన్నిటిలో దివ్యత్వం, దివ్యత్వంలో అన్నీ చూడగలగడం — ఈ అనుభవాలే అత్యున్నతమైనవి. వాటినే శ్రీఅరవిందులు వుదహరిస్తూ మనందరం కూడా యెల్లప్పుడూ సాధనలో ఆ సమున్నత స్థాయికి చేరాలని అంటారు.

తొలి మెట్టు: పరాకాష్ఠకు చేరిన ముగింపు కాదు

నిర్వాణానానికి చేరడమన్నదే ప్రస్తుతం నా యోగం యొక్క మౌలిక ఫలితంలో మొదటి మెట్టు. ఇది యే ఆలోచనలు లేని, ఆలోచనల స్థాయి దాటినది. ఏ మానసిక, ప్రాణిక స్పందనలతో కళంకితం కాని వున్నత స్థాయికి విసిరేసింది. అక్కడ అహం లేదు. వాస్తవ ప్రపంచం లేదు. కేవలం స్థిరమైన సమగ్ర జ్ఞానం ద్వారా మనిషి చూడగలిగినప్పుడు, యేదో అజ్ఞాతంగా గ్రహించబడుతుంది, లేదా, దాని నీరవ నిశ్శబ్దంలో ఖాళీ రూపాలుగల ప్రపంచం, పదార్థంకాని పదార్థంగా మారిన నీడలు గా వహిస్తుంది. అక్కడ ఏకత్వమూ ఉండదు. బహుళత్వము ఉండదు. ఉండేది కేవలం -తత్- మాత్రమే. అంటే రూపరహితమైనది, బంధం లేనిది, శుద్ధమైనది, వర్ణనాతీతమైనది, ఆలోచన కందనిది, సమగ్రమయినది. అయినప్పటికీ అది పరమ యదార్థం మరియు సంపూర్ణ వాస్తవం. ఆలాటి నిర్వాణంలో రాత్రీ పగలు జీవించాను — దాని ప్రారంభానికి ముందు యితర విషయాలు దానిలోకి అనుమతించడానికి, లేదా దానినది కాస్తయినా మార్చుకోడానికి ప్రయత్నించే లోగా. దాని అంతర్గత హృదయానుభూతి ఒక శాశ్వత స్మృతి. తిరిగి యథాస్థానానికి వచ్చే శక్తి, చిట్టచివర వున్నత స్థాయి నించి ఒక మహోన్నత స్థాయి అతిమానస చైతన్యంలో అది అదృశ్యమయ్యే వరకు వుంటుంది. కాని యింతలోనే దానంతటదే సిద్ధికి మరొక సిద్ధి (realisation) జోడించుకుంటుంది. మౌలిక సహజానుభవంతో తనంత తానే సమైక్యమవుతుంది. ప్రాథమిక దశలో భ్రాంతిపూర్వక ప్రపంచం చోటు చేసుకున్నా అందులో భ్రాంతి అనేది మొట్టమొదట కేవలం నాటకీయమై రూపంతో కనిపిస్తున్న

ప్రతి అంశం యొక్క మూలం వెనుకగా గాఢమైన దివ్యసత్యం వుంటుంది. దానిపై స్థాయిలో అత్యున్నత దివ్యసత్యం వుంటుంది. ఇది జ్ఞానేంద్రియాల్ని నిర్బంధించడం కాదు. తక్కువ చెయ్యడం కాదు. అత్యున్నత అనుభవం నించి పతనం చెందడం కాదు. సరి కదా అది దివ్యసత్యం యొక్క స్థిరమైన ఔన్నత్యానికి, విశాలతకి చేరుకుంటుంది. ఆ దివ్యస్ఫూర్తితోనే యే విషయమైనా చూడబడుతుంది. కాని జ్ఞానేంద్రియాల వలన కాదు. అనంతత్వములోగల ఆ ప్రశాంతత, నిశ్శబ్దం, యెప్పుడూ ప్రపంచంతోనే వుంటాయి. లేదా అన్ని ప్రపంచాలు (సృష్టి సర్వం) కేవలం కాలీతీతమైన దివ్యశాశ్వతత్వంతో కొనసాగుతున్న సంఘటనలు.

మాయావాదాన్ని నేను నిర్వచించిన విధానంలో వున్న చిక్కంతా యిక్కడే. స్వేచ్ఛ పొందిన నా చైతన్యంలో నిర్వాణం ఒక మలుపు. అదే దివ్యభావనకి ప్రారంభమయింది. అదే పరిపూర్ణత వైపు వేసిన తొలి అడుగు. అంతే కాని పరిపూర్ణ సత్య సిద్ధి కాదు. కనీసం సాధనలో చివరి పరాకాష్ట దశ కూడా కాదు.

నిర్ణీతమైన దివ్యసమావేశ స్థలంగా జైలు కావటం; (శ్రీఅరవిందులను 1908 లో ఆలీపూర్ జైలుకి తీసుకొని వెళ్లారు. ముద్దాయిగా జైలులో ఒక సంవత్సరం ఉన్నారు. అక్కడ జైలులో ఉన్నపుడే, ముఖ్యమైన రెండవ సిద్ధి పొందగలిగారు. అదే విశ్వచేతనానుభూతి. సర్వే సర్వత్రా దివ్యసాక్షాత్కారం). శిల్పం గూర్చి నాకు యేదో కొంచెం తెలుసు. కాని చిత్రకళ గురించి బొత్తిగా తెలియదు. ఆలీపూర్ జైలులో ఒక రోజు ధ్యానంలో వుండగా హఠాత్తుగా ఆ గోడల మీద కొన్ని చిత్రాలు కనిపించాయి. చూడు చూడు! అప్పుడే నాలో కళానేత్రం తెరుచుకుంది. చిత్రకళ గురించి మొత్తం తెలిసింది. అయితే అది కేవలం భౌతికమైన సాంకేతిక పరిజ్ఞానం మాత్రమే.

*

అప్పుడు నేను ప్రాణికస్థాయిలో గాఢమైన సాధన చేస్తూ వుండేవాడిని. అప్పుడు నా స్వభావం సంశయాత్మకంగా వుండేది. ఈ సిద్ధుల వల్ల ఉత్థాపన (యోగవిద్య వలన శరీరం గాలిలోకి లేపడం) సాధ్యపడుతుందా? అనుకుంటున్నంతలోనే హఠాత్తుగా అప్రయత్నంగానే నా శరీరం తనంత తాను పైకి లేవడం తెలిసింది. ఇది వరకు నా శక్తినంతా వుపయోగించి ప్రయత్నించినా కూడా కొంచెమైనా లేపలేకపోయేవాడిని. కాని యిప్పుడు నా ప్రయత్నం లేకుండానే శరీరంలో కొద్ది భాగం మాత్రం నేలకి

వాసుదేవ మయ మిదం సర్వం

శ్రీకృష్ణుడు మన నుంచి అభిలషించేది

నా చేతులలో ఆయన గీత ఉంచారు. (ఆలీపూర్ జైలులో). ఆయన శక్తి నాలో ప్రవేశించింది. గీతాసాధన చేయగలిగాను. ఆయనను మానసికంగా అర్థం చేసుకోవటమే కాదు — అర్జునుడు నుంచి ఆయన — శ్రీకృష్ణుడు — ఏమి అభిలషించారో, కర్మలను అనుష్ఠించేవారి నుంచి వారు ఏమి అభిలషించారో, ప్రతిఫలాపేక్ష లేకుండా, కర్మల నాచరించాలని, తన ఇష్టాయిష్టాల కతీతంగా ఉండాలంటూ, అధికుల యెడ, అధముల యెడ, జయాపజయాల పట్ల, సమభావంతో, తన, పర భేదం లేకుండా, నిరహంకారంగా తానొక ఉపకరణము మాత్రమే ననే భావనతో శ్రద్ధగా కర్మ నాచరించాలని — కూడా తెలుసుకున్నాను.

నా చుట్టూ శ్రీకృష్ణుడే: నన్ను జనావళి నుంచి వేరుచేసేందుకు నన్ను ఉంచిన జైలు చూశాను. దాని ఎత్తైన గోడల మధ్య అది నన్ను బంధించలేదు. నన్ను పరివేష్టించి ఉన్నవాడు వాసుదేవుడు. నా జైలు సెల్లుకు యెదురుగా కొమ్మలతో విస్తరించి ఉన్నదాని నీడలో నడిచేది చెట్టునీడ కాదు. అది వాసుదేవునిగానే గ్రహించాను. తన నీడలో నన్ను పట్టి ఉంచిన శ్రీకృష్ణునిగా దానిని నేను చూచాను. నా సెల్లు ఇనపకమ్మీలు చూచాను. దాని ఇనుప చట్రపు తలుపు చూశాను. అదీ నాకు వాసుదేవుడుగానే అగుపించింది. నన్ను రక్షిస్తూ నాకు రక్షకుడుగా నారాయణుడే అక్కడ నిల్చుని ఉన్నాడు. పరుండేందుకు నాకు ఇచ్చిన ముతక కంబళిపై పడుకున్నపుడు నా సఖుడు, నా ప్రేమికుడు శ్రీకృష్ణుని బాహుబంధాలలో ఉన్న అనుభూతే కలిగింది. అదీ ఆయన నాకు ప్రసాదించిన తొలి అంతర అనుభూతి. జైలులో ఉన్న ఖైదీలను — దొంగలు, ఖూనీకోరులు, వంచకులు — వాళ్లలోనూ వాసుదేవుడే నాకు ప్రత్యక్షమయాడు. ఆ భ్రష్టులు, పతితులలోనూ నాకు నారాయణుడే కనిపించాడు. అలాటి దోపిడీదారులు, దొంగలు, వారి సానుభూతి సద్భావాలతో నన్ను తలదించుకునేలా చేశారు. అలాటి విపత్కర పరిస్థితులలో మానవత్వానిదే పై చేయి అయింది. ఆయన మరోసారి నాతో మాట్లాడుతూ అన్నారు — "చూశావా! నా యీ చిన్న కార్యాన్ని నీచే నిర్వహింపచేయడానికి నిన్నెక్కడికి పంపించానో! ఇందుకే, ఇలాటి దేశాన్ని నేను ఉద్ధరిస్తున్నాను"...

ఆయన తన మహిమలను నాకు చూపారు: హిందూమతం యొక్క స్వచ్ఛమైన సత్యాన్ని తెలియపర్చారు. అంతకు ముందు నాకు యెన్నో సంశయాలుండేవి. పాశ్చాత్య వాతావరణంలో, పాశ్చాత్య భావాలతో ఇంగ్లండులో పెరిగాను. హిందూమతం గురించిన చాలా విషయాలు నాకు ఊహాపరమైనవిగా తోచేవి. కొంత మాయగా, మరెంతో భ్రమగాను నాకు అనిపించేవి. ఇప్పుడైతే రోజు రోజుకీ శారీరకంగా, మానసికంగా, అనుభూతిపరంగా హిందూమతంలోని సత్యాలను ఆకళింపు చేసుకున్నాను. అవి నాకు సజీవ అనుభవాలు అయినాయి. భౌతిక శాస్త్ర విజ్ఞానానికి అందని విషయాలు ఆవిష్కృత మయినాయి.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

విప్లవ యోగి

(జాతి ఆత్మకు మేలుకొలుపు*)

"ధర్మ" నుంచి మహోన్నతము, సర్వశ్రేష్టము అయిన మతము:

కార్యాచరణమనే మతంలో భాగమనీ, అయితే, అది అన్ని రకాల కర్మలకు వర్తించదనే సాధారణ అభిప్రాయం ఒకటి ఉన్నది. సాత్త్విక ప్రధానమైన చర్యలుగానీ, లేక నైతిక చైతన్యంతో జరిగి, పరిత్యాగానికి దారితీసే చర్యలుగానీ అయితే మతచర్యలుగా పేర్కొనవచ్చు — ఇది... తప్పుడు అభిప్రాయమే. సాత్విక చర్య మతపరమైతే రాజసిక చర్య కూడా అంతే. సర్వజీవ కారుణ్యం మతపరమైన చర్య అనుకుంటే ధర్మయుద్ధంలో శత్రు సంహారం చేయడం కూడా అంతే. తన ఆనందాన్నీ, భోగభాగ్యాలనూ, చివరికి తన జీవితాన్ని కూడా ఇతరుల మంచి కోసం త్యాగం చేయడమే మతచర్య అయితే తన మత పురోగతికి ఆలవాలమైన తన దేహాన్ని జాగ్రత్తగా చూసుకోవడం కూడా అంతే. రాజకీయాలు కూడా మతచర్యలే.

* విడుదలైన తర్వాత శ్రీఅరవిందులు "ధర్మ", "కర్మయోగి" అనే రెండు పత్రికలకు — మొదటిది వంగభాషలో, రెండవది ఆంగ్లములోను సంపాదకత్వము వహించేవారు. వారు కారాగారంలో ఉన్నప్పుడు వందేమాతరం అనే పత్రిక ఆగిపోయింది. దేశాన్నంతటినీ సంపూర్ణ స్వరాజ్యం భావనతో జాగృతం చేయడమే కాక దాని సహజ మేధస్సునూ, స్వధర్మాన్నీ దాని ఆత్మనూ కూడా మేలుకొలిపారు.

అలాగే కవిత్వం, చిత్రలేఖనం, మధురగానంతో జనాన్ని రంజింప చేయడం కూడా. ఈ విధంగా ఏ పని అయినప్పటికీ, అది పెద్దదైనా, చిన్నదైనా, స్వార్థం లేకుండా చేస్తే అదే మతపరమైన పని అనుకోవచ్చు. చేసే పను లన్నింటినీ ఒక అర్పణగా, భగవంతునికి నివేదనగా ఆయన ప్రకృతే చేయిస్తున్న భావనతో ఏ మతమైతే మన చేత కర్మలు చేయిస్తుందో అదే మహోన్నతమైన సర్వశ్రేష్ఠమైన మతము.

(బెంగాలీ మూలము నుండి అనువాదము)

23, ఫిబ్రవరి 1908 వందేమాతరం పత్రిక నుండి: విస్తారమైన, పరిపూర్ణ స్వతంత్ర్యము

ఈ దేశ ప్రజలకు భగవంతుని ప్రత్యక్ష ఆవిష్కారమే స్వరాజ్యం. అది కేవలం రాజకీయ సాతంత్ర్యం మాత్రమే కాదు – అది అపారమైన, సంపూర్ణమైన, వ్యక్తి స్వాతంత్ర్యము, సంఘ స్వాతంత్ర్యము, జాతి స్వాతంత్ర్యము, ఆధ్యాత్మిక స్వాతంత్ర్యము, సమాజ స్వాతంత్ర్యము మరియు రాజకీయ స్వాతంత్ర్యము. స్వార్థంలో మోక్షమార్గముందనే భావాన్ని మేం నమ్మము. మన చుట్టూ ఉండే ప్రజానీకం దుర్భరంగా, అధోగతికి దిగజారి ఉంటే చుట్టుప్రక్కల నున్న తన సోదరుల స్థితగతులు చూడకుండా దైవాన్ని ఎవరైనా ఏ విధంగా అన్వేషించగలరు? సర్వజీవుల పైనా కారుణ్యం చూపడమే సిద్ధుల లక్షణము. సర్వభూత హితం కోరి, ఆనందించేవాడే పరిపూర్ణమైన యోగి. అందరికీ ఏ విధంగా మంచి చేయాలా అనే ఆలోచనతో అతని మనసు నిండి ఉంటుంది. ఎవరైనా తన చుట్టుప్రక్కల ఆర్తనాదాలు, బాధలు వినకుండా కఠిన హృదయుడై ఉంటూ, తోటివారు దుఃఖితులు, పీడితులుగా, ఇతరుల దురాశకు బలైపోయి ఉన్నా సంతృప్తితో తను మాత్రం మోక్షాన్ని కోరుకుంటే, అతని మార్గం కష్టాలమయంగా అవరోధాలతో కూడి ఉంటుంది. భగవంతుడు తనలోనే కాకుండా అందరిలోనూ ఉంటాడనే విషయం విస్మరిస్తున్నాడన్న మాట. భగవంతుడు భారతదేశాన్ని పవిత్రమైన ఆధ్యాత్మికతకు ఒక శాశ్వత నీటి ఊటగా ప్రత్యేకించి ఏర్పరిచాడు కాబట్టి అది ఎన్నటికీ ఇంకిపోకుండా ఆయన జాగ్రత్త పడతాడు. అందువల్లనే "స్వరాజ్య" ప్రేరణ మనకు కలిగింది. మన రాజకీయ స్వాతంత్ర్యం ద్వారా ఆధ్యాత్మిక స్వాతంత్ర్యాన్ని సంప్రాప్తించుకుంటాము. సిద్ధులు, యోగులు మొదలగు

వారికి నెలవైన ఈ దేశం మరొకసారి పురాతన యోగాగ్నితో ప్రజ్వరిల్లుతుంది. ప్రజాహృదయాలు అనంతుని దరికి ఉద్ధరింపబడుతువి.

"కర్మయోగి" నుంచి (25 సెప్టెంబరు, 1909):

ప్రాచీన స్ఫూర్తిని తిరిగి కొత్త రూపాలతో ఆవిష్కరించుకోవడం

... ప్రాచీన ఆర్యుల స్ఫూర్తిని ఆదర్శాన్ని తిరిగి దక్కించుకొని భద్రపరుచుకోవడమే కాక దాన్ని కొంగ్రొత్త రూపాలలో, సంస్థలలో ప్రతిష్టించుకోవాలి. మన సాంఘిక వ్యవస్థలో, విధానాలలో, సంస్థలలో వాటన్నిటినీ జాగ్రత్తగా భద్రపరుచుకోవాలి. వాటికి శాశ్వతమైన విలువ ఎంతో ఉంది. అవి మనస్ఫూర్తి కెంతో ముఖ్యమైనవి, భవిష్యత్తుకి కావలసినవి. ఎంతో విస్తరిస్తూ ఉన్న భారతీయ ఉత్సాహదీప్తి తాత్కాలిక రూపాలలో, ఇరుకు గదులలో భద్రపరచవలసినది కాదు — గత కొద్ది వందల సంవత్సరాలుగా దాచిపెట్టినట్లు. అలా చేయటం నిరుపయోగం, నష్టదాయకం. ఆ పాత నమూనాలు పగిలిపోయాయి. సువిశాలమై ఆకృతులను, నూతనంగా, సుసంపన్నంగా, పుష్కలంగా నిర్మించుకోవాలి.

మూలం: శ్రీఅరవిందులు

తెలుగు అనువాదం అమరవాది ప్రభావతి, అమరవాది వెంకట్రామ శాస్త్రి)

"ధర్మపత్నిగా భార్య ఆత్మకి ప్రియమైనది. కాని అది భార్యపై వ్యామోహం కాదు" అని యాజ్ఞవల్క్యుడు ఉపనిషత్తులో చెప్పాడు. అసత్యమై, భావోద్రేకాలతో నిండి, పైకి చెప్పుకునే అహంకారిక ప్రేమ వెనుకనున్న వాస్తవికత ఏమంటే అది జీవాత్మకి దిగువస్థాయి లోని సంవేదన. కాని ఉన్నతస్థాయిలో ఆ ప్రేమ కూడా ప్రాధాన్యతాపరంగా స్వార్థపూరిత అహంది కాదు, దివ్యమైనది. నిజమైన ప్రేమలు, త్యాగాలన్నీ వాటి అంతస్తత్వంలో ప్రకృతిలోని వైరుధ్యాలైన ప్రాథమిక అహంకారం, పొరపాటుగా ఊహించే భిన్నత్వాల ఫలితం. ఇదంతా ప్రకృతిలో అత్యావశ్యకమైన తొలి భిన్నత్వ దశ నుంచి ఏకత్వం వైపు మరలే దిశగా చేసే ప్రయత్నం.

మూలం: శ్రీఅరవిందులు

అవ్యక్త నూతన దిశగా ప్రయాణం

సరిహద్దుల కతీతంగా

1 నా విశాలతర జీవాత్మలో విశాల విశ్వాన్ని చుట్టబెట్టాను
2 దేశకాలాలు నా జీవాత్మ కనుసన్నలలో ఉన్నవి.
5 ...సర్వప్రకృతి — నా పోషణలో ఉన్న పశికూన,
6 పెనుగులాట, నిరంతర విశ్రాంతి నేనే;
7 ప్రపంచాన్ని పులకింపజేసే ఆనందం, జాలువారేది నా నుంచే,
8 నా యేకాంత హృదయంలో భరిస్తాను జనావేదనను.
13 ... కాలాన్ని, జీవితాన్ని అధిగమించి ఎగసిపోతాను,
4 నా అపరిమితమైన రెక్కల పైన,
అయినా పుట్టిన, పుట్టబోయే వాటితో
మమేకమై ఉంటాను.

— శ్రీఅరవిందులు

ఒక సంధి కాలం: (మోతీలాల్ రాయ్ అభిప్రాయాలు)

(పాండిచేరి వెళ్లే ముందు, శ్రీఅరవిందులు, ఫ్రెంచి కోలనీ చంద్రనాగూరులో మోతీలాల్తో కొంతకాలం ఉన్నారు.)

చంద్రనాగూరులో ఉన్నప్పుడు శ్రీఅరవిందుల వారి యోగసాధన చాలా తీవ్రస్థాయిలో సాగింది. సూక్ష్మభూమికల స్థాయిలో ఎన్నో లోకాతీత దృశ్యాలు వారిగి అగుపించేవి. ధ్యానంలో ఉన్నప్పుడు ఆయనకు ముగ్గురు దేవతలు దర్శన మిస్తూ ఉండేవారు. చివరికి అవి నిష్క్రమించటం గమనించేవారు. తర్వాత వారు పాండిచేరి వెళ్లాక వాటిని — ఇళా, మాహి (సరస్వతి) — వైదిక దేవతలుగా తెలుసుకున్నారు.

— మోతీలాల్

ఆత్మ వికాసం కోసం భారతీయ యోగమార్గంలో కొన్ని పద్ధతులు అనుసరిస్తూ ఉన్నప్పుడు, పరోక్షంగా నాకు వైదిక విజ్ఞానంతో తొలిసారి పరిచయం అయింది.

నాకు దగ్గరైనాయి. ఆ సమయంలోనే, నా మానసికానుభవాల కనుగుణంగా ఉండే నామధేయాలు, సంకేతాలుగా, నా మనసులో మొలకెత్తటం ఆరంభమయినాయి. అవి క్రమేపీ స్థిరపడినాయి. వాటిలో నాలుగు అంతఃకరణ ప్రవృత్తి శక్తులలో మూడు — దివ్యజ్ఞానము, ప్రేరణ, అంతర్‌దృష్టి — వీటికి ప్రాతినిధ్యం వహించేవిగా — ఇళ, సరస్వతి, సరమ వచ్చాయి — వీటిలో రెండు — ఇళ సరస్వతి వైదిక దేవతలుగా ప్రసిద్ధమైనవిగా నాకు తెలుసు. కాని వాటిని హిందూమతం పౌరాణిక కథలలో సంఘటితపరచింది. సరస్వతి, చదువుల తల్లిగా, ఇళ, చంద్రవంశమాతగా పరిగణింపబడినాయి. కాగా సరమ అందరికీ బాగా పరిచయమై ఉన్నదే.

రాజకీయాలు వదిలిపెట్టడానికి కారణం:

అందులో అంత పెద్దగా రాణించలేనని నేను రాజకీయాలు వదిలిపోలేదు. ఇలాంటి భావనే నా కసలు రాదు. నా యోగమున కేదీ ప్రతిబంధకం కాకూడదని నేను బయటికి వచ్చేశాను. అంతేకాక ఒక స్పష్టమైన ఆదేశం ఈ విషయంలో నాకు వచ్చింది. రాజకీయాలతో పూర్తిగా బంధాలను తెంచుకున్నాను. అంతరంగంలో ఒక విషయం నాకు తెలిసింది — నేను ప్రారంభించిన కార్యం నేను ఉద్దేశించిన రీతిలో ముందుకు తీసుకొనిపోబడుతుందని, ఇది విధి నిర్దేశమనే విషయం నాలో అవగాహన కలిగింది. నా వ్యక్తిగత ప్రమేయం, లేదా, నేను అక్క ఉండవలసిన అవసరం లేకుండానే నేను ప్రారంభించిన ఉద్యమం విజయవంతమవటం తథ్యం. నేను వైదొలగటం వలన అది వ్యర్థమవుతుందనే భావన, విచారం నాకు ఏ మాత్రం కలుగలేదు. ఇకపోతే — మిగిలిన విషయాల గురించి — ప్రాపంచిక వ్యవహారాలలో ఏ ప్రముఖ సంఘటన కూడా చివరికి విఫలమవుతుందని నేనెప్పుడూ అనుకోలేదు. కాకపోతే, వాటిని సిద్ధింపచేసుకోవటంలో ప్రపంచశక్తులకు ఆలశ్యం కావచ్చు.

నిర్గమనానికి సంబంధించిన వాస్తవాలు: పైనుంచి ఆదేశము

నాకు సుపరిచితమైన దివ్యకంఠధ్వనిలో మూడు మాటలతో కూడిన ఒక ఆకస్మిక ఆదేశం విన్నాను — "చంద్రనాగురుకు వెళ్లు". ఇంచుమించు పది నిముషాలలో చంద్రనాగూరు ప్రయాణమయే పడవలో ఉన్నాను. (ఫిబ్రవరి, 1910)... ఎవ్వరికి

వార్తాపత్రికలతోనూ నాకు ఉండే సంబంధాలు అప్పటి నుంచి తెగిపోయాయి. పిమ్మట అదే ఆదేశంతో చంద్రనాగూరు విడిచి పెట్టి, ఏప్రిల్ 4, 1910 న పాండిచేరి చేరుకున్నారు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

తపోగుహ*

(నూతన పథానికై సమాయత్తం)

ఒక దివ్య సంకల్పం, ఒక మహదాశయమాతని హృదయాన్ని పట్టి వైచె
అతీత మానవ రూపమను గ్రహించ
అదృశ్య ఆధ్యాత్మ శిఖరాల వైపు దృష్టి సారించినాడు
ఒక మహోన్నత లోకమును క్రిందికి గొని రా కాంక్షించు...

ముందే భవిష్య సూచన ఒకటి: (1910 న తమిళనాడు పత్రిక, 'ఇండియా', విలేఖరి, కలకత్తాలో కృష్ణకుమార్ నివాసంలో, తనను కలిసినపుడు శ్రీఅరవిందులు ఈ భవిష్య సూచన చేశారు.)

1907 సం. నుంచి భారతదేశానికి ఎంతో ఆశావహంగా ఉండే ఒక నూతన శకంలో జీవిస్తున్నాం. భారతదేశంలోనే కాక, యావత్ప్రపంచంలో కూడా మహత్తరమైన మార్పులు, విప్లవాత్మకమైన పరిణామాలు వస్తాయి. ఉన్నత స్థాయిలోనివారు నిమ్నస్థాయికి, నిమ్నస్థాయిలోనివారు ఉన్నతస్థాయికి చేరుకుంటారు. అణగారిన పీడిత జనావళి ఉద్ధరింపబడతారు. నూతన చైతన్యంతో దేశము, మానవాళి ఉత్తేజితమవుతవి. నూతన లక్ష్యసాధనకు కొత్త ఆలోచనలతో కొత్త ప్రయత్నాలు కొనసాగుతవి. ఈ విప్లవాత్మక పరిణామాల మధ్య భారతదేశం స్వతంత్ర దేశమవుతుంది.

— శ్రీఅరవిందులు

తా చేసినదాని నుండి ఆతని అంతరాత్మ విశ్రమించె
మానవ కఠిన శ్రమ, నిష్ఫల కోలాహలము సద్దుమణిగె...

మహనీయ నిశ్చల నీరవత ఆతని ఏకైక సహచరిగ మిగిలె.
ఆతని కనులందు విశ్వజనీన దీప్తి గలదు,
హృదయ, మస్తిష్కముల లోనికి బంగరు తేజంబు ప్రవహించె;
ఆతని శరీరావయవముల లోనికి దివ్య క్రియాశక్తి దిగి వచ్చె,
శాశ్వత బ్రహ్మానంద సంద్రాల నుండి ఒక ప్రవాహమ్ము గూడ....

అపరిమితమగు దాని ఒక సజీవ కేంద్రమ్ము
ప్రపంచ పరిధితో, సమమగుటకై విస్తరించె,
ఆతడు తన అపార ఆధ్యాత్మ పథము వైపు తిరిగె.

శ్రీఅరవిందులు
(సావిత్రి పు. 76, 79)

ఆధ్యాత్మికమైనదానిని భౌతికము లోనికి తీసుకురావడం

పూర్వమెపుడో వ్రాసిన లేఖ (12 జూలై 1911)

నా యోగాన్ని ఏ ఆటంకాలూ లేకుండా పూర్తిచేయడానికి, నా చుట్టూ ఇతరులను చేర్చుకునేందుకు నా కొక ఆశ్రయం కావాలి. భౌతికాని కతీతంగా ఆవల వున్నవారు నాకు నిర్దేశించిన స్థలంగా పాండిచేరి కన్పిస్తున్నది. పదార్థ భూమికకై ఉద్దేశింపబడినదానిని ఆ భూమికపై ప్రతిష్ఠించడానికి ఎంతటి కృషి కావాలో నీకు తెలుసా!

ఆధ్యాత్మికమైనదానిని పదార్థ భూమికపైకి తీసుకురావడానికి అవసరమైన శక్తులను నేను అభివృద్ధి చేస్తున్నాను. మనుష్యుల్లోనికి ఇపుడు నన్ను నేను ప్రవేశపెట్టుకొని, వాళ్లను మార్చి, అంధకారాన్ని తొలగిస్తూ, వెలుగును తీసుకువస్తూ, వాళ్లకు ఒక నూతన హృదయాన్ని, ఒక నూతన మనస్సును ఇవ్వగలుగుతున్నాను.

* పూర్తిగా ఒక నూతన యోగాన్ని అభివృద్ధి చేయడానికి పాండిచేరి, శ్రీఅరవిందుల సాధనకు కేంద్రమైంది

నేనిపుడు స్పష్టంగా చూడగలుగుతున్న దేమిటంటే, పొరపాటుకు, అసమర్థతకి మూలం ఏదో దానిని పరిపూర్ణంగా, సంపూర్ణంగా తొలగించడం. ఇది నా యోగానికి మౌలికమైన లక్ష్యం. కాలక్రమంలో నేను మనుషుల ముందుంచబోయే పరమ సత్యం పరిపూర్ణమైనదిగా వుండేందుకు, ప్రపంచాన్ని మార్చడానికి నేను చేయగలిగిన సాయం విజయవంతమయ్యేందుకు ఆ సాయం అప్రతిహతంగా తయారైయ్యేందుకు, అడ్డం వచ్చే ఏ పొరపాటు, అసమర్థలనైనా సమూలంగా పెకలించివేయాలి.

విశాల ప్రదేశాలను నూతన మార్గాలను తెరవడం

జీవితం నుండి ఉపసంహరించుకొనేందుకు గాక, మానవ జీవిత రూపాంతరీకరణకు ఆధారంగా వుండే జీవితం కోసం తప్పకుండా చేయవలసిన యోగసాధనలో భాగంగా నేనింతవరకు జీవితం నుండి ఉపసంహరించుకొని వున్నాను, ఇక ముందు కూడా కొంతకాలం అలా వుంటాను. ఆంతరిక అనుభవపు విశాల ప్రదేశాలను, అందుకోసం నూతన మార్గాలను తెరచే "యోగం" అది. కాబట్టి నేను ఉపసంహరించుకొనడమూ, ఎక్కువ కాలమూ, ఆ పని పూర్తి చేయడాని కవసరమవుతాయి. కాని ఈ యోగం యొక్క ఆధ్యాత్మిక పునాది నుండి ముందుకు సాగే బృహత్ బాహ్య కార్యాన్ని నేనెపుడు నాపై వేసుకోవాలో తెలిసే సమయం ఇంకా రానప్పటికీ, అది సమీపిస్తోంది.

గత ఉషస్సులు, భవిష్య మధ్యాహ్నాలు:
పురాతన యోగం, నూతన గమ్యం

నేను దేనితో మొదలు పెట్టానో, లేలే నా కిచ్చినదేమిటో, నేను జైల్లో చేసినదేమిటో అదంతా కూడా మార్గం కోసం వెదుకులాటే. ఇక్కడ అక్కడ చూస్తూ పాత ప్రాక్షిక యోగాలన్నింటినీ స్పృశిస్తూ, స్వీకరిస్తూ, పని చేస్తూ, దీన్నీ దాన్నీ పరీక్షిస్తూ కొంచెం హెచ్చుతగ్గులుగా ఒకదాని సంపూర్ణ అనుభవాన్ని పొందిన తర్వాత మరోదాని వెంటపడుతూ చుట్టూ తిరిగాను. నేను పాండిచేరి వచ్చిన తర్వాత ఈ అస్థిరస్థితి పోయింది. అంతర్వాణియైన జగద్గురువు నా మార్గాన్ని, దానికి సంబంధించిన యావత్తు సిద్ధాంతాన్నీ కూడా చూపించాడు....

పాతయోగంలో వున్న లోపం యేమిటంటే మనస్సును, హేతువాద తత్త్వాన్ని తెలుసుకొని, పరమాత్మను తెలుసుకొని, మనస్సులో పొందిన ఆధ్యాత్మిక అనుభవంతో

సంతృప్తి చెంది అచటే ఆగిపోయింది. కాని మనస్సు కొద్దిపాటి అంశాన్ని మాత్రమే గ్రహించగలుగుతుంది. అనంతాన్నీ, అఖండాన్నీ అది పూర్తిగా పట్టుకోలేదు. మనస్సు దాన్ని పట్టుకొనేది సమాధి యొక్క పారవశ్యస్థితి ద్వారా, మోక్షం యొక్క విముక్తి ద్వారా, నిర్యాణమనబడు నశింపు ద్వారా, అలాంటివే మరి కొన్నింటి ద్వారా మాత్రమే, మనస్సుకు మరో దారి లేదు. ఇక్కడా అక్కడా యెవరో ఒకరు ఈ నిస్సంగ ముక్తిని నిజంగా పొంది వుండవచ్చు. కాని యేం లాభం? పరమాత్మ, దైవం సదా ఉండనే ఉన్నాడు. దైవం మనిషిని కోరేదేమిటంటే, వ్యక్తిగతంగా, సామూహికంగా తనను ఇక్కడే (ఇహైవ) దైవత్వసిద్ధి పొందమని. అంటే భగవంతుని ఈ జీవితంలోనే నిజం చేయమని. యోగం యొక్క పురాతన పద్ధతి, పరమాత్మను, జీవితాన్ని సమన్వయం చేయలేకపోయింది, లేదా ఏకం చేయలేకపోయింది. అది ప్రపంచాన్ని భ్రాంతిగా, లేదా క్షణం క్షణం మారిపోతుండే దైవ లీలగా కొట్టిపారేసింది. తత్ఫలితంగా జీవితాని కుండే శక్తి క్షీణించిపోయింది. భారతదేశం నిర్వీర్యమై పతనమైంది.

ఏ కొద్దిమందో సన్యాసులు, విరాగులు, సత్పురుషులు, సాక్షాత్కారం పొందినవారు, విముక్తిని పొందితే — అది ఏ రకమైన ఆధ్యాత్మిక పరిపూర్ణత అవుతుంది? భక్తితో, భగవత్పారవశ్యతానందంతో వెర్రి ఆవేశంలో కొద్దిమంది భక్తులు నృత్యం చేస్తున్న సమయంలో మొత్తం జాతి అంతా సరైన జీవనం, సరైన బుద్ధి దక్కక అంధకార, తమస్సుల అగాధాల లోనికి కూరుకుపోతుంటే అదే విధమైన ఆధ్యాత్మిక పరిపూర్ణత అవుతుంది? మొట్టమొదట మానసిక స్థాయిలో అన్ని విధాలైన అనుభవాల్ని పొందాలి. తర్వాత మనస్సును ఆధ్యాత్మిక ఆనందం ముంచివేసి, దానిని ఆధ్యాత్మిక వెలుగుతో ప్రకాశింపజేసి ఆ తర్వాత అతడు ఇంకా పై పైకి యెగబ్రాకాలి. పై పైకి అలా యెగబ్రాకకపోతే, అంటే ఈ యెగబ్రాకడం అతిమానసిక స్థాయి దాకా సాగకపోతే ప్రపంచ ఉనికి యొక్క చరమ రహస్యం తెలుసుకోవడం సాధ్యపడదు. విశ్వరహస్యం తాలూకు చిక్కుముడి విడిపోదు. ప్రపంచ చిక్కు సమస్య పరిష్కరించబడదు. అక్కడ, ఆ అతిమానసికస్థాయిలో మాత్రమే పరమాత్మ ప్రపంచం; పరమాత్మశక్తి, జీవనం అనే ద్వంద్వాలతో కూడిన విశ్వమయ అజ్ఞానం అంతమౌతుంది. అపుడు ప్రపంచాన్ని భ్రాంతిగా ఇకనెంత మాత్రము గణించ పనిలేదు. ప్రపంచం

భగవంతుని యొక్క శాశ్వత క్రీడ, పరమాత్మ యొక్క నిరంతర అభివ్యక్తి....

— శ్రీఅరవిందులు

(బరీన్‌కు వ్రాసిన లేఖ నుండి — బెంగాలీ రచనలు)

ఒక నూతన ఆధ్యాత్మిక సాహస కార్యం: పురాతన మార్గాలలోనే తిరిగి నడవడం గాదు

పురాతన సంప్రదాయాలు వాటి స్వకీయ స్థల, కాలాలో చాలా గొప్పవే. కాని ఇంకా ముందుకు పోకుండా పాతవాటినే పట్టుకుని యెందుకు చర్విత చర్వణంగా చేసుకుంటూ పోవాలో అర్థం కావటం లేదు. పృథివి మీద చేతన యొక్క ఆధ్యాత్మిక అభివృద్ధిలో, గొప్ప గతాన్ని అనుసరించి తీరాలి, మరింత మహనీయ భవిష్యత్తు కోసం.

*

ఇతర యోగాలన్నీ ఈ జీవితాన్ని ఒక భ్రాంతిగానో లేదా అశాశ్వతమైపోయే ఒక దశగానో పరిగణిస్తాయి. ఒక పురోభివృద్ధిదాయకమైన అభివ్యక్తి కొరకు దైవంచే సృజించబడినదిగా ఒక్క అతిమానస యోగమే ఈ జీవితాన్ని పరిగణిస్తుంది. జీవితాన్ని, దేహాన్ని పరిపూర్ణం చేయడమే దాని ముఖ్యోద్దేశ్యం. అతిమానసికము అంటే ఋత-చిత్, సత్యచేతన, తన అవతరణలో అది క్రిందికి తీసుకొచ్చేదేమంటే జీవితం యొక్క సంపూర్ణ సత్వం, విశ్వపదార్థంలోని చేతన యొక్క సంపూర్ణ సత్వం. ప్రస్తుతం దేహం, జీవితం పొంద సామర్థ్యంగల అత్యున్నత మహదానందం, కేవలం ప్రాణిక మనస్సు లేదా నాడులు లేదా జీవకణాల యొక్క క్షణికోద్రేకమే. అదీ పరిమితమైనదే. అపరిపూర్ణమైనది త్వరలో నిష్క్రమిస్తుంది. అతిమానసిక పరివర్తన వల్ల జీవకణాలు, నాడులు, ప్రాణికశక్తులు, దేహంలో వున్న మానసికశక్తులు వేయిరెట్లు పరమానందాన్ని వర్ణించనలవిగాని, అక్షయ పరమానందాన్ని, బ్రహ్మానందాన్ని తమలో నింపుకోగల సామర్థ్యాన్ని పొందుతాయి. అతిమానస ప్రేమ అంటే అంతరాత్మ,అంతరాత్మతో, మనస్సు మనస్సుతో, జీవనం జీవనంతో, తీవ్రాతితీవ్రమైన ఏకత్వంలో వుంటాయి. దైహికచేతన మొత్తం, భౌతికమైన ఏకత్వానుభూతిలో మునిగిపోతుంది. దివ్యప్రేమికుని

సన్నిధితో ప్రతిభాగం, దేహం యొక్క ప్రతి కణం నిండిపోతుంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె.వి. రావు

అతిమానస అతీంద్రియ పురుషుడు

ఎ.బి.పురాణీ స్మృతులు

శ్రీఅరవిందుల వారితో 1921 లో నేను రెండవసారి సమావేశమయాను. 1921 లో ఆ నా సందర్శనం నన్ను అత్యంత ఆశ్చర్యచకితుణ్ణి చేసింది. రెండు సంవత్సరాల వ్యవధిలో వారి శరీరం ఎంతగా రూపాంతరం చెందిందంటే — అతి అత్యంత అద్భుతమనే వర్ణించాలి. 1918 లో వారి శరీరఛాయ సాధారణ వంగదేశీయుని శరీరచ్ఛాయ వలె — నలుపు — అనే చెప్పాలి. అయితే ముఖంలో వర్చస్సు ఉన్నది. చూపు నిశితంగా ఉండేది. మేడ మీదికి వెళ్లి చూద్దును కదా — వారి బుగ్గలు ఆపిలు పండు కెంపు వన్నె మిసమిసలు. శరీరం అంతా మృదులమైన పసుపు తెలుపు కలిసిన వన్నెతో మెరసిపోతోంది. ఈ మార్పు నాకు ఎంత ఆశ్చర్యాన్ని కలిగించిందంటే — "ఏమైంది మీకు?" — అని అరిచాను. నాకు నేరుగా వారు సమాధానం ఇవ్వటానికి బదులు ఇంత ముందులేని నా పెంచిన గడ్డాన్ని చూచి "నీ కేమయింది?" అని బదులు పలికారు.

అయితే తర్వాత మాటల సందర్భంలో, దివ్యోన్నత చేతన, మానసికస్థాయి నుంచి, ప్రాణిక, నిమ్న ప్రాణికస్థాయికి దిగివచ్చినపుడు నాడీమండలంలోను, శారీరక సత్వంలోను కూడా రూపాంతరీకరణం జరుగుతుందని విశదీకరించారు.

*

"అతీంద్రియ" అతిమానస వ్యక్తి, "ఆధ్యాత్మిక పురుష" — అవుతాడు. అంటే అది ఒక ప్రత్యేక వ్యక్తిత్వంగా కాదు. నిర్దిష్టమైన గుణశ్రేష్ఠతలను సంతరించుకుని ఒక నిశ్చయాత్మకమైన విశిష్ట వ్యక్తికి నమూనాగా మన ముందు నిలబడటం కాదు. అలా కానేరదు. ఎందుకంటే — ఆయన వైశ్వానిక అతిలోకచేతన అభివ్యక్తీకరణ. అతీంద్రీయ వ్యక్తిని అభివర్ణిస్తూ ఇంకా శ్రీఅరవిందులు అంటారు — ఒక చైతన్యకాంతి, ఒక బలమైన శక్తి, ఒక నిగూఢ ఓజస్సాగర తీరాన ఉన్నామనే సంవేదన మనకు

కలుగుతుంది. దాని యొక్క క్రియాకలాప తరంగాల ఔన్నత్యాన్ని వర్ణించగలం. కాకపోతే అది తనకు తానుగా స్థిరపర్చుకోలేనిదిగా ఉంటుంది. అయినప్పటికీ కూడా, ఒక శక్తివంతమైన స్వరూపసాక్షాత్కారము యొక్క సంవేదన కలుగుతుంది. ఎవరో ఏదో ఒక బలమైన సమున్నత సుందర దివ్యమూర్తి, ఒక అతిలోకమూర్తి, పరమాత్మ, పరమపురుష, లోకాతీతమైనది — అని గుర్తించేదిగా, అందుకు తగిన రీతిలో అది అక్కడ ఉన్నదనే అభిప్రాయం కలుగుతుంది.

వారిని గురించి వారి శిష్యులైన మేము ఏమి భావిస్తామో దానినే వారు తమ అసమానమైన రీతిలో అభివర్ణించారు కదా అనే భావన కలుగుతుంది.

మూలం: ఎ.బి. పురాణి

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

(శ్రీ ఎ. బి. పురాణిగారు భారతస్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నవారు. శ్రీఅరవిందులకు తొలినాటి అనుయాయి)

పుస్తక అనుబంధం:

కాంతికిరణాలు

ఔదార్యం (Benevolence)

వ్యక్తిగతంగా ప్రతిక్రియకి అవకాశం లేని, సర్వతోముఖ సమ్యక్ దృష్టి కలిగిన అలుపెరుగని ఔదార్యం — ఇదీ ఈ భూమి మీద భగవంతుని ప్రేమించి, సేవించుకునే ఉత్కృష్ట మార్గం.

అంటే నా అభిప్రాయం — మనసా, వాచా కర్మణా త్రికరణశుద్ధితో కూడిన ఔదార్యం. అంతేకాని మానవసహజమైన ఆధిక్యతను, భయంకరమైన దిగజారుడు ఔదార్యంతో కూడిన కర్మలను ప్రదర్శించటానికి వేదికగా ఉపయోగింపబడేది కాకూడదు.

స్వేచ్ఛ

నీవు బలమైన సచేతనమైన ఇచ్ఛాశక్తి కలిగి ఉండి నీ ఇచ్ఛాశక్తి చైత్యపురుష కేంద్రంగా

ఉన్నపుడే నీవు స్వేచ్ఛను చవి చూడగలుగుతావు. లేకపోతే బాహ్యప్రలోభాలకి బానిసవు అయిపోతావు.

ఆగస్టు 24, 1955

*

స్వేచ్ఛ బాహ్యపరిస్థితులలో నుంచి రాదు. అంతరంగ విముక్తి నుంచి అది సమ కూడుతుంది. నీ అంతరాత్మను తెలుసుకో. దానితో సమైక్యమవు. అది నీ జీవి తాన్ని నిర్దేశించనీ. అప్పుడు నీవు స్వతంత్రుడవు అవుతావు.

ఆగస్టు 31, 1966

*

మనచేత సర్వోన్నత చేతన చేయించేది ఏదో అదే స్వేచ్ఛ.

మిగిలిన ఏ యితర సందర్భానికి చెందినదైనా — అంటే — ఇతరమైన ఇచ్ఛాశక్తికి కాని, సంప్రదాయానికి కాని, లేక, నైతికసిద్ధాంతానికి కాని, లేక, ప్రాణిక ప్రచోదనలకుగాని, లేక, మానసిక కల్పిత భ్రాంతులకుగాని, అన్నిటికీ మించి, అహం కారపూరిత కామనలకు గాని చెందినదైతే — అది బానిసత్వమే.

సెప్టెంబరు 21, 1969

విముక్తి: అహంకార అదృశ్యము.

*

సత్యము జయించటానికి సహకరించుటయే దివ్యప్రేమను అభివ్యక్తీకరించే ఉన్న తమార్గం.

ఫిబ్రవరి 21, 1968

*

దివ్యప్రేమను అందుకొని అభివ్యక్తీకరించే శక్తి ప్రపంచానికి ఇవ్వగలిగేది సత్యము మాత్రమే.

ఫిబ్రవరి 29, 1968

*

నిశ్శబ్దము:

పరిపూర్ణ నిశ్శబ్ద ధ్యానంలో అనంతంగా సర్వవిశాలత్వాన్ని సంతరించుకుంటుం

ది. ఆ పరిపూర్ణ నిశ్శబ్ద ప్రశాంతతలో దైవం, తన దేదీప్యమాన దివ్య వైభవకాంతిలో అవతరిస్తాడు.

అక్టోబరు 27, 1954

*

జీవాత్మ సర్వోత్తమంగా వ్యక్తమయేది నిశ్శబ్దంలోనే.

జూన్ 7, 1958

*

దైవంతో పరిపూర్ణ తాదాత్మ్యతా భావంతో కూడిన నిశ్శబ్దంలోనే నిజమైన అవగాహన కలుగుతుంది.

అక్టోబరు, 1969

శ్రీమాత

సమాచార పత్రం

నూతన ప్రచురణ: శ్రీఅరవింద సొసైటీ స్వర్ణోత్సవ సందర్భంగా, 'శ్రీమాతారవిందం' శీర్షికతో 15 వ్యాసాల సంకలనాన్ని, శ్రీ జలదంకి సురేంద్రాచార్యులుగారు, శ్రీఅరవింద సొసైటీ స్టడీ సర్కిల్, సిద్ధిపేట తరఫున వెలువరించారు.

పేజీలు 91, వెల - రూ 40/- ప్రాప్తి స్థానం: శ్రీఅరవింద సొసైటీ సర్కిల్, c\o గాయత్రి హాస్పిటల్, సిద్దిపేట, మెదక్ జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 502103

శ్రీఅరవింద సొసైటీ తిరుపతి బ్రాంచి: వారు శ్రీఅరవిందుల అవశేషాల ప్రతిష్ఠాపనోత్సవ కార్యక్రమాన్ని, శ్రీ యమ్. బలరామరెడ్డిగారి అధ్యక్షతన, 12-9-2009 యధావిధిగా జరుపుకున్నారు. డా. పి.వి. రామసుబ్బారెడ్డి ప్రిన్సిపాల్ యస్.వి. మెడికల్ కాలేజీ తిరుపతి, డా. కె.వి.యస్ రాఘవన్, శక్రటరీ అరవింద సొసైటీ కేంద్రం చిత్తూరు, ముఖ్య అతిధులుగా హాజరైనారు. శ్రీ యన్. అప్పాస్వామి స్వాగతవచనం పలుకగా, శ్రీ కె. భాస్కర పిళ్లైగారు వందన సమర్పణ కావించారు. 17-11-2009 శ్రీమాత నిర్యాణ దినాన్ని, 24-11-2009 న సిద్ధి దినాన్ని, 5-12-2009 న శ్రీఅరవిందుల నిర్యాణ దినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు.

శ్రీఅరవిందులు - క్షణదర్శనములు

రెండవ భాగము

అఖిల

అఖిల భారత పత్రిక

మే 2010

విషయసూచిక

దేవుని పాదముద్రలు

రెండవ భాగము

10. దైవానికి జనని 3

11. పృథ్వీ దేవాలయంలో దివ్యమాత ప్రతిష్ఠాపన 7

12. మానవ స్వభావ క్షేత్రం సాగుచేయుట 10

13. భూలోకం కొరకు తపస్సు 15

14. క్లిష్ట సమయంలో మార్గదర్శకుడు 24

15. మానవ నిశీథిలో అతిమానసకాంతి బీజావాసం 28

16. సావిత్రి — భవిష్యత్తుకు వారధి 32

17. నూతన ప్రపంచ ఆవిర్భావం 34

18. నవసృష్టికి పురిటి నొప్పులు 37

19. కాంతి కిరణాలు 42



దైవానికి జనని

జనన మరణ వేదనల వెనుక
అవివేకానికి భారంగా సాగే కాలానికి పరోక్షంగా
శాశ్వత చైతన్యశక్తి ఒకటి ఇచట ఉన్నది.
దేవమాత, ఆతని సోదరి, అతని చెలికత్తె
ఆతని మానస పుత్రిక, ఆతని సహచర శక్తి
దివ్యానికి జనని అయిన ఆమె
అతీత రహస్య అంతరంగ లోయల నుండి పైకెగసిపడినది.

— శ్రీఅరవిందులు

భూమి పుట్టిననాటి నుంచి ఎక్కడ ఎప్పుడు చైతన్యకిరణం వ్యక్తమయ్యే వీలు కలిగినా అపుడు అక్కడ నేను ఉన్నాను.

*

నేను ఏ జాతీయతకు, ఏ నాగరికతకు, ఏ ఒక సంఘానికి, ఏ ఒక జాతికి చెందినదానిని కాను. దైవానికి చెందినదానను. నేను దైవానికి తప్ప, ఏదో ఒక విధివిధానానికి, ఒక ధర్మానికి, ఒక సంఘ ఆచారానికిగాని విధేయంగా ఉండను.

నా ఇచ్ఛను, జీవితాన్ని, నన్ను, ఆ దైవానికి అర్పణ చేసుకున్నాను. అతని కోసం నా రక్తపు బొట్టు బొట్టు ధారపోయుటకు సిద్ధముగా ఉన్నాను. ఇదే అతని ఇచ్ఛ అయినట్లైన అతని సేవకి నాలో అణుమాత్రం మిగలకుండా పూర్తి ఆనందంతో, సంతోషంగా నా సర్వస్వం అతనికి త్యాగం చేస్తాను.

*

నిన్న మనం చూసిన అతను ఈ భూమి మీద ఇక్కడే ఉన్నాడు

దివ్యజీవనంలో ఆ భగవంతుని ఉనికిని మాత్రమేకాక మానవుడు భగవంతునితో ఏకమయ్యే సంభావ్యతలను, పనిలో చైతన్యంలో సమగ్రంగా అనుభవంలో అతనిని తెలుసుకోవచ్చని, ఈ భూమి మీద అతనిని అభివ్యక్తం కావింపచేయవచ్చని, 11-13 వయసు మధ్య అంతరాత్మ, ఆధ్యాత్మిక అనుభవాలలో దర్శనీయమయింది. దీనిని

నెరవేర్చుటకు కావలసిన ఆచరణాత్మక క్రమశిక్షణను నాకు, నా నిద్రలో అనేక మంది గురువులచే బోధించబడింది. వారిలో కొందరిని నేను తర్వాతకాలంలో ఈ భౌతిక భూమికలో కలిశాను. వీరిలో ఒకరిని, ఆధ్యాత్మికంగా, చైత్యపురుషపరంగా అత్యంత స్పష్టంగా, తరచుగా నేను అతంరంగికంగా, బాహ్యంగా అభివృద్ధిచెందుతున్న తరుణంలో కలవడం జరిగింది. ఆ సమయంలో భారతీయ వేదాంతం, మతం గురించి చాలా కొంచెం తెలిసినప్పటికీ అతనిని నేను 'కృష్ణా' అని పిలిచాను. అది మొదలుగా అతనితో కలసి దైవకార్యం నిర్వహించగలదాననుగా ఏదో ఒక రోజున ఈ భూమి మీద అతనిని తప్పక కలుస్తానని తెలుసుకున్నాను.

శ్రీఅరవిందులను చూసిన వెంటనే, మామూలుగా నేను బాగా ఎరిగిన 'కృష్ణా' అని పిలుచుకునే వ్యక్తిత్వాన్ని ఇతనిలో (శ్రీఅరవిందులలో) గుర్తించాను.... భారతదేశంలో, అతని సాన్నిధ్యంలోనే నా స్థానము, నా పని అని పూర్తిగా విశ్వసించానని వివరిస్తే చాలనుకుంటాను.

*

ఇది చాల చిన్న విషయం. అనేక వేలమంది జీవులు గాఢాంధకారంలో చిక్కుకుని ఉన్నారన్న విషయం చాలా స్వల్పమైనది. ఈ భూమి మీద నిన్న మనం చూసిన వ్యక్తి ఉన్నారు. వారి సాక్షాత్కారము చాలు — చీకటి వెలుగుగా పరివర్తన చెందే రోజు వస్తుందని, దైవరాజ్యము ఈ భూమి మీద స్థాపించబడుతుందని నిరూపణ కాబడటానికి.

(1914 మార్చి 29 న మొట్టమొదటిసారిగా మదర్ శ్రీఅరవిందులను కలిసిన తర్వాత తన డైరీలో పై విధంగా వ్రాసుకున్నారు.)

— శ్రీమాత

తమ యోగమార్గాలు ఒకటేనని గుర్తింపు:

నా యోగ మార్గానికి మదర్ యోగమార్గానికి మధ్య వ్యత్యాసం లేదు. మాకు ఉన్నది ఒకటే మార్గం. అది అతిమానస పరిణామానికి దైవసాక్షాత్కారానికి దారి

* తర్వాత కాలంలో 'మదర్' గా పిలవబడిన, మిర్రా అల్ఫాసా 1914 మార్చి 29 న మొట్టమొదటిసారిగా పుదుచ్చేరి వచ్చారు. ఒక ఏడాది తర్వాత మొదటి ప్రపంచ యుద్ధం కారణంగా ఆమె పుదుచ్చేరి వదిలి వెళ్ళవలసి వచ్చింది.

తీసేది. గమ్యం మాత్రమే కాదు. ప్రారంభం నుంచీ ఇద్దరిదీ ఒకటే మార్గం.

మదర్, శ్రీఅరవిందులను తెలుసుకొనక ముందునుంచే, కలవక పూర్వం నుంచే యోగసాధనలో ఉన్నారు. కాని వారిరువురి యోగసాధన స్వతంత్రంగా దైవసాక్షాత్కార లక్ష్యంగా ఉండేది. వారిరువురు కలిసిన తర్వాత సాధనను పరిపూర్ణం చేసుకొనుటకు పరస్పరం సహకరించుకున్నారు. శ్రీఅరవిందుల యోగంగా పిలువబడుతున్న యోగం శ్రీమాతారవిందులు ఇద్దరిదీ.

— శ్రీఅరవిందులు

*

తమ చైతన్యాలు ఒకటేనని గుర్తించుట:

నా చైతన్యం మదర్ చైతన్యం ఒక్కటే. రెండుగా ఉన్న ఒకే దివ్యచేతన — ఎందుకంటే విశ్వలీలకు ఇది అవసరం.

— శ్రీఅరవిందులు

*

నీ హృదయంలో ఆలోచనలో శ్రీఅరవిందులకు నాకు మధ్య భేదం లేకుండినచో, శ్రీఅరవిందుల గురించి నీవు ఆలోచించితే, నా గురించీ ఆలోచించినట్లే. అదే విధంగా నా గురించి ఆలోచించినట్లైన అనివార్యంగా శ్రీఅరవిందుల గురించి ఆలోచించినట్లే. ఒకరిని చూసినపుడు ఇంకొకరిని చూడనవసరం లేదు. ఎందువలనంటే ఉభయులమూ ఒకరే కనుక. ఈ విషయం తెలిసిన తర్వాత నీవు అతిమానస శక్తికి, అతిమానస చైతన్యానికి ఉన్మీలన మవడం (తెరుచుకోవడం) ప్రారంభమవుతుంది.

— మదర్

అనువాదం త్రివేణి

దివ్యజనని దైవం యొక్క శక్తి, చైతన్యం — సర్వానికి ఆమె తల్లి

శ్రీఅరవిందులు


Sri Aurobindo

పృథ్వీ దేవాలయంలో దివ్యమాత ప్రతిష్ఠాపన

నళినీకాంత గుప్తాగారి స్మృతులు

అగస్త్య మహర్షి (ఉత్తరాది నుండి) దక్షిణాదికి ప్రయాణిస్తుంటే, వింధ్యపర్వతాలు వంగి (నమస్కరించి) ఋషికి దారి ఇచ్చాయి; అవి అలానే ఉండిపోయాయి, ఋషి వెనుదిరిగి వచ్చేవరకు. ఈ పురాణకథ సందర్భంగా మనకు వెంటనే గుర్తుకు వచ్చేది, శ్రీఅరవిందులు — వారి తపస్సు, కృషి. వేద ఋషి శ్రీ అగస్త్యుల వలె, వారు కూడ ఉత్తరాది నుండి దక్షిణాదికి ప్రయాణించారు. అక్కడ శాశ్వత పీఠం ఏర్పాటు చేశారు — ఒక కొత్త వెలుగును ప్రసరింపచేయుటకు. ఈ ప్రాంతంలో 'వీరు' — ఉత్తర యోగి, లేదా ఉత్తరాది నుండి వచ్చిన యోగి, అని పిలవబడేవారు. వీరిరువురి సాధన, పనులలో ఒక విచిత్ర అనుబంధం కనీసం, ఒక్క విషయంలో మనకు కనిపిస్తుంది. శ్రీఅగస్త్యులవారు, పృథ్వి లోతుల్లోకి — దాని నిగూఢ అంతఃచేతన లోకి — సంవత్సరాల తరబడి, చొచ్చుకెళ్తూండేవారు.

శ్రీఅరవిందులు పాండిచ్చేరిలో 40 సంవత్సరాలున్నారు. అక్కడొక పీఠాన్ని స్థాపించడానికి, మొదట కొన్ని సంవత్సరాలు గడిపారు. అక్కడ — ఆటంకం లేకుండా పనిచేసుకుందుకు, తగిన ప్రదేశాన్ని ఎంపికచేసి, ఒక స్థిరనివాసం ఏర్పాటు చేసుకోవాల్సి వచ్చింది. దానికొక దృఢమైన, సుస్థిరమైన, పునాది అవసరమైంది. సుదూర — అంతులేని — లోలోతుల్లోకి చొచ్చుకుంటూ పోవాల్సి వచ్చింది. ఐదు మూలస్థంభాలను ప్రతిష్ఠించడానికే అక్కడ — అని చెప్పవచ్చు. ఇదంతా తానే స్వయంగా ఒక్క చేతి మీదుగా — శ్రీఅరవిందులు — మొదటి నాల్గు సంవత్సరాలూ — 1910 నుండి 1914 వరకు చేశారు. అప్పుడు వచ్చారు శ్రీమాత.

అది స్వల్పకాలమే అయినా, అప్పుడే — భవిష్యత్తులో, రాబోయే వారి కొత్త సృష్టికి — దాని అస్తిత్వానికి, దానికొక రూపం కల్పించటానికి స్పష్టమైన ప్రణాళికలు వేయబడినవి. వీటికి పునాదులు నిర్మించే పనిలో నిమగ్నమయారు శ్రీఅరవిందులు 1920 వరకు. అటు తర్వాత — ఈ పనికి బలాన్ని చేకూర్చడానికి — అది భవిష్యత్తులో భారాన్ని తట్టుకోగలదో లేదో పరీక్షించడానికి — ఆ భారాన్ని సమర్థవంతంగా తట్టుకునేటట్లు చేయడానికి — శ్రీమాతతో కలిసి పని చేశారు —

1920 నుండి 1926 వరకు. తర్వాత 1926 లో ప్రారంభమయ్యాయి, బాహ్యనిర్మాణపు పనులు. వాటితో పాటు ప్రారంభమయ్యాయి, వాటి అధిష్టాన 'దేవత' ను ప్రతిష్ఠించే పనులు. ఇవి పూర్తి కావడానికి 12 సంవత్సరాలు పట్టింది. తర్వాత 12 సంవత్సరాలు, వీటిని శాశ్వతం, సుస్థిరం చేసేందుకు పట్టింది. తన పని పూర్తయాక శ్రీఅరవిందులు ప్రక్కకు తిరిగారు — వేరొక తరహా కొత్త పని చేపట్టేందుకు. ఈ సంస్థ తన కొత్త సృష్టి — కలకాలం తలెత్తుకుని మనగలగడానికై శ్రీఅరవిందులు తమ శక్తంతా ధారపోశారు. ఈ 'పృథ్వీరూపం'లో 'దివ్యమాత' ను శాశ్వతంగా ప్రతిష్ఠించడమే శ్రీఅరవిందులు కోరుకున్నది — వారు తమ శరీరంతో చేయాలనుకున్నదంతా ఇదే.

ఈ దేవాలయాన్నే మనం 'ఆశ్రమం' అంటున్నాం; ఆమె శక్తి, ఆమె భౌతిక ఉనికి, ఆ ప్రభావం వల్లనే, ఆశ్రమం వృద్ధిచెంది, ఆమెను వ్యక్తపరచుచున్నదిక్కడ — నిత్యనూతనంగా, విశ్వాల దివ్యమాత, తనను తాను ప్రతిష్ఠించుకున్నదిక్కడ. బంగరు ఆలయంలో సజీవంగా ఉండే ఈ దేవత — పొందదగిన సర్వశక్తులతో — వ్యక్తమై ఉన్నదిక్కడ. ఇప్పుడు ఆమెయే స్వయంగా చేపట్టిందీ పనిని; యావత్ పృథ్విని, మానవజాతిని, — తన సజీవ వ్యక్తరూపాలుగా ఎదిగే గమ్యం వైపు — నడిపించుచున్నది, ఆమె కృపాశక్తియే.

మూలం: నళినీకాంత గుప్తా

శ్రీమాత పృథ్వీరూపం (పార్థివమూర్తి) — ఒక అవకాశం పృథ్వికి

ఆమె పృథ్వీరూపం — అభివ్యక్తీకరణ — పృథ్వీచైతన్యానికి ఒక అవకాశం: (1) అతిమానసాన్ని తన లోనికి గ్రహించడానికి — (2) అందుకు తగిన రూపాంతరీకరణ సంభావ్యం కావించటానికి. తరువాత, ఇంకా మరింత అతిమానస పరివర్తన

శ్రీమాత శాశ్వతంగా పాండిచ్చేరి వచ్చింది 24 ఏప్రిల్ 1920 న. " నేను పాండిచ్చేరి తిరిగిరావడం — ప్రతికూల శక్తులపై విజయానికి స్పష్టమైన సంకేతం." – శ్రీమాత

నళినీకాంత గుప్తా — శ్రీఅరవిందుల ప్రముఖ అంతేవాసి; విప్లవకాలంలో వీరు శ్రీఅరవిందులతో కలిసి ఆలీపూర్ జైల్లోను, పాండిచ్చేరిలోను ఉన్నారు. వీరు శ్రీఅరవిందులతో కలిసి పాండిచేరి వచ్చి వారితో అక్కడే ఉండిపోయారు.

జరుగుతుంది. కాని, యావత్ పృథ్వీ చైతన్యం అతిమానసీకరింపబడదు. అతిమానసానికి ప్రాతినిధ్యం వహించే ఒక కొత్త జాతి తొలిసారిగా వస్తుంది, బుద్ధిజీవిగా తొలిమానవుడు ఉద్భవించినట్లు, (13-8-1933) పృథ్వీచైతన్య పరిణామంలో — అతిమానస పరిణామం అనుశాశితమై, తప్పనిసరిగా జరిగే విషయం; ఎందుకంటే — దాని ఊర్ధ్వగామి అధిరోహణ — ఇంకా అంతం కాలేదు; బుద్ధి దాని ఆఖరి శిఖరం కాదు. కాని ఆ మార్పు రావడానికి, అది ఒక రూపం తీసుకుని స్థిరపడటానికి — ఇంకా ఉన్నది ఒక అవసరం — 1) ఎగువ నుండి ఆ సర్వోన్నతుని అనుమతి 2) ఈ అనుమతితో దిగువ నుండి ఒక పిలుపు, (3) దానితో పాటు, దాని 'వెలుగు' వచ్చినపుడు, దానిని తిరస్కరించకుండా, గుర్తించాలనే ఒక ఇచ్ఛ. ఈ 'అనుమతి' 'పిలుపు' ల మధ్య — సంప్రదించి, సామరస్యాన్ని కుదిర్చే అనుసంధానశక్తియే దివ్యమాత. కేవలం మానవప్రయత్నం, తపస్సు కాక, దివ్యమాత శక్తే — పాత్ర (సత్తా) మూతను తెరచి, దానిని కప్పే (అజ్ఞానపు) పొరను ఛేదించి, పాత్ర రూపాన్ని సరిచేయగలదు; అంధకారం, అసత్యం, మరణం, యాతన, బాధలతో కూడిన ఈ ప్రపంచంలోకి — సత్యం, వెలుగు, దివ్యజీవనం, అమరానందాన్ని — తీసుకురాగలదు.

శ్రీమాత కొరకు సాధన చేసే ప్రతి ఒక్కరు, నా యోగం చేస్తున్నారు. సొంత వ్యక్తిగత కృషితో పూర్ణయోగాన్ని చేయగలనని అనుకోడం — ఆ యోగాన్ని, అన్ని వైపుల నుండి సఫలీకృతం కావించగలమని అనుకోడం — ఒక పెద్ద తప్పు. ఏ మానవసత్తా కూడా, ఆ పని చేయలేదు. ఎవరైనా చేయవల్సిందేమంటే — తాముగా శ్రీమాత చేతుల్లో పెట్టుకోడమే; ఆమె కొరకు (సదా) తెరుచుకుని ఉండడమే — సేవ ద్వారా, భక్తి ద్వారా, ఆకాంక్ష ద్వారా. అప్పుడు తన దివ్యకాంతి, శక్తులతో పని చేస్తుంది శ్రీమాత — అతనిలో — సాధన జరిగేలా, పూర్తయేలా.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: యస్. వై. సోమయాజులు

మానవ స్వభావ క్షేత్రాన్ని సాగుచేయుట

గంభీర హృదయుడు ద్రష్ట

గంభీర హృదయుడు ద్రష్ట, నిగూఢ రహస్యాల దివ్య ప్రభువు
ఉద్గమిస్తున్న గుహ్యప్రేమ ప్రభువు హృదయమూలము నుంచి
అనంత కాలంలో పయనించ లేదెవ్వరు నీ వెరిగిన దివ్య మార్గాలలో
ఉరవడిగా జారిపడే మాటల వెల్లువ, జ్ఞానసాగరపు జ్వాలా కెరటాలు
దివిసీమ తీరాలను తాకి ప్రక్షాళనం చేసే నీ విస్తార ఆత్మ కెరటం,
జ్వలించే స్వచ్ఛతతో నిర్గమించే అభిప్రాయాలు మర్త్య విభావరిని అధగమిస్తుంటే
వెలుగుల గ్రంధమునుంచి వెలువడిన శ్వేత వ్రాతప్రతులు ఇవ్వబడినవి
పుటలు పుటలుగా మందబుద్ధులైన పృథ్వీ పుత్రులకు.

*

ఒక యోగి రచనలు చేసినప్పటికీ అతను సాహిత్యవేత్త కాడు. ఎందువల్లనంటే అతనిలోని సంకల్పము, అంతర్గతమైన వాక్కు దేనిని వ్యక్తం చేయాలనుకుంటుందో దానిని మాత్రమే రాస్తాడు. తన స్వంత సాహిత్య వ్యక్తిత్వానికి అతీతంగా చాలా అధికమైన విషయానికి అతనొక ఉపకరణంగా, సాధనంగా పనిచేస్తాడు.

వాక్ఛక్తి: నూతన భావ బీజాలు నాటేది

మాటకి శక్తి ఉంది — మామూలు మాటకు కూడా శక్తి ఉంటుంది. అది ప్రేరణతో వచ్చినదైతే దాని శక్తి చాలా అధికము. అది ఏ విధమైన శక్తి, ఆ శక్తి దేని కోసము అనేది ఆ వచ్చిన ప్రేరణను బట్టీ, ఆ విషయం మీదా, అది వ్యక్తి ఏ భాగం మీద ప్రభావం చూపిందో దానిని బట్టీ, ఉంటుంది. అది దివ్యవాక్కుయే అయి ఉంటే ధర్మశాస్త్రాల్లోని కొన్ని సూక్తులు, వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీతల శ్లోకాలు లాటివి. అవి ఆధ్యాత్మికంగా జాగృతం చేసి ఉద్ధరించి ప్రచోదన గావించేవిగా ఉంటాయి. ఇంకా అవి ఆత్మసిద్ధిని ప్రేరేపించే శక్తి కలిగి కూడా ఉంటాయి.

శ్రీమాత, శ్రీఅరవిందులు కలిసి 21 జూన్, 1914 న, 64 పేజీలతో ఒక మాస పత్రిక 'ఆర్య' ప్రారంభించారు.

ఆధ్యాత్మికానుభవాలకవి అనుకూలమైనవి.

వైదిక ఋషులు వారి కవనాలను మంత్రాలుగా భావించారు. అవి ఆత్మసిద్ధికి సాధనాలు కాగలిగాయి. ఇతరులకు కూడా ఆత్మసిద్ధి సాధనాలు కాగలిగినాయి. సహజంగా ఇవన్నీ వారికి కలిగే జ్ఞాన ఉద్దీపనములు అవచ్చు, కానీ యోగమార్గంలో చివరికి కలిగే శాశ్వత ఆత్మసాక్షాత్కారము కాదు. అవి, యోగసిద్ధికి సోపానాలు, యోగమార్గంలో దారి చూపగల జ్ఞానదీప్తులు మాత్రమే. లోగడ నేను ఉపనిషత్తులు, భగవద్గీత అధ్యయనం చేసి ధ్యానం చేసేటప్పుడు ఈ విధమైన ఉద్దీపనలు, ప్రాథమిక సిద్ధులు చాలా కలిగాయి. ఈ వాక్కు ఉచ్ఛరించినా, లేక వ్రాతపూర్వకంగా ఉన్నప్పటికీ కూడా అంతర్గత అగ్నిని రగిలింప చేసి, అనంతాకాశాన్ని తెరిపించి అందులోని విషయాన్ని మాటలరూపంగా దర్శింపచేస్తుంది. ఆర్య పత్రికలోని అంశాలను చదువుతున్నవారికి కూడా ఈ విధమైన సిద్ధులు కలిగాయి. అందులో ఉన్నది కవితలూ కాదు, వాటికి ఆధ్యాత్మిక కవిత్వంలోని శక్తీ లేదు. అయినప్పటికీ అందులోని మాటలకు వివిధ విషయాలకు సంబంధించిన శక్తి మాత్రం ఉన్నట్లు తెలుస్తుంది. అన్ని యుగాలలోను ఆధ్యాత్మిక ద్రష్టలు తమ అనుభవాలను, ఆకాంక్షలను కవిత్వరూపంగానూ, ఉత్తేజిత వాక్యరూపంగానూ భద్రపరచడం వల్ల అవి పలువురికి ఉపయోగకరమైనాయి. అందువల్ల అటువంటి కవితలకు ఆధ్యాత్మిక విలువలను, అతీంద్రియ విలువలను ఇచ్చి చాలా విలువైనదిగా నేను చెప్పటంలో అసంబద్ధత ఏమీ లేదు.

అర్య పత్రిక లోని ఒక అంశము: నూతన జీవులు రూపుదిద్దుకోవలసిన సమయం

రాబోయే కొత్త పురోగమన దశకి ఆరంభంలో ఉన్నాం. ఇది ఎంతో విస్తృతంగా ఎన్నో సమన్వయాలకు ఏకీకరణలకు దోహదపడుతుంది. మనం గత ఉషస్సులకు చెందిన వాళ్లంకాము, కాగా భవిష్యమధ్యందిన మార్తాండ తేజస్సులకు చెందిన వాళ్లం. నూతన అంశాలు ఎన్నో కుప్పలుతెప్పలుగా మనలను ముంచెత్తుతున్నాయి. వాటిని జీర్ణించుకోవాలి. ఒక్క భారతదేశంలోనివే కాక ప్రపంచంలోని ఎన్నో గొప్ప గొప్ప ఆస్తిక మతాల ప్రభావాలనూ, పునరుద్ధరించబడిన బౌద్ధమత భావాలను మనం ఆకళింపు చేసుకోవటమే కాక అధునాతన అన్వేషణా విజ్ఞానశాస్త్రాలతో వాటి పూర్తి

శక్తి సాధ్యతలను ఆకళింపుచేసుకోవవసిన అవసరం ఉంది. అంతకంటే కూడా నశించిపోయిందనుకున్న కాలదోషం పట్టిన మానవచైతన్యం కోల్పోయిన అనేక మార్మిక విషయాలు ఎంతో ఉజ్వలంగా బయల్పడుతున్నాయి. ఇదంతా కూడా ఒక చక్కని సరికొత్త సుసంపన్న సకలార్థ సమన్వయకృత సంకలనాన్ని సూచిస్తోంది. ఈ లభించిన దాన్నంతటినీ కలిపి ఉంటే విస్తృత సామరస్యీకరణ మన భవిష్యత్ మానసిక ఆధ్యాత్మిక చర్యలకు చాలా అవసరము.

ప్రస్తుత మానవజాతి పడుతున్న పరిణామ సంక్లిష్టత లోనే దాని భవితవ్యాన్ని అది ఎన్నుకోగల అవకాశం దాగి ఉంది:

కొన్ని విషయాల్లో చూస్తే మానవ మేధ అంతులేని అభివృద్ధిని సాధించి ఉండగా మరి కొన్ని విషయాల్లో దిక్కుతోచని స్థితిలో నిశ్చేష్టితంగా నిలిచిపోయి ఉంది. మానవుడు తన అతి చురుకైన తెలివితో, జీవిత సంకల్పంతో బాహ్యజీవనానికి కావలసిన హంగులను పెంచుకొంటూ, నిర్మాణాలు నిర్మించుకుంటూ వెళ్లాడు. తన మానసిక, ప్రాణిక, దైహిక అవసరాలకు, కోరిలకూ కావలసినట్లుగా సంక్లిష్టమైన ఒక బృహత్తర రాజకీయ, సాంఘిక, పరిపాలనావిధానాల, ఆర్థిక, సాంస్కృతిక యంత్రాంగాలను తన మానసిక, ఇంద్రియ, రసాత్మక, వస్తు సంబంధిత పరితృప్తి కోసం కావలసిన వ్యవస్థలనూ నిర్మించుకున్నాడు. ఈ నాగరిక నిర్మాణం ఒక అంతులేని అసాధ్యమైన బృహత్తర నిర్మాణము. మనిషి సృష్టించిన ఈ నాగరిక వ్యవస్థ తన పరిమిత మనోసామర్థ్యాన్ని, అవగాహననూ ఇంకా పరిమితమైన ఆధ్యాత్మిక, నైతిక సమర్థతకూ మించి, తప్పుల తడకైన అహంభావానికీ, దాని కోర్కెలకు తనను అపాయకరమైన సేవకునిగా తయారుచేసింది. ఈ సమయంలోనే శాస్త్రవిజ్ఞానం అనేక సార్వత్రిక శక్తి వినియోగ పద్ధతులను ఆతనికి అందుబాటులోకి తెచ్చింది. అయితే ఈ సార్వత్రికశక్తి భౌతికంగా మానవాళిని ఒకటిగా చేసింది — ఈ వైశ్వానిక శక్తిని ఉపయోగించేది మాత్రం అల్పమానవ వ్యక్తిత్వం లేదా సామూహిక అహం. చివరికి జరిగిందేమంటే వికటించే మనోభావాల అల్లకల్లోలం, వ్యక్తిగత, సామూహిక అవసరాల కోసం వెంపర్లాడటం, ప్రాణికపరంగా కామనలు, హక్కులు కోసం దేవురింపులు. ఇంకా అమాయక జీవనగతి తాలూకు ప్రేరణలు, వ్యక్తులు, వర్గాలు, దేశాలు ఆకలితో జీవనాధారం కోసం చేసే ఆక్రందనలు. మానవ మేధస్సూ,

జీవితము పరిణామం చెందవలసింది సక్రమ సార్వజనీనత్వ దిశగా ఆ రకమైన అభివృద్ధి కోసమే. కాని అహంకారం, వేర్పాటు ధోరణి, విభజనలనేవి మనస్సులో ఉంచుకొని సాగితే మాత్రం ఈ సార్వజనీనత అనేది వెర్రి మొర్రి భావాలనూ, ప్రేరణలనూ సృష్టిస్తుంది. ఇంకా చక్కగా విలీనంకాని మనస్సూ, కలగాపులగంగా కలిసిన అతి విస్తృత ఉనికితో ఉన్న ప్రాణిక, దైహిక మానసిక పదార్థాలు వాటి అధికారాలతో, తృష్ణలతో విజృంభిస్తాయి. శాస్త్రిమూ, తర్కమూ రెండూ కూడా భౌతిక జీవనాన్ని ఒక కృత్రిమమైన ఏర్పాటుతో యాంత్రికంగా ఏకీకరణం చేస్తూ ఒక క్రమపద్ధతిలో నడిపించడానికి మాత్రమే సహాయపడతాయి. ఇంతకు మించి సంపూర్ణ జీవితం కావాలంటే అన్నిటినీ ఏకం చేయగల, సమన్వయం చేయగల, సామరస్యపూర్వక ఉత్కృష్ట సంభావ్యత, గొప్ప పరిజ్ఞానము, సంపూర్ణశక్తి అవసరమౌతాయి.

మానవ పాత్రను సిద్ధం చేయటం:
(సోదరుడు బరీన్‌కి వ్రాసిన లేఖ నుండి (1920 ?)

అపరిశుభ్ర పాత్రలలో ఆధ్యాత్మిక శక్తిని నింపినట్లయితే — సరిగా కాలని మట్టిపాత్రలో ద్రాక్షరసము నింపితే అది విచ్చిపోయి మధువంతా నేలపాలైపోతుంది — ఆధ్యాత్మికతంతా ఇగిరిపోయి కాళీపాత్ర మిగిలి ఉంటుంది. ఏ రంగంలోనైనా ఇదే జరుగుతుంది. నేను నా ఆధ్యాత్మిక ప్రభావాన్ని పంపినప్పుడు దాన్ని గ్రహించుకున్నవారు శక్తిని పుంజుకొని బాగా పనిచేస్తారు. ఒక్కొక్కప్పుడు ఆ శక్తి నిర్వీర్యం అయిపోయి అది కోతిగా తయారై శివాలయంలో ఉంచడానికే పనికొస్తుంది.

నీవు వ్రాసింది "నేను దేముణ్ణి కాదు, సాగగొట్టి తయారుచేసిన ఉక్కును" అని — ఎవరూ దేముడు కాదు గానీ ప్రతివారిలోనూ ఒక భగవంతుడుంటాడు. ఆయనను మూర్తిమంతం చేయడమే దివ్యజీవన కర్తవ్యము. అది ప్రతివారూ చేయగలరు. ఆ విషయంలో సమర్థత కొంతమందికి ఎక్కువ, కొంతమందికి తక్కువ ఉంటుందని నేను ఒప్పుకుంటాను. సమర్థత మాట ఎలా ఉన్నా భగవంతుడు కనుక తన వ్రేలిని ఎవరి మీద ఉంచితే వారి ఆత్మ జాగృతమవుతుంది. ఎక్కువ, తక్కువ సామర్థ్యాలలో పెద్ద తేడా ఉండదు. కష్టం ఎక్కువ కావచ్చు, లేదా ఎక్కువ సమయం పట్టవచ్చు. అభివ్యక్తీకరణ ఒకే మాదిరిగా ఉండకపోవచ్చు. ఏదీ చెప్పలేము.

ఆ లోపలి భగవంతుడు ఈ కష్టాలను, లోపాలను లెక్కచేయడు, తాను బలవంతంగానైనా బయటకు వచ్చి తీరుతాడు.

భగవంతుని కృషి — స్వర్గాన్ని దక్కించుకున్నాము, భూమిని మాత్రం కాదు (జపాన్‌లో ఉన్న శ్రీమాతకు వ్రాసిన లేఖ)

భూమండలమంతా ఒకే ఒక నియమానికి కట్టుబడి ఉంది. ఒకే ప్రకంపనాలకు స్పందిస్తుంది. పోరాటాలు, పెనుగులాటలులేని ప్రదేశం ఎక్కడైనా ఉంటుందా అనే సందేహం నాకుంది. ఏది ఏమైనా, ప్రయోజనాత్మకమైన కార్యక్రమ విరమణ నాకు వ్రాసిపెట్టి లేదనుకుంటాను. (6-5-1915)

*

స్వర్గాన్ని దక్కించుకున్నాము, భూమిని మాత్రం కాదు. యోగసంపూర్ణతను, వేదసూత్రంలో చెప్పాలంటే, "స్వర్గలోకము, భూలోకము రెండూ సరిసమానము, ఒక్కటే" (20-5-1915)

*

అంతర్గంతంగా ఉన్నదంతా పరిపక్వమై ఉండటమో లేక పరక్వమౌతూ ఉంటూండటమో జరుగుతోంది. కానీ ఒక విధమైన సంఘర్షణ లోపల బిగిసిపోయి ఉంది. ఏదీ కూడా గెలుపు సాధించే దిశలో లేదు. ఇది ఇంచుమించు యూరపుదేశంలో కందకాలలో జరిగిన యుద్ధం మాదిరిగా ఉంది. భౌతిక ప్రపంచపు మొండితనాన్ని నిలువరించాలని ఆధ్యాత్మిక శక్తి ప్రయత్నిస్తోంది. కానీ ఆ మొండి భౌతిక ప్రపంచం అడుగడుగునా ఎదిరిస్తూ ఫలవంతం కాకుండా నిరోధిస్తోంది. అంతర్గతంగా మంచి బలము, దివ్య ఆనందాతిశయము లేనట్లుగా అది చాలా విసిగించి, వేధిస్తుంది. కానీ జ్ఞాననేత్రం దూరదృష్టితో చూసి అది కేవలం నాన్పుడు వ్యవహారం మాత్రమేనని గమనిస్తోంది. (28-7-1915)

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: అమరవాది వేంకటరామశాస్త్రి, అమరవాది ప్రభావతి

భూలోకం కొరకు తపస్సు

అతిమానస దివ్యచైతన్య అవరోహణ:

అతిమానస చైతన్యాన్ని కేవలం నా కోసం సిద్ధింపచేసుకోవాలనే వుద్దేశం నాకు లేదు — నా కొరకు నేనేమీ చేసుకొనుట లేదు. ఎందుకనగా, వ్యక్తిగతంగా, నాకే అవసరము లేదు — మోక్షప్రాప్తిగాని, అతిమానసచైతన్యప్రాప్తి గాని. అతిమానస చైతన్య ప్రాప్తి కోసం నేను ప్రయత్నిస్తున్నానంటే అందుకు కారణం అది భూచైతన్యం నిమిత్తం నిర్వర్తించవలసి వచ్చిన ఒక కార్యం కనుక...

*

మానవసంబంధిత భావాలైన అధికత్వ అల్పత్వములను నేను లక్ష్యపెట్టను. అంతరంగ సత్యము, వెలుగు, సామరస్యత, ప్రశాంతతలోని మూలతత్వాన్ని అన్వేషించి కొంతవరకు భూచైతన్యము లోనికి తెచ్చుటకు నేను ప్రయత్నిస్తున్నాను. ఊర్ధ్వస్తరాలలో అది నాకు కనిపిస్తున్నది. అదేమిటో కూడ నాకు తెలుసు — దాని నిరంతర మెరుపులు, నా చైతన్యంపై ప్రసరిస్తున్న అనుభూతి నాకున్నది. మానవుని ప్రకృతి సగం వెలుగులోను, సగం చీకటిలోను మ్రగ్గుతూ మసలే బదులు, దాని స్వీయశక్తి పరిధిలోనికి జీవిని సంపూర్ణంగా స్వీకరించ వీలు కలిగించుట కోసం నేను ప్రయత్నిస్తున్నాను. ఈ పరమ సత్యము యొక్క అవరోహణ భూపరిణామక్రమము యొక్క అంతిమ లక్ష్యమైన దివ్యచైతన్య వికసనానికి మార్గం సుగమం చేస్తుందని నా నమ్మకము.

దివ్యచైతన్య అతిమానస రూపాంతరీకరణకు మార్గమును తెరుచుట

'రూపాంతరీకరణ' అనే పదము నేను స్వయంగా తీసుకునివచ్చినది ('అతిమానసం' మాదిరిగ). సమగ్ర యోగానికి సంబంధించిన కొన్ని ఆధ్యాత్మిక భావనలను, వాస్తవాలను, స్పష్టపరచటానికై ఈ పదమును రూపొందించాను. కాని వాటికి నేను కూర్చిన మూలభావానికి యే మాత్రం పొసగని అర్థము వచ్చే రీతిలో ప్రస్తుతం ప్రజలు వాటిని ఆలపిస్తున్నారు. ఆధ్యాత్మిక పరివర్తన, నా ఉద్దేశంలో, ఒక క్రియాశీల చర్య (ఎలాంటి అవరోహణ అవసరం లేకుండానే సాధించే ఆత్మవిమోచన లేక భగవత్ సాక్షాత్కారము మాత్రమే కాదు). అది జీవియొక్క అణువణువు నుండి

అవచేతన వరకు ప్రతి భాగములోను క్రియాశీలమైన మరియు సుస్థిరమైన ఆధ్యాత్మిక చైతన్యమును వహింపచేయు ప్రక్రియ.

*

నా భావనలో, పరివర్తన ఒక స్వాభావిక మార్పు కాదు. ఉదాహరణకు, పరమ పవిత్ర జీవిగా ఎదుగుటయో లేక నైతిక పరిపక్వత పొందుటయో లేక యోగసిద్ధి సాధించుటయో (తాంత్రికుల మాదిరిగ) లేక అతీతశక్తులు గల చిన్మయ శరీరాన్ని బడయుటయో కాదు. రూపాంతరీకరణను నేను ఒక ప్రత్యేక భావనలో వాడతాను. ప్రాణాధారమైన భౌతిక జంతులోకంలో మానసికంగా ఎదిగిన ఒక జీవి ప్రప్రథమంగా ప్రకటితమైనప్పుడు, అతనిలో చోటు చేసుకున్న సాధారణ చైతన్యానికి మించిన, ఉన్నతమైన, విస్తృత పరిధి కలిగిన, పరిపూర్ణ ఆధ్యాత్మిక పరివర్తన కలుగుటకు ఒక దృఢమైన, నిర్దిష్టమైన, విలక్షణ మార్పును చైతన్యము లోనికి తెచ్చే ప్రక్రియకు అది సూచిక.

*

మన యోగము యొక్క లక్ష్యము అతిమానస జీవిని, అతిమానస ప్రపంచాన్ని, అతిమానస చైతన్య ప్రకృతిని కనుగొనుట మరియు జీవితంలో వాటి అభివ్యక్తతను తెలుసుకొనుట. కాని, ఇందులో ఉత్పన్నమయ్యే కొన్ని సాధారణ పొరపాట్లనుండి మనలను మనము కాపాడుకోవాలి. అరిమ, గరిమల లాంటి కొన్ని శక్తులు, భౌతిక క్రియలపై నియంత్రణ, వ్యాధి నివారణా సామర్థ్యము మొదలగు శక్తులను అతిమానస చైతన్యవంతమైనవని, భౌతికబలం కలిగినవని మనుషులు అనుకుంటారు. చాలా సందర్భాలలో, తెలిసో తెలియకో, ఎవరైతే ఈ శక్తులు నిక్షిప్తమై వుండే అవచేతనాస్థితికి తెరచుకుంటారో, వారు ఈ శక్తులను పొందగలుగుతారు. అతిమానసం గురించిగాని లేక యోగము గురించిగాని అణుమాత్రమైన అవగాహన కూడ లేని మనుషులు ఇలాంటి శక్తులను కలిగివున్న సందర్భాలు కోకొల్లలు.

(శ్రీఅరవిందులతో జరిగిన సాయంకాల ప్రసంగాల నుండి శ్రీ ఎ. బి. పురాణిగారి జ్ఞాపకాలు)

మార్గదర్శి: తేజోమయ మార్గాన్ని తెరచుట:

అమ్మ విషయంలోను, నా విషయంలోను మేరు సమానమైన కష్టాలను అధిగమించటానికై అన్ని మార్గాలను అన్వేషించవలసి వచ్చింది, అన్ని పద్ధతులను పాటించవలసి వచ్చింది. మీరుగాని, ఇతరులుగాని ఆశ్రమవాసులుగాని, బయటివారుగాని భరించగలిగిన భారం కన్నా అత్యధికమైన భారాన్ని భరిచంవలసి వచ్చింది. అతి క్లిష్టపరిస్థితుల నెదుర్కొని, పోరాటాలు జరిపి, గాయాలు ఓర్చుకోవలసి వచ్చింది. చొరలేని చిత్తడినేలలను, ఎడారులను, అడవులను దాటుటకై మార్గాలను వెతుక్కుంటూ, ప్రతికూల ప్రజాసమూహాలను వశపరచుకోవలసి వచ్చింది. ఇలాంటి పనిని మాకంటే ముందు ఎవ్వరు కూడ చేసి వుండరని నేను కచ్చితంగా చెప్పగలను. ఎందుకనగా మేము చేపట్టిన కార్యంలో మార్గదర్శకుడు దైవాన్ని పైనుండి క్రిందికి దించి ఆతని ప్రతినిధిగ దివ్యత్వాన్ని తాను సమకూర్చుకుని వ్యవహరించటమే గాక మానవజాతి ఉన్నతస్థాయికి ఎదిగే మూలశక్తికి కూడ ప్రతిరూపంగా నిలచి వారి యొక్క సమస్త బాధలను భరించాలి. ఇది కేవలం ఒక క్రీడగానో లేక ఒక లీలగానో కాకుండ ధృఢచిత్తంతో అనుభవించాలి. ఈ మార్గంలో ఎదురయ్యే అన్ని ఆటంకాలను, కష్టాలను, ప్రతికూల పరిస్థితులను, భంగపాట్లను, ప్రతిబంధకాలను ఎంతో శ్రమకోర్చి ఎదుర్కొంటూ నెమ్మదిగా అధిగమించాలి. కాని, ఇతరుల జీవితాలలో ఇదంతా పునరావృతం కానవసరం లేదు, సహించగలిగింది కూడా కాదు. మాకు సమగ్రమైన అనుభవం వున్న కారణంగా ఇతరులకు ఒక సరియైన, సులువైన మార్గాన్ని చూపగలుగుతాం — దానిని అనుసరించడానికి వారు అంగీకరిస్తే. మాకు కలిగిన అనుభవం అంచనాల కందని మూల్యం చెల్లించి సంపాదించినది గనుక మిమ్ములను, ఇతరులను మనస్ఫూర్తిగా కోరుతున్నాము — "దివ్యజ్ఞాన చైత్యపురుష వైఖరిని అవలంబించండి, ప్రత్యక్షంగా లేక పరోక్షంగా దైవం మిమ్ములను ఉద్ధరిస్తూండగా, తిన్నగ సాగే తేజోమయ మార్గాన్ని అనుసరించండి — కఠినమైన, ప్రతిబంధకాలతో కూడిన, చుట్టుతిరుగుడు, దుర్గమమైన మార్గంలో పయనించాలని పట్టు పట్టకండి."

*

నా గురించి, అమ్మ గురించి ఈ విధంగా అనే వారుంటారు — "దివ్యచైతన్యం

క్రిందికి రావాలంటే, అది ప్రతివారిలోను రావచ్చు కదా, అలాంటప్పుడు ముందుగా వారిలోనే ఎందుకు? వారి కంటే ముందుగా మాకెందుకు రాకూడదు? వారి ద్వారానే ఎందుకు రావాలి? నేరుగ ఎందుకు మాకు రాదు?" ఇది వినటానికి ఎంతో అర్థవంతంగా, తార్కికంగా, హేతుబద్ధంగా అనిపిస్తుంది. కాని యిబ్బంది ఎక్కడ కలుగుతుందంటే, ఈ అభిప్రాయం నిబంధనలను ఉపేక్షించి, దివ్యచైతన్య మనగా ఏమిటనే కనీస జ్ఞానం లేకుండా తమలో దివ్యచైతన్యాన్ని ఆవిష్కరింప చేసుకోవచ్చుననే మూర్ఖపు భావనను కలిగించి, ఒక మహాద్భుత ఘటనను తలక్రిందులుగా ఊహింపజేస్తుంది. ఈ ప్రయత్నం చేసే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఒక దారుణ పతనావస్థకు లోనవుతారు — ఇతః పూర్వం ఈ ప్రయత్నం చేపట్టిన అందరిలాగే, ఇది ఏ విధంగా వుంటుందంటే, మార్గదర్శిని విస్మరించి, కొండచరియ అంచున వున్న ఇరుకైన త్రోవనుండి గాలిలోకి దూకి శిఖరాగ్రాన్ని చేరవచ్చునని వూహించినట్లుగ వుంటుంది. దాని అనివార్యమైన ఫలితం తెలిసినదే కదా!

ప్రేమభారాన్ని భరించుట:

నాకై నేను స్వయంగా తేజోమయ మార్గంలో పయనించినందు వలననో లేక కష్టానికి, బాధకు, అపాయానికి జంకినందు వల్లనో కాదు. ఈ విషయాలలో నా వాటాను నేను పూర్తిగా అనుభవించాను. అమ్మ తన వాటాకు పదిరెట్లు అనుభవించింది. అయితే అందుకు కారణం దివ్యమార్గదర్శకులైన వారు ఈ విషయాలపై గెలుపు సాధించటానికి, వాటిని ఎదిరించవలసి వచ్చింది. సాధకుడికి ఎదురయ్యే ఏ కష్టమునూ కూడా మా పయనంలో మేము ఎదుర్కొనకుండా వుండలేదు; వాటిని అధిగమించటానికి ముందు, చాలా వాటికి విరుద్ధంగా వందలసార్లు పెనుగులాడవలసి వచ్చింది. (నిజానికిది తక్కువ చేసి చెప్పటమే అవుతుంది); ఇలాంటి సమస్యలు ఎన్నో యింకా మిగిలివున్నాయి. సమగ్ర పరిపూర్ణత చేకూరేవరకు కొనసాగే హక్కు సమస్యలకు వుంటాయి. అలాగని ఇతరులకు సమస్యలు అనివార్యమైన అవసరాలని మేము ఎప్పుడు సమర్థించలేదు. వాస్తవానికి, ఇతరులకు యిక పైన సులభతరమైన మార్గము తప్పక చేకూరాలనే వుద్దేశంతో మేమే వాటి భారాన్ని భరించాం. ఆ లక్ష్యంతోనే అమ్మ ఒకసారి భగవంతుని ప్రార్థించారు — ఈ మార్గానికి ఏ విధమైన కష్టాలు, అపాయాలు, బాధలు అవసరమో అవన్నీ ఇతరులపై గాక తనపైనే మోపమని.

ఏండ్ల తరబడి ప్రతి రోజు ఆమె గావించిన తీవ్ర ప్రయత్నాల ఫలితంగా ఆమె కొసగబడిన వరమేమిటంటే, ఎవరైతే ఆమెపై ఒక సంపూర్ణ నమ్మకం మనస్ఫూర్తిగా వుంచుతారో వారు తేజోమయ మార్గాన్ని అనుసరించగలుగుతారు. అలా చేయనివారు సైతం ఆమె యందు విశ్వాసముంచిన యెడల, వారి మార్గము సుగమమైనట్లుగా, గమనిస్తారు. వారి మార్గము కష్టతరమైనట్లైతే అది కేవలం అపనమ్మకము, తిరుగుబాటు, అభిమానము లేక యితర అజ్ఞానపు చీకట్లు వారిని ఆవరించినందువల్ల అని చెప్పవచ్చు. తేజోమయ మార్గము కేవలం ఒక కల్పిత కథ కాదు.

కాని అలా చేయలేనివారి సంగతేమిటని మీరడగవచ్చు. సరే, వారి కోసమే ఒక నిర్దిష్ట సమయంలో అతిమానసశక్తిని క్రిందికి తెచ్చుటకై నా ప్రయత్నాలన్నింటిని పూర్తిగా వినియోగిస్తున్నాను.

ప్రపంచపు వెనుకనున్న అదృశ్య మార్గదర్శి:

నా శక్తి ఈ ఆశ్రమానికి, దాని స్థితిగతులకు మాత్రమే పరిమితము కాదనేది నిజం. మీకు తెలుసు — అది యుద్ధము యొక్క సక్రమ పరిణామగతికి దోహదపడుటకు, మరియు మానవలోకంలో మార్పును తెచ్చుటకు విస్తారంగా వుపయోగించబడుచున్నది అని. ఆశ్రమ పరిధిని దాటి కూడ వ్యక్తిగత ప్రయోజనాలకు మరియు యోగాభ్యాసానికి వినియోగింపబడుచున్నది. అయితే ఈ పని ప్రధానంగా ఏ ఆర్భాటము లేకుండా కేవలం ఒక ఆధ్యాత్మిక క్రియగా నిర్వహించబడుచున్నది. ఏదైనప్పటికీ, అన్ని కార్యకలాపాలకు ఆశ్రమమే కేంద్రంగా వుంటుంది. యోగాభ్యాసము లేకుండ ఈ పనికి తావు లేదు. ఎలాంటి అర్థముగాని ఆశించిన ఫలితముగాని లభించదు.

*

నా ఏకాగ్రత ఒక విశిష్టమైన కార్యం కొరకు — జీవితం వదిలిపెట్టె ధ్యానం కోసం కాదు. నా ఏకాగ్రతలో నేను ఇతరులపైన, ఈ ప్రపంచం పైన, వివిధ శక్తుల కార్యకలాపాల పైన కృషి సల్పుతాను. ఎవరి పైనైనా ఒక దాడిని త్రిప్పికొట్టుటలో నేను సహాయపడవలసి వస్తే, ఒక ఉత్తరం వ్రాసి ఆ పనిని నెరవేర్చలేను. అతనికి కొంత శక్తిని అందజేయవలసి వుంటుంది. లేదా, ఏకాగ్రత వహించి, అతని పనిని

నేనే నిర్వర్తించవలసివస్తుంది. అంతేకాని, అతిమానసం గురించి చక్కని శైలిలో వ్రాసి ప్రజలకు అందజేసి ఆ చైతన్యాన్ని క్రిందికి తేలేను.

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

నవంబరు 24, 1926; సిద్ధి దినము*

శ్రీకృష్ణ భగవానుని అవరోహణం

నవంబరు 24, 1926 — శ్రీకృష్ణ పరమాత్మ భౌతికంలో అవతరించిన రోజు.

శ్రీకృష్ణుడు అతిమానస తేజస్సు కాదు. శ్రీకృష్ణుని అవరోహణం అంటే అధిమానస చైతన్య అవరోహణం. అది అతిమానస అవతరణ కాదు. కాని అతిమానస అవతరణకు, ఆనందానికి సన్నద్ధం చేయడం. శ్రీకృష్ణుడు ఆనందమయుడు. అధిమానసం ద్వారా పరిణామాన్ని పరిపోషిస్తూ ఆనందం వైపు నడిపే దైవం.

అవరోహణం

నా దేహాంతర కణ సమూహాలన్నీ
వెలుగు వెల్లువలో పరవశించిపోతున్నాయి.
నా ఆత్మ శరీరాలు ఆనంద మహార్ణవంలో కదలిపోతున్నాయి.
నా పైన, నా చుట్టూ
సాగరతరంగాలుగా సముజ్వల కాంతిరేఖలు
పరవళ్ళు తొక్కుతున్నాయి.

గిరిశిఖరంలాగా, అపురూప విగ్రహం లాగా
కఠిన శిలారూపమై, నా శరీరం

** నవంబరు 24 వ తేదీ ఆశ్రమానికి చెందిన నాలుగు దర్శనదినాలలో ఒకటి. దానినే సిద్ధదినము అని పిలుస్తారు. ఈ సంఘటన తదనంతరం శ్రీఅరవిందులు ఏకాంతంలోకి వెళ్ళిపోయారు. అతిమానస చైతన్యాన్ని భూమికి గొనిరావడానికి అమిత సమయాన్ని వెచ్చిస్తూ, అధికంగా శ్రమించారు. ఈ లోగా శ్రీమాత ఆశ్రమానికి రూపురేఖలు తీర్చిదిద్ది, సాధకులకు ఆశ్రయం కల్పించారు.*

అనంత పరివ్యాప్తమై శోభిల్లుతున్నది...
విశ్వంభరగా విస్తరిస్తోంది.
అది సమున్నత దైవత్వపు సువిశాల అవరోహణం...
మృణ్మయ అంగాంగాలలోకి ప్రవేశిస్తోంది...

*

ఒక దేవత సూక్ష్మశరీరంలాగా భాసించే అగ్నిశిఖ
గతకాలపు పరిమిత శకలాలను భస్మీపటలం చేసింది.
ఒక నవ్యాత్మ ఊపిరి తీసే విశాల సీమను సృష్టించింది.
శాశ్వతత్వపు దివ్య సంస్పర్శ ఇంద్రియ కవచాలను పటాపంచలు చేసింది.
భూమి ఎరుగని ఒక మహోన్నత చిచ్ఛక్తి అతని అంగాంగాలలో అధిష్ఠించింది.

(సావిత్రి, పు. 81-82)

విశ్వాధినేత్రి — విశ్వమాత

అంధశక్తుల దుష్ట లీలాపరంపరల మధ్య
జగన్మాత దిగివచ్చింది — విశ్వాంతర్గత
అరిష్టాలను, అపభ్రంశాలను రూపుమాపడానికి —
అజ్ఞాన ప్రపంచ విధి విషాదాంత హేలకు
భగవంతుని ఆనందమయ దివ్య రూపకంగా,
భగవంతుని ఆనంద అమృతహాసాల సుమహారంగా
మార్చాలని
జగన్మాత దిగివచ్చింది.
భగవంతుని తల్లి మన అందరి ఆత్మల కన్నతల్లి.
కాలతీరాలలో భగవంతుని దివ్యజనన
మహోత్సవంలో మనమంతా భాగస్వాములం,
భగవంతుని చిరంతన
ఐశ్వర్యానికి మనమే వారసులం!

— శ్రీఅరవిందులు

1920 ఏప్రిల్‌లో శ్రీమాత జపాన్‌నుండి తిరిగి వచ్చిన దరిమిలా, సాధకుల సంఖ్య పెరగసాగింది. 1926 లో ఆమె ఆశ్రమాన్ని నెలకొల్పారు.

— శ్రీమాత

ఆశ్రమంలో సాధన, ఇతర ఏర్పాట్లన్నీ అమ్మే స్వయంగా నిర్వహిస్తుంది. ఆమెకు సమస్త సహాయం శ్రీఅరవిందులు నేపథ్యంలో వుండి అందిస్తారు. యోగసాధన కోసం ఇక్కడకు వచ్చేవారంతా అమ్మకు ఆత్మార్పణం చేసుకోవాలి. ఆత్మ సాధనలో వారికి సహాయపడి, వారి ఆధ్యాత్మిక వికాసానికి దోహదం చేస్తారు.

— శ్రీఅరవిందులు

అనువాదం: కె. యజ్ఞన్న

సమిష్టిగా ఒకే లక్ష్యానికి కట్టుబడిన వర్గం, కలిసికట్టుగా ప్రపంచ పురోగమనాన్ని ముందుకు సాగించటం

...ఇది శ్రీఅరవిందుల్ని కలిసినపుడు నాలో కలిగిన మొదటి ప్రశ్న. నేనిదివరకే చెప్పాననుకుంటాను. ఇప్పుడు నాకు గుర్తు లేదు కాని, ఈ మధ్య ఈ విషయం గురించి ప్రస్తావించాను. ఎవరైనా యోగం చేపట్టినవారు... ఎవరికి వారు ముందుగా ప్రారంభించి, లక్ష్యం సాధించిన తరువాత అందరితో కలిసి ముందుకు సాగాలా, లేక ముందుగానే ఒకే రకమైన ఆకాంక్ష కలిగినవారందరూ కలసి వారి లక్ష్యం వైపుకు ప్రయాణించాలా?

నేను అంతకు ముందు ఈ విషయంలో చేసిన సాధన, ఆ ప్రయత్నం పట్ల ఉన్న శ్రద్ధవల్ల నేను ఈ ప్రశ్నను ముందుగానే సరిగ్గా సూత్రబద్ధం చేసుకుని మాత్రమే శ్రీఅరవిందులను కలిశాను. ఎందుకంటె ఈ రెండు పద్ధతులు సంభవమే... ఒకటి గాఢమైన ఏకాంత సాధన, అంటె మిగిలినవారితో ఏవిధమైన సంపర్కం లేకుండా ఒంటరిగా చేసే సాధన. లేదా సామూహికంగా ఒకే ఆకాంక్ష కలిగిన సభ్యులందరితో కలసి... స్వతస్సిద్ధంగా తనకు తానుగా రూపొందుతున్న దాన్ని ఆపకుండా, అందరూ కలసి ఆ మార్గాన్ని ప్రారంభించి ముందుకు సాగడం.

అయితె నిర్ణయం మానసికమైన ఎన్నిక కాదు. అది సహజంగా లోపల నించి వచ్చింది. పరిస్థితులు అలాటివి. మరో దారి లేదు. సహజసిద్ధంగా తనంత తానుగా మరో అవకాశం లేనట్లుగా, సమిష్టిగా ఒక బృందం రూపొందింది. మరి మేమూ

దానిని అలానే ప్రారంభించాము. కడవరకు అది అలా మరి నిరాటంకంగా కొన సాగవలసినదే.

— శ్రీమాత

మానవకాలంలోకి దైవం విడిది చేశాడు

... భవిష్యత్తులోని మానవులకు కొత్తదో, పాతదో అయిన మరో మతాన్ని ప్రచారం చేయడం నేనాశించిన ప్రయోజనం కాదు. మతాన్ని కొత్తగా స్థాపించడం కాదు. ...భౌతికతత్వంలో మార్గానికి ఉన్న అవరోధాన్ని తొలగించడమె. ఇదీ భౌతికస్థాయికి సంబంధించి నా భావన.

*

ఈ ఆశ్రమం, సామాన్యంగా ఈ విధమైన అనేక సంస్థలకు భిన్నంగా, మరో ఆశయంతో సృష్టించడం జరిగింది. ఇక్కడ జరిగేది ఈ ప్రపంచాన్ని వదిలి సన్యసించడం కాదు. మరో రకమైన జీవన పరిణామ కేంద్రంగా, ప్రపంచంలోనే ఉంటూ, నూతన జీవనవిధానాల, నూతన జీవనస్థితుల ఆవిష్కరణకు — అలాంటి కార్యాచరణ కేంద్రంగా ఏర్పరచి ఒక ప్రయోగశాలగా దీని స్థాపన జరిగింది.

*

ఇది అన్ని ఆశ్రమాల వంటిది కాదు. ఇందులో సభ్యులు సన్యాసులు కారు. ఇక్కడ యోగసాధన మోక్షం కోసం కాదు. యోగచైతన్యంతో యోగశక్తితో కర్మాచరణకి సంసిద్ధపర్చటం. ఇందుకు మరో రకమైన పునాది లేదు.

— శ్రీఅరవిందులు

*

ఈ ఆశ్రమంలో ఏ క్రమశిక్షణ, పరీక్ష పైకి కనపడదు. కాని ఆంతరంగికమైన పరీక్ష, సాధన, శోధన కఠినంగానూ, స్థిరంగానూ ఉంటుంది. ప్రతివారూ వారి ఆకాంక్షతో చాలా నిజాయితీపరులై ఉండాలి. అహాన్ని వదులుకోవాలి, గర్వాన్ని జయించినపుడె ఆ అంతరంగ సాధనకు తట్టుకుని నిలబడగలిగేది.

సంపూర్ణ సమర్పణ అన్నది బాహ్యంగా నిర్బంధింపబడేది కాదు. అయితే ఈ యోగంలో ఉండి సాధన కొనసాగించేవారికి తప్పనిసరిగా ఉండితీరవలసిన గుణం అది. సమర్పణ యొక్క చిత్తశుద్ధిని పరీక్షించడానికి అనేక సంఘటనలు ఎదురవుతాయి.

అయితే దైవసహాయం, దైవకృప ఆశించేవారికి, ఆకాంక్షించేవారికి నిరంతరం అందుబాటులో ఉంటాయి. వాటి శక్తి అవధులు లేనిది. విశ్వాసంతో, నమ్మకంతో ఉంటె ఆ కృపావృష్టి వారిపై నిరంతరం వర్షిస్తుంది.

— శ్రీమాత

అనువాదం: సత్యవాణి

క్లిష్టసమయాలలో మార్గదర్శకుడు

ఇపుడిక తను లేస్తాడు; భగవంతు డుద్భవించాడుగా.
ప్రపంచ పరివ్యాప్త పరిణామాలు మందకొడి ప్రారంభాలు.
విష్ణు సుదర్శన చక్రం భూమిని చుట్టపెట్టడానికి రువ్వబడింది.

పాతది నశిస్తుంది; నిష్క్రమిస్తుంది,
తొలగించబడుతుంది, నిర్మూలించబడుతుంది,
తుడిచివేయబడుతుంది;
మనిషి విస్తృత పురోగతికి బంధాలు
ఇనుపసంకెళ్లు సడలిపోతాయి తుదకు...

ఆశించిన అలనాటి ఆ రోజు, కవులు
తత్వవేత్తలు ఊహించిన, కలలుగన్న, నమ్మి
దర్శించిన స్వర్ణయుగం స్వర్గం దిగి
వస్తుంది తప్పక.

నిరంకుశ యుగం అంతరించింది. ఇపుడిపుడే
వదిలిపోతున్న గతం దాని అంతిమ ఆయాసం
దేశాలను వణికిస్తోంది. అది ఇక పోయినపుడు
భూమి ఉద్దీపిస్తుంది విరిసిన తేట కనులతో.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం; కర్రా వెంకటేశ్వర్లు

మేము ఆ యుద్ధాన్ని జాతుల మధ్య లేదా ప్రభుత్వాల మధ్య జరుగుచున్న సమరంగా భావించలేదు. సజ్జనుల దుర్జనుల మధ్య జరుగు సంగ్రామంగా కూడ భావించలేదు. దానిని దైవీ-ఆసురీ శక్తుల మధ్య జరిగే యుద్ధంగా భావించాం. మనం గమనించాల్సినది ప్రజలు, జాతులు యే ప్రక్క నిలుస్తారో అని. వాళ్ళు సరైన వైపు నిలిస్తే, మానవసహజమైన దోషాలున్నవారైనా, వారు దైవోపకరణాలుగ తయారవుతారు. మిత్రమండలి వారి విజయం పరిణామశక్తుల మార్గాన్ని సుగమం చేస్తుంది. అవతలవారి విజయం మానవాళిని వెనక్కు లాగి విలువలను నిమ్నస్థాయికి దించి, మానవజాతి వినాశనానికి దారితీస్తుంది. ఇదే ప్రధాన ప్రశ్న. తక్కిన విషయాలు అనుచితములు, అప్రధానమైనవి.

*

మానవులు విలువలు లేనివారైనా, దైవాంశ సంభూతులు కాకున్నా, పవిత్రులు కాకున్నా, దైవం వారిని తన ఉపకరణాలుగ తీసుకొంటారు. వారు సుజనులుగను, దైవం వైపు వున్నవారుగా వుంటే చాలు. దివ్యకార్యనిర్వహణకు అర్హులే.

శ్రీఅరవిందులు

*

పురాణి: ఆగష్టు 15 లోగా యుద్ధం అంతమై శాంతి ఒప్పందం కుదరాలన్న హిట్లర్ ప్రకటన ప్రాధాన్యత సంతరించుకున్నట్లుగా అనిపిస్తోంది.
శ్రీఅరవిందులు: అతడు మన దివ్యకార్యానికి శత్రువనుటకు యిదే గుర్తు. ఇక విలువలు సంబంధించి అతని వెనుక వున్నది మహా అసురశక్తి అని స్పష్టంగా తెలుస్తోంది.
పురాణి: క్రైస్తవ మతము, ఇతర మతాల విధ్వంసం కూడ అతన లక్ష్యం. ఔనా?
శ్రీఅరవిందులు: ఔను. అతడు కోరేది ఆదిమజాతులు, ఆరాధించే ప్రాచీన అనాగరిక జంతుప్రవృత్తులతో కూడిన మతం. (Ludendorf's religion – the Norse religion)
పురాణి: పురాణాల్లో దేవాసుర యుద్ధాలు కళ్లకు కట్టినట్లుగా వర్ణించబడ్డాయి. మానవజాతి వ్యతిరేకులుగ అసురులున్నట్లుగానే, మానవజాతికి సహకరించేవారు — దివ్యమానవులు (దేవతలు) కూడ వుండి తీరాలి.

శ్రీఅరవిందులు: అవును. మానవులు అసురులకు సరి రారు. మానవులపై అసురుల లేదా దివ్యమానవుల (దేవతలు) ప్రభావం — ఏదైతే, ఫలితం ఆ ప్రభావం పైనే ఆధారపడి వుంటుంది. హిట్లర్ విషయంలో కేవల ప్రభావమే కాదు. అతనిని అసురశక్తులు ఆవహించాయి. ఆతను దుష్టశక్తి అవతారమే అన్నా అనవచ్చు. స్టాలిన్ విషయం కూడ ఇంతే. ప్రాణిక జగత్తు భౌతిక జగత్తుపై విరుచుకుని పడింది. అందుకే మేధావులు వారి నాగరికత, విలువల విధ్వంసం పట్ల ఆందోళన చెందుతున్నారు. భౌతికానికి ఆవలి ప్రపంచాలను వారు త్రోసిపుచ్చుతారు. కనుక వారు కలవరపడక తప్పదు.

భారత స్వాతంత్ర్యం — జన్మదిన కానుక

ఆగష్టు 15 స్వతంత్ర భారతావని జన్మదినం. ఇది ఆమెకు పాత శకం అంతమై నూతన శక ఆరంభం అనవచ్చు. కాని యిది మనకు మాత్రమే గాక, ప్రపంచం యావత్తుకు ప్రధానమైన రోజు. ఎందుకంటే యీ దేశం, మానవజాతి యొక్క రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక భవిష్యత్తు పట్ల అనిర్వచనీయ శక్తులతోడి గొప్ప పాత్రను పోషించు ఐక్యరాజ్యసమితిలో చేరగల ప్రాముఖ్యతను సంతరించుకొంది. ఈ దినం ప్రత్యేకంగా నా జన్మదిన కారణంగా నాకు సంతోషదాయకమైన సుదినం. ఇంకను నా జన్మదినమైన యీ దినాన్ని జరుపుకొనుట వల్ల దీని కొక ప్రత్యేకత వుంటుంది.

ఈ శుభదినాన్ని నేను ఒక యాదృచ్ఛిక సంఘటనగా గాక, నేను ప్రారంభించిన దివ్యకార్యాన్ని మార్గదర్శిగా నడుపుతూ వచ్చిన ఆ దివ్యశక్తి ఆమోదముద్రగా భావిస్తాను. నేనాశించిన ప్రపంచ ఉద్యమాలన్నీ ఒకప్పుడు అసాధ్యమైన స్వప్నాలుగ అగుపించినా, అవన్నీ నా జీవితకాలంలోనే సఫలీకృతమవబోతున్నాయి. భారతదేశ శుభోదయం ఆరంభమైనదని నేను నిరంతరం చెప్పుచుండేవాడిని. ఆ శుభోదయం ఆమె భౌతిక ఆకాంక్షల కోసం, ఆమె రాజ్యవిస్తరణ కోసం, ఆమె గొప్పదనం కోసం, ఆమె సుసంపన్నత కోసం కాదు. (కాని వీటిని ఆమె నిర్లక్ష్యం చేయరాదు.) అంతే కాదు, ఇతరుల వలె పరులపై పెత్తనం చెలాయించుటకు కాదు. ఆమె భగవంతుని కొరకు, మొత్తం మానవజాతికి సహాయకారిణిగా, నాయకురాలిగా జీవించుట కొరకే. ఆమె ఉద్దేశాలు, ఆశయాలు, వాటి స్వాభావిక క్రమపద్ధతిలో

వుండేవి. అవి ఇవి: భారతస్వాతంత్ర్యము, ఐక్యత సిద్ధి కొరకైన విప్లవము. ఆసియా స్వాతంత్ర్యము, పునర్ వైభవము, మరియు మానవ నాగరికత పట్ల ఆమె నిర్వహించిన గొప్ప పాత్ర యొక్క పునరుద్ధరణ. మానవాళికి నూతనమైనట్టి, గొప్పదైనట్టి, ఉజ్జ్వలమైనట్టి జీవితం. అంటే ప్రపంచ ఐక్యత. ఇదొక అంతర్జాతీయ సంస్థ. ఇది ప్రపంచంలోని అన్ని దేశాలను ఒక్క అంతర్జాతీయ ప్రభుత క్రిందికి తేవడం అనవచ్చు. భారతదేశం విశ్వమానవ కళ్యానానికై తన ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ప్రపంచాని కంతటికి పంచిపెట్టి, మానవాళికి ఆధ్యాత్మిక జీవనం ప్రసాదించుట, చివరగా పరిణామ ప్రక్రియలో ఒక నూతన సోపానాన్ని రూపొందించుట. అనగా మానవచేతనను ఉన్నతస్థాయికి లేవనెత్తుట. దీని ద్వారా ప్రపంచంలోని సకల సమస్యలకు పరిష్కార మార్గాన్ని ఆరంభించుట. తద్వారా వ్యక్తి పరిపూర్ణతను, సమాజ పరిపూర్ణతను సాధించుట.

ప్రాక్ పశ్చిమాలు — ఒకే ఆశయం — ఒకే భవితవ్యం

ప్రాక్ పశ్చిమవాసుల మానవ స్వభావం ఒక్కటే. వారి భవితవ్యం ఒక్కటే. సంపూర్ణత్వం కొరకైన వారి ఆశయం ఒక్కటే. మరింత ఉన్నత జీవితం కొరకైన వారి ఆకాంక్ష ఒక్కటే. దేని కొరకై మన మందరం బాహ్యాంతరాల్లో ముందుకు సాగుతున్నామో అదీ ఒక్కటే.

ప్రాక్ దేశీయుల ఆధ్యాత్మిక జీవనములోను, పశ్చిమ దేశీయుల భౌతిక జీవితంలోను కూడ జీవించాలని కొందరు భావిస్తుంటారు. కాని ఆధ్యాత్మిక జీవితాన్ని కోరడంలో పశ్చిమ దేశీయులు ప్రాక్ దేశీయుల కన్న తక్కువ సంఖ్యలో వుంటారని భావించరాదు. అలానే ప్రాక్ దేశీయులు కూడా భౌతిక ప్రవృత్తితో భౌతిక సుఖజీవితాన్ని అభిలషిస్తున్నారు. అలా అలా ప్రాక్ పశ్చిమాలు దగ్గర దగ్గరై ఒకళ్ళతో ఒకళ్ళు కలసిపోతున్నారు. పరస్పరం ఒకళ్ళ ప్రభావం మరొకళ్ళపై పనిచేస్తోంది. పూర్వం కన్న ఇప్పుడు మరీ ఒక ప్రాంతీయుల జీవనవిధానం, మరొక ప్రాంతీయుల జీవనవిధానంతో మరింత యెక్కువగా ప్రభావం చూపుతోంది. ఇరుప్రాంతాలవారి అశయం, భవితవ్యం, ఆధ్యాత్మికంగాను, భౌతికంగాగాను ఒక్కటిగానే వుంటున్నది. ఈ విషయంలో వీరు వారు పరస్పరం సహకరించుకొనుట కోసం ప్రకృతి, భవితవ్యం యెక్కువగా బలవంతపెడుతున్నవి. మనం మనంవేర్వేరని భావించే కాలం చెల్లిపోయింది. మానవాళంతా ఏకమై ఒకే ఆశయం కోసం, ఒకే భవితవ్యం కోసం

పాటుపడాలి. ప్రారంభంలో ప్రకృతి తనకు తెలిసీ తెలియకనే మానవాళియొక్క యే భవిష్యత్తును ఆశించిందో మన మందరం ఆ ఆశయ సిద్ధికై అజ్ఞానాన్ని తుదముట్టించి, జ్ఞానప్రభలతో పాటుపడాల్సి వుంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: బి. నరసింహయ్య

మానవ నిశీథిలో అతిమానస కాంతి బీజావాసం*

నేనో ఒప్పందం కుదుర్చుకున్నాను చీకటితో
మా సమాగమ స్థలంగా ఓ అంధకార అధోలోకం నిర్ణయించుకున్నాం.
ఎదలో దేవుని అనంత దివ్య దివ్వె నిడుకొని
ప్రమాదభరిత ఆమె అంధహృదయాన్ని వలచుటకు చేరాను...
అయినా, నాకు తెలుసు నా మార్గం
అమృతత్వానికి రహదారి యని.

— శ్రీఅరబిందో

మరణంపై విజయం: ఆ రోజు ఉదయం, తెల్లని మంచు నేపథ్యంలో ఉన్న మంచం మీద పరుండి ఉన్న శ్రీఅరబిందో శరీరం వైపు త్వరితంగా అడుగు లేస్తున్నప్పుడు దారాకు (ఆగా సయ్యద్ ఇబ్రహీం) ఓ సమ్మోహనజనక అనుభవం కలిగింది.

నేను శ్రీఅరబిందో యొక్క సొంత గదిలో వారి మంచం ప్రక్కన ఉన్నాను. వారు చాలా ప్రశాంతంగా, సంతృప్తికరంగా ఉన్నట్లనిపించింది. నేను నవంబరు 24 వ తేదీన దర్శనసమయంలో పసిగట్టలేని ఓ వినూత్న సౌందర్య విలసితమై వారి కాయం ఉందనిపించింది. నేను ముందెందుకు చూడలేకపోయాను?... నా దృష్టి వారి వదనం పైనుండి, బాహువుల పైనుండీ మరలించలేకపోయాను. వారు సజీవంగా ఉన్నట్లనిపించింది నాకు. అప్పటికప్పుడు ఆయన వాస్తవంగా ఊర్ధ్వదిశగా మమేకమై పైపైకి చూస్తూ సమ్మోహన నిద్రావస్థలో ఉన్నట్లనిపించింది.

---

* ప్రకృతి సిద్ధమైన భూగోళం ఎదురొడ్డే సహజగుణాన్ని పరికించి పసిగట్టిన శ్రీఅరబిందో మరణ నిశీథిలో పరిపూర్ణంగా మునిగిపోయే భారాన్ని తనపై తాను ఉంచుకొన్నారు.

మరి కొందరికి కూడ ఇలాంటి అనుభూతులు సువేద్యమయినవి. ఉదయం 1.30 గం. నుండి సాయంత్రం 7.30 గం. ల వరకు ఏకబిగిన పద్దెనిమిది గంటల కాలం గడిచినా శ్రీఅరబిందో దేహం వాడి, పాడవుతున్న లక్షణాలు పొటమరించలేదు. సరి కదా, పై పెచ్చు ఓ సముజ్జ్వల సౌందర్యం సంతరించుకొంది. జీవకళ లొలుకు కాంతివంతమైన శరీరచ్ఛాయ. మరణమా! నీ పాశమెక్కడ? మరి విజయ మెవరిది?

శ్రీమాత ఆ వినూత్న సుముజ్వల సౌందర్యాన్ని అతిమానస కాంతిగా అభివర్ణించారు. డా. సన్యాలుకు కూడ ఆ దర్శన మవటానికి ఆమె దోహదపడింది. తొలుత ఆయన కది కనుపడలేదు. మహోజ్జ్వల కాంతి విలసిత ఆచ్ఛాదనం — చుట్టూ నీలి పసిడిరంగుల సమైక్య తేజోవలయం ఏర్పడింది. శ్రీ సేతనా యొక్క రేఖాచిత్రంలో దాదాపుగా ఓ అవతారశీలం ద్యోతకమవుతుంది. "ఆధ్యాత్మిక గంభీరత — అప్పటి ఆ శరీరపు దర్శనరీతికి సరియైన, సమగ్రమైన నిర్వచనం, విశదీకరణ... ఆ గది వాతావరణం శుభ్రపరచి, ఆధ్యాత్మిక వికాసం కలిగించే పునీతమైన ప్రత్యేక ప్రజ్ఞతో ప్రతిస్పందమానమై భాసిస్తున్నది. ఆ శక్తి జీవితానికి అతీతమైన అతిమాన సానుగ్రహాన్ని మానవత్వంపై వెదజల్లటానికి విజయపథంలో ఉన్న యోగీశ్వరుని నిశ్చల మనస్కృత (Master's poise) విశ్రాంత పథం నుండి పుట్టుకొస్తున్న శక్తిలా సంభావ్యమవుతున్నది."

*

"ప్రియాతిప్రియమైన తమ యోగీశ్వరుడు పరమపదించిన తరువాత పన్నెండు రోజులపాటు ఆశ్రమంలో ధ్యానాత్మక నిశ్శబ్దం రాజ్యమేలింది", అని రిషబ్‌చంద్ వ్రాసారు. "తరువాత మామూలు స్థితి ప్రారంభమైనా, ఆశ్రమ వాతావరణంలో వారి సాక్షాత్కారం కొట్టవచ్చినట్లు పరివ్యాప్తమై కనిపించింది." "శోకించటం శ్రీఅరబిందోను అవమానించటమే. సజీవంగా, నిర్నిద్ర బుద్ధితో ఆయన మనతో ఉన్నారు", అని శ్రీమాత సాధకులను డిశంబరు 14 వ తేదీన మృదువుగా మందలించారు. జనవరి 18 వ తేదీన మరింత నిశ్చయమైన హామీ ఇచ్చారు.

ఆయన భౌతికంగా మన మధ్య లేకున్నా ఆయన మన ముందు రూపాంతరీకరణ కార్యక్రమ సాధనలో మనకు సాయపడటానికి, తమ భౌతిక జీవనాన్ని ఆహుతి కావించి మనలో ఉన్నారు — ఆ ప్రణాళిక పరిపూర్ణం గావటానికి.

ఆయన సదా మన చెంతనే ఉంటారు. ఆయనకు మనం ఏమి చేస్తున్నామో, ఆలోచిస్తున్నామో, భావిస్తున్నామో — సర్వమూ ఎఱుకే.

— కె. ఆర్. శ్రీనివాస అయ్యంగారు

అద్భుతావహమైన దివ్యత్యాగం:

ఈ విశ్వం కోసం శ్రీఅరబిందో ఎంతటి మహాద్భుత క్రతువు నాచరించి త్యాగం చేశారో ప్రజలకు తెలియదు. ఓ సంవత్సరం ముందు, వివిధ విషయాలు చర్చించుకొనే సందర్భంలో నేను నా శరీరాన్ని త్యజించాలని అనుకొంటున్నాను అన్నప్పుడు ఆయన వెన్వెంటనే ఓ నిశ్చయ స్వరంతో "అది ఎన్నటికీ జరగదు. అవసరమైతే ఈ రూపాంతరీకరణ కార్యక్రమ సాఫల్యతకు నేను నా తనువు చాలిస్తాను. నీవే ఇక్కడ ఉండి మన అతిమానస అవరోహణ మరియు రూపాంతరీకరణ యోగ ప్రణాళికను పరిపూర్ణం గావించాలి", అన్నారు.

*

శ్రీఅరబిందో నెవ్వరూ తన పార్థివ శరీరాన్ని త్యజించమని నిర్బంధించలేదు. ఆయనే స్వచ్ఛందంగా మానవ మేధో పరిధి కందనంత — గోచరం కానంత కారణాలతో ఎంపిక చేసుకొన్నారు. ఆ కారణాలు అత్యంత విలక్షణమైనవి. అర్థం కానప్పుడు, తమ అవగాహన పరిధిని మించినప్పుడు ప్రతివారూ చెయ్యవలసింది కేవలం గౌరవప్రదమైన మౌనం వహించటమే. డిశంబరు 8 వ తేదీన నేను వారిని వారి శరీరాన్ని పునరుజ్జీవింప చేసుకోండి అని అభ్యర్థించినప్పుడు వారు సుస్పష్టంగా "నేను ఓ సంకల్పంతోనే ఈ శరీరాన్ని వదలి వెళ్ళాను. తిరిగి ఈ కాయంలో

మరణం యొక్క మహాద్భుత సమయం:

భయంకర అద్భుతావహమైన క్రతువు పరిసమాప్తమయింది. విశ్వానికి దేవుని త్యాగపూర్ణదేహ కైంకర్యమది. అతడు మరణించాడు, విశ్వం పునరుద్భవమై జీవిస్తుంది.... మరణం యొక్క మహాద్భుత నిర్ణీతకాలంలో ఓ బీజావసమై మానవభూతలంపై కల్పతరు శాఖ నాటడానికి; ప్రకృతితన అశాశ్వత ప్రయత్నాలను అధిగమించాలి.

— శ్రీఅరబిందో

మరలా ప్రవేశించను. నేను మరలా అతిమానసమార్గంలో ప్రథమ అతిమానస వ్యక్తిగా స్వయం వ్యక్తమవుతాను", అని బదులిచ్చారు.

— శ్రీమాత

సమాధిపై చెక్కబడిన కృతజ్ఞత

మా యోగీశ్వరునికి భౌతిక ఆచ్ఛాదనంగా ఉన్న (సమాధి) నీకు మా అనంతమైన కృతజ్ఞత. మా కొరకు ఎంతో చేసిన , శ్రమించిన, పోట్లాడిన, చింతించిన, చింతపడిన, వంతలపాలైన, ఆకాంక్షించిన, ఓరిమి వహించిన, భరించిన ఓ సౌజన్యమూర్తి నీ ముందు ఉన్నాడు. నీ అవరణలో ఉన్న ఆ మూర్తి మా కొరకే సంకల్పించాడు, సకల విధాల ప్రయత్నించాడు, సకలం సన్నద్ధపరచాడు, సర్వం సాధించాడు. నీ ముందు సాగిలపడి మేము విన్నవించుకొంటాం శ్రద్ధాపరిపూర్ణులమై, మిమ్మ మేమెప్పుడూ, ఓ క్షణమైన ఏమరుపాటునైనా, కలనైనా విస్మరించమని; మేము పరిపూర్ణంగా మీకు రుణపడి ఉన్నామని.

— శ్రీమాత

మిరుమిట్లు గొలిపే యజ్ఞవేదిక

ఆయన సమాధి నుండి వేనకు వేలుగా ఉజ్వల కాంతికిరణాలు పై కెగసి మా ఆత్మలో నిక్షిప్తమవుతున్నట్లు గోచరమగుతున్నది — పునరుత్తేజిత తేజోవిలసిత కాంతిపుంజమై. అతని ఉనికి శ్రీమాత యొక్క రూపంలో ఆచ్ఛాదింపబడి కలసిపోతున్నది — సమాధిలో మమైక్యమై, విద్యుదయస్కాంత తరంగాలను ప్రసరింప చేస్తూ. అతని శరీరం వాతావరణ సాకల్యంలో సజావుగా వ్యాపిస్తున్నది క్రమక్రమంగా, క్రమబద్ధంగా. ప్రతి ఒక్కరూ అతని అస్తిత్వాన్ని అవలోకించగలుగుతున్నారు. ఆయన చరణ సవ్వడులు వినగలుగుతున్నారు.; ఆయన లయబద్ధమైన స్వరసమ్మేళనం వినబడుతూనే వున్నది; ఆయన నిరంత జాగరూకత అనుభవైక వేద్యమవుతున్నది — ఏ భౌతిక శరీర బాదరబందీ లేకనే.

— నిరోద్ బరన్

అనువాదం: అన్నవరం ఆదిశేషయ్య

సావిత్రి: భవిష్యత్తుకు వారధి

అనంతుని వేణువు: సావిత్రి

సర్వమును అవలోకించే శిఖరాల నుండి ఒక ఆకస్మిక ప్రవక్త
రహస్య విషయాల భావమును లయబద్ధంగా గొని రాగా
ఆతని మదిలోని నిశ్శబ్దాంతరాలలో నడయాడె.
మర్త్యభాషణమున కలీతమై యొక సుస్వరము, వినిపించె.
దివ్యానంద సమస్తము ఒక బంగరు కలశములో నుంచి
వెలుగువల్ల కలుగు ఆనందము, ఆకస్మిక దర్శనము వలన కలుగు ఆనందమ్ము
మరణించని ఉత్తేజిత దివ్యవాణి ప్రహర్షమ్ము
శూన్యపాత్రలోనికి వలె — ఆతని హృదయాన గ్రుమ్మరించె,
సృష్ట్యాదిలో సృజియించిన
అనంతుని ఆదిమ ఆనందమ్ము పునరావృతమాయె...
పరాత్పరుని నిశ్శబ్ద చూపులు అన్వయించె ఆయన ప్రతినిధిగా
ఆమెగొని తెచ్చె అమృత వాక్కులను మర్త్యమానవులకు...
ఏకైకుని వాకొనుటకు శ్రమియించెను సర్వ మహనీయ వాక్కులు
మహోజ్వల దివ్యకాంతకి నిరంతర ప్రజ్వలన దివ్యజ్ఞానోదయాగ్నికి
శాశ్వత దివ్యామృతవాక్కు లోనికి లేవనెత్తబడినవి.

— శ్రీఅరవిందులు (సావిత్రి, పు. 232)

సావిత్రి మహోన్నత దర్శనం

1) రచయిత యొక్క నిత్య ఆధ్యాత్మిక అనుభవాల గ్రంథం.

2) సమగ్ర సాధనా మార్గాన్ననుసరించ దలచినవారికి మార్గదర్శకత్వం వహించి సాయపడే సంపూర్ణ యోగవిధానం.

3) భువిని దైవత్వ దిశగా చేసే తన ఆరోహణ క్రమంలో అనుసరించవలసిన యోగమది.

4) భువికి సంబంధించిన ఏ అజ్ఞానం, అనృతాల మధ్య దివ్యమాత అవతరించిందో, ఏ దేహాన్ని స్వీకరించిందో వాటికి తగినట్లు తనను తాను మలచుకొనే కృషిలో ఆమెకు కలిగిన అనుభవాలు.

— దివ్యమాత

రూపాంతరీకరణ మంత్రం

'సావిత్రి' ఒక దర్శనం. అది ధ్యానం. అది అనంతుని, శాశ్వతుని అన్వేషణ, అనంతునికై శాశ్వతునికై అన్వేషణ. అమృతత్వానికై ఆకాంక్షిస్తూ చదివితే, ఆ చదువే అమృతత్వం వైపుకు మార్గదర్శకంగా ఉపయోగపడుతుంది. "సావిత్రి" ని చదవడమే యోగసాధన, ఆధ్యాత్మిక ఏకాగ్రత. దైవాన్ని సాక్షాత్కారింప జేసుకొనడానికి కావలసినదంతా అందులో కన్పిస్తుంది. యోగం యొక్క ప్రతి మెట్టూ, ఇతర యోగాల రహస్యం ఇందులో వుంది. ప్రతి పంక్తిలోనూ ఏది వ్యక్తం చేయబడిందో, దానిని చిత్తశుద్ధితో సాధన చేస్తే, చివరికతడు అతిమానసయోగం యొక్క రూపాంతరీకరణకు చేరుకొంటాడు. నిన్నెన్నడూ విడనాడని దోషరహిత మార్గదర్శి అది. ఆ మార్గాన్న నుసరించాలనుకొనే వారికి అదెపుడూ అండగా వుంటుంది. ప్రతి పంక్తీ, 'సావిత్రి' లోని ప్రతి పంక్తీ తనంతదావ్యక్తమైన మంత్రం. మనిషినది జ్ఞానం ద్వారా సముపార్జించినదాన్నంతా అధిమగించిపోయిన మంత్రం. 'సావిత్రి', ఒక సజీవ వాస్తవిక వ్యక్తి మార్గదర్శకత్వం వహిస్తున్నట్లుగా చైతన్యశక్తితో పూర్తిగా నిండి వుంది. ఎవరైనా యోగసాధన చేయాలనుకుంటే, చిత్తశుద్ధితో ప్రయత్నిస్తే, దాని ఆవశ్యకతను సంవేదిస్తే 'సావిత్రి' సాయంతో యోగమనే నిచ్చెన చిట్టచివరి మెట్టు దాగా పోగలడు. 'సావిత్రి' ఏ రహస్యానికి ప్రాతినిధ్యం వహిస్తున్నదో తెలుసుకోగలడు. ఏ గురువు సాయమూ లేకుండానే దాన్ని సాధించగలడు. అతడు ఏదో విధంగా దాన్ని సాధించుకోగలుగుతాడు. 'సావిత్రే' స్వయంగా అతనికి మార్గం చూపుతుంది. అతని కవసరమైన దేదైనా 'సావిత్రి' లో కనుగొంటాడు.

(దివ్యమాత సంభాషణ — తన స్మృతుల నుండి మోనాసర్కారు చెప్పిన విషయాలు)

అనువాదం: కె. వి. రావు

నూతన ప్రపంచ ఆవిర్భావం

దివ్యచైతన్యశక్తి ఇక్కడ సాక్షాత్కారమై ఉన్నది:

జూలై 6, 1914

అనితరసాధ్యమైన సర్వశక్తివంతమగు దివ్యచైతన్యశక్తి అభివ్యక్తమవటానికి ఇక్కడ తయారుగా ఉంది. కాలాన్ని తనకు అనుకూలంగా మలచుకుంటూ, సాటిలేని విజయవంతమైన నీ సార్వభౌమత్వ వైభవ ప్రాభవ, మంగళప్రదమైన సదవకాశానికై వేచియున్నది.

ఆ దివ్య చైతన్యశక్తి ఇక్కడ సాక్షాత్కారమై ఉన్నది:

ఆశావహంగా నిరీక్షిస్తూన్న మీరంతా హర్షధ్వానాలు చేయండి. నూతన సృష్టి తప్పక అభివ్యక్తమవుతుంది, నూతన సృష్టి అందుబాటులోనే ఉన్నది.

ఆ దివ్య చైతన్యశక్తి ఇక్కడ సాక్షాత్కారమై ఉన్నది:

సమస్త ప్రకృతి ఆనందంతో ఉప్పొంగి గానం చేస్తున్నది.

అంతా పండుగ వాతావరణమే, ఆ దివ్యచైతన్యశక్తి ఇక్కడ సాక్షాత్కారమై ఉన్నది.

జాగృతమవండి — అందుకై జీవించండి.

జాగృతమవండి — తేజోవంతులవండి.

జాగృతమవండి — సమస్త పరివర్తన కోసం సమరానికై సమాయత్తమవండి.

ఆ దివ్యచైతన్య శక్తి ఇక్కడ సాక్షాత్కారమై ఉన్నది. కొత్త ప్రపంచం జన్మించింది: వాగ్దానం నెరవేరింది.*

దైవసన్నిధి ఎంతో స్పష్టంగా వాస్తవమై, భౌతికంగా మీ మధ్య ఉన్నది. నేను ఒక బంగారు రూపం ధరించి ఉన్నాను. అది ఈ విశ్వంకంటె పెద్దది. ప్రపంచాన్ని, దైవాన్ని వేరుచేస్తున్న ఎంతో దృఢమైన ఒక పెద్ద బంగారు తలుపు ఎదురుగా నేను నిలబడి ఉన్నాను.

** శ్రీఅరవిందులు, శ్రీమాత ముందే చెప్పి, వాగ్దానం చేసి, అందుకు శ్రమించినటువంటి అతిమానస చైతన్యం ఈ భూమి మీద ఫిబ్రవరి 29, 1956 న అవతరించింది.*

నేనా తలుపును చూస్తూనే, విషయం తెలుసుకొని, ఇచ్ఛామాత్రంతో, చైతన్యం నుంచి వచ్చిన ఒక కదలికతో 'సమయమానస్సమైనది' అనే తలంపుతో, ఒక అత్యంత శక్తివంతమైన బంగారు సుత్తితో ఆ తలుపు మీద ఒక్క దెబ్బ కొట్టాను. ఆ ఒకే ఒక్క దెబ్బతో ఆ తలుపు ముక్కలై చెల్లాచెదురైపోయింది. అప్పుడు అతిమానస ప్రకాశం, మహాశక్తి, దివ్యచైతన్యం భూమి మీదకు అడ్డు ఆపు లేకుండా వరదలాగా కిందకు తోసుకువచ్చింది.

ఓ ప్రభూ, నీవు సంకల్పించావు, నేను నెరవేర్చాను.

ఒక నూతన కాంతి భూమి మీద మెరిసింది.

నూతన ప్రపంచం ఆవిర్భవించింది.

చేసిన వాగ్దానాలన్నీ ఈడేరినాయి.

ఈ భూమి మీద అతిమానస ఆవిర్భావం ఇక ఏమాత్రం వాగ్దానం కాదు.

అది ఒక యదార్థ ఘటన, నిత్య సత్యం.

అది ఇప్పుడు ఇక్కడ పని చేస్తున్నది.

పూర్తిగా అంధులైనవారూ, అచేతనలో ఉన్నవారూ, ఏమాత్రం ఇష్టపడనివాళ్లు కూడా కృతజ్ఞతామనస్కులై గుర్తించగలిగే రోజు తప్పక వస్తుంది.

— శ్రీమాత

ఆయన మన మధ్యనే ఉన్నారు:

శ్రీఅరవిందులు మన మధ్యనే ఉన్నారు. తన అసమానమైన సంపూర్ణ సృజనాశక్తితో విశ్వవిద్యాలయ కేంద్రం స్థాపనకు అధ్యక్షత వహిస్తున్నారు. ఇప్పటి ఉన్నతస్థాయిలోని మానవులు అతిమానస ప్రకాశాన్ని అందుకుని, నూతన జాతిగా పరివర్తన పొంది, ఈ భూమి మీద నూతన తేజాన్ని, శక్తిని, జీవితాన్ని అభివ్యక్తీకరించడానికి ఈ విశ్వవిద్యాలయ స్థాపన ఒక చక్కని సాధనగా ఉండగలదని చాలా సంవత్సరాలుగా ఆయన తలంచుతూ వచ్చారు.

దివ్యజ్ఞాన ఆధ్యాత్మిక సమాజం ఆరంభం;

వ్యక్తులుగా మనం అంతటా విస్తరించుకుని ఉంటే, ఏదో కొంత జరుగుతుందనేదానికి అనుమానం లేదు; మనం ఒక సంఘంగా ప్రతి చోటా విస్తరించుకుని ఉంటే గనక

నూతన ప్రపంచ ఆవిర్భావం

దివ్యచైతన్యశక్తి ఇక్కడ సాక్షాత్కారమై ఉన్నది:

జూలై 6, 1914

అనితరసాధ్యమైన సర్వశక్తివంతమగు దివ్యచైతన్యశక్తి అభివ్యక్తమవటానికి ఇక్కడ తయారుగా ఉంది. కాలాన్ని తనకు అనుకూలంగా మలచుకుంటూ, సాటిలేని విజయవంతమైన నీ సార్వభౌమత్వ వైభవ ప్రాభవ, మంగళప్రదమైన సదవకాశానికై వేచియున్నది.

ఆ దివ్య చైతన్యశక్తి ఇక్కడ సాక్షాత్కారమై ఉన్నది:

ఆశావహంగా నిరీక్షిస్తూన్న మీరంతా హర్షధ్వానాలు చేయండి. నూతన సృష్టి తప్పక అభివ్యక్తమవుతుంది, నూతన సృష్టి అందుబాటులోనే ఉన్నది.

ఆ దివ్య చైతన్యశక్తి ఇక్కడ సాక్షాత్కారమై ఉన్నది:

సమస్త ప్రకృతి ఆనందంతో ఉప్పొంగి గానం చేస్తున్నది.

అంతా పండుగ వాతావరణమే, ఆ దివ్యచైతన్యశక్తి ఇక్కడ సాక్షాత్కారమై ఉన్నది.

జాగృతమవండి — అందుకై జీవించండి.

జాగృతమవండి — తేజోవంతులవండి.

జాగృతమవండి — సమస్త పరివర్తన కోసం సమరానికై సమాయత్తమవండి.

ఆ దివ్యచైతన్య శక్తి ఇక్కడ సాక్షాత్కారమై ఉన్నది. కొత్త ప్రపంచం జన్మించింది: వాగ్దానం నెరవేరింది.*

దైవసన్నిధి ఎంతో స్పష్టంగా వాస్తవమై, భౌతికంగా మీ మధ్య ఉన్నది. నేను ఒక బంగారు రూపం ధరించి ఉన్నాను. అది ఈ విశ్వంకంటె పెద్దది. ప్రపంచాన్ని, దైవాన్ని వేరుచేస్తున్న ఎంతో దృఢమైన ఒక పెద్ద బంగారు తలుపు ఎదురుగా నేను నిలబడి ఉన్నాను.

** శ్రీఅరవిందులు, శ్రీమాత ముందే చెప్పి, వాగ్దానం చేసి, అందుకు శ్రమించినటువంటి అతిమానస చైతన్యం ఈ భూమి మీద ఫిబ్రవరి 29, 1956 న అవతరించింది.*

నేనా తలుపును చూస్తూనే, విషయం తెలుసుకొని, ఇచ్ఛామాత్రంతో, చైతన్యం నుంచి వచ్చిన ఒక కదలికతో 'సమయమానస్న మైనది' అనే తలంపుతో, ఒక అత్యంత శక్తివంతమైన బంగారు సుత్తితో ఆ తలుపు మీద ఒక్క దెబ్బ కొట్టాను. ఆ ఒకే ఒక్క దెబ్బతో ఆ తలుపు ముక్కలై చెల్లాచెదురైపోయింది. అప్పుడు అతిమానస ప్రకాశం, మహాశక్తి, దివ్యచైతన్యం భూమి మీదకు అడ్డు ఆపు లేకుండా వరదలాగా కిందకు తోసుకువచ్చింది.

ఓ ప్రభూ, నీవు సంకల్పించావు, నేను నెరవేర్చాను.

ఒక నూతన కాంతి భూమి మీద మెరిసింది.

నూతన ప్రపంచం ఆవిర్భవించింది.

చేసిన వాగ్దానాలన్నీ ఈడేరినాయి.

ఈ భూమి మీద అతిమానస ఆవిర్భావం ఇక ఏమాత్రం వాగ్దానం కాదు.

అది ఒక యదార్థ ఘటన, నిత్య సత్యం.

అది ఇప్పుడు ఇక్కడ పని చేస్తున్నది.

పూర్తిగా అంధులైనవారూ, అచేతనలో ఉన్నవారూ, ఏమాత్రం ఇష్టపడనివాళ్లు కూడా కృతజ్ఞతామనస్కులై గుర్తించగలిగే రోజు తప్పక వస్తుంది.

— శ్రీమాత

ఆయన మన మధ్యనే ఉన్నారు:

శ్రీఅరవిందులు మన మధ్యనే ఉన్నారు. తన అసమానమైన సంపూర్ణ సృజనాశక్తితో విశ్వవిద్యాలయ కేంద్రం స్థాపనకు అధ్యక్షత వహిస్తున్నారు. ఇప్పటి ఉన్నతస్థాయిలోని మానవులు అతిమానస ప్రకాశాన్ని అందుకుని, నూతన జాతిగా పరివర్తన పొంది, ఈ భూమి మీద నూతన తేజాన్ని, శక్తిని, జీవితాన్ని అభివ్యక్తీకరించడానికి ఈ విశ్వవిద్యాలయ స్థాపన ఒక చక్కని సాధనగా ఉండగలదని చాలా సంవత్సరాలుగా ఆయన తలంచుతూ వచ్చారు.

దివ్యజ్ఞాన ఆధ్యాత్మిక సమాజం ఆరంభం;

వ్యక్తులుగా మనం అంతటా విస్తరించుకుని ఉంటే, ఏదో కొంత జరుగుతుందనేదానికి అనుమానం లేదు; మనం ఒక సంఘంగా ప్రతి చోటా విస్తరించుకుని ఉంటే గనక

దాని కంటె ఎక్కువగా ఫలితం సాధించవచ్చు. కాని దానికి ఇంకా సమయం ఆసన్నం కాలేదు. మనం హడావిడిగా దానికి ఒక రూపం కల్పిస్తే, అది నేను సరిగా ఏది అనుకున్నానో ఆ విధంగా రూపుదిద్దుకోదు. ప్రథమంలో సంఘం పలు విధాలుగా చెల్లాచెదరుగా విస్తరించుకుని ఉంటుంది. లక్ష్యాన్ని అంగీకరించినవారు, తమ మధ్య సన్నిహిత సంబంధం కలిగి ఉన్నప్పటికి, వారు వేరు వేరు చోట్ల తమ పనిని కొనసాగిస్తూ ఉంటారు. తరువాత వారంతా ఒక సంఘంగా ఏర్పడి, ఆధ్యాత్మిక సమాజంగా రూపుదిద్దుకోగలరు. వారు వారి కార్యక్రమాలను పరమాత్మకు అనుగుణంగా, యుగ అవసరాలను బట్టి రూపుదిద్దుతారు. ప్రాచీన కాలపు ఆర్యసమాజంలోలాగా, ప్రవాహం నుంచి వెనకకు వచ్చి చేరి నిలిచిన నీటి చెలమలవలె కాకుండా, కొన్ని నిర్దుష్టమైన కట్టుబాట్లతో కఠినంగా ఉండకుండా, ఎంతో స్వేచ్ఛాయుతంగా, ఏ విధంగా అయితే సముద్రం తన బహు బాహుళ్యమైన అలలతో తటాలున ఒకదానిని ఆక్రమించుతూ, మరొకదానిని ముంచెత్తుతూ, అన్నింటినీ తనలో ఎలా ఇముడ్చుకుంటుందో, అదే విధంగా జరుగుతూ ఉండగా, ఒక ఆధ్యాత్మిక సమాజం ఏర్పడుతుంది.

— శ్రీఅరవిందులు

చాలా రోజులుగా ఆశ్రమం కొంతమంది వ్యక్తుల సమూహంగా మాత్రమే ఉండేది. వారిలో ప్రతివారూ ఏదో ఒకదానికి ప్రతినిధిగా ఉన్నవారే, కాని అది ఒక వ్యక్తిగా మాత్రమే, సమిష్టి వ్యవస్థగా కాదు. ఈ పద్ధతే చాలాకాలం ఉన్నది. ఈ మధ్యనే అది సమిష్టిగా ఉండవలసిన అవసరం కనపడుతూ వచ్చింది. అది ఆశ్రమానికే పరిమితం కానక్కర లేదు, ఎవరైతే శ్రీఅరవిందుల శిష్యులై వారి బోధనల కనుగుణంగా జీవించదలచుకుని తమంతట తాము బాహాటంగా ప్రకటించుకుంటారో, వారందరికీ వర్తిస్తుంది. నేను దానిని భౌతికపరంగా చెప్పటం లేదు, అది వారికి చేతనాపరమైన అవసరం. అతిమానసిక చైతన్యం, శక్తి అవతరణ జరిగిన తరువాత నుంచి చాలా ఎక్కువగా, నిక్కమైన సామూహిక జీవన ఆవశ్యకత వారందరిలో జాగృతమయింది. అది పూర్తిగా భౌతిక పరిస్థితుల మీద ఆధారపడిలేదు. ఒక లోతైన సత్యానికి ప్రతీకగా ఉంది. అది శ్రీఅరవిందులు చెప్పిన అతిమానస లేక దివ్యజ్ఞాన సమాజానికి ఆరంభం.*

— శ్రీమాత

* శ్రీమాత, శ్రీఅరవిందో సొసైటీని సెప్టెంబరు 19, 1960 సం. లో తాను అధ్య

క్షురాలిగా స్థాపించారు. ఆ విధంగా దానిలోని సభ్యులకు, సామాన్య ప్రజానీకానికి శ్రీఅరవిందులు, శ్రీమాత, వారి లక్ష్యాలను, ఆదర్శాలను, వారి పూర్ణయోగాన్ని తెలియజేయటమే కాకుండా వాటన్నింటిని పలు విధాలుగా అనువైన మార్గాల ద్వారా చేపట్టి సఫలీకృతం చేయడం, శ్రీఅరవిందులు ఆశించిన విధంగా ఆధ్యాత్మికమైన సొసైటీ ఏర్పాటు కావడమనే ధ్యేయాన్ని సఫలం చేయడం శ్రీఅరవింద సొసైటీ స్థాపనోద్దేశం. తదుపరి దాని కనుగుణంగా దైవానికి సమర్పణ భావనతో సేవను కొనసాగిస్తూ మానవజాతి ఐక్యత అనే ఆదర్శం వాస్తవరూపం దాల్చడానికై ఫిబ్రవరి 1968 వ సం. 'అరోవిల్' జన్మించింది.

అనువాదం: డా. టి. ప్రసన్న కృష్ణ

18 నవసృష్టి పురిటి నొప్పులు

మహాపరిత్యాగం

జగన్మాత తన పిల్లల పట్ల ప్రగాఢ మమతానురాగాలు ఉన్న కారణంగా మసకబారిన మృణ్మయ వేషాన్ని ధరించడానికి అంగీకరించింది. అసత్య, అంధశక్తుల దాడులను, చిత్రహింసలను భరించడానికి భూమికి దిగివచ్చింది. మృత్యు సమానమైన జనన ద్వారాలలో ప్రవేశించింది. సృష్టిలోని సకల బాధల్ని, దుఃఖాలను, ఆవేదనలను తన పైన వేసుకుంది. భగవద్రోచిర్నవహం వైపు, ఆనందం వైపు, మహాసత్యం వైపు, అమృత దివ్యజీవనం వైపు ఈ సృష్టిని సముద్ధరించడానికి అంతకు మించి మరో మార్గం లేదు. ఇదే మహా పరిత్యాగం, మహాపురుష పరిత్యాగం — అని పిలుస్తారు., కాని ప్రగాఢంగా ఆలోచిస్తే, అది దివ్యజనని పరిత్యాగం, ప్రకృతి ఆత్మాహుతిగా పేర్కొనవచ్చును.

*

తమస్సు ప్రగాఢమై వ్యాపించిన వేళ

మారువేషం దాల్చిన విశ్వాతీత పరతత్వం సార్వభౌమ సింహాసనంపై అధిరోహిస్తుంది.
చీకటి చిక్కబడి భూమి గుండెను బిగించిన వేళ...
మనిషి మృణ్మయ మనస్సు మాత్రమే దీపమై వెలిగిన వేళ...

రాత్రి వేళ దొంగవలె తన ఇంటిలోకి భగవంతుడు ఎవరూ చూడకుండా
నడిచి వస్తాడు.

సరిగా వినపడని దివ్యవాక్కు పలుకుతుంది, ఆత్మ శిరసావహిస్తుంది.

మానసాంతర్గత మణిమందిరం లోకి ఒక దివ్యశక్తి రహస్యంగా ప్రవేశిస్తుంది.

మూసుకున్న జీవన ద్వారాలకు ఒక మనోజ్ఞత్వం, ఒక మాధుర్యం (తలుపులు) తెరుస్తాయి.

ప్రతిఘటించే ప్రపంచాన్ని సౌందర్యం జయిస్తుంది.

దివ్య సత్య తేజోనివహం ప్రకృతిని తన గుప్పెట్లో బంధిస్తుంది మహదాశ్చర్యంగా

భగవంతుని రహస్య సన్నిధానం హృదయాన్ని ఆనందమధుమయం చేస్తుంది.

ఈ భువనం ఆకస్మికంగా దివ్యమై భాసిస్తుంది....

ఎవరూ అర్థం చేసుకోలేనిది కొద్దిమంది వీక్షిస్తారు.

ప్రాజ్ఞులు మాట్లాడి, మాట్లాడి నిద్రపోయిన వేళ భగవంతుడు ప్రాదుర్భవిస్తాడు.

భగవదావిష్కరణ చివరి క్షణం వరకు మనిషికి తెలియదు అదేమిటో.

మహాకార్యం ముగిసేవరకు అసలు విశ్వాసమే కలుగదు.

— శ్రీఅరవిందులు

పృథ్వీ పరివర్తనం జరిగి తీరుతుంది:

శ్రీఅరవిందులు చేపట్టిన మహనీయ పృథ్వీ పరివర్తన మహాయజ్ఞం విజయవంతమై తీరుతుందన్న విశ్వాసం సుదృఢమవుతుంది. ఒక్క క్షణమైనా ఆ విశ్వాసం సడలదు. అది తిరుగులేని నిజం. మేము చేపట్టిన మహత్కార్యానికి సంబంధించి అనుమానానికి తావే లేదు. ప్రపంచంలో ఏ శక్తీ దానిని నిలువరించలేదు. సర్వశక్తిమంతుడైన సర్వోన్నతుని శాసనాన్ని ఏ శక్తీ కూడా భగ్నం చేయలేదు. ఆత్మవిశ్వాసరాహిత్యాన్ని, బలహీనతను పారద్రోలండి. సుదీర్ఘమైన పోరాటం చిరంతన విజయంగా మారే

---

* భూమిపై అతిమానస చైతన్యాన్ని సుస్థాపితం చేసి భవిష్యత్ కార్యాచరణకు భద్రమైన పరిస్థితి కల్పించి, శ్రీమాత 1973 నవంబరు 17 వ భువనతీరాల నుండి ఉపసంహరించుకున్నారు.

రోజు వస్తుంది. అంతవరకు జీవితంలోని ఒడిదుడుకుల్ని సాహసంతో సహించి ముందడుగు వెయ్యండి.

— శ్రీమాత

అనువాదం: కె. యజ్ఞన్న

నేనిక్కడే ఉన్నాను

ఒక అంతర్దర్శనం

దివ్యమాత: ఇదిగో ఇటు నా వంక చూడు. నేను దివ్యమైన, రూపాంతరీకరించబడిన, ప్రకాశవంతమైన నా నూతన దేహంతో వచ్చాను. ఇంకా అదే మానవమాతను. విచారించకు. నీ స్వీయాత్మను గురించి, నీ సాక్షాత్కారాన్ని గురించి, ఇతరులను గురించి కూడ చింతించకు. నేనిక్కడే వున్నాను, చూడు నా వంక, నా వంక కళ్ళు విప్పార్చి చూడు, నీవు మొత్తంగా నాలో ప్రవేశించు, నా అస్తిత్వంలో లయమైపోయి నా ప్రేమలో నిన్ను నీవు ప్రేమతో లుప్తం చేసుకో, సమస్యలన్నీ పరిష్కరించబడి సమస్తం సజావుగా జరిగిపోవడం చూస్తావు. ఇతరమైనదాన్నంతా మరచిపో, ప్రపంచాన్ని మరచిపో, నన్ను మాత్రమే గుర్తుంచుకో, నాతో, నా ప్రేమతో ఒకటై పో...

— నళినికాంత గుప్త

ఒక వాగ్దానం, ఒక ప్రమాణం:

ప్రభూ, మాకు మార్గదర్శకత్వం వహించే, మమ్మల్ని ప్రకాశమయులను చేసే చేతనరూపంలో మాత్రమే గాకుండా, మా కార్యనిర్వహణలో ఒక సక్రియ సన్నిధిగా కూడా, నీ కార్యం సాధించబడేదాకా, మాతోనే వుంటానని మాకు ఈ ఉదయం ఆశ్వాసనమిచ్చావు. నీవు సంపూర్ణంగా ఇచట ఉంటానని, భువి రూపాంతరం చెందేదాకా భూవాతావరణాన్ని విడిచి వెళ్ళనని, సుస్పష్టంగా మాకు వాగ్దానం చేసావు. మీ ఈ అద్భుత సన్నిధికి మేమర్హుల మగునట్లు, నీ మహోన్నత కార్యసఫలతకు అధికాధిక పరిపూర్ణ రీతిని మమ్ము మేము అర్పించుకొను ఏక సంకల్పంతో మాలోని సర్వమూ ఇక ముందు నుంచి సావధానమగునట్లు మమ్మనుగ్రహించుము.

— శ్రీమాత

స్వర్గం నుంచి తెచ్చిన ఒక కొమ్మ ఇక్కడ నేలపై నాటబడింది

భువి యెదలో ఒక అమరజ్యోతి వెలిగించబడియె
అస్తమించని సూర్యులిచట ప్రజ్వలించెదరు.
జన్మజన్మ హద్దుల మధ్య చీకట్లలో
అవతరించిన ఆత్మలు తపన చెందు.

దివ్యసత్యానంద సామ్రాజ్యముల పైకెగయు జ్వాలల వోలె:
క్రింద ఒక పసిమి — కెంపు వర్ణ మెట్ల వరుస కొనసాగె ముందుకు
ధగద్ధగిత దైవ సంతానంలా
ప్రకటించి ఉత్తేజకరమైన పిలుపుతో.

మరి కొంచె మధికముగ, నూత్న జీవన కవాటములు
వెండి వెలుగులతో మలచబడును.
తళతళలాడు పైకప్పు, కళాత్మకంగా పరిచిన నేలలు,
ప్రకాశమాన శూన్య లోకమందు.

వెండి మిలమిలల లోకాన విడచివైతు నా స్వప్నాలు
బంగారు, నీలవర్ణ దుస్తులతో
దేహధారియై సొగసుగా నీ సజీవ సత్యమ్ముగా
భువిపై నడయాడుటకు

— శ్రీఅరవిందులు

ఆరని దివ్యకాంతిలో దేవుని స్థితికి జగతి నుద్ధరింప
భువి మీద జగతికి దేవుని గొనిరాగ
భౌతిక జీవనమును దివ్యజీవనముగ మార్చ
ఏ కార్యమును సాధించ జన్మించిచెనో ఆమె, అందు
మా యిరువురి అంతరాత్మలు విడిపోని రీతి అనుసంధానమయ్యె.

— శ్రీఅరవిందులు ('సావిత్రి, పు. 692')

శ్రీఅరవిందుల చిహ్నము

దాని అర్థము

క్రిందికి దిగివస్తున్న త్రికోణం సత్ -చిత్ -ఆనందాలకు చిహ్నం.
పైకి పోతున్న త్రికోణం పదార్థం నుండి జీవనం-వెలుగు-ప్రేమ రూపాలలో ఆకాంక్షిస్తూ వెలువడుతున్న సమాధానానికి చిహ్నం.
రెండూ కలుసుకొన్న చోటు — మధ్యలో కమలం కలిగివున్న చతురస్రం — పరాత్పరుని అవతారాన్ని కేంద్రంగా చేసుకొన్న పరిపూర్ణ అభివ్యక్తికి చిహ్నం.
చతురస్రంలో ఉన్న జలం, నానాత్వానికి అంటే సృష్టికి చిహ్నం.

అవతారం రాకవల్ల కలిగే ఆంతరిక ప్రయోజనం

దివ్యజన్మ యొక్క, దివ్యకర్మల యొక్క యదార్థ స్వభావాన్ని తెలుసుకొనేవారు తమ పూర్ణ అస్తిత్వంతో దానిలో ఆశ్రయం పొందేవారు — మన్మయా మాముపాశితాః — వాస్తవం చేసుకోగల జ్ఞానశక్తితో పరిశుద్ధమై, నిమ్నప్రకృతి నుండి ముక్తమై దివ్య అస్తిత్వాన్ని, దివ్యస్వభావాన్ని — మద్భావం పొందుతారు. ఈ నిమ్న స్వభావానికి పైన, మనిషిలో ఉన్న దివ్యస్వభావాన్ని వ్యక్తం జేయడానికి, స్వేచ్ఛ నిరహంకార, అనాసక్త, నిర్వ్యక్తిక, విశ్వజనీన, దివ్య వెలుగు, దివ్యశక్తి, దివ్యప్రేమ నిండుగాగల దివ్యకర్మ లంటే యేమిటో చేసి చూపించడానికి అవతారం వస్తుంది. అహంకారం నుండి తప్పించి అనంతం లోనికి, విశ్వజనీనత లోనికి, పుట్టుట నుండి తప్పించి అమరత్వం లోనికి మానవుని అస్తిత్వం విముక్తమయ్యేందుకు, మానవుని చేతనను నింపివేయు దివ్యమూర్తిగా అతడు వస్తాడు. మానవులను తన వైపు పిలిచే దివ్యశక్తిగా, దివ్యప్రేమగా, వారి మానవ సంకల్పాల అసమర్థత నుండి వారి సంఘర్షణ, భీతి, రౌద్రం, మోహాలలో ఇక ముందెంత మాత్రం జీవించకుండా, అవతారంలోనే ఆశ్రయం పొందగలిగేట్లు, కల్లోల బాధామయ జీవనమంతటి నుండి విముక్తమై, దైవంయొక్క ప్రశాంతి, ఆనందాలలో నివసించ గలిగేటట్లు చేయడానికి అతడు వస్తాడు.

ఏ రూపనామాల్తో లేదా దైవం యొక్క ఏ పార్శ్యాన్ని తన ద్వారా వెలువరించడానికి వస్తాడనేది ఎంత మాత్రం ఆలోచించదగ్గ విషయం గాదు. ఎన్ని

విధాలుగానైనా ఆయన అవతరించవచ్చు. ఎందుకనంటే వారి వారి స్వభావాన్ననుసరించి, మనుష్యులు తమ కోసమై ప్రత్యేకించిన మార్గాన్ననుసరిస్తారు. అది చివరకు ఆయన దగ్గరకు, ఆయన పార్శ్వం దగ్గరకు తీసుకుపోతుంది. అవతారం మానవులను ముందుకు తీసుకుపోయేందుకు వచ్చినపుడు, వారి స్వభావానికి అనుకూలమైన మార్గాన్ని వారు అత్యుత్తమంగా అనుసరించగలుగుతారు. మనుష్యులు ఏ విధంగా సమ్మతించి, ప్రేమించి, భగవంతునిలో ఆనందం పొందుతారో అదే మార్గంలో వారిని భగవంతుడు సమ్మతిస్తాడు, ప్రేమిస్తాడు ఆనందిస్తాడు — వారిలో.

మూలం: శ్రీమాత

అనువాదం కె. వి. రావు.

కాంతి కిరణాలు

నిశ్శబ్దము:

పరిపూర్ణ నిశ్శబ్ద ధ్యానంలో అనంతంగా సర్వవిశాలత్వాన్ని సంతరించుకుంటుంది. ఆ పరిపూర్ణ నిశ్శబ్ద ప్రశాంతతలో దైవం, తన దేదీప్యమాన దివ్య వైభవకాంతిలో అవతరిస్తాడు.

అక్టోబరు 27, 1954

*

జీవాత్మ సర్వోత్తమంగా వ్యక్తమయ్యేది నిశ్సబ్దంలోనే.

జూన్ 7, 1958

*

దైవంతో పరిపూర్ణ తాదాత్మ్యతా భావంతో కూడిన నిశ్శబ్దంలోనే నిజమైన అవగాహన కలుగుతుంది.


అక్టోబరు, 1969

*

మాటలతో అర్థం చేసుకోగలం. కాని జ్ఞానోదయమయ్యేది నిశ్శబ్దంలోనే.

Rs. 15

యోగసిద్ధికి నాలుగు ఉపకరణాలు



అఖిల

అఖిల భారత పత్రిక

జూన్ 2010

యోగసిద్ధికి చతుర్విధ సాధనాలు
(పూర్ణయోగ సాధకులకు)

శ్రీఅరవిందుల దివ్యవాక్కులలో

విషయసూచిక

చతుర్విధ సాధనాలు:

శాస్త్రము — సత్యజ్ఞానము	3
ఉత్సాహము — పురుష ప్రయత్నశక్తి	8
గురువు — ఆచార్యుడు (బోధకుడు)	12
కాలము — ఒక దివ్య ఉపకరణము	20
శ్రీఅరవిందుల దివ్యప్రబోధము — సాధనావిధానము	21
అంతరంగ వికసనము	25
చైత్యపురుషసత్తా వికసనానికై శ్రీమాత సూచించిన అవసరమైన షరతులు	29
సమాచార పత్రము	30

యోగసిద్ధికి చతుర్విధ సాధనాలు
(పూర్ణయోగసాధకులకు)

శాస్త్రము — సత్యజ్ఞానము

పూర్ణయోగ పరమశాస్త్రం ఆలోచించే ప్రతి మనిషి హృదయంలోనున్న శాశ్వత వేదరహస్యం. శాశ్వత జ్ఞానము యొక్క, పూర్ణత్వము యొక్క పద్మము మనలో ముకుళితమై మొగ్గరూపంలో వుంది. మనిషి మనస్సు అనంతుని వైపు మరలడం మొదలైనపుడు, హృదయం అశాశ్వత రూపాలకు కట్టుబడక, దైవం వైపు ఆకర్షింపబడినపుడు, యీ మొగ్గ, సాక్షత్కార పరంపరల ద్వారా, వేగంగానో, లేక నెమ్మదిగానో రేకు రేకు విచ్చుకొంటు వికసిస్తుంది. అప్పటి నుండి జీవితమంతా, భావన అంతా, శారీర మానసికశక్తులన్నీ, అనుభవాలన్నీ ఆ మొగ్గ పుష్పించడానికి ఆటంకాలుగా నున్న బాహ్యపరిస్థితులను తొలగిస్తాయి. దైవాన్ని యెన్నుకొనేవారు, ముందే ఆయనచే ఎన్నుకొనబడే వుంటారు. వారు దైవస్పర్శ పొందివుంటారు. లేకపోతే ఆత్మకు మేలుకొలుపుగాని, జీవాత్మకు ఉన్మీలనముకాని సంభవించనేరదు. కాని ఒక్కసారి దైవస్పర్శను గ్రహించినపుడు ఫలితం అనివార్యం. ఆ సంభావ్యత ఒక్క జన్మలోనైనా వేగంగా జరుగవచ్చు, లేదా నిదానంగా యీ విశ్వక్రీడారంగంలోని అనేక జన్మపరంపరల్లో యేదో జన్మలోనైనా కలుగవచ్చు.

యోగసాధన ద్వారా పొందే యోగసిద్ధి, నాలుగు సాధనాల సమైక్యకృషి వల్ల అత్యుత్తమంగా పొందవచ్చు. మొదటిది సత్య, నియమాల జ్ఞానంవల్ల, దివ్యసాక్షాత్కారశక్తుల ప్రక్రియవల్ల లభించే శాస్త్రజ్ఞానం. అంటే శాస్త్రం తర్వాత ఆ శాస్త్రజ్ఞానం రూపొందించిన బాటలో సహనంతో సాగించే నిరంతర శక్తిసమన్విత స్వయంకృషి — అదే — ఉత్సాహం. మూడవది ఆధ్యాత్మికభూమిక లోనికి మన జ్ఞానాన్ని, కృషిని, లేవనెత్తే గురువుయొక్క సలహాలు, ప్రభావాలు, వారి సజీవ దృష్టాంతము — గురువు. నాల్గవది, చివరిది అయిన సాధనోపకరణం — కాలము. అన్నిటికీ కాలచక్ర పరిభ్రమణ క్రియ, దివ్యగతిశీలగమన క్రియ — ఉంటుంది.

శ్రీ అరవిందులు

మనిషి అంతరంగంలో బాహ్యానికింకా ప్రకటితంకాని జ్ఞానం దాగియుండనిచో, అతనికేదీ కొత్తగా బోధింపబడజాలదు. కనుక మనిషి బాహ్యంలో పొందే జ్ఞానమంతా అతని ఆత్మయందలి పరిపూర్ణత్వం నుండి గ్రహించబడినదే అవుతుంది. మనం మనలోని గుప్తప్రకృతిలో ఆ దైవంగానే వుంటున్నాము, కనుకనే దైవాన్ని తెలిసికొనగలుగుతున్నాము. ఆ దైవంగా తయారు కాగలుగుతున్నాము. బోధన అంతా అంతర్గతశక్తుల బాహ్యప్రకటనమే. బోధన అంతా అంతఃశక్తుల బాహ్యప్రకటనమే. పరిణామమంతా ఒక వికసనమే. ఆత్మానుభూతియే నిగూఢ రహస్యం, ఆత్మవిజ్ఞానము, చేతనాభివృద్ధులు సాధనా ప్రక్రియలు.

దివ్యవేదవాక్కు (శృతి) ఈ బాహ్యప్రకటన సాధనము. ఆ దివ్యవాక్కు లోపలి నుండి రావచ్చు. బయటి నుండైనా రావచ్చు. కాని కార్యార్థమై ఆ మాట అంతర్గత జ్ఞానాన్ని స్థిరపరచే ప్రతినిధిగా వుంటుంది. ఆ వాణి యెల్లప్పుడు దైవానికి ఉన్మీలనమై వున్న, మనలోని ఆత్మ పలుకు కావచ్చు, లేదా సర్వుల హృదయసీమల్లో ఆసీనుడై వుంటున్న జగద్గురు వాక్కు కావచ్చు. యోగమంతా ఆ దైవస్పర్శ మార్గదర్శకత్వం వల్ల బహిర్గతమైనదే. జ్ఞానపద్మం మన హృదయకమల నివాసియైన దైవం నుండి బయలుదేరే ప్రకాశం ద్వారా వికాసం చెందినదే. గ్రంథం యొక్క కాని, బాహ్యగురువు యొక్క కాని ప్రభావం అవసరం లేకుండా కేవలం అంతర్గత ఆత్మజ్ఞానం చాలు అనదగిన గొప్పవారు అరుదుగా వుంటారు.

సాధారణంగా దైవప్రతినిధియైన బాహ్యగురువు ద్వారా లభించే శక్తివంతమైన ఉపదేశవాక్కు ఆత్మవికసనంలో సహాయకారిగా అవసరమవుతుంది. అది శక్తివంతమైన సజీవమైన గురువాక్కు కావచ్చు. కొందరు తమ ఉపదేశకుని ద్వారా కలిగిన దివ్యావిష్కరణాన్ని తమలోని దివ్య అంతశ్శక్తి మేల్కొలుపునకు సాకుగా తీసికొంటారు. ప్రకృతిపై ఆధిపత్యం వహించే నియమావళికి ఇది సర్వజ్ఞుడు, సర్వశక్తి సమన్వితుడునైన దైవం యొక్క అనుకూలమైన అనుగ్రహ సౌలభ్యంగా భాసిస్తుంది. దేవకీనందనుడైన శ్రీకృష్ణుడు ఋషి ఘోరానుండి మంత్రోపదేశం పొంది జ్ఞానం పొందాడని ఉపనిషత్తుల్లో చెప్పబడింది. శ్రీరామకృష్ణ పరమహంస స్వీయ అంతఃసాధనల వల్ల జ్ఞానం పొందారు. ఐనా ఆయన పలు యోగమార్గాల గురువులను అంగీకరిస్తారు. ఆయన పొందిన సాక్షాత్కారం ఆయనకే మినహాయింపు. సాధారణ వ్యక్తులు శిష్యులుగా గురువు ద్వారా జ్ఞానాన్ని పొందక తప్పదు.

సాధారణంగా సంకేతాత్మకంగా (గురు) ప్రభావం, సాధకుని జీవితంపై అధికస్థాయిలో వుంటుంది. యోగం శాస్త్రిలచే నడుపబడినా, లేదా గురువుల మంత్రోపదేశంవల్ల నడుపబడినా, దానిని స్వయంకృషి వల్ల కాని లేదా గురువు యొక్క సహాయంవల్ల కాని సాధన చేయవచ్చు. ఆధ్యాత్మిక జ్ఞానం, ధ్యానం ద్వారాను, స్వానుభూతి వల్లను, దైవసాక్షాత్కారం వల్లను పొందనగును. యోగం శాస్త్రిలు బోధించే పద్ధతుల ఫలితాలచేత సాగిపోతుంది; లేదా గురుబోధన ద్వారాను శక్తివంతములైన సాంప్రదాయ పద్ధతుల ద్వారానైనా సాగిపోవచ్చు. ఇది ఒక ఇరుకైన సాధనా ప్రక్రియ. కాని దీని పరిధుల్లో యిది సురక్షితము, సత్ఫల ప్రదాయకము. ఎందుకంటే యిది సుపరిచితమైన, చక్కగా ఆచరింపబడిన, పలువురు నడిచిన సుదీర్ఘ మార్గంలో నడుస్తుంది.

పూర్ణయోగసాధకునికి యెంతటి అధికారపూర్వక శాస్త్రిమైనా లేదా విషయమెంతటి ఘనమైనదైనా, అది అనంత దివ్యజ్ఞానంయొక్క ఒక పార్శ్వంయొక్క ప్రకటనమే అన్న విషయాన్ని జ్ఞప్తి యందుంచుకోవాలి, కాని దానికి బద్ధుడు కాడు. పవిత్ర శాస్త్రిజ్ఞానం లోతైనది, విస్తృతమైనది, విశాలదృక్పథం కలిగినది అయివుంటే, అది సాధకునిపై, ఉన్నతంగా, అత్యంత ప్రాముఖ్యంగా ప్రభావం చూపుతుంది. ఆ ప్రభావాన్ని అతడు మకుటాయమానమైన సత్యాలతో కూడిన తన ఉన్నత స్వానుభూతితో జతపరుపవచ్చు. భగవద్గీత, ఉపనిషత్తులు, వేదములచే ప్రతిపాదించబడిన హిందూ సత్ సాంప్రదాయాలకు అనుగుణంగానున్న శాస్త్రిలచే అతని యోగం నడుపబడవచ్చు. లేదా అతని యోగం, పవిత్ర శాస్త్రిలలోని సత్యాలను గ్రహించి తన అనుభూతితో సుసంపన్నమైన రీతిలో తీర్చిదిద్దబడవచ్చు. కాని చివరకు అతడు తన ఆత్మానుభూతితో ఉపదేశాల పరిధుల దాటిపోనూవచ్చు. "శబ్ద బ్రహ్మాతివర్తతే" గీత నుడివినట్లు శాస్త్రిబద్ధమైన సత్యాన్ని అధిగమించి, అతడు అభివృద్ధి చెందవచ్చు. అంతే కాదు, "శ్రోతవ్యశ్య శ్రుతశ్యచ" అన్నట్లు తాను విన్నదానిని వినబోవుదానిని అధిగమించి సాగిపోవచ్చు. ఎందుకంటే అతడు అనంతుని గూర్చిన దైవసాధకుడే కాని, గ్రంథసాధకుడు కాదు కదా!

మరో శాస్త్రిం — అది వేదశాస్త్రిం Scriptures కాదు. అది విజ్ఞానశాస్త్రి పద్ధతులు, యోగసూత్రములు కల, ఒక వివరణ పత్రం. అందుండి సాధకుడు తాను అనుసరించవలసిన యోగపద్ధతులను ఎన్నుకొంటాడు. ప్రతి యోగమార్గము నకు

ఒక శాస్త్రము ఉంటుంది. అది వ్రాతమూలకమైనది కావచ్చు. లేదా గురుపరంపరగా మౌఖికంగా ఒకరి నుంచి మరొకరు స్వీకరించబడిన సుదీర్ఘ సాంప్రదాయ పద్ధతులు కావచ్చు. భారతదేశంలో అలాంటి వ్రాతపద్ధతులకు లేదా సాంప్రదాయ పద్ధతులకు గౌరవము, ఆధిపత్యము వుంది. అలా యోగపద్ధతులన్నీ ప్రామాణికములుగ స్థిరీకరించబడుతాయి. ఆయా సాంప్రదాయ రీతుల్లో గల ఆ యా శాస్త్రాలను అధ్యయనం చేసి, సాక్షాత్కారం పొందిన గురువులు శిష్యులకు అవసరమైన ఎప్పటి నుంచో అనుసరించే, నడిపించే మార్గదర్శకు లవుతారు. వాటిని గాక నూతన యోగసాధనా బోధనను ఎవరైనా అనుసరిస్తే అది "శాస్త్రానుగుణంగా లేద" ని ఆక్షేపిస్తారు కూడ. కాని ఫలానా యోగపద్ధతినే అనుసరించి తీరాలని, నూతన సత్యాలను, నవ్య సాక్షాత్కారాలకు విస్తృత నూతన అనుభూతులను పొందే సాధకుని ఉక్కుచట్రంలో బిగించేంత అనాగరికంగా, మొరటుగా, విధినిషేధాలు వాస్తవానికి లేవు. వ్రాతరూపంలో నున్న బోధనలు, పరంపరాగతంగ వచ్చే సాంప్రదాయ బోధనలు, యోగానుభవాలు, క్రమపద్ధతిలో కూర్చబడివున్నాయి. అవన్నీ ప్రారంభ యోగసాధకులకు ఉపయుక్తము లవుతాయి. అంతే కాదు, వీటి ప్రాధాన్యత, ప్రయోజనము, అపారము కూడ. కాని పలు విభిన్న విధానాలను, అభివృద్ధులను అనుసరించు స్వేచ్ఛ ఎప్పుడూ ఆచరణీయమే. పతంజలి మహర్షి రూపొందించిన మహత్తర శాస్త్రమైన రాజయోగం యితర రూపాల్లో సాధన చేయవచ్చు. భక్తి, జ్ఞాన, కర్మ త్రిమార్గాలు కూడ, పలు మార్గాలుగా విడివడి ఉన్నాయి. కాని అవన్నీ కూడ మరల గమ్యస్థానంలో ఒకటే అవుతాయి. సాధారణ యోగవిజ్ఞానశాస్త్రం స్థిరమైనదే. కాని దాని యొక్క సాధనా పద్ధతులు, మార్గాలు, రూపాలు, వేర్వేరుగా వుండడానికి సానుకూలంగా ఉండాలి. ఎందుకంటే సాధారణ సత్యాలు సుస్థిరమైనవిగానూ, మార్పుచెందనవిగాను, వున్నప్పటికీ, వ్యక్తి స్వభావము, అవసరాలు, ప్రేరణలు, — వీటి అవసరాలు సంతృప్తిపరచేవిగా ఉండాలి.

సంయోజనాత్మకమైన పూర్ణయోగం ప్రధానంగా, యే శాస్త్రానికి, యే సాంప్రదాయానికి కట్టుబడి వుండాల్సిన అవసరం లేదు. ఈ యోగం గతంలో పొందిన విజ్ఞానాన్ని ఆధారం చేసికొని, వర్తమాన, భవిష్యత్తుల సాధనా ప్రక్రియల కనుగుణంగా నూతనంగా రూపొందించుకొంటుంది. సాధకుడు తన స్వానుభూతి ఆధారంగా, తన జ్ఞానం ఆధారంగా, తన స్వీయ సాధనా పద్ధతిని నూతన పద్ధతిలో

తీర్చిదిద్దుకొనుటకు సంపూర్ణ స్వేచ్ఛ కలిగి వుంటాడు. జీవితాన్నంతా యోగంగా గ్రహించడమన్నది రాజబాటలో సురక్షితంగా గమ్యానికి యాత్ర చేయడం లాంటిది కాదు. అది ఇదివరకెవరు కాలుపెట్టని అడవిలో క్రొత్తగా బాటను వెతుక్కుంటూ పయనించడం లాంటిది అవుతుంది. ఎందుకంటె చాల కాలం నుండి యోగం నిజజీవితం నుండి ప్రక్కకు విడిపోయింది. పూరాతన యోగపద్ధతులు, మన తాతముత్తాతల కాలం నుండి, ఇప్పుడు మనకు అందుబాటులో లేనట్టివిగ, ఆచరణకు అనుగుణం కానట్టివిగను నున్నవి. కాని వర్తమాన కాలానికి తగ్గట్లు ఆ సమస్య పరిష్కారాన్ని నూతనంగా ప్రారంభించవలసి వుంది.

ఈ పూర్ణయోగం ద్వారా మనం అనంతుని అన్వేషించడమేగాక, ఆయన్ను మన జీవితంలో తనను తాను ఆవిష్కరించండని కోరతాము. అందువల్ల మన యోగశాస్త్రం — దైవావిష్కరణను గ్రహించగలిగే మానవాత్మలకు అనంత స్వేచ్ఛ కలిగించాలి. విశ్వమయుడు, విశ్వాతీతుడు తనలో అవతరించడానికి సాధకుడు అంగీకరించడం, అందుకు తగినట్లుగా సంసిద్ధుడై ఉండటం మనిషి సమగ్ర ఆధ్యాత్మిక జీవితానికి సరైన నిబంధన. అన్ని మతాల ఏకత్వం, ఏకత్వంలో భిన్నమతాల అభ్యున్నతిని యెత్తి చూపాలని తెల్పుచు, స్వామి వివేకానంద ప్రతి మనిషి తన జాతికి, లేదా సాంప్రదాయాలకు కట్టుబడక, తన స్వభావానుగుణమైన రీతిలో భగవంతునితో తన సంబంధాన్ని ముడివేసికొని స్వతంత్రంగా నిలువగలిగినప్పుడే ఆ సమగ్ర ఏకత్వం సిద్ధిస్తుంది అన్నారు. కనుక పూర్ణయోగ సమగ్రత ప్రతివ్యక్తి స్వభావానుగుణమైన స్వంత యోగమార్గాన నడచినపుడే లభిస్తుంది. ఎందుకంటే స్వాతంత్ర్యమే వారి నియమం — చివరి లక్ష్యప్రాప్తి.

కాని సాధకుని సాధనకు సహాయకారిగా వుండుటకై కొన్ని యోగపద్ధతులు రూపొందింపబడాలి. ఇవి సాధకుడు యాంత్రికంగా ఆచరించుటకై రూపొందించబడి స్థిర కఠిన నిర్ణయ విధానాలుగ వుండరాదు. ఆ యోగపద్ధతులు సాధారణ సత్యాలతో, నియమాలతో కూడి వుండి, శక్తివంతములై ఉదార సూచనలతో కూడి వుండాలి. అన్ని శాస్త్రాలు కూడ భావి అనుభవానికి సహాయకారులుగా, వెలువడిన గత అనుభవాల ఫలితాలే. అవి సాధకులకు సహాయకారులుగ, కొంతవరకు మార్గదర్శకంగా వుంటాయి. అవి ప్రయాణీకులు యే మార్గాలలో పయనిస్తున్నదీ తెలుపుడు చేసే బాటల పేర్లతో మార్గదర్శక ఫలకములను ఏర్పరుస్తాయి.

మిగిలినదంతా సాధకుని స్వయంకృషి పైన, స్వీయ అనుభవం పైన, గురువు శక్తిపైన ఆధారపడి వుంటుంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: బి. నరసింహయ్య

ఉత్సాహము — పురుష ప్రయత్నశక్తి

ఆధ్యాత్మికానుభవం వృద్ధిపొందడమనేది ముఖ్యంగా దాని ఉరవడిలో, విస్తరణలో దాని ఫలితాల శక్తితీవ్రతలో ప్రాథమికంగా సాధకుడు ప్రారంభించిన మార్గం పైనా ఆ తర్వాత కొంతకాలానికి అతని ఆకాంక్ష పైనా, కృషిపైనా ఆధారపడి ఉంటుంది. బాహ్యజీవన వ్యాపారాల్లో, విషయ ఆకర్షణల్లో మునిగి తేలుతూ అహంభావ చైతన్యంలో ఉన్న మనిషిని ఉద్ధరించి, అతీంద్రీయశక్తులు, విశ్వాత్మకశక్తులు దిగివచ్చి వాటి శక్తిని నింపి వ్యక్తిని పూర్తిగా మార్పుచేయగల ఉన్నతస్థితికి మళ్ళించటమనేది యోగప్రక్రియ. వ్యక్తి ఎంత తీవ్రంగా ఈ మార్గాన్ని అనుసరిస్తున్నాడు, అంతర్గతంగా ఆ ఆత్మను నడిపిస్తున్న శక్తి ఏది అనేదాన్ని బట్టి యోగసిద్ధి నిర్ణయమౌతుంది. ఇంకా హృదయంలోని ఆకాంక్ష, సంకల్పశక్తి, మనస్సులోని ఏకాగ్రత, ఆ శక్తి కుండే ఓర్పు, పట్టుదల ఆ తీవ్రతను నిర్ణయించే ప్రమాణాలు. బైబిలు మాటల్లో చెప్పాలంటే “నా ప్రభువు కోసం నా ఆరాటం నన్ను తినేస్తోంది” అని సాధకుడు చెప్పే స్థితిలో ఉండాలి; ఇటువంటి ఆరాటం, ఉత్సాహం దివ్యఫలితాల కోసం హృదయావేదన, వ్యాకులత ఆ దైవాన్ని చేరాలనే ఉత్సుకత అహంకారాన్ని పూర్తిగా హరించివేస్తుంది, అహంకారానికుండే ఇరుకు పరిధుల్ని, దాని ఆవరణ కోశాన్ని ఛేదించేసి అది కోరుకునేదాన్ని గొప్పగా గ్రహించగలిగేటట్లు చేస్తుంది. అది అన్వేషిస్తున్నది విశ్వాత్మకం కావటం వల్ల అన్నిటినీ అధిగమిస్తుంది; సర్వాతీతం కాబట్టి ఎంత పెద్ద బహుళమైన వ్యక్తిత్వ స్వభావమైనప్పటికీ మించిపోగలదు.

కానీ పరిపూర్ణత కోసమై పనిచేసే శక్తికి ఇది ఒక పార్శ్వం మాత్రమే. పూర్ణయోగ ప్రక్రియ మూడు దశల్లో ఉంటుంది. అయితే విడివిడిగా ప్రత్యేకంగా వేరుచేసేటట్లుండవు కానీ ఒక రకంగా క్రమానుగతంగా అనుసరించేవిగా ఉంటాయి. మొట్టమొదట చేయువలసింది తనను తాను అధిగమించి భగవంతునితో అనుబంధం

ఏర్పరుచుకోడానికి ఉపకరించే ప్రాథమిక ప్రయత్నం. ఆ తర్వాత మనం సంసర్గం ఏర్పరుచుకున్న ఆ అధిగమనశక్తి మన పూర్తి చైతన్యాన్ని పరివర్తనం చేయగలందులకై మనలోకి దాన్ని ఆహ్వానించుకోవటము, చివరగా పరివర్తన చెందిన ఈ మానవత్వమును ఒక దివ్య కేంద్రంగా ఈ ప్రపంచంలో వినియోగించడము. భగవంతునితో కొంతగానైనా సంసర్గం ఏర్పడనప్పుడూ, కొంతవరకూ నిలకడైన సాయుజ్యసిద్ధి లేనప్పుడూ సహజంగా పురుషప్రయత్నం ఆధిక్యత వహించాలి. అయితే ఆ సంసర్గం ఏర్పడినప్పుడు అది ఎంత మేరకు ఏర్పడిందో తెలుసుకొన్న సాధకుడు తనదిగానిదీ తన అహంకార ప్రయత్నాన్నీ, సామర్థ్యాన్నీ అధిగమించే ఒక దివ్యశక్తి తనలో పనిచేస్తున్నట్లు గ్రహించి, అంతగానూ ఆ శక్తికి తనను తాను సమర్పించుకొని క్రమంగా తన సాధనా బాధ్యతను దానికి అప్పగించాలి. చిట్టచివరికి తన శక్తి, సంకల్పమూ కూడా ఉన్నత దివ్యశక్తితో ఏకమైపోగా, వాటికి దివ్యసంకల్పంలో దాని అతీత విశ్వశక్తిలో విలీనం చేస్తాడు. ఇక అప్పట్నించీ అది నిష్పాక్షిక విజ్ఞతతో, అమోఘ దివ్యదృష్టితో తన ఔత్సాహిక అహానికి చేతకాని ప్రాణిక, దైహిక జీవాలకు కావలసిన పరివర్తనా కార్యాన్ని పర్యవేక్షిస్తున్నట్లు తెలుసుకుంటాడు. ఈ సాయుజ్యం, తాదాత్మ్యం సంపూర్ణంగా ఏర్పడినప్పుడు ప్రపంచంలో దైవకేంద్రమనేది సంసిద్ధమవుతుంది. ఇది పరిశుద్ధమై, విముక్తమై, మృదువై, తేజోమయమై పృథ్వి ఆధ్యాత్మిక పరిణామం లేదా పరివర్తనా కార్యం కోసం మానవత, అతిమానవత చేసే మహాయోగంలో పరమోన్నతశక్తి సూటిగా పనిచేయడానికి సాధనం కాగలదు.

నిజానికి పనిచేసేది ఎప్పుడూ, ఆ మహోన్నత దివ్యశక్తే. ఆ దివ్యశక్తి పనితీరులో మన దోషభరితమైన అసంపూర్ణ అహంకార మనస్సు, అన్వయించుకోవాలనే ఆకాంక్ష వల్ల మన ప్రయత్నం ఉంటుంది. అహంభావ మనస్సు మామూలు ప్రాపంచిక అనుభవాలను మానసికంగా భావించినట్లే అసాధారణ శక్తి, భూమికలో కూడా అనుభవానికి తెచ్చుకోవాలని పట్టుపడుతుంది. ఈ ప్రపంచంలో మనం అహము ద్వారానే పనిచేస్తాము. మనలో పనిచేస్తున్న విశ్వశక్తు లన్నిటినీ మనవిగా చాటుకుంటాము. మనః ప్రాణ శరీరాల పరిధిలో చక్కగా రూపుదిద్దుతూ అభివృద్ధి పథంలో పనిచేస్తున్న అతీతశక్తి కార్యకలాపాలు కూడా మన సంకల్పం, మన బుద్ధి, మన శక్తి మన ప్రయోజకత్వంతోనే జరుగుతున్నట్లు ప్రకటించుకుంటాము. జ్ఞానోదయమైనప్పుడు ఈ అహం ఉపకరణం మాత్రమేనని తెలుసుకుంటాము.

ఇవన్నీ మనవేగానీ అంటే మనలో ఉండే ఆత్మ సర్వాతీత పరమాత్మకే చెందుతాయనీ, అహం (నాది) కాదనీ గ్రహింపుకు రావడం మొదలవుతుంది. మన పరిమితులు, వికృతాలూ మాత్రం మన వంతు సహకారంగా అందిస్తాము. దానిలో ఉండే అసలైన శక్తి భగవంతునిది. మానవ అహంకారం ఎప్పుడైతే తన సంకల్పం ఒక పరికరమనీ, తన మనస్సు, అమాయకత్వమూ, తెలివితక్కువతనమనీ, తన శక్తి కేవలం ఒక బాల్యచేష్టయనీ, తన నీతి, అపవిత్రత బూటకరూపమనీ గుర్తించి తన కంటే అతీతమైన శక్తి ఆధీనంలోకి వెళ్ళుతుందో అదే దానికి విముక్తి. మన వ్యక్తిత్వం తాలూకు స్వేచ్ఛ, ఆత్మవ్యక్తీకరణలను మనవే అనే మమకారంతో భావిస్తాము. కానీ మనకు అంటకూడదనే అనేక వేల సలహాలకూ, ప్రచోదనలకూ, శక్తులకూ మన అహం దాసోహమంటూ ఉంటుంది. స్వేచ్ఛను చాటుకునే మన అహం ప్రతిక్షణం అనేక వేల జీవుల, అనేక అధికారాల, శక్తుల, సార్వత్రిక ప్రకృతిధర్మాల చేతుల్లో బానిసగా, కీలుబొమ్మగా ఆడుతూ ఉంటుంది. భగవంతునిలో ఆత్మను లీనం చేసుకోవడమే దానికి సాఫల్యత. తనకు అతీతంగా ఉండే శక్తిని శరణు వేడటమే దానికి బంధవిమోచనము. అదే సంపూర్ణ స్వాతంత్ర్యము.

అయినప్పటికీ ఆచరణలో మాత్రం ఈ మూడు దశలనూ క్రమానుగతంగా అనుసరించవలసిందే. ప్రతి దశా అవసరమే, ప్రతిదీ ఉపయోగమే. దేని స్థానం దానిది, దేనికి కావలసిన సమయమూ దానిదే. అన్నిట్లోకీ ఉత్కృష్టమైనదని చివరి దశకి ఓ గంతుతో మొదలుపెట్టడం మంచిదీ కాదు, అది అంత క్షేమకరమూ కాదు. దాని వల్ల ప్రయోజనం సిద్ధించదూ కూడా. పరిణతి లేకుండా ఒక దాన్నుంచి మరోదానికి కప్పదాట్లు వేయకూడదు. ఎందువల్లనంటే మొదటినుంచీ హృదయంలో, మనస్సులో ఆ పరమాత్మ ఎరుకను కలిగి ఉన్నప్పటికీ స్వభావంలోని కొన్ని అంశలు ఆ అభిజ్ఞ ప్రత్యక్షం కాకుండా అడ్డుపడతాయి. సాక్షాత్కారము లేనప్పుడు మనస్సులోని నమ్మిక క్రియాశీలక వాస్తవం కాలేదు. అది ఆకృతి పొందిన జ్ఞానమే అవుతుంది కానీ సజీవత్వము కాదు, కేవలం భావమే కాని తేజస్సు కాదు. ఒక వేళ యోగసిద్ధి ప్రారంభమైనా ఆ వెంటనే మనం పూర్తిగా భగవంతుని చేతిలో ఉన్నామనిగానీ ఆయన పరికరంగా పనిచేస్తున్నామనిగానీ అనుకోటం మొదలుపెడితే ప్రమాదము. అది చాలా ఉపద్రవమైన అనర్థం తెచ్చిపెట్టవచ్చు; నిస్సహాయమైన అచేతనత్వాన్ని కలుగచేయవచ్చు; భగవంతుని పేరుతో అహంకార చలనాలను గోరంతలు

కొండంతలు చేస్తూ యోగక్రియనంతా ఘోరంగా వక్రీకరించి పాడుచేయవచ్చు. దీర్ఘకాలంపాటు అంతరంగంలో ప్రయత్నం చేస్తే వ్యక్తిగత సంకల్పం కష్టబడి అధః ప్రవృత్తి తమస్సునూ, వికారాన్నీ నిరోధించి తనను తాను దివ్యకాంతి వైపు తీక్షణంగా, స్థిరంగా నిలుపుకోగలదు. ఇంకా మనస్సు సమర్థతలనూ, హృదయానురాగాలను, ప్రాణికవాంఛలనూ ఇంకా యావత్తు మనిషినీ సముచిత వైఖరి కలిగియుండేటట్లు చూడాలి, లేదా యుక్తప్రభావాలకు లోబడి, నడుచుకునేటట్లు శిక్షణ నివ్వాలి. అప్పుడు మాత్రమే, ఇదంతా లక్షణంగా జరిగినప్పుడు మాత్రమే అధఃప్రవృత్తి ఉన్నతప్రవృత్తి అధీనంలోకి రావటం సంపూర్ణ మవుతుంది. అంటే సమర్పణ అంగీకారయోగ్యమైనదన్న మాట.

సాధకుడు తన సంకల్పబలంతో అహంకారశక్తులను స్వాధీనం చేసుకొని కాంతి, సత్యాల వైపు మళ్ళించాలి. అలా మళ్ళించిన తర్వాత ఎల్లప్పుడూ వాటినే గుర్తిస్తూ, అంగీకరిస్తూ అనుసరిస్తూ ఉండేటట్లుగా వాటిని తర్ఫీదు చేయాలి. ఈ విధంగా పురోగమిస్తూ ఇంకా తన స్వీయసంకల్పంతో, స్వప్రయత్నంతో, స్వశక్తితో ఆ అహంకారశక్తులను మహోన్నత ప్రభావానికి చైతన్యవంతంగా లోబడి నడచుకొనే ఉన్నతశక్తి ప్రతినిధులుగా వినియోగించడం నేర్చుకుంటాడు. ఇంకా కొంచెం ముందుకు వెళ్ళినప్పుడు తన సంకల్పము, ప్రయత్నమూ, శక్తీ ఇక ఏమాత్రం ప్రత్యేకమూ కాదు, తనవీ కాదు. అది తనలో పనిచేసే ఉన్నతశక్తి కార్యశీలత మాత్రమే. దైవం ఆవిర్భవించటానికీ ఇప్పుడిప్పుడే పురోగమిస్తున్న మానవ పరిణామానికీ మధ్య ఇంకా కొంత అంతరం మిగిలే ఉంది. ఒక ఖచ్చితమైన విధానంలో కాకపోయినా కొంత వికృతంగానైనా ఈ పరిణామానికి కొంత ప్రక్రియ అవసరము. ఈ ప్రక్రియ చివరి దశలో అహంకారం, అపవిత్రత, అజ్ఞానం క్రమక్రమంగా అదృశ్యమైపోగా వేర్పాటుధోరణి యొక్క అడ్డు తొలగిపోయి వ్యక్తిలో దైవకార్యక్రమం మాత్రమే కొనసాగుతూంటుంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: అమరవాది ప్రభావతి, అమరవాది వేంకటరామ శాస్త్రి)

గురువు ఆచార్యుడు (బోధకుడు)

సమగ్రయోగ శాస్త్రం, ప్రతి మనిషి హృదయంలో రహస్యంగా ఉన్న శాశ్వత వేదం. కనుక దాని సర్వోత్కృష్ట దివ్యమార్గదర్శి, బోధకుడు, రహస్యంగా మన అంతరంగంలో వున్న జగద్గురువు. అతని జ్ఞానం యొక్క అత్యుజ్వల కాంతిచేత మన అంధకారాన్ని నాశనం చేసేది అతడే. ఆ వెలుగు, మనలో ఆతని స్వీయవ్యక్తీకరణ యొక్క అభివృద్ధి చెందే మహనీయతగా తయారవుతుంది. ఆతని స్వభావమైన స్వేచ్ఛ, ఆనందం, ప్రేమ, శక్తి, అమృతస్థితులను ఆతడు మనలో క్రమంగా ఆవిష్కరిస్తూ ఉంటాడు. మనకు పైన, మనం అందుకోవలసిన ఆదర్శంగా తన దివ్యత్వాన్ని మనకు పైన నిలిపి, దాని కోసం నిరీక్షిస్తున్న ఈ నిమ్నప్రకృతిని, దానికి ప్రతిరూపంగా రూపాంతరం చెందిస్తాడు. మన లోనికి తన సాన్నిధ్య ప్రభావాన్ని గ్రుమ్మరించడం ద్వారా వ్యక్తి అస్తిత్వాన్ని విశ్వాత్మక, విశ్వాతీత స్థితితో మమేకం అయ్యేటట్లు తయారుచేస్తాడు.

దీనికి ఆతని వ్యూహం, పద్ధతి ఏమిటి? ఆతనికో పద్ధతంటూ లేదు, కాని ఏ పద్ధతైనా ఆతనిదే! అత్యున్నత ప్రక్రియలను, ఉద్యమాలను ప్రకృతి భరించగలిగనంతవరకూ సహజరీతిని వ్యవస్థీకరించడం ఆతని వ్యూహం. బయటకు ఏ మాత్రం విలువ లేనివిగా కన్పించే అత్యల్పమైన అంశాలనూ, కార్యాలనూ ఎంతో జాగ్రత్తగా, కూలంకషంగా పరిశీలిస్తూ, తమతో వాటిని అనుసంధానం చేసుకొంటూ, తమ లోనికి స్వీకరిస్తూ, చివరకు అన్నింటినీ, దివ్యవెలుగు లోనికి ఉద్ధరించి, ఆ అత్యున్నత ప్రక్రియలు, ఉద్యమాలు రూపాంతరీకరిస్తాయి. ఎందుకనంటే ఆతని యోగంలో నిరుపయోగమైనది, వదలివేయవలసినది, అత్యల్పమైనదంటూగాని, ప్రయత్నించలేనంత గొప్పదంటూగాని ఏదీ లేదు. గురువునకు సేవకునిగా, శిష్యునిగా సాధకుడు చేసే పనిలో గర్వానికి లేక అహంకారానిక ఎట్టి ప్రమేయం ఉండదు. కారణం ఆతని కోసం జరిగేదంతా ఊర్ధ్వస్థాయి నుంచే జరుగుతుంది. అదే కారణంగా అతని వ్యక్తిగత లోపాలకు, లేదా అతని స్వభావంలోని తొట్రుపాట్లకు నిరాశ చెందే అవసరం అతనికి లేదు. ఎందుకనంటే అతనిలో పనిచేసే దివ్యక్రియాశక్తి వ్యక్తిగతం కానిది. అనంతమైనది.

ఈ అంతరంగ మార్గదర్శకుని, యోగాచార్యుని, ప్రభువును, వెలుగును,

ఉపభోగించువానిని గుర్తించడం సమస్త యజ్ఞగమ్యాన్ని, కృషిని పూర్తిగా గుర్తించడం, సమగ్ర పరిపూర్ణతకి అత్యంత ప్రాముఖ్యంగల విషయం. అంతరంగంలోని ఆ మార్గదర్శకుని మొదటగా సమస్తం వెనుక నున్న ఒక రూపరహిత దివ్యజ్ఞానంగా, దివ్యప్రేమ, దివ్యశక్తిగా దర్శించామా, లేదా, సాపేక్షంలో అభివ్యక్తమౌతూ, దాన్ని ఆకర్షిస్తున్న ఒక నిరపేక్షంగా దర్శించామా, లేదా, వ్యక్తియొక్క ఉన్నతతకు పరమాత్మగా, సమస్తం యొక్క ఉన్నతతకు పరమాత్మగా దర్శించామా, లేదా, ఆతని లేక ఆమె యొక్క అసంఖ్యాక రూపనామాల్లో ఒక దివ్యపురుషునిగా మనలోనూ, ప్రపంచంలోనూ దర్శించామా, లేదా, మనస్సు భావించు ఆదర్శంగా దర్శించామా, లేదా, అనేది ముఖ్య విషయం కానే కాదు. చివరి కాతడే సమస్తమూ అనీ, ఇవన్నీ కలియగా ఏర్పడిన స్వభావానికి అనుగుణంగా, ఆతనిని గ్రహించే స్థితిలో మానసిక అవగాహన తప్పకుండా మారుతుంది.

పురుషప్రయత్న తీవ్రత వల్ల, తనలోనూ, తన లక్ష్యాల సాధనలోనూ మునిగిపోయి వున్న, అహంకారం వల్ల మొదట్లో అంతరంగం లోని ఈ దివ్యమార్గదర్శకుడు తరుచు తెరమరుగవుతాడు. స్పష్టత సంతరించుకొన్న కొలదీ, అహంకారిక కృషి వల్ల కలిగే సంక్షోభస్థితి నుండి ఒక ప్రశాంతతర ఆత్మ-జ్ఞానానికి అవకాశం కలిగించినకొలదీ, మనలో పెరుగుతున్న వెలుగుకు ఆధారాలను మనం గుర్తించగలుగుతాం. తెలిసీ తెలియని మన పరస్పర విరుద్ధ కదలికలు, మన మిపుడిపుడే చూడమొదలిడుతున్న ముగింపు వైపునకు ఎలా దారితీయ నిర్దేశించబడినవో తెలుస్తున్నకొలదీ యోగమార్గంలోనికి మనల్ని, మన జీవన పరిణామాన్నీ ఎవరో వ్యూహరచన చేసి ఈ మలుపు ద్రిప్పినట్లు గ్రహించినకొలదీ, మన గతంలో కూడా, మనలో అదే జ్ఞానప్రకాశ మూలం ఉండి ఉన్నదని గుర్తిస్తాం. ఎందుకనంటే యిపుడు మన సంఘర్షణలు, ప్రయత్నాలు, జయాపజయాల భావాన్ని అర్థం చేసుకోగలుగుతున్నాం. చివరకు మన కెదురైన అగ్నిపరీక్షలు, బాధల యొక్క అర్థాన్ని పట్టివేయగలుగుతున్నాం. మనల్ని గాయపరచిన, ఆటంకపరచిన, దానంతటి వల్ల అందిన సాయాన్ని, మన పతనాలు, తప్పటడుగుల ప్రయోజనాన్ని ప్రశంసించగలుగుతున్నాం. ఒక విశ్వాతీత దివ్యద్రష్ట మన భావాలకు, ఒక సర్వాలింగక దివ్యశక్తి, మన సంకల్పానికి, కర్మలకు, సర్వాన్నీ ఆకర్షించే, సర్వోన్నతలో లీనం చేసుకొనే బ్రహ్మానందం మరియు దివ్యప్రేమ మీద భావావేశం జీవితానికి రూపకల్పన

చేసి నడిపిస్తున్న దివ్యనాయకత్వాన్ని – గతంలో అది ఉన్నదా లేదా అని గాక ఇప్పుడున్నది అని తర్వాత గుర్తించగలుగుతాం. మరింత మెరుగైన వ్యక్తిగత సంబంధం వల్ల మొదటగా మనల్ని స్పృశించినదాని నుండి లేదా చివరకు మనల్ని పట్టి వేసుకొన్నదానిలో నుండి కూడా దానిని గుర్తించగలుగుతాం. ఒక సర్వోన్నత దివ్యగురువును, దివ్యమిత్రుని, దివ్యప్రియుని, దివ్యబోధకుని యొక్క శాశ్వత సన్నిధిని కూడా మనం అనుభూతి చెందుతాం. ఈ మహిమోపేతమైన అభివృద్ధి మన స్వప్రయత్నాలవల్ల కాదని, ఒక శాశ్వత దివ్యపరిపూర్ణత మనకు తన స్వీయ ప్రతిబింబరూపాన్ని కల్పిస్తున్నదని మనం గ్రహించాం గనుక, మన అస్తిత్వ ప్రధానకేంద్రంలో, ఆ సన్నిధి వున్నదనీ, మన అస్తిత్వం ఒక మహనీయ మరియు విశాల అస్తిత్వంలాగా మరియు దానిలోనికి అభివృద్ధిచెందుతున్నట్లు గుర్తిస్తాం. యోగసూత్రాల ప్రభువు లేక ఈశ్వరుడు ఎవ్వరో, చైత్యగురువు లేక అంతర్యామి యెవ్వరో, జిజ్ఞాసి యొక్క నిరపేక్షమేదో, అజ్ఞేయవాది యొక్క అగ్రాహ్యమేదో, పదార్థవాది యొక్క విశ్వశక్తి యేదో, మతాలు రూపనామాలు కల్పించిన అంతర్యామి, సర్వోన్నత శక్తి యెవ్వరో, ఆతడు మన యోగ ఈశ్వరుడు.

ఆ యేకైకుని దర్శించి, తెలుసుకొని, ఆయనలా తయారై ఆయనను మన ఆంతరమూలాలలో మన సమస్త బాహ్యప్రకృతిలో సాకారం చేసుకొనడమే సదా మన నిగూఢమైన రహస్య గమ్యం. అదిపుడు శారీరకంగా అభివ్యక్తమైన మన ఉనికి యొక్క సచేతన కార్యంగా తయారవుతుంది. మన అస్తిత్వపు సకలాంశాలలో ఆతని యెరుక కలిగి వుండడం, అంతకు సమంగానూ మన విభజనాత్మక మనస్సు మన అస్తిత్వానికి బాహ్యమైనవిగా వేటిని చూస్తుందో వాటన్నింటి యందూ ఆతని యెరుక కలిగి వుండటం వ్యక్తిగత చేతన యొక్క పతాకస్థాయి. ఆయనచే వశంచేసుకోబడి, అప్పట్నించీ ఆయన మనలనూ, సమస్త వస్తువులనూ ఆవహించునట్లు చేసుకొనడం, సమస్త సామ్రాజ్యాధిపత్యాన్ని తెలియజేస్తుంది. సమస్త సక్రియత, సమస్త నిష్క్రియతల, శాంతి, శక్తుల యందు, అభేదత్వ భేదత్వాల అనుభవాలయందు ఆయనను సంవేదించే ఆనందం కోసమే ప్రపంచంలో అభివ్యక్తమైన జీవుడు, వ్యక్తిగత అంతరాత్మ, అజ్ఞానంలో అన్వేషిస్తున్నది. సమగ్రయోగ లక్ష్యం యొక్క పూర్తి నిర్వచనం యిది. సర్వేశ్వర ప్రకృతి తనలోనే దాచివుంచిన సత్యాన్ని ప్రతివాని యొక్క వ్యక్తిగత అనుభవం ద్వారా, ఆవిష్కరించడానికి ప్రసవవేదన పడుతోంది.

మానవ అంతరాత్మను దివ్య అంతరాత్మ లోనికి, ప్రాకృతిక జీవనాన్ని దివ్యజీవనం లోనికి మార్పు చేయడం సమగ్రయోగ లక్ష్యం.

*

మనలోనే నివసిస్తున్న రహస్య గురువును కనుగొనడం, దివ్యజ్ఞానం, దివ్యప్రేమ కూడా అయిన దివ్యశక్తికి మనం సదా తెరచి ఉంచుకొంటూ మార్పుకోరుతూ దానికి విశ్వసనీయంగా ఉండడమే సమగ్రంగా ఈ లక్ష్యాన్ని ఫలప్రదం చేసే సురక్షిత మార్గం. కాని మొదట్లో ఇలా ప్రవర్తించడమంటే ఆహంకారిక చేతనకు చాలా యిబ్బందికరంగా వుంటుంది. ఒక వేళ ప్రవర్తించడమంటూ జరిగినా సంపూర్ణంగా ప్రకృతి యొక్క ప్రతి అంశలోనూ అది జరగడం చాలా కష్టం. మొదట్లో అది యెందుకని యిబ్బందికరంగా వుంటుందంటే, ఆలోచనల యొక్క, ఇంద్రియ సంవేదన యొక్క అహంకారిక అలవాట్లు కారణం. అవసరమైన అవగాహన కలిగించే దారులన్నీ మూసుకుపోయి వున్నాయనే భావనకు గల అహంకారిక అలవాట్లు కారణం. తరువాత కూడా అదెందుకు యిబ్బందికరంగా వుంటుందంటే, విశ్వాసం, సమర్పణల ఈ మార్గంలో అవసరమైన ధైర్యం కలిగి వుండడం అహంకి — మేఘావృతమైన అంతరాత్మకు — అంత తేలికైన విషయం గాదు. అహంకారిక మనస్సు కోరుకొనేది, లేదా సమ్మతించే ఏ కార్యనిర్వహణా విధానం వుందో అది దైవకార్య నిర్వహణా విధానం గాదు. ఎందుకనంటే అది సత్యం దగ్గరకు చేరడానికి తప్పును ఉపయోగిస్తుంది, ఆనందం పొందడానికి బాధను ఆసరాగా చేసుకొంటుంది, పరిపూర్ణతను సాధించడానికి అపరిపూర్ణత మీద ఆధారపడ్తుంది. తానెచటికి నడుపబడుతున్నదో అహంకారం గమనించ లేదు. ఇతరమైనదానిచే నడుపబడటాని కెదురు తిరుగుతుంది, నమ్మకం కోల్పోతుంది, ధైర్యాన్ని కోల్పోతుంది. ఈ వైఫల్యాలు గణించదగినవి కావు. ఎందుకనంటే అంతరంగంలోని దివ్యమార్గదర్శకుడు మన తిరుగుబాటువల్ల కినుక వహించడు, మన విశ్వాసరాహిత్యంవల్ల నిరుత్సాహపడడు, లేదా మన బలహీనతలవల్ల దరిచేరకపోడు. మాతృమూర్తికుండే నిండైన ప్రేమ, గురువుకుండే సమస్తాన్నీ సహించే ఓర్పు, ఆయనకున్నాయి. ఆ మార్గదర్శకత్వం నుండి మన అంగీకారాన్ని ఉపసంహరించుకుంటే వాస్తవిక ప్రయోజనాన్నంతా కాకపోయినా — చైతన్యాన్ని లేక యెరుకను కోల్పోతాం. ఆ మార్గదర్శకత్వం వల్ల ఏ ప్రయోజనం కలుగుతుందని భావించామో, ఏ సందర్భంలో కూడా అది కలగకుండాపోదు. ఏ నిమ్న జీవాత్మ

ద్వారా అతను తన దివ్య ఆత్మను వ్యక్తీకరిస్తున్నాడో, దాని నుండి మన ఉన్నతతర పరమాత్మను వేరుచేసి గుర్తించలేకపోతున్నందువల్ల మనం మన అంగీకారాన్ని వెనక్కు తీసుకొంటున్నట్లవుతున్నది. ప్రపంచంలోలాగా మనలో కూడా భగవంతుని చూడలేకపోతున్నాం, ఎందుకనంటే సృష్టిలో అతని కార్యకలాప విధానాలే కారణం. ముఖ్యంగా ఎందుకనంటే అతడు మన స్వభావం ద్వారనే పనిచేస్తాడుగాని నిర్హేతుక మహిమల పరంపర ద్వారా కానే కాదు. తనకు విశ్వాసం కలగడానికని మనిషి మహిమలను కోరుకుంటాడు. కనులు మిరుమిట్లు గొలిపే వెలుగులను తను చూడాలనుకుంటాడు. దైవనాయకత్వానికి వ్యతిరేకంగా చేసే మరో తిరుగుబాటులో మన అనాలోచిత ప్రేరేపణలకు, కోరికలకు ఎక్కువ సంతృప్తిని కలిగించే, అస్తవ్యస్తం చేసే మరో శక్తిని పిలిచి దారి చూపించమని దాని నడిగి, దానికో దేవుని పేరు పెట్టే ప్రమాదంగా ఈ తొందరపాటు అసహనం, అజ్ఞానం తయారుకావచ్చు.

తనలోనే అదృశ్యంగా ఉన్న దానిని దేనినో నమ్మడం మనిషికి కష్టం. కాని అదే సమయంలో, తాను రూపమును ఆపాదించగలిగి, తనకు, బహిర్గతంగా నున్న దేనినైనా నమ్మడం తేలిక. మానవుల్లో చాలామంది యొక్క ఆధ్యాత్మిక పురోభివృద్ధి ఒక బాహిరమైన ఆలంబనాన్ని మనకు విశ్వాసం కలిగించేదిగా బయటనున్నదాన్ని కోరుకుంటుంది. ఆధ్యాత్మిక అభివృద్ధికి భగవంతుని బాహ్య ప్రతిరూపంతో అవసరముంది; లేదా, ఒక మానవ ప్రతినిధి, అవతారం, ప్రవక్త లేక గురువు దానికి కావాలి; లేదా రెండింటినీ అది వాంఛిస్తుంది, రెండింటినీ స్వీకరిస్తుంది. ఎందుకనంటే మానవ అంతరాత్మ అవసరాన్ని బట్టి దైవం తనను తాను దివ్యత్వంగా, మానవ దైవంలా, లేదా మామూలు మానవతలో — లోనున్న భగవత్తత్వాన్ని ఎంతో విజయవంతంగా దాచిపెట్టే ఆ దళసరి ముసుగును, తన మార్గదర్శకత్వాన్ని ప్రసరింపజేసే మాధ్యమంలా ఉపయోగించుకొంటూ — తనను తాను అభివ్యక్తం చేసుకొంటుంది.

హిందూ ఆధ్యాత్మిక శిక్షణా విధానం, ఇష్టదేవత, అవతారం, గురువుల రూపంలో మానవ అంతరాత్మకుగల ఈ అవసరాన్ని తీరుస్తుంది. ఇష్టదేవత అంటే ఏదో క్షుద్రశక్తిగాదు. విశ్వాతీత మరియు విశ్వజనీన భగవత్తత్వం యొక్క ఒక రూపం, ఒక నామం. దాదాపు అన్ని మతాలూ అటువంటి ఏదో ఒక రూపనామాన్ని తమకు ఆధారం చేసుకొంటాయి, లేదా అటువంటి దానిని దేన్నో ఆధారంగా

ఉపయోగించుకొంటాయి. మానవ అంతరాత్మకు అటువంటి ఆవశ్యకత ఉన్నదని స్పష్టంగా తెలుస్తూనే వుంది. భగవంతుడే సర్వం, (పూర్ణః) సర్వంకన్నా అధికుడు భగవంతుడు. సర్వం కన్నా అధికమైనదాన్ని మనిషెలా ఊహించగలడు? అందుచేత అతనికి సర్వం అంటే అర్థం గావడం కూడా మొదట్లో చాలా కష్టంగా వుంటుంది. అతనే తన జాగృత చేతనలో ఒక పరిమిత స్వభావంతో సామరస్యత కలదానికే ఉన్మీలనం కాగలవాడు. సర్వంలో ఆతని గ్రహణశక్తికి చాలా కష్టమనిపించే విషయాలున్నాయి, లేదా అతని సున్నిత భావావేశాలకు, కృంగదీసే ఇంద్రియ సంవేదనలకు చాలా భయంకరంగా కన్పించేవీ వున్నాయి. అతని అజ్ఞానమయ లేదా మనస్సు చేసే పాక్షిక నిర్మాణాల పరిధి కావల, ఎంతో దూరంగా వున్న దేన్నో దైవంగా చూడమంటే తేలికగా చూడలేడు, దానికి సన్నిహితంగా వెళ్ళలేడు, లేదా దానిని గుర్తించలేడు. తన స్వీయ ప్రతిబింబంలోనే భగవంతుని గ్రహించడం అతనికి అవసరం లేదా తన కావలనున్న ఏదో ఒక రూపం అతని కవసరం. కాని అతని ఉత్తమోత్తమ ధోరణులకు అనుగుణమైనదిగా అతని అనుభూతులకు చిక్కేదిగా, లేదా అతని బుద్ధి కందేదిగా అది వుండాలి. లేకపోతే దైవంతో సంబంధం లోనికి రావడంగాని, సంసర్గం కలిగించుకొనడంగాని అతనికి కష్టమౌతుంది.

అప్పుడు కూడా స్వకీయ మానవతకు బాగా సన్నిహితమైన, మానవ ప్రభావానికి, ఉదాహరణగా గ్రాహ్యమయ్యే దేనిలోనో దైవాన్ని అనుభూతి చెందగలిగేట్లు, ఒక మానవ మాధ్యమాన్ని అతని స్వభావం కోరుకుంటుంది. ఒక మానవ ఆకారంగల, అవతారరూపంలో — కృష్ణ, క్రీస్తు, బుద్ధ రూపాల్లో — జరిగే దైవ అభివ్యక్తివల్ల ఆ కోరిక సంతృప్తి చెందుతుంది. లేదా ఇది కూడా ఆతని గ్రహింపునకు చాలా కష్టమనిపిస్తే దైవం ఇంకా తక్కువ స్థాయి మహిమగల మాధ్యమంగా అంటే ఓ ప్రవక్త లేదా ఓ బోధకునిగా తనను ప్రకటించుకొంటాడు. దైవమానవుని ఊహించలేని లేదా అంగీకరించడాని కిష్టపడని చాలామంది, మానవులలో ఉత్తముని, అవతార మనకుండా, జగద్గురువుగా, లేదా దైవప్రతినిధిగా అంగీకరించడానికి ముందుకొస్తారు.

ఇది కూడా చాలదు. ఒక సజీవ ప్రభావం, ఒక సజీవ ఉదాహరణ, ఒక వర్తమాన బోధ అవసరం. ఎందుకనంటే కొద్దిమంది మాత్రమే గతంలో వచ్చి వెళ్ళిన బోధకుని, అతని బోధనను, గతంలో వచ్చి వెళ్ళిన అవతారాన్ని అతని ఉదాహరణ ప్రభావాన్ని తమ జీవితాల్లో ఒక సజీవశక్తిగా చేసుకోగలుగుతారు. హిందూ ఆధ్యాత్మిక శిక్షణా

విధానం గురుశిష్య సంబంధం ద్వారా ఈ అవసరం తీరే యేర్పాటు చేసింది. గురువు కొన్ని కాలాల్లో అవతారంగా రావచ్చు. కాని అతడు శిష్యునికి దివ్యజ్ఞాన మందించాలి, దివ్య ఆదర్శాన్ని దేన్నో అతనికి చేరవేయాలి లేదా మానవాంతరాత్మకు శాశ్వతునితోగల నిజమైన సంబంధాన్ని శిష్యుడు అనుభూతి చెందేటట్లు చేయగలగాలి.

తన స్వభావాన్న ననుసరించి సమగ్రయోగ సాధకుడు, సాధనకు సహాయపడే వాటన్నింటినీ ఉపయోగించుకొంటాడు. కాని అతడు వాటి పరిమితులను విడనాడక "నా భగవంతుడు, నా అవతారం, నా ప్రవక్త, నా గురువు" అంటూ రోదించే, అహంకారిక మనస్సు యొక్క మరి యే ఇతరాన్నీ కాదనే పోకడను, శాఖాపరమైన లేదా మతావేశ ధోరణితో ఇతర సాక్షాత్కారాల నన్నింటినీ వ్యతిరేకించే అహంకారిక మనస్సు యొక్క, నా కిదొక్కటే చాలు, తక్కినవేవీ అవసరం లేదనే పోకడను తన నుండి దూరంగా విసరివేయాలి. శాఖాపరమైన సమస్తాన్నీ మత కాఠిన్యతనంతా త్యజించాలి. దైవసాక్షాత్కారపు సమగ్రతకు అవి పొసగనివి.

అందుకు విరుద్ధంగా సమగ్రయోగ సాధకుడు భగవత్తత్వపు ఇతర నామరూపా లన్నింటినీ తన అవగాహనలో ఇముడ్చుకొనేంతవరకూ సంతృప్తి చెందడు. తన యిష్టదేవతనే ఇతర దేవత లందరిలోనూ దర్శించేంత వరకూ, అవతారంలో అవతరించే ఆపరమమును ఏకత్వంలో అవతారాలన్నింటినీ ఏకం చేసేంతవరకూ, బోధన లన్నింటి లోని సత్యాన్ని శాశ్వత దివ్యజ్ఞాన సామరస్యతలో కరిగించి ఒకటిగా చేసేంతవరకూ సమగ్రయోగ సాధకుడు సంతృప్తి చెందడు.

అతని అంతరంగంలోనే ఉన్న పరదైవం కొరకు అతని అంతరాత్మ మేలుకొనేందుకు బాహ్యంగా సాయమందించే వీటి లక్ష్యాన్ని మరచిపోకూడదు. అది జరుగకపోతే చివరకు ఏదీ సాధించనట్లే అవుతుంది. కృష్ణుని, క్రీస్తు లేక బుద్ధుని పూజించినా ప్రయోజనముండదు. అలాగే ఇతర సహాయ ఉపకరణాలకు మరో ప్రయోజన మంటూ వుండదు. మనిషిలో మారని పరిస్థితికి, అతనిలోనే ఉన్న దైవసాక్షాత్కారానికి మధ్య ప్రతీదీ ఒక వారధే.

*

సమగ్రయోగాన్ని బోధించే దివ్యోపదేశకుడు తనకు సాధ్యమైనంతవరకు మనలో ఉన్న అంతరంగ దివ్యబోధకుని పద్ధతినే అవలంబిస్తాడు. అతడు శిష్యుని, శిష్యునియొక్క స్వభావాన్ని అనుసరించి ముందుకు నడుపుతుంటాడు. బోధన,

ఆదర్శం, ప్రభావం — ఇవి మూడూ ఆ దివ్యగురువు యొక్క ఉపకరణాలు, లేదా పద్ధతులు. కాని వివేకవంతుడైన బోధకుడు, తన అభిప్రాయాలను స్వీకరించే మనస్సు యొక్క సాత్త్విక అంగీకారధోరణిపై తననుగాని, లేదా తన అభిప్రాయాలనుగాని విధించాలని కోరుకొనడు. శిష్యుని అంతరంగంలో పెంపొందుతున్న దైవప్రభావం క్రింద తప్పక మొలకెత్తి అభివృద్ధిచెంది ఫలప్రదమయే బీజాన్నే నాటుతాడు. బోధనకు కంటే మేలుకొలుపునకే అతడు చూస్తుంటాడు. ఒక సహజప్రక్రియవల్ల స్వేచ్ఛగా విశాలం కావడం ద్వారా అతని కార్యనిర్వహణాసామర్థ్యాలు, అనుభవాల పెరుగుదలపై దృష్టి సారిస్తాడు. జవదాట నలవిగాని ఒక ధర్మంగా ఒక స్థిరమైన విధానంగా గాక, సహాయంగా ఉపయోగించుకొనే వస్తువుగా అతడొక పద్ధతిని అందిస్తాడు. ఏ సాధనోపాయమైనా పరిమితులను విధించేదిగా, ప్రక్రియ, యాంత్రికమైనదిగా మారకుండా ఉండేటట్లు జాగ్రత్త పడుతుంటాడు. ఆతని మొత్తం వ్యవహారమంతా దివ్యప్రకాశాన్ని మేలుకొలిపి, తాను ఏ దివ్యక్రియాశక్తికి కేవలం ఒక మార్గంగా సహాయకారిగా, ఒక దేహంగా, ఒక ప్రవాహమార్గంగా, నిలిచాడో, ఆ శక్తిని అతనిలో సరాసరి పనిచేసేటట్లు చేయడం.

ఉపదేశం కన్నా, ఆదర్శంగా ఉండటం చాలా శక్తివంతమైనది. బాహ్యకర్మలు, వ్యక్తిగత నడవడిక అత్యంత ముఖ్యమైన విషయాలే గాని, అవే ఆదర్శం కావు. అలాగని వీటికీ తగిన స్థానము, ప్రయోజనమూ లేకపోలేదు. మొత్తం తన జీవితాన్ని, ఆంతరిక జీవన కార్యరూపా లన్నింటినీ నిర్దేశించేది, ఇతరులలో తీవ్ర ఆకాంక్షను ప్రేరేపించేదిగా ఉండే దివ్యసాక్షాత్కారపు కేంద్రీయ సత్యమేదైతే ఉన్నదో అదే ఆదర్శం కావాలి. ఇది, విశ్వజనీనము మరియు అత్యంత ఆవశ్యకమైన మూలకం. తక్కినదంతా వ్యక్తిగత విషయానికి, వ్యక్తికి సంబంధించిన పరిస్థితికి చెందుతుంది. సాధకుడు అనుభూతి చెందవలసింది ఈ సక్రియాత్మకమైన సంసిద్ధిని. దానిని అతడు తన సహజ స్వభావానుగుణంగా బయటకు ఆవిష్కరింపచేసుకోవాలి. సక్రమమైన, సహజ ఫలాలను పండించేదాని కంటె, ఏ ప్రయోజనమూ సాధించలేనిదాన్ని బయటికి కనుపించేటట్లు అనుకరించడాని కతడు పెనగులాడవలసిన అవసరం లేదు.

ఆదర్శంగా ఉండటంకంటె కూడా ప్రభావితం చేసే లక్షణం ఇంకా అతిముఖ్యమైన విషయం. శిష్యునిపై గురువు బాహ్యంగా అధికారం, జులుం చెలాయించటం కాదు ప్రభావమంటే. ఆతని సంసర్గానికి, సాన్నిధ్యానికి మౌనంలో అయినప్పటికీ,

తాను ఏది అయి ఉన్నాడో, తనకేది స్వాధీనమై వున్నదో, దానిని శిష్యుని అంతరాత్మలో ధారపోయగల, అంతరాత్మ. అంతరాత్మ అంతరాత్మకు మధ్య నుండే సామీప్యతకు సాయుజ్యతకు సంబంధించిన శక్తిని ప్రభావం అంటారు. ఇది గురువుగా గుర్తించుటకు అత్యున్నత చిహ్నం. ఎందుకనంటె అందరికంటె గొప్ప గురువు బోధకుడు అవడు. దివ్యచేతనను, ఆ చేతనా ప్రకాశాన్ని, శక్తిని పరిశుద్ధతను, తన చుట్టూ వుండి స్వీకరించేవారిలో ప్రవహింపచేసే ఒక దివ్యసన్నిధి అతడు.

తనకు తానుగా తనకు లేని గురుత్వాన్ని మానవరీతిలో అర్థరహితంగా స్వీయౌన్నత్యాన్ని చాటుకొవడానికి ఆపాదించుకొననివాడు సమగ్రయోగ గురువు. అతని కేదైనా ఒక పని అంటూ వుంటే అది ఊర్ధ్వం నుండి దిగివస్తున్న దానికి తానొక ప్రవాహమార్గం, వాహికగా, ఒక పాత్రగా లేక ఒక ప్రతినిధినని, ధర్మకర్తనని ప్రగాఢంగా విశ్వసించడం. అతడు తన సోదరులకు సహాయం చేసే ఒక మనిషి, బిడ్డలను ముందుకు నడిపే ఒక బిడ్డ, ఇతర దీపాలను వెలిగించే ఒక దివ్యజ్యోతి, అంతరాత్మలను మేలుకొలిపే, మేలుకొన్న దివ్య అంతరాత్మ. అత్యున్నతస్థితిలో దైవం యొక్క ఇతర శక్తులను తన వద్దకు రమ్మనిపిలిచే పరదైవం యొక్క దివ్యశక్తి లేక దివ్యసన్నిధి, సమగ్రయోగ గురువు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె. వి. రావు

కాలము — ఒక దివ్య ఉపకరణము

దివ్యసాధన ఉపకలణాలన్నింటిలోను కాలము మిక్కిలి శక్తివంతమైనది. ఈ ఉపకరణాలన్నీ కలిగివున్న సాధకుడు తన లక్ష్యాన్ని తప్పక సాధించి తీరతాడు. ఎప్పుడైనా వొక పతనం సంభవించినా మరింత వేగంగా వున్నతంగా యెదగడానికది దోహదమవుతుంది. ఒకసారి యెప్పుడైతే యీ బాటలో అడుగు పెట్టాడో జననమరణాలు అభివృద్ధి సాధన ప్రక్రియలుగా మారి, అతని జీవనయాత్రలో మజిలీ లవుతాయి. ఈ ప్రక్రియ ఫలితం సాధించడానికి అవసరమైనదిగా మిగిలినది కాలం మాత్రమే. మానవ ప్రయత్నానికి శత్రువుగా గాని, మిత్రుడిగా గాని, ఒక అడ్డంకిగా గాని,

మాధ్యమం లేదా పరికరంగా గాని కాలం తనని తాను సంసిద్ధపర్చుకుంటుంది. (లేదా పరిచయం చేసుకుంటుంది.) కాని, నిజానికిది యెప్పుడూ ఆత్మో యోగపరికరమే.

పరిస్థితులకు క్షేత్రమే కాలం. శక్తులన్నీ సంఘటితమై పనిచేస్తూ విడుదల చేసి సంఘటితపర్చి, ప్రగతిఫలాన్ని బేరీజు వేసేది కాలమే. అహం దృష్టిలో అది ఒక ద్రోహి, కార్యనిరోధకం. కాని కాలమే దివ్యత్వ సాధనకి శక్తివంతమైన వుపకరణం. అందుచేత మన ప్రయత్నం వ్యక్తిపరమైనదైతే కాలం అడ్డంకి కనిపిస్తుంది. కాలమహిమ వల్లే శక్తులన్నీ సంఘటితమై మనల్ని స్వయంగా ప్రతిఘటిస్తాయి. మన చైతన్యం కొంత దైవపరంగా కొంత స్వార్ధపరంగా కలిసివున్నట్లయితే అది ఒక షరతుతో మధ్యస్థంగా వున్నట్టు అనిపిస్తుంది. దైవకార్యమే స్వకార్యమై, రెండూ వొకటిగా కలిసిపోయినప్పుడు కాలము వొక సేవకుడిగాను, వుపకరణంగాను మారిపోతుంది.

కాలం పట్ల సాధకుడు ఆదర్శవంతమైన దృష్టితో కార్యసిద్ధికి కావలసిన అపారమైన ఓరిమి కలిగి వుండాలి. సాధకుడు కాలము పట్ల అవధిలేని ఓరిమి వహించాలి. కార్యసిద్ధికి సమయం అనంతమని భావించాలి. కాని, అందుకు తగిన శక్తిని, ఆధిపత్యాన్ని ఎప్పటికప్పుడు పెంపొందించుకుంటూ ఉండాలి. అవిచ్ఛిన్నంగా పరమమైన రూపాంతరీకరణ శక్తిని అతి శీఘ్రగమనంలో అత్యాశ్చర్యకరమైన రీతిలో సాధించాలి.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: నడిమిండి విజయలక్ష్మి

శ్రీఅరవిందుల దివ్యప్రబోధము

సాధనా విధానము

శ్రీఅరవిందుల మహనీయ ప్రబోధం ప్రాచీన భారతావనిలోని మహాద్రష్టల దర్శనాల నుండే ప్రారంభమవుతుంది. సృష్టిలోని దివ్యమానవ నానావిధ రూపాల చాటున అస్తిత్వ చైతన్యాల మహాసత్యం భాసిస్తున్నది. అదే సర్వప్రాణుల ఆత్మ. అది ఏకం, చిరంతనం. సర్వజీవులు ఆ పరమాత్మలో సంయోగం చెంది వుంటారు. కాని మనః ప్రాణ శరీరాలలో విడిపోయి వుంటారు. తమ నిజమైన ఆత్మ ఏదో తెలియని అజ్ఞానం వారిని పరమాత్మ నుండి వేరుచేస్తున్నది. ఒక నిర్దిష్ట మనోవైజ్ఞానిక

సాధన ద్వారా విడిపోయిన ఈ నిమ్న చైతన్యపు యవనికను తొలగించి మనలోని నిజమైన ఆత్మను, సర్వత్రా ఉన్న జీవులలోని దైవత్వాన్ని మనం గ్రహించగల్గుతాము.

ఈ ఒకే ఒక సత్ (అస్తిత్వం), చైతన్యం పదార్థంలో అంతర్లీనంగా నిక్షిప్తమై వుంది. పరిణామం ద్వారా అది తనను తాను విముక్తం చేసుకొంటుంది. నిశ్చేతనలో చైతన్యం ప్రభవిస్తుంది. అది స్వయంప్రేరితమై ఉన్నతోన్నత శిఖరాల వైపు వృద్ధి చెందుతూ తనకు తాను విస్తృతం చేసుకొంటూ మరింత మహనీయ పరిపూర్ణత్వాన్ని సంతరించుకొంటుంది. చైతన్య విముక్తిలో ప్రథమ సోపానం ప్రాణం. రెండవది మనస్సు. అయితే ఈ పరిణామం మనస్సుతో ముగిసిపోదు. పరిణామం ఇంకా ముందుకు సాగి ఆధ్యాత్మిక, అతిమానస చైతన్య అవధి చేరుకొంటుంది. కాబట్టి మనస్సు తర్వాత సోపానం అతిమనస్సు లేదా ఆత్మ (సత్యచేతన). అవి చైతన్యమయమైన జీవునిలో ప్రబలశక్తిగా విజృంభిస్తాయి. అప్పుడే సర్వప్రకృతిలో అంతర్నిక్షిప్తమై ఉన్న దివ్యత్వం సర్వసంపూర్ణంగా తనకు తాను విముక్తమవుతుంది. అప్పుడు జీవితంలో పరిపూర్ణతను అభివ్యక్తం చేయడం సాధ్యమవుతుంది.

చెట్లలో, జంతువులలో చైతన్యాత్మకమైన సహకారం లేదు. వాటి సహకారం లేకపోయినా, ప్రకృతి తన పరిణామ ప్రస్థానాన్ని కొనసాగించాలి. కాగా మనిషిలోని, సచేతన సంకల్పంలో ప్రకృతి, అతనిలో పరిణామాన్ని సాగించగలుగుతుంది. కాని అతనిలో సిద్ధించవలసిన సంపూర్ణ పరిణామం అతని మానసిక సంకల్ప సహకారం చేత మాత్రమే సాధ్యం కాదు. ఏలన ఈ ప్రక్రియలో మనస్సు కొంతవరకు మాత్రమే ముందుకు కదలి, తరువాత ఒక వలయంలో పరిభ్రమిస్తూంటుంది. చైతన్య పరివర్తన కలగాలి. మనస్సు తత్వమే మారాలి. అది మరింత ఉన్నతమైన భూమికల్లోకి రూపాంతరం పొందాలి. ఈ మార్పునకు ఆవశ్యకమైన మార్గం ప్రాచీన యుగాలనాటి మనోవైజ్ఞానిక శిక్షణ, యోగాభ్యాసం ద్వారా మనం కనుగొనాలి. అయితే ప్రపంచం నుండి దూరమై పరమాత్మ, లేక పరబ్రహ్మము యొక్క శిఖరాలలో అదృశ్యం చెందడం ద్వారా గతంలో ప్రయత్నం జరిగింది. శ్రీఅరవిందుల బోధన ప్రకారం మనస్సుకు పైనగల ఒక చేతనాతత్వం దిగిరావడం (అవరోహణ) సాధ్యమే. ప్రపంచం నుండి ఆత్మను విముక్తం చేయడం మాత్రమే కాదు. ఈ ప్రపంచంలోనే ఆత్మను విముక్తం చేయడం సుసాధ్యమే. మనస్సు యొక్క అజ్ఞాన లేక పరిమిత జ్ఞానం స్థానంలో అతిమానస సత్యచైతన్యాన్ని స్థాపించగలదు. ఈ సత్యచేతన ఆత్మకు

చాలినంత పరికరం కాగలదు. మానవుడు తనకు తాను క్రియాశీలకంగా ఆత్మరూపంలో దర్శించడమే కాక, మృగరూపంగా ఉన్న మానవతత్వం నుండి దివ్యమానవజాతిగా అవతరించడం సాధ్యపడుతుంది. మనోవైజ్ఞానిక క్రమశిక్షణతో కూడిన యోగం ద్వారా మన సత్వంలోని అన్ని భాగాలను తెరచి ఉంచితే ఉన్నతమైన, ఇప్పటికీ నిక్షిప్తంగానే ఉన్న అతిమానసతత్వం అవరోహించి వాటిని రూపాంతరం చెందిస్తుంది.

అయితే దీనిని క్షణంలోగాని, అల్పకాలంలోగాని సత్వరమే, అద్భుతమైన పరివర్తన ద్వారా సాధించలేము. అతిమానస అవతరణం సంభవం కావడానికి ముందు సాధనకు చాలా మెట్లు ఎక్కాలి. మానవుడు ఎక్కువగా ఉపరితల మనః ప్రాణ శరీరాల్లోనే జీవిస్తున్నాడు. అధికతర సంభావ్యతలతో కూడిన ఏ అంతశ్చైతన్యం ఉందో దాని కతడు మేల్కోవాలి. ప్రస్తుతం అతడు దాని నుంచి ఏ అల్పాల్ప ప్రభావం స్వీకరిస్తున్నాడో, అదే అతనిని ఇప్పుడు ఒక అధికతర సౌందర్య, సామరస్య, శక్తి, జ్ఞానాల అన్వేషణకు ముందుకు నెట్టుతుంది. ఈ యోగంలో ప్రథమ ప్రక్రియ ఏమిటంటే, సాధకుని అంతర్గత శ్రేణులను తెరచి, అటునుంచి బహిర్ముఖంగా జీవిస్తూ అంతరాంతర శక్తి, దీప్తిలతో జీవితాన్ని నియమించి పాలించడం. ఇలా జరిగినప్పుడు, అతడు తనలోని తన నిజ ఆత్మను కనుగొంటాడు. అది బాహ్య మనఃప్రాణదేహాల మిశ్రమం గాదని, వాటి వెనుక దాగిన పరమ సత్యం అని, భగవదగ్ని శిఖ అని గ్రహిస్తాడు. సాధకుడు ఆత్మజీవనుడై జీవిస్తూ దానిని దివ్యసత్యం వైపు నడుపుతూ తన స్వభావాన్ని నిర్మలంగా మార్చడం నేర్చుకోవాలి. అటు తరువాత, ఊర్ధ్వభూమికకి ఉన్మీలనం అయ్యాక అక్కడ నుంచి ఉన్నతతర చైతన్యభూమికలకి సత్యము అవరోహిస్తుంది. కాని అలా దిగివచ్చిన సత్యం సైతం పూర్ణ అతి మానసకాంతి, శక్తులతో కూడినది అని చెప్పలేము. కారణం మనస్సుకు అతిమనస్సుకు మధ్య అనేక చైతన్యశ్రేణు లున్నాయి. ఈ నడిమిశ్రేణులను మూసి ఉంచే ముసుగులను వైదొలగించి, ముందుగా ఆ శ్రేణుల తాలూకు శక్తులన్నిటినీ మనోప్రాణ, దేహాలలోకి గొనిరావాలి. అప్పుడు మాత్రమే అతిమనస్సు యొక్క సంపూర్ణశక్తి, అపరా (భౌతిక) ప్రకృతిపై పనిచేయగలదు. ఇలా ఈ సాధనా ప్రక్రియ సుదీర్ఘం, బహు కష్టమయం. కాని అది ఏ కొంచెం సాధించినా, ఆ మేరకది లాభమే. ఎందుకంటే, అది అపుడు అంతిమ విముక్తిని, పూర్ణత్వాన్ని మరింతగా సంభావ్యమయేలా చేస్తుంది.

ఈ యోగమార్గంలో గత సాంప్రదాయాలకు చెందిన అనేక విషయాలు కూడా

ఆవశ్యకమే. అవి 1) ఒక అధికతర విశాలత్వానికి, అనంతత్వానికి, పరమాత్మకు మనస్సు తెరిచి ఉంచడం. 2) విశ్వచేతనలోకి వెలువడడం. 3) కోరికలు, ఆవేశాలపై నియంత్రణ. ఇచ్చట బాహ్యసన్యాసం ఆవశ్యకం కాదు. కావలసినది కోరికలు, మమకారంపై విజయం. ఆలాగే శరీరంపై, దాని ఆవశ్యకతపట్లా లాలసలు, సహజాతాలపై సంయమనంపై సాధించాలి. శ్రీఅరవిందుల బోధనలో గతయోగాలకు చెందిన తత్వాలు చక్కగా ఇమిడిపోతాయి. అవి: సత్యం, దృశ్యమాన జగత్తు మధ్య వివేచనా ద్వారా ఏర్పడిన జ్ఞానయోగం ఇక్కడా ఉంది. అలాగే భక్తి, ప్రేమ, సమర్పణ ద్వారా హృదయానికి చెందిన భక్తియోగము ఇక్కడ ఉంది. అలాగే సంకల్పశక్తిచే ప్రవర్తించే కర్మయోగము ఉంది. ఈ సంకల్పశక్తి స్వార్థచింతన నుండి క్రియాశక్తిని మళ్లించి, అహంకారం కంటే అధికమైన పరమాత్మ సేవకు వినియోగిస్తుంది. ఈ సర్వయోగాల ద్వారా మనలోని సమస్త సత్వమూ శిక్షణ పొందుతుంది. పైనున్న మహనీయశక్తి, ప్రకాశాలు మన ప్రకృతిలో పనిచేయడానికి అవకాశం లభించినప్పుడు, మన సత్వము అనుకూలంగా స్పందించి రూపాంతరం చెందుతుంది.

ఈ సాధనలో గురుదేవుని ప్రేరణ, స్ఫూర్తి అధికతర కష్టాలు వచ్చినప్పుడు, ఆయన నియంత్రణతో పాటు సన్నిధి సైతం అత్యంతావశ్యకం. ఏలన — ఇలా కానప్పుడు జారిపడకుండా, దారి తప్పకుండా గమ్యం చేరుకోవడం అసంభవమే అవుతుంది. ఎవరైతే ఒక ఉన్నతోన్నత చైతన్యం, అస్తిత్వానికి ఆరోహించారో, అంతేకాక ఎవరు దాని అభివ్యక్తిగానో, ప్రతినిధిగానో పరిగణించబడగలరో వారే యదార్థ గురువు. ఆయన తన బోధనచేత, అంతకు మించి తన ప్రభావంచేత, తన ఆదర్శంచేత, తన సాయం అందిస్తాడు. దీనిని మించి, తన స్వీయ అనుభవాన్ని సరాసరి గురువు శిష్యునికి అందించగలడు.

ఇదే శ్రీఅరవిందులు బోధన, సాధన; ఇప్పుడున్న ఏదో ఒక మతాన్ని చేపట్టి, దాన్ని పెంపొందించడంకాని, గత మతాలన్నింటినీ సమన్వయం చేయడంగాని, ఒక నూతన మతాన్ని స్థాపించడంగానీ, ఆయన ఆశయం కాదు. కారణం — ఇలా ఏది చేసినా అది ఆయన తలపెట్టిన ప్రధాన ప్రయోజనం నుండి మానవాళిని దూరం చేస్తుంది. ఆయన యోగలక్ష్యం ఒక విశిష్ట అంతరాంతర స్వీయవికాసం. ఇట్టి వికాసంచేత, ఈ యోగాన్ని అనుసరించే ప్రతి సాధకుడు అందరిలోను ఏకాత్మను కనుగొని, మనస్సుకు పైనున్న ఒక ఉన్నత చేతనానుభవాన్ని క్రమంగా పొందుతాడు.

అదే ఆధ్యాత్మిక, అతిమానస చైతన్యం. అదే మానవప్రకృతి స్వరూపాన్ని మార్చివేసి దానిని దివ్యప్రకృతిగా పరివర్తన చెందిస్తుంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె. యజ్ఞన్న

అంతరంగ వికసనము

అంతఃసత్తా యొక్క స్తరాలను తెరచి, బాహ్యజీవనాన్ని ఒక అంతర్జ్యోతి, శక్తులతో నియంత్రించి, మనుగడను ఆ స్థితినుండి కొనసాగునట్లు చేయుటయే యోగముయొక్క ప్రథమ ప్రక్రియ. అందువలన, మనలో రెండు సత్తా లున్నాయని చెప్పవచ్చు. ఒకటి, ఉపరితలంపైన వ్యక్తమయ్యే మన సాధారణ మనస్సు, ప్రాణికము, శరీరచేతన, మరొకటి తెరమరుగున వుండే ఒక అంతర్మానసము, ఒక అంతఃప్రాణము, వేరొక సత్తాను లేక అంతరాత్మను సంఘటితపరచే ఒక అంతర్భౌతిక చేతన. ఒకసారి ఈ అంతరంగ సత్తా మేల్కొంటే, అది తన వంతుగ మన సత్య, యదార్థ, శాశ్వత జీవాత్మకు తలుపులు తెరుచుకుంటుంది. ఈ యోగ పరిభాషలో చైత్యపురుష సత్తా అని పిలువబడే, జీవాత్మకు అంతర్ముఖంగా తెరుచుకుంటుంది. ఈ చైత్యపురుష సత్తాయే మనకు సంభవించే జన్మపరంపరకు ఆధారభూతంగా వుంటూ; ప్రతి జన్మలోను ఒక క్రొత్త మనస్సును, ప్రాణాన్ని, శరీరాన్ని సంతరించిపెడుతుంది. ఇంకా జన్మ నెత్తని పరమాత్మకు ఊర్ధ్వదిశగా తెరుచుకుంటుంది. సచేతనంగా మనము, దానిని వశపరచుకొని, మార్పు నొందుతున్న భౌతిక వ్యక్తిత్వాన్ని అధిగమించి, విముక్తి పొందగలుగుతాము. మన భౌతికప్రకృతిపై సంపూర్ణ ఆధిపత్యాన్ని సాధించగలుగుతాము.

*

సత్యం, శివం, సుందరం వైపుగా మన జీవాత్మ సదా మరలి వుంటుంది. ఎందుకనగా, అది తన అంతస్తును స్వయంగా పెంచుకోగలిగేది, ఈ అంశాల వల్లనే. మిగతావి, అనగా, వీటికి విరుద్ధమైనవి, అనుభవానికి అవసరమైనవాటిలో ఒక భాగమే అయినా, సత్తాయొక్క ఆధ్యాత్మికాభివృద్ధికి వీటిని అధిగమించి పురోగమించవలసి వుంటుంది.

మనలో మూలాధారమైన చైత్యపురుష అస్తిత్వము ఆనందమయమైనది. ఆనందము, మరియు జీవితానుభవమంతా జీవాత్మ యొక్క క్రమాధిక అభివ్యక్తీకరణలో ఒక భాగమే. కాని, ఆ బ్రతుకులోని ఆ ఆనందానుభవానికున్న నియమమేమిటంటే అన్ని సంసర్గాల నుండి, సంఘటనల నుండి వాటిలో నిగూఢంగా ఉన్న, దివ్యసంవేదనాసారాన్ని, వాటి దైవీప్రయోజనములను, లక్ష్యములను అన్నింటిని కూడదీసి, అనుభవము ద్వారా మన మనస్సును, జీవితమును అచేతన నుండి దివ్యచేతన దిశగాను, అజ్ఞానయుత వేర్పాటు ధోరణిని అధిగమించి సమగ్రముగ రూపొందిన చైతన్య దిశగాను, సుజ్ఞాన దిశగాను ఎదగగలగాలని. చైత్యపురుషసత్వము వున్నది అందులకే. నిరంతరాభివృద్ధి చెందుచుండే దాని స్వాభావికమైన ఊర్ధ్వపురోగమనము, మరియు పట్టుదల, ఒక జీవితము నుండి మరొక జీవితానికి, జీవితపరంపరలతో విడువకుండా అనుసరిస్తాయి. జీవాత్మ వికాసము — అంధకారము నుండి వెలుగులోకి, అసత్యము నుండి సత్యములోకి, బాధలో నుండి తనదైన పరమోన్నత విశ్వవ్యాప్త పరమానందములోకి చేరే వికాసము. (అసతోమా సద్గమయ, తమసోమా జ్యోతిర్గమయ, మృత్యోర్మా అమృతంగమయ.)

*

చైత్యపురుష సత్తా యెప్పుడైతే మేల్కొంటుందో అప్పుడు నీలో జీవాత్మను గురించిన చైతన్యము మొలకెత్తుతుంది. నీ ఆత్మ నీకు అవగతమౌతుంది. (ఆత్మజ్ఞానివి కాగలుగుతావు) నిన్ను నీ మానసికసత్తాతోనో లేక ప్రాణికసత్తాతోనో మమేకమయ్యే పొరపాటును ఇకపై చేయవు. అవే జీవాత్మ అని పొరపాటుగా భావించవు.

రెండవది, చైత్యపురుషసత్తా మేల్కొన్నప్పుడు దైవము పట్ల లేక గురువు పట్ల నీలో నిజమైన భక్తిని అది కలిగిస్తుంది. మానసిక, ప్రాణికభక్తి కన్నా అది పూర్తిగా భిన్నమైనది.

ఎవరికైన తమ మనస్సులో ఒక మనిషి పట్లనో, గురువు పట్లనో, వారియొక్క మేధోప్రతిభ పట్లనో ఒక మెప్పు లేక ప్రశంసాపూర్వక భావన కలుగవచ్చు. కాని అది కేవలం మానసికమైనది; కాబట్టి అది అంతా అంతటితో సరి. మరిక ముందుకు పోము. అలాటిదే భావన ఉండటం అపాయమేమీ కాదు. కాని, దానంతట అది అంతః సత్తాను పూర్తిగా వెల్లడించలేదు. కేవలం ఒక మానసిక సంసర్గాన్ని మాత్రమే ఏర్పరుస్తుంది.

ప్రాణికస్థాయికి చెందిన భక్తియొక్క కోరిక అంతులేకుండా కొనసాగుతూనే ఉంటుంది. దానికి తోడు అది దాని స్వంత షరతులను కూడ విధిస్తుంది. తనను తాను దైవానికి ఆత్మార్పణ చేసుకుంటుంది. కాని అది షరతులతో కూడిన ఆత్మార్పణ. "నీవు యెంతో గొప్పవాడవు, నిన్ను నేను పూజిస్తాను, యిప్పుడు నా కోరిక తీర్చు, నా ప్రగాఢవాంఛను తృప్తిపరచు, నన్ను గొప్పవాడిని చేయి, నన్నొక గొప్ప సాధకుడిని చేయి, గొప్ప యోగిని చేయి, వగైరా, వగైరా" అని దేవుడిని కోరుతుంది.

వికాసము చెందని మనస్సుకూడా పరమసత్యానికి ఆత్మార్పణ చేసుకుంటుంది. కాని, తన స్వంత షరతులను విధిస్తుంది. పరమ సత్యమును వుద్దేశించి "నా తీర్పును, నా అభిప్రాయాన్నే సమ్మతించు" అని అంటుంది. తన మనసు స్వయంగా నిర్దేశించిన రూపంలోనే పరమసత్యము కూడ అమరి ఉండాలని కోరుతుంది.

పరమ సత్యము తనంతట తానుగ దాని స్వంత కదలికలతో జతకూడాలని ప్రాణిక సత్వము పట్టుబడుతుంది. ప్రాణికస్థాయి సత్తా ఉన్నతతరశక్తిని రాబట్టుకోవాలని ప్రయత్నిస్తుంది. గురువుయొక్క ప్రాణికసత్తాను కూడ లాక్కొనే ప్రయత్నాన్ని కొనసాగిస్తుంది.

ఈ రెంటికి (మానసిక మరియు ప్రాణిక సత్తాలకు) వాటి ఆత్మసమర్పణలో ఒక మానసికపరమైన దాపరికం వుంది.

కాని, చైత్యపురుషసత్తా మరియు దాని యొక్క భక్తి ఆ విధంగా వుండవు. వెనుకనున్న దైవత్వంతో ప్రత్యక్షసంబంధం కలిగి యున్నందున నిజమైన భక్తిని కలిగియుండే శక్తి దాని కుంటుంది. చైత్యపురుష భక్తికి యెలాంటి కామన వుండదు, యెలాంటి దాపరికము వుండదు. దాని ఉనికితో అది తృప్తిచెందుతుంది. చైత్యపురుషసత్తాకు పరమసత్యాన్ని సక్రమ మార్గంలో యెలా పాటించాలో తెలుసు. దైవానికిగాని, గురువుకుగాని అది నమ్మకంతో ఆత్మసమర్పణ కావించుకుంటుంది. అందుచేత నమ్మకంతో స్వీకరించగలదు కూడ.

మూడవది, చైత్యపురుషసత్తా బహిర్గతమైనప్పుడు, మానసిక మరియు ప్రాణికసత్తాలు తమను తాము వంచించుకుంటే అది విచారపడుతుంది. ఆ విచారం పవిత్రతకు భంగం వాటిల్లినందువల్ల కలిగేది.

మనసు యెప్పుడైతే తన కిచ్చవచ్చిన రీతిలో ప్రవర్తిస్తుందో, లేక ప్రాణిక

సత్తా తన స్వీయ మానసిక ప్రేరణతో ప్రభావితమౌతుందో, అప్పుడు చైత్యపురుషసత్తా యిలా స్పందిస్తుంది. 'నాకీ విషయాలు అక్కరలేదు; అయినా, నేనిక్కడ యెందుకున్నట్లు? నేనిక్కడున్నది పరమసత్యము కోసం, యీ ఇతర విషయాల కోసం కాదు."

మరొకటేమిటంటే, చైత్యపురుష విచారము మానసిక అసంతృప్తికి లేక ప్రాణిక విచారానికి లేక శారీరక కృంగుబాటుకు భిన్నంగా వుంటుంది.

చైత్యపురుష సత్తా ధృఢమైనదిగా వుంటే అది మానసిక లేక ప్రాణిక సత్తాలపై దాని ప్రభావం చూపి, వాటిని వత్తిడి చేసి — బలవంతపెట్టి — మారునట్లు చేస్తుంది. కాని, అది శక్తిహీనమైనదిగా వుంటే, మిగతా భాగాలు అలుసు తీసుకుని చైత్యపురుష విచారాన్ని తమకు అనుకూలంగా వాడుకుంటాయి.

కొన్ని సందర్భాలలో చైత్యపురుష సత్తా బహిర్గతమై, మానసిక మరియు ప్రాణికసత్తాలను కలవరపరచి అన్నింటిని అస్తవ్యస్తం గావిస్తుంది. కాని, మానసిక మరియు ప్రాణికసత్తాలు చైత్యపురుష సత్తాకన్నా ధృఢమైనవిగా వుంటే, అప్పుడు దాని ప్రభావం అడపాదడపా మాత్రమే వుంటుంది. మరియు క్రమేపీ వెనక్కు తగ్గుతుంది. దాని మొర అరణ్యరోదనే అవుతుంది. మానసిక లేక ప్రాణిక సత్తాలకు వాటి దారి సుగమం అవుతుంది.

చివరిగ, పై పై ఆకారాలను చూసి చైత్యపురుషసత్తా మోసపోవుటకు నిరాకరిస్తుంది. అసత్యంచేత ప్రభావితం కాదు. అసత్యానికి క్రుంగిపోవుటను ఒప్పుకోదు. అలాగే, సత్యాన్ని కూడ గోరంతలు కొండంతలు చేయదు. ఉదాహరణకు చుట్టుప్రక్కల నున్న ప్రతి ఒక్కటి, "దేవుడు లేడు" అని ఘోషిస్తున్నా, చైత్యపురుషసత్తా దానిని నమ్ముటకు నిరాకరిస్తుంది. "నాకు తెలుసు, నాకా సంవేదన వున్నది కాబట్టి నాకు తెలుసు," అని అంటుంది.

పరోక్షంగ ఉన్నదేదో దానికి తెలుసును గనుక, పైకి కనిపించే ఆకారాలకు అది మోసపోదు. దివ్యశక్తిని తక్షణమే సంవేదించగలదు.

అంతేగాక యెప్పుడైతే చైత్యపురుషసత్తా మేల్కొల్పబడిందో, మానసికోద్వేగభరితసత్తా నుండి మాలిన్యాన్ని బయటకు నెట్టివేసి భావోద్వేగ దౌర్బల్యము నుండి లేక మానసికాదేశ అల్ప ప్రేరణల నుండి విముక్తిని పొందుతుంది.

కాని, మనస్సు యొక్క పెడసరానికిగాని, లేక ప్రాణిక అనుభూతుల

అతిశయోక్తికిగాని తనలో తావివ్వదు. ప్రతి సంవేదనకి సక్రమమైన రీతిలో స్పందిస్తుంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

చైత్యపురుష సత్తా వికసనానికై శ్రీమాత సూచించిన అవసరమైన షరతులు

జీవితంలో కలిగే అన్ని అనుభవాల ద్వారానే చైత్యపురుష వ్యక్తిత్వం యేర్పడుతుంది, వృద్ధిచెందుతుంది, వికశిస్తుంది. చివరకు ఒక పరిపూర్ణ చైతన్యవంతమైన స్వతంత్ర జీవిగా రూపొందుతుంది.

ఈ పరిణతికి సంబంధించిన ప్రక్రియ అవిశ్రాంతంగ అసంఖ్యాక జీవనాల ద్వారా కొనసాగుతుంది. దానిని గురించిన ఎఱుక ఎవరికైనా లేదంటే, అందుకు కారణం వారికి వారి చైత్యపురుషసత్తాను గురించిన చైతన్యము లేనందువలననే — ఎందుకనగా అది అనుల్లంఘనీయమైన ప్రారంభస్థానము గనుక. ఆత్మానుసంధానము లేక ఆత్మావలోకనం ద్వారా మరియు యేకాగ్రత ద్వారా వ్యక్తి తన చైత్యపురుషసత్తాతో చైతన్యవంతమైన సంపర్కాన్ని యేర్పరచుకోవాలి. ఈ చైత్యపురుషసత్తా బాహ్యసత్తాపై సర్వదా తన ప్రభావాన్ని చూపుతుంది. కాని ఆ ప్రభావం ఎప్పుడూ గుప్తంగా ఉంటుంది. చూడబడదు. సంవేదింపబడదు. అవగాహన కాబడదు — వాస్తవమైన అసాధారణ పరిస్థితులలో తప్ప.

సంసర్గాన్ని సహాయాన్ని ఇతోధికంగా దృఢపరచుటకు, వీలైతే చైతన్యవంతమైన చైత్యపురుషసత్తాను అభివృద్ధిగావించుటకు, యేకాగ్రత వహించునప్పుడు దానివైపుగ తిరిగి, దానిని తెలుసుకోవాలని మరియు దాని అనుభూతిని పొందాలనే ఆకాంక్షతో, ఆ ప్రభావాన్ని స్వీకరించుటకు వీలుగ తనకు తాను ఉన్మీలనమై ఉండాలి. దాని నుండి సంకేతం అందిన ప్రతిసారి, దానిని తు.చ తప్పకుండా జాగ్రత్తగా పాటించుటకు అత్యంత శ్రద్ధ, చిత్తశుద్ధి వహించాలి.

ఒక మహోన్నత ఆకాంక్షతో జీవించాలి. అంతరంగమందు ప్రశాంతతో నుండుటకు మరియు వీలైనంత వరకు ఆ స్థితిలోనే కొనసాగుటకు శ్రద్ధ కనబరచాలి. వ్యక్తి

పదార్థము నుండి పరమాత్మకు
మన రహదారి



అఖిల

అఖిల భారత పత్రిక

జూలై 2010

పదార్థము నుండి పరమాత్మకు మన రహదారి

విషయసూచిక

మన నిరంతర ఆలోచనాసరళి ఎలా ఉండాలి?	2
జీవనశక్తి ప్రాణికసత్వము నుంచి అంతరంగ కేంద్ర అస్తిత్వమునకు మారాలి	3
అహం నుంచి పరమాత్మకు రహదారి	4
వస్తువుల బాహ్యరూపం వెనుక దాగిన అసలు సత్యం	9
అహంకారజీవితం దివ్యజీవనానికి నాంది	14
అహం అంటే ఏమిటి?	16
అహంకార పరిధి	19
అహంభావాన్ని ఎలా తొలగించాలి?	21
అహంకార సంవేదన నుంచి పూర్ణ విముక్తి	25
సామాజిక అభివృద్ధి వలయంలో ఒక కొత్త మలుపు	28
కాంతి కిరణాలు	31

అట్ట మీది పుష్పం ఆధ్యాత్మిక సంకేతం:

అహం నుంచి దైవానికి జీవితలక్ష్య పరివర్తన

(Conversion of the Aim of life from the Ego to the Divine)

మన నిరంతర ఆలోచనాసరళి ఎలా ఉండాలి?

మనస్సు, బుద్ధి, మన మనుగడకి ప్రధానమైన కీలకశక్తులు కావు. ఎందుకంటే అవి అర్థసత్యాలను, అనిశ్చితాలను మాత్రమే గుర్తించి అసంతృప్త వలయంలో చుట్టు తిరుగుడు తిరుగుతుంటాయి. కాని మనస్సులో, జీవితంలో, బౌద్ధిక, రసాత్మక, నైతిక, క్రియాత్మక, భావోద్వేగ, భౌతిక, ప్రాణిక, సత్వ చలితచాలనాలలో అంత రంగ జ్ఞానంతో, తాదాత్మ్యతాభావంతో దర్శించే శక్తి ఒకటి నిక్షిప్తమై ఉంటుంది. అది వాటి పరివ్యాప్తికై సత్యాన్ని, నిశ్చితత్వాన్ని, స్థిరత్వాన్ని సంతరించిపెడు తుంది. ఆ శక్తిని, కొంతవరకూ మనం, విజ్ఞానశాస్త్రం వెనుక, పరోక్షంగా దర్శించ డానికి అస్పష్టంగా ఆరంభిస్తున్నాం. కాని యీ శక్తి స్వేచ్ఛగా తన కొరకుగా పనిచేయక, మనోజీవితాల కొరకే పరిమితమై పనిచేస్తే, మనం మనలోని యీ సహజాత అంతరంగ అతిమానుషశక్తి (డేమన్ శక్తి) యొక్క ప్రయోజనాన్ని పొంద లేము. మనిషి తన మేధోశక్తి గురించి ఎంతో గర్వపడతాడు. అయితే తాను పొందిన మేధోశక్తి అసమగ్రమని ధైర్యంగా ప్రకటించగలిగినపుడు మాత్రమే అతని లో నిక్షిప్తమై వున్న దివ్యతేజం స్వేచ్ఛగా విముక్తమై ప్రసరించగలుగుతుంది. అప్పుడే అతనికి నిరంతరం పరివ్యాప్తమయే మానసిక ధ్యాస అయి, నిమగ్నమై ఉంటాడు. ఆధ్యాత్మిక దివ్యమానవత్వపు బాట తెరువబడుతుంది. అదే అతని నిరంతర ఆలోచనాసరళి అవుతుంది. అంతట అతని వేదాంత తత్వజ్ఞానము, కళ లు, విజ్ఞానశాస్త్రము, నీతిపథము, సామాజిక మనుగడ, అతని మనోజీవన వల యంలోని సాధనలుగాక, వాటి వెనుక నున్న దివ్యసత్యం కొరకు, ఆ దివ్యసత్యశక్తిని మానవ మనుగడ లోనికి తేవడానికి, దోహదమవుతుంది. అప్పుడే మనము సత్య శాసనాన్ని కనుగొని, సత్యమై, తృప్తికరమైన దివ్యస్వభావంతో మనుగడ సాగిం చుటకు అవసరమైన సరైన బాటలో నడువగలుగుతాము.

మూలము: శ్రీఅరవిందులు

అనువాదము: బి. నరసింహయ్య

జీవనశక్తి, ప్రాణికసత్త్వము నుంచి అంతరంగ కేంద్ర అస్తిత్వమునకు మారాలి

మన జీవన ప్రధానశక్తి పరివర్తన చెందాలి. ఉన్నత చైతన్యశక్తిగా మార్పుచెందాలి. ఇందులోనే ఉంది మానవ రూపాంతరీకరణ రహస్యం. ఇది ఒక ఊపు నిస్తుంది. ప్రాణికజంతు బుద్ధి నుంచి ఆలోచనాత్మక బుద్ధి కిది ఒక ఆరోహణ. ఇది కూడా జంతుబుద్ధి నుంచి ఆలోచనాత్మక బుద్ధికి ఆరోహణ — మానవమేధకి అపరిపూర్ణ మే. అయినా ఇది మరి ఊర్ధ్వగమనమే. ఈ యెదుగుదల ఆరోహణ — కంటె కూడా, మరింత ఉన్నత చైతన్యభూమికకి ఆరోహణ అత్యంత ప్రాముఖ్యమైనది. జీవితంలో అంతర్గర్భిత ప్రముఖ ఇచ్ఛాశక్తి ప్రాణికశక్తిగా మాత్రమే ఉండకూడదు. అది ఆధ్యాత్మికశక్తి కావాలి. దీని తాలూకు క్షణికదర్శనాలు, సూచనలు, మసక మస కగా మాత్రమే మనకిపుడుంటాయి. అయితే ఇది (ఆధ్యాత్మిక ఇచ్ఛాశక్తి) అతి కష్టంగా, అస్పష్టంగా, నీరసంగా మారురూపంలో మానసికభావనగా మన దరిచేరి ఉంటుంది. అయితే దాని స్వస్వభావంలో అది అతిమానసం. ఎలాగైనా మనం కనుగొలవలసినది దానియొక్క అతిమానసశక్తిని, అతిమానససత్యాన్ని. మన జీవన మునకు ప్రధానశక్తి ఇంకెంత మాత్రమూ ప్రాకృతిక నిమ్నప్రాణిక ప్రేరణ కాకూడ దు. ఇది, ఇదివరకే మనలో సాధింపబడి ఉన్న శక్తి. ఇది ఎంతసేపూ అహం కేంద్రంగా చుట్టూ గుడిగుడి గుండ్రంగా పరిభ్రమించేది. కాకపోతే, మనం అప్పుడప్పుడు వింటూన్నది, మాట్లాడుతున్నది అయిన ఆధ్యాత్మికశక్తి యొక్క లోలోపలి నిగూఢ సత్యము, మనకు ఇంతవరకు ఇంకా దక్కనే లేదు. అదింకా, మన లోలోతులలో విశ్రాంతి తీసుకుంటూనే ఉన్నది. మనం, మన అహంకార పరిధిని దాటిన ఔన్నత్య స్థాయిలో, సర్వులతోనూ సమైక్యం కాబడే విశ్వజనీన వ్యక్తిత్వమును బహిర్గతం కావించుకోవటం కోసం వేచి ఉన్నది. మానవస్వభావం అన్వేషించి కనుగొనవలసి నది — మనలోని ఉపకరణాత్మక వాస్తవము అయిన ప్రాణిక సత్వమును కాక, మన లోపలి కేంద్ర అస్తిత్వముగా ఉన్న జీవాత్మను. మన ఇచ్ఛాశక్తిని ఆ ఉన్నతస్థితికి ఉద్ధరించి, దానినే మన జీవనశక్తిగా బదలాయింపు కావించుకొనటం — ఇంతవ రకు మనం ఏం చేశామంటే, ప్రాణిక ఇచ్ఛాశక్తిని మానసికస్థాయికి బదలాయిం చాం. ఇంతవరకు జరిగినది పాక్షిక విజయంతో కూడిన కృషి — ఈ మానసికస్థాయికి

బదలాయింపు. మానవుడు మనోభావనాబలంతో మనుగడ సాగించడానికి మాత్రమే ఇంతవరకు కృషి జరిగింది. అంతే. ఈ మానసికభావనా బలంతో జీవించే జీవనం మధ్యంతర జీవనమే అవుతుంది. ఉపకరణాత్మకము మాత్రమే. But the mental idea in us is always intermediary and instrumental. ఇంత మాత్రంతోనే జీవనం సంతృప్తిపడి ఉండదు. కొంతకాలమే ఆ వేర్పాటు ధోరణితో కూడి సంతృప్తిపడి ఉంటుంది. అలాగే ఎల్లప్పుడు మనుగడ కొనసాగించ లేదు. అంతమాత్రంతోనే సంతృప్తిపడి ఉండనేరదు కూడా. అంతకు మించిన ఆధారక్షేత్రమును నమ్మి అందుకు నిరీక్షిస్తుంది. రెండే రెండు ప్రత్యామ్నాయాలు -- ప్రాణిక, శారీరక జీవనంతో కిందా, మీదా పడుతూండటం — లేదా — తనకు తానుగా, సమున్నతంగాను, లోతుగాను జీవాత్మదిశగా సముద్ధరించుకోవటం.

మూలం: శ్రీఅరవిందులు

భావానువాదం: కర్రా వెంకటేశ్వర్లు

అహం నుంచి పరమాత్మకు మన రహదారి

దివ్య అస్తిత్వమ్ము, ఆధ్యాత్మిక దివ్యసత్యము, అంతర్లీనంగా, పైకి అచేతనంగా కనపించే భౌతికపదార్థంలో ముకుళితమై ఉన్నది. ఇదే పరిణామక్రమానికి ప్రారంభం, తొలిమెట్టు. ఆ దివ్యవాస్తవమే తన సహజప్రవృత్తిలో, శాశ్వత సత్ , చిత్ , ఆనంద స్థితి. ఈ సత్ చిత్ ఆనంద అస్తిత్వ ఆవిష్కరణయే పరిణామము కావాలి. కావలసినది అదే. తొలుత అది అంతస్తత్వంలో ఒక్క మారుగా పరిపూర్ణంగా ఆవిష్కారం కాదు. అలా కాక, వివిధ పరిణామరూపాలుగా, మారువేషాలలో దాగి ఉంటూ, వ్యక్తమవుతూ ఉంటుంది. అదే 'అసత్'. ఆ అసత్ లో నుంచి ఆవిష్కరించబడిన తొలి పరిణామరూపం, 'పదార్థం' – Matter the substance of Matter – పదార్థమూలక ద్రవ్యం. అచేతన దివ్యశక్తిగా ఇది సృష్టించబడినది. భౌతికపదార్థంలో దివ్యచేతన దృగ్గోచరం కాదు. అంతర్లయనమై (involved) ఉంటుంది. తొలుత అది, ప్రాణికస్పందనలతో సచేతనమై కూడా, అవచేతనస్థితిలో (subconsciennt), వ్యక్తమవుతుంది. అదే అపుడు అపరిపక్వంగా ప్రకటితం కాబడిన పలు సచేతన, జీవరూపాలుగా వ్యక్తం అవుతుంది. తమను తాము తెలుసుకోవాలనే పెనుగులాట

వాటికి. ఆ పెనుగులాట దేనికోసమంటే మరింత సమగ్ర వ్యక్తీకరణకు. ఈ భౌతికపదార్థ రూపాలు, క్రమానుగతంగా తమకు తాము రూపొందించుకుంటూ, వ్యక్తమవుతాయి. ఈ ప్రక్రియలో, శక్తిమంతం కావించే దివ్యచేతన (the emerging consciousness, మనిషిలో మరింత ప్రస్ఫుటమై స్వీయచేతన కలిగి, విషయాలను యెరుకపర్చుకుంటూ మనసుగా (as mind) ప్రత్యక్షమైంది. ఇది కూడా ఇంకా అపరిపూర్ణమైనది; పరిమితమైనది. తనదైన సమగ్రశక్తి కాదు ఇది. కాకపోతే, ఇది, ఒక తొలి భావాత్మకమైన అంతర్నిహితశక్తి. సమగ్ర వ్యక్తీకరణకు ఇది ఒక నిరూపణ, తార్కాణం. పరిపూర్ణ సమగ్ర వ్యక్తీకరణయే పరిణామాత్మకు దివ్యప్రకృతికి లక్ష్యం.

తనను తాను ఈ మహావిశ్వంలో సుస్థిరపర్చుకునేందుకు మానవుడు ఉన్నాడు. అదే ఆతని తొలి వ్యాపకం. అంతే కాదు — పరిణామం చెందుతూ తనను తాను అధిగమించాలి కూడా. తన అపరిపూర్ణ అస్తిత్వం నుంచి, పరిపూర్ణ అస్తిత్వం లోనికి విస్తృతపర్చుకోవాలి. తన అపరిపూర్ణచేతనను పరిపూర్ణచేతనగా విస్తరించుకోవాలి. పరిసరాలపై ఆధిపత్యం సాధించాలి. తన వ్యక్తిత్వాన్ని అవగతం చేసుకోవాలి. దానిని విశ్వాత్మగా విశాలపర్చాలి. ఇంకా వైశ్వానిక, ఆధ్యాత్మిక అస్తిత్వ ఆనందాన్ని సాధించాలి. తన అజ్ఞాన, అంధకార, అస్పష్ట, తప్పుడు మనస్తత్వాన్ని సరిదిద్దుకోవాలి. రూపాంతరీకరించుకోవాలి. విశాలమైన, స్వేచ్ఛాయుత, విజ్ఞాన తేజోవిలసనము, ఇచ్ఛాశక్తి, సౌకుమార్యము, క్రియాశీలత, సత్ శీలము — వీటిని తనకు పరమలక్ష్యాలు కావించుకోవాలి. ఇదీ మానవస్వభావానికి నిర్దేశించినది. తన వివేకముపై సృజనాత్మక దివ్యశక్తి విధించినది ఇదే. దీని యొక్క ఆవశ్యకతను తన యొక్క మానసిక, ప్రాణిక మూలపదార్థంపై ఒక అవసరంగా, ఒక ఆదర్శంగా, సృజనాత్మక దివ్యశక్తి చేత నాటబడినది.

అయితే మనిషికి తన జీవనయానంలో ఈ ఆధ్యాత్మిక సత్యం, తన సత్వము యొక్క నిజ ఆదర్శం అంత తొందరగా ప్రస్ఫుటమయ్యే అవకాశముండదు. ఎందుకంటే దివ్యప్రకృతి యొక్క పరిణామక్రమ ప్రస్థానంలో ముందుగా మనిషికి ఈ సంసిద్ధత కోసం కొంత వ్యవహారం సాగించాల్సింది ఉంది. అదేమిటంటే — తన స్వీయ వ్యక్తిత్వాన్ని సుసంపన్నం కావించుకోవాలి. సుస్థిరపర్చుకోవాలి. స్పష్టపర్చుకోవాలి. శక్తివంతం కావించుకుని, పరిపూర్ణంగా, దృఢంగా తన వశంలో ఉండేలా చేసుకోవాలి. అందుకు తగినట్లుగానే ముందు ముఖ్యంగా తను 'అహం'

వ్యాపకంలో, అహాన్నే పట్టించుకుంటూ ఉంటాడు. ఇది తనకు అహంకారిక పరిణామ దశ. ఈ దశలో, ప్రపంచము ప్రజలు అంత పట్టించుకోవలసినవాడుగా తనకు అనిపించదు. వాళ్లు తనకు అంత ప్రధానం కారు. వాళ్లు, పరిస్థితులు, సంఘటనలు తనను తాను సుస్థిరపర్చుకునే సాధనాలుగా మాత్రమే ఉపయోగపడతారు. అంతవరకే వాళ్ల ప్రాముఖ్యత. ఈ దశలో భగవంతుడు కూడా అంత ప్రధానం కాదు. ఎంతసేపూ, తన 'స్వ' యే తనకు ప్రధానం. కాబట్టే, మతం యొక్క క్రమవికాసంలో, నిమ్నస్థాయిలో, ముందు, దేముడు, మనిషి కోసం, మనిషి అవసరాలు తీర్చేవాడుగా రూపొందింపబడినాడు. ఈ దేవతలందరూ మనిషి కోసం వ్యక్తీకరింపబడినవాళ్లు. మనిషికి కోర్కెలు, అవసరాలు, కామనలు తీర్చేందుకు సహాయకులుగా దేవతలు తీర్చిదిద్దబడినారు. ఈ పాపాలు, హింసలు, క్రూరత్వాలు, మొరటుతనాలు — అన్నీ వాటి వాటి స్థానాలలో ప్రకృతి యొక్క పొరపాట్లుగానో, చెడుగానో పరిగణించకూడదు. ఇదంతా ప్రాథమికంగా మనిషి యొక్క అహంకార తొలి క్రమావిర్భావం. మనిషి తనలోని క్రియాకలాపంలో తన వ్యక్తిత్వాన్ని తాను తెలుసుకోవటానికి, అధోచేతన నుండి పరిపూర్ణంగా విడవడి ఉండటానికీ ఈ తతంగం అవసరం. ఇందులో వ్యక్తి ప్రాపంచిక, సామూహిక చైతన్యానికి దాసుడై ఉంటాడు. ప్రకృతి యొక్క యాంత్రిక ప్రయోజనాలకు, చలితచాలనాలకు పూర్తిగా నిబద్ధుడై ఉంటాడు. వ్యక్తిగా మనిషి తన వ్యక్తిత్వాన్ని సుస్థిరం చేసుకోవాలి. ప్రకృతికి అతీతంగా వ్యక్తీకరించుకోవాలి. తనకు తానుగా శక్తియుతుడు కావాలి. తన శక్తియుక్తులను, ఆనందాన్ని వికసింపచేసుకోవాలి. వాటిని మరింత సాధికారికంగా శక్తివంతం కావించుకుని, ప్రపంచాన్ని ప్రకృతిని వశపర్చుకునేటందుకు వాటిని మళ్లించాలి. ఈ ప్రాథమిక అవసరమును సాధించటానికే విచక్షణాజ్ఞానంతో కూడిన 'అహం' తనకు స్వంతం కాబడింది. తన ప్రత్యేకతను, వ్యక్తిత్వాన్ని, ప్రత్యేకమైన స్వీయసామర్థ్యాన్ని అభివృద్ధిపర్చుకోవాలి. అంతవరకు తన శక్తులను ఉన్నత దైవీప్రయోజనాల కోసం విజయవంతంగా మరలించే సామర్థ్యంకలవాడు అవడు. తను సంతరించుకోవలసిన తనదైన ప్రత్యేక సామర్థ్యము ఇదే. అభివృద్ధిపర్చుకోవలసినదీ ఇదే. దివ్యజ్ఞాన పరిపూర్ణత సాధించటానికి ముందు తన అజ్ఞానాన్ని తనకు తానే విశదపర్చుకుని ధృవపర్చుకోవాలి.

ఇందుకే ప్రకృతి అహాన్ని కల్పించింది. మూకుమ్మడి అచేతన, అధోచేతనలతో

తాను విడివడి, స్వేచ్ఛాయుత సజీవ మనో, ప్రాణిక, ఆత్మశక్తిగా ఉంటూ తన చుట్టూ ఉన్న ప్రపంచంతో సమన్వయం కావించుకుంటూ, మరి అందులో మునిగిపోయి, అదృశ్యమవకుండా ఉండటానికి, తాను అనామకంగా, అప్రయోజకత్వంగా ఉండకుండా ఉండటానికి దివ్యప్రకృతి అహాన్ని కల్పించింది. నిజానికి వ్యక్తి వైశ్వానిక సత్వములో భాగము. అయినా అంతకు మించినవాడు కూడా. అతీత దివ్యత్వం నుంచి దిగివచ్చిన జీవాత్మ. దీనిని వెన్వెంటనే యెరుకపర్చుకుని అభివ్యక్తీకరించలేడు. జీవాత్మగా ఆత్మజ్ఞానాన్ని పొందే ముందు తాను తొలుత మానసిక, ప్రాణిక అహం అని తెలుసుకోవాలి.

అయినప్పటికీ వ్యక్తి, తన యొక్క అహంకారయుత వ్యక్తిత్వాన్ని తెలుసుకోవటం, తానను తాను తెలుసుకోవటం కాదు (ఆత్మజ్ఞానమవదు). నిజమైన ఆధ్యాత్మిక వ్యక్తిత్వం అంటే మానసిక అహం కాదు. ప్రాణిక అహం కాదు. శారీరక అహం కాదు. అది ముందుగా (the egoistic) అహంకారయుత ఇచ్ఛాశక్తితో కూడిన చాలనం. స్వార్థపూరితమైన కార్యసాధనకు సంబంధితమైనది. ఆ తర్వాత మాత్రమే, చోటుచేసుకునేది, జ్ఞాన వ్యావహారికాలు. కాబట్టి మనిషి తన అహంకారయుత అస్పష్ట సత్వరూపమునకు పరోక్షంగా ఉన్నదానిని దర్శించే సమయం ఏదో ఒకప్పుడు తనకు తప్పక కలుగుతుంది. అపుడు తనను తాను తెలుసుకోక తప్పదు. (ఆత్మజ్ఞానం) తనలోని నిజమానవుని తెలుసుకునే ప్రయత్నం చేయక తప్పదు. అలా కాకపోతే ప్రకృతి తాలుకు ప్రాథమిక విజ్ఞానంతోనే (పదార్థ విజ్ఞానం) సరిపెట్టుకుని సంతృప్తిపడాలి. లోతైన ఉత్కృష్ట ప్రబోధాలను అందుకోలేడు. ఎంతటి సామర్థ్యం, ఆచరణ యోగ్యమైన విజ్ఞానం, నైపుణ్యం కలిగివున్నవాడైనా, పశువుకి కాస్తంత మాత్రమే పైన ఉంటాడు. ముందు తన మానసిక విజ్ఞానం వైపు దృష్టి సారించాలి. సహజ స్వాభావిక మూలకాలైన — అహం, బుద్ధి, దాని ఉపకరణాలు, ప్రాణికము, శరీరము — వీటిని వర్గీకరించుకోవాలి. ఆ తర్వాతే తన సర్వ అస్తిత్వానికి, ఈ మూలకాలకు (మనో, ప్రాణ, శరీరాలు) మించి ఉన్న పరిజ్ఞానమును తాను తెలుసుకోవలసిన అవసరము తనకు ఉన్నదని కనుగొంటాడు. అది కేవలం తన అహంకారాన్ని సుస్థిరపరుచుకుని సంతృప్తిపడటం మాత్రమే కాదని గమనిస్తాడు.

మూలం: శ్రీఅరవిందులు

భావానువాదం: కర్రా వెంకటేశ్వర్లు



వస్తువుల బాహ్యరూపం వెనుక దాగిన అసలు సత్యం

సాధారణంగా, మన గురించి మనం అనుకొనే 'నేను' అనేదే ప్రపంచంలో మన శరీరాన్ని, మనసుని, నైతిక స్వభావాన్ని శాసించేదని అనుకుంటాము. అది దాని స్వయంప్రతిపత్తితో, పనులను యెన్నుకోవడంలో పూర్తి స్వేచ్ఛని కలిగివుంటుం దని, తను చేసే పనులకు తానే బాధ్యత వహించే స్వాతంత్ర్యం కలిగి వుంటుందని కూడా భావిస్తాము. సాధారణ బుద్ధికి లోతైన ఆలోచనగాని, లోతుగా చూడగల దృష్టిగాని వుండవు. స్వంత శారీరక వ్యవస్థని, ఆ సంవిధాన శక్తిని అవగాహన చేసుకోవడం అంత సులభం కాదు. ఆధ్యాత్మిక దృక్పథం, అనుభవంలేనివాళ్లు యెంత ఆలోచనాపరులు, సూక్ష్మబుద్ధిగల వాళ్లయినా వాళ్లకి కూడా యిది తెలుసుకోవడం యెంతో కష్టం. స్పష్టంగా కనిపించే 'నేను' తన సామ్రాజ్యం కంటె శక్తివంతమైన, లోతైన సత్యమేదో వుండగలదనే విషయం వూహించడం యెలా? కాని ఆత్మజ్ఞానం దిశగా మొట్టమొదట వేసే అడుగు యీ అద్భుతం యొక్క స్వచ్ఛమైన సత్యం వైపు పడాలి. పైకి కనిపించే వస్తుసత్యం వెనుకగల మూలసత్యం తెలుసుకోడానికి, దాని వలన వాస్తవం తేటతెల్లం కావడానికి జరగవలసినదదే. అప్పుడే ముసుగు కప్పుకున్న నిజమైన చైతన్యవంతమైన సత్యం యేదైతే వుందో దాని ముసుగు తొలగి అసలు రూపం బయటపడుతుంది.

అహం వెనుక దాని సత్యం: 'అహం' లేక 'నేను' శాశ్వత సత్యం కాదు. అందులో సత్యభాగం మన కవసరమైనదాని కంటే కూడా చాల తక్కువ, అది కేవలం ప్రకృతి నిర్మాణం మాత్రమే. మనసు తన విచక్షణతో యేర్పరుచుకున్న మానసిక రూపం. మన జీవితభాగాలలో స్పందన అనుభూతుల వలన యేర్పడిన ప్రాణిక రూపం. భౌతిక చైతన్యం స్వీకరించిన పదార్థ కేంద్రీకరణ, మరియు పదార్థ ప్రక్రియల యొక్క భౌతికరూపం. మన అందరి అంతరంగ స్వరూపాలు 'అహం' కాదు. దివ్యచైతన్యం, లేక ఆత్మ లేక దివ్యభావన. మనమంతా బాహ్యంగా పై పైనే వుంటాం, పని చేస్తాం కాని అదే మన అహం కాదు. స్వభావం మాత్రమే.

కర్మల వెనుకగల సత్యం; ఒక కార్యనిర్వాహక విశ్వశక్తి మనల్ని తీర్చిదిద్ది మన స్వభావం, అలాగే తీర్చిదిద్దబడిన పరిసరాలు, సహజ మానసిక స్వభావం ఉంటాయి. విశ్వశక్తి యొక్క ప్రత్యేక విశిష్ట సూత్రీకరణ ద్వారా మన పనులు, ఫలితాలు

ఆదేశింపబడినవిగా వుంటాయి. నిజానికి మనం ఆలోచించం, అనుకోము, ఆచరించం. కాని అప్రయత్నంగానే ఆలోచన కలుగుతుంది. మనలో అలాగే సంకల్పం, స్పందనక్రియ పనిచేస్తాయి. మన అహం భావం యీ మొత్తం సహజ కార్యకలాపలన్నింటినీ తన చుట్టూ పోగుచేసుకొని అదంతా తను చేస్తున్నట్లు తనకి ఆపాదించుకుంటుంది. కాని యిదంతా విశ్వశక్తి, దివ్యప్రకృతి చేసినది. అదే ఆలోచన పుట్టిస్తుంది. సంకల్పాన్ని కలిగిస్తుంది. స్పందనని కలిగిస్తుంది. మన శరీరం, బుద్ధి మరియు అహం క్రియాశీలత గల శక్తి తరంగాలు — యివి పాలించవు. ప్రకృతి విశ్వశక్తిచే పాలించబడతాయి. మార్గదర్శకత్వాన్ని పొందుతాయి. సత్యసాధనలో సాధకుడి ప్రగతి, ఆత్మజ్ఞానం ఒక విషయం వద్దకి తప్పకుండా రావాలి. ఎక్కడి కంటే ఆత్మ తన అంతర్దృష్టి నేత్రాలను తెరచి యీ అహం వెనుకగల సత్యం మరియు యీ క్రియాకలాపాల వెనుకగల సత్యం గుర్తించాలి. అప్పుడే సాధకుడు మానసిక, ప్రాణిక, భౌతికపరమైన 'నేను' అనేదే యీ పనులలో శాసిస్తూ పనిచేస్తున్నదనే భావన విడిచిపెడతాడు. దివ్యప్రకృతిని గుర్తిస్తాడు. విశ్వశక్తి స్వభావం తన విధివిధానాల ననుసరిస్తున్నదని అది మాత్రమే తనలోను, అన్ని జీవులలోను, వస్తువులలోను పనిచేసేది అని తెలుసుకుంటాడు.

ప్రకృతి — పురుషుల వెనుకగల సత్యం: ప్రకృతి రీతులను ఏది సిద్ధపరుస్తున్నది? లేదా శక్తి చలితచాలనాలను శాసించి, నిర్వహిస్తున్నదేది? ఒక దివ్య చైతన్యం లేదా దివ్యాత్మ పరోక్షంగా వున్నది. దాని వెనుకగల పరమాత్మ జ్ఞాని, సాక్షి, ఆనందించేవాడు, పైకి తెచ్చేవాడు, ప్రకృతి పనులను అనుమతించే మూలపురుషుడు. ఈ చైతన్యమే దివ్యాత్మ లేదా పరమపురుష. ప్రకృతి మన కార్యక్రమాలకు రూపకల్పన చేస్తుంది. ఆమెలో వున్న పరమ పురుష లేదా ఆమె వెనుక సాక్షిగా వున్నావాడు దానిని ఆమోదించి, భరించి పైకి తెస్తాడు. ప్రకృతి మన బుద్ధిలో ఆలోచన సృష్టిస్తుంది. ఆమెలో లేదా ఆమె వెనుకగల పురుషుడు ఆ ఆలోచనను దాని వెనుకగల సత్యాన్ని గ్రహిస్తాడు. మన చర్యల ఫలితాన్ని ప్రకృతి నిర్ణయిస్తుంది. దాని పర్యవసానంగా వచ్చే ఆనందాన్నిగాని, బాధనిగాని పురుషుడు అనుభవిస్తాడు. ప్రకృతి, శరీరాన్ని, మనసు నిర్మించి వాటి మీద పనిచేస్తుంది. వాటిని అభివృద్ధిని చేస్తుంది. పురుషుడు ఆ నిర్మాణాన్ని, వికాసాన్ని ఉన్నతికి తెచ్చి ఆమె కార్యక్రమంలో ప్రతి దశని అనుమతిస్తాడు. మనుషులలో, వస్తువులలో పనిచేసే సంకల్పశక్తిని ప్రకృతి

అనుసంధానం చేస్తుంది. పురుషుడు తన అంతర్దృష్టితో యేది జరగాలో నిర్ణయించి ఆ పనికి తగిన సంకల్పశక్తిని చేకూరుస్తాడు. ఈ పురుషుడు బాహ్యతలంలో వుండే 'అహం' కాదు. అహం వెనుక వుండే వొక నిశ్శబ్ద అంతరాత్మ. ఒక శక్తి మూలం. జ్ఞానానికి మూలపురుషుడు. జ్ఞానగ్రహీత. మన మానసికమైన 'నేను' అనేది యీ అసలు 'నేను' యొక్క తప్పుడు ప్రతిరూపం. అలాగే మన మనుకునే శక్తి అసలు శక్తికి, మన మనసనుకునే జ్ఞానం, నిజమైన జ్ఞానానికి తప్పుడు ప్రతిబింబాలు. ప్రకృతి కార్యకలాపాలన్నింటికి బాసటగా, గ్రహీతగా, కారణంగా వున్నది యీ పరమ పురుషే. అయితే అతడెప్పుడూ ప్రత్యక్షకర్తగా వుండడు. ప్రత్యక్షంగా వుండేది యెప్పుడూ ప్రకృతిశక్తి, శక్తి, దివ్యచైతన్యతీక్షణత, దివ్యాత్మశక్తి. ఇవి ప్రకృతి వెనుక వుండి నడిపిస్తూ వుంటాయి. ప్రకృతి — పురుషులు రెండూ విశ్వమాతకి అంతర, బాహ్యముఖాలు. విశ్వంలో జరిగేవన్నీ పరిగణనలోకి తీసుకోబడతాయి. విశ్వమాతే ప్రకృతిశక్తి. ఆమే అన్నిటికీ కర్తృత్వం వహిస్తుంది.

జీవాత్మ వెనుకగల సత్యం: ప్రకృతి-పురుషులు, దివ్యచైతన్యశక్తి మరియు ఆత్మకి అండగా వున్న ప్రకృతి. ప్రకృతి-పురుషులు వేర్వేరుగా వున్నా వొక్కటిగా అవిభాజ్యంగానా వుంటారు. వారు వొక్కటిగా వున్న సార్వత్రిక, సర్వోన్నతశక్తి. కాని వ్యక్తిలో కూడా యేదో వున్నది. అది మానసికమైన అహం కాదు. ఈ మహోన్నత సత్యంతో వున్న సారంలో అజ్ఞాతమైనదేదో అది వొకటి. అది దివ్యపురుషుడిలో భాగం లేదా దాని స్వచ్ఛ నిర్మల ప్రతిబింబం. అది ఆత్మ, వ్యక్తి లేదా శరీరధారి యైన జీవి. అది వ్యక్తి ఆత్మ లేదా జీవాత్మ. శక్తి పరిమితశక్తితో పరిమిత జ్ఞానంతో తానుగా కనిపిస్తుంది. ఆ విధంగా వ్యక్తి నాటకాన్ని సమర్థిస్తూ సర్వోన్నత, సార్వత్రిక ప్రకృతికి బాసటగా వుంటుంది. అత్యంత ప్రగాఢ సత్యంలో అనంతమైన ఏకత్వమే అనంతమైన భిన్నత్వం. మనం కేవలం ప్రతిబింబం లేదా దానిలో భాగం మాత్రమే కాదు. మనం అదే (తత్). అదే ఆధ్యాత్మిక వ్యక్తిత్వం. మన అహానికి భిన్నమైనది. సార్వత్రిక, సర్వాతిశాయిత్వం విడిచిపెట్టనిది. కాని ప్రస్తుతం మనలోగల ఆత్మలేదా తాను, విశిష్ట లక్షణంపై ఆసక్తి కలిగినది. ప్రకృతిలో అహం అనే భావనతో తనను తాను తికమక పెట్టుకునేవి. ఈ అజ్ఞానం నించి తప్పనిసరిగా బయటపడాలి. తనని తాను అత్యున్నత శక్తిగా, విశ్వాత్మయొక్క ప్రతిబింబంగా లేదా అందులో భాగంగా తెలుసుకోవాలి. విశ్వకర్మలో తన చైతన్యానికి మూల కేంద్రమవాలి.

కర్మాధిపతి వెనుకగల సత్యం: ఈ దివ్య జీవనపురుషుడు కూడా కర్మల కర్త కాడు. అహం లేదా ఆధారచైతన్యం యొక్క సాక్షి లేదా జ్ఞాని కంటె యెక్కువ కాడు. మళ్లీ మరియు నిరంతరం అదే సర్వాతిశాయి సార్వత్రిక విశ్వశక్తి తాను మాత్రమే సృష్టి కంతటికీ కర్త. కాని ఆమె వెనుక మహోన్నతమైన ఆమె ద్వారా అభివ్యక్తమయిన ప్రకృతి పురుషులనే ద్వంద్వశక్తి అదే యీ సర్వేశ్వరశక్తి వున్నది. ఆ మహోన్నతశక్తే చిచ్ఛక్తిగా మారి ఆమె ద్వారా విశ్వంలో సంపూర్ణ మూలపురుషుడు లేదా కర్మల కధిపతి అవుతున్నాడు.

ఈశ్వర శక్తి: ఈశ్వర-శక్తి, పురుష-ప్రకృతి వొకటి కాదు. పురుష మరియు ప్రకృతి వేర్వేరు శక్తులు. కాని ఈశ్వర-శక్తి పరస్పరం వొక దానిలో వొకటిగా కలిసి వున్నవి. (అర్ధనారీశ్వరతత్వం). ఈశ్వరే, పురుషగా తనలో ప్రకృతిని చేర్చుకుని తనలోగల శక్తి ఆధిక్యతలో పరిపాలిస్తుంది. శక్తే ప్రకృతి అయి పురుష వలన ఆత్మస్థైర్యాన్ని పొంది ఈశ్వరసంకల్పాన్ననుసరించి పనిచేస్తుంది. ఈశ్వర సంకల్పమే శక్తి సంకల్పం. ఈశ్వర రూపం నిరంతరం ఆమె తనతో, తన ప్రతి కదలికలో తన వెంటే తీసుకుపోతుంది. తన సాధనామార్గంలో పురుష-ప్రకృతి గుర్తింపు సాధకుడికి మొట్టమొదటి అవసరం, ప్రయోజనం. విచక్షణాత్మకి, శక్తికిగల విభజన అదే — జీవి ఆచరణ, వ్యక్తి యొక్క నిర్మాణవ్యవస్థ కోసం. అదే మన అజ్ఞానానికి, అసమగ్రతకి బలమైన కారణం. ఇది గ్రహించినట్టయితే ప్రాణి తనని తాను ప్రకృతి యొక్క యాంత్రికకర్మల నుండి విడిపించుకొని స్వేచ్ఛ సాధించగలడు. అప్పుడే ప్రకృతి మొట్టమొదటి ఆధ్యాత్మిక విజయాన్ని సాధించినట్టు. ఈశ్వర-శక్తి, పురుష-ప్రకృతి సంబంధానికి అండగా వాని వెనుక నిలబడతాయి. జీవి యొక్క అజ్ఞాన కార్యకలాపాలన్నీ సృష్టివికాస ప్రయోజనంగా మారతాయి. ఈశ్వర-శక్తి గుర్తింపు, జీవిని వొక అత్యున్నత చైతన్యంలో భాగంగా తీసుకురాగలదు. ఆధ్యాత్మిక దివ్య కార్యాచరణతో జీవి ప్రకృతిలో సంపూర్ణ ఏకత్వం, సామరస్యం సాధించగలదు.

బాహ్యవ్యక్తిత్వము వెనుక గల సత్యము: ఇదే కర్మల వెనుక సత్యమైతే మొదట సాధకుడు అహం యొక్క వివిధ రూపాలు, కార్యాచరణ నించి విముక్తుడు కావాలి. 'నేను' అనే భావం నించి, ఆ భావంతో పనిచేయడం నించి విడుదల పొందాలి. ప్రతి సంఘటన తనలోగల దివ్యచైతన్యం, లేదా ఉపచేతన, లేదా అతిమానస చైతన్యం యొక్క, తనంతట తానే జరిగేటట్టు చేసే శక్తివలన తన ఆధ్యాత్మిక,

మానసిక, ప్రాణిక, భౌతిక ప్రకృతి ద్వారా జరుగుతున్నదని తెలుసుకోవాలి. వ్యక్తి బాహ్యతలంలో వొక వ్యక్తిత్వం వుంది. దాని ప్రభావం వలన యెన్నుకోవడం, యిష్టపడడం, అర్పించడం, తీవ్రంగా పెనుగులాడడం లాంటి చర్యలతో ప్రకృతికి మేలు చేయడానికి లేదా ప్రకృతిపై విజయం సాధించడానికి ప్రయత్నిస్తూ వుంటాడు. కాని యీ వ్యక్తిత్వం తనకు తానే యేర్పడిన ప్రకృతి నిర్మాణం. అందుచేతనే అది ప్రకృతి ఆధిపత్యానికి లోబడి నడుపబడుతూ, నిర్దేశించబడుతూ ప్రకృతి అధీనంలో వుంటుందే తప్ప స్వేచ్ఛగా పనిచేయలేదు. తనలో వుండే ఆత్మ యొక్క రూపం లేదా తీరు. అది వ్యక్తి యొక్క స్వంత ఆత్మ అనే కంటే ప్రకృతి ఆత్మ అనాలి. అది సహజ వ్యక్తిత్వం. చంచల స్వభావం కలిగినది. కాని అది అతడి ఆధ్యాత్మికమైన, శాశ్వతమైన ఆత్మ కాదు. తాత్కాలికంగా యేర్పడిన వ్యక్తిత్వం. అంతేగాని స్థిరమైన శాశ్వతమైన వ్యక్తిత్వం కాదు.

మనిషి సుదూరంగా పయనించాలి: అనుభవంలో అనుభూతికి రావలసినది సృష్టిలో అన్ని కర్మలూ దివ్యమాతవే. మొత్తం అంతా దైవం వలననే జరుగుతున్నదే అని. అలా సాధకుడు సుదూరంగా ముందుకు పోవాలి. అలాంటివారే ఆ భావంలో వుండగలరు. వారు ప్రకృతిలో యే మార్పుని కోరరు. కాని దాని వెనుకగల సత్యం యొక్క అనుభవాన్ని మాత్రమే కోరుకుంటారు. నీ కర్మ యెప్పుడూ సార్వత్రిక ప్రకృతి ననుసరించే వుంటుంది. అందులో మళ్లీ నీ వ్యక్తిగత స్వభావాన్ని బట్టి కూడా వుంటుంది. ప్రకృతి అంతా వొక తీవ్రశక్తి. అది విశ్వకర్మ కోసం దివ్యమాతచే నిరోధింపబడుతూ వుంటుంది. కాని విషయాలు, అజ్ఞానం అహం యొక్క కర్మల అధీనంలో వుంటాయి. కాని మనం కోరుకునేదేమంటే యీ అజ్ఞానం, అహంల ద్వారానే దివ్యసత్యం ముసుగు తొలగించబడి స్వస్వరూపం వెల్లడి కావాలని.

సాధనా లక్ష్యం: ప్రతి వస్తువు కూడా విశ్వపరాశక్తియొక్క పరికరమన్నది సత్యం. అందుచేత సర్వం దివ్యమాతదే. కాని సాధనలక్ష్య మేమంటే చైతన్య రహితమైనందు వలన అసమగ్రంగా వుండడానికి బదులు సమగ్రమైన చైతన్యవంతమైన దివ్యస్పృహతో కూడిన పరికరంగా మారడం. మనిషి చైతన్యవంతమైన సమగ్ర పరికరంగా యెప్పుడు మారగలడంటే దివ్యమాత స్పృహలో ఆమె అత్యున్నత పర్యవేక్షణకి తన్ను తాను సమర్పించుకొని అందులో జీవించాలి. నిమ్న ప్రకృతికి

లోబడి బానిసలై అజ్ఞానపు వూబిలోకి యెప్పటికీ త్రోయబడకుండా వుండాలి.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

అహంకార జీవితం దివ్యజీవనానికి నాంది

జీవన వికాస దశలలో అవసరమైన చైతన్య ప్రస్థానంలో పరిమిత అహం మధ్యంతరంగా కనిపించే తాత్కాలిక సంఘటన మాత్రమే. ఒక రకమైన పురోగమన మార్గంలో ఇది అవసరం. ప్రస్థాన మార్గం అనుసరించే సాధకుడు తనకు మించినదానిని, తాను ప్రాతినిధ్యం వహించిన తత్వాన్ని చేరుకోగలడు. పరిమితమైన, మసకబారిన అహం రూపంలో కాకుండా అతను ఆ అతీతస్థితికి, భగవంతుని కేంద్రబిందువుగా, విశ్వజనీన చైతన్యకేంద్రంగా ప్రాతినిధ్యం వహించగలడు. అన్ని వ్యక్తిగత నిర్ధారితాంశాలను తనలో విలీనం చేసుకొంటూ, ఉపయోగించుకొంటూ, సామరస్య రూపంలోకి, రూపాంతరం చెందించుకోగలడు.

భౌతిక విశ్వంలో మానవ జీవితానికి గట్టి పునాదిగా భౌతిక ప్రకృతి సర్వ సమగ్ర పూర్ణత్వంతో దివ్యచైతన్యమూర్తి అభివ్యక్తం కాగలడు. మన కార్యకలాపాలకు అనుకూలస్థితిగా అంతర్నిక్షిప్తమై వున్నా, అనివార్యంగా పరిణమిస్తున్న ప్రాణం, మనస్సు, అతిమనస్సులో ఆ చైతన్యమూర్తి ఆవిష్కరిస్తాడు. ఈ పరిణామం వల్లనే మనిషి పదార్థజగత్తులో రూపుదిద్దుకొన్నాడు. పరిణామం వల్ల మనిషి క్రమానుగతంగా శరీరంలో భగవంతుడ్ని ఆవిష్కరించుకోగలడు — అదే విశ్వజనీన అవతారం. అనిర్ధారితపూర్ణత్వంనుండి ఒకే ఒక పరతత్వం అనేక రూపాలుగా మారడానికి ఈ అహంకారమే మధ్యంతర, నిర్ణయాత్మక అంశం. ఈ అనిర్ధారిత పూర్ణత్వమే మనం అవచేతన అంటాం. అది రూపరహితం, మసకబారిన స్థితి. దీనినే వేదంలో, 'హృద్య సముద్రం' (the ocean heart) అన్నారు. జననమరణాలు, సుఖదుఃఖాలు, ఆనందవిషాదాలు, సత్యాసత్యాలు, మంచిచెడులు — ఇవి అహంకార చేతనలోని మొదటి అవస్థలు. సత్యం, మంచితనం, జీవితం, ఆనందంలేని కృత్రిమ నిర్మాణాలలో

ఐక్యతను సాధించే యత్నంలో సర్వసహజంగా, అనివార్యంగా తలయెత్తే పర్యవసానం అది.

జీవితంలో అత్యుత్కృష్ట సాఫల్యం పొందాలంటే, వ్యక్తి తన ఆత్మను విశ్వానికి, భగవంతునికి తెరచి వుంచాలి. అప్పుడే ఈ అహం అంతర్ధానం అవుతుంది. మానవజీవితానికి మృగజీవనం ఏ విధంగా నాంది అయినదో అదే విధంగా ఈ దివ్యసాఫల్యతకు అహంకార జీవితం నాంది అవుతుంది. పరిమిత అహంకారాన్ని దివ్య ఐక్యత, స్వేచ్ఛలకు చైతన్య బిందువుగా ఈ అహాన్ని రూపాంతరం చెందిస్తే అప్పుడు విశ్వమంతా దీపించే దైవతత్వం సిద్ధిస్తుంది. ఆ స్థాయికి చేరుకున్నప్పుడు దివ్యసాఫల్యత లభిస్తుంది. అప్పుడు అనంత, నిరపేక్ష అస్తిత్వ మహత్వం, మహాసత్యం, ఆనందం, శివం(Good) ప్రపంచంలోని అనేకత్వంపై (ప్రాణికోటిపై) వర్షిస్తాయి. పరిణమిస్తున్న యుగాలన్నీ ఆ దివ్య భవితవ్యం, దివ్య ఫలితంవైపే కదులుతున్నాయి. భౌతికప్రకృతి గర్భంలో మహోన్నత దివ్యజన్మ అంటే ఇదే, ఈ దివ్యత్వానికి జన్మ ఇవ్వడానికే మాతృసహజమైన ప్రకృతి నానాయాతన పడుతున్నది.

*

ప్రాణ, మనశ్శరీరాలలోని అహంకారం వికృతరూపంగా కుంచించుకుపోయింది. ఈ స్థితిని సర్వత్రా భాసించే భగవత్ తత్వం సదా త్రోసిపుచ్చుతూ వుంటుంది. అదే మరణం.

పరిమిత జ్ఞానంలో తనకు తాను సంతృప్తిచెందినట్లు అహం తప్పుగా అభిప్రాయపడుతుంది. దానిని భగంతుడు ఖండిస్తూనే వుంటాడు. అదే అసత్యం. విశ్వజనీన ఆనందాన్ని, అహం తన పరిమితమైన, ప్రత్యేకమైన సుఖంగా మార్చుకొనే స్వార్థపరమైన, తప్పు అభిప్రాయాన్ని విశ్వస్థితి పరమాత్మ తిరస్కరిస్తుంది. అదే దుఃఖం, బాధ.

అందరిలోను ఏకత్వాన్ని దర్శించగలిగినప్పుడు వ్యక్తి ఈ వికృతస్థితి నుండి విముక్తి పొంది, దివ్యసిద్ధిని పొందగలడు. అప్పుడు సర్వదైవత్వం, సర్వశక్తి, సర్వచైతన్యం, సర్వసత్యం, సర్వానందం ఆత్మను పెనవేసుకొంటాయి. మర్త్యత్వం అమృతత్వమై పరిఢవిల్లుతుంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె. యజ్ఞన్న

అహం అంటే ఏమిటి?

'నేను' లేదా అల్పమైన అహం ప్రాకృతికంగా ఏర్పడింది. ఇది బాహ్యచైతన్యం, క్రియాశీలత అభివ్యక్తం, కేంద్రీకృతం కావడానికి దోహదపడే మానసిక, ప్రాణిక, భౌతిక రూపాంతరం. సత్య సత్త్వ ప్రకాశంతో అహం ప్రయోజనం అంతమౌతుంది. అది అంతర్ధానమై సత్య సత్వ సంవేదనకి చోటు కల్పిస్తుంది.

*

అహం మొదట ప్రకృతి పరిణామంలో బాహ్య చైతన్య ఆవిష్కారానికి సాధనంగా ఉద్భవించింది. తర్వాత పాశవిక, తామసిక మానవుడు క్రియాశీలంగా ఏదో సాధించడానికి ప్రోత్సాహకారిగా పరిణమిస్తుంది. లేకుంటే మానవుడు ఆహార, నిద్రా, మైధునాలకే పరిమితమై సంతృప్తిచెందేవాడు. అహం కల్పించే ప్రోత్సాహకాలనే (కలిమి, గర్వము, ఆకాంక్ష, అధికార దాహం వంటివి) అన్ని రకాల పనులు చేయడానికి ఉద్యమించాడు మానవుడు. అవి లేకుంటే ఏవీ చేసేవాడు కాడు. కాని ఇంతటితో ఆపకుండా ఇంకా ఉన్నతస్థితికి ఎదగాల్సిరావడంతో, అందుకీ అహం, ఓ పనికిమాలిన అవరోధంగా పరిణమిస్తుంది.

*

అన్ని పదార్థాలలోని చైతన్యశక్తికి అహం యొక్క బాహిరరూప నిర్మాణం, కేవలం తాత్కాలిక సాధనం మాత్రమే. మనలోని అంతశ్శక్తి, రహస్యవ్యక్తిత్వ బాహిర రూపాన్ని సంతరించుకోవడానికీ, అవిద్యాస్వభావంతో తాత్కాలికంగా ప్రాతినిధ్యం వహించి ఉపకరణంగా మారడానికి ఉపయోగపడుతుంది. విశ్వంలోని అచేతన నుండి ఉద్భవించిన ప్రపంచంలో మొట్టమొదట చేయగలిగింది ఇంత మాత్రమే.

*

విశ్వజీవన పురోగమన క్రమపరిణామంలో మొట్టమొదటి బృహత్ ప్రయత్నం శారీరక వాసనలతో కూడిన మానసిక, ప్రాణిక అహం రూపొందడమే. పదార్థం నుండి చైతన్యవ్యక్తి సృష్టికి కనుగొన్న సాధనం ఇదే. అయితే ఈ జీవనం దివ్యంగా ఫలప్రదం కావడానికి ఈ పరిమిత అహం లయం కావడం మొట్టమొదటి స్థితి — అవసరమైన సాధనం. అప్పుడు మాత్రమే ఈ చైతన్యవ్యక్తి సర్వోత్కృష్టమైన తన జీవాత్మను లేదా వాస్తవ స్వస్వరూపాన్ని కనుగొనగల్గుతాడు.

మన ప్రాపంచిక జీవనానికి కారణం స్వీయానుభవ ప్రేరణలో నమ్మించేలా చేసే అహం కాదు. అహం కేవలం మన ప్రాపంచిక జీవనవిధానం ఫలితం లేదా ఒక పరిస్థితి మాత్రమే. పరాధీన ప్రపంచంలో స్వతంత్ర మానసిక, భౌతిక అనుభూతి సాధ్యం కావడానికి అనేకాత్మక దివ్యపురుషుడు వైయక్తిక మనసులు, శరీరాల మధ్యా, ఆత్మరక్షణ, పరస్పర అవగాహన, దమనచర్యల మధ్యా ఏర్పరచిన సంబంధం మాత్రమే ఇది. బ్రహ్మ చైతన్యమే, మన నిజమైన ఆత్మ, సత్యమైన అస్తిత్వం.

ఈ మనస్సు, శరీరం మన నిజమైన ఆత్మ కాదు. అవి కాలగమనంలో గతశక్తుల సమాహార ప్రభావంగా మనం కల్పించుకునే అశాశ్వతమైన రూపాలు లేదా దృశ్యాలు మాత్రమే. ఈ శక్తులు గతంలో విగతజీవులై పడి ఉన్నట్లు అనిపించినా, వాటి చరిత్ర మననను వెంటాడుతూ ఉండటం వల్ల ఆకృతిలేని పదార్థసంచయంగా, భవిష్యద్వర్తమానాల్లో ఎప్పుడూ క్రియాశీలంగా ఉంటూనే ఉంటాయి.

అహం యొక్క కార్యకలాపం మన నిజమైన ఆత్మ కాదు. అహం విచక్షణాత్మక మనస్సుచేత ప్రతిపాదించబడిన శక్తి మాత్రమే. చక్రంలోని ఇరుసు చక్రపరిభ్రమణాన్ని పట్టి ఉంచినట్లుగానే, అహం తన చుట్టూ భౌతిక, మానసిక అనుభూతులను కేంద్రీకరించుకుంటుంది. ఇది కేవలం ఒక ఉపకరణం మాత్రమే. సాధారణ మానసిక స్థితికి పరిమితమై ఉన్నంతకాలం అదే మనోస్వభావానికి వశమై ఉంటూ, ఉపకరణాత్మక అహం ప్రయోజనాన్ని — ఆత్మగా — ఆత్మ విధివిధానంగా (function) పొరపడతాం.

*

వైయక్తిక విశిష్ట లక్షణాన్ని అధిగమించితేనే, నిజమైన దైవీసంభూత వ్యక్తులము అవుతాము. అందుకు అహమే దోహదకారి; అహమే అవరోధం.

*

అహం అని పిలిచే ప్రగాఢమైన ప్రత్యేక వేర్పాటు ధోరణితో కూడిన స్వానుభవం ఏది? దానికది ఏమాత్రం ప్రాథమిక సత్యం కాదు. ప్రకృతి చర్యలను కేంద్రీకృతం చేయడానికి మన చైతన్యం కల్పించిన ఆచరణాత్మక నిర్మాణం మాత్రమే అది. మిగతావాటి కంటె విభిన్నమైన మానసిక, భౌతిక, ప్రాణిక అనుభూతిగా దాన్ని గ్రహించవచ్చు. అందుకే ప్రకృతిలో 'మేము' అని వేరుగా భావిస్తాం. ఈ వైయక్తికత రూపాంతరీకరణలో భాగం. ఆ తర్వాత మనం అంటే ఏదో ఒక శక్తి సంతరించుకున్న

వ్యక్తిత్వంగా, వ్యక్తీకరణ పొందేవరకు మాత్రమే, మనగలిగేదిగా, ఒక తాత్కాలిక, అనిత్యమైన రూపాంతరీకరణగా భావిస్తాం. లేదా మనమే ఈ వ్యక్తీకరణకు కారకంగా, వ్యక్తిత్వ పరిధిలోని శాశ్వత సత్వంగా భావిస్తాం. ఈ రకమైన భావన — అవగాహన మన అహం వాసనగా చెప్పవచ్చు. సాధారణంగా మన వ్యక్తిగత అస్తిత్వ పరిజ్ఞానంలో ఇంతకంటె ముందుకు పోము.

కాని చివరగా మన ప్రత్యేక వ్యక్తీకరణ అన్నది ప్రత్యేక శరీరంలో జీవనాన్ని తాత్కాలికంగా ఉపయోగించుకునేందుకు ఏర్పడిన ఒక బాహిర నిర్మాణం, ఆచరణాత్మక ఎంపిక, పరిమిత చైతన్య సంలీనంగానో, లేదా జన్మపరంపరలో వివిధ శరీరాలలో ఎప్పుడూ మారుతూ వృద్ధిచెందే సంలీనంగానో గ్రహించాలి. దీని వెనుక ఒక చైతన్యం, ఒక పురుషుడు ఉంటాడు. ఈ ప్రత్యేకీకరణ లేదా సంలీన పరిమితి, వేర్పాటు అతనికి ఉండదు. కాని అందుకు భిన్నంగా అతను వీటికి సహకరిస్తూ, వీటిని నియంత్రిస్తూనే అధిగమిస్తాడు. ఈ సంలీనాన్ని ఏర్పరిచేందుకు దేన్నుంచి అతడు ఎంపిక చేస్తాడో అదే అతని ప్రాపంచిక సత్త్వ పూర్ణానుభవం. ఆ ప్రాపంచిక సత్వం వల్ల, ఆ సత్వం ప్రత్యేక వ్యక్తీకరణ సాధ్యానుభవం కోసం దాన్ని ఉపయోగించే చైతన్యం వల్లనే మన వైయక్తీకరణ సాధ్యమౌతుంది.

*

జీవితం మొదట అహంకార ప్రేరణ చుట్టూ వ్యవస్థీకృతమౌతుంది. ఈ అహం విస్తరీకరణ స్పందన వల్లనే మనుషులు పరస్పర సంబంధం కలిగి ఉంటారు. అల్పాత్మ అనంతాత్మతో సంయోగం పొందడానికి చేసే తీవ్ర ప్రయత్నాలలో మొట్టమొదటి అపరిపక్వ సాధనం కలిమి కోసం చేసే సంఘర్షణ కలసి ఉండాలనే ప్రేరణ, అవసరం నియంత్రించిన జీవనఘర్షణ యొక్క అరకొర వ్యవస్థ కలిగిన అయోమయమే అంతా. ఇతరులతో సంబంధం, సహవాసం, ఘర్షణ కోసం బలవంతంగా ముందుకు సాగటానికి వ్యక్తులు, తెగలు, సమూహాలు, విభాగాలు, జాతులు, భావాలు, నాగరికతలు, సంస్కృతులు, ఆదర్శాలు, మతాలు తమను తాము స్థిరపరచుకుంటూ సాగే ఘర్షణ అది. ప్రకృతి, అహాన్ని ఒక ముసుగుగా దించుతుంది. దానికి పరోక్షంగా వున్న ఆత్మ వైయక్తీకరణ కోసం శ్రమిస్తుంది. అనంతాత్మతో సంయోగం, సమైక్యం చెంది, తన చైతన్యంలోనే దాన్ని గుర్తించి, మిగతా సృష్టితో సమైక్యమై ఏకమయ్యేదాకా మూలంలో ఎదగాలని నిర్బంధిస్తుంది. ఈ ఎదుగుదలకు

సహకరించటానికి అల్పాత్మ ధృవీకరణ స్పందనలు, గమనాలను సరిచేసే అహం విస్తరణ, అహం అధిగమనం, అహం నిర్మూలక స్పందనలు — గమనాలను జీవనప్రకృతి తనలోనే వదులుతుంది. తన మానవసాధనంలో దయాదాక్షిణ్యాలు, ఆత్మహననం, ఆత్మత్యాగం, ఆత్మవిరక్తి, సర్వజనహితం, మనస్సు హృదయం, జీవనంలో విశ్వజనీనత వైపు గమనం వంటి స్పందనలను, స్వయంప్రకాశం సంకల్పశక్తినీ చరాచర సృష్టి అంతా ఆత్మమయం అన్న అస్పష్టభావనల మిణుకులను ఆపాదిస్తుంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: ఆచార్య యం. రాజగోపాలాచార్య

అహంకారపు పరిధి

తనను తాను సమర్థించుకోవడమనేది అజ్ఞానానికీ, అహంకారానికీ గుర్తు.
మరీ సున్నితత్వమనేది అహంకార ఫలితమే.
అవును. ప్రతివారిలోనూ ఉండే ప్రతిబంధకానికి అహమే కారణము.
గాఢవాంఛ ఎప్పుడూ గూడా ప్రాణికమునకు సంబంధించిన శక్తే.
సమతాభావ మున్నంత మాత్రాన అహం లేనట్లు కాదు, కానీ కాంక్ష, మమకారము లేదన్న మాట.
చివరకు కొంతమంది చూపే నమ్రత, పరహితభావన కూడా ఒక విధమైన అహంకార సూచనే.
కర్తృత్వభావన లేకపోవటమనేది దైవత్వం కాదు.

మానవుడు తన అసంపూర్ణతతో విసుగుచెందవచ్చును కాబట్టి, పాపభీతి అనేది అవసరము అయింది. అది అహంకారభావాన్ని సరిదిద్దటానికి భగవంతుడు చేసిన సర్దుబాటు. మనిషి తన అహంకారంతో ఇది వర్తించనట్లు చేసుకుని తన తప్పిదాలను చూసీ చూడనట్లుండి ఎదుటివారి తప్పిదాలను మాత్రం చక్కగా గమనిస్తాడు.

కాళీదేవి అంటే భయంకరమమైన శక్తిని ఉగ్రప్రేమనూ ప్రదర్శించే కృష్ణుడే, మనఃప్రాణశరీరాల్లోని ఆత్మను అనంతాత్మగా ముక్తి పొందించడం కోసమని వాటిని రౌద్రావేశంతో ఆమె హతమారుస్తుంది.

పరిపూర్ణమైన విశ్వదృష్టి, విశ్వభావన అనేది అన్ని పాపాలకు, బాధలకు నివారణ మంత్రము. కానీ మనుష్యుల్లో ఎక్కువ మంది వారి అహంభావ పరిధిని విస్తృతం చేసుకోవడంలో మాత్రమే కృతకృత్యులవుతున్నారు.

కర్మఫలాన్ని, ఫలాపేక్షనూ కూడా యజ్ఞకర్తకు అర్పించడం ద్వారా రాజసిక కోరికలమయమైన అహాన్ని వదులుకున్నప్పటికీ కూడా కార్యకర్త తాలూకు అహంకారాన్ని పదిలపర్చుకున్నట్లే. ఇంకా ఆ పనికి కర్తృత్వం మనమే వహిస్తున్నట్లు, దానికి ఆధారం మనమేనన్నట్లు, ఆమోదించేది కూడా మనమేనన్న భావనలో ఉంటాము. దాన్ని ఎంపికచేసి నిర్ణయించేది కూడా 'నేనే', ఇంకా దాని బాధ్యత వహించేది మంచిచెడులను అనుభవించేది అంతా 'నేనే' — అహమే.

*

కార్యకర్తననే అహం ఒక వేళ నశించినప్పటికీ, దాని స్థానంలో ఉపకరణపు అహం రానైనా రావచ్చు, లేక వేరే రూపంలో అదే కొనసాగవచ్చు.

*

సాధారణ మనస్సు, ప్రాణికములకు అవధులు లేకుండాపోయినప్పుడు వ్యక్తి అతి విస్తృతమైన, అతిశక్తివంతమైన చైతన్యాన్నీ, అపరిమితమైన సాధ్యతలనూ పొందుతాడు. అహంభావంతో ఇదంతా తన ప్రయోజకత్వమనుకున్నప్పుడు సాధారణ మానవుని కంటె అతని అహంభావం వెయ్యిరెట్లు పెచ్చుపెరిగి పోతుంది. అప్పుడిక భగవంతుని మహత్వాన్ని తన ఆధిక్యతను సమర్థించుకోడానికీ, చెప్పుకోడానికీ వాడుకుంటూ ఉండే ఆ పెద్ద 'నేను' ఉప్పొంగుపోతూ భువిసీమనే కాక దివిసీమలను కూడా నింపేస్తుంది.

*

సత్వగుణం, జ్ఞానానందాలకు కట్టుబడి ఉంటుంది. సాధారణంగా ఏదో కొంత అసంపూర్ణ సిద్ధితో, తన స్వంత సౌశీల్యభావనతో, తన నీతినియమాలు, తన అభిప్రాయాలు మొదలైనవాటి ఔచిత్యంతో, ఇతర్లను దృష్టిలో పెట్టుకొని పనిచేయడంలో వ్యక్తిగతభావాన్ని వ్యతిరేకిస్తూ, మనకి న్యాయము, ఉచితమని తోచినప్పటికీ భగవంతుని ఆజ్ఞ మేరకు అర్జునుని మాదిరిగా మన సంకల్పాన్ని ఆయనకే అర్పించడం మొదలైనవాటితో సత్వగుణం ముడిపడి ఉంటుంది. సాత్విక అహంకారాన్ని

తప్పించుకోవాలంటే సుకృత దుష్కృతాలు, పాపపుణ్యాలు అనే ద్వంద్వాలకు అతీతులమై యుండాలి.

ఆత్మ శరణాగతి కావాలని సాధకుడు సంకల్పించుకున్నప్పుడు ఇంకా శరణాగతి సంపూర్ణం కానంతవరకూ అతని అహం, తన మీద పనిచేస్తున్న ప్రతి గుణమూ కూడా ప్రత్యేకమైన హానినే కలిగిస్తుంది. రజోగుణం పనిచేస్తున్నప్పుడు సాధకునిలో స్వాతిశయం పెరిగిపోయి, "నేను గొప్ప సాధకుడనై బాగా పురోగమించాను, భగవంతుని చేతిలో నేను గొప్ప ఉపకరణమైనాను" అనే భావాలు ఉద్భవిస్తాయి. అలా కాకపోతే ఆ పనిలో అనురక్తిని పెంచుకొని దైవకార్యం కాబట్టి పూర్తిచేయాలనుకుంటూ తన శక్తిసామర్థ్యాలు ఉపయోగిస్తూ కష్టపడుతూ చివరికి భగవంతుని కంటే తనకే దైవకార్యంపై శ్రద్ధ ఉన్నట్లు తనే దాన్ని బాగా నిర్వహించగలనన్నట్లూ భావిస్తాడు.

మూలం: శ్రీఅరవిందులు

స్వేచ్ఛానువాదం: అమరవాది ప్రభావతి, అమరవాది వెంకటరామశాస్త్రి

అహంభావాన్ని ఎలా తొలగించాలి?

ప్రతి మనిషి, తెలిసోతెలియకో, విశ్వశక్తికి ఉపకరణము. అంతరంగంలోని దివ్యసన్నిధానము యొక్క ఉనికి తప్పించి, గర్వాహంకారాల అవివేక వర్తనమునకు ఆధారభూతమైన వివిధ చర్యల మధ్య మరియు సాధనముల మధ్య అంత కీలకమైన వ్యత్యాసము లేదు. జ్ఞానానికి, అజ్ఞానానికి మధ్య నుండే వ్యత్యాసము ఆత్మశక్తి యొక్క అనుగ్రహము; దివ్యశక్తి వీచికలు అది కోరుకున్న దిశగా ఆహ్లాదకరమైన చోట వీస్తూ నేడు ఒకదానిని, మరునాడు మరోదానిని, ఒక దివ్యభావముతోనో, లేక ఒక అంతర్గత శక్తితోనో నింపుతుంది. కుమ్మరి ఒక కుండను మరొక కుండ కన్నా మెరుగుగా తీర్చిదిద్దితే, ఆ యోగ్యత కుండకిగాక, దానిని చేసిన కుమ్మరికి చెందుతుంది. మన మనోవైఖరి, 'ఇది నా బలము', 'నాలోని దైవశక్తిని చూడు' అన్నట్లుగా కాక, ఒక దివ్యశక్తి ఈ మనస్సులోను, దేహములోను పనిచేస్తుంది. అదే శక్తి మానవులందరిలోను, పశువులోను, మొక్కలోను, లోహములోను,

చైతన్యవంతమైనవాటిలోను, జీవమున్నవాటిలోను, కంటికి కనిపించే అసత్ మరియు అచేతనా వస్తువులలోను పనిచేస్తున్నది, అనే విధంగా నుండాలి. అందరిలో మరియు విశ్వమంతటిలో పనిచేస్తున్నది ఆ ఒక్కడే అనే విశాల దృక్పథం దైవకార్యాచరణకు మరియు క్రమంగా చోటు చేసుకునే ఆత్మాభివ్యక్తతకు సరైన ఉపకరణమని మన అనుభవంలోకి సంపూర్ణంగా వస్తే, అది రాజసికమైన స్వార్థచింతనను మన నుండి తొలగించుటకు తోడ్పడుతుంది. సాత్విక అహంభావం కూడ మన స్వభావము నుండి వైదొలగిపోవుట ప్రారంభిస్తుంది.

*

మానవ ప్రకృతి అనే హారం అహం అనే సూత్రంతో నిబద్ధించబడి ఉంటుంది; ఎవరూ దాని నుండి తప్పించుకోలేరు. అది అతని ఆలోచనలకు, ఆచరణలకు ముందో వెనుకో నీడలా అంటిపెట్టుకునే వుంటంది. దానిని గమనించుట మొదటి మెట్టు. అహంకారభరిత కదలికలలోని కాపట్యాన్ని, మౌఢ్యాన్ని గుర్తించుట రెండవ మెట్టు. అడుగడునా దానిని నిరుత్సాహపరుస్తూ, తిరస్కరించుట మూడవ మెట్టు — కాని అది ఎప్పుడు పూర్తిగా తొలగిపోతుందంటే, ప్రతిదాని యందు మరియు ప్రతిచోట, ఆ పరమాత్మను (ఏకైకుని) సమానంగా చూచి, అనుభూతి పొంది, ఆతడే జీవితంగా మనుగడ సాగించినప్పుడు మాత్రమే సాధ్యపడుతుంది.

*

పట్టువదలకుండా తిరస్కరించకపోతే ఆహము నుండి విమోచన పొందుట సాధ్యము కాదు. ఊర్ధ్వముఖంగా ఆత్మానుసంధానతో పరమాత్మలోనికి యెదుగుతూ ఉంటే మనలోని ఉన్నతతర ఇంద్రియభాగాలకు విమోచన లభిస్తుందిగాని, అహం మాత్రము నిమ్నస్థరాలలోనే నిలిచిపోతుంది. ఈ విమోచన సాధించుటకు శక్తివంతమైన సాధనము ఏదనగా, చైత్యపురుషసత్తా ఆధిపత్యంలో ఉండటం అహాన్ని దృఢంగా నిరాకరించటం.

*

మానవుడు సహజంగా అహంకారి మరియు స్వార్థపరుడు. అహంకేంద్రంగా పనిచేసేవాడు. అతడు చేసేది, ఆలోచించేది, అనుభూతిచెందే అన్నింటిపైన అహంకారం యొక్క ముద్ర వుంటుంది. అతను తన ఉనికికి కేంద్రము అహము కాదు, దైవము అని గ్రహించి, ఆ దైవము గురించి మాత్రమే ఆలోచిస్తూ, ఆచరిస్తూ, అనుభూతి చెందుతూ వుండుట నేర్చుకునే వరకు — లేదా ఒక ఉన్నతతర లేక

దివ్యచేతనలోకి తాను ప్రవేశించే వరకు లేక దివ్యచేతనను తనలోకి ప్రవేశింపజేసుకునే వరకు — ఇది మరో విధంగా వుండదు, ఎందుకంటే, దివ్యచేతనలో అహంకారానికి చోటు వుండదు కనుక.

*

ఇంచుమించు ప్రతి ఒక్కరి సాధన యొక్క ప్రారంభదశ అహం కేంద్రస్థానంగా వుంటుంది. దాని ముఖ్యోద్దేశము ఎప్పుడూ, స్వీయసాధన, స్వయంకృషి, వ్యక్తిగత వికసనము, పరిపూర్ణత, సిద్ధికి సంబంధించినదిగ వుంటుంది. అధికశాతం వ్యక్తులలో, ఇది అనివార్యం ఎందుకనగా అలాంటి వ్యక్తిగత కృషి లోపించినట్లయితే ముందుగా చోటు చేసుకోవలసిన అత్యావశ్యక మార్పులకు తగినంత సంకల్పబలం, చొరవ కొరవడుతవి. కాని యివి ఏవీ కూడ — వికసనము, పరిపూర్ణత, సిద్ధి — అంతిమదశకు లేదా పరిపూర్ణతకు చేరుకోవు. అవి సుసాధ్యం కావాలంటే ఈ స్వార్థపూరిత వైఖరి దైవంపై కేంద్రీకృతమైనదిగాను, ఈ వికసనము, పరిపూర్ణత, సిద్ధి దివ్యచైతన్యపరమైనవిగాను మరియు దేహమునకు సంకల్పసాధనములుగాను పరివర్తన చెందినప్పుడే అది సాధ్యమౌతుంది. ఆ స్థితి ప్రాప్తించేదెప్పుడంటే, ఈ (అహంకారిక) విషయాలన్నీ అప్రధానములై, దైవభక్తి, దైవప్రేమ, దివ్యచేతనము, దివ్యసంకల్పములు ఏకైక లక్ష్య మైనప్పుడే. అపుడు ఇక మిగిలినదంతా దివ్యశక్తి యొక్క దివ్యసంకల్పసిద్ధి మాత్రమే.

*

కాని, ఈ విషయాలన్నింటిని అహము స్వాధీనపరచుకుని వాటని తన స్వప్రయోజనాలకు వినియోగించుకుంటున్నంత వరకు, ఏ విధంగా అవి దైవానికి చెందగలవు? ఆత్మార్పణము వాస్తవానికి అహము కేంద్రముగా ఉండే స్థితి నుండి దైవము కేంద్రముగా నుండే స్థితికి మార్పుచెందుట; అంతే కాదు, ఆ సమర్పణ ఎలాంటిదిగ వుండాలంటే చైతన్యము యొక్క ఆధారము పూర్తిగ మార్పుచెందుటకు దోహదపడేదిగ వుండాలి.

*

దివ్యశక్తి మరియు దివ్యజ్యోతి, చైతన్యమును పూర్తిగ వశపరచుకుని, దైనందిన స్వల్ప జీవనవిషయాలపై పట్టుబిగించే వరకు అవి చైతన్యమును అధికంగా ఆక్రమించకూడదు. పై పై చైతన్యపు పొరలకే పరిమితం కావాలి. వీటికి పెద్ద పీట

వేసేది అహము — ఈ అహముమ నిరుత్సాహపరచాలి — 'నా కోసము కాదు, దైవము కోసమే' అనే సూత్రము చైతన్యానికి, ఆలోచనాప్రక్రియకు మరియు ఆచరణకు ఒక శాసనంలా ప్రభవించాలి. ఇదంతా ఒక్క ఊపులో సమగ్రంగా సాధ్యపడదుగాని వీలైనంత త్వరగా మనసునందు బిగువు సడలని లక్ష్యంగా పరిణమింప చేసుకోవాలి.

*

కాని, నీవు మాట్లాడే అహము, అసలు ఏమిటి? ప్రతి ఒక్కరికి అహము వుంటుంది. రెండు విషయాలలో తప్ప దానిని పూర్తిగా వదిలించుకొనుట వీలుపడదు — అంతరంగంలో చైత్యపురుష వికసనము మరియు పైనుండి ఒక విశాలమైన నిరహంకార చైతన్యము యొక్క అవరోహణ. సత్యములో చైత్యపురుష వికసనము అహమును తక్షణమే తొలగించదుగాని దానిని ప్రక్షాళన చేసి, దానితోపాటు అన్ని కదలికలను దైవానికి అర్పించి, వ్యక్తిని ఆత్మార్పణ మరియు శరణాగతి ద్వారా అహంకారరహితుణ్ణి చేస్తుంది. ఆ సమయములోనే ఊర్ధ్వ ప్రకృతి తెరచుకుంటుంది. విశాలమైన నిరహంకార చైతన్యము క్రిందికి దిగివస్తుంది. అహము అంతరిస్తుంది. చైత్యపురుషశక్తితో దివ్యమాతలో భాగమైన నీ నిజసత్తా నీకు తెలియవస్తుంది. జగవలసినది యిదే కాని అంత స్వల్ప వ్యవధిలో సాధ్యపడదు. ప్రాణిక ప్రేరణ గురించి, అహమును గురించి అతిగా ఆలోచించకు — వాటిని నీవు గమనించావు. వాటి ఉనికి నీకు తెలియవచ్చింది. అది చాలు. ముఖ్యంగా, నీ హృదయాంతరాళంలో తెరుచుకున్నదానిపై కేంద్రీకరించు; దృఢనిశ్చయంతో పట్టువదలకుండా కేంద్రీకరించు. అదే మాదిరి ఆకాంక్షించు. ఇందుకు ఎక్కువ సమయం పట్టినా కూడ పట్టు వదలకు. అయినప్పటికి, హృదయపు లోతుల్లో నుండి నీవు పిలువ లేకపోవచ్చు. మరే విధంగానైనా పిలు — హృదయాంతర్గతమైన పిలుపు అపుడు వెలువడుతుంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదము: కైలాసపతి, జానకి

అహంకార సంవేదన నుంచి పూర్ణ విముక్తి

సత్వము అహం వైపు వేర్పాటు మార్గం వైపు మరలడం, అనేదాని మీదే అజ్ఞానం, బంధనాల ప్రభావాలతో కూడిన సంక్లిష్టమైన నిష్ప్రయోజన ప్రయత్నాలన్నీ ఆధారపడి ఉన్నాయి. అహంకార సంవేదన నుంచి స్వేచ్ఛను పొందనంతకాలం నిజమైన విముక్తి అనేది ఎవరికీ ఉండబోదు. అహం మూలస్థానం బుద్ధిలో ఉందని చెప్పబడింది. ఇది, వివేచన చేయడం మూలంగా ప్రత్యేకత కలిగినటువంటి వ్యక్తిత్వపరమైన మనోజీవన శరీరాలను వేరు అస్తిత్వపు ఉనికికి సత్యమనుకుని, దాని ఫలితంగా సమస్త అస్తిత్వపు ఏకత్వానికి సత్యప్రమాణమై అధికాధికంగా ఏది సామరస్యపరుస్తుందో దానికి వ్యతిరేకంగా మరలిపోతుంది. ఏ విధంగా చూసినా మనిషిలోని అహంభావమే తాను వేరే, తన మనుగడ వేరే అను అసత్యానికి ముఖ్యమైన ఆలంబన. ఈ భావనను పోగొట్టుకోవాలంటే, అందుకు విరుద్ధమైన ఏకత్వభావనలో, ఒకే ఆత్మగా, ఒకే ఆత్మశక్తి, ఒకే అస్తిత్వ స్వభావంగా నివసించడమే బలమైన మార్గము. అంత మాత్రంతోనే అది తనంతతాను సత్ఫలితం ఇవ్వదు. అహంకారం, ఈ అహంభావన, అహంబుద్ధితో, తాను బలోపేతం అయినా కొంత పెడసరంగా కూడుకుని లేదా గాఢావేశ వ్యామోహపూరిత మూర్ఖపు పట్టుదలలతో సాధారణమైన పనులను కొనసాగించేటటువంటి భావనామనస్సు, ప్రాణిక, శరీరాల ద్వారా అత్యంత శక్తివంతమవుతుంది. అహాన్ని మన నుంచి పూర్తిగా తరిమివెయ్యడం సాధ్యం అయ్యే పని కాదు. అది పూర్ణఫలితం ఇవ్వాలంటే ఈ పరికరాలన్నీ పరిశుద్ధికి నోచుకోవాలి. ఎందువల్లనంటే, వాటి పని స్వార్థపూరిత మూర్ఖపు పట్టుదలతో, లేదా, తమ వేర్పాటుధోరణిలో గీతలో చెప్పినవిధంగా, 'సముద్రంలో గాలికి ఊగాడే నావలాగా', బుద్ధి వాటివైపే లాగబడుతుంది. మానసికజ్ఞానాన్ని నిరంతరం మసకబారడం కాని, లేదా, తాత్కాలికంగా కోల్పోవడం కాని జరుగుతుంటే దానిని ఎప్పటికప్పుడు పునరుద్ధరించుకోవాలి. అది గ్రీకు పురాణాలలో చెప్పిన శిశీఫస్ (Sisyphus)అనే రాజుకి సంబంధించిన విరామం లేని శ్రమను పోలి వుంటుంది. ఇవి నిమ్నపరికరాలు కనుక, వాటి స్వార్థపూరిత కోరికలను, ఊహాపోహలను, ఇచ్ఛను, స్వార్థపూరిత వాంఛను, స్వార్థపూరిత ఆవేశాలను, బుద్ధితో పాటుగా తన స్వార్థపూరిత ఆలోచనలను, ఇష్టాయిష్టాలను పరిశుద్ధిచేయడం జరిగితే, అప్పుడు ఏకత్వమే

ఆధ్యాత్మిక సత్యజ్ఞానం కుదురుకోవడానికి గట్టి పునాది ఏర్పడగలదు. అప్పటిదాకా అహం పలు రకాల సూక్ష్మరూపాలు ధరిస్తుంది, మనం దాని నుంచి విముక్తుల మయ్యామనుకుంటాము, కాని నిజానికి మనం అది ఆడించినట్లుగా ఆడుతూండే దాని ఉపకరణాలము మాత్రమే; మహా అయితే మనం ఒక విధమైన మేధోస్థాయిని చేరి ఉంటాము. కాని అది నిజమైన ఆధ్యాత్మిక విముక్తి కాదు. అంతే కాకుండా, క్రియాశీలమైన అహంభావనను దూరంగా తరిమివేస్తే చాలదు, అది మనస్సులో ఒక విధమైన అచేతనస్థితిని తీసుకువస్తుంది, ఒక విధమైన ఉదాసీనతతో కూడిన వేర్పాటు అస్తిత్వపు జడప్రశాంతత అహంకారపూరిత క్రియాశీలత్వాన్ని ఆక్రమిస్తుంది, కాని అది కూడా నిజమైన విముక్తి కాదు. అహంకారిక బుద్ధి స్థానంలో, అతీత దైవం, విశ్వవ్యాపకుని, ఒకే ఒక స్థాపన జరగాలి.

ఈ విధంగా ఎందుకు చేయవలసి వస్తుందంటే, అహంకారబుద్ధి, స్థిరపడి, దాని పలు విన్యాసాలలో అహంకారాన్ని సుప్రతిష్ఠితం కావిస్తుంది. కాని ఇది మూలంలో మన ఆధ్యాత్మికసత్వము యొక్క వాస్తవానికి, సత్యానికిది దిగజార్పుడు, హీనస్థితి. సత్వము యొక్క సత్యము ఏమంటే — ఒక అతీత అస్తిత్వస్థితి ఉంది, సర్వోన్నత జీవాత్మ, కాలాతీత జీవాత్మస్థితి, ఒక శాశ్వతం, దివ్యం లేదా ఇప్పటి మానసిక ఆలోచనాధోరణుల కనుగుణంగా చెప్పవలసివస్తే, అన్నింటికి మించి పరమమైన 'దేవుడు'గా ఇక్కడ అంతర్లీనంగా, అన్నింటినీ తనలో ఇముడ్చుకున్న, అన్నింటినీ ప్రేరేపణచేస్తున్న, అన్నింటినీ పరిపాలిస్తున్న, ఒక గొప్ప విశ్వ ఆత్మ. వ్యక్తి శాశ్వత అస్తిత్వపు చైతన్యశక్తి తాలూకు సత్వము. ఆయనతో శాశ్వతంగా తన అంతరంగ అస్తిత్వంలో ఒకటిగా ఉన్నవాడు. ఈ సత్వాన్ని మేధస్సు గ్రహించగలదు. అదీ ఎప్పుడంటే, అది పరిశుద్ధి నొందినప్పుడు, ఆ సత్యాన్ని ప్రతిఫలించగలిగినప్పుడు, తాను దానిని వశం చేసుకుని మళ్ళీ అందించే పద్ధతిలో మాత్రమే. కాని దాని పూర్ణ సాక్షాత్కారం, జీవనం, సార్థకత అనేవి ఆత్మశక్తిలో జరగాలి. మనం ఆ ఆత్మశక్తిలో జీవిస్తే, మనకు ఆ విషయం తెలియటమే కాదు, అదే మన అస్తిత్వ సత్యమని గ్రహించగలుగుతాము. అప్పుడు వ్యక్తి ఆత్మశక్తిలో సంతోషాన్ని పొందుతాడు, ఆ ఆత్మశక్తి యొక్క పరమానందాన్ని అనుభవిస్తాడు, విశ్వం ఉనికిలోని ఏకత్వాన్ని, కాలరహితదైవంతో ఏకత్వాన్ని, సర్వప్రాణులతో ఏకత్వాన్ని పొందుతాడు. అదే అప్పుడు అహం నుంచి ఆధ్యాత్మిక విముక్తి పొందడమనేదానికి

అసలైన చరితార్థత. కాని ఆత్మ కనుక ఏ క్షణానైనా మానసిక పరిమితికి తల ఒగ్గితే అప్పుడది ఒక విధమైన వేర్పాటుతనానికి లోనవుతుంది. అది ఆ స్థితిలోని ఆనందాలను పొందుతుంది, కాని ఏ క్షణాన్నైనా అహంకారికబుద్ధి లోనికి, అజ్ఞానం లోనికి, ఏకత్వ విస్మృతి లోనికి దిగజారే ప్రమాదముంది. ఈ విధమైన వేర్పాటు భావనను లేకుండా చేసుకోవటానికి తనను తాను దైవభావనలో, సాక్షాత్కారానుభూతిలో మునిగిపోవటానికి ప్రయత్నాలు జరిగాయి. ఇది కొన్ని ఆత్మానందాన్ని ఆకాంక్షించే కఠినమైన ఆధ్యాత్మికరీతులలో పలు విధాలుగా ఆచరించబడుతూ ఉన్నది. అందులో పడేటటువంటి ఆ అధిక శ్రమనంతా వ్యక్తి అస్తిత్వాన్ని పూర్తిగా తుడిచిపెట్టటానికి మరలిస్తూ, వ్యక్తి అస్తిత్వాన్ని పూర్తిగా తోసిరాజని, వ్యక్తి, లేక, విశ్వసంబంధాలన్నింటిని సమాధిస్థితిలో లగ్నం చేయడం అనేది ఒక పద్ధతికాగా, మరి కొంతమంది ఈ లోకంలో కాకుండా దైవలోకంలో లీనమై విహరించడం లేదా నిరంతరంగా లీనం కావడం లేక తీవ్ర ఆకాంక్షతో ఆయన సన్నిధిలో జీవించడాన్ని అపేక్షించారు. దానినే సాయుజ్య, సాలోక్య, సామీప్య ముక్తిగా చెప్పారు. పూర్ణయోగంలో చెప్పబడిన మార్గం వ్యక్తి పూర్ణ అస్తిత్వాన్ని ఉత్థానపరచి, సమర్పించడం, ఆ విధంగా, మనం మన ఆధ్యాత్మిక ఉనికితో ఆయనతో ఏకం కావడమే కాకుండా, ఆయనలో మనం, మనలో ఆయన వసించడం జరుగుతుంది. ఆ విధంగా మొత్తం స్వభావం అంతా ఆయన సన్నిధితో నిండిపోయి, దివ్యప్రకృతిగా మారిపోతుంది. మనం దైవంతో ఒకటే ఆత్మశక్తిగా, చైతన్యంగా, జీవంగా, పదార్థంగా అయిపోతాము. అదే సమయంలో మన జీవితం, కదలికలు అన్నీ ఆయనలో జరగగా, ఆ ఏకత్వపు పరిపరివిధాల ఆనందాలను అనుభవించగలుగుతాము. అహం నుంచి దివ్యశక్తి లోనికి, దివ్యప్రకృతి లోనికి ఈ పూర్ణవిముక్తి ఇప్పుడు మనం ఉన్న స్థాయికి అనుగుణంగా పరిమితంగానే పూర్తవుతుంది. కాని, అది సంపూర్ణంగా జరగడం మొదలయేది మనం దివ్య ఆత్మజ్ఞానానికి ఉన్మీలనమై, అందులోకి ఎగబాకినప్పుడే. ఇదే విముక్తి నొందిన పరిపూర్ణత.


మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

సామాజిక అభివృద్ధి వలయంలో ఒక కొత్త మలుపు

మానవజాతి యొక్క ఒక ఆధ్యాత్మిక యుగం గ్రహించగలదీ సత్యాన్ని — యాంత్రిక పద్ధతులలో మానవుని పూర్ణునిగా చేయాలని అది ప్రయత్నించదు. అలాగే అతని అంగాంగాలని నిలువునా కట్టి ఉంచడం ద్వారా మానవుని నిటారుగా నిలబెట్టాలని ప్రయత్నించదు. మనుష్యుని ఉన్నత ఆత్మను — ఒక రక్షకభటునిలో, ఉద్యోగిలో, పరిపాలనాధికారిలో, సామాజికపాలనావ్యవస్థలో, లేదా శ్రామిక సోవియట్లలో — అది చూపదు.

దాని లక్ష్యం ఏమంటే — ఎంతవరకు వీలైతే అంతవరకు, ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా, మానవ బాహ్యజీవిత వత్తిడిని లేదా నిర్బంధాన్ని — దాని అవశ్యకతను తగ్గించడమే. ఎలా? వానిలోని అంతరాత్మను అంతరాత్మ యొక్క దివ్య నిర్బంధాన్ని జాగృతం చేయడం ద్వారా. 'అది' ఉపయోగించే ప్రాథమిక సాధనాలు ఈ లక్ష్యాన్నే కలిగి ఉంటాయి. కేవలం ఆధ్యాత్మిక వత్తిడి మాత్రమే కాకపోయినప్పటికీ, చివరకు ముఖ్యం 'అది' ఉపయోగించేది దీనినే — ఆధ్యాత్మిక నిర్బంధాన్నే. ఈ ప్రభావాన్ని ఒక ఆధ్యాత్మిక వ్యక్తి కూడ, తన చుట్టూ ఉన్నవారిపై ప్రయోగించగలడు. అలాంటప్పుడు, ఒక ఆధ్యాత్మిక సమాజం, ఇంకెంత ఎక్కువ పరిమాణంలో సాధారణ సమాజాన్ని ప్రభావితం చేయకలదు! మనలో అంతర్గత నిరోధం, ఒత్తిడి బాహ్యావ్యతిరేకత ఉన్నప్పటికీ, ఒక ఆధ్యాత్మిక సంఘం, 'వెలుగు' యొక్క నిర్బంధాన్ని, వత్తిడిని మనలో జాగృతం చేయడం; తన స్వంత నైజంతోనే దైవంలోకి ఎదగాలనే కోర్కెను, (ఇచ్ఛా) శక్తిని జాగృతం చేయడం — ఆధ్యాత్మిక సమాజం ద్వారా సాధ్యం కాగలదు. ఒక 'ఆధ్యాత్మిక స్వేచ్ఛావాది' కలగన్నట్లు ఏ సంఘంలో మనుష్యులంతా నిశ్చలగంభీరులై, స్వేచ్ఛగా ఉంటారో,అలాటి సమాజమే పరిపూర్ణ ఆధ్యాత్మిక సమాజం. అది అలానే ఎందుకుంటుందంటే, దాని యొక్క ప్రాథమిక షరతు పరితృప్తి కావింపబడి ఉంటుంది. ఆ స్థితిలో, ప్రతి మనిషి, తనకు తానే ఒక చట్టమై ఉండకుండా దివ్యశాసనానికి లోబడి ఉంటాడు. ఎందుకంటే అతడు — ప్రాథమికంగా — పరిపూర్ణంగా కాకపోయినప్పటికీ — తన స్వార్థప్రయోజనాలు, లక్ష్యాలు కొరకు బ్రతికే 'అహంకార' యతుడుగా ఉండడు. ఎందుకంటే, తన దివ్యన్యాయం కోసం దివ్యవాస్తవం (the Divine reality) లో నివసించే జీవాత్మగా



ఉంటాడు. అహంకార విముక్తుడుగా స్వస్వ దివ్యస్వభావం, స్వధర్మంచే నిర్దేశింపబడి జీవితం అతనిది అవుతుంది.

అయితే దానర్థం — భిన్నవ్యక్తుల విభిన్న చర్యలతో, విభక్తమై ఉండే మానవ సమాజం కాదు. ఎందుకంటే, ఆత్మయొక్క మూడవ పదమే (ముఖమే) ఏకత్వం (the third word of the Spirit is unity). ఆధ్యాత్మిక జీవితం — ఏ విశేషణాలు లేని వట్టి ఏకదళ పుష్పం కాదు. అది — చైతన్యంతో భిన్నదళాల సమాహారంగా ఉండే కుసుమం. ప్రతి మనిషి, తనలో నిక్షిప్తమై ఉన్న దివ్యసత్యము లోకి, తన వ్యక్తిగత సత్తా ద్వారా, ఎదగాల్సి ఉంటాడు. అందుచేత, ఇలా ఎదిగేటప్పుడు, — ఒక నిర్ణీత పరిమాణంలో పెరిగే స్వేచ్ఛ, ఆ సత్తాకు అవసరం. పరిపూర్ణ జీవితానికి, పరిపూర్ణ స్వేచ్ఛ, — ఒక చిహ్నం, ఒక షరతు కూడ. అంతే కాకుండా, ఏ దైవాన్ని ఈ విధంగా, (తన అహంకారపూరిత, వ్యక్తిగత సత్తా ద్వారా) తనలో దర్శిస్తూంటాడో — అదే దైవాన్ని, అందరిలోను దర్శిస్తాడతడు — ఒకే పరమాత్మగా. ఈ కారణంచే కూడా — ఇతరులలో మమేకత్వం, వికసిత సత్వానికి ఒక అవసరం. ఈ విధమైన పరిపూర్ణ ఐక్యత, పరిపూర్ణ జీవితానికి ఒక చిహ్నం, ఒక షరతు. తనలో భగవంతుని అన్వేషించి దర్శించటం మాత్రమే కాదు, ఇతరులలో కూడా భగవంతుని అన్వేషించి దర్శించటం; తన వ్యక్తిగత విముక్తి వ్యక్తిగత పరిపూర్ణతలను అన్వేషించుట మాత్రమే కాదు, ఇతరుల వ్యక్తిగత విముక్తి పరిపూర్ణతలను అన్వేషించుట: ఇదే — ఆధ్యాత్మిక సత్యము యొక్క పరిపూర్ణ న్యాయము. అలా కాకుండ — అన్వేషింపబడిన దైవత్వం — అందరిలో ఏకైకమై ఉంటున్న దైవం కాకుండ, తనలో వేరుగా ఉన్న దైవమైతే; లేదా — దైవాన్ని తన కొరకు మాత్రమే అన్వేషిస్తే — అప్పుడు నిజంగా వచ్చే ఫలితం — ఒక గొప్ప వైభవోపేతమైన అహంకారం కావచ్చు (a grandiose egoism). గోథే యొక్క ఒలింపియన్ అహంకారం, లేదా నిషే ఊహించిన టైటానిక్ అహంకారం, లేదా, వీటి దేనితోను సంబంధం లేని, ఒంటరి ఆత్మవిజ్ఞానం కావచ్చు; లేదా, ప్రపంచ దుఃఖం, కష్టాలతో సంబంధం లేని, ఎవరికీ అందని ivory tower జీవితం కావచ్చు. కాని ఎవరైతే అందరిలో దైవాన్ని దర్శిస్తారో, వారా భగవంతుని ఆరాధిస్తారు — స్వేచ్ఛగా, ప్రేమతో, అతడు తన స్వేచ్ఛనే గాక, అందరి స్వేచ్ఛను అన్వేషిస్తాడు; తన పరిపూర్ణతనేగాక, అందరి పరిపూర్ణతను, అన్వేషిస్తాడు. వైశ్వానిక వ్యక్తిత్వంలో తప్ప, అతడు తన

వ్యక్తిత్వాన్ని పరిపూర్ణతని అనుభూతి చెందడు. అతడు — తన కొరకు గాని, తన దేశము, సమాజము కొరకు గాని, తన వ్యక్తిగత అహంకారం కొరకు గాని, సమిష్టి అహంకారం కొరకు గాని జీవించడు. కాని అతడు జీవించేది వీటన్నింటికీ అతీతంగా ఉన్నతమైన దాని కొరకు, తనలో భగవంతుని కొరకు, విశ్వంలో దైవం కొరకు.

ఎప్పుడైతే మానవుని సాధారణ బుద్ధి — ఈ సత్యాల కనుగుణంగా జీవించడానికి సంసిద్ధమౌతుందో, ఎప్పుడైతే అది, త్రిముఖ ఆత్మచే ప్రభావితమై, దానిచే నడిపింపబడాలని కోరుకుంటుందో — అప్పుడే ఆధ్యాత్మిక శకం ప్రారంభమవడానికి సిద్ధమౌతుంది. దీనర్థం, ఇప్పటి వరకు మనం పరిశీలిస్తున్న, మళ్లీ మళ్లీ (వ్యక్తి అహంకారం చుట్టూ) పునరావృతమవుతున్న, అసంపూర్ణ సామాజికాభివృద్ధి వలయాలు — ఊర్ధ్వంగా తమ గమ్యం వైపుగా — ఒక కొత్త మలుపు తిరుగుతాయి.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: యస్. వై. సోమయాజులు

కాంతికిరణాలు

నిశ్శబ్దము:

పరిపూర్ణ నిశ్శబ్ద ధ్యానంలో సర్వం అనంతంగా విశాలత్వాన్ని సంతరించుకుంటుంది. ఆ పరిపూర్ణ నిశ్శబ్ద ప్రశాంతతలో దైవం, తన దేదీప్యమాన దివ్య వైభవకాంతిలో అవతరిస్తాడు.

అక్టోబరు 27, 1954

*

జీవాత్మ సర్వోత్తమంగా వ్యక్తమయేది నిశ్సబ్దంలోనే.

జూన్ 7, 1958

*

దైవంతో పరిపూర్ణ తాదాత్మ్యతా భావంతో కూడిన నిశ్శబ్దంలోనే నిజమైన అవగాహన కలుగుతుంది.

అక్టోబరు, 1969

ఆగష్టు 2010



శ్రీఅరవిందుల సందేశము

అఖిల

అఖిల భారత పత్రిక

విషయసూచిక

మొదటి భాగము

శ్రీఅరవిందుల సందేశం — పరిచయం	3
జీవితం ఒక భ్రాంతి కాదు	4
పృథ్వీ ప్రశ్నకి కీలక పరిష్కారం	6
పృథ్వీ పరిణామంలో తదుపరి సోపానం	7
విషణ్ణమానవ జీవన ధ్యేయం	8
మేలుకో, నిన్ను నీవు అధిగమించు, ఆవిష్కరించుకో	10
పాత యోగం, కొత్త గమ్యం	12
అతిమానస యోగానికి కీలక సూత్రం — ఆత్మార్పణ	15
దివ్యమాత అభివ్యక్తీకరణ	16

రెండవ భాగము

మతం గురించి శ్రీఅరవిందులు	17
సమాజము — వ్యక్తి	19
మానవ సమైక్యత	21
స్వతంత్ర భారతావనికి శ్రీఅరవిందుల సందేశం	23
భారతావనిలో పునర్వికాసం	27
సాధకులకు శ్రీఅరవిందుల సందేశం	29
ఉజ్వల భవిష్యత్తు	34
శ్రీఅరవిందుల పిలుపు	36

"నీ వహో! జడశిల నుంచి మేధోశిఖరానికి అధిరోహించావు.
అజ్ఞాత అలౌకిక అత్యున్నతాగ్రాలకు ఇక మరి మరలు."



శ్రీఅరవిందుల సందేశము

పరిచయం

ప్రకృతిలో జరుగుతున్న పరిణామంలోని ఆరోహణా క్రమంలో రాతి నుంచి వృక్షం, వృక్షం నుంచి జంతువు, జంతువు నుంచి మనిషి వచ్చాడు. ఈ పరిణామక్రమంలో మనిషి దశే చిట్టచివరిదని, ఇదే శిఖరాయమానమని, ఈ భూమి మీద మనను మించి ఉన్నతమైనది ఏదీ లేదని మనిషి భావిస్తున్నాడు. కాని అది పొరపాటు. అతని శారీరక స్వభావపరంగా అతను దాదాపు పూర్తిగా పశుప్రాయుడే. అతను ఆలోచించగల, మాట్లాడగల పశువే. అతని ప్రాపంచిక అలవాట్లలో, సహజాతాలలో అతను ఇంకా పశువుగానే ఉన్నాడు. ఈ అసంపూర్తి ఫలితంతో, నిస్సందేహంగా ప్రకృతి సంతృప్తి చెందదు. జంతువుకి — మనిషికి తేడా ఏ విధంగానో — అదే విధంగా మనిషికి — అతిమానసజీవికి అంతే తేడా ఉంది. అతిమానసజీవి బాహ్యంగా మనిషి రూపాన్ని పోలి ఉన్నా, అతని చైతన్యం, అజ్ఞానానికి బానిసగా ఉన్న మానసికచైతన్యాన్ని దాటి, సుదూరంగా అత్యంత ఉన్నతాలలోకి ఎదిగి ఉంటుంది. అటువంటి అతిమానసజీవిని మనిషి నుంచి తీసుకునిరావాలని ప్రకృతి కృషిచేస్తోంది.

ఈ సత్యాన్ని మనుష్యులకు బోధించుటకు శ్రీఅరవిందులు ఈ భూమి మీద కొచ్చారు. మానసికచైతన్యంకల మనిషి మధ్యంతరజీవి మాత్రమేనని శ్రీఅరవిందులు చెప్పారు. సామరస్యంగా, సౌందర్యవంతంగా, సంతోషంగా, పూర్తి స్పృహతో జీవితాన్ని జీవించగల ఒక కొత్త చైతన్యాన్ని, సత్యచైతన్యాన్ని మనిషి పొందటము సాధ్యమేనని శ్రీఅరవిందులు చెప్పారు. దానిని వారు 'అతిమానసము' అని పిలిచారు.

*

ఈ అతిమానసము తనలో స్థిరపరచుకొనుటకు, తనను ఆశ్రయించినవారు దానిని సాక్షాత్కరింపచేసుకునే విధంగా వారికి సహకరించుటకు శ్రీఅరవిందులు తన జీవితకాలాన్నంతా వెచ్చించారు.

*

శ్రీఅరవిందుల యొక్క ఈ పని — భూరూపాంతరీకరణ పరివర్తనలో సాటిలేనిది. నిరుపమానమైనది.

*

శ్రీఅరవిందులు ప్రపంచచరిత్రలో ఒక సిద్ధాంతబోధనకు, అతీంద్రియజ్ఞానానికి ప్రాతినిధ్యం వహించేవారుగా కాని వచ్చినవారు కారు. ఇది (అతిమానసశక్తి) ప్రత్యక్షంగా ఆ పరమాత్మ నుంచి వచ్చిన నిర్ణయాత్మక క్రియాశక్తి.

*

అతిమానసమైన ఒక కొత్తజాతి, కొత్త ప్రపంచం అభివ్యక్తమవుతుందని ప్రకటించుటకు శ్రీఅరవిందులు విశ్వేశ్వరుని నుంచి ఈ భూమి మీద కొచ్చారు.

*

మనోహరమైన భవిష్యత్ ప్రపంచాన్ని తప్పనిసరిగా సాక్షాత్కరింపచేసుకొనమని ప్రపంచానికి చెప్పుటకు శ్రీఅరవిందులు వచ్చారు.

ఒక ఆశను ఆయన కలిగించలేదు. ఉజ్జ్వలమైన దృఢవిశ్వాసాన్ని ఇచ్చారు. ఆ వైపుగా ప్రపంచం కదులుతోంది.

ఈ ప్రపంచం యాదృచ్ఛికమైన, దురదృష్టకరమైన సంఘటన కాదు. ఇది అద్భుతమైంది. అది తనను తాను ప్రకటించుకునే దిశగా ముందుకు సాగుతోంది.

సంతృప్తికరమైన సుందర భవిష్యత్ మీద దృఢవిశ్వాసం ఈ ప్రపంచానికి అవసరం. అందుకు శ్రీఅరవిందులు హామీ ఇచ్చారు.

మూలం: శ్రీమాత

అనువాదం: సిద్దులగారి త్రివేణి

జీవితం ఒక భ్రాంతి కాదు

జీవితం యాదృచ్ఛికం కాదు. క్రమరహితంగా కావింపబడని సృష్టి కాదు. నిర్లక్ష్యంగా క్రమరహితంగా జరిగిన సంఘటన కాదు. అది రహస్యంగా పరిపూర్ణంగా వున్న దివ్యసన్నిధి, తనంత తానే తనలో నిక్షిప్త దివ్యవాక్కుని తనతో తీసుకుపోతున్నది.

జీవితం ఒక గుడ్డి యంత్రం కాదు. ఒక ప్రయోజనం కాని, లక్ష్యం కాని లేకుండా ఎలాగో వచ్చి ప్రారంభమయిన ఉద్దేశరహిత చలనం కాదు. క్రమక్రమ వికసనంతో యింకా పూర్తిగా వికసించని సృష్టి ప్రత్యక్ష క్రమవిధానంలో అభివ్యక్తమైన అంతర్నిహిత దివ్యవాస్తవం.

జీవితం ఒక భ్రాంతి కాదు. నిష్కారణమైన మాయ కాదు. అనవసరమైన

అస్తిత్వము కాదు. అసలు అస్తిత్వమనేదే లేక, అలా ఉన్నట్లు అగుపించే భ్రాంతి కాదు. ఈ అద్భుతమైన విశ్వం తనకు తానే అభివ్యక్తమయిన మహత్తర దివ్యవాస్తవం.

*

కంటికి కనబడే సృష్టి అంతా శాశ్వతుని యొక్క కథావృత్తాంతం కాదు. అది ఆయన యొక్క వైభవోపేతమైన, ఎప్పటికీ వాడని ముఖము, శరీరము. అది తన ఆనందచైతన్య దీప్తి, శక్తి.

*

మనం పూజించే భగవంతుడు విశ్వానికి అతీతంగా వుండే దివ్యవాస్తవాన్ని సుదూరంలో వుండి శాసించేవాడు మాత్రమే కాదు. మన యెదుటనున్న, మనకి అత్యంత సమీపంలో వున్న దృశ్యప్రపంచమంతా సగం ముసుగులో వున్నది. జీవితమన్నది అపరిపూర్ణ దివ్యదృశ్య రంగం. ఇక్కడ యీ భూమీమ్మద, జీవితంలో, శరీరంలో ఇక్కడ మాత్రమే (ఇహైవ) అన్న ఉపనిషద్వాక్య ప్రకారం ఆ వాస్తవం యిక్కడే వున్నదానిని, ఆ ముసుగు తొలగించి పరిపూర్ణ దివ్యసాక్షాత్కారం పొందవలసింది మనమే. ఈ భూమీమ్మదే మనం, సర్వాతిశయ, మహత్తర అతీత కాంతిని, మధుర సత్యాన్ని మన చైతన్యానికి వాస్తవం కావించాలి, సాధించాలి. ఇక్కడే పొందాలి. ఎంత వీలైతే అంతగా ప్రకటించాలి.

*

తెలుసుకోవడానికి, తనంతట తాను కృతకృత్యుడు కావడానికి బుద్ధి, ప్రాణం, శరీర రూపాలలో అభివృద్ధిచెందుతు వికసించే ఆధ్యాత్మికశక్తియే మానవుడు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

పృథ్వి చిక్కు ప్రశ్నకి కీలక పరిష్కారం

(అంతర్లీన పరమాత్మ క్రమావిష్కారం)

ఈ నిశ్చేతనా పదార్థతత్వంలో అంతర్లీనమై, రహస్యంగా ఉన్న అతీతమానస చైతన్యస్ఫూర్తియే ఈ వ్యక్తమైన దృశ్యప్రపంచానికి కారణం. ఈ పృథ్వి యొక్క చిక్కుప్రశ్నకి కీలకమైన పరిష్కారం. క్రమంగా పరిణామం చెందే రహస్య అపరిమిత చైతన్యం ఒకటి, పైకి జడంగా కనిపిస్తూ అగోచరమైన (అత్యంత సూక్ష్మమైన) ప్రకృతి యొక్క స్వయంచోదకశక్తి ఒకటి. ఆ గొప్ప దైవం స్వయంగా కోరుకున్న ఆవాసం పృథ్వి. ఈ అంధకారంలో బందిఖానా లాంటి పృథ్వీజీవితాన్ని ఓ అద్భుతమైన దివ్యసౌధంగా స్వర్గానికి చేర్చగల కోవెలగా మార్చాలన్న అనాది సంకల్పమే పరిణామరహస్యం.

*

పరిణామం అన్నది పురోగమించే ఆత్మ యొక్క క్రమవికాసం. పదార్థచైతన్యం యొక్క స్థూలతత్వం నుంచి, ఈ వ్యక్తమైన మృగప్రాయమైన అస్తిత్వం నుంచి, క్రమంగా ఆత్మసాక్షాత్కారాన్ని పొంది వికసించడం.

*

పరిణామం యొక్క నిజమైన సారాంశం మరింత సౌష్టవమైన శరీరాభివృద్ధి పొందడం కాదు, లేదా మరింత సమర్థవంతమైన జీవితాన్ని పొందడం కాదు. ఇవి కేవలం సాధనాసామగ్రి, బాహ్యపరిస్థితులు మాత్రమే. పరిణామం పదార్థంలో జోగుతూ నడుస్తున్న (నిద్రాణమైన) చైతన్యం మేల్కోడానికి చేసే ప్రయాస, స్వేచ్ఛ కోసం పడే ఆరాటం, తనని తాను తెల్సుకుని, ఆ అనంత సంభావ్యతలకు విస్తృతంగా, తుదివరకూ, చిట్టచివరి అంతస్థులకు ఎదగాలన్న నిరంతర తపన, ఆకాంక్ష. పరిణామం రహస్యంగా ఉన్న ఆత్మయొక్క క్రమవికాసానికి స్వేచ్ఛకు, స్వీయ అభివ్యక్తికి చేసే ప్రయత్నం. ఆత్మ తన క్రమవికాసానికి, దివ్యత్వానికి, నిజతత్వానికి ఎదగడం.

ఈ పరిణామం యొక్క అంతిమ లక్ష్యం మానసికజీవి మనిషి కాదు. ఇది పరిణామం ఆశించే అంతిమ విలువ కాదు, లేదా అత్యంత ఉన్నతమైన చివరి అంతరార్థమూ కాదు. ప్రస్తుతం మానవుడు అసంపూర్ణత్వంతో ఉన్న అల్పజీవి.

ఈ ప్రకృతి పడే శ్రమకు అతడు మాత్రం తుది ఫలితం కాదు. మకుటాయమానంగా నిలిచి ఉండటానికి, ఇంకా అల్పుడు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: సత్యవాణి

పృథ్వీ పరిణామంలో తదుపరి సోపానం

ఈ సృష్టి బాహ్యరూపాల వెనుక ఏకైక, శాశ్వత మహాసత్యం ఉంది. అదే దివ్యచైతన్యం, అదే పరమాత్మ. అదే దివ్య అస్తిత్వం. ఈ అద్భుత సత్యాన్ని ప్రవచించిన వేదద్రష్టల ప్రబోధం నుంచే శ్రీఅరవిందుల దివ్య ప్రబోధం కూడా ప్రారంభమవుతుంది. సమస్త జీవులు ఏకైక పరమాత్మలో ఒక్కటిగా సమైక్యమై ఉంటారు. కాని చైతన్యంలో వేర్పాటు కల్గినందున, మనఃప్రాణ, శరీరాలకు ఆత్మను గూర్చి తెలియకపోవడం వల్ల, అజ్ఞానంతో వారు వేరైనట్లుగా ఉంటారు. ఈ అడ్డుతెరను తొలగించే సాధన ఒకటి వుంది. మనలోని, అందరిలోని, ఆత్మను, దివ్యత్వ మహత్వాన్ని సిద్ధింపచేసు కోవటం సాధ్యమే — ఒకరకమైన మానసిక విజ్ఞానినంతో కూడిక క్రమశిక్షణ వల్ల.

ఈ ఏకైకము, దివ్యచైతన్యము భౌతికపదార్థంలో నిబిడీకృతమై వుంది. అంతర్లీనమై భాసిస్తోంది. పరిణామం ద్వారా అది తనను తాను విముక్తం చేసుకొంటుంది. చైతన్యం నిశ్చేతనగా కనిపిస్తోంది. నిశ్చేతనగా మారిన పిమ్మట మరింత ఉన్నతంగా ఎదగడానికి స్వీయప్రయత్నం సాగుతోంది. అదే సమయంలో మరింత విస్తృతమై, మరింత పరిపూర్ణత్వ శిఖరాల వైపు వికాసంచెందుతోంది. చైతన్య విముక్త దశలలో ప్రాణం తొలి సోపానం. మనస్సు రెండవది. పరిణామం మనస్సుతో ఆగడం లేదు. మరింత మహనీయమైన, ఆత్మిక, అతిమానస చైతన్యంలోకి విడుదలకై నిరీక్షిస్తోంది.

అతిమనస్సు, దివ్య ఆత్మ — ఇవి పరిణామంలో తదుపరి సోపానం. చైతన్యమయ పురుషునిలో అధిష్ఠించిన మహాచ్ఛక్తి అది (Supermind). అప్పుడు మాత్రమే సృష్టి సర్వత్రా అంతర్నిక్షిప్తమై యున్న మహా దివ్యత్వం సంపూర్ణంగా తనను

తాను విముక్తం చేసుకుంటుంది. అప్పుడు జీవితం దివ్య పరిపూర్ణత్వాన్ని ఆవిష్కరిస్తుంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె. యజ్ఞన్న

విషణ్ణ మానవ జీవన ధ్యేయం

మనిషి జన్మ పరిణామం ఒక సంధి దశలో ఉన్నది. అది అంతిమ ఫలావస్థ కాదు. అతనికి పైన – అతనిలో ఊర్ధ్వారోహణ చేయటానికి అనుగుణమైన దేదీప్యమాన మానసం ఒకటి ఉన్నది. అదే అతిమానస దశ.

సృష్టి పరిణామంలో మానవజన్మ కదే ఫలావస్థ. అదే మన లక్ష్యం. ఈ బాధామయ జీవితానికి మనసత్య కామన కదే చరమావస్థ. అది అవశ్యం కావాలి – తప్పక జరుగవలసినది. ఎందుకంటే మన చేతనలో గుప్తంగా నున్న సంకల్పబీజం — సృష్టి పరిణామగత తర్కం.

మనిషి మనస్సన్న పంజరంలో చిలుకలాగా ఉన్నాడు. అది అపరిపూర్ణ సంధిగ్ధ దశ. అతని శారీరక చేతన పరిపూర్ణం కాదు. పరా మానవదశ అలా కాదు. అతని చేతన శరీరాన్ని స్వతంత్రంగా, స్వేచ్ఛగా వినియోగించుకొంటుంది. దివ్యశక్తుల క్రీడకది చాలా అనుగుణంగా మసలుకొంటుంది. ఆ శక్తుల కది దృఢమైన ఆధారం. కాంతిమయ సాధనం. దివ్యశక్తులు పదార్థ జగత్తులో చేయవలసిన కార్యాల కది క్రీడాంగణం.

అతిమానసం స్వతః అనంత ప్రజ్ఞాపాలనలో విహరించగలదు. దివ్యసంకల్పాని కది పెన్నిధి. దాని మూలంలో క్రియావంతమైన చేతనాశక్తి ఉన్నది. అది దివ్యవిజ్ఞానరాశియైన సృష్టికర్తకు సంబంధించినది. అతిమానసావస్థ తన సహజమైన ఉన్నతదశకు మెట్లపై ఎక్కటం కాదు. మానవౌన్నత్యాని కది చిటారుకొమ్మ కాదు. జ్ఞాన-శక్తి-ప్రజ్ఞ-సంకల్పం-శీలం-ప్రతిభ-క్రియాచేతన. ....పరిశుద్ధ-పరిపూర్ణాదుల శ్రేష్ఠ దశా కాదు. మరేదంటే ఆ పరాచేతన – మానసిక మానవస్థితి కలితమైన బృహత్ చైతన్యం. అది ఊర్ధ్వచేతన కంటె అతీతం. ఇది మానవస్వభావానుగుణస్థితి మాత్రమే.

మనిషి గొప్పతనం తానున్న స్థితిలో లేదు. పెరగవలసిన దశలో ఉన్నది. అతని మహత్త్వం గుప్తసంకేత స్థలం — రహస్యశిల్పశాల. అదొక కర్మాగారమనుకొంటె అందులో ఒక మహాశిల్పి, తాను మలచబోయే అతిమానసచేతన అన్న శిల్పం తయారౌతుంది. ఇదే ఆ శిల్పశాల.

ఈ స్థితి క్రింది లోకానికి చెందినది కాదు. ఒక మహోజ్వల దివ్య చైతన్యావస్థను సిద్ధింపచేసే దివ్యజ్ఞాననిధియైన శిల్పి చేతిలో మట్టిబొమ్మ. ఈ ఊర్ధ్వగమనంలో ఆ మహాశిల్పి కతడు అనుకూలంగా ఉండాలి, సంకల్పించాలి. ఆ మహాసంకల్పానుగుణంగా ప్రవర్తించాలి. ఆలోచించాలి. ఈ దృష్టి లేకపోతే మట్టిమనిషి బంగారుమనిషి కాలేడు. అసంపూర్ణ మానవుడు పరిపూర్ణుడు కాలేడు. అతని సంకల్పం ఆ మహా అతిమానసశిల్పికి ప్రతిధ్వనియైన భూదేవి పిలుపు.

ఈ పిలుపునకా పరమచైతన్యం సమాధానంగా స్పందిస్తుంది. ఆ పవిత్ర ఘడియ దివ్యలక్షణం ఆ మహాకాంతిమయపరిణతికి నిత్యం సిద్ధంగానే ఉంటుంది.

ఈ జగత్సర్వస్వం భగవంతునిలోనే కదిలే పెద్ద కదలిక — మహాగతి. మనమా దివ్యచేతన లోని కేంద్రాలము — గ్రంధులం. ఇవి ఆ పరమేశ్వర మహాగతికి దాసోహం కావటం. ఈ విశ్వమా పరమాత్మ ఆనందావర్తం. ఒక శివతాండవం. అతడే ఉన్నది — ఆనందం, స్వేచ్ఛా, పరిపూర్ణశక్తిగా ఉన్నాడు. మనమో అతని క్రీడలో సఖులు, చెలికాండ్రము. కృష్ణసఖులమైన గోపాలకులం మాత్రమే. ఈ జగత్తు ఒక సూత్రం. ఒక ఛందోవలయం — ప్రహేళికాజాలం. అవన్నీ అతనినే వ్యక్తీకరిస్తూ ఉన్నవి. ఎక్కడ ఉండటం? అతని మహాచైతన్యంలోనే. అంటే వాటికి మట్టినేల ఆధారం కాదు. మనం లోపల ఆ మహాచైతన్యమౌతూనే బాహిరముగా ఆ సూత్రం — ఛందోగతిలో స్వరాలు — ప్రతీకలుగా ఉంటున్నాం. కాబట్టి మనమాతని క్రీడను కొనసాగించాలి. అతని క్రీడలో భాగస్వాములం కావాలి. అతని గణితసూత్రాలను విప్పుకోవాలి. అతని స్వర సంగతులలో స్వరం కావాలి. అతని సృష్టికి దోహదకారులం కావాలి. ఇదే వానికి మనం సహవాసులమంటే. ఇదే మన ఆనందం — పూర్ణకామన, ఈ లక్ష్యం దృష్ట్యా విశ్వాన్ని పరిణమింపచేయాలి — ఆ మహాక్రీడలో పాల్గొనడమే విశ్వగతికి దోహదం చేయటమంటే.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: తుమ్మపూడి కోటేశ్వరరావు

మానవాతీత పురుషుడు కావడం — భగవత్తత్వాన్ని ప్రసరించే సంపూర్ణ పాత్రగా మారడం — ఇదే నీ పని. నీ సత్త్వలక్ష్యం. ఇందుకోసమే నీ విక్కడికి వచ్చావు. మిగతా అంతా నిన్ను నువ్వు సన్నద్ధం కావించుకోవడం లేదా ఆ మార్గంలో ఆనందాన్ని పొందడం లేదా ఆ లక్ష్యాన్నుండి పతనం కావడం మాత్రమే. నీ గమ్యం, నీ లక్ష్యం ఇవే. ఆ పయనంలోని శక్తి, ఆనందాలు కావు. నీ సత్త్వ విశిష్టత, సంతోషం అంతా నీ గమ్యపు ఆనందంలోనే ఉంది. నిన్ను గమ్యానికి చేర్చేది నీతోనే ఉండటం వల్లా నీ శిఖరాలను నువ్వే అధిగమించేందుకు వీలుగా ఆరోహణాశక్తినీ నీకు ప్రసాదించడం వల్లా, నీకు మార్గంలో ఆనందం లభిస్తున్నది.

నీ కొక నిర్దేశిత కర్తవ్యం అనేది ఉంటే అది ఇదే. నీ లక్ష్యం ఏది అంటే ఇదే. సంతోషం కావాలంటే ఇంతకు మించింది లేదు. మిగతా అన్ని ఆనందాలు విచ్ఛిన్నమయ్యేవే లేదా పరిమితమైనవే. చెప్పాలంటే అవి అన్నీ స్వప్న సుషుప్తి, ఏమరుపాటు లాంటివి. కాని ఇది మాత్రం నీ సంపూర్ణ సత్త్వపు ఆనందం. నీ సత్త్వం ఏదంటే ఇదే. ఇదే నీ దివ్యత్వం. మిగతా అంతా ఛ్ఛిన్నమయ్యేదే. లేదా దాని వికృతరూపమే. నవ్వు అన్వేషించే దివ్యసత్యం ఇదే. నీ ముందు దీన్ని ఉంచుకో. అన్ని విషయాల్లో దీనికి విధేయుడుగా ఉండు.

తెరలోంచి చూస్తూ తెరనే ముఖమని భ్రమించేవారు నీ లక్ష్యం నిన్ను నీవు ఆవిష్కరించుకోవడమని, స్వాభావికంగా మనిషి తనను తాను అధిగమించడం అనీ చెప్పటం ఉచితమైనదే. ఇది నిజంగా అతని స్వభావమే. నిజంగా తనను తాను అధిగమించుకోవడమనేదే దివ్యలక్ష్యం.

మేలుకో — నిన్ను నీవు అధిగమించు — నిన్ను నీవు ఆవిష్కరించుకో. నీవు మనిషివి కదా. మనిషి పూర్తి స్వభావం తన పరిధిని తానధిగమించిపోవడం మొదట మనిషి పశుప్రాయుడు. తర్వాత ఆ స్థితిని అధిగమించాడు. ఆలోచనాపరుడు, నేర్పరి, సత్యాన్వేషకుడు, అయాడు. ఆలోచనాపరుడుని మించి జ్ఞానదృష్ట కావాలి. నేర్పరిగానే గాక అంతకు మించి సృష్టికర్త, సృష్టిభర్త కావాలి. సత్యాన్వేషకుని మించిపోవాలి. అన్ని ఆనందాలనూ, సౌందర్యాలనూ ఆనందించాలి. మనిషి భౌతికంగా ఉన్నపుడు శాశ్వత పదార్థాన్ని అన్వేషిస్తాడు. ప్రాణికంగా ఉండి తన సత్త్వపు

అతీతశక్తిని, అజరామర జీవనాన్ని అన్వేషిస్తాడు. జ్ఞానాన్ని మేధస్సుకు పరిచితం చేసి సాక్షికజ్ఞానం కలిగి ఉన్నప్పుడు, సంపూర్ణ ప్రకాశాన్నీ, సంపూర్ణ దృష్టినీ అన్వేషిస్తాడు.

వీటిని పొందడమే అతిమానస పురుషుడు కావడం. మనస్సు నుంచి అతిమానసం వైపు జాగృతం కావడం. దివ్యమానసం, దివ్యజ్ఞానం లేదా అతిమానసం — ఏ పేరుతో పిలిచినా అదే దివ్యసంకల్పం, దివ్యచైతన్యాల శక్తీ, ప్రకాశం.

పరమాత్మ అతిమానసంతో దర్శించి ప్రపంచాల్లో తనను తాను సృష్టించుకొన్నాడు. అందులో జీవిస్తూ, దాన్నే నియంత్రిస్తున్నాడు. ఈ అతిమానసంతోనే అతను స్వరాట్ సామ్రాట్, స్వయంపోషకుడు, సర్వపాలకుడూ అయ్యాడు.

అతిమానసమే అతిమానసవ్యక్తి. కాబట్టి మనసును అధిగమించడమే ప్రముఖమైన స్థితి.

అతిమానస మానవుడు కావడం అంటే దివ్యజీవనాన్ని గడపడం, దైవం కావడం. దైవాలంటే దైవీశక్తులు. మానవత్వంలో దైవీశక్తి రావాలి.

దివ్యజీవనాన్ని గడపడం, పరమాత్మ చైతన్యాన్నీ, బ్రహ్మానందాన్నీ, సంకల్పాన్నీ, జ్ఞానాన్నీ నీలో ఆవహించుకోవడం, నీతో వినోదించడం, నీ ద్వారా ప్రసరించడం — ఇదే పరమార్థం.

ఇదే పర్వతశిఖరంపై నీ రూపాంతరం. అంటే నీలో పరమాత్మను ఆవిష్కరించడం — సర్వత్రా అతన్ని దర్శించడం. ఆయన సత్త్వంలో జీవించడం, ఆయన ప్రకాశంలో ప్రకాశించడం, ఆయన శక్తితో ప్రవర్తించడం, బ్రహ్మానందంలో తరించడం. ఆ అగ్ని, ఆ సూర్యుడు, ఆ సముద్రం కావడం. ఆ ఆనందం, ఆ ఔన్నత్యం, ఆ సౌందర్యం కావడం.

దీన్ని నీవు సాక్షికంగా సాధించినా, అతిమానుషత్వం వైపు నీకిది మొదటి మెట్టు సాధించటం అవుతుంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: ఆచార్య. యమ్. రాజగోపాలాచార్య

పాత యోగం — కొత్త గమ్యం

(తన సోదరుడు బరీన్‌కు 1920 ప్రాంతంలో, బెంగాలీ భాషలో శ్రీఅరవిందులు వ్రాసిన లేఖ నుంచి గ్రహించబడినది)

దేనితో ప్రారంభించా నేను, 'లేలే' ఇచ్చినదేమిటి నాకు, ఏమి చేసా నేను జైల్లో — అదంతా — వెదుకులాట, 'దారి' కొరకు, చుట్టూ తిరుగుట — ఇక్కడికి, అక్కడికి చూస్తూ, తాకుతూ, పట్టుకుంటూ, ఉపయోగిస్తూ, పరీక్షిస్తూ — దీనిని, దానిని — పాత పాక్షికయోగాలన్నిటినీ — కొంచెం ఇంచుమించుగా — ఒకదాని సంపూర్ణానుభవం పొందడం, దానిని వదలి వేరొకదాని నన్వేషించడం — ఇలా. తర్వాత — ఎప్పుడైతే నేను పాండిచ్చేరి వచ్చానో, అప్పుడే ఆ అనిశ్చితస్థితి తొలగింది. 'అంతర్యామి', 'విశ్వగురువు' నాకు చూపారు నా దారిని — సంపూర్ణంగా — దాని పూర్తి సిద్ధాంతంతో.

పాతయోగంలో లోపమేమిటంటే — అది — బుద్ధిని, దాని తర్కాన్ని తెల్సుకుని, ఆత్మను తెల్సుకున్నాక, బుద్ధి పొందే ఆత్మానుభవంలో సంతృప్తి చెందింది. కాని, బుద్ధి, అఖండునిలో కొద్ది భాగాన్ని మాత్రమే గ్రహించగలదు. అనంతుని పూర్తిగా గ్రహించలేదు. బుద్ధి, అనంతుని పొందే మార్గమేమంటే — సమాధిలో పారవశ్యస్థితి ద్వారా, మోక్షంలో స్వేచ్ఛాస్థితి ద్వారా, నిర్వాణంలో ఏదీ మిగలనిస్థితి ద్వారా; ఇలా చెప్పొచ్చు. దానికి ఏ ఇతర మార్గాం లేదు. ఇక్కడా, అక్కడా, ఎవరో ఒకరికి, నిజంగా, ఏ విశేషణాలు లేని — విముక్తి లభించి ఉండవచ్చు. కాని దాని వల్ల లాభం ఏముంది? ఆత్మ లేదా దైవం, ఎప్పుడూ అక్కడే ఉంది. దైవం మనిషిని కోరేదేమంటే, — ఇక్కడే, వ్యక్తిలోను, సమిష్టిలోను, భగవంతుని పొంది, వాని రూపాలుగా ఉండమని; జీవితంలో భగవంతుని పొందమని. పాతయోగ వ్యవస్థలు ఆత్మను (భగవంతుని), జీవితాన్ని సమన్వయం చేసి ఐక్యం చేయలేకపోయాయి. అవి ప్రపంచాన్ని ఒక మిథ్య లేదా భగవంతుని తాత్కాలిక క్రీడగా భావించాయి. ఫలితంగా జీవితం శక్తిహీనమయింది. దేశం పతనమైంది. కొద్దిమంది విరాగులు, సన్యాసులు, పవిత్రమూర్తులు, సిద్ధులు, ముక్తి పొంది — కొద్దిమంది భక్తులు, పారవశ్యంతో, దైవం మత్తులో ఆనందతాండవం చేసి — మిగిలిన జాతి అంతా, జీవితం, తెలివిలేకుండా — జడత్వం, చీకటి లోతులలో మునిగిపోతే — అది ఏ

రకమైన ఆధ్యాత్మిక పరిపక్వత అవుతుంది? మొదట బుద్ధి స్థాయిలో ప్రతి ఒక్కరు, సాక్షిక అనుభవాలు పొందాలి; అతని బుద్ధి కాంతివంతమవాలి, ఆధ్యాత్మికకాంతితో, ఆధ్యాత్మికానంద వెల్లువ అతని బుద్ధిపై ప్రవహించాలి. తర్వాతే ఊర్ధ్వదిశగా పురోగమనం. ఈ విధంగా, పైకి — అతిమానసస్థాయి వరకు, ఆరోహణ జరిగితేనే తప్ప — ప్రపంచ అస్తిత్వం యొక్క తుదిరహస్యం, తెల్సుకునే అవకాశం లేదు; అది పరిష్కరింపబడదు. అక్కడ — అతిమానసస్థాయి వద్ద — ఆత్మ, ప్రపంచము; ఆత్మ, జీవితం — అనే ద్వంద్వాలతో కూడిన అవిద్య — విశ్వవ్యాప్త అవిద్య — నిర్మూలింపబడ్తుంది. అప్పుడీ ప్రపంచాన్ని, ఎంత మాత్రము, 'మిధ్య' గా చూసే అవకాశం ఉండదు. ఈ ప్రపంచం — భగవంతుని నిరంతర క్రీడ, ఆత్మ యొక్క నిరంతర వ్యక్తీకరణం.

*

పాతకాలపు సంప్రదాయాలు — వాటి స్థానంలో అవి గొప్పవే చాలా గొప్పవే. కాని వాటిని మనం — కేవలం అలానే తిరిగి ఎందుకు చేస్తుండాలి; అంతకంటె కొంత ముందుకు ఎందుకు పోకూడదు? భూమిపై మానవ ఎరుక యొక్క ఆధ్యాత్మికాభివృద్ధిలో — అత్యున్నత గతాన్ని అంతకన్న ఉన్నతతమమైన భవిష్యతున్తు అనుసరిస్తూ పురోగమించాలి.

ఇతర యోగాలన్నీ ఈ జీవితాన్ని 'మిధ్య' లేదా మారుతుండే 'దశ' గా భావించాయి. అతిమానసయోగం మాత్రమే జీవితాన్ని దైవంతో సృష్టింపబడినట్లు భావిస్తుంది. జీవితం యొక్క, దేహం యొక్క, సఫలత, సంతృప్తే లక్ష్యంగా — తాను (దైవం) వానిలో క్రమంగా ప్రగతిమార్గంలో అభివ్యక్తమవడానికి. దివ్యత్వమును ఎరుకపర్చుకోవటమే అతిమానసం. దాని అవతరణలో అది ఏం తెస్తుందంటే — జీవితం యొక్క సంపూర్ణ సత్యాన్ని. ద్రవ్యంలో సంపూర్ణ సత్యచేతనను. దేహం, జీవితం పొందగల అత్యున్నత ఆనందం — ప్రాణికబుద్ధి, లేదా నరములు, కణముల యొక్క స్వల్పవ్యవధి ఉద్రేకమే. ఇది పరిమితము, అపరిపక్వము, త్వరగా పోవునది. కాని, అతిమానస మార్పులో — అన్ని కణములు, నరములు, జీవశక్తులు, రూపుదాల్చిన బుద్ధి యొక్క శక్తులు — ఇవన్నీ వేయిరెట్లు ఆనందంతో నింపబడ్తాయి. ఆ ఆనందస్థాయి వర్ణనాతీతము, త్వరగా పోయేది కాదు. అతిమానసప్రేమ అంటే — గాఢ ఐక్యత — ఆత్మలో ఆత్మ, బుద్ధితో బుద్ధి, జీవితంతో జీవితం — భౌతికంగా

ఏకత్వానుభవంతో కూడిన, సంపూర్ణ శరీర ఎరుక యొక్క వెల్లువ — శరీర అన్ని భాగాల్లో, కణాల్లో, ప్రియుని ఉనికి అనుభూతిచెందడం — ఇలా — ఎంతైన చెప్పొచ్చు. ప్రస్తుతానికిది చాలు.

*

పూర్ణయోగమంటే ఏమిటి? భగవంతుని సంపూర్ణంగా పొందడానికి, ఆత్మానుభూతి సంపూర్ణంగా పొందడానికి, మన సత్తా మరియు ఎరుక, సంపూర్ణ సఫలత పొందడానికి, మన నైజం సంపూర్ణంగా పరివర్తన చెందడానికి, ఇంకా ఇందులో ఇమిడి ఉన్నది — ఇదే ఆ మార్గం. జీవితం యొక్క సంపూర్ణ పరిపక్వత, ఇక్కడే — కాలాతీత పరిపక్వత వేరే చోటికి పోయి పొందేది కాదు. ఇదే — ఆ లక్ష్యం: దీనిని పొందే పద్ధతిలో కూడ అదే పూర్ణత్వం. ఎందుకంటే, లక్ష్యం యొక్క పూర్ణత్వం, పద్ధతిలో కూడ లేకపోతే, ఆ లక్ష్యం సాధింపబడదు. మన సత్తా, దాని నైజం, దాని అన్ని భాగాలు, పద్ధతులు, కదలికలు — అన్నీ — సంపూర్ణంగా మలుపు తిరగాలి, తెరుచుకోవాలి, ఆత్మార్పణ కావించుకోవాలి, తమ లక్ష్యం వైపు. మన బుద్ధి, ఇచ్ఛ, హృదయం, జీవితం, దేహం, మన బాహ్యాంతరాలు, లోలోపల అస్థిత్వం; మన అతి మానస, అంతరమానస, — అంతేకాక, మన చైతన్య భాగాలు, అన్నీ, తప్పనిసరిగా — వినియోగించబడాలి; సాధనాలు కావాలి ఈ లక్ష్యానికి, పరివర్తనకు, క్షేత్రం కావాలి. అంతే కాకుండా — మానవచైతన్యం, నైజం నుంచి దైవచైతన్యం, నైజం వైపుకు, వెలుగు వైపుకు అవన్నీ మారాలి. ఆ మార్పుకు భాగస్వాములు కావాలి. ఇదే పూర్ణయోగ తత్వం.

*

ఈ యోగం — సత్వము యొక్క పరివర్తన యోగం; దైవాన్ని లేదా అంతరాత్మను పొందే యోగం మాత్రమే కాదు. కాని ఆ పొందుట ఈ యోగానికి పునాది. అది లేకుండా, ఎట్టి పరివర్తన సాధ్యం కాదు. ఈ పరివర్తనలో నాల్గు అంశాలున్నాయి: 1) చైత్యపురుషసత్వము యొక్క ఉన్మీలనము, 2) అతీంద్రియశక్తి ద్వారా పయనం, 3) ఆధ్యాత్మిక విముక్తి, 4) అతిమానస పరిపూర్ణత. ఈ నాల్గింటిలో ఏ ఒక్కదానిని

సాధించలేకపోయినా, ఈ యోగం అసంపూర్ణంగా ఉంటుంది. చైత్యపురుష అంటే, నా అర్థం — అత్యంత లోలోపలి జీవాత్మ స్వభావం.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: యస్. వై. సోమయాజులు

అతిమానసయోగానికి కీలక సూత్రం ఆత్మార్పణ

అతిమానసయోగ విధానంలో జీవాత్మ దైవాభిముఖంగా ఆరోహణ సాగించటం, దైవం భౌతికంలోనికి అవరోహించటం ఏకకాలంలో జరుగుతుంది. దివ్యచైతన్య దిశగా ఆరోహించాలంటే శారీరక, మానసిక ఆధ్యాత్మిక స్థాయిలలో విస్తృతము, కేంద్రీకృతము, నిరంతరము అయిన పరిపూర్ణ సత్యము యొక్క పిలుపు, ఆకాంక్ష నిత్యానంత దైవం దిశగా సాగాలి. ఇది ప్రవర్థమానం అవుతూ భౌతిక ప్రకృతిని లోబరుచుకున్ననాడు మాత్రమే భౌతికం అతిమానసంగా రూపాంతరీకరణ చెందుతుంది. ఉన్మీలనము, సమర్పణా భావము ఈ యోగానికి ప్రాతిపదికలు. అప్పుడే, ఉన్నత స్థరాలలో ఉంటూ ప్రచ్ఛన్నంగా, సర్వే సర్వత్రా ఆవరించియున్న దివ్యచేతనను గమనించటానికి, అందులో ప్రవేశించటానికి అవకాశం కలుగుతుంది. అర్ధచేతనము, నశ్వరము అయిన సత్వము మరో విధంగా దివ్యచేతనను సమీపించలేదు. ఇంతే గాక, దివ్యశక్తిని చేరినా అనంత కరుణామయి అయిన దివ్యమాత కరకమలాలలో లాలించబడేవరకూ తట్టుకోగల శారీరక, మానసిక దార్ఢ్యం కూడా సాధకునకు కావాలి.

ఇతర యోగాల విధానాలను ఈ యోగానికి లోబడియుండే విధంగా ఉపయోగించుకునే అవకాశం లేకపోలేదు. అలా అప్పుడప్పుడు జరిగింది కూడా. కాని ఈ యోగంయొక్క విశిష్ఠ నియమాలకు లోబడి ఉండకపోతే అవన్నీ నిరర్థకం అవుతాయి. అంతేగాక, ఆ యోగాలు అనివార్యమైనవి కూడా కాదు. ఏతా వాతా గ్రహించాల్సింది ఏమంటే కేవల శారీరక మానసిక పరిశ్రమ ద్వారా ఈ యోగాన్ని సాధించటానికి, కొనసాగించటానికి వీలుపడదు. దీనికి శ్రీమాత యొక్క సర్వోత్కృష్టమయిన అనుగ్రహం కావాలి. ఆమె మార్గం అతిమార్మికమైనది,

బాహ్యంగా సంక్లిష్టమైనది. అనుసరించటానికి వీలులేనంత సున్నితమైనది. మేధస్సుతో విశ్లేషించి సూత్రీకరించటానికి వీలులేనంత విస్తృతమైనది కూడా!

మానవుడు తన స్వయంకృషితో మాత్రమే తన స్వభావాన్ని అధిగమించలేడు. అయితే దివ్యసత్తను తనలో పనిచేయించుకోగల సామర్థ్యం మాత్రం అతనికి వున్నది. ఈ దివ్యచేతన మాత్రమే అతనిలో దివ్యత్వాన్ని నింపగలదు. సర్వోత్కృష్టమైన సాధకుడు ఆత్మార్పణ గావించుకోవటం ఈ యోగానికి కీలకసూత్రం.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె. ఆర్. యల్. నరశింహారావు

దివ్యమాత అభివ్యక్తీకరణ

దివ్యమాత, దివ్యచేతనాశక్తి — జగన్మాత

*

ఆదిపరాశక్తి, పరమేశ్వరియైన జగన్మాత సర్వలోకాలకు అతీతశక్తిగా నిలిచియున్నది. తన శాశ్వత చైతన్యములో పరమోత్కృష్ట దివ్యత్వమును ధరించి నిలబెట్టుకొనియున్నది. ఆమె ఒక్కరుగా ఇతరుల సహాయము అక్కరలేనిదై పరమోత్కృష్ట దివ్యత్వమును ధరించి నిలబెట్టుకొనియున్నది. వాక్కునకు అందని, సన్నిధిని నిలబెట్టుకొని రక్షించుచున్నది. విశ్వములో అభివ్యక్తము కావలసియున్న సత్యమును తనలో నిక్షిప్తమై దాగియున్న సత్యమును బహిర్గతముచేసి, తన అనంత చైతన్యమును వెలుగులోనికి తీసుకునివచ్చుచున్నది. పరమాత్మ ఆమెలో సర్వదా నిత్య సచ్చిదానందమయిగా అభివ్యక్తమై యున్నది. ఆమె ద్వారా లోకాలలో ఒక్కటే అయిన చైతన్యద్వయం, ఈశ్వరశక్తిగా, సూత్రద్వయం, పురుష-ప్రకృతిగా అభివ్యక్తమయి ఉన్నది. ఆమె వల్ల లోకాలలో, భూమికలలో, దేవతలలో, వారి శక్తులలో ఆకృతి పొంది యున్నది. ఆమె కారణంగా, తెలిసిన, తెలియని ప్రపంచాలలో ఉన్న సమస్తముగా ఆమె దర్శనమిస్తున్నది. సమస్తమూ పరమాత్మతో ఆమె క్రీడ. శాశ్వతుని అద్భుతాలకు, అనంతుని ఆశ్చర్యాలకు అంతా ఆమె రూపొందించిన అభివ్యక్తి. అంతా ఆమెయే అన్నీ దివ్యచైతన్యశక్తికి చెందిన అంతర్భాగాలే.

భూచైతన్యం తనలోనికి అతిమానసాన్ని అందుకొనుటకు, అందుకు తగిన రీతిలో తొలి రూపాంతరీకరణకు ఆమె అభివ్యక్తీకరణ ఒక అవకాశం. తరువాత మరింత ఇతోధిక అతిమానస రూపాంతరీకరణము ఉంటుంది. అయితే మొత్తం పృథ్వీచైతన్యమంతా రూపాంతరీకరింపబడదు. తొలుత అతిమానసమునకు ప్రాతినిధ్యం వహించే నూతనజాతి వస్తుంది. ఎందుకంటే మనవుడు మనసుకు ప్రాతినిధ్యం వహిస్తాడు కాబట్టి.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: డా. సరోజా ప్రసాద్

మతం గురించి శ్రీఅరవిందులు

ఆధ్యాత్మిక జీవనం, ధార్మికజీవనం, నైతికత ఒక అంశంగా కలిగిన సాధారణ మానవజీవితం, ఈ మూడూ మూడు విభిన్న జీవనవిధానాలు. ఈ మూడూ ఒకటేనని అనుకొనే అయోమయస్థితిలో వుండకుండా, ఏది కావాలో, తప్పనిసరిగా, స్పష్టంగా తెలుసుకొనివుండాలి. సాధారణ జీవితం అంటే, సత్యమైన తన ఆత్మనుండి, దైవం నుండి విడివడిపోయి, అవిద్యాధర్మాలైన మనస్సు, ప్రాణికం, దేహం యొక్క సామాన్య అలవాట్లచే నడుపబడే సగటు మానవచేతనతో జీవించే జీవితం. ఐహికం నుండి దైవం వైపు తిరుగుతూ లేక తిరగడానికి ప్రయత్నిస్తున్నదే, అజ్ఞాన జీవితపు ఒక గమనము, ధార్మికజీవనము. కాని ఇంకా తగిన జ్ఞానం లేనందున ఐహిక బంధనాల నుండి విడివడి ఆవలనున్న ఆనందలోకం లోనికి పోవడానికి దారి కనుగొన్నానని చెప్తూ ఒక శాఖకు, లేదా తెగకు చెందిన మూఢాచారాలకు, కట్టుబాట్లకు కట్టుబడి, ధార్మికజీవనం సాగుతూంటుంది. ధార్మికజీవనాన్ని, ఆధ్యాత్మికజీవితం వైపు ప్రప్రథమంగా దృష్టి సారిస్తున్న దశగా చెప్పవచ్చు. కాని చాలా తరచుగా అది కర్మకాండలు, క్రతువులు, ఆచారాలు లేక స్థిరభావాలు, రూపాల చుట్టూ తిరుగుతూ బయటపడే దారి చూపలేని చక్రభ్రమణమే అవుతుంది. ఆధ్యాత్మిక జీవితం అలా గాకుండా చేతనలో మార్పు ద్వారా సరాసరి ముందుకు సాగిపోతుంది. తన ఆత్మసత్యం నుండి, భగవంతుని నుండి విడిపోయిన చేతనతో జీవించే స్థాయి

నుండి, ఎచట తన సత్యమైన అస్తిత్వాన్ని తెలుసుకొనగలడో, మొదట దైవంతో ప్రత్యక్ష సజీవసంబంధం ఏర్పరచుకొని, ఆ తరువాత ఆ దైవంతో ఏకమౌతాడో ఆ మహనీయ చేతనలోనికి, తన చేతన మార్పు ద్వారా సరాసరి ముందుకు పోతుంది ఆధ్యాత్మిక జీవితం. ఆధ్యాత్మిక అన్వేషి అన్వేషించేది ఈ చేతనా పరివర్తనం ఒక్కదాన్నే, తదితరమైనది ఏదీ అతనికి విలువైనది కాదు.

నైతికత, సాధారణ జీవనం లోని ఒక అంశం. మానసిక నియమాల ననుసరించి బాహ్యానడతను నియంత్రించడానికి జరిగే ఒక ప్రయత్నం లేదా మానసిక ఆదర్శాలకు ప్రతిరూపంగా ఈ నియమాల ద్వారా తన నడతను సరిదిద్దుకోవడం, నైతికజీవనం. ఆధ్యాత్మికజీవితం మనస్సును అధిగమించిపోతుంది. అది ఆత్మశక్తి యొక్క లోతైన చేతనలోనికి ప్రవేశించి ఆ సత్యంలో కుదురుకొని అచటి నుండి కార్యం నిర్వహిస్తుంటుంది. నైతిక కట్టుబాట్లు సాంఘిక జీవనానికీ, భగవంతుని సాక్షాత్కారింపజేసుకోవలసిన అవసరానికీ సంబంధించిన విషయానికొస్తే, అది జీవిత లక్ష్యాలను సార్థకం చేసుకోవడం అంటే ఏమిటి అనేదాని మీద ఆధారపడి వుంటుంది. ఆధ్యాత్మికచేతనలోనికి ప్రవేశించడం దానిలోని ఒక భాగమైతే, కేవలం నైతికత అందుకు చాలదు....

నీ హృదయంలోనూ, అంతరంగంలోనూ ఆధ్యాత్మిక పరివర్తనం కోసం చిత్తశుద్ధిగల ఆకాంక్ష వుంటే, నీకు దారి దొరుకుతుంది, మార్గం చూపించి నడిపేవాడు దొరుకుతాడు. ఆత్మశక్తి ద్వారాలను తెరువడానికి కేవల మానసిక అన్వేషణలు, సంశయాత్మకతలు చాలవు.

*

మతానికి రెండు పార్శ్వాలున్నాయి. అవి యదార్థమతం, మతవాదం. యదార్థమైన మతం అంటే ఆధ్యాత్మిక మతం. అది బుద్ధికి, ఉత్తమాభిరుచులకు, నైతికవిలువకు మనిషి యొక్క భౌతిక అస్తికత్వమునకు అతీతంగా నున్న ఆత్మశక్తిలో నివసించ కాంక్షిస్తుంది. ఆత్మశక్తి యొక్క ఉన్నతతర వెలుగును మన అస్తిత్వం యొక్క అంగాలకు చూపి, ఈ వెలుగుతో వాటిని నియంత్రిస్తుంది. దానికి విరుద్ధంగా మాతవేశం నిమ్నభాగాల లోనికి సంకుచిత నిష్ఠానియమాల ఆవేశాన్ని తీసుకురావడంలో కూరుకుని కుచించుకుపోతుంది, లేదా ఛాందసమైన మూఢాచారాలూ, విధానాలూ, క్రతువుల పైన స్థిరీకరించబడిన కఠిన నైతికనియమావళి పైన, ఏదైనా మతపరమైన రాజకీయపరమైన, సాంఘిక వ్యవస్థ మీద పట్టుబడుతుంది. అంత మాత్రాన ఇవన్నీ

పూర్తిగా అలక్ష్యం చేయదగినవని లేదా మంచివి కావనిగాని, లేదా అనవసరం అని గాని లేదా రూపాల క్రతువుల, నియమావళి లేదా విధానాలను ఆధ్యాత్మిక మతం ఏవగించుకొని విసర్జించాలనీ అర్థం గాదు. తద్విరుద్ధంగా, మనిషికి వాటి అవసరం వుంది. ఎందుకనంటే నిమ్న అంగాలను పూర్తిగా ఆధ్యాత్మికం చేయడానికి ముందుగా, అవి ప్రత్యక్షంగా ఆత్మానుభూతి చెంది దాని ధర్మాన్ని పాటించే ముందు, వాటిలో ఉత్సాహాన్ని నింపి, ఉత్తేజపరచాలి. చింతనశీలియైన, హేతుబుద్ధిగల మనస్సుకు, మేధోపరమైన ఒక సూత్రంతో తరచుగా అవసరం కలుగుతుంది. ఉత్తమాభిరుచులుగల చిత్తవృత్తికి లేదా హేతుబుద్ధి కూడా లేని నిమ్న అస్తిత్వపు ఇతర భాగాలకు ఒక రూపంతో లేక క్రతువుతో, ఆచారంతో అవసరం ఏర్పడుతుంది, ఆంతరిక జీవితం వైపు తిరిగే దశలో మనిషి ప్రాణికస్వభావానికి ఒక నిర్ణీత నియమావళి అవసరం అవుతుంది. కాని ఇవి ఆధ్యాత్మికజీవితానికి సహాయం చేసేవి, ఆధారంగా వుండేవి మాత్రమే. అంతేగాని అదే ఆధ్యాత్మికజీవితసారం గాదు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె.వి.రావు

సమాజము — వ్యక్తి

వాస్తవమైన సమృద్ధమైన ఆధ్యాత్మిక లక్ష్యం, సమాజంలో మనిషిని మనశ్శరీరప్రాణికాలుగా పరిగణించదు. భువిపై దివ్యత్వాన్ని సఫలీకృతం చేసుకోవటానికి అవతరించిన జీవాత్మగా గుర్తిస్తుంది. భౌతిక, ప్రాణిక, మానసిక ప్రకృతితో కూడిన ఈ పృథ్వి పైకి, దైవ సాఫల్యత కోసం కాకపోతే ఆతడు, తన సుదూర స్వర్గలోకాలను విడిచి ఇక్కడికి రావలసిన అవసరం ఉండేదే కాదు. ఈ మనః ప్రాణ శరీరాలు వాటికవి తమ స్వీయప్రయోజనాలతో సంతృప్తిచెందడం వాటికి ధ్యేయం కాదు. ఈ దేహభాగాలను ఉత్తమము, అంతిమమయిన వాటిగా భావించక, లేదా రోగగ్రస్తము, మృతప్రాయమూ అవటం చేత వీటి నుండి, ఆత్మను విడిపించి, దానిని తన స్వంత స్వచ్ఛసీమలకు ఎగిరిపోవటానికి దోహదం చేయటమూ కాదు. ఇంకా అంతుచిక్కని దివ్యప్రయోజనసాధన కోసమై ఉన్న జీవాత్మకు తొలి ఉపకరణాలుగా, ఆ దివ్యకారణానికి అవసరమయిన అపరిపూర్ణ ఉపకరణాలుగా,

వీటి భవితవ్యంపై ఆధ్యాత్మిక లక్ష్యానికి నమ్మకం ఉంది. అందుకే వాటికి తమపై తమకు నమ్మకాన్ని కలిగించి, ఆ ఉన్నత ఉద్దేశ్యం కోసమే వాటి నిమ్నసాధ్యతలను విస్మరించి, అత్యున్నత సాధ్యతల పట్ల విశ్వాసాన్ని పెంచుతుంది. తన దృష్టిలో వాటి ధ్యేయం తమను తాము ఆధ్యాత్మీకరించుకొని ఆత్మయొక్క దృశ్యమాన అంశాలుగా ఎదిగి, ఆత్మావిష్కరణకు స్వచ్ఛమైన వాహకాలుగా, స్వయంగా ఆధ్యాత్మికము, ప్రకాశమానము, మరింత చైతన్యవంతమూ, పరిపూర్ణమూ కావాలి. మానవ ఆత్మ, మౌలికంగా దివ్యమయినదనే సత్యాన్ని అంగీకరించాలి. అపుడే అతను పూర్తిగా దైవత్వాన్ని అందుకోగల సాధ్యతను కూడా అంగీకరించగలడు. ఈ సాధ్యత, సాఫల్యత ప్రకృతి మున్ముందుగా తిరస్కరించినా, అంతిమ విజయాన్ని గుడ్డిగా త్రోసిపుచ్చినా, అదే ఈ భువిపైన ఆవశ్యకమయిన భౌతిక ప్రారంభదశ. అది వ్యక్తిగా మానవుణ్ణి అనంతతత్వం యొక్క ఆత్మరూపమయిన మానవ సమూహాన్ని, తన అసంఖ్యాకమయిన సంబంధాలతో, విస్తృతమయిన కార్యకలాపాలతో, పృథ్వీపై అనంతరూపాలతో దైవత్వం పొందటానికి అవతరించే సామూహిక ఆత్మను ఆదరిస్తుంది. ఇది మానవజీవితంలో విభిన్నమయిన అంశాలను పవిత్రంగా భావించి అతని అన్ని అంతర్భాగాలను అనుసంధానించి — అంటే భౌతిక, ప్రాణిక, చైతన్యమయ, భావావేశ, కళాత్మక, నైతిక, మేధోపర, చైత్యపురుష పరిణామాన్ని, సంవిధానపరచి, అది దివ్యజీవనంలోకి ఎదగడానికి కావలసిన ఉపకరణాలుగా చూస్తుంది. ఇదే రకమైన దృక్పథంతో మానవసమాజాన్ని, దేశాన్ని ప్రజలను లేదా యితర సజీవ సమూహాలను పరిగణిస్తుంది. ఒకే దృష్టితో ఉప ఆత్మలుగా, సంక్లిష్ట వ్యక్తీకరణలుగా, సాధనగా, ఆధ్యాత్మిక లక్ష్యం పరిగణిస్తుంది. మనిషి అంతరంగసత్వంలో భగవంతునితో ఏకత్వము కలిగి ఉన్నవాడు. అంతశ్చేతనలో దైవంతో ఏకత్వాన్ని కలిగి ఉండే మనిషి దైవంగా మారే సాధ్యతయే ఏకైక సిద్ధాంతము, నమ్మకము. The possible godhead of man because he is inwardly of one being with God....

మూలం: శ్రీఅరవిందులు

స్వేచ్ఛానువాదం డా. సరోజా ప్రసాద్

మానవ సమైక్యత

భయంకర విధ్వంసపు ఫెళ ఫెళార్భటులు, పెనుతుఫానుల భీభత్స హోరుగాలి — వీటి వల్ల — దివ్య సత్యమునకు సంబంధించిన మహత్తరమైన రెండు మాంత్రిక పదాలు, కాదన్నా పట్టు విడువకుండా మానవమేధస్సు మీద పనిచేస్తున్నాయి. అవే ఇపుడు మనం ఆశించే సమాజ పునర్నిర్మాణానికి ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుని శక్తివంతమైనవిగా నిలిచి ఉన్నాయి. అవే — స్వేచ్ఛ, సమైక్యత. అయితే, మొదట వాటిపై మనకున్న సమ్యక్ దృష్టి ఎలాటిది — అనేదాని పైన అసలు విషయం అంతా ఆధారపడి ఉంటుంది. రెండో విషయం — దానిని మనం చిత్తశుద్ధితో అన్వయించేతీరు. చివరిది — ముఖ్యంగా దాని గురించి మన ఆంతరంగిక సంసిద్ధత. సమైక్యత అనేది జాతికి హృదయస్థమైనది. అలాకాక కేవలం యాంత్రికంగా వ్యవస్థీకృతమైనదైతే ఆ ఐక్యత నిలబడదు. వ్యర్థమవుతుంది. మన భౌతిక ప్రయోజనాలను సమకూర్చుకొనేందుకు, సంరక్షించుకునేందుకు మాత్రమే తయారైనా అదీ వ్యర్థమే. ఈ మధ్యకాలంలోని గతానుభవాలు ఉన్నాయి మనకు. అవే — చెలరేగిన భయంకర పోరాటాలు, కొత్త విప్లవాలు, ఇంకా, అరాచకత్వము. పనికిమాలిన విధానాలీ మానవ సమైక్యతా విధానాలు. నిజంగా స్వేచ్ఛాయుతమైనవి కావు ఇవి. అలా అగుపిస్తాయి మనకు. అంతే. సహాయపడవు. ఈ కొత్త నిర్మాణాలు, యంత్రాంగాలు చూడటానికి బ్రహ్మాండంగా కనిపిస్తాయి. చివరికి అంతా మళ్ళీ మరొక బందిఖానా మాత్రమే అవుతుంది. ఫలితంగా — అందులోంచి విడుదల కావటానికి మరో నూతన విముక్తి పోరాటం. మనిషికి భద్రమైనది — ఒక్కటే. అదేమంటే — బాహ్యజీవన కార్యకలాపం అంతా అంతరంగ ప్రేరితమైనది కావాలి. ఈ రకమైన జీవనసరళి నేర్చుకోవాలి. అలవర్చుకోవాలి. బాహ్యవ్యవస్థలు, యంత్రాంగాలు — ఇవి కల్పించే పరిపూర్ణతపై ఆధారపడం కాదు. అలా కాక వికసిత అంతరంగ పరిపూర్ణత ఆధారంగా జీవనాన్ని రూపుదిద్దుకుని వ్యవస్థీకరించుకోవాలి. ఈ అంతరంగ వికాసంతోనే ఉత్తమ అంశాల సత్యాన్ని చాల గొప్పగా దర్శించగలుగుతాం. బాహ్య జీవనానికి చిత్తశుద్ధితో దానిని అన్వయించుకోగలుగుతాం కూడా. ఇపుడు మనం చూచేది, చర్చించుకునేది మానసిక బాహ్యనిర్మాణాలను గురించి మాత్రమే. మానవాళిలో దైవసామ్రాజ్యం సుస్థాపితం కావించేందుకు ముందు, మనం దైవాన్ని

తెలుసుకోవాలి. మన సత్యము యొక్క దివ్యసత్యాన్ని మనలో దర్శించుకోవాలి. అదే మన జీవనం కావాలి. అలా కాక — హేతువాద నిర్మాణాలు, భౌతిక విజ్ఞానశాస్త్రి రీత్యా సమర్థనీయమైన ఏర్పాట్లు, పద్ధతులు — వీటి తాలూకు నూతన సంవిధానాలు — ఇవి కావు కావలసినవి. వీటివల్ల వైఫల్యం చెందాం. ఇవి సమాజ సువ్యవస్థీకరణకు యోగ్యం కావు. సహకరించవు. పాత పొరపాట్లే కొనసాగింపబడుతున్నాయి. అందుకే జ్ఞానోదయ సంపన్నులు — ఇంకా కార్యాచరణాత్మకంగా లేకున్నా — మరింత స్పష్టంగా, అంతరంగ వాస్తవాన్ని దర్శించేందుకు పెనుగులాడుతున్నారు. చివరి సంధ్యాసమయం దగ్గరపడుతోంది. ఒక యుగం అంతరించి, మహోన్నత నూతన యుగావిర్భావం, మధ్య వచ్చే సంధ్యాసమయం అది. వాస్తవంగా ఇంకా ఉషోదయం కాలేదు. మానవుడు అందుకు ఇంకా సిద్ధంగా లేడు. పాత పద్ధతి, దాని శక్తి ఇంకా బలీయంగా పనిచేస్తోంది. ఇంకా కొంతకాలం అది కొనసాగుతుంది. వర్ధిల్లుతుంది అనిపిస్తో ంది. ఈ మెరుపులుకి, సంధ్యాసమయాలకి అతీతంగా ఉషోదయకాంతులు దర్శించే ఉజ్వల భవిత, మానవాళి కోసం వేచి ఉంది. అందుకు మానవాళి సంసిద్ధం కావాలి. మానవులు దివ్యశక్త్యుపకరణాలుగా పరివర్తన చెందాలి. అసాధారణ కాంతి దిశగా, సాగేలా వారిని దివ్యశక్తి ఒత్తిడి చేస్తోంది.

మూలం: శ్రీఅరవిందులు

భావానువాదం: కర్రా వెంకటేశ్వర్లు

స్వతంత్ర భారతావనికి శ్రీఅరవిందుల సందేశం

(ఇది ఆగస్టు 15, 1947 న భారతదేశం స్వాతంత్ర్యం పొందిన సందర్భంగా ఆకాశవాణి, తిరుచ్చినాపల్లి కేంద్రం నుంచి ఆగష్టు 14 న ప్రసారమైన సందేశం)

ఆగస్టు 15, 1947 స్వతంత్రభారతం పుట్టిన రోజు. ఈ రోజు భారతచరిత్రలో పాతశకం ముగిసి, నవయుగాన్ని సూచించే ముఖ్యఘట్టం. కాని మనం కూడా, స్వతంత్రం పొందిన దేశంగా, మన జీవనవిధానం, చర్యలతో దీనిని నవయుగంలో ప్రపంచమంతటికి, మానవజాతి రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక భవితవ్యానికి తలుపులు తెరుచుకునే ప్రముఖదినంగా కూడా చేయగలుగుతాం.

ఆగష్టు 15 నా పుట్టిన రోజు. ఇది ఇంత ప్రాధాన్యతను సంతరించుకోబోవడం, నిజంగా నాకు సంతృప్తి కలిగించే విషయం. దీనిని కాకతాళీయంగానూ, అనుకోని సంఘటనగానూ తీసుకోవడం లేదు. ఇది, నేను జీవితంలో మొదలుపెట్టిన పనికి నాకు మార్గదర్శకత్వం వహించే, దివ్యశక్తి అనుజ్ఞ, ఆమోదముద్ర పొంది, పూర్తిగా ఫలించటానికి ఇది నాంది అని అనుకుంటున్నాను. వాస్తవానికి ఈ రోజు ప్రపంచ సంఘటనలన్ని నా కళ్ళ ముందు చూడగల్గుతున్నాను. నేను వేటినైతే నా జీవితకాలంలో పూర్తిగా ఫలించాలని ఆశించానో, ఏవైతే ఒకప్పుడు కార్యాచరణకు కూడా నోచుకోని గొంతెమ్మ కలలుగా కనిపించాయో, అవి ఫలించబోతున్నాయి, లేదా, సాధ్యమయ్యే దిశగా సాగుతున్నాయి. ఈ ప్రపంచంలోని సంఘటన లన్నింటిలోను స్వతంత్ర భారతం ప్రముఖ పాత్రను పోషించబోతోంది, తానే ముందుండి నడిపిస్తుంది.

ఈ నా కలలలో మొదటిది భారతదేశ స్వాతంత్ర్యతను, అఖండ భారతాన్ని అందించగలిగే ఒక విప్లవాత్మక కార్యక్రమం. ఈ రోజు భారతదేశం స్వాతంత్ర్యన్నయితే పొందింది కాని, అఖండ భారతంగా కాదు. ఒకానొక సమయంలో తనకు కలిగిన విముక్తితో ఆమె ఆంగ్లేయుల దండయాత్రకు ముందున్న విధంగా భిన్న రాష్ట్రాల మధ్య గందరగోళానికి దారితీస్తుందా అని అనిపించింది. అదృష్టవశాత్తు, ఆ ప్రమాదపరిస్థితి బహుశా తప్పిపోగలదని, ఇప్పుడు కాకపోయినా ముందు ముందు ఏకీకరణతో కూడిన, ఒక విశాలవంతమైన, శక్తివంతమైన దేశం ఏర్పడగలదని అనిపిస్తున్నది. అంతే కాకుండా, సంవిధానసభ (Constituent Assembly) వివేకంతో రూపొందించిన బలమైన విధానం అణచివేతకు గురైన

నిమ్నవర్గాల సమస్యలను, ఏ విధమైన చీలికలనూ, ఎడబాట్లూ కలిగించకుండా బహుశా తీర్చగలదు. కాని ఇతః పూర్వపు హిందూ, ముస్లిముల మతవైమనస్యం ఇప్పుడు ఇంకా మొండిగా సంక్లిష్టమై దేశ శాశ్వత రాజకీయ విభజనకు దారితీసిందనిపిస్తుంది. కాని ఈ విధంగా ఖరారైన వాస్తవాన్ని, యథతథంగా అంతిమ నిర్ణయంగా ఆమోదించనక్కరలేదు. లేక, ఒక తాత్కాలిక ప్రయోజనాన్నిందించే కార్యవిధానంగా అనుకోవచ్చును. అది ఆ విధంగానే ఉండిపోతే, భారతదేశం అత్యంత ప్రమాదకరంగా బలహీనపడటమే కాకుండా, ముక్కలు చెక్కలైపోతుంది. అంతఃకలహాలు సర్వసామాన్యమైపోతాయి, అంతేకాక ఒక కొత్త దాడితో, విదేశీ ఆక్రమణ జరిగే అవకాశముంది. భారతదేశ అంతరంగ పురోభివృద్ధి, సుఖశాంతులకు విఘ్నం ఏర్పడవచ్చు. ఇతర దేశాల మధ్య ఆమె స్థానం బలహీనమవుతుంది. ఆమె భవితవ్యం కుంటుపడటం, లేదా, వైఫల్యానికి లోను కావచ్చు. అలా జరగటానికి వీల్లేదు. జరగకూడదు, దేశవిభజన పోవాలి. అది పరిస్థితులకు లోబడి, శాంతి, సంధి, ఒడంబడికల ప్రాతిపదికగా మాత్రమే కాకుండా, అధికాధికంగా తప్పనిసరి అది గుర్తించిన ఐక్య కార్యాచరణతో, అందరికీ వర్తించే సర్వసాధారణమైన కార్యాచరణను అమలుపరుస్తూ, దానికి అవసరమైన వనరులను సమకూర్చుకుంటూ సహజంగానే ఏకీకరణ జరుగుతుందని ఆశిద్దాం. ఈ రకంగా చివరకు, ఏదో ఒక రూపంలో ఏకీకరణ జరగవచ్చును, అది ఏ రూపంలో అనేది ఆచరణాత్మకంగా ప్రాముఖ్యమైనదై కావాలే కాని, ప్రాథమికమైన ప్రాముఖ్యత కానక్కరలేదు. అది ఏ పద్ధతిలోనైనా కాని, ఏ విధంగానైనా కాని విభజన తప్పనిసరిగా పోవాలి. ఐక్యత తప్పదు, అది జరిగి తీరుతుంది, ఎందువల్లనంటే భారతదేశపు గొప్ప భవితవ్యానికి అది తప్పనిసరి.

నా తదుపరి స్వప్నం: మానవజాతి నాగరికతలో తాను పోషించవలసిన గొప్ప పాత్ర కోసం పునరంకితం కావటానికై, ఆసియా ప్రజల పునరుజ్జీవనం, విముక్తి. ఆసియా మేల్కొంది. పెద్ద పెద్ద ప్రాంతాలన్నీ ఇప్పుడు స్వాతంత్ర్యం పొందాయి, లేదా, విముక్తి పొందబోతున్నాయి. ఇంకా పరాయిపాలనలో ఉన్న కొన్ని ప్రాంతాలు స్తబ్ధుగా ఉన్నాయి, లేదా , పాక్షికంగా ఆ ప్రాంతాలు ఏదో ఒక విధంగా స్వాతంత్ర్యం కోసం తీవ్రంగా పోరాటాం సలిపే దిశగా ముందుకు కదులుతున్నాయి. ఇంకా కొంత మాత్రమే చేయవలసి ఉంది. అది నేడో రేపో జరుగుతుంది. భారతదేశం తన వంతు పాత్ర పోషించాల్సి ఉండగా, ఆ ప్రక్రియ, తన శక్తి, దీక్షా, దక్షతలతో

మొదలుపెట్టింది. దాని సాధ్యాసాధ్యాల పూర్తి పరిమాణం, వివిధ దేశాల ప్రతినిధుల సలహా సంఘంలో దాని స్థానం, అది నిర్వహిస్తున్న పాత్ర విదితమౌతున్నది.

నా మూడవ స్వప్నం, మానవజాతి అంతటికి కల్లాకపటం లేని, తేజోవంతమైన, ఉదాత్తమైన జీవితాన్ని అందించటమనే ప్రాతిపదికగా పెద్ద ఎత్తున ఒక ప్రపంచ సమాఖ్య ఏర్పడాలి. మానవప్రపంచం ఏకీకరణ దిశగా సాగుతున్నది. అది అసమగ్రంగా మొదలుపెట్టబడి, వ్యవస్థీకరించబడింది. కాని అది అనేక భయాందోళనలు కలిగించే ఇక్కట్లతో పెనుగులాడుతున్నది. అయినప్పటికి, ఒక కదలిక ఉన్నది, అది తప్పనిసరిగా ఉధృతమై జయిస్తుంది. ఇక్కడ కూడా భారతదేశం ఒక ప్రముఖపాత్ర పోషించడం మొదలుపెట్టింది. ఆమె కనుక విస్తృతతర రాజకీయ చతురతను పెంపొందించుకుంటే ఇప్పుడున్న వాస్తవిక పరిస్థితులకూ వెనువెంటనే నెరవేరగలిగేవాటికే పరిమితమైపోకుండా భవిష్యత్తులోకి దృష్టి సారించి దానిని అత్యంత సమీపంగా అందుబాటులోకి తీసుకురాగలిగితే, నెమ్మదిగానూ పిరికితనంతో కుంచించుకుపోయేదానికీ, ధైర్యంగానూ, వేగవంతంగా పురోభివృద్ధి పొందేదానికీ ఉండే తేడాను ఆమె తన అస్తిత్వం ద్వారా బహుశా తెలియచేస్తుంది. ఇంతమటుకు జరిగినదానిని బహుశః ఒక దుర్ఘటన జోక్యం చేసుకోవడం, అడ్డగించడం, లేదా, నాశనం చేయవచ్చు. అయినప్పటికి, అంతిమవిజయం తథ్యం. ఏకీకరణ మనేది ప్రకృతిమాత అవసరం. తప్పనిసరిగా అది ఆ దిశగా కదులుతుంది. అది దేశాలకు కూడా అవసరమనేది సుగ్రాహ్యం. ఎందువల్లనంటే, అది జరగని పక్షంలో చిన్నదేశాల మనుగడ ప్రశ్నార్థకమవుతుంది. అంతే కాక శక్తివంతమైన దేశాలు కూడా అభద్రతకు లోనవుతాయి. ఈ కారణాల వల్ల ఏకీకరణ అందరి అవసరాలను తీరుస్తుంది. మానవుల బుద్ధిహీనత, మూఢత్వం మాత్రమే దానికి ఆటంకమవుతవి. కాని, అదీ ఎల్లకాలం ప్రకృతిమాతకు అవసరమైనదానిని, దైవేచ్ఛను ఎదురొడ్డి నిలవలేదు. కాని ఈ బాహ్యపరిస్థితుల మీద ఆధారపడటం ఒక్కటే సరిపోదు. వివిధ దేశాలన్నింటిని కలిపి ఉంచే ఆత్మశక్తి, దూరదృష్టి, అంతర్జాతీయ రూపకల్పనలు, సంస్థలు తయారుకావాలి. అది ఏ విధంగా తయారుకావాలంటే అవి జంట పౌరసత్వం, లేక, వివిధ పార్శ్వాలను కలిపే అనేక దేశాల పౌరసత్వం, ఇచ్ఛాపూర్వకమైన ఇచ్చిపుచ్చుకోవటాలు, లేదా, బుద్ధిపూర్వకమైన వివిధ సంస్కృతుల విలీనత. దేశభక్తి తనకు తానుగా సఫలీకృతమయింది. ఇప్పుడిక ఇవన్నీ ఏ మాత్రమూ స్వభద్రతకు, తాను ఆశించే

పరిపూర్ణతకు పొసగని విషయాలని గ్రహిస్తుంది. ఒక కొత్త ఐక్యతాశక్తి మానవజాతిని వశం చేసుకుంటుంది.

నా కలలలో మరొకటి, ప్రపంచానికి భారతదేశం అందించాల్సిన ఆధ్యాత్మిక కానుక. అది ఈ వరకే మొదలయింది. భారతదేశ ఆధ్యాత్మికత ఐరోపాలోను, అమెరికాలోను ఎప్పటికంటె అధికతర పరిమాణంలో ఇతోధికంగా ప్రవేశిస్తోంది. అది ఇంకా వృద్ధిచెందుతూ కాలగమనంలో వచ్చే ఎన్నో విపత్తుల మధ్య కూడా ఎంతోమంది ఆశావహదృక్కులతో భారతదేశం వైపు మరలి చూస్తున్నారు. అంతేకాక, ఆమె బోధల కోసం మాత్రమే కాకుండా, ఆమె చైత్యాత్మ ప్రభావానికి, ఆధ్యాత్మిక మనుగడకు ఆమె ఆశ్రయం కోరేవారి సంఖ్య కూడా అంతకంతకు ఎక్కువవుతున్నది.

ఆఖరు స్వప్నం, పరిణామక్రమంలో ఒక ముందడుగు. అది మానవుణ్ణి, అధికోన్నతమైన, విస్తృతమైన చైతన్యపు ఔన్నత్యాలకు తీసుకువెళ్లగలదు. అది జరిగితే, మానవుడు ఆలోచించటం మొదలుపెట్టినప్పటి నుంచి, వ్యక్తి పరిపూర్ణత, పురిపూర్ణమైన సమాజం గురించి కలలు కన్నప్పటి నుంచి, అతనిని ఇంతవరకూ వేధించిన, క్షోభపెట్టిన అనేక సమస్యలకు పరిష్కారం దానితో మొదలవుతుంది. ఇది నా వ్యక్తిగత ఆశావహం, వ్యక్తిగతంగా నేను ఇది జరగాలని ఆశిస్తున్నాను. ఇది నా ఆలోచన (idea) . భారతదేశంలోను, పశ్చిమ దేశాలలోను భవిష్యత్తు వైపు దృష్టి సారించినవారందరి మస్తిష్కాలను ఈ ఆశయం ప్రభావితం చేసింది. ఏ లక్ష్యసాధనలోనూ లేని దుస్సాధ్యమైన అడ్డంకులు ఈ దారిలో ఉన్నాయి. అడ్డంకులనేవి తొలగించడానికే ఉన్నాయి. పరమాత్మ ఇచ్ఛ గనుక ఉంటే తప్పక అధిగమించవచ్చు. ఇక్కడ కూడా, ఈ పరిణామం గనక జరగవలసి ఉంటే, అది తప్పకుండా ఆత్మపురోభివృద్ధితోను, అంతరంగ చైతన్యంతోను తప్పక ముందుకు పోవలసి ఉంటుంది కాబట్టి దానికి, చొరవ భారతదేశం నుంచే రాగలదు, దాని పరిధి విశ్వవ్యాప్తమైనప్పటికి, కేంద్రబిందువు భారతదేశమే.

ఇదీ భారతదేశ స్వాతంత్ర్యదినమున నేను చెప్పదలుచుకున్న సారాంశం. ఈ సదాశయం జరుగుతుందా, లేక, ఎంతకాలంలో — అనే నిజనిర్ధారణ నవీన, స్వతంత్ర భారతదేశం మీద ఆధారపడింది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

భారతావనిలో పునర్వికాసము

భారతదేశం తను తానుగానే ఉంటూ, స్వధర్మాన్ని చక్కగా అనువర్తిస్తూంటూనే చక్కగా పురోగతి చెంది మానవాళిని ఉద్ధరించగలదు. అట్లాగని కొంతమంది అనుకుంటున్నట్లుగా కాలగతిలో వస్తున్న ప్రతి కొత్త విషయాన్నీ, పశ్చిమదేశాల్లో కనిపెట్టి తయారుచేస్తున్న ప్రతిదాన్నీ గుడ్డిగా తోసిపుచ్చాలని కాదు. ఆ విధమైన వైఖరి అవివేకమే కాక స్థూలంగా అసాధ్యము. అన్నిటినీ మించి ఆధ్యాత్మిక భావానికి వ్యతిరేకము. నిజమైను ఆధ్యాత్మికత ఏ కొత్త వెలుగునీ నిరోధించదు. మానవుల స్వయంసమృద్ధికి కావలసిన ఏ కొత్త సాధనసంపత్తులనూ నిరాకరించదు. కానీ నేను చెప్పేదేమంటే మన కేంద్రస్థానాన్ని యదాతథంగా ఉంచి మన జీవితార్థాన్నీ, సహజ స్వభావాన్నీ కాపాడుకుంటూ కొత్తగా వచ్చిన వాటినన్నిటినీ దానితోబాటు విలీనం చేసుకొని తద్వారా మనంచేసే పనిలో, తయారుచేసే ఉత్పత్తులలో పరిణతి చెందాలి. భారతీయుల మనస్సు నిండా మతమే ప్రధానంగా ఆక్రమించి ఉంది. మతాధిక్యత భారతదేశాన్ని నాశనం చేసిందని కొంతమంది అన్నారు. సూటిగా చెప్పాలంటే మతమే జీవితంగా, జీవితమంతా మతమయంగా చేసుకోవడం వల్లనే, మనం మతప్రాబల్యం వల్లనే జీవితంలో ఓడిపోయి క్షీణించడం జరిగింది అన్నారు. దానికి నేను బదులు చెప్పను. ఇంకో సందర్భంలో కవి ఒకరు, ఉపయోగించిన భాష ప్రకారం నేను చెపుతాను. మన పతనం గురించి మనకు ఏం ఫర్వాలేదు. పతనమైపడిన భారతదేశ నేలధూళి చాలా పవిత్రమైనది. పతనం, ఓటమి అనేది తీసిపారవేయవలసినది కాదు. పతనమై ఉండటమనేది మనిషికిగానీ, దేశానికిగానీ శ్రేయస్కరం కాదు. అయితే అందుకు వారు చెప్పిన కారణమే సరియైనది కాదు. వారు చెప్పినట్లు అధిక సంఖ్యాక భారతీయులు జీవితాలను నిజంగా మతమయం చేసుకున్నట్లయితే మనం ఇక్కడ ఇలా ఉండేవాళ్లమే కాదు. వారి పతనానికి కారణం వారి బాహ్యజీవితం మతానికి వ్యతిరేకంగానూ, అహంభావపూరితంగా, స్వార్థపూరితంగా, ప్రాపంచికజీవనంగానూ ఉండటమే. అది రెండు రకాలుగా జరిగియుండవచ్చు. ఒక పక్క విపరీతమైన ఛాందస మతవిధులు. అంటే బాహ్యంగా కర్మకాండలు, నిబంధనలు, యాంత్రికమైన ఆచారవ్యవహారాలు అతిగా నిర్వర్తించడం, ఇంకో పక్క ప్రపంచాన్ని దూరం చేసుకునే వైరాగ్యధోరణులు. ఇందువల్ల ప్రాచీన

మహర్షుల మాదిరిగా ఆధ్యాత్మికభారాన్ని వహిస్తూ జీవితాలను దీప్తిమంతం చేయగల మహానుభావులు సంఘానికి కరువైపోయారు. దీని పర్యవసాన ఫలితంగానే సర్వసాధారణంగా, విస్తారంగా ఉండే ఆధ్యాత్మిక ప్రేరణలు సన్నగిల్లడం, వివేచనాత్మక చర్యలు, స్వేచ్ఛ తరిగిపోవడం, ఉన్నతాదర్శాలు కనుమరుగవడం, జీవితమాధుర్యం కోల్పోవడం జరిగింది.

ఒక విధం చూస్తే మతం మరీ ఎక్కువున్నట్లు అనిపిస్తుంది. అంటే బాహ్యానికి కనబడేటట్లు జరిపే విశ్వాసాలు, కర్మకాండలు, ధర్మనిష్ఠలు మొదలైనవాటిపై అభిరుచి పెరగడం. మతానికి కనుక ఆధ్యాత్మిక ప్రేరణను సంపూర్ణంగా అన్వయించి అర్థం చెప్పుకుంటే, ఆధ్యాత్మికత అంటే పరమాత్మను తెలుసుకొని ఆ విశిష్టాత్మలోనే ఉండే ప్రయత్నమనుకుంటే, దైవమంటే అన్నిటినీ తనలో నిలుపుకొనే ఏకత్వం కాబట్టి జీవితాన్ని మొత్తంగా, ఆ దివ్యవిలువలను అందుకునేటట్లు చేస్తే అప్పుడు మతం ఎక్కువ లేదు, చాల తక్కువగానే ఉన్నదని తెలుస్తుంది. ఆ ఉన్నది కూడా ఏకపక్షంగానే ఉండటం వల్ల అది మరీ చాలీచాలని వైఖరి అవుతుంది. దాన్ని చక్కబరచాలంటే అనాదిగా ఉన్న ఆదర్శాన్ని మరింత చిన్నబుచ్చకుండా దాని పూర్వపు ప్రాచుర్యాన్ని పునరుద్ధరించి ఇంకా ఎక్కువ విస్తరించే అవకాశమివ్వాలి. జాతి జీవనమంతా ఈ ఉన్నత ఆధ్యాత్మికతతో కూడిన మతంగా తయారుచేయాలి. పశ్చిమదేశాలలో వేదాంతము, కవిత్వము, కళలు ఈ దిశగానే సాగుతున్నాయి. ఏదో కొంత అస్ఫుటంగా ఉన్నా, ఇంకా వృద్ధిపొందుతూ, సత్యస్ఫూర్తి మెరమెరలు దిశగా దృష్టి సారిస్తున్నారు; వారి రాజకీయ, సాంఘిక ఆదర్శాలపై ఆ కాంతికిరణాలు ప్రసరించడం ప్రారంభమైంది. ఆ విజ్ఞానానికి, ఆదర్శాలను చైతన్యవంతంగా అన్వయించుకోగల కీలకం హిందూదేశం వద్దనే ఉన్నది. దాన్ని అన్వయించడంలో పూర్వమున్న అజ్ఞానం ఇప్పుడు తొలిగిపోయింది. ఈ కొత్త వెలుగులో భరతమాత ప్రకాశిస్తున్నది. పాతపద్ధతుల్లోని లోపాలను, వక్రతలను ఆమె ఇప్పుడు సరిదిద్దకలదు. ఒకప్పుడు బాహ్య విస్తృతి నుంచి ఆధ్యాత్మిక ఆదర్శాలను రక్షించుకోడానికి ఏర్పరుచుకున్న కంచెలు తర్వాతి కాలంలో అది విస్తరించడానికీ, సుదూరంగా అన్వయించడానికీ అడ్డుకట్టలు కాగా ఇప్పుడు వాటిని తొలగించుకొని తన ఆత్మ విహరించడానికి విస్తారమైన క్షేత్రం కల్పించగలదు. ఆమె తలుచుకుంటే మానవాళి యాతనలు పడుతూ, కొట్టుమిట్లాడుతున్న సమస్యలన్నిటికీ నూతనమైన నిర్ణయాత్మక

పరిష్కారాలు చూపగలరు. ఆమె దగ్గరున్న ప్రాచీన విజ్ఞానంలో ఈ సమస్యలన్నిటికీ సూత్రబద్ధమైన కిటుకులున్నాయి. ఈ పునర్వికాససమయంలో ఆమెకున్న అవకాశం మేరకు ఔన్నత్యానికి చేరగలదా లేదా అనేది వేచిచూడవలసిందే.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: అమరవాది ప్రభావతి, అమరవాది వేంకటరామశాస్త్రి)

సాధకులకు శ్రీఅరవిందుల సందేశము

మన ఆధ్యాత్మిక లక్ష్యము బహు దొడ్డది, జటిలమైనది. ఆ లక్ష్యసాధనకు రెండు శక్తులున్నాయి. ఆ రెండింటి కలయిక వల్ల మాత్రమే మనకు లక్ష్యసిద్ధి. ఒకటి — క్రిందినుండి (మనలో నుండి) అమోఘమైన ఆకాంక్షతో కూడిన పిలుపు. అందుకు పైనుంచి బదులిచ్చే పరమోత్కృష్టమైన దివ్యానుగ్రహ కృప.

అయితే ఆ దివ్యానుగ్రహము సత్య జ్ఞాన తేజోపూరిత షరతులకు (నియమములకు) లోబడి మాత్రమే పనిచేస్తుంది. అసత్య అజ్ఞాన నియమిత పరిస్థితులలో అది పనిచేయదు. ఎందుకంటే అసత్యానికి దాని కామనలకు అది తల ఒగ్గితే తన స్వప్రయోజనాన్ని తానే భంగపరచుకొన్నట్లవుతుంది.

అత్యున్నతమైన దివ్యశక్తి క్రిందిగి దిగి రావటానికి ఈ పరిస్థితులు, షరతులు సత్యజ్ఞానప్రకాశాలకు చెందిన ఒకే రకమైన నిబంధనలు పరమశ్రేష్ఠమైన అతిమానస దివ్య చైతన్యశక్తి మాత్రమే పైనుండి క్రిందికి అవతరిస్తూ నిమ్నప్రకృతిలో మూసుకొని ఉన్న దానిని తెరుస్తుంది. భౌతికప్రకృతిలో విజయవంతంగా వ్యవహరిస్తుంది. దాని ఇబ్బందులను రూపుమాపుతుంది.

నిజాయితీతో కూడిన పరిపూర్ణ ఆత్మసమర్పణ తప్పక ఉండాలి. వేరొకదానిని దేనిని కాక దివ్యశక్తిని మాత్రమే స్వీకరించి నిలబెట్టుకొనేలా, స్వభావమును ఉన్మీలనము కావించుకోవాలి. క్రిందికి దిగివస్తున్న దివ్యసత్యాన్నే, పూర్తిగా ఎప్పుడూ ఎన్నుకోవాలి. భౌతిక ప్రకృతిని ఇంకా పరిపాలిస్తున్న అవాస్తవికమైన, మానసకి, ప్రాణిక, శారీరక శక్తులను ఎప్పుడూ పూర్తిగా నిరాకరించాలి.

సమర్పణ సంపూర్ణమై (త్రికరణశుద్ధితో కూడినదై) ఉండాలి. అస్తిత్వ భాగాలన్నిటినీ

వశపరచుకొనేదై ఉండాలి. చైత్యపురుష ప్రతిస్పందించి, ఉన్నత మానసికం అంగీకరించి, లేదా, అంతరంగ భౌతికచైతన్యం ఆ ప్రభావ అనుభూతిని పొంది విధేయంగా ఉండటమూ చాలదు. సత్వములో ఏ భాగంలోనైనా, అత్యంత బాహ్యంలో అయినా సరే దాపరికం చేసేది కాని, సంశయాలు, తబ్బిబ్బులు, యుక్తిచమత్కారాలు — వీటి వెనుక దాగి ఉండేదిగాని, తిరుగుబాటు చేసేది, నిరాకరించేదిగా, ఏదీ ఉండకూడదు.

సత్వంలో ఒక భాగం సమర్పణ కావించుకొని, వేరొక భాగం పట్టించుకోనట్లుగా ఉంటూ, తన దారిని తాను పోతూ, తన స్వంత నిబంధనలను తానే విధించుకుంటూ ఉంటే —. అలా జరిగిన ప్రతిసారీ దివ్యకృపను నీకు నీవే నీ నుండి దూరంగా త్రోసిపుచ్చుకుంటూన్నవాడవు అవుతావు.

నీ భక్తిసమర్పణల వెనుక నీ ఆశలకు, అహంకారపూరిత కామనలకు, ప్రాణికమైన పట్టుదలలకు ఆశ్రయం కల్పించినట్లయితే, నిజమైన ఆకాంక్ష ఉండవలసిన చోట, వీటిని ఉంచనట్లయితే, నీలో మార్పు రావాలని ఈశ్వరకృపను వేడుకోవటం నిరర్థకం.

నిన్ను నీవు దివ్యసత్యానికి ఒక ప్రక్కన ఒక భాగం తెరచి ఉంచుకొని, వేరొక వైపు విరోధశక్తుల ప్రవేశానికి తలుపులు తెరిచి ఉంచుతే, దివ్యకృప నీతో ఉంటుందని ఆశించటం భ్రమయే అవుతుంది. సజీవ సాన్నిధ్యాన్ని ప్రతిష్ఠించవలెనని నీవు అభిలషిస్తే ఆలయాన్ని పరిశుద్ధంగా ఉంచాలి.

ప్రతిసారీ ఈశ్వరశక్తి తాను కలుగచేసుకుని దివ్యసత్యమును నీలోకి తీసుకుని వచ్చినప్పుడల్లా నీవు దాని పట్ల విముఖత చూపి, బహిష్కరింపబడిన అసత్యమును నీవు తిరిగి ఆహ్వానిస్తుంటే, నీకు ఈశ్వర కృప కలుగలేదని నీవు దానిని నిందించటానికి బదులు, నీ అపరిపూర్ణ ఆత్మసమర్పణను, మోసపూరిత ఇచ్ఛను నిందించుకో.

నీవు దివ్యసత్యమును ఆహ్వానిస్తావు. అయినప్పటికీ నీలో ఉన్నదేదో అసత్యమైనదానిని, అజ్ఞానమైనదానిని, దైవమునకు వ్యతిరేకమైనదానిని ఎన్నుకొన్నట్లైన, లేదా, దానిని పూర్తిగా నిరాకరించేందుకు సమ్మతించకపోయినా, అపుడు నీపై దాడికి నీ వెప్పుడూ తెరుచుకునే ఉంటావు. దివ్యకృప నీ నుంచి వెనుతిరిగిపోతుంది. ముందు నీలో ఏది అసత్యమో, ఏది అస్పష్టమైనదో దానిని కనిపెట్టు. దానిని విడువకుండా నిరాకరించు. అపుడు మాత్రమే నిన్ను పరివర్తన కావించే దివ్యశక్తిని సక్రమంగా ఆహ్వానించగలుగుతావు.

సత్యము, అసత్యము, వెలుగు, చీకటి, సమర్పణ, స్వార్థచింతన — దైవానికి అంకితమైన గృహంలో వీటిని కలిసి కాపురం చేయకలుగ నివ్వటం సాధ్యమని ఊహించకు. పరివర్తన సమగ్రమైనదిగా ఉండాలి. దానిని ప్రతిఘటిస్తూన్న సర్వమునూ నిరాకరించుటం కూడా సమగ్రంగానే ఉండాలి.

పరమాత్మ విధించిన నిబంధనలను నీవు పాటించకపోయినా సరే, నీ కోసం దివ్యశక్తి సమస్తమూ చేస్తుందని, చేసితీరాలనే పొరపాటు భావాన్ని వదిలిపెట్టు. నీ సమర్పణ నిజమైనది, పరిపూర్ణమైనది కావించుకో. అపుడు మాత్రమే మిగిలినదంతా నీ కోసం చేయబడుతుంది.

నీ కోసం ఈశ్వరశక్తియే అర్పణసైతమూ కావిస్తుందనే పనికిమాలిన తప్పుడు అభిప్రాయాలు పెట్టుకోకు. ఆమెకు (పరమశక్తి) నీవు ఆత్మార్పణ చేసుకోవాలనేది, పరమేశ్వరాదేశం. దానిని అది నీపై బలవంతంగా విధించదు. తిరుగులేని పరివర్తనము నీలో చోటు చేసుకునేటంతవరకూ, ఏ క్షణంలోనైనా నీవు భగవంతుని నిరాకరించనూవచ్చు, నీ ఆత్మార్పణను వెనక్కి తీసుకోనూవచ్చు. కాకపోతే అందువల్ల సంభవించే ఆధ్యాత్మిక పరిణామాలను భరించటానికి నీవు సిద్ధపడాలి. నీ ఆత్మార్పణ నీకు నీవుగా, స్వేచ్ఛాయుతంగా కావించుకునేది కావాలి. అది సజీవ సమర్పణ కావాలి. అంతేకాని జడత్వంతో కూడిన యాంత్రిక సమర్పణ కాకూడదు.

మొద్దుబారిన ఉదాసీనతను వాస్తవమైన సమర్పణగా భావింపబడూతూంటుంది. ఈ జడత్వ ఉదాసీనత నుంచి నిజమైన శక్తివంతమైనది ఏదీ ఆవిర్భవించదు. అది, భౌతికప్రకృతి యొక్క నిశ్చలతాభావం. అట్టి నిశ్చలత నుంచి సత్యసమ్మతమైనది, శక్తివంతమైనది ఏదీ ఆవిర్భవించదు. ఆ స్థితిలో అజ్ఞానయుతమైన, ఆసురిక ప్రభావమేదైనా నీపై దాడి చేయవచ్చు. ఆ, శక్తులకు వాటి దయాదాక్షిణ్యాలకు నీవు వశమై ఉంటావు. దివ్యశక్తి నీలో పనిచేయుటకు సంతోషపూర్వకమైన, బలమైన, ఉత్సాహభరితమైన, సహకారముతో కూడిన, ఆత్మార్పణ ఉండాలి. భగవంతుని నమ్మకమైన బంటుగా, అసత్య అజ్ఞానములతో పోరాడే, అంతరంగవీరుడుగా ఉండాలి. విశ్వాసపాత్రుడవైన, దైవసేవకుడివి కావాలి. ఆ రకమైన విధేయత కావాలి.

ఇదీ నిజమైన వైఖరి. ఎవరు ఈ భావనను, ప్రవృత్తిని కలిగి ఉంటారో, ఎంత ఆశాభంగము, ప్రమాదము, వ్యతిరేకత, కష్టము సంభవించినా, విశ్వాసము సడలకుండా ఉంటారో వారే మహారూపాంతర పరివర్తన పొందగలుగుతారు.

II

ప్రపంచంలో జరిగే ప్రతి కార్యము ఈశ్వరుడు తన దివ్యశక్తి ద్వారా నడిపిస్తున్నాడు. కాని యోగమాయచే ఆయన మరుగునపడి జీవుని అహంకారము ద్వారా నిమ్నప్రకృతిలో పనిచేస్తున్నాడు.

యోగములో భగవంతుడే సాధకుడు, సాధన కూడా. ఆయన శక్తి, ఆమెదే (శ్రీమాత) యగు వెలుగు, సామర్థ్యము, జ్ఞానము, యెరుక, ఆనందములతో ఆధారము (జీవుని శరీరము) పనిచేయుచున్నది. ఆధారము — శరీరము — శక్తికి ఉన్మీలనమై ఉన్నపుడు, ఆమె, తన దివ్యశక్తులను ఆ యాధారముపై వర్షింపచేస్తూ, సాధన సాధ్యమయేలా చేస్తుంది. కాకపోతే, నిమ్నప్రకృతి బలీయంగా ఉన్నంతసేపూ, సాధకుని వ్యక్తిగతప్రయత్నము ఆవశ్యకమవుతుంది.

వ్యక్తిగతమైన సాధన మూడు విధాలైన — ఆకాంక్ష, నిరాకరణ, సమర్పణల — కృషితో కూడుకున్నది.

ఆకాంక్ష: మెలకువతో కూడినదై, స్థిరమైనదిగా, నిరంతరంగా ఉండాలి. ఇంకా, మనోసంకల్పము, హృదయాన్వేషణ, ప్రాణికము యొక్క అంగీకారము — కావాలి. భౌతికచైతన్యమును, స్వభావమును వికసింపచేసి భగవంతునికి ఉన్ముఖమయేలా సంకల్పించుకోవాలి. ఈ చలనములన్నీ ఏకోన్ముఖం కావించాలనే ఇచ్ఛ కలిగి ఆకాంక్షించాలి.

నిరాకరణ: నిమ్నప్రకృతి యొక్క వ్యాపారములను నిరాకరించుటం అంటే మానసికభావాలు, ఆలోచనలు, ఇష్టాయిష్టాలు, అలవాట్లు, అభిప్రాయాలు — వీటిని నిరాకరించాలి. నిశ్చలమైన మనస్సులో సత్యసమ్మతమైన జ్ఞానము వచ్చి నిలిచే, ఆవాకశము కలుగచేయాలి.

ప్రాణికస్వభావము యొక్క కోరికలు, దేవేరింపులు, సంవేదనలు, ఆవేశములు, స్వార్థములు, పొగరు, పశువాంఛలు, దురాశలు, ఈర్ష్య, అసూయ, అసహనము, సత్యము యెడల ద్వేషము — మొదలగువాటిని నిరాకరించి, పారద్రోలవలెను. అపుడు ప్రాణికము ప్రశాంతసుందరంగా, విశాలమై, బలము కలదై ఏకోన్ముఖమై ఉంటుంది. పైనుంచి అవతరించే సత్యసమ్మతమైన శక్తి, ఆనందాలు దానిలో ప్రసరిస్తాయి.

భౌతికప్రకృతి యొక్క మూర్ఖత్వము, అనుమానము, అపనమ్మకము, అస్పష్టత, మొండితనము, అల్పత్వము, సోమరితనము, మార్పు పట్ల అయిష్టత, తమస్సు మొదలగువాటిని విడనాడి వాటిని దూరం చేయాలి. అపుడు శరీరం క్రమంగా దైవత్వమును పొందుతుంది. అట్టి శరీరములో నిజమైన వెలుగు, శక్తి, ఆనందములు వచ్చి స్థిరపడుటకు అవకాశం కలుగుతుంది.

సమర్పణ: తనను, తనదై ఉన్న తన సర్వస్వాన్ని చైతన్యానికి చెందిన ప్రతి భూమికను, చలనాన్ని, గమనాన్ని, దైవానికి దివ్యశక్తికి సమర్పణ కావించటం.

*

మనిషిలో సమర్పణ, ఆత్మనివేదన పెంపొసగుతూన్న కొలదీ, సాధకుడు, తన సాధన, దివ్యశక్తియే నడిపిస్తూన్నట్లు తెలుసుకుంటాడు. దివ్యశక్తి (శ్రీమాత) ఇతోధికంగా తనలోకి ప్రసరిస్తూ, తనలో దివ్యప్రకృతి యొక్క స్వేచ్ఛ సంపూర్ణతలు నెలకొనునట్లు చేయుచున్నదని గ్రహిస్తాడు. తన స్వీయసాధన స్థానంలో, శ్రీమాత చైతన్య ప్రక్రియ వృద్ధి పొందుతున్న కొద్దీ, ఆతని అభివృద్ధి అధికమై, శీఘ్రమై, వాస్తవము అవుతుంది. సమర్పణ, అంకితభావం ఆమూలాగ్రం పరిశుద్ధమయి, సంపూర్ణం కావాలి. అంత వరకు వ్యక్తిగత కృషి ఆవశ్యకమవుతుంది. సంపూర్ణంగా తొలగిపోలేదు.

నిబంధనలు పాటించకుండా తిరస్కరించి, తనకు ఏ శ్రమా లేకుండా బాధ, కష్టము లేకుండా, సర్వమూ తానే చేయమని కాపాడమని భగవంతుని అర్థించటం, తామసిక సమర్పణ అవుతుంది. వంచన అవుతుంది. అది స్వేచ్ఛకి, పరిపూర్ణతకి దారితీయదని గమనించాలి.

మూలం: శ్రీఅరవిందులు

పూర్వ అనువాదకులకు అంజలి ఘటిస్తూ

సంపాదకుడు

వికసిత చేతన ఆవిర్భావం పెరుగుదలలే, పరిణామ ప్రక్రియ యొక్క ఆశయము. ఇదే దాని రహస్య ఉద్దేశం, కీలకం. అయితే, ఆ పరిణామ ప్రక్రియ స్వభావాన్ని బట్టి దాని పెరుగుదల, శక్తులు విస్తృతంగా వృద్ధిచెందడమే గాక, సాధ్యమైనంత అత్యున్నత స్థాయికి ఆరోహణ కూడ అంతరగర్భితమై వుండాలి. ఎందుకంటే ఆ పరిణామ ప్రక్రియ అంతర్లీనస్థితిలో అత్యంత నిమ్నస్థాయిలో అచేతనస్థితి నుండి ప్రారంభమై, భౌతిక ప్రపంచాన్ని సృష్టిస్తూ, అజ్ఞానం అచేతన దశలోని వెలుగును, నిర్వహణ కౌశలాన్ని, శక్తుల సమన్వయాన్ని బహిర్గతపరుస్తూ, ఇతోధికంగా జ్ఞానదశలోకి పురోగమిస్తున్నది. అది దాని సర్వశక్తుల పరిపూర్ణత్వాన్ని పొందగలిగే స్థితికి చేరుకొనితీరాలి. ఆ స్థాయి, జ్ఞానం కోసం అభిలషించే అజ్ఞానంగాక, స్వార్జిత దివ్యజ్ఞానంగా, పరిమితులచేత, దోషాలచేత ఆటంకపరుపబడకుండా తను సత్య యజమానిగా, స్వభావదర్శనంగా రూపొందాలి. ఒకవేళ పరిమితి వున్నా, అది తనకు తానుగా తన వెనుక వైపు సృష్టించుకొన్న తెరగా వుంటుంది. అది క్రమంగా, సకాలంలో, సత్యావిర్భావానికి తనకు తానుగానే ఆ తెరను ఛేదించుకొని బైట పడగలుగుతుంది.

అంటే వ్యక్తి తన అంతరంగంలో వ్యవస్థితమై ఉన్న సత్యచేతనలో ప్రవేశించి, తన శక్తులు గుర్తించి, సకాలంలో వాటిని ఆవిష్కరించగల శక్తిని కలిగి వుంటాడు. అంతట అతని జీవితం సత్యమయమై, సంకల్పానుభూతులు, సహజ అంతఃస్ఫురణ ప్రేరేపితములై, దోషరహితంగా పనిచేస్తాయి. దానివల్ల ఆత్మశక్తులు, సత్యాలు పరిపూర్ణంగా వెల్లడి కాగల్గుతాయి. ఆ తరుణంలో వ్యక్తి మానసిక పరిధులను దాటుతాడు. అతని మనస్సు దివ్యసత్యకాంతిని కోరుతుంది. సంకల్పం దివ్యసత్యశక్తి అవుతుంది. జీవితం పరిపూర్ణ దివ్యసత్యంగా వృద్ధిచెందుతుంది. దేహం సత్యం యొక్క ఎరుక కలిగిన ఉపకరణంగా, ఆత్మసంసిద్ధి సాధనగా, స్వీయచేతనారూపంగా రూపాంతరీకరణం చెందుతుంది. అపుడు భౌతిక ప్రపంచంలో భాగవత జీవనానికి లేదా ఆధ్యాత్మిక చేతనావిర్భావానికి నాంది పలుకుతుంది. లేదా అలాంటి సత్యచేతన మన శారీరక మానసజీవనంతో, నిత్యసంబంధం కలిగి వుంటుంది. సత్యచేతన వాటిలో అవతరించి, వాటిపై ఆధిపత్యము వహించి తన ఆశయాలను వాటి యందు

ప్రేరేపిస్తుంది. వాటిని నడుపుతుంది. కాని అందరు ఆ సత్యాన్ని పూర్తిగా రూపు దాల్చలేరు. కాని ప్రతివారు తమ తమ ఆధ్యాత్మిక స్వభావాన్ని బట్టి ఆ సత్యానికి రూపాన్ని అందించగలరు. వారు తమ శక్తికి తగిన పరిపూర్ణతను స్థిరీకరించగలరు. ఆత్మయొక్క సత్యపథంలోను, ప్రకృతి సత్యపథంలోను, పూర్తిస్థాయిలో పురో గమించగలరు.

మనం యీ సత్యచేతనను భౌతికప్రపంచం లోనికి అవతరింపచేయగలిగితే మానవాళి పరిపూర్ణత, వ్యక్తి పరిపూర్ణత, సమాజ, జాతి పరిపూర్ణతల కొరకైన మన చిరకాల స్వప్నాలు, నిజమైనట్లవుతుంది. ఆత్మనిగ్రహము, ప్రకృతిశక్తులపై ఆధిపత్యము, వాటిని పొందుటయు ఉపయోగించుకొనుటయు జరుగుతుంది. ఈ మానవాళి పరిపూర్ణత అన్ని పరిమితుల నధిగమించి భాగవత జీవనంగా రూపాంతరీకరణం చెందగలదు. జడప్రకృతి జీవనశక్తిని, మనోవెలుగును తనలోనికి ఆవిర్భవింపచేసికొని, అత్యున్నతమైన ఆత్మశక్తిని తనలోనికి దించుకొనగలదు. భౌతిక దేహం తన అచేతన భాగాలను చైతన్యవంతం కావించుకొని చేతనామయమైన ఆత్మోపకరణంబుగా విరాజిల్లగలుగును. అంతట యీ శరీరాంతర్నివాసి సంకల్పం వల్ల, శక్తి వల్ల, దేహం స్థిరమైన ఆరోగ్యాన్ని, బలాన్ని, శక్తిని, చేకూర్చుకోగలదు. ఈ భౌతికచేతనా శక్తులు, అత్యధికమైన పరివ్యాప్తస్థితిని చేరి, దోషరహితంగా తన కార్యాలను నిర్వహించును. ఈ దేహం తన అంతర్నివాసి కోరిక మేరకు, సకల ప్రయోజనాలను పరిపూర్ణంగా నిర్వహించగలస్థాయి నందుకొనును. అంతే కాదు యీ దేహం అత్యున్నత సౌందర్యాన్ని, ఆనందాన్ని ప్రకటించే ఉపకరణంగా ఉంటుంది. ఆత్మవెలుగును ప్రసరిస్తుంది. ఈ దేహం తనలో ఆత్మానందాన్ని, మనస్సంతోషాన్ని, జీవితానందాన్ని, ఆత్మసుఖాన్ని కలిగి వుంటుంది. భౌతిక సంతోషం ఆధ్యాత్మిక చేతనతలో కలసి నిరంతర ఆనందంతో పులకిస్తుంది. ఇదే ఇదే పరిపూర్ణ ఆధ్యాత్మిక దేహంగా మనగలిగేది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: బి. నరసింహయ్య


మానవజీవన సర్వస్వము ఆత్మశక్తిచే నడిపించేదిగా పరివర్తన చెందాలి. ఇది అత్యావశ్యకంగా మొట్టమొదట కావలసిన పరివర్తన. మనిషికి కీలకమైన ధ్యేయం స్వర్గారోహణ కాదు. కాక, ఆధ్యాత్మికశక్తి లోనికి ఆరోహణ, ఆధ్యాత్మికశక్తి సాధారణ మానవత లోనికి అవరోహణ. తద్వారా భౌతిక స్వభావ రూపాంతరీకరణ — ఇదీ జరుగవలసినది. ఇదే నిజమైన నూతన జన్మ. తన బాధాయుత, సుదీర్ఘ, అస్పష్ట జీవనయానంలో మానవునికది రాజ్యాధిపత్యం లాంటిది. తత్సమానమైన పురోగతి.

అందుచేత ఆధ్యాత్మిక పరిణామమే మానవాళి భవితవ్యమై మనిషికి ఉత్కృష్టమైన ఆవశ్యకత యని గుర్తించి, అలాంటి ఉజ్వల భవిష్యత్తు కోసం పాటుపడేవారే నవయుగ వైతాళికులు. పశుప్రాయమైన మానవుడు మానసిక మానవుడుగా సంస్కరింపబడినాడు. ఉన్నత మానసికస్థాయిలో మానవాళి ఉన్నది. అలాగే నేడో రేపో, ప్రస్తుత మానసిక మానవ సమాజం ఆధ్యాత్మికసంపన్న మానవసమాజం కావటమనేది జాతికి ఆవశ్యకమైనది. దివ్యప్రకృతియొక్క చరమ లక్ష్యం కూడా అదే. దాని చర్యలు, బావన, కృషి అందుకే — ఆ పరివర్తన, ఆ పరిణామం కోసమే. అలాగని, అందుకోసం ఏదో ఒక నిర్దిష్టరూపాన్నో, నమ్మకాన్నో పట్టుకొని వేళ్లాడటం కాదు. మనుష్యులు తమ తమ స్వస్వభావాలకు, స్వధర్మాలకు నిబద్ధులయే ఉంటూ, ఆధ్యాత్మిక పరివర్తన అవశ్యమైనదిగా భావిస్తారు. అదే తమ జీవనవిధానం కావించుకునేందుకు కృషి చేస్తారు. వారి భావాలు, అభిప్రాయాలు, తమ ఆధ్యాత్మిక జీవనవిధానానికి అనువుగా మలుచుకోగలుగుతారు. ఈ పరిణామమంతా యేదో బాహ్యయంత్రాంగాల సహాయంతోనో, వ్యవస్థతోనో సంభావ్యమవుతుందనే పొరపాటు అభిప్రాయం కలిగి ఉండరు. ఇది ప్రతి వ్యక్తి అంతరంగంగా పాటించి జీవించవలసిన విషయమనే సంగతి వారు తెలుసుకుంటారు. దానిని ఎప్పటికీ వారు మరచిపోరు. అలాగని ఇది ఏదో ఒక జాతితో, వర్గంతో పోల్చుకునేదిగా ఎన్నడూ ఉండదు. హృదయస్థంగా పదిలపర్చుకునే అంతరంగభావన. మనిషికిది, తన భవితవ్యాన్ని, విముక్తిని పొందగలగడానికి హృదయం అన్వేషించవలసిన ప్రాచ్యదేశ భావన. అయితే మనవాళ్లు, పాశ్చాత్యులు తమ జీవనవిధానానికి ఇచ్చే ప్రాధాన్యతను నిరసించరు. కాకపోతే దానికి వేరే మలుపు నిస్తారు. అంతేకాక కొద్దిమంది ఆధ్యాత్మికంగా వికసితులైనవారి

కాంతి నేపథ్యంలో వారికి నీడగా సమాజాన్ని తయారుచేయరు. చుట్టూ గిరి గీసి అందులో ఉంచరు. నిర్గంధకుసుమం లాంటి ఆధ్యాత్మిక సన్యాసాన్ని అంగీకరించరు. కొంతమంది ఎప్పుడూ నిమ్నస్థాయిలోనే జీవితంలో ఉండిపోవలసినవారుగాను, కొద్దిమంది మాత్రమే గాలి, వెలుతురులోకి స్వేచ్ఛగా ఉన్నతభూమికలకు యెదగవలసిన అర్హత కలిగినవారనే సిద్ధాంతాన్ని ఎన్నడూ అంగీకరించరు. కాగా ఉన్నత ఆధ్యాత్మికతత్త్వాన్ని సమ కూర్చుకునేందుకు కృషి చేసిన ఉత్తమ ఆధ్యాత్మిక సంపన్నుల దృక్పథం ప్రకారంగా వారు పృథ్వీజీవనాన్ని సమున్నతం కావించటానికి సంకల్పించి ప్రారంభిస్తారు. అందుకు సంబంధించిన గతవైఫల్యాలను లెక్కచేయరు. సమున్నతము, సుసం పన్నము, జటిలము అయిన విషయాలలో వైఫల్యాలు సర్వసాధారణం. గత వైఫల్యాలు, అనుభవాలను ప్రోత్సాహకాలుగా, లాభదాయకంగా ఉపయోగించుకునే సమయం వస్తుంది. అంతవరకు మూసి ఉన్న ద్వారాలు అపుడు తెరుచుకుంటాయి. వైఫల్యాలు విజయాలకి సోపానాలు. ఏదీ అసంభవం కాదు. అలాగ అనుకోవటం అజ్ఞానం బలహీ నత. కృషి చేస్తూన్నకొలదీ కష్టం పరిష్కార మవుతుంది. అయితే ఒకటి. ప్రారంభం చిత్తశుద్ధితో కూడినది కావాలి. కార్యసాధన చేస్తుంటేనే సమస్య పరిష్కారమవుతుంది. కాలమే పరిష్కారం చూపిస్తుంది. ఓరిమితో చేసే కృషి వృథా కాదు. మనకు తెలి యకుండానే పరిష్కారాన్ని చూపుతుంది. మార్గదర్శకులైనవారు మొత్తం జీవితమంతా తమ కార్యక్షేత్ర పరిధి లోనికి తీసు కుంటారు. ఎందుకంటే వారు చేయదలచుకున్నది మానవజీవితమంత విస్తారమైనది. పురోగమనశీలురు దేనినీ విరుద్ధంగా విపరీతంగా భావించరు. తమకు సంబంధం లేనిదని దేనినీ అనుకోరు. విడిచివేయరు. జీవితానికి సంబంధించిన ప్రతి అంశము ఆధ్యాత్మికభావనతో స్వీకరించాలి. కేవలం అది — మానసికము, ఉత్తమ అభిరుచి కరము, నైతికముగానే కాక, మరింకా, గమన శీలమైనదిగా, శారీరక, ప్రాణికమైనవి కూడా స్వీకార యోగ్యమైనవే. మానవస్వభావమునకు సంబంధించిన ప్రతి అంశాన్నీ ఆధ్యాత్మిక పరివర్తనా దృక్పథంతో సాధించాల్సినదే. ప్రతీదీ జీవాత్మను అన్వేషించే సాధనయే.

మూలం: శ్రీఅరవిందులు

భావానువాదం: కర్రా వెంకటేశ్వర్లు



అఖిల

ల భారత పత్రిక

ప్టెంబరు 2010

శ్రీఅరవింద సొసైటీ

స్వర్ణోత్సవ ప్రత్యేక సంచిక

విషయసూచిక

శ్రీమాతకు మా కృతజ్ఞతా నివేదన	3
సాధారణ లక్ష్యం	3
అతిమానస లక్ష్యము	6
శాంతి సామరస్యాలకు మార్గము	9
యువతకు పిలుపు	11
యువభారతానికి మా పిలుపు	12
సాధన — బాహ్యక్రియలు	14
ఆధ్యాత్మికతను జీవనానికి అన్వయించుకోవటం	17
ఆధ్యాత్మికతను జీవనానికి అన్వయించుకోవటం (దృశ్యమాలిక)	15

సెప్టెంబరు 19, 1960 న, శ్రీమాత తన అధ్యక్షతలో శ్రీఅరవింద సొసైటీని స్థాపించారు. శ్రీఅరవిందుల లక్ష్యాలు, --- ఆదర్శాలు సభ్యులకు, సాధారణ ప్రజానీకానికి, శ్రీఅరవిందులు దర్శించిన ఆధ్యాత్మిక సమాజాన్ని వీలైనన్ని పద్ధతులలో కృషిచేసి సాధించటానికి ఇది స్థాపించబడింది.



శ్రీమాతకు మా కృతజ్ఞతా నివేదన

సర్వోన్నత వరప్రసాదివి, స్వచ్ఛ, శివసుందరంగా జీవితాన్ని సార్థకం చేసి మా భవితవ్యాన్ని నియంత్రించి, మా సర్వ ఆకాంక్షలకు గమ్యస్థానమైన నీకు — గాఢ భక్తిపురస్సరంగా అవధిలేని కృతజ్ఞతాభావంతో ప్రణమిల్లుతున్నామో శ్రీమాతా!

మా ఆలోచనలకు, సంవేదనలకు, క్రియాకలాపాలకు సర్వోత్కృష్టాధిపత్యం వహించుమా!

నీవు మా అస్తిత్వం, నీవే మా దివ్య వాస్తవం.
నీవు లేక అంతా అసత్యమే, భ్రమయే.
నీవు లేకపోతే అంతా దట్టమైన చీకటియే.
నీలోనే జీవనం, కాంతి ఆనందాలు.
పరమమైన సర్వోత్కృష్ట ప్రశాంతీ, నీ లోనే —

(శ్రీమాత, "ప్రార్థనలు — ధ్యానాలు", జనవరి 1, 1914 — ఆధారంగా)

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

సాధారణ లక్ష్యం

ప్రగతిశీలమైన విశ్వజనీన సామరస్యమే సర్వమానవాళి సాధించవలసిన సాధారణ లక్ష్యం. ఒక్కటిగా వెలుగుతున్న అంతర్గత దైవత్వాన్ని మేలుకొలిపి, అభివ్యక్తం చేసి, మానవాళి ఐక్యతను సిద్ధింపచేసుకోవాలి. ఈ లక్ష్యసాధనకు అదే ఉపకరణం.

మరోలా చెప్పాలంటే — మనందరిలోనూ వున్న భగవత్ సామ్రాజ్యాన్ని సుస్థిరపర్చి ఈ మానవ ఐక్యతను సాధించాలి.

ఈ క్రింది విషయాలు చాలా ఉపయోగకరమైనవి.

1) ప్రతి వ్యక్తి తనలోని దివ్యసాన్నిధ్యాన్ని ఎప్పుడూ ఎరుకలో వుంచుకోవాలి. దానితో సాయుజ్యం చెందాలి.

2) మనిషిలో ఇంతవరకు చైతన్య ప్రదీప్తంకాని అనేక అస్తిత్వ విభాగాలను, అంతస్తులను వ్యక్తిగతం చేసుకోవాలి. అంటే వ్యక్తిగతంగా అందుబాటులోకి తెచ్చు

కోవాలి. విశ్వజనీన శక్తి చైతన్యధారలు అందని స్థితిలో వున్నాయి. వాటిలో ఏదో ఒకదానికి, లేదా మరిన్నిటికి భూమిని కలపడం సాధ్యపడుతుంది. అందుకే అస్తిత్వ స్థితులను మనం మనలో వ్యక్తిగతం చేసుకోవాలి.

3) ప్రపంచంలో ప్రస్తుతం వున్న మానవ మనస్తత్వం జీర్ణించుకొనే విధంగా చిరంతన మంత్రాన్ని సరి కొత్త రూపంలో మళ్ళీ పలకాలి. చిరంతన అక్షరం, చిరంతన సత్యం మానవాళికి అందాలి. అది మానవ సమస్త విజ్ఞాన సమన్వయం.

4) సమిష్టిగా, వినూతన జాతి, భగవంతుని కాంతిశిశువుల జాతి పరిఢవిల్లడానికి అనువైన శుభప్రదమైన ప్రదేశంలో ఆదర్శ సమాజాన్ని నెలకొల్పాలి.

*

రెండు ప్రక్రియల ద్వారా భువన పరివర్తన, సామరస్యాలను సాధించవచ్చును. అవి పరస్పరం విరుద్ధంగా కనిపించినా అవి కలిసిపోవాలి. అవి ఒకదానిపై మరొకటి పనిచేసి, పూర్ణం చేసుకోవాలి!

1) దైవసాన్నిధ్యంతో సాయుజ్యం చెందడానికి దారితీసే అంతర్గత చైతన్య వికాసం, వ్యక్తి పరివర్తనం.

2) సామాజిక పరివర్తన వ్యక్తివికాసానికి అనుకూలమైన పరిసరాల వాతావరణాన్ని కల్పించాలి.

పరిసరాల ప్రభావం వ్యక్తిపై వుంటుంది. అంతే కాదు — వ్యక్తి విలువపై పరిసరాల విలువ ఆధారపడి వుంటుంది. ఒక దానితో పాటు మరొకటి ఈ రెండు కార్యాలు జరగాలి. శ్రమవిభజన ద్వారా మాత్రమే ఇది సాధ్యపడుతుంది. దీనివల్ల అంచెలుగా వర్గీకరణ చెందిన వర్గం రూపొందాలి. ఈ వర్గం లోని సభ్యుల కార్యసరళి మూడు విధములుగా ఉంటుంది.

1) సాధించాల్సిన ఆదర్శం వ్యక్తిగా సిద్ధించుకోవాలి. ఆలోచనకు అతీతమైన పరతత్వం గుణాలు, లక్షణాలు, పద్ధతుల తొలి అభివ్యక్తికి పరిపూర్ణ భువనైక ప్రతినిధిగా మారాలి.

2) ఈ ఆదర్శాన్ని మాటల ద్వారా అందరికి ప్రవచించాలి. అన్నిటికీ మించి అందుకు ఆదర్శనీయంగా నిలవాలి. తమ వంతుగా ఈ సిద్ధికి సిద్ధంగా వున్న వారందరినీ తమ వైపు తిప్పుకోవాలి. భూమి మీదనే స్వేచ్ఛ, విముక్తి పొందాలన్న సత్యాన్ని చాటే ప్రవక్తలు కావాలి.

3) ప్రత్యేకమైన, ఆదర్శవంతమైన సమాజాన్ని స్థాపించాలి. అటువంటివి ఉన్నట్లయితే వాటిని పునర్వ్యవస్థీకరించాలి.

*

ప్రతి వ్యక్తికి రెండు రకాల పని ఒకేమారు చేసేదిగా వుంటుంది. ఒకటి మరొకదానికి సహాయపడుతూ దానిని పరిపూర్తి చేయాలి:

1) అంతర్వికాసం, భగవత్ తేజో నివహంతో క్రమానుగతంగా సాయుజ్యం చెందాలి. విశ్వజనీన జీవనస్రవంతితో మనిషి సమరస వికాసం చెందాలి. ఇది ఏకైక నియమం.

2) ప్రతి వ్యక్తి తన శక్తియుక్తులు, తన ఇష్టాయిష్టాల మేరకు బాహ్యమైన కార్యసరళిని ఎంచుకోవాలి. విశ్వగానసభలో తాను మాత్రమే ఆక్రమించగల స్థానాన్ని అతను కనుక్కోవాలి. దానికి తనను తాను అర్పించుకోవాలి. భువన సంగీతంలో తాను ఒక రాగాన్ని ఆలపిస్తున్నానని మాత్రం అతను మరచిపోకూడదు. అయితే విశ్వశ్రుతి లయలకు ఆ రాగం తప్పనిసరి అని, దాని విలువ దాని నైతిక మహత్వంపై ఆధారపడి వుంటుందని మరవరాదు.

మూలం: శ్రీమాత

మనం సాధించవలసిన కొత్తదనం ఏముంది? దివ్యప్రేమ — ఎందుకంటే మనం ఇంతవరకు విద్వేషాన్ని, స్వార్థసంతోషాలను మాత్రమే సాధించాం. దివ్యజ్ఞానం — ఎందుకంటే మనం పొరపాట్లను, ఆలోచనలను, భావసంచయాన్ని పోగేసుకున్నాం ఇంతవరకు. దివ్య ఆనందం — ఎందుకంటే సుఖదుఃఖాలను, నిర్లక్ష్యాన్ని మాత్రమే ఇంతవరకు సాధించాం. దివ్యశక్తి — యెందుకంటే మనం బలహీనతల్ని, ఫలించని ప్రయత్నాలను, మనం విజయం అనుకునే అపజయం — ఇవీ మనం సాధించాం. దివ్యజీవనం — ఎందుకంటే మనం జన్మిస్తున్నాం, పెరుగుతున్నాం, మరణిస్తున్నాం ఇవే మనం ఇంతవరకు సాధించాం. సమైక్యత. మనం యుద్ధాలను, వర్గాల సమీకరణలనే ఇంతవరకు సాధించుకున్నాం. ఒక్క మాటలో మనం సాధించవలసినది దివ్యత్వం; మనల్ని మనం దివ్యదీప్తి బింబాలుగా పునః ప్రదీప్తం చేసుకోవాలి.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: యజ్ఞన్న

అతిమానస లక్ష్యం

దివ్యశరీరంలో దివ్యజీవనం అనే ఆదర్శసూత్రమును మేము దర్శిస్తున్నాం. వాస్తవంగా, పరిణామక్రమ ఫలితంగా ఈ రూపాంతరీకరణ పొందే అవకాశానికి చేరుకున్నాం. ఏ విధంగా అయితే దివ్యప్రకృతి, పదార్థం నుంచి జీవనాన్ని, జీవనం నుంచి దానికి అతీతంగా మనస్సును అభివ్యక్తం చేసిందో అదే విధంగా ఆమె, మనస్సుకు అతీతంగా ఒక చైతన్యశక్తితో కూడిన అస్తిత్వాన్ని బహిర్గతం చేయాలి. అది మానసిక అస్తిత్వపు అసంపూర్ణతకు, పరిమితికి లోబడని అతిమానస లేదా సత్య చైతన్యంతో ఆత్మశక్తి పరిపూర్ణతను, శక్తిని, అభివృద్ధి చేయగలుగుతుంది. ఇక్కడ, మన పరిణామం నెమ్మదిగా, మందగమనంతో సాధారణ పరిణామ నియమానుసారంగా జరగవలసిన అవసరం లేదు. అది ఎంతమటుకంటే, కొంచెం ఎక్కువ తక్కువలతో మానసిక అజ్ఞానం మన ఆరోహణను కిందిగి దిగలాగుతూ, ప్రతిబంధకమైనంతవరకే. కానీ మనం సత్య చైతన్యంలోకి ఎదిగిన క్షణాన, దాని ఆధ్యాత్మిక సత్య, అస్తిత్వశక్తి సమస్తాన్ని నిర్ణయిస్తుంది. ఆ సత్యంలో మనం స్వేచ్ఛను పొందుతాము. అదే మనస్సును, జీవితాన్ని, శరీరాన్ని పరివర్తన చేస్తుంది. ప్రకాశం, పరమానందం, సౌందర్యం సంపూర్ణ అస్తిత్వపు సహజసిద్ధమైన సక్రమమైన కార్యశీలత, పరిపూర్ణత అనేవన్నీ అతిమానస సత్య చైతన్యపు సహజశక్తులు — అవి వాటి కున్న స్వభావ లక్షణంతో మనస్సు, జీవితం, శరీరాలను పరివర్తనం చేసి, ఇక్కడే ఈ భూమి మీదే సత్యచైతన్య ఆత్మశక్తిగా అభివ్యక్తం చేస్తుంది. ఈ భౌతిక అస్పష్టతలు అతిమానస సత్యచైతన్యం ముందు నిలబడలేవు. వాటిని జయించడానికి భూమిలోకి కూడా ఆత్మశక్తి, అవసరమైనంత, సర్వాతీతశక్తిని, సర్వవ్యాపక కాంతిని, తీసుకురాగలుగుతుంది. ఆ కాంతి, శక్తికి అన్నీ ఉన్మీలనం కాలేకపోవచ్చును, కాని ఏది ఎంత ఉన్మీలనమైతే అంతమాత్రంగా తప్పక పరివర్తన అయితీరుతుంది. అదే పరివర్తన ప్రధానసూత్రం కాగలదు.

*

భౌతిక ప్రపంచంలో దివ్యజీవనం తప్పనిసరిగా సృష్టిలో చివరి రెండు అంచులైన ఆధ్యాత్మిక శిఖరాగ్రము, భౌతికానికి ఆధారమైన పదార్థముల అనుసంధానాన్ని తెలియజేస్తుంది. జీవితాన్ని ఆధారం చేసుకుని పదార్థంలో కుదురుకున్న ఆత్మ, ఆత్మశక్తి శిఖరాలను ఆరోహిస్తుంది. కాని అది తన ఆధారాన్ని పరిత్యజించదు. అది



ఔన్నత్యాలను, లోతైన గాఢతలను — రెండింటినీ అనుసంధానం చేస్తుంది. ఆత్మశక్తి తన సమస్త తేజఃపుంజాలతో, వైభవాలతో, శక్తులతో పదార్థంలోకి, భౌతికప్రపంచంలోకి అవరోహణం చేసి, వాటితో నింపి, భౌతిక ప్రపంచంలోని జీవితాన్ని పరివర్తన చేసి, తత్ఫలితంగా భౌతికానికి ఇతోధికంగా దివ్యత్వాన్ని సంతరింప చేస్తుంది. పరివర్తన అనేది కేవలం అతిసూక్ష్మత లోనికి, ఆధ్యాత్మికత లోనికి మార్పుచెందటం కాదు. దానికి భౌతికం తన సహజ పెడసరస్వభావం కలిగి ఉండదు. అది ఆత్మశక్తికి ఆటంకం కాదు. ప్రతిబంధకం కాదు. పరివర్తన పదార్థాన్ని ఆత్మశక్తికి ఒక రూపంగా భావిస్తుంది. ప్రస్తుతానికి అది పరోక్షరూపంలో ఉన్నా, అది తనలోని ఆత్మశక్తిని బహిర్గతం చేసే పరికరంగా మారుస్తుంది. ఈ ప్రణాళికలో అది పదార్థంలోని శక్తులను, సామర్థ్యాలను, దాని విధివిధానాలను తోసిపారెయ్యదు. అది వాటిలోని అంతర్గతంగా దాగివున్న సంభావ్యతలను బయటకు తీసుకువస్తుంది. వాటి నన్నింటిని ఉత్థరిస్తుంది. వినిర్మలం కావించి, వాటిలోని సహజసిద్ధమైన దివ్యత్వాన్ని వెల్లడిచేస్తుంది. దివ్యజీవితం, దివ్యత్వానికి సామర్థ్యమున్నవాటిని వేటిని అక్కరలేనిదిగా నెట్టివెయ్యదు. సమస్తాన్ని వశం చేసుకుని, ఉజ్వలం చేసి, పూర్తిగా పరిపూర్ణం అయ్యేట్లుగా చేస్తుంది. జ్ఞానం కోసం అహర్నిశలు పాటుపడుతున్న మనస్సు ఇంకా అజ్ఞానంలో ఉంది. అది ఊర్ధ్వా భిముఖమై, అతిమానసతేజం లోనికి, అతిమానససత్యం లోనికి ఆరోహించి, దానిని కిందకు తీసుకురావాలి. ఆ విధంగా అది మన ఆలోచనలను, గ్రహణశక్తిని, నిశితదృష్టిని, మనలో ఎన్ని అవగాహనా విధానాలున్నాయో వాటినన్నింటిని, వాటి అంతరాళాల్లోను, బాహ్యాభ్యంతరాల్లోని గమనాలన్నింటిలోను పరమసత్యంతో ప్రజ్వలించేటట్లుగా పరివ్యాప్తపరుస్తుంది. అసంపూర్తిగా అర్థరహితంగా, గందరగోళంగా, ఎన్నో నిరుత్సాహమైన నిమ్నలక్ష్యాలతో ఉన్న మన జీవితం, మనకు ఊర్ధ్వంగా ఉన్న అతిమానస, అత్యంత ఉత్కృష్టజీవితంతో జతకావటానికి, ఏకమవటానికి, తన అవసరాలు, అంతఃప్రేరణలన్నీ ఉజ్వలమై, ప్రకాశవంతమవాలని తప్పనిసరిగా అభిలషించాలి. భౌతికచైతన్యం, భౌతిక అస్తిత్వం, శరీరం కూడా తాను ఇప్పుడు ఏవిధంగా ఉందో, ఏం చేస్తున్నదో అనే వాటితో సహా తాను ఇప్పుడు ఏ విధంగానూ ఊహించలేనటువంటి పరిపూర్ణతను తప్పనిసరిగా చేరుకోవాలి. చిట్టచివరకు, ఆ సుదూరతీరాల ఆ ప్రకాశ,

సౌందర్యాల, పరమానందాలతో వ్యాప్తి చెందినదై జీవితం దివ్యమై, శరీరం దివ్యత్వాన్ని సంతరించుకోగలుగుతుంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

శాంతి సామరస్యాలకు మార్గం

సర్వస్వార్థ సంకుచితత్వాలను, పరిమితులను విదిలించుకో. దివ్యమానవ సమైక్యతా చైతన్యానికి మేలుకో. శాంతి, సామరస్యాలను సాధించటానికిదే ఏకైక మార్గం.

*

దీనికి ఉన్న ఆధారసూత్రం మానవ సమైక్యత. అయితే బాహ్యమైన మానవ సమైక్యత మనిషి యొక్క మంచితనం, చిత్తశుద్ధిపై ఆధారపడి ఉంటుంది.

*

వాస్తవము, శాశ్వతము అయిన శాంతి భూమీ్మద సుస్థిరం కాబడేది వికసిత మానవచేతన వల్ల మాత్రమే. ఈ లక్ష్యం దిశగా సాగే అన్ని సాధనాలు స్వాగతీకరించవలసినవే. కాని బాహ్యమైనవి మాత్రం చాలా పరిమిత ప్రయోజనం కలవి. అయితే అన్నిటిలోకి అత్యంత ప్రధానమైనది, అత్యావశ్యకమైనది. తక్షణమే కావలసినది — మానవచైతన్య రూపాంతరీకరణ, జ్ఞానోదయము, దాని క్రియాశీల పరివర్తన.

*

ఏ రకమైన బాహ్యవైఖరి వల్ల సమైక్యత సిద్ధించదు. అలా కాక, సనాతన సమైక్య చేతనానుభవం వల్లనే అది సిద్ధిస్తుంది.

*

ప్రశ్న: మనవాళి ఎప్పుడు ఒక్కటవుతుంది?

దానికి సంబంధించిన మౌలిక సూత్రానికి చైతన్యం, జాగృతం అయినప్పుడు.

ప్రశ్న: మానవ సమైక్యతా చైతన్యం మనిషిలో వికసింప చేయటానికి యేది మార్గం?

ఆధ్యాత్మికవిద్య. అంటే — ఏదో మతపరమైనబోధన లేదా నైతికబోధన లేదా భౌతిక విజ్ఞానశాస్త్రి బోధన కాక అంతరంగ వికాసానికి మరింత ప్రాధాన్యత నిచ్చే విద్య.

*

"ఆధ్యాత్మిక జీవనం అందరిలో ఒకే అంతస్తత్వాన్ని ఆవిష్కరిస్తుంది. అయితే ఇంకా అది అనంత వైభవాన్నీ ఆవిష్కరిస్తుంది. ఇది ఏకత్వంలో అనేకత్వం కోసం, ఆ అనేకత్వంలో పరిపూర్ణత కోసం పాటుపడుతుంది."

— శ్రీమాత "ప్రశ్నలు — సమాధానాలు" 1929 (ఆగస్టు 14)

విశ్వసృష్టికి అసలు ప్రేరణ ఇదే. అంటే మౌలికంగా అందరూ ఒక్కటే. అంతా ఒక్కటే. కాని, ప్రతి మౌలిక పదార్థానికి, ప్రతి సత్వమునకు తనదైన ఒక కార్యదీక్ష అన్నది ఉన్నది. అదేమంటే — ఈ ఏకత్వంలో తన భిన్నత్వాన్ని తనకు తాను ఆవిష్కరించుకోవాలి. తెలుసుకోవాలి. ఇది తప్పనిసరిగా ప్రతి ఒక్కరిలో పెంపొందించాలి. అదే సమయంలో, మౌలిక ఐక్యతాభావనకు జాగృతమై ఉండాలి. ఇదీ ఏకత్వంలో భిన్నత్వం పనిచేయడం. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పరిపూర్ణులు కావాలి. అలాటపుడు భిన్నత్వము (దానికదే) పరిపుష్టతను, పరిపూర్ణతను సంతరించుకుంటుంది.

*

ప్రపంచమంతా ఒక్కటే. ఎప్పుడూ అలా ఉంటూనే ఉన్నది. అలాగే ఉంటుంది ఎప్పుడూ. ఇప్పుడూ అంతే. దానికి ఐక్యత లేకపోవటం కాదు. ఐక్యతను బయటినుంచి దాని నెత్తిన రుద్దటం కాదు.

తన ఏకత్వం, ప్రపంచానికి యెరుక లేదు. అది యెరుక పర్చాలి. అందుకు తగిన కృషికి ఇపుడు మంచి సమయం ఆసన్నమైనదని మేము భావిస్తున్నాం.

ఎందుకంటే, ఒక దివ్య నవచేతన, దివ్యశక్తి, దివ్యకాంతి — ఈ కొత్త మూలకానికి మీరు ఏం పేరు పెట్టండి — అది ప్రపంచంలో అభివ్యక్తమై ఉన్నది. తన సమైక్యతను తాను యెరుకపర్చుకునే శక్తి ప్రపంచానికి ఇపుడు ఉన్నది.

మూలం: శ్రీమాత

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

జీవితాన్ని దివ్యపరిపూర్ణతలో సుసంపన్నం కావించుకోవటమే అసలైన ఆధ్యాత్మికత. అంతేకాని జీవిత పరిత్యాగం కాదు.

శ్రీమాత

యువతకు పిలుపు

కొత్త ప్రపంచనిర్మాతలు యువతే కావాలి

వ్యక్తిగత పోటితత్వం, పెట్టుబడిదారీ విధానం, పశ్చిమ దేశాల భౌతిక కమ్యూనిజం విశ్వ ఆదర్శం కాకూడదు. పాత ఛాందస మతనియమాలకు బానిసలైన వారు, అనుమతితో ఆత్మచే జీవితపరివర్తనను నమ్మలేని వాళ్ళు — కాదు, కొత్త ప్రపంచ నిర్మాతలు. సంపూర్ణతర సత్యాన్ని అనుమతించడానికి, ఉన్నతతర ఆదర్శంకై శ్రమించడానికి ఎవరి మనోహృదయాలు స్వేచ్ఛగా ఉంటాయో ప్రపంచ నిర్మాతలు వారు, తప్పనిసరిగా, భూతవర్తమానాలకు కాకుండా, భవిష్యత్ కే అంకితమైనవారుగా ఉండాలి. వారు వారి జీవితాన్ని — వారి నిమ్న నైజం, ఆత్మను అధిగమించడానికి. తమలోను, మానవులందరిలోను భగవంతుని సాక్షాత్కరింపచేసుకుని, మనఃపూర్వకంగా, మానవాళి కొరకు అలుపెరుగని శ్రమపడడానికి — అంకితం కావాలి. ఈ ఆదర్శం బీజప్రాయమైనది మాత్రమే. దీని నుంచి అభివ్యక్తమయే జీవితం, ఒక చిన్న మూలబీజం. కాని మా స్థిరమైన ఆశ ఏమంటే, ఆ విత్తనం పెరిగి గొప్ప వృక్షమౌతుందని — ఆ కేంద్రం — నిరంతరంగా విస్తరించే దాని రూపానికి ఆత్మ అవుతుందని. దారితెన్నులు తెలియని పతనమైపోతూ, గందరగోళంలో ఉండే ప్రపంచంలో నూతన మానవాళి ఉద్భవించేందుకు ప్రసవవేదన పడుతోంది. మార్గదర్శకులుగా మమ్ములను ఉత్తేజపరుస్తున్న ఆత్మవిశ్వాసంతో, మా స్థానాన్ని మేము తీసుకుంటున్నాం.

*

యువతదే భవిష్యత్తు. కొత్త యువప్రపంచం అభివృద్ధిపథంలో ఉన్నది. దానిని సృజించేది, తప్పనిసరిగా యువతే. కాని మనం సృజించడానికి అన్వేషిస్తున్న ఈ ప్రపంచం — సత్యం, ధైర్యం, న్యాయం, ఉన్నత ఆశయాలు, ఋజువర్తనలో సంతృప్తి, సాఫల్యతతో కూడి కూడా ఉంటుంది. ఈ ఉద్యమ భవిష్యత్ లో — పిరికివానికి, స్వార్థపరునికి, కబుర్లు చెప్పేవానికి, — తన తోటివారిని విడిచిపెట్టేవానికి — స్థానం లేదు. సాహసంగల, ఉన్నది ఉన్నట్లు చెప్పగల, స్వచ్ఛమైన హృదయంగల,

ధైర్యం — ఆకాంక్షగల, యువత మాత్రమే — భవితకు పునాది. దానిపైనే భవిష్య నిర్మాణం కాబడగలదు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: యస్. వై. సోమయాజులు

యువభారతానికి మా పిలుపు

భారతదేశం కోసం పాటుపడాలని, ప్రపంచం కోసం పాటుపడాలని, భగవంతుని కోసం పాటుపడాలని, చైతన్యవంతులౌతున్న ప్రతి వ్యక్తికీ ముఖ్యంగా యువతకు మేమీ పిలుపునిస్తున్నాం. మీ మనస్సులను యూరపు భావాలకు కట్టి పడవేసుకుంటే లేదా మీరు భౌతిక దృక్పథంతో జీవితాన్ని పరిశీలిస్తుంటే ఆ ఆదర్శాలను మీరు పరిపోషించుకోలేరు. వాటిని నెరవేర్చడం అంతకంటె జరగదు. భౌతికపరంగా నీకు ఏ విలువా లేదు, ఆధ్యాత్మికంగా సమస్తమూ నీవే. సమస్తమూ తానే అని విశ్వసించగల భారతీయుడు మాత్రమే, సమస్తాన్నీ సాధించ సాహసించగలడు, సమస్తాన్నీ పరిత్యజించనూ గలడు. అందుకని మొట్టమొదట మీరు భారతీయులుగా తయారుకండి. మీకు వారసత్వంగా వచ్చిన మీ హక్కును తిరిగి చేజిక్కించుకొనండి. ఆర్యుని చింతనను, ఆర్యుని క్రమశిక్షణను, ఆర్యుని శీలాన్ని, ఆర్యుని జీవితాన్ని తిరిగి పుణికిపుచ్చుకొనండి. వేదాంతాన్ని, గీతను, యోగాన్ని తిరిగి స్వీకరించండి, మీ మేధస్సు లోనికి లేదా భావావేశం లోనికి స్వీకరించడం మాత్రమే గాక, మీ జీవితాల్లోకి తిరిగి స్వాయత్తం చేసుకోవాలి. వాటిని జీవించండి, అప్పుడు మీరు గొప్పవారు, దృఢకాయులు, ప్రబల శక్తిసంపన్నులు, అజేయులు, నిర్భయులు అవుతారు. జీవన్మరణాలు మిమ్ముల నేవిధంగానూ భయకంపితులను చేయలేవు. మీ పదకోశం నుంచి కష్టం, అసాధ్యం అనే పదాలు మాటుమాయమై పోతాయి. ఎందుకనంటే ఆత్మశక్తిలోనే అటువంటి బలం శాశ్వతంగా వుంటుంది. ఆ శక్తితోనే, నీ బాహ్యసామ్రాజ్యాన్ని జయించే ముందు, నీ అంతర సామ్రాజ్యాన్ని తిరిగి తప్పక గెలుచుకోవాలి. దివ్యమాత అచటనే నివసిస్తోంది. నీకు బలమివ్వడానికి, నీ ఆరాధన కోసం ఆమె అచట వేచి చూస్తున్నది. ఆమెలో నమ్మకముంచు, ఆమెను సేవించు, ఆమె సంక

ల్పాలలో, నీ సంకల్పాలను, దేశం యొక్క ఉన్నతతర అహంలో నీ అహంకారాన్ని, మానవాళి సేవలో నీకు ప్రత్యేకమైన నీ స్వార్థపరత్వాన్ని నిమజ్జనం చెయ్యి. నీలోనే ఉన్న సమస్త బలం యొక్క మూలాన్ని తిరిగి స్వాధీనం చేసుకో, అపుడు సాంఘికంగా మంచి స్థానం, అగ్రశ్రేణికి చెందిన మేధస్సు, రాజకీయ స్వాతంత్ర్యం, మానవ చింతనపై పట్టు, ప్రపంచాధిపత్యం, ఇవన్నీ నీకు తోడవుతాయి.

*

తదుపరి అన్వేషణ

ఇవి నాకు సంతృప్తి నివ్వకపోతే తర్వాత మరి నేను దేనిని అన్వేషించాలి? నేనో క్రొత్త వెలుగు కోసం, సరి కొత్త వెలుగైనా, అది అతిప్రాచీనమైనదే వాస్తవానికి. వెలుగు లన్నింటి కంటె అత్యంత పురాతనమైన వెలుగు కోసం, నేను అన్వేషిస్తాను. సర్వమానవ సత్యాన్ని అంగీకరించి, ప్రకాశింపజేసి, సమన్వయపరచేదైనప్పటికీ, అదంతా కేవలం మానవ తప్పిదంగా విశదీకరించడం ద్వారా దాన్ని తిరస్కరించి, వదిలించుకొనే ఒక ప్రమాణం కోసం నేను అన్వేషిస్తాను. ప్రక్షిప్తాలకు చోటివ్వని, సంస్కరణలకు లోనుగాని, స్థానభ్రంశం చెందనలవిగాని, క్రిములు, చెదలు నాశనం చేయలేని, భూస్థాపితం చేయలేని, కాలం హరించలేని, శృతివాక్యం, నిత్య సత్య శాస్త్రం కోసం అన్వేషిస్తాను. భగవంతుని, ఆతని జగత్తును మిథ్య అని నిరర్థకం కావించకుండా, నన్ను పరిశుద్ధుని చేసి, నా నుంచి, నా అజ్ఞానం నుంచి నాకు విమోచనం కలిగించే సన్యాసాన్ని నేను అన్వేషిస్తాను. ప్రతిదాన్నీ శంకించేదైనప్పటికీ, యదార్థం కావడాని కవకాశమున్న దేన్నీ తిరస్కరించని క్షమ కలిగిన సంశయవాదాన్ని అన్వేషిస్తాను. పంతొమ్మిదివ శతాబ్దం మినహా, మానవచరిత్రకు సంబంధించిన, తతిమ్మా శతాబ్దాలన్నీ, మతిలేని మూఢాచారాలకు సంబంధించినవనే, సమర్థనీయం కాని ఊహ మీద ఆధారపడక, లౌకికజ్ఞానం, వివేకం అని చెప్పుకొనగోరే ఒక నూతన పిడివాదం, ప్రగతిశీలంకాని వాదంతో, ప్రచండ అసహనంతో పరిమితమయ్యే విచారణ మీద ఆధారపడడానికి బదులు, సత్యాన్ని ఆవిష్కరించుకోవాలనుకునే హేతువాదానికై నేను అన్వేషిస్తాను. భౌతిక విలువను గుర్తించి, దానికే బానిసను కాకుండా, దానిని ఉపయోగించుకొను పదార్థవాదాన్ని అన్వేషిస్తాను. మాయామర్మం లేకుండా, ఇంద్ర జాలం లేకుండా, "అంధుడిగా వుండిపో ఓ మానవా! అప్పుడు చూడు!" అని

మానవాళికి పాతపడిపోయిన తామసిక పిలుపు నివ్వకుండా తన సమస్త ప్రక్రియలను, ఋజువులను బహిరంగంగా వెలుగులోనికి దెచ్చి చూపే గుప్తవిద్యకై నేను అన్వే షిస్తాను. బ్రహ్మముయొక్క సత్యం కోసం, ఆతని సారతత్వాన్ని గురించిన సత్యం కోసం మాత్రమేగాక, ఆయన అభివ్యక్తిని గురించిన సత్యం కోసం, అరణ్యమార్గంలో దారిచూపే దీపం కాక, ప్రపంచభోగానికి, ప్రపంచకర్మకు మార్గం చూపించే వెలుగు కోసం, మార్గంపై నడిపించే మార్గదర్శకుని కోసం, మానసిక అభిప్రాయాని కావలగా ఎంతో దూరాన వున్న సత్యం కోసం, సమస్త చింతన పెనగులాడే జ్ఞానం కోసం, నేను అన్వేషిస్తున్నాను. విజ్ఞానశాస్త్రానికై, మతానికై, దివ్యజ్ఞానానికై గాక వేదం, బ్రహ్మన్, అత్యావశ్యకమైన దివ్య అంశ, దివ్య అభివ్యక్తీకరణ గురించి,'యస్మిన్ విజ్ఞాతే, సర్వం విజ్ఞాతం' ఏది తెలిస్తే సర్వం తెలుస్తుందో అన్న దానికోసం అన్వేషిస్తున్నాను.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె. వి. రావు

సాధన — బాహ్యక్రియలు

బాహ్యజీవనం, దైనందిన క్షణక్షణ కార్యకలాపం మన ధ్యానానికీ, చింతనకీ పరిపూర్ణంగా ఉండే అనివార్య సాధన కాదా? ఒక్కొక్కదానికీ వెచ్చించే సమయం, సిద్ధికీ, దాన్ని సంసిద్ధం చేసుకొనే ప్రయత్నంలో పడే కృషికీ సరిసమానం అవదా? ధ్యానానికీ, చింతనకీ పర్యవసానంగా పొందే ఫలితం వికసిత దివ్యసమైక్యతా కుసుమం..దినచర్య అంటే గట్టి గట్టి లోహాలను మృదువుగా, మెరుపుగా ఉండటానికి స్వర్ణకారుని దాగలి మీద ఉంచి సుత్తి దెబ్బలతో తయారుచేసే కార్యక్రమం లాటిది అన్నమాట. వివిధ కారణాంశాలను కూడా దిమ్మ మీద ఉంచి శుద్ధిచేసి, మృదువుగా పరిపక్వం చేస్తే, ధ్యానంతో వచ్చే కాంతిని మెరిపించగలవు. ఈ విధంగా వివిధ కార్యక్రమాంశాలు మూసలో పడి పరిశుద్ధి అయినప్పుడు మన సమగ్ర అభివృద్ధికి బాహ్యక్రియల అవ సరం ఇక ఉండదు. అలా శుద్ధి అయిన ఈ క్రియలన్నీ, నీకు దివ్యంగా అభివ్యక్తం చేసే సాధనాలుగా మారతాయి. అలా మారి మిగిలిన చైతన్య కేంద్రాలను కూడా

కొలిమిలో కాలి మెరుగుపడే ద్వంద్వ క్రియలకు జాగృతం చేయవచ్చు. అందువల్లనే గర్వము, నీకు నీవే సంతృప్తిపడి ఉండటం అనేవి అడ్డంకులవుతాయి. ఎంతో విన యంతో ప్రతి చిన్న అవకాశాన్నీ వినియోగించుకొని వివిధాంశాలనూ చక్కగా, సమిశ్రితంగా, పరిశుద్ధంగా సున్నితపరిచి స్వార్థాన్ని విస్మరించటం, నిగ్రహం, భక్తి తత్పరత, కరుణ, సౌమ్యతలను వాటికి నేర్పించాలి. ఈ విధంగా ఉండటం అలవడి నప్పుడు అవి (శారీరక ఉపకరణాలు) ధ్యానంలో పాల్గొని నీ గురించిన అత్యంత ఏకాగ్రతతో నీతో తాదాత్మ్యం చెందటానికి సిద్ధమైనట్లే. ఈ కార్యక్రమమంతా నాకు చాలా దీర్ఘంగా మందకొడిగా తోస్తుంది. ఎటువంటివారిలోనైనా సమర్థవంతంగా ఇంతటి సమగ్రపరివర్తన జరుగుతుందని తోచదు. వారు తమ దృగ్విధానం మార్చు కోవచ్చు, ఋజుమార్గంలో తమని తాము నడిపించుకోవచ్చు, కానీ గమ్యం చేరటానికి మాత్రం ప్రతినిమిషం అనేక రకాల అనుభవాలు పొందే అవసరం మాత్రం తప్పిం చుకోలేరు.

పనంతా ఒక అనుభవ పాఠశాల:

ఏ పనీ చేయకపోతే నీ కెటువంటి అనుభవమూ రాదు. జీవితమంతా ఒక అను భవ క్షేత్రమే. నీ ప్రతి కదలిక, నీ కొచ్చే ప్రతి ఆలోచనా, నీవు చేసే ప్రతి పనీ నీకు ఒక అనుభవమే కావచ్చు, అనుభవం కావాలి కూడా. వ్యక్తి అంతర్గతంగా పొందాలను కున్న అభివృద్ధినంతా వర్తింపచేసి చూడటానికి ముఖ్యంగా పనే ఒక అనుభవ క్షేత్రము.

ఏ పనీ చేయకుండా ధ్యానంలోనూ, చింతనలోనూ ఉండిపోతే నీవు పురోగతి సాధించావో లేదో కూడా తెలియదు. పురోగతి పొందావనే భ్రమలో పడిపోతావు. అలాకాక పనిచేయడం మొదలుపెడితే, దానికి సంబంధించిన పరిస్థితులు, ఇతరులతో సాన్నిహిత్యం, విషయవ్యాపకం మొదలైనవన్నీ కూడా అనుభవరంగమే. దానివల్ల ఇంతవరకూ నీవు సాధించిన ప్రగతే కాకుండా ఇంకా సాధించవలసిన పురోగతి కూడా నీకు అవగతమవుతుంది. ఏ పనీ లేకుండా నీలో నీవు బిగించుకొని ఉండిపోతే పూర్తిగా ఆత్మాధీనంలో ఉన్నట్లు భ్రమలో పడిపోతావు. నీ చర్యలను ఏ క్షణమైతే బాహ్యంగా ఆచరించడం మొదలుపెట్టి ఇతరులతోనూ, పరిస్థితులతోనూ, జీవిత విషయాలతోనూ అనుబంధం ఏర్పరుచుకుంటావో అప్పుడే నీవు ఎంత పురోగతి సాధించావో కచ్చితంగా బయటకు తెలుస్తుంది. అసలు అభివృద్ధి పొందావా, లేదా,

ప్రశాంతంగా ఉంటున్నావా, ఎక్కువ చైతన్యవంతంగా, ఎక్కువ దృఢంగా, స్వార్థ రహితంగా, వాంఛారహితంగా ఉంటున్నావా లేదా అని తెలుస్తుంది. ఇంకా ఏ కోరికలూ లేకుండా ఉన్నావా లేదా, ఇష్టాయిష్టాల ఎంపిక, బలహీనత, విశ్వా సరాహిత్యాలు లేకుండా ఉన్నావా లేదా అనే విషయాలు పని చేస్తేనే నీకు అవగతమౌతాయి. కేవలం ధ్యానంలో ముక్కు మూసుకొని ఉండిపోవాలనుకుంటే మాత్రం పూర్తిగా భ్రమలో పడిపోయి దాని నుంచి బయటపడలేవు. అద్భుతమైన సిద్ధులు పొందావనుకుంటావు. నిజానికి అది నీకు కలిగినట్లుగా నీ భావన మాత్రమే ఉంటుంది.

*

ఏ పని చేస్తున్నా నీవు ఎంత పరిపూర్ణంగా చేయగలవో అంతగానూ చేయి. అదే మనిషిలోని భగవంతునికి చేసే ఉత్కృష్ట సేవ.

మూలం: శ్రీమాత

అనువాదం: అమరవాది ప్రభావతి, అమరవాది వేంకటరామ శాస్త్రి

దైవ కైంకర్యాభిలాషుల వేడుకోలు

సర్వాంతరాయాలను అధిగమించగల, ఓ సర్వేశ్వరా! నీకు పూజ్యవందనము.

మా లో ఏదీ, నీ దివ్యకార్యక్రమానికీ ఆటంకం కాకుండునట్లు మమ్మనుగ్రహించు.

దివ్య మైన నీ అభివ్యక్తీకరణకు, ఏదీ ఆటంకపర్చకుండునట్లు అనుగ్రహించు.

ప్రతి కదలికలో అనుక్షణం సకల విషయాలలో నీ దివ్యసంకల్పమే సఫలత చెందాలన్న ప్రార్థనను అనుగ్రహించు.

ప్రతి మౌలిక పదార్థములోను, మా సత్వము యొక్క ప్రతి కార్యకలాపంలోను, మా శారీరక సర్వోన్నత, శిఖరాగ్రాల నుంచి, అత్యంత అల్పాణువు వరకు, నీ దివ్య ఇచ్ఛాశక్తి మాలో సఫలం కావాలని మేమిక్కడ, నీ మ్రోల మోకరిల్లి ఉన్నామో ప్రభూ!

మేము సర్వకాల సర్వావస్థలలో నీకు విశ్వాసపాత్రులుగ నుండునట్లు మమ్ము అనుగ్రహింపుము.

మేమెల్లవేళల పరిపూర్ణముగ నీ ప్రభావమునకే తప్ప మరిక దేనికీ లోబడి

ఉండకుండునట్లు మమ్మనుగ్రహింపుము.

అచంచలమైన, ప్రగాఢమైన కృతజ్ఞతాభావము నీ పట్ల గలిగి నిన్ను కలలోనైనా మరువని భావసంపత్తిని గలిగి యుండెడు భాగ్యమిమ్ము.

అనుక్షణమూ మాకు మీరు బహుమతిగా ప్రసాదించెడు ఆశ్చర్యకరమైన వస్తువులను ఎప్పుడూ దుర్వినియోగము చేయ సంకల్పించని మనోబలము నను(గ్రహించుము.

మా సర్వస్వము నీ దివ్యకార్యములలో, నీతో మమైక్యమై నీ సాక్షాత్కారమునకు సతతము, సర్వసన్నద్ధమై యుండెడు యోగ్యతను మాకు ప్రసాదించుము.

సర్వసిద్ధిప్రదాయకుడవైన ఓ పరమోన్నత సర్వేశ్వరా! నీకు విజయోస్తు.

నీ దివ్య దిగ్విజయోత్సాహములో నిశ్చలము, ఉత్సాహభరితము, శ్రద్ధాపరిపూర్ణములతో కూడిన విశ్వాసమును, మాకు ప్రసాదింపుము.

మూలము: శ్రీమాత

అనువాదము: అన్నవరం ఆదోశయ్య

ఆధ్యాత్మికతను జీవితానికి అన్వయించుకోవటం

(జీవితమంతా యోగసాధనే)

రాజకీయ, సామాజిక జీవితంలో కళలు, సాహిత్యంలో ఆధ్యాత్మికత అంటే యేమిటి? అసలు ఈ ఆధ్యాత్మికత అంటే ఏమిటి మన అభిప్రాయం? దానివల్ల సాధించగలిగేదేమైనా వుందా? అని ఒక్కొక్కసారి మనలో మనం ప్రశ్నించుకుంటూ వుంటాం. కళలు, సాహిత్యం విషయాలు ఏమంత మెరుగుపడతాయి, వాటికి ఈ ఆధ్యాత్మిక నేపథ్యసంగీతంగా కూర్చటం వల్ల? అలాగే మన కెదురయ్యే ఆచరణాత్మక సమస్యలు, సామాజికమైనవయినా, రాజకీయమైనవయినా ఈ ఆధ్యాత్మికాంశ వలన ఎలా ప్రయోజనం పొందగలము? మనదేశ చరిత్రయొక్క ఈ దశలో ఏ భారతీయుడైనా ఇలా మాట్లాడటం — అది తన అజ్ఞానప్రదర్శనే అవుతుంది. మనం యిక్కడ నిజంగా యూరోపియన్ల అభిప్రాయాల్ని అనుకరిస్తున్నాం — చాలా కాలంగా. వారి భావనప్రకారం, మత, ఆధ్యాత్మిక దృక్పథం, మేధోపరమైన నిజజీవిత చైతన్యం ఈ రెండూ పరస్పరం విరుద్ధాలు. దేనికదే సంపూర్ణంగా దాని స్వంతమైన విభిన్నమైన దారులలో, సంపూర్ణ విభిన్న సిద్ధాంతాలను అనుసరిస్తూ వాటి మీద అచంచల

విశ్వాసంతో వినయవిధేయతలతో కూడి వుంటుంది. మనం, భారతదేశాన్ని, తన ఆధ్యాత్మిక భావనలు వూహాజనితమైనవని, అభివృద్ధి నిరోధకమైనవని, మూఢ నమ్మకాలు, అర్థం లేని మతవిశ్వాసాలతో హేతువాదం, ఆధునికతకి దూరం అవుతు న్నదనే, అనుమానంతో యెత్తి చూపుతూ వుంటాం. ఈ ఆఘాతలని యెదుర్కొని నిలబడగలిగే శక్తిసామర్ధ్యాలు కలిగి వుండాలంటే యీ దేశం సమర్ధవంతమైన చక్కని కార్యనిర్వహణాచతురత కలిగి వుండాలి. అది ఆధ్యాత్మికత సిద్ధాంతంచే శాసించబడిన పునరుద్ధరణ వల్లనే సాధించబడుతుందని స్పష్టంగా చెప్పగలగాలి. అలా చెప్పడానికి ప్రయత్నం చెయ్యాలి.

ఆధ్యాత్మికతయొక్క అర్థం, యిది కాదని మొట్టమొదట చెప్పనివ్వండి. మనం ఇహలోక జీవితాన్ని ఇహలోక ఆడంబరంగా కాక అందరం యెంత వీలైతే అంత వేగంగా మన సాంఘికజీవిత సర్వసంగపరిత్యాగులైన నిరాడంబర సన్యాసులుగా మలుచుకొని యే కొండగుహల్లోకో, పర్వతశిఖరాల పైకో తీసుకుపోయే ప్రయత్నం చెయ్యడం, లేదా ఎదుగూ బొదుగూ లేని జడత్వంతో భూమిపై యేమీ చెయ్యవలసింది లేదని, మానవజాతి సామూహిక ప్రగతి నిరోధకమైన లక్ష్యాన్ని సూచించేది కాదని స్పష్టంగా చెప్పాలి. కొంతకాలం క్రితం ఒకపుడు భారతీయ స్వభావం అలా అయి ఉండవచ్చు. కాని అదే మొత్తం ఉద్దేశం ఎప్పటికీ కాదు. ఆధ్యాత్మికత అంటే, జాతినంతా కొన్ని పరిమిత మూఢ సిద్ధాంతాలకి, రూపాలకి, మతపరమైన ప్రత్యేక వ్యక్తుల సంకుచితత్వానికి అనుగుణంగా మలిచే విధానం కాదు. పురాతన సంస్థలు, బూజుపట్టిన పాత మానసికభావాలు, అలవాట్ల తీవ్ర ప్రభావం యింకా చాలామంది మనసుల్ని కలుషితం చేస్తున్నవి. పురాతన సమాజం వల్ల, తరచు అటువంటివారి ప్రయత్నాల వల్లనే యిది జరుగుతున్నది. అయితే, కొందరలా కోరుకున్నప్పటికీ అటువంటి ప్రయత్నా లెప్పటికీ నెరవేరవని స్పష్టంగా చెప్పవచ్చు. ఎన్నో భిన్న, భిన్న మతభావాలు హిందూ, మహమ్మదీయ, క్రైస్తవ మతాల వంటి విభిన్న సిద్ధాంతాలు, వాటిలోంచి పుట్టుకువచ్చే అసంఖ్యాకంగా ఎన్నో ప్రత్యేక విధానాలు రూపుదిద్దు కుంటూన్న సిద్ధాంతాలు — ఇలా బలమైన మతాలుగల ప్రజలతో నిండిన దేశంలో అది యెప్పటికీ సాధ్యం కాదు. ఆధ్యాత్మికత అనేది ఒక ప్రత్యేక మతభావనకంటే విశాలమైనది. సువిశాలమైన ఆశయాలతో యిప్పుడది మనని సమీపి స్తున్నది. మహోన్నతమైన మతం సైతం యీ సార్వత్రిక (ఆధ్యాత్మిక) వృక్షానికి శాఖ

మాత్రమే అవుతుంది. దీనినుంచి మనం అర్థం చేసుకోవలసింది యేమిటంటే భవిష్యత్తులో మనిషి శాశ్వతమైన, దివ్యమైన మహత్తర ఆత్మని తెలుసుకుంటాడు. ఐక్యతామూలం శాశ్వతత్వము, దివ్యత్వపు విలువలతో ప్రగతికారకమైన జీవన విలువలతో కూడిన మానవజీవితానికి చేరుకునే ప్రయత్నం జరుగుతుంది.

మన ఉద్దేశంలో మానవజీవితం యొక్క మహోన్నత లక్ష్యం, ఆధునిక ప్రపంచం యొక్క జటిల సమస్యలు మానవ కార్యాచరణ విధానాలు, సాధారణమైన లేదా గతానుగతికంగా వచ్చే అంతర్గత ప్రేరణలు, ఆత్మవికాసానికి, విస్తృతికి మనిషి స్వాభావికంగా కోరుకునే సాధనాలు అంటే అభివృద్ధి వ్యాప్తి, పెరుగుతున్న వుత్సాహం, మరియు ఆనందం, కాంతి, శక్తి, సమగ్రత వీటన్నిటినీ లేదా వీటిలో కొన్నిటిని మిన హాయించడం మన ఉద్దేశం కాదు. మనిషి అంటే శరీరంగాని, బుద్ధికాని లేని వట్టి ఆత్మ కాదు. అందుచేత మానవ ఆధ్యాత్మికత అంటే బుద్ధిని చిన్నబుచ్చడం యెంత మాత్రం కాదు. జీవితాన్ని కాని, శరీరాన్ని కాని, తక్కువగా పరిగణించడం అసలే కాదు. చెప్పాలంటే వాటిని అత్యున్నతంగా పరిగణించడం, గాఢమైన ప్రాధాన్యత నివ్వడం అనాలి. ఎందుచేతంటే అవే మనిషికి ఆత్మకి సాధనాలు, జీవిత నియమాలు కూడా. సనాతన భారతీయ సంస్కృతి బలమైన చక్కగా యెదిగిన బుద్ధిబలంతో కూడిన జీవితానికి, శరీరానికి అవసరమయిన విలువలతో కూడి వుండేది. ప్రాచీన హెలెన్ సాంప్రదాయం, లేదా, ఆధునిక శాస్త్రీయ దృక్పథంలా ఒక విభిన్న లక్ష్యంతో, ఒక ఉన్నత ప్రేరణతో విశిష్టమై, ఉన్నతమైనదిగా వుండేది. అందుచేత ఈ విషయాల ఆరోగ్యకరమైన పరిపూర్ణమై పరిపుష్టం కావించే ప్రతి విషయం స్వేచ్ఛాచరణ, కార్యకారణ సంబంధానికి, శాస్త్రవేదాంతాలకి, సుందర జీవాత్మ సంతృప్తికి యింకా చిన్న, పెద్ద అయిన సమస్త కళలకి దోహదం చేసింది. అంతే కాదు శరీరంయొక్క ఆరోగ్యం, బలం కోసం, భౌతికమైన ఆర్థికపుష్టి కలిగిన జీవిగా, ప్రశాంతమైన, సమృద్ధమైన జాతిగా తయారవడానికీ దోహదం చేసింది. కొందరు మనలను నమ్మేటట్టు పలికే — 'భారతదేశానికి పేదరికం జాతీయాదర్శం' — అన్న మాట యెప్పుడూ నిజం కాదు. భారతీయ ఆధ్యాత్మికత యెన్నడూ శూన్యత్వం లేదా నైచ్యంతో కూడుకున్న విధానం కానే కాదు. తన సాధారణ సైనిక, రాజకీయ, సామాజిక ఉన్నతికి, సమర్థతలకు కొదువ లేదు. వాటి లక్ష్యం చాలా వున్నతమైంది. అంతే కాదు దృఢమైనది, విశాలమైనది కూడా. ఎంతో గొప్ప శ్రద్ధతో కేంద్రీకరించడానికి

వాళ్ళు కనుక్కున్న ఆధారంగా యెన్నుకున్న ఉపకరణాలు యివే. నూతన భారతదేశం యిదే లక్ష్యాన్ని కొత్త పద్ధతుల్లో విశాలమైన నూతన విధానాల వివిధ ప్రేరణలతో సాధిస్తుంది. అనేక క్లిష్ట పరిస్థితుల కనువైన సాధనాల సమృద్ధితో సాధిస్తుంది. ఆమెకి ప్రయత్నం, కార్యాచరణ, సమయస్ఫూర్తి, చైతన్యవంతమైన మేధ వీటికి లోటు లేదు. సరి కదా పూర్వంకంటె యిప్పుడు మరీ యెక్కువ ఆధ్యాత్మికతను మినహాయించవలసిన అవసరం లేదు, ఆధ్యాత్మికత సర్వాన్ని పరిపుష్టం చేయగలిగేదిగా ఉంటుంది.

కాని యిప్పటికీ అస్తిత్వం పట్ల పూర్తి పదార్థగతమైన మానసిక దృక్పథానికి, ఆధ్యాత్మిక దృక్పథానికీ మధ్య ఎంతో తేడా వున్నది. ఆధ్యాత్మిక దృక్పథం, మనస్సు, ప్రాణం, శరీరం మనిషి యొక్క సాధనాలే గాని లక్ష్యాలు కావు అంటుంది. అంతే కాదు అవే చివరి, మరియు మహోన్నత సాధనాలు కావు అని నమ్ముతుంది. ఇంకా వాటిని మనిషియొక్క బాహ్య ఉపకరణాత్మక స్వీయత్వం (self) గా తప్ప తన మొత్తం అస్తిత్వంగా చూడదు. పరిమితికల అన్ని వస్తువుల్లో అనంతత్వాన్ని దర్శిస్తుంది. సర్వపరిమిత వస్తువుల్లోను అపరిమితత్వాన్ని దర్శిస్తుంది. ఈ పరిమిత వస్తువుల విలువను, ఉన్నతతర అపరిమితత్వంతో (higher infinite) బేరీజు వేస్తుంది. ఈ పరిమిత వస్తువులన్నీ అనంతత్వానికి, అసమగ్ర ప్రకటనలే. కాబట్టి అవి అనంతత్వాన్ని చేరుకునేందుకే ప్రయత్నం యెప్పుడూ కూడా. వాటి ప్రయాణం ఎప్పుడూ ఆ దిశగానే అంటే అనంతం వైపునకే. బాహ్యంగా కనిపించేదాని వెనుక, దాగిన మహత్తర సత్యాన్ని చూస్తుంది. ఇది వ్యక్తి కలీతంగా వున్న సత్యాన్నే కాక విశ్వాని కలీతంగా వున్నదాన్ని వ్యక్తి ఆంతర్యం లోను, విశ్వాంతరంలోను వున్నదానిని కూడా దర్శిస్తుంది. ఈ హృదయం లేదా ఆత్మ మనిషిలో వుండే దివ్యత్వం. దాని వునికి కేవలం మనిషిలో మాత్రమే వుంటుంది. దీనికే అత్యధిక ప్రాముఖ్యత యివ్వబడుతుంది. మనిషిలో వుండే యితర సాధనాలన్నీ దీన్నెలా వుపరితలనాకి తెచ్చి ప్రకటించాలా? అని ఆలోచిస్తూ సాధన చేస్తాయి. ఈ హృదయం ఆత్మ, దివ్యదర్శనం విశ్వంలో ప్రకటించాలని ప్రయత్నిస్తాయి. దృశ్యమాన ప్రపంచం ద్వారా దివ్యత్వాన్ని గుర్తించి దర్శించడానికి మనిషి నిరంతరం ప్రయత్నిస్తూనే వుంటాడు. తన ఆలోచనని, జీవితాన్ని దానితో సమైక్యం చెయ్యడానికి ప్రయత్నిస్తాడు. ఆ దివ్యదర్శనంలోనే తన సాటి మానవు లందరితో సమైక్యతని సాధిస్తాడు. ఈ దృక్పథం మనకి మామూలుగా వస్తువుల పట్ల గల దృష్టిని సమూలంగా మార్చేస్తుంది. చివరికి అప్పటివరకు పరిరక్షిస్తున్న

సాధారణ మానవజీవితంయొక్క అన్ని లక్ష్యాలను మార్చేస్తుంది. ఈ దివ్యదృక్పథం వాటికి ఒక విభిన్నమైన అర్థాన్ని, పరమార్థాన్ని, దిశానిర్దేశాన్ని యిస్తుంది.

మన లక్ష్యం యెప్పుడూ శరీరారోగ్యం, వుత్సాహం మీదే. కాని దేని కోసం? అంటే దాని కోసమే అన్నది మామూలుగా వచ్చే జవాబు. ఎందుచేతనంటే అదే కలిగివుండవలసినది. మన ఆయువు పెరుగుతుంది. చాలా యేళ్లు జీవిస్తాం. తెలివి తేటలకు, ప్రాణిక, మానసికోద్వేగాల తృప్తికి మూలం అవుతుంది. నిజమే. దాని కోసమే ఒక విధంగా. కాని ఈ భావనలో భౌతికం కూడా ఒక ఆత్మభావప్రకటనే, మరియు దానిలో సమగ్రత కూడా వుండడం అవసరం. అది పరిపూర్ణ మానవజీవితధర్మంలో ఒక భాగమే. పైగా యిప్పటికీ అత్యున్నత కార్యాచరణ అంతటికీ మూలం కూడా. అది మనిషిలో వుండే దివ్యాత్మని కనిపెట్టి, ప్రకటించడంలో తన లక్ష్యం పూర్తవుతుంది. "శరీర మాద్యం ఖలు ధర్మసాధనం" అన్నది సనాతన సంస్కృత సూక్తి. శరీరం కూడా మన ధర్మాన్ని నెరవేర్చే సాధనమే. మన సత్వాన్ని దైవదిశగా సాగటానికి ఆవశ్యకమైనది. మన మానసిక, మానసికోద్వేగ, సౌందర్యారాధనకి సంబంధించిన భాగాలు అభివృద్ధి చెందాలి అన్నది సాధారణ దృష్టి. దాని వల్ల అటువంటివారు యెంతో సంతృప్తి పడవచ్చు. ఎందుకంటే అది మనిషి వుత్తమ స్వభావం. దానివల్ల మనిషి తనకు తానే మరింత సజీవంగా వున్నట్టు, సఫలీకృతుడైనట్లు అనుభూతి చెందుతాడు. ఇది, యిది మాత్రమే కాదు. ఇవన్నీ కూడా ఆత్మానుభావ ప్రకటనలే. మనిషి ఆంతర్యంలో అన్వేషిస్తూన్న విషయాలన్నీ వాటి వాటి దివ్య విలువలకి దోహదం చేసేవే. వాటి యెదుగుదల, సూక్ష్మత, మృదుత్వం, తీక్షణత, గాఢత వల్ల భగవంతుడికి మరింత చేరువ కాగలుగుతారు. ప్రపంచంలోని దివ్యసత్యం అనేక రూపాల్లో స్వాధీనమవుతుంది. సందర్భానుసారం వారి జీవితమంతా దానిలో స్థిరపడి అందులోనే ఐక్యమయిపోతుంది. నైతికత మామూలు దృష్టితో చూస్తే మంచి క్రమశిక్షణగల వ్యక్తి మరియు అతడి సామాజిక నడవడి లాంటివి. అది సమాజాన్ని నడిపిస్తూ అప్పటికి వున్నదాని కంటె మెరుగైన దిశ వైపు నడిపిస్తుంది. మనిషి ఇంతకు ముందు కంటె తార్కికమైన ఆలోచనతో, స్థిమితంగా, సానుభూతి నిండిన మనసుతో, ఆత్మ నిగ్రహంతో సాటివారితో వ్యవహరిస్తాడు. కాని ఆధ్యాత్మికదృష్టిలో నైతిక విలువలు అంతే కావు. అంతకు మించి మన కార్యాచరణలో అవి అభివృద్ధి సాధనాలు. మనలోగల దివ్యాత్మ ప్రవర్తనలో అవి యింకా అవసరమయినవి. మనలో యెదు

గుతున్న దివ్యత్వం వేసే ఒక ముందడుగు.

అలాగే, మన లక్ష్యాలు, కార్యకలాపాలు వీటన్నటితో సర్వస్వాన్ని ఆధ్యాత్మికత తీసుకుంటుంది. వాటికి అంతకంటె మహత్తరమైన, దివ్యమైన, యింకా విశదమైన అర్థాన్నిస్తుంది. పాశ్చాత్యవిధానంలో తత్వశాస్త్రం జగత్తుయొక్క ప్రాథమిక వాస్త వాలను హేతువాద వెలుగులలో, భావావేశరహిత విచారణతో తెలుసుకున్నది. అది శాస్త్రం మన యెదుట వుంచిన వాస్తవాలను పరిశీలించడం ద్వారా తెలుసుకోగల గడం, లేదా, జాగ్రత్తగా సకారణమైన భావనలను తార్కికమైన నిశిత పరిశీలన ద్వారా లేదా రెండింటి మిశ్రమంతో యెర్పడిన పద్ధతిలో పరిష్కరించి తెలుసుకోవడం. కాని ఆధ్యాత్మిక దృష్టితో చూస్తే అంతఃకరణ ప్రబోధం లేదా అంతరంగానుభవం వల్లనే కాని, కేవలం, హేతువాదం, లేదా భౌతికశాస్త్ర పరిశీలన వల్ల జగత్తు యొక్క ప్రాథమిక సత్యాలు తెలియబడవు. తత్వశాస్త్రం చేసేది పరిశోధనచే వివిధ సాధనల ద్వారా పొందిన జ్ఞానం యొక్క విషయాలను క్రమబద్ధీకరించడం — ఏ చిన్న అంశాన్ని వదలకుండా. వాటిని ఏకైక దివ్యసత్యం — అదే అత్యున్నత సార్వత్రిక సత్యంతో సమన్వయపరచి, క్రమపద్ధతిలో అనుసంధానపరచాలి. కొన్ని నిశ్చిత పరిస్థితుల్లో మానవజీవాత్మ దివ్యాత్మగా, దివ్యప్రకృతిగా ఎదగడానికి, ఆధ్యాత్మిక గుర్తింపుకి అవసరమయిన మూలాధారం సిద్ధం చేయడానికి దాని వాస్తవ విలువ వుపయోగపడుతుంది. భౌతికశాస్త్రం తనంతట తానే కేవలం ప్రపంచ జ్ఞానంగా మారిపోతుంది. కాకపోతే అది విశ్వాత్మపైన, వస్తువులలో అతని మార్గం పైన కొంత అదనపు కాంతిని ప్రసరింపజేస్తుంది. అది తనకి తాను భౌతిక జ్ఞానానికి కట్టు బడి వుండదు. దాని ప్రయోగఫలితానికి కట్టుబడదు. ప్రారంభ విషయంలా పదార్థం లేదా పదార్థశక్తికి సంబంధించిన అభిప్రాయం మీద జీవిత జ్ఞానానికి మనిషి మనసు ఆధారపడదు. ఆధ్యాత్మికమైన సంస్కృతి పరిశోధనలలో నూతన క్షేత్రాలకి చోటిస్తుంది. కొత్త, పాత భౌతికశాస్త్రాలు, ఫలితాలు యేవైతే వున్నాయో అవి ఆత్మ ప్రాథమిక సత్యంగా ప్రారంభించి మరియు బుద్దిబలాన్ని బుద్ధిని మించిన గొప్పదనం కలిగిన దేదైతే వుందో అది జీవితం మీద, పదార్థం మీద పనిచేస్తుంది. మొట్టమొదట అంటే ఆదిమకాలంలో కళలు, సాహిత్యం యొక్క ఆశయం మనిషి ప్రకృతి ప్రతిరూపాలను సృష్టించడమే. అది సౌందర్యభావనని సంతృప్తిపరచేది. కళాత్మకంగా సజీవమూర్తులను తమ తెలివితేటలతో జీవితం గురించి తమ వూహలకి అనుగుణంగా రూపకల్పన

చేసేవారు. కాని ఆధ్యాత్మిక సంస్కృతిలో అవి ప్రకృతిలో, మనిషిలో దాగివున్న మహోన్నత విషయాల దివ్యజ్ఞానాన్ని యింకా అత్యంత గంభీరమయిన ఆధ్యాత్మిక, సార్వత్రిక సౌందర్యాన్ని తమ లక్ష్యంగా మార్చుకుంటాయి. రాజకీయాలు, సమాజం, ఆర్థికవిధానం యివన్నీ మొదట్లో సామూహికంగా జీవించడం, వుత్పత్తి చేసుకోగలగడం జరిగేది. ఆ విధంగా తన కోరికలు తీర్చుకోడం, ఆనందించడం, శారీరకంగా అభి వృద్ధి చెందడం ద్వారా ప్రాణిక, మానసికసామర్థ్యం పొందగలిగేవాడు. కాని ఆధ్యాత్మిక లక్ష్యం వారిని అంతకంటె చాలా గొప్పవాళ్ళని చేసింది. మొదట్లో ఒక చట్రంలో యిమిడిన జీవితం — అందులోనే మనిషి తన నిజమైన ఆత్మని, దివ్యత్వాన్ని కని పెట్టి అందులోనే యెదుగుతాడు. రెండవదశలో జీవితంలో అంతకు ముందు కంటె యెదిగిన జీవాత్మ యొక్క దివ్యసిద్ధాంత నిర్దిష్టరూపం యేర్పరుచుకుంటాడు. మూడవ దశలో దివ్యప్రకృతిగల మానవజాతి సామూహికంగా కాంతి, శక్తి, ఐక్యత, సామరస్యం మొదలైన వీటన్నిటి వైపు సాగిపోతుంది. అదే జాతివికాస ప్రయత్నం. ఇది తప్ప యింతకంటె యెక్కువైనదిగాని, తక్కువైనదిగాని యేదీ లేదు. ఇదే తన శక్తిసామర్థ్యా లన్నిటిలో వున్నది. దానినే మనం ఆధ్యాత్మిక సంస్కృతి మరియు ఆధ్యాత్మికతని, జీవితానికి అన్వయించడం అంటాము.


మూలం: శ్రీఅరవిందులు

భావానువాదం: నడిమింటి విజయలక్ష్మి

దృశ్యమాలిక

జీవితాన్నంతటినీ రూపాంతరీకరించే సమగ్ర సత్యజీవనం సొసైటీకి ఆదర్శంగా ఉండేలా తన సర్వతోముఖ విస్తృతకార్యక్రమంలో, అన్ని కార్యకలాపాలు పొందు పరుపబడినవి. ఇవి:

సమగ్ర విద్య,సమగ్ర ఆరోగ్యము, సమగ్ర గ్రామీణాభివృద్ధి, సమగ్ర యాజమాన్యము, భారతీయ సంస్కృతి, యువత, స్త్రీలు, ప్రసారమాధ్యమాలు, కళలు, సమాచార సాధనాలు, నిర్విరామంగా సాగించే అభివృద్ధి, శాస్త్రీసాంకేతిక విజ్ఞానము, ఆర్థిక, వ్యాపార అభివృద్ధి, విభిన్న రంగాలలో పరిశోధన, శిక్షణ, అధ్యయన శిబిరాలు, సమావేశాలు, సదస్సులు, ప్రదర్శనలు, గ్రంథాలు, దృశ్యశ్రవణ రూపకాలు, పత్రికలు, E. పత్రికలు. ఈ క్రియాకలాపాల వివరాల దృశ్యమాలిక 25-40 పేజీలలో —



అఖిల

అఖిల భారత పత్రిక

అక్టోబర్ 2010

[illegible]
[illegible]
[illegible]

[illegible]
[illegible]
[illegible]

7-10-2010.

The Divine voice is heard
as a melodious chant in the
stillness of the heart.
[illegible]

నూతన సృష్టికి అవశ్యమయే ఒక షరతు

(శ్రీమాత దివ్యవాక్కులు)

విషయసూచిక

అత్యవసరమైన ఒక నిబంధన	3
వ్యక్తిని రూపకల్పన చేసేది ఏది?	6
అహం అంటే?	9
అహంకారం అంటే యేమిటి?	11
అహంకారము లేదని సమర్థించుకోకు	12
వ్యక్తిగత ప్రయత్నం అంటే	14
మానవ సేవ	20
తొలి మెట్టు	28
అహంకారం నుంచి వేరై యెలా బయటపడాలి?	33

కవరుపై పుష్పం:

నూతన సృష్టి

(బలంగా, శాశ్వతంగా సువాసనలీనుతూ పైకెగసిపోతుంది)



అత్యవసరమైన ఒక నిబంధన

యుగయుగాలుగా మానవజాతి ఎదురుచూస్తున్న సమయం ఇప్పుడు ఆసన్నమైంది. కాని ఇది కష్టమైనది. ఈ భూమి మీద మనం ఇక్కడ ఉన్నది విశ్రాంతి కోసమో, ఆనందం కోసమో అని నేను అనను. దానికి ఇది తగిన సమయం కాదు. క్రొత్తసృష్టికి మార్గం ఏర్పాటు చేయుటకు మనం ఇక్కడ ఉన్నాం.

ఈ భూమి మీద ఈ క్షణంలో నీవిక్కడ ఉండుట — ఒకప్పుడు నీవు తీసుకున్న నిర్ణయమే. అది నీకు గుర్తు ఉండదు. కాని నాకు తెల్సు. అందుకే నీవిక్కడున్నావు. సరే. లక్ష్యాన్ని చేరుకునే దిశగా నీవు తప్పక ఉన్నతంగా ఎదగాలి. దానికి నీవు గట్టి ప్రయత్నం చేయాలి. సమస్త బలహీనతలను, పరిమితులను నీవు అధిగమించాలి. వీటితోపాటు అన్నిటికీ మించి నీవు నీ అహానికి, "నీ కాలం చెల్లిపోయింది", అని చెప్పాలి. అహం లేని ఆ ఖాళీస్థలాన్ని దివ్యచైతన్యంతో నింపిన మానవజాతి మాకు కావాలి. అహంకారం లేని, స్వయం సమృద్ధమయిన, అతిమానసజీవి ఆవిర్భావానికి తోడ్పడేదిగా ఉండే దివ్యచైతన్యంను మేము కోరుకొంటున్నాము.

నేను కోరేది ఒక్కటే. అహంకారం యొక్క మాట వినవద్దు. అందుకు మీరు హృదయపూర్వకంగా 'సరే' అంటే నన్ను మీరు పూర్తిగా సంతుష్టిపరచినట్లే. నాకు మాటలతో పనిలేదు. నిష్కపటంగా దీనిని అంగీకరించే మీ హృదయాలు కావాలి. అంతే!

*

కాని ఒక అత్యవసరమైన నిబంధన: అహంకారం యొక్క ప్రభావం పూర్తిగా అంతం అయిపోవాలి. ఇప్పుడు అహం ఆటంకంగా ఉంది. అహం స్థానంలో దివ్యచైతన్యం స్థాపించబడాలి. శ్రీఅరవిందులు దానిని 'అతిమానసం', అన్నారు. మనం కూడా దానిని అలాగే పిలుద్దాం — అపార్థం చేసుకునే వీలు లేకుండా. ఎందువలనంటే మనం దానిని 'దైవం' అని పిలిచినపుడు, ఇతరులు దానిని, 'దేవుడు' అనే ప్రమాద ముంది. అపుడు అది అంతా అపసవ్యమవుతుంది.

*

మానవజాతి సృష్టి జరిగిన ఆరంభంలో, అహం, మానవజాతినంతా కలిపి ఉంచే సమైక్య సూత్రంగా ఉండినది. అహం చుట్టూ జీవియొక్క అనేక జీవనవ్యవస్థలు

సమీకృతం కాబడినాయి. కాని దివ్యమానవజాతి ఆవిర్భావానికి ఏర్పాటు జరిగే ఈ తరుణంలో అహం అదృశ్యమయి, చైత్యపురుషునికి దారివ్వాలి. మనిషిలో దైవం ప్రకటితమగుటకు దైవంయొక్క జోక్యంతో, ఈ చైత్యపురుషసత్వము నెమ్మదిగా మనిషిలో రూపుదిద్దుకుంటుంది.

చైత్యపురుష ప్రభావంతో మనిషిలో దైవం ప్రకటితమయి రాబోవు దివ్యమానవజాతి సంసిద్ధమవుతుంది. చైత్యపురుష అమరము. దీనితో, ఈ భూమి మీద అమరత్వం అభివ్యక్తం కాగలదు.

కావున వ్యక్తి తన చైత్యపురుషుని కనుగొని, దానితో ఐక్యం చెంది, అహాన్ని తొలగించుకుని, దాని స్థానంలో చైత్యపురుషుని నిలిపి, తనలోని అహం పూర్తిగా అదృశ్యమగుటకు, పరివర్తన చెందుటకు అహాన్ని నిర్బంధించాలి. ఇది ఇపుడు చాలా ముఖ్యం.

*

నువ్వు అర్థం చేసుకోవాలి. ఒక్కటే మార్గం. అది అహంకారం పోవాలి. అంతే. అదంతే. ఎప్పుడైతే 'నేను' అన్న భావం ఏమాత్రం ఉండదో అప్పుడింకేమీ ఉండదు. ఏ ఎగుడుదిగుడులు ఉండవు. (ఎత్తుపల్లాలులేని అపారమైనదానిని సూచిస్తుంది అని చేతులతో సంజ్ఞ చేసి చూపుతుంది మదర్). అది ఎలా ఉంటుందంటే... మాటలలో చెప్పలేనిది. కాని అది చాలా స్థిరమైన అనుభూతి: "నీవు ఏది ఇచ్ఛగిస్తే అదే (దానిని వర్ణించుటకు మాటలు చాలవు) నిజానికి, దీనికి అస్తిత్వము లేదు. ఉన్నది తత్" That మాత్రమే. ఈ అనుభూతి పొందటానికి విశాలత్వాన్ని సంవేదించటం — రూపరహితమైనది — but, it is a vision — అంతర్దృష్టి. కాని ఇది వాస్తవమైనది. వాస్తవంగా కనిపించే రూపాల కంటె వాస్తవమైనది. అపరిమితమైన దివ్యశక్తి; దివ్యస్పందన, గాఢమైన ప్రభావం కలిగిస్తుంది. దాని ప్రభావానికి లోకం మెలికలు తిరిగిపోతుంది. అది తెరుచుకుని విశాలమయినపుడు పరివ్యాప్తమవుతుంది.

ఇది చాలా ఆసక్తి కలిగిస్తుంది.

ఇది ఒక్కటే పరిష్కారం. వేరొకటి లేదు. మిగిలినవన్నీ, ఆశలు, ఆకాంక్షలు, సంకల్పాలు, — అయినప్పటికీ అది దివ్యమానవుడే, అతిమానసం కాదు. అది ఉన్నతమైన మానవత్వం. అది మానవత్వాన్ని పూర్తిగా పైకి ఉద్ధరించేది. ప్రయత్నిస్తోంది. కాని దాని వలన ఇంకా అంత ప్రయోజనకరంగా లేదు.

ఇది మాత్రం చాలా స్పష్టం. పైకెదుగుటకు గట్టి విశ్వాసంతోనే ఈ మానవత్వం నిలిచి ఉంది. కాని అది స్వయంగా తనను తాను విడిపించుకోవటం లేదు. కావాల నుకుంటోంది. తనను తాను సమర్పించుకోవాలి. లేకపోతే పని జరగదు. తనని తాను వదిలించుకోవాలి. అప్పుడే ఆ దివ్యమైనదేదో వచ్చి తన స్వస్థానాన్ని ఆక్ర మిస్తుంది.

రహస్యమంతా అక్కడే ఉంది. ఉదాహరణకు, ఈ వైపునున్న మానవజాతి సర్వాన్నీ బలవంతంగా తన వైపు లాక్కుని పైకెత్తేయాలనుకుంటుంది. (మదర్ తన నుదురు పై భాగాన్ని తన చేతులతో చూపుతారు) ఇది ఆసక్తికరంగా ఉంది. కాని అది కాదు. ఈ సాధ్యాసాధ్యాలన్నీ కూడా పూర్తిగా లేకుండా పోవాలి. అప్పుడే మానవజాతి తనలో నున్న మరింకేదో అంశాన్ని అర్థం చేసుకోగలుగుతుంది. ఆ ఇంకేదో మాత్రమే మిగిలి ఉన్నది. తనను తాను రాహిత్యం కావించుకునేటంతవరకు సాష్టాంగపడి సమర్పణ కావించుకోవాలి. 'నేను' అనే భావన పోగొట్టుకొనటం అంటే నిజానికి ఎంత కష్టం!

మూలం: శ్రీమాత

అనువాదం: సిద్ధులగారి త్రివేణి

మానవులు తమ స్వల్పమైన వ్యక్తిగత అహంకారాన్ని అధిగమించుటకు దైవంయొక్క చేయూత కోసం, వెలుగు కోసం, ప్రత్యేకంగా దైవం వైపు మరలుటకు వారిని నిర్బంధించే క్లిష్ట సమయం ఈ భూమికి ఆసన్నమైంది. వ్యక్తుల వివేచన అవిద్యాపరమై ఉన్నది.

శ్రీమాత

వ్యక్తిని రూపకల్పన చేసినదేది?

ఒక వ్యక్తిని రూపకల్పన చేసినదేది? అన్న విషయం ఎవరు చెప్తారు? మనిషిలోనే వున్న మనిషివి నీవేనని నీకు అభిప్రాయం కలిగించేదేది? పదేళ్ళప్రాయంలో వున్నప్పుడు నువ్వు పుట్టినప్పటి కంటె ఎంతో విభిన్నంగా వుంటావు. ప్రస్తుతం పదేళ్లప్రాయంలో వున్నప్పటికంటె విభిన్నంగా వున్నావు కదా! ఆ రూపం కొన్ని నిర్దిష్ట పరిమితులకు లోబడి యెదుగుతుంది. దానిలో ఒక సారూప్యత వుంది. అలా వున్నప్పటికీ, అది నువ్వు పుట్టినప్పటి రూపం కంటె పూర్తి భిన్నంగా వుంటుంది. “అది నేను కాదు.” — అని నువ్వు చెప్పినా తప్పు లేదన్నట్టు వుంటుంది. భౌతికంగా అయితే సాధారణంగా జరిగేదదే. సరే యిప్పుడు మన అంతరంగ చైతన్యం గురించి తీసుకుందాం. అయిదేళ్ళ వయస్సు వున్నప్పటికీ, యిప్పటికీ ఆ యిద్దరూ ఒకటే అని ఎవ్వరూ అనరు. కాని వీటన్నింటినీ మినహాయిస్తే, ఆలోచిస్తూన్నదీ, తనూ, ఒక్కటే అనే గుర్తింపు నీకు కలిగిస్తున్నదేది?

పోనీ. తన ప్రవాహమార్గాననుసరించి ప్రవహిస్తున్న నదినే ఉదాహరణగా తీసుకుందాం. ఎప్పుడూ ఒకే నీరు ప్రవాహంలో వుండదు. నదంటే యేమిటి? ఒక్క నీటి బొట్టు కూడా నిలకడగా వుండదు. అంటే నదిలో అదే నీరు యెప్పుడూ వుండదు. అక్కడ స్థిరత్వం అన్నది లేనే లేదు. అలాటప్పుడు నది యెక్కడిది? కొంతమంది యీ వుదాహరణతో వ్యక్తికి నిజవ్యక్తిత్వం అన్నదే లేదు అని ఋజువు చేస్తారు. ప్రాణులన్నింటి విషయంలో జరిగేదిదే. చైతన్యం మారుతుంది. ఆలోచనలు మారుతాయి. అనుభూతులు మారతాయి. అప్పుడు సత్వము being యేమిటి? వ్యక్తిత్వం జ్ఞాపకశక్తి మీద (గుర్తు పెట్టుకోవడం) ఆధారపడి వుంటుందంటారు కొందరు. నువ్వు గుర్తు పెట్టుకోగలవు. కాబట్టి నువ్వొక మనిషివి అనడం పూర్తిగా తప్పు. నీకు జ్ఞాపకశక్తి లేకపోయినా నువ్వు మనిషివే.

ఒక సాధకుడు: నదికి రూపాన్ని కల్పించేది, నదీ ప్రవాహమార్గం. నదికి రూపకల్పన చేసేది దాని ప్రవాహమార్గం, స్థానికత నిచ్చేది అదే. కాని ఆ స్థలం కూడా మారుతూ వుంటుంది. అంటే దానర్థం అన్నీ అస్థిరమైనవే. తాత్కాలికమయినవే. అదే సత్యం. కాని సాక్షికసత్యం మాత్రమే. అదే పూర్తి సత్యం కాదు. నీలో స్థిరమైనదేదో ఒకటుందనేది

అతి స్పష్టంగా నీకనిపిస్తూ వుంటుంది. అనిపించదూ? అయితే ఈ స్థిరత్వభావన యెక్కణ్ణించి వచ్చింది?

జనంలో చాలామంది 'నేను' అంటూ వుంటారు. అంటే ఆ 'నేను' అనేది తమలో ఒక భాగమని వాళ్ళ భావన. వాళ్ళ శరీరం, ఆలోచన అన్నీ వేర్వేరు కాదనే ఆ భావన తెలియజేస్తుంది. అయితే యీ చెప్పేదంతా యేదయితే వుందో అది నిరంతరం మారుతూ వుంటుంది. అందుచేత వాళ్ళు అనే, 'నేను', కూడా నిరంతరం మారుతూనే వుంటుంది. అయితే అందులో స్థిరంగా వుండే విషయం యేమిటి? చైత్యపురుష సత్వము అని స్పష్టంగా చెప్పవచ్చు. ఏదైనా స్థిరమైనది కావాలంటే అది మొట్టమొదట శాశ్వతమైనదవాలి. లేనట్టయితే అది స్థిరమైనది కాలేదు. అప్పుడది యే అనుభవాల ద్వారా పోతున్నప్పటికీ స్వతంత్రమైనదై వుండాలి. అది ఆ అనుభవాలతో తాదాత్మ్యత చెందకుండా వుండగలగాలి. దీనివల్ల నది తనని రూపకల్పన చేసిన ప్రవాహమార్గము కానే కాకూడదు. ప్రవాహప్రదేశం కేవలం వొక పరిస్థితిగా మాత్రమే వుంటుంది. ఈ పోలికే యింకొంచెం వివరించి ముందుకు తీసుకొళ్లినపుడు (పోలిక లెప్పుడూ అంత మంచివి కావనుకోండి. ఎందుకంటే పోలికల్ని జనం వాళ్ళకి కావలసినట్టు అన్వయించుకుంటారు.) నది జీవితానికి మంచి వుదాహరణ. నదిలో స్థిరంగా నిరంతరం వుండేది ముఖ్యంగా నీరు. అది బొట్టు బొట్టుకి మారవచ్చు. అదే నీరు కాకపోవచ్చు. కాని అది నీరే. నీరే లేకపోతే నది ఉండదు. అది నది కాదు. అలాగే మానవజీవి యొక్క స్థిర లక్షణం చైతన్యం. చైతన్యంతోనే మానవజీవితం మనగలుగుతుంది. అంతేగాని అది కేవలం నామ రూపాలు కాదు. ఈ రూపాలన్నిటినీ సమన్వయం చేస్తూ వీటన్నిటి గుండా పనిచేస్తున్న శక్తి యేదైతే వుందో ఆ చైతన్యం. రూపాలు నిలిచి వుండవు. వాటిని స్మృతిలో వుంచుకోవడమే కాదు. (స్మృతి అన్నది కేవలం బాహ్యామైనది.) కాని చైతన్యస్పందన లని భద్రపరచి నిలిపి ఉంచేది — 'consciousness' చైతన్యం.

అదే సృష్టి యొక్క అద్భుత రహస్యం. ఆ చైతన్యం, దివ్యచైతన్యం ఒక్కటే. కాని అదే క్షణంలో ఈ దివ్యచైతన్యం తనంతట తానే అభివ్యక్తమవుతుంది. తనని తానే ఆవిష్కరించుకుంటుంది. తనకు తానే వ్యూహరచన చేసుకుంటూ అవసరమైన వ్యాప్తి కోసం తనని తానే అసంఖ్యాకమైన చిన్న చిన్న భాగాలుగా విభజించుకుంటుంది. ఈ చిన్న చిన్న భాగాలలో ప్రతి ఒక్కటీ, మానవజీవికి మూలమవుతున్నవి. ప్రతి

వ్యక్తిగత సత్యమూ ఆ మౌలికరూపం నుంచి వచ్చిన ఆ మౌలికమునకూ, అదే , సత్యానికి నిబద్ధమైనది. అదే ధర్మము, అదే ఆ సత్యమే అక్కడ లేకపోతే ఈ వ్యక్తిత్వానికి అవకాశమే ఉండదు. ఇది నిరంతరాయంగా విస్తృతమవుతూ సాగే సంవిధానక్రమం. ఏకత్వంలో భిన్నత్వంయొక్క పరిణామ ప్రతిరూపం. ఏకత్వానికి ప్రాతినిధ్యం వహిస్తున్న మౌలిక అంశం. ఈ బహుళత్వం అసంఖ్యాక ధర్మాల రాశి; చైతన్యమూలకాలు, సత్యాలు. ఇవి విశ్వవ్యాప్తమవుతూ చివరకు ప్రత్యేక వ్యక్తిత్వాలను సంతరించుకుంటాయి. అందుచేత, ప్రతి వ్యక్తిగత సత్యము, తన ప్రత్యేక వ్యక్తిత్వాన్ని సంతరించుకునే దిశగా, అసలు మూలం నుంచి, ముందుకు, ఇంకా మున్ముందుకు, నిరంతరంగా సాగిపోతూంటుంది. కాని వ్యక్తి వైశిష్ట్యం పరిణతి పొందాక, ఆంతరిక గుర్తింపు వల్ల, బహుళత్వంలో, మౌలికమైన ఏకత్వం — ఈ సత్యం గ్రహించగలిగే సంభావ్యత సిద్ధిస్తుంది. సరిగ్గా ఇదిగో యిదే మనకు దృగ్గోచరమయే ఈ విశ్వనిర్మాణ ఉద్దేశం. ఇది యిలా దృగ్గోచరమవాలనే విశ్వనిర్మాణం సాగుతోంది. పరమేశ్వరుడు తానే, తనకు అభివ్యక్తమవుతున్నాడు — తనకు తానే యెరుకపర్చుకునేలా — The Supreme has manifested Himself to Himself so as to become aware of Himself....

వ్యక్తిత్వ సంవేదనకు ఒక కారణంగా, కావాలనే, అహం గురించి ప్రస్తావించలేదు. గ్రహించండి. ఎందుకంటే, అహం ఒక అసత్యము, భ్రాంతి. వ్యక్తిత్వం సంవేదన కూడా, దానికది, ఒక అసత్యము, భ్రాంతి. (బుద్ధుడు, శంకరాచార్యుడు నొక్కి వక్కాణించినట్లు) కాగా, వైయక్తిక విశిష్టతకు మూలం, పరమేశ్వరునిలో ఉన్నది. అహం దానికి ఒక తాత్కాలిక వికృతరూపం — అపభ్రంశం. కాని ఇపుడది అవసరం. దాని అవసరం తీరిన తర్వాత అదే మాయమవుతుంది — దివ్యసత్యచేతన స్థిరపడినపుడు —

మూలం: శ్రీమాత

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

అహం అంటే?

అహం మనిషిని తాను ఇతరుల కంటె వేరుగా ఉన్నాననే అనుభూతిని కలిగిస్తుంది. "నేను", "నేను చేస్తున్నాను", " నాకు కావాలి", "నేనున్నాను", అనే సంవేదన కలిగించేది నిస్సందేహంగా అహమే. బహుళ ప్రాచుర్యంలో ఒక తెలివితక్కువ వాక్యం ఉంది — ఆలోచిస్తాను కాబట్టి నేను ఉన్నాను "I think therefore I am" నీవు ఫలానా, ఒక మనోజీవి, అనే భావన కలుగచేసేది అహమే. ఇదే కారణం, నీవు వాని కంటె పూర్తిగా భిన్న మైనవాడివని అనుకోవడం కూడా. సాధారణ భౌతికస్పందనల సముదాయంలో నీ శరీరం కలిసి మాయమైపోకుండా నిరోధించేది, అహం. నీకు ఒక నిర్దిష్టమైన రూపాన్నిస్తూ, ఒక లక్షణాన్నిస్తూ, ప్రత్యేక చైతన్యాన్ని, నీ వున్నావనే ఉనికి అనుభూతిని నీకు కలుగజేస్తూ, అందరి కంటె స్వతంత్రంగా ఉన్నట్లు, వాస్తవంగా అటువంటి భావననే కలుగజేసేది — అదే — అహమే. ఒక వేళ ప్రపంచమంతా మాయమయిపోయినా తాను మట్టుకు ఉంటాననే ఒక అనుభూతి తటాలున కలుగు తుంది. అది This of course is the Super ego అత్యహం

నీ ప్రాణిక, మానసిక దృక్పథం ప్రకారం నీ అహం అంత త్వరగా నిన్ను వీడి నప్పటికీ, నిస్సందేహంగా, ఒక నిరాకార పదార్థసంచయంగా తిరిగి తయారవుతావు. నిశ్చయంగా అహం ప్రత్యేక విలక్షణ వ్యక్తిగా తీర్చిదిద్దే పనిముట్టు, కనుక ఒకరు ప్రత్యేక విలక్షణ వ్యక్తిగా తీర్చిదిద్దబడేవరకు, వారిలో సంఘటితంగా రూపకల్పన జరిగేదాకా, అహం తప్పనిసరిగా ఒక ఆవశ్యకమైన శారీరకాంశాన్ని నిరూపించే ఉపాదానం. ఎవరికయినా అహం ఏర్పడటానికి ముందుగానే దానిని లేకుండా చేయగలిగిన శక్తి ఉన్నట్లయితే, వారు తమ ప్రత్యేక వ్యక్తిత్వాన్ని కోల్పోతారు. కాని ఒకసారి ప్రత్యేక వ్యక్తిత్వం సంతరించుకున్నపుడు ఇక నీ అహం నీకు ఎందుకూ పనికిరానిది అవడమే కాక, హానికరమైనది కూడా అవుతుంది. సరిగా అప్పుడే దానికి తప్పనిసరిగా ఉద్వాసన చెప్పాలి. కాని, సహజంగానే అది ఎంతో ప్రయాసపడి నిర్మాణం చేసింది కనుక, అంత తేలికగా తాను నిర్మించిన పనిని వదలిపెట్టి పోలేదు, పైగా అది తన శ్రమకు తగ్గ ప్రతిఫలాన్ని ఆశిస్తుంది, అంటే అది ఆ ప్రత్యేక వ్యక్తి త్వాన్ని అనుభవించి ఆనందించాలని కోరుకుంటుంది.

*

అహాన్ని స్వాధీనపరచుకుని ఉంచుకోవటం చాలా కష్టమైన పని. కారణం, వాస్తవంగా అహాన్ని అవగతం చేసుకోవటానికి తప్పనిసరిగా దాని నుంచి బయటపడి ఉండాలి. లేకపోతే నీ కది అసలు దొరకదు. నీవు దాని సహాయంతోనే పూర్తి ఆకృతిని సంతరించుకోగలిగావు. తల నుంచి పాదాలదాకా, బాహ్యం నుంచి అంతరంగం వరకూ. భౌతికం నుంచి ఆధ్యాత్మికందాకా నీవు అహంతో నిండా మునిగి ఊరవేయబడి ఉన్నావు. అది అన్నింటితో కలసిపోయి ఉంది. నీకు అదేమిటో కూడా తెలియని పరిస్థితి. అహం అంటే ఏమిటో తెలియాలంటే, పాక్షికంగానైనా కాని, కనీసం అస్తిత్వంలో ఏదో ఒక మూలనైనా నీవు దానిని అప్పటికే తప్పక జయించి ఉండాలి. దానినుంచి విముక్తుడవు కావాలి — కనీసం పాక్షికంగానైనా. నీ సత్వం ఓ మూల యెక్కడో ఏ కాస్తో, అసలు అహం అంటే ఏమిటో తెలుసుకోవటానికి స్వతంత్రుడవై ఉండి ఉండాలి.

అహం మనలను ప్రత్యేక విలక్షణవ్యక్తిగా తయారయేందుకు దోహదం చేస్తుంది, అదే మనలను దివ్యం కానీయకుండా అడ్డుకుంటుంది. అది అటువంటిది. ఈ రెండింటిని సమన్వయపరిచి, సమాలోచన చేస్తే అహాన్ని తెలుసుకుంటావు. ప్రస్తుత ప్రపంచ వ్యవస్థలో ఏ వ్యక్తీ అహం లేకుండా ఉండటం సాధ్యం కాదు. అహంతో ప్రపంచం దివ్యం కాలేదు.

చివరగా, మనం ముగింపును ఈ విధంగా చెప్పడం సహేతుకంగా ఉండవచ్చు "మనం చేయగలిగింది, ముందుగా మనం ఎరుకతో కూడిన వ్యక్తు ల మవుదాము. దాని తరువాత మనం అహాన్ని పంపించివేసి దివ్యత్వాన్ని పొందుదాము." సచేతనమైన వ్యక్తులుగా అయినపుడు మాత్రమే, అహంతో ఎంతో తాదాత్మ్యత చెంది మనుగడ సాగిస్తున్నందున, దానిని అసలు మనం గుర్తించలేకపోతాం. దాని ఉనికిని తెలుసుకునేందుకు ఎంత శ్రమ అవుతుందో!

మన జీవితంలో జరిగేదంతా ఒకే ఒక పాఠాన్ని మనకు తెలియజెప్పటానికి — అది, మనం అహాన్ని వదిలించుకుంటే తప్ప మనకుగాని, ఇతరులకుగాని శాంతి లేదనే విషయం. అహం లేని జీవితం అత్యద్భుతం.

మూలం: శ్రీమాత

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

అహంకారం అంటే ఏమిటి?

అహంకారాన్ని సరిచేసుకొనడం చాలా తేలిక. ఎందుకంటే అదంటే ఏమిటో ప్రతి ఒక్కరికీ తెలుసు గనుక. అయితే అందుకు పూనిక వహించాలి. కావాలనుకొని అందుకు నిలబడాలి.

*

అహంకారం అంటే ఏమిటనేది ప్రతి ఒక్కరికీ తెలుసు. ప్రతిదానినీ నీ వైపే తిప్పుకోవాలనే అనుకుంటావు. మిగిలినవారి సంగతి అస్సలు పట్టించుకోవు. మరదే, అహంకారమంటే! ఈ ప్రపంచంలోని ప్రతిదానికీ నీవే కేంద్రబిందువు అవ్వాలనుకుంటావు. అన్నీ నీతోనే సంబంధపడి వుండాలంటావు. అదే అహంకారమంటే. అయితే అందరూ దానిపట్ల గ్రుడ్డిగా వుంటారు. అది ఉందనే సంగతిని పట్టించుకోరనేది సుస్పష్టమే. ప్రతి ఒక్కొక్కరికీ కొద్దో, గొప్పో అహంకారం ఉంటుంది. కొంతవరకు దానిని అంగీకరించాలి. అయితే సాధారణ జీవితంలో ఈ అహంకారం శృతిమించినపుడు ఎదురు దెబ్బలు తప్పవు. ఎందుకంటే తనలోని అహంకారం ఎదుటివారిలోని అహంకారాన్ని ఆమోదించదు.

ఇదే వైఖరి అందరిలోనూ ఉంది. దానిని అంగీకరించక తప్పదు. అవును. ప్రతి వారిలోనూ ఎంతో కొంత — ఎక్కువగా కాకున్నా — అహంకారం తప్పక ఉంటుంది. అది స్పష్టంగా పైకి కన్పించదు. పైగా దాని గురించి ఎవరికీ తెలియదు గనుక దానిని గురించి మాట్లాడేందుకు ఎవరూ ఇష్టపడరు. దానితో ఎంతగా మమేక మై ఉంటామంటే దాని ఉనికి గూడా ఎవరూ గమనించరు. అది ఉన్నంతకాలం ఎవరికీ దివ్యచేతనను గురించిన స్పృహ ఉండదు.

*

కృంగిపోవడం అనేది ప్రగాఢమైన అహంకారానికి గుర్తు. అది నిన్ను పైకొంటున్నది అని అనుకున్నపుడు నీకు నీవు ఇలా చెప్పుకోవాలి. "నేను అహంకారమనే వ్యాధికి లోనవుతున్నాను. దానిని నేను వదిలించుకోవాలి."

*

అహంకారం అనేది ఇతరులలోని అహంకారాన్ని గమనించినపుడు దిగ్భ్రాంతి చెందుతుంది.

ఈ భూమి మీద ప్రతివారు, ముఖ్యంగా ప్రతి అహంకారి — తనకు తాను సరిగ్గా వున్నట్లు తన కామనలన్నీ సరైనవే అయినట్లు సమర్థించుకుంటాడు.

మూలం: శ్రీమాత

అనువాదం: కొంగర భాస్కరరావు

అహంకారం లేదని సమర్థించుకోకు

నీవు ఇతరుల నుండి వేరు అనే వేర్పాటుభావాన్ని కలిగించేది అహం. అహం లేక పోతే — ఇతరులనుండి వేరుగా ఉన్న వ్యక్తిగా నిన్ను నీవు తెలుసుకోలేవు. అప్పుడు అత్యంత సమస్తంలో నీవు అతి స్వల్పభాగమన్న — అనుభూతి కల్గుతుంది. కాని ప్రతి ఒక్కరు — తాను (ఇతరుల నుండి) వేరు వ్యక్తినని, కచ్చితంగా, ఎరుక గలిగి ఉంటారు. నీకీ విధమైన భావనను ఇచ్చేది అహంకారమే. ఇట్టి ఎరుక నీకున్నంత వరకు — దానర్థం —నీకు అహంకారం ఉన్నదని.

అంతా నీవేనని నీకు ఎరుక గల్గడం ఎప్పుడు ప్రారంభమౌతుందో — మరియు, ఇది కేవలం ఒక అల్పాంశమేనని — ఒకే వ్యక్తియొక్క సహస్ర శత అంశాలలో నీవూ ఒక అల్పాంశంగా సర్వత్రా ఉన్నావని, అన్నిటా నీవు ఉన్నావని, వేరు భావం లేదని — ఎప్పుడు నీవు అనుభూతి పొందుతావో, అహంకారం ఇంకెంత మాత్రం లేని మార్గంలో నీవున్నావని అప్పుడే తెలుసుకో.

ఇంకా చెప్పాలంటే, 'అది నేను కాదు' — అనీ ఊహించుకోడం, చెప్పడం కూడ, అసంభవంగా ఊహించే సమయం వస్తుంది; ఎందుకంటే, ఈ విధంగా చెప్పేటప్పుడు కూడ — అంతా నీవే, నీవే అంతా, నీవే దైవానివి, దైవమే నీవు — అని చెప్పేటప్పుడు కూడ ఇంకా కొంత ఏదో మిగిలి ఉన్నట్లు ఋజువౌతుంది.

అదొక్క క్షణం — ఒక మెరుపులా సంభవిస్తుంది. ఆ క్షణంలో అంతా అదే — ఆలోచించేది, తెల్సుకునేది, సంవేదించేది, జీవించేది, అంతా సర్వజ్ఞత్వమే అని. కాని అది ఆ క్షణికమైనది నిలకడగా ఉండటం కష్టం. అక్కడ ఆ అనుభూతి కూడ ఉండదు. ఆ స్థితిని చేరామనే అభిప్రాయం కూడా ఉండదు. ఆ క్షణంలో అంతా సవ్యంగానే ఉంటుంది. కాని అపుడు ఇంకా అంతవరకు అహం యొక్క

కొంత అల్పశేషాంశ ఎక్కడో ఉండనే ఉంటుంది. సాధారణంగా అది నీలో నిన్ను గమనించే భాగం, సాక్షిభూతమైన భాగం.

అందుచేత నీకు అహంకారం లేదని సమర్థించకు. అది సరి కాదు. ఆ మార్గంలో అహంకారం ఇంకెంతమాత్రం లేకుండా ఉండే మార్గంలో ఉన్నానని చెప్పు. అలా చెప్పడం మాత్రమే సరైనది.

నీ సత్తాలో ఏ అతి చిన్న భాగంలో నైనా సరే — నీ ప్రయత్నం ద్వారా, నీ క్రమశిక్షణతో, క్రమక్రమంగా సాధించిన ఆధిపత్యం ద్వారా — నీవు అహంకారాన్ని అధిగమించి ఇంకా ముందుకు సాగితే — అది నీలో ఎక్కడో ఒక చిన్న కిటికీ తెరచి నట్లవుతుంది. ఆ కిటికీ ద్వారా జాగ్రత్తగా చూస్తే — నీకు అతిమానస క్షణికదర్శనం పొందవచ్చు. అదే ఒక వాగ్దానం. నీకా క్షణికదర్శనం కలిగినపుడు అది ఎంతో సౌందర్యవంతమైనదిగా కనుగొంటావు. మిగిలినదంతా వ్యర్థమనుకుంటావు. అహంకారసంబంధితమైనది అంతా వదిలించుకోవాలనుకుంటావు.

"అహము, భౌతికచేతన నేను కాదు" — అంటావు. నిజానికి అలా చెప్పగలిగేది నీ అంతరాత్మ. కచ్చితంగా అహం భౌతికచేతన నీ అంతరాత్మ కాదు. కాకపోతే, అహం, మానసిక, ప్రాణిక, శారీరక సత్వములచే రూపొందించబడినది. ఇవి అహం ద్వారా వ్యక్తమవుతాయి. అహం ద్వారానే అవి ఇతరులతో సంసర్గం కలిగి ఉంటాయి. ఈ సంసర్గమునకు ప్రతిస్పందిస్తాయి.

ఇక్కడ ఇదే కష్టమైనది. అందుకే, అహం నుంచి విముక్తి పొందటం, దైవం యొక్క జోక్యం లేకుండా, పూర్తిగా అసంభవం.

దీనిని నీవు పూర్తిగా అర్థం చేసుకునేందుకు, మరికొంత వివరణ ఇస్తా — మానవ ఎరుక, చైతన్యం యొక్క అన్ని అంశాలు — అనేక వేల జన్మపరంపరలలో ఆత్మ చుట్టూ చేరి, వ్యవస్థీకరించబడ్డాయి. ఈ ఆత్మరూపమే చైత్యపురుష సత్త. ఇది బాగా అభివృద్ధి చెంది వ్యవస్థీకరింపబడినపుడు — అదే ఆత్మకు, చైత్యపురుష సత్తాకు మధ్య 'మధ్యవర్తి'గా వ్యవహరిస్తుంది.

చైత్యపురుషసత్తాకి విముక్తి లభించినపుడు — అది — తన అహంకారం, భౌతికచైతన్యాలను — తన బాహ్య, పరదేశీయమైన, విశ్వప్రకృతియొక్క చలితచాల

నాలుగా అనుభూతి చెందుతుంది. ఈ చాంచల్యాలు — ఇంకెంత మాత్రం — ఏ విధంగాను — చైత్యపురుష సత్తాను ప్రభావితం చేయలేవు.

మూలం: శ్రీమాత

అనువాదం: యస్. వై. సోమయాజులు

వ్యక్తిగత ప్రయత్నము అంటే!

ప్రశ్న: అమ్మా! ఇప్పుడు పనిచేయబోయే కొత్తశక్తి వ్యక్తిగత ప్రయత్నం ద్వారా పనిచేస్తుందా? లేక స్వతంత్రంగా పనిచేస్తుందా?

ఈ వైరుధ్యం ఎందుకు? అది వ్యక్తిగత ప్రయత్నం పై ఏ మాత్రం ఆధారపడకుండా దానంతటదే స్వతంత్రంగా పనిచేస్తున్నట్లుండి, వ్యక్తి కృషిని ఏర్పాటుచేసుకుని ఉపయోగిస్తుంది. వ్యక్తిపరమైన కృషి దాని కొక సాధనము. అదే (కొత్త శక్తి) అన్నిటి కంటే శక్తివంతమైన సాధనము. పురుషప్రయత్నమనేది వ్యక్తిగతమనుకుంటే అది భ్రమే. అయితే వ్యక్తి మాత్రం తన ప్రమేయం లేకుండా పనిచేసే సార్వత్రిక క్రియ ఉంది కదా అనుకుని, తన వ్యక్తిగత కృషిని నిరాకరిస్తే తన సహకారాన్ని, నిరాకరించినవాడే అవుతాడు. కానీ ఆ మహాశక్తి తనకున్న అతి ముఖ్య ఉపకరణంగా, వ్యక్తిగత పురుష ప్రయత్నాన్ని ఉపయోగించుకుంటుంది. నీ వ్యక్తిగత ప్రయత్నమే, ఆ పరాశక్తి, ఆ దివ్యశక్తి.

దీన్ని బట్టి చూస్తే ఏం తెలుస్తుందంటే "నీ కంటూ నీకు ఉనికి లేదు" అన్నప్పుడు నీ ప్రాణికసత్వ అహం ప్రథమంగా ప్రారంభమై "సరే, నేను కాదు గదా చేసేది — అయితే నేనింకేమీ చేయను" అంటూ, "ఆ దైవం అన్నీ చేయగలదు గదా! అది ఆయన పనే, నాకేమీ పేరు లేనప్పుడు నేనింకేమీ చేయబోను" అనేస్తుంది. ఇటువంటివారికి చెప్పేదేమీ లేదు. ఈ మాటలు ఎప్పుడూ వింటూనే ఉంటాము. అహం దెబ్బతిన్నప్పుడు బయటపడేది అదే. అయితే సరైన ప్రతిస్పందన ఎలా ఉండాలంటే, సహకరించాలనే ఉత్సాహభరితమైన ప్రచోదనగా ఉండాలి. శక్తినంతా కూడతీసి, కేళీవినోదంలో పాల్గొనాలనే, సంకల్పబలాన్నంతా చైతన్యంగా తన అధీనంలో ఉంచుకొని, నీ స్థితిలో నీకు ఆలంబన ఉన్నదని, భావిస్తూ, ఏ విధమైన పొరపాట్లు చేయని ఒక ఉన్నతశక్తి నీ కంటే, ఎంతో అధికమైనది నిన్ను ఆవహించి, రక్షిస్తూ,

కావలసిన బలాన్నిస్తూ, నిన్ను తన ముఖ్య పరికరంగా ఉపయోగిస్తూన్నదనే భావనలో నీవు ఉండాలి. అలా ఉంటే తాము సురక్షితంగా పనిచేస్తున్నట్లు, ఇక ఏ రకమైన పొరపాట్లు చేయబోరని, చక్కటి ఫలితాలు వచ్చేట్లు, ఆనందంగా పనిచేస్తున్నట్లు భావిస్తారు. అదే సరైన మనోవైఖరి. అపుడు తన సంకల్పం ద్విగుణీకృతమై, అతి అనంతంలో అత్యల్పమైనది ఏమాత్రం కాదనీ, ఒక అనంతమైన విశ్వశక్తి, సత్యశక్తి తనని పనిచేయిస్తున్నదనే భావంలో సత్ప్రవృత్తి కలుగుతుంది. అదే అసలైన ప్రతిస్పందన.

మరొకటి ఉన్నది. అది దౌర్భాగ్యమైనది. "నేను కాదు గదా పనిచేస్తున్నది, వెలువడేది నా సంకల్పం కాదు కదా! పనిచేస్తున్నది నా శక్తి గాదుగా, — నేను హాయిగా కాళ్ళు జాపి కదలకుండా జడంగా, పడుకుంటాను. అదే బాగుంది", అనుకుంటూ దైవంతో, "నీ ఇష్ట మొచ్చినట్లు చేసుకో, నాకింక అసలు ఉనికే లేదు." అది నిజంగా దౌర్భాగ్యమే!

*

ప్రశ్న: చైతన్యం అతిమానసపు ఆనందాలను అందుకున్నప్పుడిక దానికి మనస్సుకు సంబంధిత విషయాలలో ఆసక్తి ఏమాత్రం ఉండదా?

అతిమానసము, మానసికమైన విషయాలలో మనస్సు మాదిరిగా ఆసక్తిని చూపదు. విశ్వానికి సంబంధించిన అన్ని విషయగతులలో తనదైన ఆసక్తిని కలిగి ఉంటుంది. అది వేరొక దృక్పథంతో, విభిన్న ధోరణితో ఉంటుంది. ఈ ప్రపంచమంతా దానికి పూర్తిగా భిన్నరూపంలో కన్పిస్తుంది. అదంతా ఉల్టాగా ఉండి అక్కణ్ణించి చూసినప్పుడు మనస్సు దర్శించినదాని కంటే భిన్నంగానూ ఒక్కొక్కసారి పూర్తిగా విరుద్ధంగానూ కనిపిస్తుంది. వాటి అర్థాలూ వేరుగానే ఉంటాయి, వస్తువుల తీరుతెన్నులు, చలనము, విధానక్రమము మొదలైనవన్నీ మరో దృష్టితో దర్శిస్తాయి. ఇక్కడున్న వాటి నన్నిటినీ అతిమానసము తెలుసుకుంటూనే ఉంటుంది. మనోగతులు, ప్రాణికచలనాలు, పదార్థగతులు మొదలైనవేగాక విశ్వకేళీహేల నంతా అది ఆసక్తితో చూస్తుంది. అయితే అది వేరొక తరహాగా ఉంటుంది. అది ఎలా ఉంటుందంటే తోలుబొమ్మలను ఆడించేవారికీ ఆట చూసేవారికీ ఉన్న తేడా వంటిదే. బొమ్మలాట ఆడించేవారికి, అవి పనిచేయవలసిన పనీ దాని వెనక సంకల్పమూ తెలుస్తుంది, వాటిని ఎలా కదిలించాలో అలానే కదిలిస్తారు. చూసేవారు మాత్రం తర్వాతేమౌతుందోననే

ఉత్సుకతతో చూస్తారు. వారికి అసలు విషయం తెలియదు కనుక ఉద్విగ్నతతో తర్వాత వచ్చే నాటకీయ పరిణామాలపై అతిశ్రద్ధతో, ఆసక్తితో ఉంటారు. వెనకాల నుండి బొమ్మలను ఆడించేవాడు మాత్రం తొణకడు, బెణకడు. ప్రశాంతంగా ఉంటాడు. తెలియనితనం (అజ్ఞానం) వల్ల ఆసక్తి పెరిగి భ్రమకి దారితీస్తుంది. అజ్ఞానంలో నుంచి బయటపడినపుడు భ్రమలు తొలిగిపోవాలి. అటువంటి భ్రమ వల్లనే మానవులకు విషయాసక్తి ఏర్పడుతుంది. అది తొలిగిపోతే ఆటపై ఆసక్తి ఉండదు. అది పేలవంగానే కనిపిస్తుంది. ఈ అజ్ఞానం, భ్రమ ఇంతకాలం ఉండిపోవటానికి కారణం అదే. మానవులకి అదే ఇష్టం కాబట్టి, దాన్ని వదలరు కాబట్టి, అది కల్పించే చిత్రమైన ఆకర్షణ నిలిచి పోతుంది.

ప్రశ్న: శరీర పరిస్థితి మార్చుకోవాలనీ, వ్యాధి నివారణ జరగాలనీ, శారీరక లోపాన్ని సరిచేసుకోవాలనీ అనుకునేవారు ఏమి చేయాలి? తను కోరుకునే గమ్యం మీద మనసు పెట్టాలా, అలా పెట్టి తన సంకల్పశక్తినంతా దాన్నిపై నిలపాలా లేక అది అలా జరుగుతుందనే విశ్వాసంతో ఉండాలా? లేక భగవంతున్నిపై నమ్మక ముంచి సమయమొచ్చినప్పుడు, రావలసిన రీతిలో దివ్యశక్తే ఆశించిన ఫలితాలు తెస్తుంది అనుకోవాలా?

ఇవన్నీ కూడా ఒకే పనికై చేసే వివిధ విధానాలు. ఏ పరిస్థితి కది అన్నీ ప్రయోజనకరంగానే ఉంటాయి. నీ కేది ఎక్కువ ప్రయోజనకారి అనేది నీవు పెంపు చేసుకున్న నీ చైతన్యస్థితి పైనా, నీవు వినియోగించుకోగల శక్తుల లక్షణం మీదా ఆధారపడి ఉంటుంది. పూర్తి నివారణ లేదా పరివర్తనా చైతన్యంతో నీవుంటే అది లోన స్థిరపడి క్రమంగా బాహ్యంగా కూడా మార్పును తెస్తుంది. అలా కాకపోతే, ఏ శక్తి ఇటువంటి పనులు చేయగలదో దాని గురించిన అవగాహన కనుక నీ కుండి, దానిని, ఉపయోగించుకునే నేర్పు నీకుంటే దాన్ని క్రిందికి దించుకొని అవసరమైన భాగాలలో వర్తింపచేస్తే, అదే, మార్పును తీసుకుని రాగలదు. అదీ కాకపోతే నీ కష్టాన్ని భగవంతునికి నివేదించి, దివ్యశక్తిపై పూర్తి విశ్వాసంతో నీకు, స్వస్థత చేకూర్చ మని కోరుకోవాలి.

నీవు ఏం చేసినప్పటికీ, ఏ ప్రక్రియ పాటించినా, దానిలో చక్కటి శక్తినీ, ప్రావీణ్యతనూ, సంపాదించినా పర్యవసాన ఫలితాన్ని మాత్రం భగవంతునికే వదిలి పెట్టాలి. నీ ప్రయత్నం నీవెప్పుడూ చేయవచ్చుగానీ నీ ప్రయత్నం ఫలించటమా,

లేదా, అనేది భగవంతుని చేతిలోనే ఉంటుంది. అంతా భగవన్నిర్ణయమే. అంతటితో స్వశక్తి ఆగిపోతుంది. తగిన ఫలితం వచ్చిందంటే అది భగవంతుని శక్తేగానీ నీది కాదు. ఇటువంటి విషయాలు దైవాన్ని అర్థించటం సబబేనా అంటున్నావు కదా! నీ లోని ఒక నైతిక లోపాన్ని పోగొట్టమని భగవంతుని వేడుకునేదాని కంటే, నీలో దైహిక లోపాన్ని నివృత్తి చేయమని కోరటం పొరపాటేమీ కాదు. నీవు ఏది అడిగినా, ఎటు వంటి ప్రయత్నం చేసినా, చేతనైనంత బాగా ప్రయత్నం చేస్తూ, నీ పరిజ్ఞానం, పాటవం, అంతా వెచ్చిస్తున్నానన్నప్పటికీ ఫలితం మాత్రం దైవకృప మీదే ఆధారపడి ఉంటుందనే భావన నీలో ఉండాలి. యోగమార్గంలో ప్రవేశించిన తర్వాత మాత్రం నీవేం చేసినా అంతా పరిపూర్ణ సమర్పణాభావంతోనే చేయాలి. "నేను ఆకాంక్షిస్తాను, నా లోపాలు సవరించుకోవాలని ప్రయత్నిస్తాను, చేతనైనంతవరకూ చేస్తాను, కానీ ఫలితం మాత్రం భగవంతునికే వదిలిపెడతాను," అనే వైఖరితో ఉండాలి.

ప్రశ్న: "ఫలితాలపై నాకు పూర్తి నమ్మకముంది, భగవంతుడు నాకు కావలసింది ఇస్తాడు" అనుకుంటే ఫర్వాలేదా?

ఆ విధంగా అనుకోవచ్చు. నీలో ఏర్పడిన ఆ దృఢవిశ్వాసాన్ని బట్టే అది సూచి స్తున్నది జరుగటానికి భగవంతుడు నిర్ణయించిట్లుగా అనుకోవచ్చు. నీ అచంచల విశ్వాసమే దైవసంకల్పమైనట్లు గుర్తు, జరగబోయేదానికి నిదర్శనము.

*

మొదట నీలో సంకల్పబలం కలగటమే ముఖ్యమనే నా నమ్మకము. అనుసరించవలసినది ఒక్కటే విధానమని ఏమీ లేదు. ఇది నేను చదువుతాను. ఎంతమంది వినటానికి ఇష్ట పడతారని అదే సమయంలో నన్ను నేనే ప్రశ్నించుకుంటాను. (పర్యవసానం దైవకృప పైనే ఆధారపడి ఉంటుంది.) దైవకృప ప్రమేయం గురించి అనుకోవడం ఇష్టం లేక పోవడం వల్లనే ప్రపంచంలో భౌతికవాదం, సానుకూలతావాదం అనేవి ఏర్పడ్డాయి. ఎవరికైనా రోగనివారణమైతే "నాకు నేనే నయం చేసుకున్నాను"; ప్రగతి సాధ్యమైతే "నేను పురోగమించాను" అనీ అనుకుంటారు. వారేదైనా వ్యవస్థీకరించినప్పుడు "నేనే నిర్వాకం చేస్తున్నాను" అనీ చెప్పుకోవాలని చూస్తారు. అలా కాక ఇంకోరకంగా చెయ్యాలనుకునేవారికి తమను తాము తమ ఆంతర్యంలో పరిశీలించుకుంటే తెలుస్తుంది — అది చేసింది తాము కాదనీ దివ్యశక్తేననీ అనుకోగలరు. వారే కొంత పురోగతి సాధించిన తర్వాత, కొంత మారిన తర్వాత, కొంత తెలుసుకున్నతర్వాత అప్పుడు,

అలవాటుగా, అసంకల్పితంగా, అనాలోచితంగా, "ఇలా ఆలోచించాలి కాబోలు" అనే అవసరం లేకుండా "దైవశక్తి లేకపోతే ఏదీ జరిగేది కాదు," అనే అవసరం లేకుండా "దైవశక్తి లేకపోతే ఏదీ జరిగేది కాదు", అని తెలుసుకుంటారు. నీలో నీవు చూసుకుంటే చాలా సరదాగా ఉంటుంది. రోజులో ఎన్నిసార్లు నీకు తెలియకుండానే "నేను ఇది చేశాను", "అది చేయగలిగాను", "అందులో సాధించగలిగాను", "ఇందులో తప్పేను", అని నీవు అనుకుంటున్నదీ తెలుస్తుంది. నీవేదైనా బాగా కృషి చేసి, మంచి ఫలితాన్ని పొందినప్పుడు మాత్రం ఒకటి రెండు నిమిషాలు తర్వాత అనుకుంటావు, "దైవశక్తి గనుక సాయంచేసి ఉండకపోతే నేను చేయ గలిగేవాడిని కాను", అని. కానీ స్వతస్సిద్ధంగా వచ్చేది మాత్రం "నేనే సాధించాను" అనేదే కదా! అయితే మనసులో ఒక భాగం మాత్రం సంస్కారాన్ని, జ్ఞానాన్ని పొంది, చింతనచేసి, తెలుసుకొని, చక్కని స్థితి పొంది ఉంటుంది, జరిగినదాన్ని అనుకుంటుంది; కానీ ఇది మనసులో ఒక భాగం మాత్రమే, అది ఎప్పుడూ చురుగ్గా ఉండదు. ఒక్కొక్కప్పుడ దాన్ని జాగృతం చేసి అడగాల్సి వస్తుంది, "అప్పుడు నేను ఏమని అనుకోవాలి, ఎలా ఆలోచించాలి?" యోగమార్గాన్ని అనుసరించేవారు మాత్రం చిత్తశుద్ధి కలవారైతే కొంత పర్యావలోకనం చేసి,ఈ విధంగా అనుకుంటారు, "నాకు తెలియలేదు. కానీ నేను విజయం సాధించానంటే అక్కడ దైవశక్తులుండి సహాయం చేసి యుండాలి. లేకపోతే నేను గెలిచేవాణ్ణి కాదు." అది అందరికీ తెలుసు. ఆ శక్తులే గనుక అక్కడ లేకపోతే చిటికిన వేలు కూడా కదపలేరని వారికి తెలిసివస్తుంది; అనుకునే క్షణం వస్తుంది. కానీ కొంతకాలం గడవాలి.... కాని మళ్ళీ మొదటికే వచ్చి చూస్తే ఎవరికి వారు పరిశీలించుకుంటే ఎన్నోసార్లు "అంతా నేనే" అనుకుంటూ తనను తాను అభినందించుకుంటూ "ఆహా! నేను ఏదో కొంత చేయగలను, సమర్థుణ్ణే" అంటారు. ఇంకా చెప్పాలంటే ఇలా అనుకోవటంలో ఉండే ఆనందం లేకపోతే ఎంతమంది పనిచేయగలరు? "నేనిది చేశాను, అది చేశాను, బాగా సాధించాను. నేను ఆట చాలా బాగా ఆడేను", అనుకోకపోతే చేయలేరు. ఇంకా కొంతమంది మనస్సు కొంచెం పరిణతి చెందినవారు నాకు కొందరు తెలుసు. వారికన్నీ బాగా తెలుసు. వారు స్థిరంగా ధ్యానానికి కూర్చుంటారు; ధ్యానంలో వారి అంతా పోతుంది, జీవశక్తి అంతా ఇగిరిపోయి ఒక రకమైన ప్రశాంతత వస్తుంది. ఏమీ చేయవలసినది ఉండదు. కదలవలసిన పనీ ఉండదు. కూర్చొని

కలలు కనడమే... చెట్టు కింద కూర్చొని, చేతులు ముడుచుకొని అంతా భగవంతునికి వదిలేస్తారు. నీకు ఆహారం అవసరమైతే దాన్ని కూడా భగవంతుడే చూడాలి. ఇదంతా బాగానే ఉండవచ్చు. కానీ దీనివల్ల ఉపకరణం సంసిద్ధం కాలేదని తెలుస్తుంది. నిజానికి అది భగవత్సేవలోకాక అహం, తన సేవలో ఉందన్న మాట. అక్కణ్ణించి అహాన్ని తీసివేస్తే అది ఏమీ పనిచేయదు. అందువల్ల చెప్పేదేమిటంటే అహంకారము ఉన్నన్ని రోజులూ పనిచేయటానికి ఈ భ్రమ అవసరము అవుతుంది. మనిషి పూర్తిగా రూపాంతరం చెందేవరకూ, అంటే, నిజమైన చైతన్యం స్థిరపడేవరకూ పనిచేయడం అవసరము.

ఈ చెప్పిన మాట పునశ్చరణ చేస్తాను. (శ్రీమాత పుస్తకం తీస్తారు)

"నీవేం చేస్తున్నప్పటికీ, ఏ ప్రక్రియతో చేస్తున్నప్పటికీ, ఆ పనిలో గొప్ప నైపుణ్యం, శక్తి సంపాదించినప్పటికీ పర్యవసాన ఫలితాన్ని మాత్రం భగంతుని చేతుల్లో పెట్టాలి. నీ ప్రయత్నం నీవు చేస్తూనే ఉండాలి కానీ ఫలప్రదం అవటమనేది భగవన్నిర్ణయమే. అక్కడితో స్వశక్తి ఆగిపోతుంది. ఫలితం కనిపిస్తే అది దైవశక్తేగానీ నీ ప్రయోజకత్వం కాదు."

ప్రశ్నోత్తరాలు 1929 (23 జూన్)

అన్ని మతాల్లోనూ ఈ విషయాన్నే బోధించారు. అదే మనుష్యులను నాస్తికులుగా చేసి ఎంతో కోపం తెప్పించింది, "ఏమీ నేను కాదా?", అనే తిరుగుబాటు ధోరణిలో.

ఈ "నేను" ఇది ఎంత బ్రహ్మాండమైనదో నీకు తెలిస్తే! ఇది సర్వత్రా వ్యాపిస్తుంది. ఇదే భౌతికవాదానికి పునాది.

మూలం: శ్రీమాత

అనువాదం: అమరవాది ప్రభావతి, అమరవాది వేంకటరామ శాస్త్రి

అహం ఎప్పుడూ, తనకేమి లేదో, ఏది కావాలో అని ఆలోచిస్తుంది. అదే దాని నిరంతర వ్యాపకం.

ఆత్మ తనకు లభించినదాన్ని తెలుసుకొని నిరంతర కృతజ్ఞతతో జీవిస్తుంది.

శ్రీమాత

మానవ సేవ

ప్రశ్న: దైవము సర్వాంతర్యామి కాబట్టి, మానవ సేవ చేస్తే, అది మాధవ సేవయే అవుతుంది; కదూ?

అద్భుతం. ఇందులో సుస్పష్టమైన విషయం ఏమంటే — నాలో దైవం ఉన్నాడు. నాకు నేను సేవ చేసుకుంటే దైవసేవ చేస్తున్నట్లే! (ఆమె నవ్వు) నిజానికి దైవం సర్వత్రా ఉన్నాడు. దైవం తన పని తాను కావించుకుంటాడు. నీ ప్రయోజనమేమీ లేకుండానే.

నీకు బోధపడలేదు. నా కది స్పష్టంగా తెలుస్తోంది. కాని వాస్తవంగా దైవం అంతటా ఉన్నాడని నీవు తెలుసుకున్నప్పుడు మానవసేవకి ఇక నీ ప్రమేయమనేది ఎక్కడ ఉంది? మానవసేవ యెలా చేయాలో భగవంతుని కంటె నీకే ఎక్కువ తెలిసినట్లుంది. భగవంతుని కంటె నీకు ఎక్కువ తెలుసా మానవసేవ ఎలా చేయాలో?

దైవము సర్వాంతర్యామియే. అవును (కాని) విషయాలు దివ్యంగా కనపడటం లేదు.... నా వరకు ఒకటే పరిష్కారం కనిపిస్తోంది. నీవు మానవసేవ చేయాలనుకుంటే, నీవు చేయవలసినది మాత్రం ఒకటి ఉంది. అది — నీకు ఎంత వీలైతే అంతగా నిన్ను నీవు కూడగట్టుకుని దైవానికి అర్పణ కావించుకో. అదే పరిష్కారం. ఎందుకంటే, వాస్తవంగా భౌతికానికి ప్రాతినిధ్యం వహించిన నీవు, కనీసం ఈ విధంగానైనా కాస్తంత దివ్యవికసనాన్ని పొందగలుగుతావు.

అంతటా భగవంతుడున్నాడంటారు. (మరి) విషయాలు మారవేమి? కారణం — దైవము పట్ల స్పందన లేక. దైవానికి ఏదీ ప్రతిస్పందించటం లేదు. ఇది తెలుసుకోవాలంటే చైతన్యపు లోతులలో అన్వేషించాలి. మానవసేవ చేయటానికి ఏం చేస్తావు? పేదవాళ్లకి అన్నం పెడతావా? కోట్లమందికైనా నీవు భోజనం పెట్టగలవు. అది పరిష్కారం కాదు. సమస్య యథాతథంగానే ఉంటుంది. మానవుల జీవనప్రమాణాలను పెంచుతావా? వాళ్లలో దైవం ఉన్నాడు. పరిస్థితులు మారవేమి? నీ కంటె భగవంతునికే మానవాళి పరిస్థితి తెలిసి ఉండాలి. అయినా నీ వెవరివి? కాస్తంత భౌతికానికి, కాస్తంచైతన్యానికి ప్రాతినిధ్యం వహించినవాడివి. దానిని, "నేను", అని పిలుచుకుంటున్నావు. నీవు మానవాళికి, ప్రపంచానికి, విశ్వానికి నిజంగా సాయం చేయాలని అభిలషిస్తే నీవు చేయవలసినది ఒక్కటే — ఆ కాస్తంత, "నేను", అనుకునే

దానిని పరిపూర్ణంగా దైవార్పణ కావించు. ప్రపంచం ఎందుకని దివ్యంగా లేదు? కారణం సుస్పష్టమే. ప్రపంచం ఉండవలసిన రీతిలో లేదు. కాబట్టి, సమస్యకి ఒక్కటే పరిష్కారం. నీకు ఉన్న సర్వస్వమూ అర్పణ కావించటమే. పరిపూర్ణ అర్పణ — సర్వ ప్రపంచం కోసం, విశ్వం కోసం. ఇంతకన్న మేలైన పరిష్కారం మరొకటి లేదు. మానవాళికి నీవు ఏ విధంగా సహకరించాలనుకుంటున్నావు? ఏది అవసరమో నీకే తెలియదు. ఏ శక్తికి నీవు సేవ చేస్తున్నావో, బహుశః నీకు ఇంకా తక్కువ తెలుసు. అసలు నువ్వు మారకుండా ఇతరమైనదానిని నీవెలా మార్చగలుగుతావు?

ఏది ఏమైనా అందుకు తగిన శక్తివంతుడివి కావు నీవు. ఎదుటివాని కంటె ఉన్నత చైతన్యవంతుడివి కాకుండా, అతనికి సహకరించగలనని నీవెలా అనుకుంటావు? ఇదెంతటి తెలివితక్కువ భావన! నేను ఒక వసతిగృహాన్ని నిర్మిస్తాను, బాలవిహార్ ని తెరుస్తాను, కొంతమందికి గంజి పోస్తాను, విద్యాబోధన చేస్తాను — అని చిన్నపిల్లలు అంటారు. మిగిలినవాళ్ల కంటె నీవు ఇంకా బాగా తెలివైనవాడినని, చేయవలసినది, చేయకూడనిది నాకే బాగా తెలుసుననుకుంటావు. మానవసేవ అంటే ఇదేనని నీ భావన. దీనివల్ల అంతగా మార్పు ఏమీ రాదు. మానవసేవ అంటే, స్కూళ్లు, వైద్యాలయాలు తెరవటం కాదు.

ప్రశ్న: *అంటే అయినప్పటికి అది సహకరించదా? పాఠశాలలన్నీ మూసివేస్తే...*

మానవాళి ఇదివరకు కంటె మరింత సుఖంగా ఉన్నదని, మరింత పురోగతి ఉన్నదని నేను అనుకోను. సమాజంలో నేను కూడా ఏదో, something, అనే భావన నీకిది కలుగచేస్తుంది. దీనినే నేను ప్రగాఢమైన కోరిక — అంటాను. స్కూళ్లకు మొదలైనవాటికి డబ్బు ఇవ్వటానికి సిద్ధపడే ఈ జనమే, భగవత్కార్యం చేయటానికి నిర్ణయిస్తే, నిజంగా అది దైవకార్యమని వారు ఒప్పుకున్నా, ఏమీ ఇవ్వటానికి సుముఖంగా ఉండరు. ఎందుకంటే, ఆ సహాయానికి గుర్తింపు ఉండదు కదా! ఏదో మంచిపని చేశామనే సంతృప్తి వాళ్లకు ఉండదు. దీనినే నేను ambition అనేది. వైద్యశాలలు తెరుస్తామంటే బోలెడుమంది లక్షల కొలదీ డబ్బు ఇచ్చేవాళ్లు నాకు తెలుసు. తామేదో ఘనకార్యం, ఉదారమైనది, దయాపూరమైనది చేస్తున్నామనే సంతృప్తి వాళ్లకి. గొప్పగా భావించుకుంటారు. నేను దానినే ప్రగాఢమైన వాంఛ అని అనేది.

నాకు తెలిసిన ఒక కొంటె కోణంగి అంటూండేవాడు — "దైవసామ్రాజ్యం అవ

తరించటానికి ఆట్టే కాలం పట్టదు. ఈ పరోపకార పరాయణులు చేయటానికి మిగిలే దేముంటుంది? మానవాళికి ఇక ఏ కష్టం లేనపుడు, పాపం, పరోపకారపరాయణులకు ఇక ఏ పని ఉండదు" — అది కష్టమే. అయితే ఇది నిజం. దైవానికి తాను అర్పణ కావించుకోకపోతే ఈ లోకం, ఉన్న పరిస్థితి నుంచి బయటపడదు. ఈ సుగుణాలన్నీ — వాటిని గురించి నీ కెంతో గొప్పగా చెప్పవచ్చు. నీ ఆత్మసంతృప్తిని పెంపొంది స్తాయి — అంటే నీ అహాన్ని. అవి నీకు దైవాన్ని యెరుకపరిచేందుకు సహాయపడవు. దయాళువులు, వివేకవంతులు — వీళ్లని మార్చటం చాలా కష్టం. వారు తమ జీవి తంతో చాల సంతృప్తిగా ఉంటారు. అనేక రకాలుగా, పాపం, అవివేకంగా జీవితంలో ప్రవర్తించినవాడు వెంటనే, పశ్చాత్తాపంతో, "నేనేమీ కాను. ఏమీ చేయలేను. నన్నేమి చేస్తావో, అంతా నీదే భారం," — అంటాడు. ఎంతో తెలివైనవాడు, వివేకం ఉన్నవాడు, ఆడంబరంగా ఉన్నవాని కంటె, అలాటివాడు సరియైనవాడు, దైవానికి సన్నిహితంగా ఉన్నవాడు అవుతాడు. వీడు తనను, తాను ఉన్నట్లుగానే దర్శించుకుంటాడు.

మానవాళికి, ఉదారంగా, వివేకంతో, ఎంతో చేసినవాడు, మరెంతగానో ఆత్మసం తృప్తితో, పరిణామానికి సంబంధించినంతవరకు, సక్రమమైన భావనలేక, పరివర్తనకు తగిన సరియైన అవగాహన లేకుండా ఉంటాడు. సాధారణంగా ఇలాటివాళ్లు ఏమంటా రంటే — "నేనే కనుక, నిజంగా ఈ ప్రపంచాన్ని సృజించినవాడినే కనుక అయి ఉంటే ఈ విధంగా సృష్టించి ఉండేవాడిని కాను. మరింత మేలైనదిగా సృష్టించి ఉండేవాడిని". భగవంతుడు అధ్వాన్నంగా చేసినదానిని సరిచేయ ప్రయత్నం చేసేవారన్న మాట! వాళ్ల ఈ చిత్రీకరణ ఎంత అవివేకమైనది, పనికిమాలినది! ఈ రకమైన దృక్పథంతో దైవానికి సన్నిహితుడవు కాలేవు. నీకు, దైవానికి మధ్య సచైతన్యమైన అహంకారిక మానసిక ఉద్ధతి దైవాన్ని విచారణ చేసేదిగా ఉంటుంది. ఇందులో అపార్థం చేసుకోవడమనేదేదీ లేదనే ధీమా వాళ్లలో ఉంటుంది. తామే ఈ ప్రపంచాన్ని కనుక సృష్టించి ఉంటే భగవంతుడు చేసిన తెలివితక్కువ పనులు తాము చేసి ఉండేవాళ్లం కామనే దృఢ నమ్మకం వాళ్లలో ఉంటుంది. ఇదంతా ఎందుకు వస్తుందంటే, గర్వం, డంబం, ఆత్మాతిశయం — వీటివల్ల. ప్రజాసేవ చేయాలనుకునేవాళ్లలో సరిగ్గా ఇదే బీజప్రాయంగా ఉంటుంది.

ఇలాంటివాళ్లు మానవాళికేమి ఇస్తారు? అసలేమీ ఇవ్వరు! వారిలో తమ ప్రతి ఒక్క రక్తపుబొట్టు, తమ మేధోసర్వస్వము, తమ యావత్సంపద — ధారపోసినా

— ఈ అనంతకాలంలో క్షణికమైన ఒక్క వ్యక్తిలో కూడా పరివర్తన తీసుకురాలేరు. నిరవధికంగా సేవ చేయగలమని నమ్ముతారా వారు? మానవుని కంటె ఉన్నతోన్నతమైన వారెందరో వచ్చారు. వెలుగును చూపారు. జీవితాలను అర్పించారు. అదేమంతగా పరివర్తన తీసుకురాలేదు. అలాంటిది ఈ పిపీలికం లాంటి జీవుడు నిజానికి ఏం సహ కారం అందిస్తాడు, అది వాని దర్పం కాకపోతే? వారి వాదన ఏమంటే — "ప్రతి ఒక్కరు తాను చేయగలిగినంత మంచి చేస్తే, అంతా సవ్యంగా నడుస్తుంది", — అని. నేనలా అనుకోను. కాగా అది అసంభవం. ఒకానొక పద్ధతిలో, విశ్వంలో, ప్రతి ఒక్కటీ కూడా తన శక్తివంచన లేనంత తను చేస్తుంది. అది యెంత ఉత్కృష్టంగా చేసేదే అయినప్పటికీ, అదేమీ కానే కాదు. ప్రతీదీ పరిణతి చెందాలి. అంతవరకు ఏదీ మారదు. సర్వోత్కృష్టమైనది ఏదైతే ఉన్నదో అది పరిణామం చెందాలి. అజ్ఞానం స్థానంలో సుజ్ఞానం, చైతన్యశక్తులు, ఉద్భవించాలి. అలా కాకపోతే మనం ఎప్పుడూ గానుగెద్దులా, చుట్టు తిరుగుడుగా అవివేకం చుట్టూ, తిరుగుతూ ఉండవలసినవారమే.

మీరు లక్షల కొలదీ వైద్యాలయాలు యేర్పాటు చేయవచ్చు. అయినా అనా రోగ్యం మాయమవదు, సరి కదా, అందుకు భిన్నంగా, జనం, రోగగ్రస్తులు కావటానికి ఒక సదుపాయం కలుగచేసి, ప్రోత్సహించినట్లు అవుతుంది. "నేనీ ప్రపంచంలో పుట్టినందుకు, నేను ఇతరులకు సహాయం చేయాలి," అనుకుంటాం. "నాదెంత నిస్వార్థము! మానవసేవ చేస్తున్నాను." ఇలాంటి అభిప్రాయాలు మనలో నాటుకు పోయాయి. అంతరంగంలో కలత లేకుండా ఉంటుంది. మరి ఇదంతా స్వార్థపరాయ ణత్వం కాక మరొకటి కాదు.

అసలు నిజం చెప్పాలంటే, నిన్ను నువ్వే ముందు పట్టించుకోవాలి. బాధను తగ్గించాలనుకుంటావు. కాని, బాధను తట్టుకోగలిగే శక్తిని, నిశ్చయాత్మకమైన ఆనం దంగా పర్యవసింపచేసుకోగలిగేవరకు, ప్రపంచం మారదు. But unless you can change the capacity of suffering into a certitude of being happy, the world will not change. అదెపుడూ అలాగే, ఉంటుంది. గానుగెద్దులా చుట్టుతిరుగుడే. నాగరికతలు మార్పు చెందుతుంటాయి. ప్రళయాలు సంభవి స్తుంటాయి. కాని విషయాలు మాత్రం ఏం మారవు. ఎందుకంటే — అక్కడ ఒక లోపం ఉంది. అక్కడ ఉండవలసినది అక్కడ లేదు. అదే చైతన్యము. అంతే.

At least, that's my opinion. అదే, మరి, నా అభిప్రాయం. మీకిది యెంత వరకు ఉపకరిస్తుందో, మీ ముందుంచాను. మీరు స్కూళ్లు, వైద్యశాలలు నిర్మిస్తామంటే నిర్మించండి — మీకది ఆనందమైతే, దానికంత ప్రాధాన్యత లేదు. నేను, 'Monsier Vincent' సినిమా చూశాను. నా కది చాలా ఆసక్తి కలిగించింది. పదిమంది పేదవాళ్లకి భోజనం పెడితే, తర్వాత అలాటి వాళ్లు నూరుమంది తయారవటం గమనించారు. అందులో, Colbert అనే అతను అంటాడు — "నీవు పేదవాళ్లని పోషిస్తూ మరింత మందిని సృష్టిస్తున్నావు" — అని. అది పూర్తిగా అవాస్తవం కాదు. ఏమయినప్పటికి, పాఠశాలలు స్థాపించటం, చదువు నేర్పటం, రోగులను ఆదుకోవటం, ఇది నీకు రాసిపెట్టి ఉంటే, మంచిదే. అదే కానీ. అయితే దానినే నీవు మరీ ప్రధానమైనదిగా తీసుకోకూడదు. అదంతా నీ ఆనందం కోసం పటాటోపంతో చేస్తున్నది. "నాకు ఆనందం ఇస్తుంది కాబట్టి నేను చేస్తున్నాను", అని చెప్పు. యోగం గురించి మాట్లాడకు. నీవు యోగం చేయటం లేదు. నీవేదో గొప్ప ఘనకార్యం చేస్తున్నావని నమ్ముతావు. అంతే. ఇది నీ వ్యక్తిగత సంతృప్తి కోసం.

ప్రశ్న: ఋషి విశ్వామిత్రుడు ఒక నవలోకాన్ని సృష్టించాడంటారు?

ఏం చేశాడతను? చెప్పండి. ఈ ప్రపంచంతో సంతృప్తిపడక, క్రొత్త ప్రపంచాన్ని సృష్టించాడు. అంతే కదా? అదిపుడు ఎక్కడ ఉంది?

సహజంగా ముందు ఆయన భావన ఏమంటే ప్రపంచ సృష్టికర్త కంటె తను అధికుడు కావాలని. అది బాగా జరగలేదనచ్చు. బాగా జరిగి ఉండకపోవచ్చు. దైవం కంటె నీవు బాగా చేయగలననీ నీవు నమ్ముతే నేనది పొరపాటు అనను. నీకు (ambition) వాంఛ లేదని నీవనలేవని నేను అంటాను. వాళ్లది పొరపాటు అనీ అనను. వాళ్లు వాంఛాపరులంటాను. అంతే. మరొకటి కాదు. వీళ్లు మంచివాళ్లు. దయార్ద్రహృదయులు. వాళ్లని మార్చటం కష్టం. అహం, భయంకరమైనది. అందుకు ఇదే తార్కాణం. వారి కరుణ, న్యాయప్రవర్తన మొదలైనవి ఎంతో గొప్పవి. మరొకదానికి అక్కడ స్థానం లేదు — భగవంతునికి కూడా.

మంచి పని ఒకటి చేయటానికి అర్హత కల్పించుకునే ముందు, వ్యక్తి అంతరంగం లోనికి తొంగి చూచుకుని ఒక ముఖ్య విషయాన్ని కనిపెట్టాలి. అదేమిటి అంటే — వ్యక్తికి అస్తిత్వము లేదు. ఉన్నది ఒక్కటే. అదే దైవము. ఇది నీవు కనుగొననంతవరకు మార్గంలో ముందుకు సాగలేవు. దీనిని కనుగొనటం అంటే తాబేలు, పై డిప్పను

పగులగొట్టటం లాంటిది. అంత గట్టిది. నీకు తాత్త్వికచింతన, ఆధ్యాత్మిక బుద్ధి కనుక ఉంటే నిన్ను నీవు ప్రశ్నించుకో: నాలో, 'నేను', అన్నది ఏమిటి? దేనిని "నేను", అనుకుంటాను? నా శరీరాన్నా? అదెపుడూ పరివర్తన చెందుతూనే ఉంటుంది. ఎపుడూ ఒకేలా ఉండదు. నా బాహ్యేంద్రియ జ్ఞానములా? అవి ఎంతో తరుచు మారుతూనే ఉంటాయి. నా ఆలోచనలా? అవి నిరంతరమూ ఉత్పన్నమవుతూం టాయి, నాశనమవుతుంటాయి. అదేమీ "నేను" కాదు. నేను, నా స్వంతము అనేది ఎక్కడ? నేను అవిచ్ఛిన్నంగా కొనసాగుతున్నాను అనే సంవేదన కలిగించేది ఏది నాకు? (ఈ అన్వేషణ) ఇది ఇలా నీవు చిత్తశుద్ధితో కొనసాగిస్తూ ఉంటే, కొన్ని సంవత్సరాలు వెనక్కి వెడతావు. సమస్య అంతకంతకు, మరింత జటిలమవుతుంది. గమనిస్తూనే ఉంటావు. నీకు నీవే అనుకుంటావు. "ఇది నా స్మృతి". కాని వ్యక్తి స్మృతి కోల్పోయినా తను తానుగానే ఉంటాడు. ఈ ప్రగాఢ అన్వేషణ అలా సాగిస్తూ ఉంటే, ఒక సమయం వస్తుంది. అపుడు అంతా అదృశ్యమైపోతుంది. నిలిచి ఒక్కటే ఉంటుంది. అదే దైవం. దివ్య అస్తిత్వం. మిగిలినదంతా మాయమై పోతుంది. ఎండలో పెట్టిన వెన్నలా కరిగిపోతుంది.... వ్యక్తి దీనిని కనుగొన్నట్లైన, వ్యక్తి తాను ఒక అలవాట్లు మూట, a bundle of habits తప్ప, మరొకటి కాదని తెలుసుకుంటాడు. ఎప్పుడూ కూడా దైవస్పృహ లేనిది దైవం గురించి తెలియనిది మాత్రమే మాట్లాడేది. ప్రతి వ్యక్తిలో ఎన్నో వందల, "నేను", "తాను" లు, selves ఉంటాయి. అవి పరిపరివిధాలుగా మాట్లాడుతాయి. ఈ "నేను" లు, నిశ్చైతన్యమైనవి. చలిస్తూ ఉండేవి. నిరంతరమూ మార్పుచెందేవి. తను ఇవాళ మాట్లాడినదానికి నిన్నటిదానికి తేడా ఉంటుంది. కొంచెం ముందుకు సాగి గమనిస్తే, 'తాను', మాయమై పోతుంది. అక్కడ ఒక్కటే మిగిలి ఉంటుంది. అదే, భగవంతుడు. ఆ ఒక్కటే ఎప్పుడూ మారనిది.

ప్రశ్న: దయాపూరంగా స్పందిస్తూ ప్రపంచానికి సహకరించగలమా?

శుభకామనలతో ఎంత మార్పునైనా తేవచ్చు. కాకపోతే వ్యక్తి స్వచ్ఛంగా ఉండాలి. మంచితనం కల్తీ కానిదిగా ఉండాలి. పరిపూర్ణంగా స్వచ్ఛమైన ఒక ప్రార్థన, నిజమైన ప్రార్థన ప్రపంచంలోకి బయల్వెడలుతే అది పనిచేస్తుంది. ఇది సుస్పష్టం. మనసులో ప్రవేశించి మలినం కాని పరిపూర్ణంగా స్వచ్ఛమైన ఆలోచన ఎక్కడ ఉంది? దిగజారుడు, పతనాలే. అంతరంగ చైతన్యం, జ్ఞానదీప్తితో కూడిన కృషితో

నీ కామనను అధిగమించగలిగిననాడు, అంటే దానిని చెదరగొట్టి, నిశ్శేషం కావించు కున్నపుడు, ఆంతర్యంలో మంచితనం వెల్లివిరుస్తుండగా, నీ కామనలను పరితృప్తి కావించుకుని పొందే ఆనందం కంటే వేయిరెట్లు, ఆనందానుభూతిని పొందుతావు. తర్వాత దాని పరిణామం అత్యద్భుతంగా ఉంటుంది. నీకు తెలియకనే, పరోక్షంగా, ప్రపంచంలో ప్రతిఫలం ఉంటుంది — అది ప్రసరిస్తూ నలువైపులా. నీవు సృజించిన స్పందనలు స్పందిస్తూనే ఉంటాయి. ఇవి మంచుబంతిలా అంతకంతకు పెరిగి పెద్దవవుతుంటాయి. నీ సౌశీల్యం వల్ల నీవు పొందే లబ్ధి నీకు అల్పమే కావచ్చు. కాని లోకానికది అనల్పంగా ఉంటుంది. ఇప్పుడు నీ కింతవరకు చెప్పిన దాని నా ఉద్దేశం ఇదే. అంతరంగ స్వభావంలో ఏ మార్పు లేకుండా బాహ్యంగా చేసే పనులన్నీ — స్కూళ్లు, వైద్యశాలల నిర్మాణం వగైరా — గొప్ప కోసం చేసేవి. అలా కాక, గోప్యంగా తనను తాను అధిగమించి మంచి అంతరంగంతో చేసేవి మరింతగా, చెప్పలేనంత విజయాన్ని లభింపచేస్తాయి — వాటి పరిణామాలు గుప్తంగా ఉన్నప్పటికీ. నీ లోని ప్రతి అసత్య చలితచాలనము, దివ్యజీవనానికి నిషిద్ధమే. నీవు చేసిన చిన్న ప్రయత్నాలే నీకు తెలియకుండా అధికఫలితాలు ఇస్తాయి. వ్యక్తిగతంగా కాకపోవచ్చు. సార్వత్రికమైన ఫలితాన్ని సమకూరుస్తాయి ఖచ్చితంగా.

నీ వేమైనా నిజంగా మంచి చేయతలచుకుంటే, నీవు చేయగలిగిన ఉత్తమోత్తమ మైనది ఒకటి ఏమంటే — చిత్తశుద్ధితో ఒకదాని తర్వాత ఒకటి చిన్న చిన్న విజయాలను సాధిస్తూ ఉండు. ఆ విధంగా ప్రపంచానికి చేయగలిగినంత సహాయాన్ని అందిస్తావు.

ప్రశ్న: మా విజయం సర్వ ప్రపంచానికి పనికొచ్చేదిగా ఉంటుందా?

ప్రపంచాన్నంతటిని పరివర్తన కావించదు. ఏమంటే నీ విజయము ప్రపంచానికి మరీ అల్పమైనది. అలాటివి ఎన్నో కోట్ల విజయాలు అవుసరం. మొత్తం అంతటితో కలిపినపుడది చాలా తక్కువే. కాని ఇది మిగిలిన సర్వస్వముతో కలిసిపోతుంది....

అత్యంత సాధారణమైన కోరికలలో ఒకటి ఏదంటే — మానవ సేవాభావన. అలాటి సేవకి, లేదా, పనికి అంటిపెట్టుకుని ఉన్న అనుబంధం వ్యక్తిగత కామనకి సూచన.

శ్రీమాత

ప్రపంచం లోనికి ఒక సాధనాశక్తిని తీసుకురావటం లాంటిది, ఇది, అని మనం చెప్పు కోవచ్చు. ఒక్కొక్కప్పుడు ఒక కార్యసాధనకు, శతాబ్దాలు పట్టవచ్చు. It is a question of proportion — రూపనిష్పత్తుల ప్రమాణాలకి సంబంధించిన సమస్య. నీ తోటివారితో నీవు ప్రయత్నించవచ్చు. ఇది మరింత జటిలమైనదే. పరిపూర్ణ చిత్తశుద్ధితో నీవు ఉండాలి. ఫలితాన్ని ఆశించి చేయకు. విజయం సాధించాలి, కాబట్టి చెయ్యి. విజయం ఫలిస్తే దాని ప్రభావం అందరిపైనా ఉంటుంది. అంతేకాని, లాభనష్టాలు బేరీజు వేసుకుని వ్యాపారధోరణిలో నిర్వర్తిస్తే అది పనిచేయదు. నేను ఇది ఇచ్చి, అది తీసుకుంటాను — అనే దృక్పథం మొత్తాన్నంతటినీ పాడుచేస్తుంది. చిత్తశుద్ధి, స్వచ్ఛత లుప్తమవుతాయి. ఇది బేరం.

నీ చిత్తశుద్ధి, ఆకాంక్ష, ప్రేరణ — ఇవి కలుషితం కాకూడదు. దైవప్రేమతో చెయ్యి. సత్యము కోసం, పరిపూర్ణత కోసం చెయ్యి. మరియే ఇతర ప్రేరణలు, భావనలు ఉండకూడదు. మరి అపుడే అది సత్ఫలితాల నిస్తుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

అహంయొక్క క్రియాఫలం కర్మ.
అహాన్ని పరిత్యజించినపుడు మాత్రమే
కర్మ నిశ్శేషమవుతుంది.

— శ్రీమాత

వ్యక్తి తన వేర్పాటు అహాన్ని దివ్యచేతనలో ఎలా విలీనం కావించుకోగలడు?

వ్యక్తి తాను దైవంలో విలీనమై అహం నుండి ఎలా విముక్తి పొందుతాడనేనా నీ ఆలోచన?

తొలుత అతడు అలా కావాలని సంకల్పించాలి. పట్టుదలతో ఆకాంక్షించాలి. అహంకారం తలెత్తినపుడల్లా ముక్కుపై ఓ మొట్టికాయ వేయాలి. అది వాటితో అలసి తన ఆట కట్టేవరకూ అలా అలా మొట్టికాయలు వేస్తూనే ఉండాలి.

కాని సాధారణంగా మనిషి అలా దాని ముక్కుపై మొట్టికాయలు వేయడానికి బదులుగా దాని ఉనికిని సమర్థించుకొంటాడు. అహం అలా తలెత్తినపుడల్లా "అది సరైనదే" అని అనుకుంటాడు. అది అహంకారమని కూడ అతనికి తెలీదు. అది తనే అని భావిస్తాడు. అది అహంకారమని గుర్తించి అహం ఎత మాత్రం లేకుండా చేసుకోవడం మొదటి షరతు.

దైవంలో అహాన్ని లీనం చెయ్యడమే! ఎవరైనా సరే తాను పరిపూర్ణ వ్యక్తిత్వాన్ని సంతరించుకునే వరకు తన అహాన్ని దైవంలో లీనం చెయ్యలేడు. పరిపూర్ణ వ్యక్తిత్వాన్ని సంతరించుకోవటం యేమిటో నీకు తెలుసా? బాహ్యప్రభావాల నన్నింటినీ నిరోధించగలవా?

కొద్దిరోజుల క్రితం ఒకాయన్నుంచి నాకు ఉత్తరం వచ్చింది. సాధారణ పుస్తకాలను అంటే నవలలను, నాటకాలను చదవాలంటే తాను వెనకాడతానని చెప్పాడు. ఎందుకంటే వాటిని చదివితే తాను అందలి పాత్రల స్వభావంతోను, వాటి సజీవ అనుభూతులతోను ఐక్యం చెందకుండా నిగ్రహించుకోలేక పోతున్నానంటాడు. అలాంటి వ్యక్తులు చాలమంది వుంటారు. వాళ్లు పుస్తకం చదివేటప్పుడు వాటి యందలి పాత్రల ఆవేశాలతో, తలపులతో, కోర్కెలతో, అభిప్రాయాలతో, ఆదర్శాలతోను ఐక్యమైపోతారు. ఆలా అధ్యయనంలో లీనమైపోతారు. అది వాళ్ళకే తెలీదు. ఎందుకంటే వాళ్ల స్వభావం 99% మెత్తని వెన్నలా ఉంటుంది. కాని దానిపై ఎవరైనా బొటనవ్రేలుతో ఒత్తితే ముద్ర పడుతుంది.

ప్రకటించబడిన ఆలోచన, చదువబడిన వాక్యం, దర్శించబడిన వస్తువు,ఇతరులు చేసిన పనిని గమనించడం, ఇరుగుపొరుగువారి సంకల్పం — గమనించడం —

ఇవన్నీ ఒక దానితో ఒకటి కలసిపోతాయి. లోపల, బైట పోరాటం సృష్టించడానికి, తానే పైన వుండటానికి ప్రతి సంకల్పం బొటనవ్రేలులా ఒత్తిడి చేస్తూ వుంటుంది. విద్యుత్ప్రవాహంలా ప్రతిదీ ప్రజల లోపలికి బైటికి పోతూ వస్తూ వుంటుంది. కాని ఆ సంగతి యెవ్వరూ గ్రహించలేరు. నిరంతరం అలా సంకల్పాలు తమ వ్యక్తీకరణకై ఒకదానితో ఒకటి పోటీ పడుతూ తిరుగుతూ వుంటాయి. వానిలో బలమైనది విజయం పొందుతుంది. అలా అనేక సంకల్పవికల్పాల పరస్పర సంఘర్షణ — నిరంతరం సాగుతూనే వుంటుంది. వ్యక్తికిది ఏకాంత సంఘర్షణ. కష్టమే.

కనుక ప్రతివారూ సముద్రపుటలల పై తాడుకు కట్టిన బెండుముక్కలా అల్లల్లాడుతూ కిందా, మీదా పడుతూంటారు. ఒకరోజు ఇది కావాలని, మరొకరోజు అది కావాలని, అటూ, ఇటూ, పైకీ, కిందికీ తోపుల్లాట. ఇదీ వ్యక్తి పరిస్థితి.

తొలుత వ్యక్తి తనలో తనకు తానుగా చైతన్యవంతంగా, పరిసరాల ప్రభావాలకు లోనుగాక, స్వతంత్రవ్యక్తిగా పరిపూర్ణ వ్యక్తిగా మనుగడ సాగించాలి. అతడు యేదైనా విన్నా, యేదైనా చదివినా, యేదైనా చూచినా, వీటికి స్పందించకుండా, మారకుండా, తనకు తానుగా యథాస్థితిలో వుండాలి. తాను గ్రహించకోరిందే బైట నుండి గ్రహిస్తాడు. అతనికి సమ్మతికాని వాటిని అతడు తిరస్కరిస్తాడు. తను కోరనిది యేదీ అతనిపై ముద్రవేయజాలదు. అప్పుడే అతడు పూర్ణవ్యక్తిత్వం సంతరించుకో గలిగినవాడుగా తయారవడం మొదలవటం. వ్యక్తిత్వం కలిగిన వారే దాన్ని అర్పణ చేయగలరు.

ఎవరైనా ఏదైనా తాము కలిగి వున్నప్పుడే దానిని యివ్వగలుగుదురు. తొలుత అతడు పూర్ణవ్యక్తిగా వుండాలి. ఆ తర్వాత తనను తాను అర్పించగలుగుతాడు.

మనిషికి (వ్యక్తిత్వ) మనుగడే లేకపోతే యేమీ యివ్వలేడు. ప్రత్యేకమైన అహంకారం అదృశ్యం కావాలంటే వ్యక్తి తనను తాను దైవానికి పరిపూర్ణంగా అర్పణ చేసుకోవాలి. అలా ఆత్మసమర్పణ చేసుకోవాలంటే మనిషి తొలుత వ్యక్తిగా మనుగడ కలిగి వుండాలి. అతడు మనుగడ సాగించాలంటే పరిపూర్ణవ్యక్తిత్వంతో రూపొంది వుండాలి.

మీ దేహం కఠిన రూపంలో వుండి వుండకపోతే — వుంది లెండి — కఠినరూపంగానే వుంది కదా? మీ చర్మం యిలా దృఢంగా లేకుండా వుంటే మీ ప్రాణమయ, మనోమయ భూమికలు బైటికి ప్రతిబింబిస్తూ వుంటే మీరు 'జెల్లీ చేప' కంటె హీనంగా, మెత్తటివారుగా ఉంటారు. ప్రతిదీ ప్రతిదానిలో కలిసి పోయేదే అవుతుంది. అదెంత

గందరగోళంగా, పరిణమించేదిగా వుంటుందో కదా? కనుక నే తొలుత కఠినరూపం వుండడం అవసరం. తర్వాత మనం దానిని గూర్చి "ఈ దేహం గట్టిగా స్థిరంగా వుంది. మనం దైవంలో లీనమయ్యేందుకు యిది యిబ్బందికరంగా వుంది. ఇది మృదుత్వంగా లేదు. కోమలంగా లేదు. ఇది ద్రవరూపంలో లేదు", అని ఫిర్యాదు చేసేవాళ్ళం. కాని దేహకాఠిన్యం, స్థిరత్వం చాల అవసరం. ఎందుకంటే యిలా కాకపోతే, మీరు మీ శరీరం నుండి వేరైపోతే (మీలో చాలమంది అలా వెళ్ళలేరు. ఎందుకంటే మీ ప్రాణికసత్తా మీ శారీరక సత్తా కన్న ఎక్కువగా వ్యక్తీకరించబడింది.) మీరు మీ దేహం నుండి బైటికి వచ్చి ప్రాణిక ప్రపంచంలోనికి వెళ్ళితే, అక్కడ అన్నీ ఒకదానితో ఒకటి కలిసిపోయినట్లు, విడిపోయినట్లు, రకరకాల స్పందనల, శక్తుల ప్రవాహం వస్తూ పోతూ, ఒక దాన్ని మరొకటి నాశనం చెయ్యడానికి ప్రయత్నిస్తుం డడం, ఒకదానితో మరొకటి లీనమైపోవడం, ఒకదాన్ని మరొకటి బైటికి త్రోసివేయడం — యిలాంటి ప్రతిఘటనలు చూడగలుగుతారు. దీనిలో, నిజమైన వ్యక్తిత్వాన్ని కనుగొనడం చాల కష్టం. ఇవన్నీ శక్తులు, చలనాలు, కోర్కెలు, స్పందనలు.

అక్కడ విశిష్ట వ్యక్తిత్వం కలవారు, వ్యక్తులు — ఉంటారు. కాని అవి శక్తులు. ప్రపంచంలో విశిష్ట వ్యక్తిత్వలక్షణాలు, వ్యక్తిత్వాన్ని సంతరించుకొన్నవాళ్లు నాయకులు గానో, లేదా రాక్షసులుగానో ఉంటారు.

ఇప్పుడిక, నీ మనస్సు గురించి (నిశ్శబ్దం), భౌతిక మనస్సును, జాగరూకతతో, ఎరుక గలిగి చూస్తే... కొందరు దాన్ని నాలుగు వీధులు కలిసే బహిరంగ ప్రదేశం అని అంటారు. ఎందుకంటే ప్రతి ఒక్కటీ అక్కడ చేరుతుంది. అడ్డదిడ్డంగా తిరుగు తుంది. మళ్ళీ వెనక్కు మరలుతుంది. అన్ని ఆలోచనలు అక్కడికి వెళ్తాయి. ఒక చోట ప్రవేశించి మరోచోట నుండి బైటికి పోతాయి. కొన్ని యిక్కడుంటాయి. కొన్ని అక్కడుంటాయి. అదొక బహిరంగ ప్రదేశంగా వుంటుంది. అది చక్కగా వ్యవస్థీకరింపబడినదిగా వుండదు. ఎందుకంటే ఆలోచనలు కలుస్తుంటాయి. ఢీ కొట్టు కుంటూ వుంటాయి. పలురకాల ప్రమాదాలు సంభవిస్తుంటాయి. అప్పుడు మనిషి "నేను దేనిని నా మనసని పిలవాలి? లేక మనసంటే ఏమిటి?", అన్న జిజ్ఞాస కలిగి వుంటాడు.

మనిషి స్వతంత్ర ఆలోచనను రూపొందించుకొనుటలో విజయమందుటకై

యెంతో అవధానం, జాగరూకత, హేతుబద్ధత, పొందిక, నిర్వహణ కౌశలం, ఎన్నిక స్వీయ ఆలోచనాసరళి అవసరం.

మనిషి నమ్ముతాడు తన ఆలోచన తన స్వంతమేనని. అలా కానే కాదు. అది అతడు మాట్లాడే తోటి మానవుల మీద, అతడు చదివే పుస్తకాల మీద, లేదా అతని మనఃస్థితి మీద ఆధారపడి వుంటుంది. అది నీ జీర్ణశక్తి యొక్క బాగోగుల మీద, నీవు తలుపులు బిగించుకొని గాలి, వెలుతురు ప్రాకని మూసిన గదిలో వుంటున్నావా?, లేక, గాలి ప్రసరించే బహిరంగ ప్రదేశాల్లో వుంటున్నావా? అందమైన ప్రకృతి ఒడిలో వుంటున్నావా? నీ నివాసప్రాంతం సూర్యరశ్మిలో వుంటున్నదా లేక వర్షంలో వుంటున్నదా అన్నదానిపై ఆధారపడి వుంటుంది. నీవు నీకు సంబంధం లేని అనేకానేక విషయాలను గూర్చి ఆలోచిస్తుంటావు. అది నీ ఎరుకలో వుండదు.

నీ ఆలోచన యితర ఆలోచనలతో సహకరించునట్లు పొందిక కలిగియుండునట్లు, హేతుబద్ధంగా వుండగలుగునట్లు తయారుకావాలంటే, సుదీర్ఘ సమగ్ర కృషి అవసరం. నీవు అందమైన, చక్కగా రూపొందించబడిన, బలమైన, శక్తివంతమైన మనోనిర్మాణాన్ని తయారుచేసికొనుటలో విజయుడవైతే, నీకు తెలియచెప్పబడే, మొదటి అంశం, "నీవు దైవంతో ఐక్యమవడానికి యీ మనోనిర్మాణాన్ని కూల్చివేయాలి!" అన్నది. అలా నీవు చాలాకాలంగా చేయనందుననే దైవంతో ఐక్యం కాజాలకున్నావు. ఎందుకంటే, నీవి కానట్టి విషయపరంపరలు, నీవు దైవసమర్పణ చేయడానికి, నీవి అన్నవియేదీ, నీ దగ్గర లేనందున నీవు దైవసాయుజ్యం పొందలేవు. నిన్ను నీవు ఆత్మసమర్పణ చేసికొనుటకు, నీకు నీవుగానే, వుండాలి. ఇంతకు ముందే చెప్పిన విషయాన్నే మళ్ళీ చెబుతున్నాను.

ఇప్పుడున్న ప్రపంచ పరిస్థితుల్లో యెవరైనా దైవానికి అర్పణ చేయగలిగేది తన దేహాన్ని మాత్రమే. కాని అతడు దాన్ని అర్పించడు. అతడు తన కర్మలను అర్పించవచ్చు. కాని ఇక్కడ కూడా సత్యదూరమైన మౌలికవిషయాలెన్నో వుంటున్నవి.

ఇదంతా నీకు చెప్పేది నిన్ను బురదలోకి తోయడానికి కాదు. దైవంలో అహాన్ని లీనం చేయాలనుకునే ముందు నీవెవరో తెలుసుకోవలసి వున్నందున నీకిది చెబుతున్నాను. అహంకారం వుంది, అది అవసరమే. నిన్ను నీవు ప్రత్యేక స్వతంత్ర వ్యక్తిగా గుర్తించడానికి, నువ్వు గుంపులో గోవిందయ్యవి కాకుండా, అనామకంగా ఉండకుండా, వుండడానికి, అది, అవసరమైంది. నీలోనే నువ్వు మనుగడ సాగించడానికి

అహంకారం వుంది. అలానే బాహ్యరూపం వుంది. భౌతికశక్తులు బాహ్యశరీరం ద్వారా సాగిపోతుంటాయి. దానితో కొంత దూరం సాగిపోయే స్పందన కూడ వుంది. అయినా ఒకరిలో ఒకరు కలగాపులగం కాకుండా, బాహ్యరూపం మనల్ని నిరోధిస్తుంది కూడ.

(మౌనం తర్వాత) వ్యక్తి అదంతా దైవానికి, తర్వాత, అర్పణం చేస్తాడు. దీనికి సంవత్సరాల తరబడి కృషి అవసరం. నీవు నిన్ను గురించి మాత్రమేగాక, నీ లోని అన్నింటిని గూర్చి వివరంగా ఎరుక కలిగి వుండాలి. కాని నీలోని నీ సత్తాయొక్క కేంద్రమైన, నీ చైత్య కేంద్రం చుట్టూ "నీవు" అనే దాన్ని క్రమబద్ధీకరించుకోవాలి. దానివల్ల ఆ "నీవు" ప్రత్యేకమైనదై, ఎరుకతో కూడిన సత్తాగా రూపొందగలదు. చైత్య కేంద్రం యీ వరకే దైవానికి తన్ను సమర్పణ గావించుకొన్నందున దాని చుట్టూ నీ అంతట నీ అనుకూలమైన రీతిలో వుంచితే, అదంతా దైవార్పణగా తయారవుతుంది.

కనుక నీ అర్పణ సరైనదేనని దైవం తలచినపుడు, కాలం కలసివచ్చినపుడు, అప్పుడే దైవం నీ విశేష వ్యక్తిత్వీకరణం పూర్తయినపుడు, అప్పుడే దైవం నీ అహంకారం తనలో లీనం కావించుకొనుటకు, అప్పటి నుండి నీవు దైవంలో మాత్రమే నివసించుటకును అనుమతిస్తాడు.

కాని యీ నిర్ణయం తీసికొనేది దైవమే. తొలుత నీవీ పనంతా చేసి వుండాలి. ఎరుక కలిగిన మనిషిగా తయారై వుండాలి. దైవం చుట్టూ నెలకొని వుండి, దైవంచేత నీవు నడుపబడాలి. ఆ తర్వాత కూడా యింకా అహంకారం వుంటుంది. ఎందుకంటే నిన్ను ఒక వ్యక్తిగా తయారుచేసేది అహంకారమే. నీ కర్తవ్యం పూర్తిగా నెరవేర్చిన పిమ్మట నీవు దైవంతో, "నేను సిద్ధంగా వున్నాను. మీరు నన్ను కోరుతారా?" అని అడగాలి. దైవం, "అవును" అంటారు. అంతట అంతా ముగుస్తుంది. అంతా నెరవేర్చబడుతుంది. నీవు దైవంయొక్క నిజమైన ఉపకరణంగా తయారవుతావు. కాని తొలుత ఉపకరణం, నిర్మాణం కాబడి ఉండాలి.

మూలం: శ్రీమాత

అనువాదం: బి. నరసింహయ్య

అహంకారం నుండి వేరై, ఎలా బయటపడాలి?

ఈ అల్పమైన అహం నుండి తనను తాను వేరుపరుచుకోవడం ఎంత కష్టమో నీకు తెలియదు. అది చిన్నదైనా, మన జీవనమార్గాలకు అడ్డుతగులుతుంది. ఎంత సూక్ష్మమైనదైనా అది చాలా పెద్ద చోటు ఆక్రమిస్తుంది. అతి చాలా కష్టం, కొన్ని సమయాలలో దానిని ఎవరైనా త్రోసివేస్తుంటారు. ఉదాహరణకు, ఏదైనా మంచిదనిపిస్తే, మొదట దానిని పొందడానికి ఎవరైనా ముందుకు దుముకుతాడు. పొరుగువాడు నెట్టుకుంటూ పోతాడు. (మామూలు జీవితంలో ఇది సర్వసాధారణం) అప్పుడు అది అంత అందంగా లేదని తెలుసుకుంటాడు. ఈ మొరటుతనాన్ని అణగద్రొక్కడం ప్రారంభిస్తాడు. పెద్ద ప్రయత్నమే చేస్తాడు. అతడు ఆత్మతృప్తి చెందుతాడు. "నేను స్వార్థపరుణ్ణి కాను. మంచిదానిని ఇతరులకు ఇస్తాను. దానిని నేను నా వద్ద ఉంచుకోను", అని అంటాడు. ఇక అతడు ఉబ్బిపోతాడు. ఇక నైతిక అహంకారం అతనిని ఆవరిస్తుంది. భౌతిక అహం కన్న అది మరింత అధ్వాన్నమైనది. తాను చాలా గొప్పదానిని అనే స్పృహ ఉంటుంది. మరికొందరున్నారు. వారు అంతా వదిలివేస్తారు. అన్నీ త్యజించి వేస్తారు. తమ కుటుంబాలను విడిచిపెడతారు. తమ ఆధిక్యత గూర్చి వారికి బాగా తెలుసు. ఆధ్యాత్మిక వైభవ శిఖరాల నుండి వారు, పాపం, బీద మానవాళిని చూస్తారు. అది దారుణమైన అహంకారం. దానిని ఖండ ఖండాలుగా నరికివేస్తేనేగాని వారు దైవాన్ని చూడలేరు. అందువల్ల అహంను విడిచి పెట్టడం అంత తేలిక పని కాదు. చాలా కాలం పడుతుంది. ఒక వేళ అహంను వది లివేసినా, మళ్లి మొదటికొస్తుంది.

*

నువ్వు ఏదైనా చేస్తున్నప్పుడు, మనస్సు, ప్రాణికం, ఈ రెండూ, తప్పనిసరిగా ఉంటాయి. నువ్వు చేసే పనినుండి ఏదో లబ్ధి పొందాలని అవి చూస్తాయి. సంతృప్తి, ఆనందం, నీ పట్ల నీకుగల సదభిప్రాయం — ఇవి పొందాలని ప్రయత్నం చేస్తాయి. తనకు తాను వంచించుకోకపోవడం చాలా కష్టం.

*

ప్రశ్న: అహం నుండి బయటపడడానికి అవలంబించవలసిన వైఖరి ఏమిటి?

వైఖరి? అది సంకల్పం. ఔను కదూ! నువ్వు సంకల్పించాలి. ఎవరైనా ఏం

చేయాలి? ఇదీ ప్రశ్న. అన్నింటికన్నా నిశ్చయమైన మార్గం భగవంతునికి అర్పించుకోవడమే. భగవంతుడ్ని మన వైపు లాక్కోవడానికి ప్రయత్నించగూడదు. మనల్ని మనమే ఆయనకు అర్పించుకోవాలి. అది మొదటి దశ. కొద్దిగానైనా నువ్వు అహం నుండి బయటపడతావు. ఎవరైనా భగవంతుడ్ని గూర్చి ఆలోచించినప్పుడు, ఆయన నుండి సాధ్యమైనంత మేరకు అన్నీ లాక్కోవడానికి ప్రయత్నిస్తారు. అప్పుడు వారికి ఏదీ దొరకదు. "ఓహ్! నేను ప్రార్థించాను, పిలిచాను, నాకు జవాబు ఇవ్వలేదు. నాకేదీ దొరకలేదు", అని వారు అంటారు. "నువ్వు ఆయనకు అర్పించుకొన్నావా" అని అడిగితే "లేదు. నేను భగవంతుడి నుండి లాక్కోడానికి యత్నించాను", అని అంటాడతను. "అందువల్లనే జవాబు రాలేదు!" అది రాలేదని అనుకోరాదు. నువ్వు లాక్కోడానికి ప్రయత్నించినప్పుడు నువ్వు నీ అహంలో కూరుకుపోయావు. నేనిప్పుడు చెప్పినట్లు భగవంతుడ్నించి ఏదైతే రావాలని అనుకొన్నావో, దానికి నీకు మధ్య ఈ అహం గోడలాగా నిలబడుతుంది. జైలులో వున్నప్పుడు శూన్యం తప్ప నీకు ఏమీ దొరకదు.

జైలు కన్నా అధ్వాన్నం. రోడ్డు మీదికి కిటికీలు కూడా ఉండవు.

నిన్ను నువ్వు విసిరివేసుకో (అమ్మ చేతులు విసురుతుంది) ఏదీ నీ వద్ద ఉంచుకోవద్దు. నిన్ను నీవు అర్పించుకో. అర్పించుకోవడంలో ఆనందం కోసం ఈ పని చెయ్యి. అప్పుడు నీకేదో, ఊహించని ఉద్వేగం కలుగుతుంది.

ప్రశ్న: తాను లేనని, భగవంతుడే ఉన్నాడని భావిస్తే — అహం నుండి బయటపడే మార్గం — అదెలా?

తాను లేనని భావించడమా? మానసికంగా ప్రయత్నం జరిపితే గెలుపు సాధిస్తాడని నేను అనుకోను. ఇది మానసిక ప్రయత్నం. ఏదో మానసిక నిర్మాణాలు జరగవచ్చు. ఏదీ సాధించడం జరగదు. స్వతస్సిద్ధంగా, సహజంగా, ఉద్వేగభరితంగా జరగాలి. మన లోపల ఒక అగ్నిజ్వాల ప్రదీప్తం కావాలి. ఆకాంక్షజ్వాల. ఏదో... ఎలా మాటలతో చెప్పడం? పరివర్తనకు, మనోభావజాలానికి చాలా తేడా వుంది. మానసికంగా ఏదీ జరగదు.

రూపాంతరీకరణ చైత్యపురుష కేంద్రం నుంచి స్పష్టంగా వస్తుంది. ఒక రకమైన మానసిక నిర్మాణం, కృషి వల్ల పొందేదానికి దీనికి ఎంతో తేడా ఉంటుందని నా నమ్మకం.

తనకు తాను అర్థం కావడం కష్టం. కాని బుర్రలో ఇలా (అమ్మ తన చేతివేలును నుదుటిపై ఉంచుతుంది.) ఒక విషయం తిరుగుతున్నంత సేపూ దానికి ఏ శక్తి ఉండదు. దానికి చాలా పరిమితమైన శక్తి ఉంటుంది. తనను తాను మోసగించుకుంటుంది. ఒక వ్యక్తి తన ఇచ్ఛాశక్తినంతా కూడదీసుకొని, అది కృత్రిమమే — ఏదో పట్టుకోడానికి ప్రయత్నిస్తాడు. మరుక్షణంలో అది మాయమైపోతుంది. అదేమిటో గ్రహించలేడు. "అది ఏలా జరిగింది?" అని తనను తాను ప్రశ్నించుకుంటాడు.

నాకు తెలియదు. గట్టి సంకల్పంతో పట్టు లేకపోతే యోగసాధన చేయడం చాలా కష్టం. తలతో (మేధస్సు) సాధన చేయలేరు. సంకల్పం తలలో లేదు. సంకల్పం ఇదిగో ఇక్కడ (అమ్మ తన గుండెలోని కేంద్రభాగాన్ని చూపిస్తుంది) వుంది. దానికి కర్తృత్వశక్తి ఉంది. సిద్ధి నిచ్చే శక్తి ఉంది.

*

ప్రశ్న: అహంకార పీటముడి అంటే ఏమిటి?

ముడి? ఓహ్! అది ఒక భావచిత్రం. కాని అది నిన్ను అంటిపెట్టుకుని వుంటుంది. తాడు ముడిలాగా అది నిన్ను గట్టిగా పట్టుకొంటుంది. నిజంగా సాధనలో పురోగతి సాధించాలంటే ఈ అహంకారపు ముడిని విచ్ఛిన్నం చేయాలి. అది చాలా విపులమైన, విశేషమైన భావచిత్రం. తాళ్లతో బంధించి, తన లోపల తనను, జైలులో నిర్బంధించడం వంటిది. అన్ని అవయవాలను తాళ్లతో బిగించి పీటముడులు వేయడం. ఇది చాలా బలమైన పట్టు. కాని అది ఒక పరిమితి. నీకు కావలసిన శక్తులన్నీ నీకు అంది రావు. నిన్ను బంధించివేసిన తాడును ఎన్నో పీటముడులు వేసి, నిన్ను ఒక కోశంలో మూసివేసినట్లుంటుంది.

ప్రశ్న: అమ్మా, ఈ అహంకార పీటముడిని ఎలా తెగగొట్టాలి.

ఎలా తెగగొట్టాలి? ఒక కత్తి తీసుకో, కోసేయ్. (నవ్వు) అది వున్నట్లు స్పృహ వుంటే ఆ పని చెయ్యి. కాని ఎవరికీ స్పృహ వుండదు. అది సాధారణమైనదిగా ఉంటుంది అనిపిస్తుంది. మనకేం జరుగుతోందో అంతా మామూలుగానే కనిపిస్తుంది. సాధారణమే కాదు. అది మంచిదని కూడా అనిపిస్తుంది. మనకు ఈ ఐహిక ప్రపంచంలో బంధించే అనేక చిక్కుముడులలో ఉన్నామన్న స్పృహ రావాలి. దానికి ఒక గొప్ప విస్పష్ట అంతర్దృష్టి కావాలి. ఒక ఆ స్పృహ కలిగితే, ఆ ముడుల్ని కదల్చడం కూడా సాధ్యం కాకపోతే — అప్పుడు తన సంకల్పం పదునైన ఖడ్గంగా భావించాలి.

తన శక్తినంతా కూడదీసుకోవాలి. ఈ ముడిపై ఒక వేటు వెయ్యాలి. (ఇది అంతా ఊహ మాత్రమే సుమా! నిజంగా కత్తిని తీసుకొంటారేమో!) దీని వల్ల ఫలితం ఉంటుంది. ప్రతిఘటనలు, అలవాట్లు,ఇష్టాయిష్టాలు అన్నీ ఈ ముడి రూపంగా రాటుదేలాయని గ్రహించి, మానసికమైన కోణంలో ఈ పని చేయాలి. నీవు ఎప్పుడైతే ఇది గ్రహిస్తావో, అప్పుడు దివ్యశక్తిని, దివ్యకృపను ఆవాహన చెయ్యాలి. అందుకు మనస్సును ఏకాగ్రం చెయ్యాలి. అప్పుడు ఎవరూ విడదీయ లేనంతగా బిగుసుకుపోయిన ఈ అహంకారగ్రంథిని దెబ్బతీయాలి. ఆ ముడుల రూపంలో వున్న నీ ఇష్టాయిష్టాలు చెప్పే కబుర్లు వినకూడదని గట్టిగా నిశ్చయించుకోవాలి. దివ్యచైతన్యం నుండి వినిపించే దివ్యస్వరాలనే వినాలి. వ్యక్తిగత ఫలితాల గూర్చి కలతచెందకూడదు. అన్ని బంధాలకు దూరం అవ్వాలి. ఇష్టాయిష్టా లన్నింటినీ పారద్రోలాలి. విజయం కోసం, శక్తి కోసం, తృప్తి కోసం వ్యర్థ పటాటోపం కోసం వెంపర్లాడే నీ కోరికల నుండి విడివడాలి.... ఇదంతా అదృశ్యం కావాలి. నీ సంకల్పంలో ఆవిర్భవించిన భగవత్సంకల్పాన్ని మాత్రేమే వీక్షిస్తుండాలి. నిన్ను నడిపించే, కర్తృత్వాన్ని కదిలించే, "దివ్యసంకల్ప శక్తి"నే చూడాలి. ఇదిగో అప్పుడు నీలోని మాలిన్యాలు, రుగ్మతలు మటుమాయమవుతాయి.

*

ప్రశ్న: అమ్మా! సాధన కోసం ప్రయత్నం చేసినప్పుడు, మాలో ఏదో ఆత్మసంతృప్తి చెందినట్లు, గొప్పలు చెప్పుకోవడం, ఆ ప్రయత్నంలో సంతుష్టి చెందడం జరుగుతుంది. ఇదే సర్వాన్ని నాశనం చేస్తుంది. దీనిని ఎలా వదులుకోవాలి?

ఓహ్! అంటే అది ఏం జరుగుతోందో గమనిస్తున్నదన్న మాట! ఏదైనా చేస్తున్నప్పుడు ఎప్పుడూ ఎవరో గమనిస్తూన్నారని తెలుస్తుంది. ఒక్కొక్కసారి ఆ వ్యక్తి గర్విస్తుంటాడు. దీని వల్ల ప్రయత్నం నుండి శక్తి కోల్పోవలసి వస్తుంది. పనిచేస్తున్నప్పుడు తనను తాను చూసే అలవాటు అది. జీవిస్తున్న విధానాన్ని చూడడం అది. ఎవరికి వారిని గమనించడం అవసరం. చిత్తశుద్ధితో, స్వతస్సిద్ధంగా ఉండడానికి ప్రయత్నించడం పూర్తిగా అవసరమని, నేను భావిస్తాను. ఎప్పుడూ తనను తాను గమనించడం కాదు. తను చేసే పనిని, తనకు తాను ఆత్మవిమర్శ చేసుకోడం, ఒక్కొక్కసారి తీవ్రంగా అలా చేయడం అంత మంచిది కాదు. సంతృప్తితో తనను తాను మెచ్చుకోడం లాంటిది అది. రెండూ మంచివి కావు. తన ఆకాంక్ష విషయంలో

చిత్తశుద్ధితో మెలగాలి. తాను ఆకాంక్షిస్తున్నట్లు, తానే ఆకాంక్షగా మారినట్లు అతనికి తెలియదు. దీనిని కనుక సాధిస్తే, నిజంగా అసాధారణ శక్తిని అతను పొందుతాడు.

అటువంటి ప్రయత్నం ఒక్క నిముషం, ఒక్క నిముషం చాలు. సంవత్సరాల తరబడి సిద్ధిని సన్నద్ధం చేసుకోవచ్చు. తనను తాను గుర్తించుకోవడం కాదు. అహంకారం తను చేసే పనిని చూడడం కాదు. తాను కర్తృత్వంగా మారిపోవాలి. ముఖ్యంగా ఆకాంక్షలో అలా చేస్తే, అది నిజంగా మంచిది. ఆకాంక్షించే వ్యక్తి ఉండకూడదు. పూర్తిగా ఏకాగ్రతతో కూడిన ప్రేరణతో ఆకాంక్ష ఉద్గమించాలి. అప్పుడది చాలా దూరం పయనిస్తుంది. లేకపోతే అది వ్యర్థ పటాటోపం, ఆత్మస్తుతి, ఆత్మకారుణ్యం వంటి అల్ప విషయాలలో కలగలపి సాధనను నాశనం చేస్తాయి. కాని అది కష్టం.

ప్రశ్న: అహంకార సంకల్పాన్ని ఎలా తొలగించాలి?

అంటే, అహంకారాన్ని ఎలా తొలగించాలి అని అడగడమే. యోగసాధన వల్లనే అది సాధ్యం. మానవాళి ఆధ్యాత్మిక చరిత్రలో చాలా యోగపద్ధతులు ఉన్నాయి. యోగసమన్వయంలో శ్రీఅరవిందులు వాటిని వర్ణించి, విశ్లేషించారు.

అహంకార సంకల్పాన్ని నిర్మూలించడానికి సుదీర్ఘకాలం పట్టుతుంది, కాని దానికి ముందు, అవకాశం వచ్చినప్పుడల్లా అహంకార సంకల్పాన్ని భగవత్సంకల్పానికి సమర్పించుకోవాలి. చివరికి నిలకడగా నిరంతరాయం ఆ ప్రక్రియ సాగాలి. మనకు శ్రేయస్కరమైనదేదో, మనకు నిజంగా కావలసిందేమిటో, మన ఆధ్యాత్మిక ప్రగతి కోసం మాత్రమే కాదు, మన భౌతికశ్రేయస్సు కోసం, మన ఆరోగ్యం, మన లోని అన్ని భాగాల కార్యకలాపాలు సవ్యంగా సాగడం కోసం మనం చేయవలసినదేమిటో, మనకన్నా భగవంతునికే బాగా తెలుసు. ఇది ముందు మనం అర్థం చేసుకోవాలి. అది మొదటి సోపానం. తనకు ఏది కావాలో ఇతరులనన్నా తనకే బాగా తెలుసునని అహం అనుకుంటుంది. అహానికిది సహజమైన అభిప్రాయం కాదు. తనకు సొంతంగా న్యాయవిచారణ, నిర్ణయాలు తీసుకోగలనని అహం భావిస్తుంది. అది అజ్ఞానంతో కూడింది కాబట్టి అది అలాగే భావిస్తుంది. నిజంగా తెలుసుకోడానికి తన అవగాహన, తన దృక్పథం పరిమితమైనవని, సత్యానికి అనుకూలంగాలేని, గుడ్డి కోరికలు ఆధారంగా తను విశ్లేషిస్తుందని అహాన్ని నమ్మించాలి.

కోరికలు, అవసరాల వ్యక్తీకరణలు కాక, ఇష్టాయిష్టాల వ్యక్తీకరణలు.

మూలం: శ్రీమాత

అనువాదం: కె. యజ్ఞన్న

కాంతి కిరణాలు

నా చిన్నారులలారా, ఆశ మీరే, భవితవ్యమూ మీరే. ఎల్లప్పుడూ యౌవ్వనాన్ని పదిలపర్చి ఉంచండి. అది అభివృద్ధిప్రదాయక శక్తి; అసంభవమనే మాటని నిరర్థకం చేస్తుంది.

*

దైవం కోసం మనుగడ సాగించండి. దైవము కోసమే కర్మ నాచరించండి. దైవాన్ని మాత్రమే కొలవండి.

*

తన యెదలో వినగలగాలి కాని, సర్వ సృష్టి దైవం గురించే ఊసూలాడుతుంది.

*

మన జీవనసర్వస్వమూ దైవారాధనగా సమర్పణ కాబడవలె.

*

నా హృదయంలో నీవు ప్రతిఫలించేందుకు స్వచ్ఛ స్ఫటికంగా పరిశుద్ధమయి నీ యెదుట ఉండేలా అనుగ్రహించుమో, స్వామీ.

*

మనలో ప్రతి ఒక్కరూ పోషింపవలసిన పాత్ర ఒకటున్నది. నిర్వహింపవలసిన కర్తవ్య మొకటున్నది. మనమే వశపర్చుకోవలసిన స్థాన మొకటున్నది.

*

మన హృదయంలో, పురోగమన, ఆవేశాగ్ని రగులుతూ ఉండేలా నిలిపి ఉంచుదాం.

*

సౌందర్యామా! దైవాన్ని చేరుకునే మార్గానివి నాకు నీవే.

జ్ఞానపిపాస, సత్యము కొరకు ప్రేమ — ఇవి మన జీవిత నిర్దేశితాలు కావాలి.

*

జీవితంలో అన్ని పరిస్థితులు, అన్ని సంఘటనలు, నిరంతర జ్ఞానసముపార్జనకు పునరుజ్జీవనం కల్గించే సదవకాశాలు కాబడనీ.

*

నీ కర్మాచారణలో పరిపూర్ణతకు ఏ కొంచెం కొరత కూడా లేకుండా ఉండాలనేది నీ ఆదర్శమవనీ. అపుడు నీవు దైవానికి వాస్తవమైన ఉపకరణంగా తప్పక తయారవుతావు.

*

నీ ఆకాంక్ష జ్వాల, ఎంత సూటిగా, ఎంత ఉత్సాహభరితంగా ఉండాలంటే, దానిని ఏ ఆటంకమూ కూడా చెల్లాచెదురు కావించలేకుండా ఉండాలి.

*

ప్రజలేమనుకుంటారు, ఏమి అంటారు, ఏమి చేస్తారు అన్నది ఏమీ అంత పట్టించుకోవలసినది కాదు. దైవంతో నీకు ఉన్న అనుబంధం— అదే గణనీయమైనది.

*

చిత్తశుద్ధితో కూడిన ప్రార్థనలన్నీ సమ్మతింపబడుతవి. ప్రతి పిలుపునకు సమాధానము ఉంటుంది.

*

ఓ ప్రభూ! నీ దివ్య ఇచ్ఛాశక్తి నాలో, యే ఇబ్బంది, కల్తీ లేకుండా ముద్రింపబడేటట్లుగా ఎప్పుడూ పూర్తిగా స్వచ్ఛమైన తెల్లకాగితంలా నీ ముందు ఉండాలని ఎంతగా అభిలషిస్తానో!

*

అద్భుతమైన ఇంద్రజాలకుడవు నీవు — ప్రతిదానిని రూపపరివర్తనం కావిస్తావు. అందవికారమైనదాని లోనుంచి సౌందర్యాన్ని, చీకటిలో నుంచి వెలుగును, బురద లోనుంచి స్వచ్ఛమైన ఉదకాన్ని, అజ్ఞానంలో నుంచి జ్ఞానాన్ని, అహంకారం నుంచి కారుణ్యాన్ని — ఆవిష్కరింప చేస్తావు.

మూలం: శ్రీమాత

అనువాదం: కస్రా వెంకటేశ్వర్లు

అఖిల



అఖిల భారత పత్రిక

నవంబరు 2010

సాధనలో ఆత్మార్పణ ప్రాముఖ్యత

విషయసూచిక

సంసిద్ధి ప్రక్రియలో మకుటాయమానం	2
సమగ్ర సమర్పణ ఎలా సాధ్యం?	5
పరిపూర్ణ ఆత్మసమర్పణకు మూడు విధానాలు	7
సాధనకు కావల్సిన రెండు సమానాంతర చలనాలు	8
సమగ్ర సమర్పణ — బేరసారాలు	11
సాధన ప్రయోజనం	15
ప్రార్థనలు — ధ్యానాలు	17
సంపూర్ణ సమర్పణలోని ఆనందం	18
ఆత్మార్పణకి తొలి మెట్టు	22
పరిపూర్ణ భగవదర్పణ	25
సాధకులకు శ్రీమాత సూచనలు	27

అనుబంధం

శ్రీమాతతో ఉదార్ సంభాషణ	29

సంసిద్ధి ప్రక్రియకి మకుటాయమానం

నీ జీవిత బాధ్యతలను దైవానికి అప్పగించాలని తీసుకునే నిర్ణయమే 'ఆత్మసమర్పణ'. ఈ నిర్ణయం లేకుండా ఏదీ, ఏ మాత్రం సాధ్యం కాదు. నిన్ను నీవు సమర్పణ గావించుకోకపోతే, 'యోగా' ప్రశ్నకు తావు లేదు. ఇతరమైనవన్నీ సహజంగా దాని వెంటె వస్తాయి. సమర్పణతోనే ప్రారంభమౌతుంది, మొత్తం ప్రక్రియ అంతా.

'విజ్ఞానం' లేదా 'భక్తి' ద్వారా నిన్ను నీవు సమర్పించుకోగలవు. దైవం మాత్రమే 'సత్యం' అనే, ఒక దృఢమైన అంతర్వివేచన నీ కుండవచ్చు; దైవం లేనిదే, ఏదీ నీవు నిర్వహించలేవనే 'నమ్మకం' — వెలుగుతో కూడిన నమ్మకం, నీ కుండవచ్చు; లేదా ఈ విధంగా మాత్రమే, సంతోషంగా ఉండగలమన్న భావన — స్వాభావిక, నిరాటంక భావన, దైవానికి మాత్రమే చెంది ఉండాలనే , చైత్యపురుషసత్తకు చెందిన కోరిక, నీవు కల్గి ఉండవచ్చు. "నేను — నాకు చెందను" అని నీవు, నీ సత్తా బాధ్యతలను 'దివ్యసత్యానికి' విడ్చిపెడ్తావు.

అప్పుడు సంభవిస్తుంది, ఆత్మసమర్పణ: ఇక్కడ ఉన్నా — ఒక జీవిని — అనేక లక్షణాలతో — మంచి చెడు, చీకటివెలుగులతో' — ఇప్పుడు నేను ఉన్నది ఉన్నట్లుగా, నన్ను నీకు సమర్పించుకుంటున్నాను. నన్ను స్వీకరించు. నా ఉన్నత, నిమ్న, పరస్పర విరుద్ధ స్వభావాలతో, ప్రేరణలతో; నా అన్నిటితో నీ కేది ఇష్టమైతే అది చేయి. నీవు ఆత్మసమర్పణ గావించుకునేటప్పుడు, ఏది నీ మొదటి నిర్ణయమో — దానిని, నీలోని చైత్యపురుష సత్తాతో కేంద్రీకృతం చేయడం ప్రారంభిస్తావు. నీ నైజంలో గందరగోళం చేసే అంశాలన్నిటినీ సామరస్యపర్చాలి; వాటి నొక్కొక్కదానిని, ఒక దాని తరువాత మరొకదానిని తీసుకుని నీ కేంద్రసత్తాతో ఏకీకృతం చేయాలి. నీవు నిన్ను దైవానికి సహజంగా, నిరాటంకంగా సమర్పించుకోవచ్చు; కాని నీ సత్తా, ఈ విధంగా ఏకీకృతం కానిదే, ఇది సాధ్యం కాదు. నీవు ఎంతగా ఏకీకృతం కాబడ్తావో, అంతగా, ఆత్మార్పణను సాధించగలుగుతావు.

ఒక మారు ఆత్మసమర్పణ పూర్తవుతే, భగవదర్పణ, క్రమంగా దాని వెంటే అనుసరిస్తుంది. ఇదే సాధన ప్రక్రియ మొత్తానికి మకుటం – ఇదే ఆఖరి మెట్టు; తర్వాత ఇంకెంత మాత్రం కష్టాలుండవు; నీవు సమైక్యంగా, పూర్ణంగా, సమగ్రంగా ఒకేసారి, భగవదర్పణ కావించుకో. ఎప్పుడైతే, నీలో ఒకటి రెండు రోజులు — ఒక

దృఢమైన, ఒక ప్రత్యేక తరహాకు చెందిన ఉత్సాహం ఉరకలు వేస్తుందో అపుడు భ్రమలో పడతావు. ఇతరమైనవన్నీ దాని వెంట వాటంతటవే వస్తాయని, ఆ సమయంలో ఆశిస్తావు; అలా ఆశించేటట్లు చేయబడ్తావు. కాని వాస్తవమేమంటే, నీవెంత మాత్రం నిబ్బరంగా ఉన్నా, ఎంత స్వల్పమాత్రం, ఆత్మపరితృప్తి, ఆత్మవిశ్వాసంతో ఉన్నా, నీ పురోగతిని నీవే కుంటుబడేటట్లు చేసుకుంటావు.

ఎందుకంటే, నీ సత్తాలో అంతటా, అసంఖ్యాకంగా పరస్పరం కలహించుకొంటూ ఉండే, పరస్పర విరుద్ధమైన ఉద్దేశాలు — వీటిని విభిన్న వ్యక్తిత్వాలు అని చెప్పొచ్చు. వీటిలో ఒకటి తనను తాను దైవానికి సమర్పించుకుంటే, వెంటనే మిగిలినవన్నీ కలిసి తిరస్కరిస్తాయి. "మేము మమ్మలను సమర్పించుకోవటం లేదు", అని అరుస్తాయి, అవి వాటి స్వతంత్రాన్ని ప్రకటించటానికి గోలచేస్తాయి. అప్పుడు వాటిని ప్రశాంతంగా ఉండమని చెప్పి, నీ సత్యమంతా ఓర్మితో, మూలమూలలా తిరిగి వాటిని ఎదుర్కోవాలి. మానసికంగా అవకాశం కోసం చూస్తూ, నిరీక్షిస్తున్నవాటిని యెదుర్కోవాలి. ఈ విధంగా నీవు, నీ మానసిక, ప్రాణిక, భౌతిక నైజాల చుట్టూ తిరిగి, దైవానికి ఆత్మసమర్పణ చేసుకోమని వాటికి నచ్చచెప్పి, సంపూర్ణంగా వాటిలో ఏకీకృత అంకితభావం సాధించాలి. అప్పుడు నీవు నీ కష్టాలను అంతమొందించవచ్చు. అప్పుడు పరివర్తన వైపు నీ నడక నిజంగా వైభవోపేతంగా ఉంటుంది. ఎందుకంటే నీవు ఇక ఎంతమాత్రం చీకటి నుండి విజ్ఞానానికి వెళ్ళనక్కర్లేదు; విజ్ఞానం నుండి మరింత ఉన్నత విజ్ఞానానికి, కాంతి నుండి కాంతికి, సంతోషం నుండి సంతోషానికి పురోగమిస్తావు.

సంపూర్ణ అంకితభావం — నిస్సందేహంగా సులువైన విషయం కాదు. అది తీసుకోవచ్చు సుదీర్ఘకాలం, అపరిమితంగా — అంతా నీవే, నీ అంతట నీవే చేయవల్సివస్తే, నీ సొంత వ్యక్తిగత ప్రయత్నం ద్వారా. దైవకృప నీ వద్ద ఉంటే, అది అలా ఉండదు — అచ్చంగా. అప్పుడు దైవం ఇచ్చే చిన్న ఊతంతో బాగా సులువౌతుంది, సాపేక్షంగా. కాని కాలవ్యవధి ప్రతి వ్యక్తిపై ఆధారపడ్తుంది. అది చాల తగ్గించబడ్తుంది. నీవు నిజంగా దృఢమైన నిర్ణయం చేస్తే. నిర్ణయం ఒక్కటే కావల్సింది. నిర్ణయమే కీలకం.

మనం దాని స్పృహ కలిగి ఉంటే లేదా, కనీసం కేంద్రీకృత ఆకాంక్ష కలిగి ఉంటే — మనం అనేక వేరు వేరు, విభిన్న భాగాలుగా తయారుకాబడి ఉన్నవాళ్లమైనా, వాటిని చైత్యపురుష సత్వము కేంద్రంగా ఏకీకృతం కావించాలి. ఈ ఏకీకరణ జరగకపోతే ఈ విభజన మనలోనే ఉంటుంది. ఇలా ఏకీకరణ చేయడానికి ప్రతి ఆలోచన, ప్రతిభావన, ప్రతి అనుభూతి, ప్రతి ఉద్వేగము, ప్రతీ ప్రతిచర్య, అది వ్యక్తమయిన వెంటనే తప్పనిసరిగా దానిని — కేంద్ర ఆకాంక్ష, లేదా కేంద్రసత్తా ఎరుక ముందుంచాలి. దాని కనుగుణంగా ఉండేది అనుమతించబడుతుంది; దాని కనుగుణంగా లేనిది తిరస్కరింపబడ్తుంది లేదా పరివర్తన చేయబడ్తుంది.

*

ప్రశ్న: మన సత్తాలో ఐక్యత లేదా సారూప్యత స్థాపించుట ఎలా?

ఇచ్ఛాశక్తిని స్థిరంగా ఉంచు. నీలో విశృంఖల భాగాలను అవిధేయ పిల్లలుగా పరిగణించు. ఓర్మితో వారితో స్థిరంగా వ్యవహరించు. వారి తప్పులను వారికి నచ్చజెప్పు.

నీ చైతన్యం లోతులలో చైత్యపురుషసత్వము ఉన్నది; దేవాలయం ఉన్నది. నీ సత్తాలో ఉన్న ఈ వికేంద్రీకృత భాగాలను, పరస్పర వ్యతిరేక భాగాలను, ఈ కేంద్రం చుట్టూ ఏకీకృతం చేయాలి. ఒక్కమారు నీవు చైత్యపురుషసత్వ చైతన్యం, ఆకాంక్ష పొందావంటే, ఈ అనుమానాలను, కష్టాలను నిర్మూలించవచ్చు. దీనికి కొంచెం ఎక్కువ లేదా తక్కువ సమయం పట్టవచ్చు; కాని నీ అంతిమ గెలుపు తథ్యం.

మూలం: శ్రీమాత

అనువాదం: యస్. వై. సోమయాజులు

సమగ్ర సమర్పణ ఎలా సాధ్యం?

యోగము అంటే భగవంతునితో ఐక్యత అని అర్థం. దైవానికి నిన్ను నువ్వు అర్పించుకోడం మీదనే ఆధారపడుతుంది. మొదట్లో సాధారణ పద్ధతిలోనే యీ అర్పణ మొదలుపెడతావు. "నేను భగవంతుడి సేవకుణ్ణి. నా జీవితం పూర్తిగా భగవంతుడికే అర్పితం. నేను చేసే ప్రయత్నమంతా కేవలం దివ్యజీవనం కోసమే", అంటావు. కాని యిదంతా కేవలం మొదటి అడుగు మాత్రమే. ఇది మాత్రమే చాలదు. నిర్ణయం ఎప్పుడైతే తీసుకున్నావో, నీ జీవితం సంపూర్ణంగా దైవానికి అర్పించడానికి ఎప్పుడు నిశ్చయించుకున్నావో, అప్పుడు నీ వునికికి సంబంధించిన విషయాలన్నిటిలోను యిది అమలుజరగాలి. అది ప్రతి క్షణం గుర్తుచేసుకుంటూ వుండాలి. అడుగడుగునా నువ్వు దైవానికి చెందినవాడినే అన్నది అనుభూతిలోకి రావాలి. ఏది చేసినా, దేని గురించి ఆలోచించినా, నీవు స్థిరమైన అనుభవం పొంది వుండాలి. నిరంతరం నీ ద్వారా దివ్యచైతన్యం పనిచెయ్యాలి. నీ స్వంతమనేది యేదీ యెప్పటికీ వుండకూడదు. అనుకోకూడదు. ప్రతి వస్తువు దైవం నించే వస్తున్నదని, అది యెక్కడినించి వస్తున్నదో, మళ్ళీ అక్కడికే నువ్వు చేర్చాలని గుర్తించగలగాలి. అప్పుడు ఏ ప్రాధాన్యతా లేని అతిస్వల్ప వస్తువైనా, దాని మీద నువ్వు అంతగా శ్రద్ధగాని, జాగ్రత్తగాని చూపని అత్యంత అల్పమైన వస్తువైనా సరే, పూర్తిగా అర్థవంతమై, అత్యంత విశాలంగా దిగంతాల వరకు దైవం వైపు తెరుచుకుంటుంది.

నీ సాధారణ సమర్పణ, సమగ్ర సమర్పణగా అమలుజరగాలంటే నువ్వు చేయవలసినదిదే. నిరంతరం దైవసన్నిధిలోనే జీవించు. నువ్వు చేస్తున్న ప్రతి పని అంతా, ఆ పరమాత్మే చేస్తున్నదనే అనుభూతితో జీవించు. నీ స్పందనలన్నీ ఆ దైవానికే సమర్పించు. కేవలం మానసికమైన కార్యాచరణే కాదు. ప్రతి ఆలోచన, అనుభూతి కూడా సమర్పించు. అతి సాధారణమైనది, బాహ్యమైనది అయిన పనులు కూడా, అంటే, తినడం లాంటివి కూడా ఆ దైవానికే సమర్పణ చెయ్యి. నువ్వు తింటున్నప్పుడు భగవంతుడే నీ ద్వారా తింటున్నట్టు అనుకో. ఆ విధంగా నీ స్పందనలన్నీ, ఆ దివ్యజీవన స్పృహలోకి తీసుకురాగలగాలి. అప్పుడు నీలో వేర్పాటుధోరణికి బదులు ఐక్యతాభావం యేర్పడుతుంది. నీలో వొక భాగం దైవానికి సర్వసమర్పణ అయి మిగిలిన భాగం సాధారణ పద్ధతిలో సాధారణ వస్తువుల

ఆకర్షణకి లోబడడమన్నది యెంత మాత్రం జరగదు. నీ జీవితం మొత్తం దైవాధీనమయి క్రమంగా సంపూర్ణ పరిణామాన్ని గుర్తించే స్థితి కలుగుతుంది.

ప్రశ్న: మనం మానసిక స్పందనల మీద లేక మేధోపరమైన అన్వేషణల మీద శ్రద్ధ పెట్టినప్పుడు కొన్ని సందర్భాలలో పరమాత్మని మరిచిపోతూ తనతో అనుబంధాన్ని కోల్పోతున్నాం. ఎందుచేత?

కోల్పోతున్నావు. ఎందుచేతనంటే నీ చైతన్యం యిప్పటికీ విభజించబడే వుండడం చేత. నీ మనస్సులో పరమాత్మ స్పృహ యింకా స్థిరపడలేదన్నమాట. నువ్వు సంపూర్ణంగా దివ్యజీవనాని కంకితం కాలేదు. లేనట్టయితే నువ్వు కొంతవరకైనా అటువంటి విషయాల మీద శ్రద్ధ పెట్టగలిగి వుండేవాడివి. ఇంకా అప్పటికీ నువ్వు దైవం యొక్క సహకారం, సహాయం పొందాలనే అవగాహన కలిగి వుండేవాడివి.

మేధోపరమైన, లేదా క్రియాశీలమైన అన్ని కార్యకలాపాలలోను నీ ఏకైక ఆశయం, "గుర్తుంచుకో, సమర్పించుకో", అనేదే కావాలి. నువ్వేది చేసినా అది భగవంతుడి కర్పితమైనదై వుండాలి. ఇది కూడా నీ అత్యుత్తమ క్రమశిక్షణ అవుతుంది. అది నిన్ను ఎన్నో తెలివితక్కువ మరియు వ్యర్థమైన పనులు చెయ్యకుండా ఆపుతుంది.

యోగసాధన ప్రారంభంలో నువ్వు అతి తరచుగా, అతి సులువుగా దైవాన్ని మరచిపోతూ వుంటావు. కాని నిరంతర ఆకాంక్షతో నువ్వు నీ జ్ఞాపకశక్తిని పెంచుకుంటావు. క్రమంగా మరుపుని పోగొట్టుకుంటావు. కాని అది కఠినమైన క్రమశిక్షణగా కాని, లేదా, నిర్బంధ కర్తవ్యంగా కాని బలవంతంగా జరగకూడదు. ప్రేమపూర్వకమైన స్పందన మరియు ఆనందంతో యిచ్ఛాపూర్వకంగా జరగాలి. అప్పుడు అతిశీఘ్రంగా దైవసమక్షాన్ని నువ్వు అనుభవించకపోయినట్టయిన ఏ పని చేస్తున్నా వెంటనే నీకు ఒంటరిగా, విచారంగా యెంతో కష్టంగా వున్నట్టు నీకు అనిపిస్తుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

పరిపూర్ణ సమర్పణకు మూడు విధానాలు

దైవానికి ఆత్మసమర్పణార్థం మూడు విలక్షణమైన విధానములు:

1) వ్యక్తి తన గర్వాన్ని త్యజించి పరిపూర్ణమైన వినమ్రతతో భగవంతునికి సాష్టాంగ ప్రణామం చెయ్యాలి.

2) ఒక పుస్తకాన్ని తెరిచి ఉంచినట్లు, వ్యక్తి తన శరీరాన్ని తల నుంచి పాదాల వరకు, భగవంతునికి ఉన్మీలనం కావించుకోవాలి. తన అస్తిత్వంలో కించిత్ మాత్రం, ఏ భాగమూ మిగలకుండా అన్ని కేంద్రాల చలనాలను (భౌతిక, ప్రాణిక, మానసిక) సంపూర్ణమైన చిత్తశుద్ధితో, ఏ అరమరికలు లేక, తనకంటూ ఏమీ లేకుండా భగవంతునికి, తెరచుకుని ఉంచాలి.

3) భగవంతుని చేతులలో సుఖంగా ఒదిగి, అతని మీద అచంచలమైన విశ్వాసంతో, ప్రేమతో అతనిలో లీనమవ్వాలి.

పైన పేర్కొన్న చర్యలతో పాటు, సందర్భానుగుణంగా మరో మూడు సూత్రాలున్నాయి.

1) నీ ఇచ్ఛానుసారం కాక దైవేచ్ఛానుగుణంగా జరుగనీ.

2) నీ ఇచ్ఛ ప్రకారమే, నీ యిష్టమే.

3) నేను, సదా, నీ వాడనే.

సాధారణంగా పై చర్యలన్నీ ఋజుమార్గంలో జరిపినప్పుడు వీటిని అనుసరించి దైవంతో పరిపూర్ణ తాదాత్మ్యతలో అహం అంతరించి, మహోన్నత ఆనందం వికసిస్తుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: సిద్దులగారి త్రివేణి

సాధనకు కావల్సిన రెండు సమానాంతర చలనాలు

వ్యక్తి పరిణామం చెందటానికి రెండు సమానాంతర చలితచాలనాలు కావాలి. సాధారణంగా ఏదో ఒకదాని మీద కేంద్రీకరించడం కోసం రెండవదాన్ని అశ్రద్ధ చేయటం వల్లనే ఆతని పురోగతి లయతప్పి నత్తనడక నడుస్తోంది.

మొదటిది భౌతిక, జ్ఞానేంద్రియ, అలాగే, మానసిక, ఆధ్యాత్మిక, వ్యక్తిత్వరూప కల్పన మూలకాలకు సంబంధించిన చైతన్యం కలిగి ఉండటం; అంతర్గత జీవనిర్మాణం గురించిన పూర్తి అవగాహన పొందటం; అంటే దాని వైఖరులు, గుణగణాలు, శక్తిసామర్థ్యాలు ఇంకా దాని వివిధ కార్యకలాపాలను గురించి, నిష్పాక్షికంగా, అంటే దాని గురించిన మంచిచెడుల పూర్వాభిప్రాయాలకు తావివ్వకుండా, నిరంకుశంగా, తిరుగులేని నిర్ణయాలు తీసుకోకుండా (ఎందుకంటే సాధారణంగా మన తీర్మానాల్లో పారదర్శకత లోపిస్తూంటుంది.) ఏది ఉండాలో, ఏది ఉండకూడదో, దేన్ని ప్రోత్సహించాలో, దేన్ని అణగద్రొక్కాలో, అనే, విషయాల గురించిన క్షుణ్ణమైన అవగాహనతో ఉండాలి. మన దృష్టి నిర్వ్యాజంగా, సమగ్రంగా ఉండాలనుకుంటే అది నిష్పాక్షికంగానూ, వస్తుగతంగాను ఉండాలి. మన ముందున్న ప్రపంచాన్ని ప్రతి అల్పాతి అల్ప అంశాన్ని వివరంగా పరిశోధించాలి. అందులో నిగూఢంగా ఉన్న సూక్ష్మాతి సూక్ష్మ అంశాలను కూడా వైజ్ఞానిక దృష్టితో, సంపూర్ణంగా, వ్యక్తిగత భావంతో కాకుండాను, ముందే ఏర్పర్చుకున్న అభిప్రాయాలకు తావివ్వకుండానూ, పరిశోధించాలి.

మనం ఏమనుకున్నప్పటికీ ఈ పరిశీలనా కార్యక్రమం, విశ్లేషణమూ, ఆత్మశోధనా పూర్తి అవటమనేది జరగదు. భౌతికకాయంతో మనం భూమ్మీద ఉన్నంతకాలమూ, ఏ అంశమూ కూడా మన ఎరుక లేకుండా, మన ఆధీనం నుంచి తప్పిపోకుండా ఈ మన అతిసంక్లిష్ట, నిరంతరజీవిత విచారణలో ఉండాలి: ఎందుచేతనంటే, మనకు తెలిసినదానిపై మాత్రమే ప్రావీణ్యం సంపాదించగలము, ప్రావీణ్యత సంపాదించినదానినే స్వాధీనతలో ఉంచుకోగలము.

దీనితో పాటు గానూ, దీనితో సరిసమానంగానూ ఉండవలసిన రెండవ చలనము దగ్గరకు, యిది మనలను తీసుకువస్తుంది. అదే నివేదనము, నిరంతరం మన అధీనంలో ఉన్న సమస్త అంశాలను సర్వదా పరమాత్మ దివ్యశాసనానికి సమర్పణ గావించడము.



చైతన్యవంతమైన ప్రతి అంశాన్నీ, ప్రతి వైఖరినీ, ప్రతి సామర్థ్యాన్ని, ఒక పసిబిడ్డ కుండేటటువంటి పూర్తి నమ్మకంతో శాశ్వత సారభూతమైన, దివ్యశక్తి దివ్యమార్గ దర్శకత కోసమై సమర్పించుకోవాలి. ఆమె వీటిని క్రమబద్ధీకరించి, వర్గీకరించి ఈ అంశాలన్నిటినీ సక్రమమార్గంలో ఉపయోగిస్తుంది. కేవలం ఆమె మాత్రమే (దివ్యమాత) వేటిని ఉపయోగించవచ్చో, వేటిని ఉపయోగించరాదో, వేటిని ప్రోత్సహించాలో, వేటిని వైదొలగించాలో, వేరు చేయగలదు. ఆమెకి అన్నీ సమానమైన విలువ కలవే ననడంలో సందేహం ఏమీ లేదు, అన్నిటినీ వినియోగించవచ్చు, ఆమె అన్నిటినీ పరివర్తింప చేయగలదు., ప్రకాశమానం చేయగలదు, రూపాంతర మొందించగలదు. ఆమె చైతన్యాన్ని పొందినవన్నీ ఆమెకే అర్పించుకొన్నవన్నీ ఆమెగా మార్పుచెంది మంచిచెడు అనే బాహ్య, మానవ భావాలకు అతీతమైపోతాయి.

వీటిలో ఏదో ఒక వైఖరి, ఒకే చలనం ఉండి రెండవది లేనట్లయితే, అది అసంపూర్ణం, ఏకపక్షం అవుతుంది. మనలోకి ఏదో ఒక విభాగం ఆ పరమ మూలాంశానికి సమర్పించుకున్నంత మాత్రాన సరిపోదు. మనకు తెలియని మౌలికాంశాలన్నీ మన అధీనంలో లేనివి ఈ సమర్పణలోకి రాకుండా తప్పించుకుపోతాయి. ఈ విధంగా అవి సనాతన ధర్మానికి అనుగుణంగా ఉండక తమ స్వంత న్యాయాన్నే అనుసరిస్తూ కల్లోలాలకు కారణమవుతాయి. అంతవరకు పవిత్ర న్యాయానికి కట్టుబడి నడుచుకుంటున్నామనుకుంటే, ఇవి వారిలో అలజడికి కారణమవుతూంటాయి. తన జీవితంలో, తన పనుల్లో వాటాదారులుగా తనలోని అపరిచిత కోణాల్లో ఉన్న వాటి విషయం మాత్రం అతను మరిచిపోతాడు. అవి ఇప్పుడు తమ పనుల్లో వ్యక్తమవుతుంది. అదంతా మొత్తం వ్యక్తిత్వంతో పోలిస్తే అస్తవ్యస్తంగా, సామరస్యరహితంగా తయారవుతాయి. ఇదంతా అవి కేంద్రస్థమైన సంకల్పాన్నించి దూరమవటం వల్లనే.

ఇంకో రకంగా చూస్తే మనలో నున్న స్వల్ప అంశాలలో చైతన్యం పెంచుకుంటే, అది వృథాయే గాక, అపాయకరం కూడా అవుతుంది. అది కనక ఒక ఆనతి ప్రకారం అంటే దివ్యశక్తి అన్ని అంశాల మీదా సర్వాధికారిగా ఉండేటట్లు చేయలేకపోతే, ఆమె మార్గదర్శకానికీ, దైవనిర్ణయానికీ కనుక, వీటి సర్వసమర్పణ మనం సాధించలేకపోతే అది అపాయమే అవుతుంది.

ఈ రెండు వైఖరుల సమతుల్య సమైక్యతలో మాత్రమే నిక్కచ్చిగా, సమగ్రమైన దైవభృత్యునిగా చెప్పుకోవచ్చు.

సమస్త పదార్థాలకు జీవనము, కాంతి, ప్రేమలు నీవే అయివున్న, ఓ ఉదాత్త ప్రభూ! సిద్ధాంతపరంగా నా జీవన సర్వస్వాన్నీ నీకు సమర్పణ గావించుకున్నప్పటికీ, ఆ సమర్పణను సవివరంగా అమలుచేయటం కష్టంగా ఉంది.

ప్రతి రోజూ ఎన్ని సార్లు నీకు సమర్పణ కావించకుండానే కర్మల నాచరిస్తున్నానో! అలా చేసిన వెంటనే నాకు చెప్పలేని వ్యాకులత కలిగి అది శారీరక సంవేదనగా హృదయంలో కలుక్కుమంటుంది. అప్పుడు నా కర్మకు నేనే గురి అవుతాను. చాలా హాస్యాస్పదంగా, బుద్ధితక్కువగా, నిందాపూర్వకంగా అనిపిస్తుంది నాకది. అది చాలా శోచనీయంగా బాధ కలిగిస్తుంది. అప్పుడు ఒక పసిబిడ్డ వలె, విశ్వాసంతో నీలోకి ఒదిగిపోయి, నా లోనూ, నా చుట్టూ, జరిగినవాటిని సరిచేయడానికి తగిన స్ఫూర్తి, శక్తి వచ్చేవరకు వేచివుంటాను. అప్పుడే నాకు అన్ని చర్యలను సంపూర్ణ స్వతంత్రంగా నిర్ణయించగల సార్వత్రిక ఐక్యతను గురించిన నిరంతర అవగాహన కలుగుతుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: అమరవాది ప్రభావతి; అమరవాది వేంకటరామ శాస్త్రి

సమగ్ర సమర్పణ — బేరసారాలు

ఒకాయన నాకు వ్రాశాడు. ఎందుకు? తాను అద్భుతశక్తులు అభిలషించాడు. ఎందుకోసమంటే దివ్యానుష్ఠానం కోసం. దివ్యశక్తులను దైవమునకు సమర్పించటం కోసం. అందుకోసమే అపారమైన సంపదలను కోరుకున్నాడు. ఇందుకు తను విచారించనవసరం లేదని బదులు చెప్పాను. ప్రతి ఒక్కరు తమకున్న సర్వస్వము — అది యేదికానీ — తన జీవన సర్వస్వమును, తనకున్న వనరులను దైవార్పణ కావించవచ్చును. ఆధ్యాత్మిక దృక్పథంలో నీవు అర్పించిన దానం పరిపూర్ణమవుతుంది. ఇదేమీ నీ కున్న సంపద, శక్తి సామర్థ్యాలపై ఆధారపడదు.

అర్పణయొక్క పరిపూర్ణతపై నాధారపడుతుంది. నేను, నాది, నాకున్నది — అది అర్పించు. నీ ప్రదానం పరిపూర్ణమవుతుంది. ఆధ్యాత్మిక దృక్పథంలోనూ ,అది పరిపూర్ణంగా ఉంటుంది. నీకు ఉన్న సంపద, శక్తిసామర్థ్యాలపై గాక నీవు అర్పించిన దానియొక్క పరిపూర్ణ సమగ్రతలపై, అది ఆధారపడి ఉంటుంది.

భారతీయ కథల సంపుటి పుస్తకంలో చదివిన ఒక కథ నాకు గుర్తుకి వస్తోంది. ఆ కథలో ఒక చాలా ముదుసలి అవ్వ, పేదరాలు, అనాథ, పాడైపోయిన గుడిసెలో దీనాతిదీనంగా బ్రతుకుతోంది. ఆమె కెవరో ఒక మధురమైన మామిడి పండు ఇచ్చారు. ఆమె ఆ పండు సగం తిని, మిగిలినది, మరునాటికి దాచుకుని ఉంచుకుంది. అంతటి తీయటి అపురూపమైన పండు ఇదివర కెన్నడు ఆమె తినలేదు. చీకటి పడింది. ఆ రాత్రి ఎవరో ఆశ్రయం కోసం, ఆకలితో, ఆతిథ్యాన్ని కోరి, పట్టుతప్పి, శిథిలమై వేలాడే తలుపు తట్టాడు. ఆమె చెప్పింది: "చలి కాచుకోటానికి నీకు నిప్పు ఇవ్వలేను. కప్పుకొనేందుకు దుప్పటి లేదు. ఉన్నదల్లా సగం తినగా మిగిలిన ఈ మామిడిపండు మాత్రమే. నీకు కావాలంటే తీసుకో. సగం నేను తిన్నాను" — అన్నది. ఆ వచ్చినవాడు పరమశివుడు. ఆమె దివ్యతేజోవిలసితురాలయింది. ఏమంటే ఆమె చేసినది పరిపూర్ణదానం. సమగ్రమైనది — తన దగ్గరున్న సర్వస్వము —

అది చదివాను. దివ్యమైనది అది. కళ్ళకు కట్టినట్లుగా వర్ణించినది, సరిగ్గా అదే.

సంపన్నులు, జీవితంలో పుష్కలంగా అన్నీ ఉన్నవాళ్ళు, దైవానికి ఇవ్వవలసి వచ్చినపుడు — వాళ్ల అవసరాలు తీర్చుకొని, మిగిలినదేమైనా ఉంటే దేముడికి ఇస్తారు. వాళ్లు సాధారణంగా చేసేది అంతే. అవసరాలన్నీ తీర్చుకున్న తర్వాత ఇంకా కాస్త సొమ్ము ఉంటుంది. వస్తుసముదాయం ఉంటుంది. అప్పుడే యెంతో ఉదారంగా భగవంతుడికి దానం చేస్తారు. అసలేమీ ఇవ్వకుండా ఉండటం కంటే ఇది మేలే. ఈ మిగిలినది కూడా తక్కువ సొమ్ము కాకపోవచ్చు. లక్షల విలువ చేసేదే కావచ్చు. కాని ఇది కూడా, ఆ సగం తిన్న మామడిపండు విలువకు సరి రాదు. ఇక్కడ లెక్కకట్టేది పరిమాణం, విలువ కాదు. గుణశ్రేష్ఠత. ఇవ్వటంలో చిత్తశుద్ధి, సమగ్రత. ఇవీ లెక్కింపదగినవి.

ప్రశ్న: సాధారణ జీవితంలో ఐశ్వర్యవంతులు తమ సంపదను భగవంతునికి దానం చేయాలనుకున్నప్పుడు, దైవం వారి ముందు ఉండడు. మరి వారు ఎవరి కివ్వాలి? వారి ధనం ఎక్కడ ఇవ్వాలో వారికి తెలియదు!

అవును. కాని ఆ ప్రశ్నే తలెత్తదు. తమ ఆంతర్యంలో కాని, బాహ్యంగా కాని వారికి భగవంతునితో సమాగమం లేనపుడు ఆ ప్రశ్నే లేదు. తనకు పరిచితులుకాని వారి కెవరికీ ఇవ్వమని ఎవరూ అడగరు కదా.

వారు దైవాన్ని తమలో కనుగొన్నప్పుడు తమకు ఉన్న దానిని ఎలా వినియోగించాలో దైవం నుంచి తమకు వచ్చిన సూచనను వారు అనుసరించాలి. తమకు అందిన సూచనను వారు తూ.చ తప్పకుండా చిత్తశుద్ధితో పాటించటమే వారు చేయగలిగే పని. అంతవరకు వారి నెవరూ యేమీ అడుగరు.

"నేను దైవానికి సమర్పణ కావించుకోవాలని కోరుకుంటున్నాను, అందుకు సిద్ధంగా ఉన్నాను," అని నీవు అన్నపుడే నిన్ను ఎవరైనా ఏమైనా అడగటం ఆరంభమయేది. అపుడే, ఎవరైన అడగటం ప్రారంభమైనప్పటి నుంచే — ఆ క్షణం నుంచీ, అంతకు ముందు కాక — అంతా సక్రమంగా ఉంటుంది. అంతకు మునుపు నీవు ఏమిచ్చినా బాగానే ఉంటుంది కాని, సహృదయంతో నీవు ప్రవర్తించటం వేరు, దైవాన్ని (భక్తి పురస్సరంగా) నిన్ను దగ్గరకు చేర్చుకోమని అభ్యర్థించటం వేరు — జీవనయానంలో ఏ కాస్తంత అయిన మార్పు చెందాలనే ఉద్దేశం లేకుండా. ఈ రెండింటికి వ్యత్యాసం ఉంది.

సాధారణ జీవనం జీవించేవాళ్ళు, సహృదయతతో ప్రవర్తించటం, వారికది మేలు చేకూరుస్తుంది. భవిష్య జీవనానికది — ఆ సహృదయత — వారికి నిర్దిష్ట అంశంగా ఉపకరిస్తుంది. అయితే — "నా కిపుడు గణనీయమైననది ఒక్కటే — దివ్యజీవనం మాత్రమే. దివ్యజీవనుడిగా ఉండాలని కోరుకుంటాను," అని నీవు అనుకున్న క్షణం నుంచి మాత్రమే — ఆ క్షణం నుంచే ఎవరైనా నిన్ను అడిగేది — అంతకు ముందు కాదు.

ప్రశ్న: ప్రియజననీ, ఇక్కడికి వచ్చే వ్యక్తులకి సంపద ఉంటుంది. భక్తి ఉంటుంది. తమ భక్తిని ప్రదర్శిస్తారు. కాని డబ్బు విషయానికి వచ్చేసరికి బేరం ఆడతారు....

చెప్తాను. దీనిని గురించి నేనిదివరకే ప్రస్తావించాను. వాళ్లు తమ శక్తివంచన లేకుండా దైవం నుంచి తీసుకోవలసినదంతా తీసుకోవటానికి వస్తారు — సర్వ నైపుణ్యాలు, సుగుణాలు, అవకాశాలు, సుఖాలు — సర్వమూ — ఇంకా శక్తులు కూడా — ఇలా అంతా, ఇవ్వటానికి కాక తీసుకోవటానికే వాళ్లు వస్తారు. వాళ్ళు ప్రదర్శించే భక్తి కేవలం ఒక ముసుగు — కోర్కెలను కప్పిపుచ్చి ఉంచేది. ఇది

ఎంతో సువిశాల క్షేత్రాన్ని విస్తరించి ఉంచుతుంది — ఆత్మరక్షణ నుంచి, ఆధ్యాత్మిక అనుభవాలు, శక్తులు పొందటం, సుఖమైన ప్రశాంత జీవనం, ఏ బాదరబందీలు, చికాకులు లేని జీవనం — అలా ఉంటుంది. అదెంతో విస్తృత పరిధిని ఆక్రమిస్తుంది. కాని వాళ్లు ఇవ్వవలసివచ్చినపుడు — అదో రకమైన బేరమే. ఇవన్నీ పొందటానికి ఎంతో కొంత ఇవ్వవలసి ఉంటుందని, కాకుంటే, వాటిని పొందలేమని, వాళ్లకు తెలుసు. అందుకే వాళ్ల భక్తి ప్రదర్శన. అదో నాటకమే. చిత్తశుద్ధి లేదు.

వారి దురదృష్టం. ఇది ఎవరినీ మోసగించదు. సహింపబడవచ్చు. అంటే మోసగింపబడినారని కాదు.

జీవుని అన్ని భాగాలలోను, సర్వత్రా బేరమాడటమనేది ఉన్నది. ఎల్లప్పుడూ ఇచ్చి పుచ్చుకోవటమే — సర్వోన్నత ఆధ్యాత్మిక అనుభవాల నుంచి అత్యల్పమైన ప్రాపంచిక అవసరాల వరకు. బేరమనేది లేకుండా సమర్పణ కావించుకునేవారు కోటికి ఏ ఒక్కరో!

మీకు నేను చెప్పిన కథ తాలూకు అందం ఎక్కడ ఉన్నదంటే — అలాంటి వారు ఇక్కడ చాలామంది ఉన్నారు. ఆ వృద్ధురాలు ఇచ్చినపుడు, తీసుకునేవాడు పరమేశ్వరుడని ఆమెకు తెలియదు. అలా దారినపోయే దానయ్యకు ఇచ్చినది, ఆమె. ఇవ్వటంలో, ఒక మంచి పనిచేయటంలో ఆనందం. ఆతను భగవంతుడని కాదు, మోక్షాన్ని ఆశించీ కాదు. ఇచ్చిపుచ్చుకునే పరిజ్ఞానంతోనూ కాదు.

మూలం: శ్రీమాత

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

చాలా కొద్దిమంది మాత్రమే, బహు కొద్దిమంది — చర్చికి, దేవాలయానికి నిజమైన ఆధ్యాత్మిక సంవేదనతో — భగవంతుని ప్రార్థించి, ఏదో లబ్ధి పొందాలని కాక, తమను తాము అర్పణ కావించుకోవటానికి, కృతజ్ఞతా నివేదనానికి, వెడతారు. అలాటి వారు కోటికి ఏ ఒక్కరో!

— శ్రీమాత

సాధన ప్రయోజనం

ప్రశ్న: ప్రియజననీ! "ఈ విముక్తి, పరిపూర్ణత్వం, నిండుతనం (సమగ్రత్వం) మన కోసం కాకుండా భగవంతుని కోసమే ప్రయత్నించాలి", అని శ్రీఅరవిందులు వ్రాశారు. కాని మనం చేసే సాధన మన కోసం కాదా?

సరిగ్గా అదే ఆయన నొక్కి చెప్పారు. విషయాన్ని స్పష్టం చేసేందుకే. మనం సాధించదలచుకునే పరిపూర్ణత మన వ్యక్తిగతమైన, స్వార్థపరమైన ప్రయోజనం కోసం కాదు. భగవంతుని అభివ్యక్తం చేయడం కోసమే. భగవంతుని సేవలో భాగంగా పరిపూర్ణత్వాన్ని అర్పించటం కోసం. వ్యక్తిగత పూర్ణత్వం పొందాలన్న స్వార్థపర యోచనతో మనం ఈ సాధన చేయరాదు. భగవత్కార్యసిద్ధి కోసం ఈ సాధన చేపట్టాలి.

ప్రశ్న: ఈ భగవత్కార్యం మనం ఎందుకు చేయాలి? మనల్ని మనం...

కాదు, కానే కాదు! భగవత్ సంకల్పం కాబట్టి. అది వ్యక్తిగత ప్రయోజనం కోసం కాదు. అది కానే కాదు. అది భగవత్ సంకల్పం, భగవత్ కార్యం కాబట్టి.

వ్యక్తిగత ఆకాంక్ష, కోరిక, స్వార్థపర సంకల్పం దానితో కలిసి వుంటే, అది ఒక మిశ్రమం అవుతుంది. అది భగవత్ సంకల్ప వ్యక్తీకరణ. భగవంతుడు, భగవంతుని సంకల్పం, భగవంతుని అభివ్యక్తి, భగవంతుని వ్యక్తీకరణ — ఇవే ప్రధానాంశాలు. దాని కోసమే ఎవరైనా ఇక్కడ వున్నది. మరే కారణం కాదు. స్వార్థపరత్వం, అహంకారం, వ్యక్తి అనే భావన ప్రవేశిస్తే, ఒకరు ఎలా ఉండితీరాలో అలా లేరని అర్థం. అంతే. ఇదంతా ఒక్క రోజులో సాధిస్తామని కాదు. కాని అదే సత్యం

ఈ ఆధ్యాత్మిక రంగంలో కూడా చాలామంది (ఆధ్యాత్మిక జీవనం, యోగసాధన చేపట్టిన వారిలో అధిక సంఖ్యాకులు) వ్యక్తిగత కారణాల వల్ల సాధనలో దిగుతారు. కొందరు జీవితంలో విరక్తి చెందుతారు. కొందరు ఆనందం లోపించడం వల్ల, కొంతమంది ఇంకా తెలుసుకోవాలన్న కాంక్షతో, మరికొంత మంది ఆధ్యాత్మికంగా తాము గొప్పవారు కావాలని, ఇతరులకు బోధించడానికి జ్ఞానం సంపాదించాలని కొందరు యోగసాధన చేయడానికి అనేక వేల వ్యక్తిగత కారణాలున్నాయి. భగవంతునికి అర్పించుకొందామని, భగవంతుడే మనల్ని తన వైపు తిప్పుకొంటాడని, తానేమి సంకల్పిస్తాడో ఆ విధంగా మనల్ని రూపుదిద్దుతాడని పవిత్రమైన, నిలకడగల మనస్సుతో

ఈ విధంగా సాధన చెయ్యాలని అనుకునేవారు కొద్దిమందే వుంటారు. కాని అదే సత్యం. దీని సహాయంతో సాధకుడు తన గమ్యం చేరతాడు. ఎప్పుడూ పొరపాట్లు చేయడు. కాని ఇతర భావాలు అహంతో మలినమవుతాయి. అవి సాధకుడ్ని, అటూ యిటూ తీసుకొని వెళ్తాయి. గమ్యం నుండి చాలా దూరం వెళ్లిపోతాడు.

జీవించడానికి ఒకే కారణం, ఒకే గమ్యం, అదే భావన, పరమార్థం. అదే భగవంతునికి పరిపూర్ణంగా, సర్వసమగ్రంగా, నిండుగా ఆత్మసమర్పణ చేసుకోవడం, దైవం నుండి నువ్వు వేరు కాదు, ఎటువంటి వ్యక్తిగత సంఘర్షణలు లేకుండా పూర్తిగా, దైవంగానే ఉండిపోవడం. ఇదే ఆదర్శం. అన్ని ప్రమాదాల నుండి, ముఖ్యంగా అహంకారం వంటి పెద్ద ప్రమాదం నుండి నిన్ను రక్షించి, ముందుకు తీసుకొని వెళ్లేది, ఆ ఆదర్శమే. శ్రీఅరవిందుని ఉద్దేశ్యం అదే తప్ప మరోటి కాదు.

ప్రశ్న: ప్రియజననీ! భగవంతుని కోసం ప్రతి పనీ చేయాలని మీరు ఇప్పుడే చెప్పారు.

ఔను.

ప్రశ్న: అయితే మరి, ఈ గందరగోళ పరిస్థితిలో భగవంతుడు ఎందుకు అభివ్యక్తం కావాలని కాంక్షిస్తున్నాడు?

భగవంతుడు ఈ కారణంగానే ఈ భూమిని సృష్టించాడు. ఆయనకు మరే ప్రేరణ లేదు.

ఈ భూమి ఆయనే. అయితే ఈ ప్రపంచం వైకల్యరూపం చెందింది. తిరిగి దానిని మహాసత్యంతో సుస్థిరం చేయాలని ఆయన ఆకాంక్ష. ఈ భూమి ఆయన నుండి వేరు కాదు. ఆయనకు పరాయిది కాదు. ఆయనే తనకు తాను ఈ లోకంగా వైకల్యం చెందాడు. అసలు ఈ లోకం అసలు స్వరూపమేమిటో, అంటే భగవంతునిగా మారాలి. అదీ ఆయన లక్ష్యం.

ప్రశ్న: మరి ఆయన మన కెందుకు అపరిచితుడుగా అయినాడు?

కాని ఆయన అపరిచితుడు కాదు. ఆయనను అపరిచితుడిగా నువ్వు ఊహిస్తున్నావు. కాని ఆయన అలా ఏ కాస్తంతా కూడా కాదు. నీ ప్రత్యక్ష ఆత్మ, నీకు పరాయి పురుషుడు కాడు. ఆయనెవరో నీకు తెలియకపోవచ్చు. ఆయన నీకు పరాయివాడు కాదు సుమా! నీ ఆత్మ సుధాసారమే! ఆయన నీకు తెలియకపోవచ్చు. ఆయన లేకపోతే నువ్వు జీవించ లేవు. ఆయన లేకుండా నువ్వు క్షణంలో లక్షో వంతు కూడా బ్రతకలేవు. అవాస్తవ భ్రాంతిలో, వైకల్యస్థితిలో

నువ్వు జీవిస్తున్నందువల్ల నీవు చైతన్యవంతుడివి కాలేకపోతున్నావు. నీ గురించిన స్పృహ నీకు లేదు. మరేదో స్పృహలో ఉన్నావు. అదే నీవనుకుంటున్నావు. కాని అది నువ్వు కాదు.

ప్రశ్న: మరి నే నెవర్ని, ప్రియ జననీ?

దైవానివే! (The Divine)

మూలం: శ్రీమాత

అనువాదం: కె. యజ్ఞన్న

ప్రార్థనలు — ధ్యానములు

నీ దివ్య మార్గదర్శకత్వంలో విశ్వాసముంచి సమర్పణ కావించుకోవటంలో పొందే సాఫల్యత (సార్థకత) గత రాత్రి నాకు అనుభవమయింది. తెలుసుకొనవలసినదేదైనా తెలుసుకోవలసిన అవసరం కలిగినపుడు అది తెలుస్తుంది. నీ దివ్య తేజోనివహానికి అనుగుణంగా మనసు నిశ్చలమైనపుడు దాని వ్యక్తీకరణ మరింత సుస్పష్టంగాను, సుసంపన్నంగాను ఉంటుంది.

నీ ఊసులు నాలో విన్నాను. నీవు చెప్పినదంతా దాని నిర్దిష్ట పదసూత్రబంధం చెడకుండా ఉండేలా, యథాతథంగా వ్రాసి ఉంచాలని అభిలషించే వాడినే. ఎందుకంటే ఇపుడు అయితే ఆ చెప్పినది చెప్పినట్లుగా చెప్పగలిగేవాడను గాను. (అయితే) అపుడనుకున్నాను — ఈ సంరక్షణా తాపత్రయం, నీ పట్ల అవమానకరమైన విశ్వాసరాహిత్యమే అవుతుందని. ఎందుకంటావా — నా కవుసరమైనదంతా, నా దృక్పథానికి అనుగుణమైన మేరకు, నా పై నాలో నీవు ప్రవర్తిస్తావు, నీవే చేయగలుగుతావు. నీ అనంతశక్తికి అవధి లేదు కదా! సర్వాంతర్యామియైన నిన్ను దర్శించడమెలాగో తెలిసినవాళ్లంతా, వీలైనంత పరిపూర్ణంగా, సర్వదా, తెలుసుకోవలసినదదే. మరిక భయమే లేదు, అశాంతి లేదు, బాధ లేదు — పరిపూర్ణ నిశ్చలతత్వము, పరిపూర్ణ విశ్వాసము, చెదరని పరమోన్నత దివ్య ప్రశాంతత — తప్ప మరేమీ లేదు.

మూలం: శ్రీమాత (06-12-1912)

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

సంపూర్ణ సమర్పణలోని ఆనందం

ప్రశ్న: మాతా, ఎవరయినా కొంత ఉన్నతస్థితికి చేరినప్పుడే తమను తాము సమర్పించుకోగలరు. కాని ఎవరయినా కొంత హెచ్చుతగ్గులతో అచేతనాజీవితమే గడుపుతున్నప్పుడు, ఆత్మ-సమర్పణ కొంత అటు ఇటుగా మానసికమే అవుతుంది కదా? అటువంటప్పుడది ఫలితాన్నివ్వదు కదా. వారు ఏం చేయాలి? మొట్టమొదటి నుంచే ఆత్మ-సమర్పణను చేస్తూ వారు మొదలు పెట్టవచ్చునా?

అది ఆ యా మనుషుల మీద ఆధారపడి ఉంటుంది నాయినా. కొంతమంది మనుష్యులుంటారు, వారిలో మేధస్సుతో ఆలోచించి అర్థం చేసుకునే శక్తి తక్కువ ఉండి, చైత్యపురుషుని నుంచి వచ్చే కదలికలు, భావావేశ ప్రేరణలు బలంగా ఉంటాయి. వారిలో తెలియకుండానే దైవం గురించి ఏదో చెప్పలేని ప్రబలమైన ఆకర్షణ ఉండి, దైవం అంటే ఇసుమంతైనా అవగాహన లేమితనం, అది ఎట్లా ఉంటుంది, అది దేనిని తెలియపరుస్తుంది, అనే వాటి మీద ఏమాత్రం మేధోపరమైన జ్ఞానం ఉండదు, కాని వారికి దైవం కోసం ఒక ప్రేరణ, ఆకర్షణ, అవసరం, <u>అదీ తప్పని సరైన అవసరం</u> ఉంటుంది.

ఎవరికైతే అది ఉందో, అది భగవదనుగ్రహ ఫలితం అని చెప్పగలను, వారికి ఇబ్బంది పెట్టని మనస్సు ఉంటుంది. అది ప్రశ్నించదు, దాని గురించి చర్చించదు, ఎంతో త్వరితంగా దైవసమాగము కోరుకుంటుంది.

మరి కొంతమంది ఉంటారు, వారు మొదట అవగాహన ఏర్పరుచుకుంటారు, వారు మేధావులు, గ్రంథపఠనం చేసి ఉంటారు, వారు మాటలలోను, భావాలలోను చమత్కారులు, అన్ని రకాల తాత్త్వికతల మీద, అన్ని మతాల మీద, మానవభావాల మీద అసాధారణ ప్రజ్ఞాపాటవాలతో ఉపన్యాసాలను ఇస్తారు. బహుశా వారు పురోభివృద్ధిలో ఒక అడుగు ముందుకు వేయడానికి సంవత్సరాలు తీసుకుంటారు. ఎందువల్లనంటే అదంతా వీరి మస్తిష్కంలోనే తిరుగుతుంటుంది.

మస్తిష్కంలో ఎన్నో విషయాలు తిరుగుతుంటాయి. దీని గురించి ఇదివరకే మీకు నేను చాలా సార్లు చెప్పాను. మస్తిష్కం ఒక బహిరంగ స్థలం లాంటిది. అందులోకి ఏవైనా ప్రవేశించగలవు. అలా వచ్చినవి, ఒకదాని నొకటి దాటుకుని బయటకు పోవటంతో పాటు, చాలా అస్తవ్యస్తతలను సృష్టిస్తాయి. ఎవరైతే భావాలతో

క్రీడిస్తుంటారో వారందరికంటె ఎక్కువగా ముందుకు పోవటానికి అడ్డగించబడతారు. వారు ఆడే ఆట చాలా అందంగా ఆకర్షణీయంగ ఉంటుంది. నీవు ఏ మాత్రం కూడా సాధారణ మనిషివని, సాధారణ జీవనస్థాయిలో ఉన్నావనే భావనను కలగనీయదు, కాని అది రెక్కలను కత్తిరిస్తుంది.

మస్తిష్కానికి రెక్కలుండవు, అవి హృదయాని కుంటాయి. అది ఇక్కడ అవసరం.... అవును, తప్పనిసరైన అవసరం. ఇంకేదీ దాని ముందు లెక్కలోకి రాదు. అదే సమస్తం, కేవలం అది మాత్రమే.

అటువంటి వారికి అన్నీ స్వల్ప విషయాలయి, అన్నింటినీ తృణప్రాయంగా తలుస్తూ, వారు ఎటువంటి అడ్డంకులను, కష్టాలను లవలేశం కూడా లెక్కచేయరు. అవి నిన్నేం చేయగలుగుతాయి?... అవి గణనీయం కావు. కొన్ని సమయాలలో దానికి వారు నవ్వుకుంటారు. అది చాలా సమయం తీసుకుంటే మట్టుకు నీ కేమవుతుంది? దానివల్ల నీకు ఆకాంక్షలో, అర్పణలో, ఆత్మనివేదనలో సంతోషం మరింత ఎక్కువ సమయం ఉంటుంది.

ఎందుకంటే ఇదే అసలైన వాస్తవ సంతోషం. ఈ సంతోషం, ఎక్కడైనా కొంత అహంకారం ఉంటే మరుగైపోతుంది, దానికి కారణం పొంది తీరాలనే కోరిక (demand), దానినే ఒకరు అవసరం అంటారు, అది సమర్పణలో కలసిపోయి ఉంటుంది. లేకపోతే ఆ సంతోషం ఎప్పటికీ అదృశ్యం కాదు.

ఎవరైనా దీనినే మొదట పొందుతారు, ఆఖరున కూడా వాస్తవంగా సిద్ధింప చేసుకుంటారు. అదే విజయానికి గుర్తు.

నీవు సంతోషంగా, నిరంతరమైన, నిశ్చలమైన, ప్రశాంతమైన, ప్రకాశవంతమైన, నిశ్చలమైన సంతోషంతో ఉండలేని పక్షంలో, అప్పుడు దానర్థం ఇంకా నిన్ను నీవు పరిశుద్ధి చేసుకోవటానికి కృషి చేయవలసి ఉంటుంది. ఒక్కొక్కప్పుడు చాలా కఠిన శ్రమ చేయవలసి ఉంటుంది. అదే గుర్తు అని తెలుసుకోవాలి.

ఈ వేర్పాటు భావన వలననే నొప్పి, బాధ, దుఃఖం, అజ్ఞానం, అన్ని రకాల అశక్తతలు వచ్చాయి. అది సంపూర్ణమైన ఆత్మ-సమర్పణ, నేననే దానిని పూర్ణసమర్పణతో మరచిపోవటం జరిగినప్పుడే బాధ అదృశ్యమై, దాని స్థానంలో సంతోషం స్థిరపడుతుంది, దానిని ఏదీ మరుగుపరచలేదు.

ఈ సంతోషం ఇక్కడ ఈ ప్రపంచంలో సుస్థిరంగా స్థాపించబడినప్పుడే, అది

పూర్తిగా పరివర్తన చెందబడుతుంది. అప్పుడు కొత్త జీవితం, నూతనసృష్టి, నవ్య సాక్షాత్కారం జరుగుతుంది. సంతోషం మొదట చైతన్యంలో స్థాపించబడాలి, దాని తరువాతనే భౌతిక పరివర్తన జరుగగలదు, దానికి ముందు కాదు.

నిజం చెప్పాలంటే, అడ్డుపడే శత్రువు (adversary) వలననే ఈ ప్రపంచంలో బాధ ప్రవేశించింది కేవలం ఆనందం మాత్రమే అతనిని గెలువగలదు, ఇక దేని వలననూ కాదు. అదే నిశ్చితంగా, సందేహానికి తావు లేకుండా గెలిచి తీరుతుంది.

(చాలాసేపు నిశ్శబ్దం)

దివ్యానందమే సృష్టిని చేసింది, దివ్యానందమే దానిని సాధిస్తుంది.

(నిశ్శబ్దం)

ఒక విషయం గుర్తు పెట్టుకోండి, నేను మనుషులు సాధారణంగా మాట్లాడే సంతోషం గురించి మాట్లాడటం లేదు, అది దానికి ఏ మాత్రం అనుకరణ కూడా కాదు, అది నా ఉద్దేశంలో పక్క దారి పట్టించడానికి చేసే దారుణమైన కల్పన, నేను దేని గురించి మాట్లాడుతున్నానో తెలిసిందా, అది నిర్లిప్తత, ఉదాసీనత నుంచి వచ్చే సుఖానుభవం.

(నిశ్శబ్దం)

నేను పరిపూర్ణ శాంతి, నీడలేని వెలుగు, సామరస్యం, పూర్ణసౌందర్యం, అడ్డు ఆపులేని ప్రబలమైన అత్యంత ఆకర్షణీయమైన శక్తికి, సంబంధించిన ఆనందం గురించి చెప్తున్నాను. ఆ ఆనందం దివ్యసన్నిధి,, దాని అంతస్సత్వంలో, దాని దివ్య ఇచ్ఛలో, దాని సాక్షాత్కారంలో అది ఉంది.

ప్రశ్న: మాతా, జయించటానికి మీరు ఒక మాట చెప్పారు, కేవలం సంతోషం మాత్రమే, అడ్డుపడే శత్రువును గెలవగలదని. కాని సంతోషం పొందాలంటే మొదట ఆ శత్రువును గెలిచి తీరాలి కదా!

అలా ఎందుకని! వాడిని అధిగమించిపోయి, వాడిని పట్టించుకోకుండా ఉపేక్ష వహించాలి.

నీవు ఒక పనిని చేయడం మొదలుపెట్టాలి, ఏమిటంటే, వాడి ప్రభావం నుంచి నీవు స్వతంత్రతను పొందడం. కాని అడ్డుపడే శత్రువు నుంచి స్వతంత్రతను పొందడానికి, అడ్డుపడే ఆ శత్రువును జయించడానికి తేడా ఉంది. అడ్డుపడే శత్రువును జయించటం చిన్న విషయమేం కాదు. వాడిని గెలవటానికి వాడి కంటె ఎక్కువ శక్తి

కావాలి. కాని అదే వాడి ప్రభావం నుంచి ఎవరైనా పూర్తిగా స్వతంత్రతను పొందవచ్చు. ఏ క్షణాన్నైతే వారు వాడి ప్రభావం నుంచి పూర్తిగా స్వతంత్రతను పొందుతారో అప్పుడు వారు తమను తాము పూర్తిగా అర్పించుకోగలుగుతారు. అడ్డుపడే శత్రువును నిజంగా జయించి, వాడు మాయమైపోవటానికి ఎంతో కాలానికి ముందే తమను తాము అర్పించుకోవటం అనే దాని వలన ఆనందం కలుగుతుంది.

ప్రపంచానికి అడ్డుపడే ఆ శత్రువు అవసరం లేదన్నప్పుడే, వాడు మాయమైపోతాడు. అయితే బంగారానికి దాని శుద్ధ నాణ్యతను తెలిపే గీటురాయిలాగా మనకు వాడు అవసరం. ఈ విషయం మనకు బాగా తెలుసు.

కాని మీలో, అది ఎవరైనా కాని, నిజంగా చిత్తశుద్ధిని కలిగినవారయినట్లైతే, (నేను చిత్తశుద్ధి అనేది, శ్రీఅరవిందులు చిత్తశుద్ధి అని దేనిని అంటారో, ఆ చిత్తశుద్ధి గురించి మాట్లాడుతున్నాను,) అస్తిత్వంలో ఏదీ ఆకాంక్షను, సమర్పణ చేయాలనే ఇచ్ఛను ఖండించకూడదు. స్వతంత్రుడుగా జీవించటానికి, ఏదీ కపటవేషంతో తనను తాను మోసం చేసుకోదు. కపటవేషాలు లెక్కలేనన్ని. అవన్ని అతి చాకచక్యంతో దురుద్దేశంతో చాలా మోసపూరితంగా ఉంటాయి. దురదృష్టవశాత్తు మానవునికి స్వాభావికంగానే ఒక సహజమైన తనను తాను మోసం చేసుకునే ధోరణి చాలా ఎక్కువగా ఉంది. ఎంత తక్కువమంది తాము మోసగించబడ్డామనే సంగతిని గుర్తించగలుగుతారు! కాని వారు నిజంగా చిత్తశుద్ధి కలవారైతే, అడ్డుపడే ఆ దుష్టశత్రువు ఎంత మాత్రం వారి దరిదాపులకు కూడా రాలేదు, వాడసలు ప్రయత్నమే చేయడు, అలా చేస్తే కనుక వాడి నాశనాన్ని వాడు కోరి తెచ్చుకున్నట్లవుతుంది.

రాధ ప్రార్థన

ఓ సత్యస్వరూపా, మొదటి చూపులోనే, నా అస్తిత్వప్రభువుగా, నా దైవంగా నిన్ను తెలుసుకున్నాను. నా నివేదనను స్వీకరించు.

నా ఆలోచనలన్నీ, నా భావావేశాలు, హృదయావేశాల అనురాగపూరిత ఆర్ద్రతలు, నా అన్ని స్పందనలు, నా జీవన అన్ని కదలికలు, నా శరీరంలోని కణకణమూ, నా ప్రతి రక్తపుబొట్టూ నీదే. నేననేది సంపూర్తిగా, మొత్తమంతా కలుపుకుని, నీదే. ఏ దాపరికం లేకుండా నీదే. నీవు ఏమని ఇచ్ఛగిస్తే అది నేనవుతాను. నీవు నాకు జీవితాన్ని లేదా మృత్యువును, సుఖాన్ని లేదా దుఃఖాన్ని, సౌఖ్యాన్ని లేదా

బాధను ఇవ్వాలని తలంచినట్లైతే నీ నుంచి వచ్చే ఏదైనా సరే నాకు స్వీకారయోగ్యమే. నీ విచ్చే ప్రతి బహుమతి నాకు దివ్య బహుమతే, అది నాకు అమితానందాన్నిస్తుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్న కృష్ణ

ఆత్మార్పణకి తొలి మెట్టు


సమస్త అస్తిత్వం యొక్క ఆత్మార్పణ, సంపూర్ణ సమత, ఏమాత్రం దయాదాక్షిణ్యాలు లేని అహంకార నిర్మూలన, అజ్ఞానమయ కర్మ నిర్వహణా విధానాల నుండి, రూపాంతరం జరిగే విధంగా స్వభావాన్ని విముక్తం చేయడం అనే దశల ద్వారా స్వీయ అస్తిత్వం, స్వభావం మొత్తాన్ని దైవేచ్ఛకు సమర్పణ కాగలిగేటట్లు సన్నద్ధం చేయగలగడం, సాధించగలగడం — అదొక యదార్థ, సమగ్ర, ఎట్టి మినహాయింపులు లేని ఆత్మనివేదన అవుతుంది. అత్యంతావశ్యకంగా మొట్టమొదట జరుగవలసింది, మనం చేసే కర్మలలో పూర్తి ఆత్మ-సమర్పణాభావం అవశ్యం. అది మొదట సదా కొనసాగే సంకల్ప రూపం ధరించాలి, తరువాత సమస్త అస్తిత్వంలో ఆమూలాగ్ర అవసరంగా మారాలి, చివరకు అప్రయత్నంగా జరిగిపోతుండే, కాని సజీవమైన, సచేతనమైన అలవాటుగా తయారుగావాలి. మనలోనూ, సమస్త జీవులలోనూ, సమస్త విశ్వకార్యనిర్వహణా విధానాలలోనూ ఉన్న పరాత్పరునికై, తెరమరుగై వున్న, పరాశక్తికై చేస్తున్న ఒక యజ్ఞంగా సమస్త కర్మను నిర్వహించే ఆత్మ-స్థిత మార్పుగా పర్యవసించాలి. ఈ యజ్ఞం జరిగేది జీవితంలో, కర్మలు ఆ యజ్ఞంలో మనచే ఆహుతి చేయబడే సమిధలు. మనం, మన కర్మలను అర్పించే యజ్ఞాధిదేవత, మన కిప్పటివరకూ తెలియనిదిగా ఉన్న, లేదా మనం దర్శించనిదిగా ఉన్న, కాని సంవేదించబడిన లేక తటిల్లతలా దర్శించబడిన ఒక విశ్వాతీత, విశ్వవ్యాపక పరాశక్తి మరియు దైవసన్నిధి. ఈ యజ్ఞానికి ఈ ఆత్మార్పణకు రెండు పార్శ్వాలున్నాయి. మనం చేసే కర్మయే ఒక పార్శ్వం, ఆ కర్మను ఏ భావంతో చేస్తున్నామో అది మరో పార్శ్వం. మనం చూస్తున్న, భావిస్తున్న, అనుభవిస్తున్న సమస్తంలో గల కర్మాధికారియైన వాని యెడల వుండే ఆరాధనకు సంబంధించిన భావం అది.

మన అజ్ఞానంలో నుంచి, మనం స్వాయత్తం కావించుకున్న ఉత్తమ జ్ఞాన

ప్రకాశంతో, మొదట మనం చేసే కర్మ నిర్ణయించబడుతుంది. మనం చేసితీరవలసిన కర్మ అదే అని భావిస్తాం. మన విద్యుక్త ధర్మం అనే భావంతో గాని, సహచర-జీవులపై వుండే మన అనుభూతితోగాని, మన అభిప్రాయం ప్రకారం ఇతరులకు ఏది మంచో, ప్రపంచానికి ఏది మేలు చేస్తుందో, దానిని బట్టి గాని, మానవరూపంలో వున్న మనకన్నా, వివేకవంతుడని, ఎవర్ని మనం నమ్ముతామో, కాని అతడెవరైనా గాని మనకు మాత్రం ఆతడు ఇంకా మనం తెలుసుకోనటువంటి సర్వకర్మ ప్రభువు యొక్క ప్రతినిధి అని అంగీకరిస్తామో, ఆ మానవ గురువు, మన కన్న విజ్ఞుడైనవాని ఆదేశం వల్లగాని మనం చేసే కర్మ అదేదైనా గాని సూత్రం ఒకటే — రూపొందించబడుతుంది. కర్మల యజ్ఞానికి ఒక ఆవశ్యకత ఉండి తీరాలి, ఆ ఆవశ్యకత మనకు మన కర్మ ఫలితంపై వుండే అనురాగాన్ని భగవంతునికి సమర్పించే ఆవశ్యకతగా వుండాలి. ఏ ఫలాన్నపేక్షించి కర్మ చేస్తున్నామో దానితో మనకుండే సమస్త సంగాన్ని పరిత్యజించేదై వుండాలి. ఫలితంపై అనురాగంతో మనం కర్మ చేస్తున్నంత కాలం, మనం చేసే యజ్ఞం దైవానికి నివేదన కాకుండా, మన అహంకారానికి చేసే నివేదన అవుతుంది. మనం మరోలా భావించవచ్చు, కాని అలా అనుకోవడం మనల్ని మనం మోసగించుకోవడమే అవుతుంది. మనం మన భావాన్ననుసరించి దైవానికొక రూపం తయారుచేసుకొంటాం. విద్యుక్త ధర్మానికొక అర్థం చెప్పుకొంటాం. సహచర జీవులను గురించి ఒక విధమైన సంవేదనకు లోనవుతాం. ప్రపంచానికి, ఇతరులకు ఇది చేస్తే శుభం కలుగుతుందని ఒక నిర్ణయానికొస్తాం. చివరకు గురువుకు విధేయులమై చేస్తున్నాం అనుకొని చేసేది కూడా మన అహంకారిక సంతృప్తులకు, యిష్టాలకు మనం వేసే ఒక ముసుగు. మన స్వభావం నుండి సమస్త వాంఛను పెకలించి పారవేయమని మనపై కలిగే వత్తిడి నుండి మనల్ని మనం రక్షించుకొనే ఒక అపురూపమైన కవచం.

యోగం యొక్క ఈ దశలోనూ, యోగం కొనసాగుతున్నంత కాలమూ కూడా కామన యొక్క రూపం, అహంకారం యొక్క ఈ ఆకారం యోగానికి శత్రువే, దీనికి వ్యతిరేకంగా మనం సదా అప్రమత్తులమై జాగరూకతతో యోగక్షేమాన్ని పరిరక్షించుకోవాలి.

మనం కర్మ ఫలాపేక్షను విసర్జించగలిగిన వాళ్ళమైనప్పటికీ, ఆ తరువాత, కర్మను చేయాలనే ఆపేక్షను గూడా విసర్జించగలగాలి. ఏ క్షణాన్నైనా సరే, ఒక



Sri Aurobindo

పనిని, కర్మ చేసే పద్ధతిని, కర్మ క్షేత్రాన్ని మరోదాని కోసం, మార్చుకొనడానికి లేదా గురువు యొక్క స్పష్టమైన ఆదేశం అదే అయితే, పూర్తిగా విడిచివేయడానికి సిద్ధం కావాలి. అలా కాకపోతే, ఆతని కోసం గాక, కర్మ చేయడంలో మనకుండే సంతృప్తి కోసం, ఆనందం కోసం, మనలోని గతిశక్తి యొక్క స్వభావానికుండే కర్మ చేయవలసిన అవసరం కోసం, లేదా మన అభిలాషను నెరవేర్చుకొనడానికి, కర్మచేస్తూన్నట్లవుతుంది. కాని ఇవన్నీ మన అహంకారం నిలిచి వుండే ప్రాంగణాలు, అహంకారానికి ఆశ్రయస్థానాలు.

కర్మఫలంపై, కర్మ చేయుడం పైనే, హృదయుం నుండి సంగాన్ని పరిత్యజించినట్లుగానే, మనమే కర్మ చేస్తున్నామని చివరి దాకా కూడా పట్టుకొని వ్రేళ్ళాడుతూండే భావాన్ని, గ్రహింపును కూడా చివరకు మట్టుబెట్టాలి. మనకు పైన, మన లోపల ఉన్న దైవశక్తి మాత్రమే యదార్థమైన ఏకైక కర్త అనే విషయాన్ని తెలుసుకోవాలి, అనుభూతి చెందాలి.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె. వి. రావు

పరిపూర్ణ భగవదర్పణ

పరమాత్మకు మన సర్వస్వాన్ని పవిత్రీకరించి అర్పణ కావించాలన్న స్థిరమైన, నిరంతరాయమైన సంకల్పం కల్గి ఉండటం మన విధి. అంటే సర్వాంతర్యామియైన నిత్యుడికి మన సంపూర్ణ సత్త్వాన్ని, అనేక కూర్పులుగా అమరిన మన స్వభావాన్ని సమర్పించాలి. ఏకైక పరమార్థమైన ఆ అద్వైతుడి (ఏకైకుని) వరకు ఆత్మార్పణ చేయగలిగామన్నది — అన్నిటినీ త్యజించి ఆ ఒక్క విషయం పైనే ఎంత ప్రభావశీలంగా, సంపూర్ణంగా ఏకాగ్రతను నిలుపగల్గుతున్నామన్నదానిపై ఆధారపడి ఉంటుంది. కాని మినహాయింపు చివరిగా ప్రపంచం పట్ల మన అసత్య దృక్పథాన్నీ, మన సంకల్పపు అజ్ఞానాన్నీ తప్ప దేన్నీ మినహాయించదు. మనస్సులో, మన ఆత్మలో, అట్లాగే అన్ని పదార్థాల్లో, ఆత్మలలో, సంఘటనలలో పరమాత్మను నిరంతరం దర్శించగల్గినప్పుడే పరమాత్మ పట్ల ఏకాగ్రత మనస్సులో పరాకాష్ఠను పొందుతుంది. మన భావోద్వేగాలన్నీ పరమాత్మానురక్తిగా పరమాత్మలోనే పరమాత్మ కోసమే

పరిణమించినప్పుడు, ఈ విశ్వంలోని సమస్త ప్రాణులూ, శక్తులూ, వ్యక్తులూ, రూపాలలోని, సర్వాంతర్యామి దైవం పట్ల ప్రేమగా ముగిసినప్పుడే హృదయపరంగా పరిపుష్ఠమౌతుంది. మనం నిరంతరం దైవస్పందనలను పొంది, అనుభవించినప్పుడు దాన్నే మన ఏకైక ఉత్ప్రేరకశక్తిగా ఆమోదించినప్పుడు ఆ ఏకాగ్రతమన సంకల్పంలో పరాకాష్టను చేరుతుంది. అంటే మన అహంకారభూయిష్టమైన ప్రకృతిలో తిరగబడి, దారితప్పి సంచరించే స్పందనల్లో చివరిదాన్ని కూడా అంతమొందించి, మనలను మనం సార్వజనీనం గావించుకొని, సర్వత్రా దైవసంకల్పాన్ని సంతోషంగా ఆమోదించే స్థితిని పొందగల్గటం అన్న మాట! పూర్ణయోగంలో మొట్టమొదటి సిద్ధి ఇది.

భగవంతుడి కోసం సంపూర్ణ ఆత్మార్పణ చిన్న విషయమేమీ కాదు. కాని మనం నిస్సంకోచంగా కోరికను నిర్మూలించే సుదీర్ఘ, క్లిష్టతర సంధి దశలో నిరంతర పురోగతిని సాధించినప్పుడే ఈ అర్పణ భావన సమగ్రతను సంతరించుకుంటుంది. పరిపూర్ణ భగవదర్పణము అంటే పరిపూర్ణ ఆత్మసమర్పణ.

*

ఇందులో రెండు చలనాలు మధ్యలో సంధి దశ ఉన్నాయి. యోగా రెండు దశలు ఇవి. ఒకటి సమర్పణ క్రమం, రెండవది దాని పరాకాష్ట — పరిణామం. మొదటి దశలో వ్యక్తి పరమాత్మను తన అన్ని భాగాల లోనికి ఆహ్వానించటానికి సిద్ధపడతాడు.

ఈ మొదటి స్వీయ సన్నద్ధ దశ స్వయంకృషికి సంబంధించిన కాలం. ఇందులో అవలంబించాల్సిన మార్గం తను అన్వేషించే దైవంపై తన సర్వ సత్త్వాన్ని కేంద్రీకరించటం — అందుకు అనుబంధంగా దైవిక వాస్తవ సత్యంకాని దాన్నంతా నిరంతరం నిరాకరించటం, బహిష్కరించటం. ఈ నిరంతర ప్రయత్న ఫలితమే. మన సమస్తమూ, మనోవాక్కాయ కర్మల సంపూర్ణ భగవదర్పణ. పరమాత్మకు సంపూర్ణ ఆత్మసమర్పణలో ఇది పరాకాష్ఠను చేరుతుంది. సమస్త అవగాహనతో సంపూర్ణ ప్రకృతి సమగ్ర సమర్పణే ఈ కైంకర్యానికి సమాప్తికి కలికి తురాయి — చిహ్నం. ఈ యోగా రెండవ దశ మానవ — దైవీ వ్యాపారాల్లోని సంధి దశ. ఈ దశలో ఒక సమధిక పవిత్ర, జాగృత, స్తబ్ధత, దివ్యశక్తి పట్ల ఇతోధిక జాజ్వల్య దివ్య ప్రతిస్పందన — అనితరం కానిది జోక్యం చేసుకుంటుంది. తత్ఫలితమే పైనుండి మనలోకి ఒక సమున్నత, చైతన్యపు అద్భుత కార్యాచరణ ప్రవాహం. చివరి దశలో ఏ విధమైన ప్రయత్నం కాని, నిర్దిష్ట విధానం కాని, సాధన కాని ఉండదు;

ప్రయత్నం — తపస్సు స్థానే పరిశుద్ధ, సంపూర్ణ ఐహిక ప్రకృతి మొగ్గ నుండి దివ్యకమలం సహజ స్వాభావికంగా, శక్తివంతంగా, ఆనందంగా వికసిస్తుంది. యోగాచరణలో ఇవి సహజ పరిణామాలు

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: ఆచార్య మాడభూషణం రాజగోపాలాచార్య

సాధకులకు శ్రీమాత సూచనలు

ప్రశ్న: మదర్ ! అధీనం కావటానికీ, సమర్పణకూ భేదమేమిటి?

శ్రీమాత: ఈ రెండు మాటలు దాదాపు పర్యాయపదాలు. నాకు నేనుగా నీకు, స్వాధీనమవుతున్నాను, లేదా సమర్పించుకుంటున్నాను, అనటంలో 'సమర్పణ' అనేది స్వాధీనమవటం కంటే స్వచ్ఛందమయిన భావాన్ని ప్రతిఫలిస్తుంది. ఫ్రెంచిలో 'సుమిసియోం' అనే మాట దురదృష్టవశాత్తూ అంత సరైన పదం కాదు. ఆంగ్లభాషలో మనం 'స్వాధీనత' అని వాడుతాం. కానీ సమర్పణ, స్వాధీనత అనే పదాల మధ్య అంత వ్యత్యాసమేమీ లేదు. 'సుమిసియోం' (ఫ్రెంచి) అనే పదం ఒక ఉదీసీన భావనను కలిగి ఉంది. కానీ సమర్పణ అనే మాట స్వచ్ఛందమైన నివేదనను సూచిస్తుంది.

ప్రశ్న: మదర్ ! 'ఆత్మార్పణ' అనే మాటకు సరియైన అర్థం ఏమిటి?

శ్రీమాత: 'ఆత్మార్పణ' అనేది నిగూఢమైన పదం, కానీ గహనమయినదేమి కాదు. సంపూర్ణ ఆత్మసమర్పణ అంటే పరిపూర్ణమయిన నివేదన. అంటే సమర్పణకు సమానమయిన అర్థాన్నిస్తుంది. ఉదాసీనమయిన 'సుమిసియోం' అనే పదానికికాదు. ఆత్మార్పణ అన్న పదంలో 'ఒక ఉజ్వలమయిన ఉద్వేగం' ఉంది. సమర్పణ అనే పదంలో కన్న మరింత జ్వలిత జ్వాల ఇందులో ఉంది. ఆత్మార్పణ అంటే ఒక కార్యానికి సంపూర్ణంగా నివేదించుకోవటం. యోగపరమైన అర్థంతో చూస్తే అది ఒక దైవకార్య సాధన కోసం పరిపూర్ణమయిన ఆత్మనివేదన.

*

ధ్యానంతో లభించే ప్రశాంతత నిజానికి కొంతసేపే ఉంటుంది. ఎందుకంటే మీరు ధ్యానం నుండి బయటకు వచ్చిన వెంటనే ప్రశాంతత నుండి కూడా బయటకు

రావటం జరుగుతుంది. నిజమయిన ఆత్మసమర్పణ వలన మాత్రమే నిరవధికమయిన శాశ్వతమయిన ప్రశాంతి మీ మనః, ప్రాణ, శరీరాలలో నెలకొంటుంది. ఎప్పుడైతే మీరు దేనినీ కూడా 'నాది' అని అనుకోరో చివరికి మిమ్మల్ని కూడా — ఎప్పుడైతే మీ శరీరం, మీ ఉద్వేగాలు, మీ భావనలు, ఆలోచనలు అన్నీ కూడా దైవానికి సంబంధించినవని భావిస్తారో — భగవంతుడు అన్నిటికీ పూర్తిగా బాధ్యత వహిస్తాడు. మీరిక దేని గురించి చింతించవలసిన అవసరం ఉండదు.

*

అల్పమైన 'నేను' కన్నా ఉన్నతమయిన దానికి మనల్ని మనం అర్పించుకోవటం పరిపూర్ణమయిన ఆనందాన్నిస్తుంది. దానిని భగవంతుడు, మూలవిరాట్, దైవం, పరమ సత్యం — ఇలా ఆ పరమాత్మను మీరు ఏ పేరుతో పిలిచినా ఫరవాలేదు. మన కనువైన ఏ రూపంలో కొలిచినా సరే. సంపూర్ణమయిన ఆత్మసమర్పణలో మనను మనం పూర్తిగా మరచిపోవటం జ్ఞానసిద్ధికి రూఢి అయిన మార్గం.

ప్రశ్న: మదర్ ! ప్రతి క్షణం చేసే పనిని మీ కోసమే అని గుర్తుంచుకోవటం ఎలా? ముఖ్యంగా పరిపూర్ణమయిన నివేదనను చేసుకోవాలనుకున్నపుడు భగవంతుడి కోసమే సర్వమూ అని మర్చిపోకుండా ముందుకు వెళ్ళటం ఎలా?

శ్రీమాత: అది సాధించాలంటే చాలా దృఢమయిన సంకల్పం, అనంతమయిన సహనం ఉండాలి. కానీ ఒకసారి గట్టిగా నిర్ణయించుకొన్న తర్వాత మీకు సహాయం చెయ్యటానికి దైవకృప మిమ్మల్ని వెన్నంటి ఉంటుంది. అంతరంగంలో నీకు సహకారం అనుభవైకవేద్యమవుతుంది.

ప్రశ్న: మదర్ ! భయం వేసినపుడు ఏం చెయ్యాలి?

శ్రీమాత: ఏం చెయ్యాలి అనేది నీ వెలాంటివాడివి, అనే దానిపై ఆధారపడి ఉంటుంది. భయాన్ని అధిగమించటానికి ఎన్నో ఉపాయాలున్నాయి. మీరు భగవంతునికి ఆత్మార్పణ చేసుకొని, ఆయనలో అచంచలమైన విశ్వాసాన్ని కలిగి ఉంటే — చాలా సుగమమయిన మార్గముంది. 'నీ సంకల్పమే నెరవేరనీ, నీవే నా మార్గదర్శివయినపుడు — ఏదీ నన్ను భయపెట్టలేదు — నేను నీ స్వంతం — నా జీవన రథసారథివి నీవే', అని భగవంతుడితో అనగలిగినపుడు — అది వెంటనే పనిచేస్తుంది. అన్నిటికన్న యిది అత్యంత శక్తివంతమయిన మార్గం. ఇది సత్యం. కానీ దైవానికి నిజాయితీతో కూడిన ఆత్మసమర్పణ అవసరం. అలా చేసి ఉన్నట్లయితే,

అది వెంటనే పనిచేస్తుంది. మీ భయమంతా ఒక స్వప్నంలా కరిగిపోతుంది. మీపై దుష్ప్రభావాలు చూపే భూతాలు కూడా ఒక కలలా మీ భయంతోపాటు మాయమవుతాయి. అవి పరుగెత్తుకొని వేగంగా పారిపోవటం మీరు చూస్తారు.

*

బాధలు, కష్టాల నుండి బయటపడటానికి నాకు తెలిసినది ఒకే మార్గం — భగవంతునికి సమగ్రమైన నివేదన, సమర్పణ.

మూలం: శ్రీమాత

అనువాదం: డా. సరోజా ప్రసాద్

అనుబంధం

శ్రీమాతతో ఉదార్ సంభాషణ...

ఓ రోజు నేను శ్రీమాత నడిగాను... "నేను చాలా ఏళ్ళుగా యోగసాధన చేస్తున్నాను, కాని శ్రీఅరవిందుల యోగం ఎలా చేయాలన్న సమగ్రమైన అవగాహన నాకు లేదని భావిస్తున్నాను. అన్ని పుస్తకాలు చదివి యోగసాధన చేయడానికి ప్రయత్నిస్తాను, కాని నేను ఎంతవరకు నా సాధనలో అభివృద్ధి సాధిస్తున్నానో తెల్సుకోలేను" అంటూ శ్రీమాత సహాయాన్ని కోరాను.

శ్రీమాత: "నీవు అంతా పొరపాటుగా చేస్తున్నావు," అన్నారు.

నేను: "ఏం చేయాలని " అడిగాను.

శ్రీమాత: 'నీ యోగం నేను చేస్తాను," అన్నారు.

నేను పులకించిపోయి "నేను ఏం చేయాలని," అని అడిగాను.

"నిన్ను నీవు నాకు సమర్పించుకో.... నీ యోగం నేను చేస్తాను," అని శ్రీమాత చెప్పారు.

సమర్పణ ఎలా చేయాలి? అడిగాను.

నీవు చిత్తశుద్ధిగా చేయాలనుకుంటున్నావా? ఆమె అడిగారు.

అవును మాతా! నిజం... అన్నాను.

శ్రీమాత: నీవు ఉదయం పొద్దున్న లేవగానే ముందుగా ఏ పనిచేస్తావు?

ఉదార్ పళ్ళు తోముకుంటాను.

శ్రీమాత: 'పళ్ళు ఎలా తోముకుంటావు.'

ఉదార్: ఆశ్చర్యంగా ఎలా? అందరిలాగే.

శ్రీమాత: అయితే అందరిలాగే నీవు అచేతనంలోనే పనిచేస్తున్నావు. దానికి భిన్నంగా ఆ పని చేసేటప్పుడు నన్ను తలుచుకో, నేనే చేస్తున్నానని భావించు. నీవు ముఖం కడుక్కునేటప్పుడు నీతో పాటు నేనూ కడుక్కుంటున్నానని భావించు, నీవు తినేటప్పుడు నేనూ ఆ ఆహారాన్ని తింటున్నానని భావించు. నీతో పాటు ఆ భోజనాన్ని నేను ఆనందంతో ఆస్వాదిస్తున్నానని భావించు.

ఇంకా ఆమె ఇలా చెప్పారు. "నీవు నిద్రించే సమయంలో నన్ను గురించి భావన చేయడం చాలా ముఖ్యం. నన్నే నిన్ను నిద్ర పుచ్చనీ. అపుడు నీవు నిద్రలో కూడా జాగ్రుతమయి ఉంటావు. అలా నిద్రపోయి మేల్కొనినపుడు, ఆ రోజును మరింతి చైతన్యవంతంగా ప్రారంభించగలవు". ఆ విధంగా, ఎప్పుడూ ఆమె సాక్షాత్కార చైతన్యంలోనే, ఆమెకి ఉన్మీలనమై, ఆమెకు ఆత్మసమర్పణ కావించుకుంటూ ఉండాలి.

మూలం: ఉదార్

శ్రీమాత సూచన

ఈ మార్గంలో సాగుతూన్నపుడు తీసుకోవడం కంటె, ఇవ్వడంలోనే అపరిమిత ఆనందముందని ముందు తెలుసుకోవాలి. క్రమంగా మనం తెల్సుకునే మరో విషయం... మనల్ని మనం మర్చిపోవడమే ప్రగాఢ శాంతికి మూలమని. ఆ తరువాత స్వీయ విస్మృతిలోనే, దైవాన్ని కనుగొనగలమని, అదే నిరంతరం వృద్ధిచెందే ఆనందానికి మూలమని తెల్సుకుంటాం. మనుషులు దీనిని తెల్సుకుని, — ఒప్పుకుని ఉంటే, యోగం చేయాలని అభిలషిస్తారని శ్రీఅరవిందులు నాతో ఓ రోజు అన్నారు.

శ్రీఅరవిందుల సూచన

'విధేయత' అన్నది అహంచేత తనను తాను తక్కువ చేసుకోడంగా భావించబడుతుంది. కాని నిజానికి దైవం పట్ల 'విధేయత' అస్తిత్వాన్ని మరింత ఉన్నతం చేస్తుంది.

అనువాదం: డి. సత్యవాణి

వ్యాకులత చెందకుండా ఉన్నప్పుడు మాత్రమే మనం యెప్పుడూ సరియైన సమయంలో, సన్మార్గాన, సక్రమంగా చేయవలసినది చేయగలుగుతాం.

శ్రీమాత



రవము - తిండి

త్యేకసంచిక

అఖిల

అఖిలభారత పత్రిక

డిశంబరు 2010

ఆహారము — తిండి

విషయసూచిక

ముందు మాట	3
తినే ముందు దైవనివేదనలోని ఆంతర్యం	4
ఆశానిరాశల తరుణోపాయం	6
ఆహారపు టలవాట్లు	8
దేహసూచనలను పాటించు	10
ఉపవాసం	13
మాంసాహారం — ఒక కథనం	17
టోకియో సుందరవనంలో శ్రీమాత అనుభవాలు	19
ధూమపానం, మద్యపానం — రెండు కథలు	21
పిల్లలకు తగిన ఆహారం	24
అవశ్యమైన విషయం ఒకటే	26
జగన్మాత మార్గదర్శక సూత్రాలు	28
యోగంపై శ్రీఅరవిందుల లేఖలు – కొన్ని భాగాలు	31

ముందు మాట

మనం తినే ఆహారమును నిర్ణయించి శాసించే రెండు విషయాలున్నాయి. అన్నిటికంటె ముందు శారీరక అవసరం. శరీరపోషణ కోసం శరీరంలో నిర్దిష్టంగా జరుగవలసిన మార్పులకి ఆవశ్యకమయే మూలకాల కోసం. అంటే — యెలాటి భోజనం, యెంత పరిమాణంలో తినాలి అనేది — సాధారణంగా ముఖ్యమైన ఈ శారీరక అవసరం విస్మరింపబడుతుంది. మరో రకమైన అవసరానికి — ద్వితీయశ్రేణి అవసరాల కోసం — అంటే — ప్రాణిక కామనలు, మనోభీష్టాలు — వీటి కోసం ముఖ్యమైన శారీరక అవసరం విస్మరింపబడుతుంది. ఇది మరుగున పడిపోతుంది. నిజం చెప్పాలంటే మన భోజనపదార్థాలు, నూటికి తొంభైశాతం, ఈ ద్వితీయశ్రేణి అవసరాల పరితృప్తి పరిచేవిగా ఉంటాయి. నిజానికి ప్రప్రథమంగా పరిగణనలోనికి తీసుకోవలసినది చివరికి నెట్టివేయబడుతుంది. ఇపుడు, శరీరం, ప్రాణిక, మానసిక అవసరాలకి బానిస. తన అవసరాలకు చాలినంత పరిమాణంలో, నాణ్యమైన ఆహారం ఎన్నుకునే స్వేచ్ఛ, శరీరానికి లేదు. మనసు, ప్రాణికము సన్నిహిత స్నేహితులు. ఇవి శరీరాన్ని విభజన చేసే విషయంలో కలిసిమెలిసి పనిచేస్తాయి. తమ ఇష్టాయిష్టాలను, అవసరాలను శరీరంపై బలవంతంగా రుద్దుతాయి. శరీరం — పాపం — నిస్సహాయంగా వాటిలో ఇరుక్కుపోయి, తన సహజప్రవృత్తిని కోల్పోతుంది.

(శ్రీమాతతో నళినీకాంత గుప్తాగారి ఇష్టాగోష్ఠి ఆధారంగా)

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

తినే ముందు దైవనివేదన ఆంతర్యం

భౌతికంగా, మనం జీవించడానికి ఆహారం, దురదృష్టవశాత్తు అనివార్యంగా అవుసరమవుతుంది. మనం ప్రతి రోజూ, నిరంతరంగా, భయంకరమైన అచేతనను, దానితోపాటుగా తామసికతను, మందకొడితనాన్ని, జడత్వంతో కూడిన బద్ధకాన్ని ఆహారంతో పాటుగా లోపలికి తీసుకుంటాం. మనం మరో విధంగా చేయలేము. నిరంతరంగా, ఏమాత్రం ఆటంకం లేకుండా, మనం పూర్తి ఎరుకతో సచైతన్యంగా ఏదైనా పదార్థం మన శరీరం లోనికి వెళ్ళగానే వెనువెంటనే దాని మీద దృష్టి నిలిపి దానిలోని ప్రకాశాన్ని మాత్రమే వెలికి తీసుకుని, మన చైతన్యాన్ని అంధకారంలో ముంచేసే దానినల్లా తోసివేయగలగాలి. ఆహారాన్ని తీసుకోవటానికి ముందు దైవానికి అర్పించటం అనే మతాచారాలకు మూలం, సహేతుకమైన వివిరణ ఇదే. భుజించేటప్పుడు ఆహారం తన అల్పమైన మానవ అహంకారానికి కాక తనలోని దివ్యచైతన్యానికి నైవేద్యంగా సమర్పిస్తున్నానని ఆకాంక్షిస్తారు. అన్ని యోగాలలో, అన్ని మతాలలో ఇది ప్రోత్సహించబడింది. ఆ విధమైన నిత్యకృత్యానికి అదే మూలం, ఆ విధంగా వెనుకనున్న చైతన్యంతో సంపర్కం పెట్టుకోవటానికి, సాధ్యమైనంత వరకు రోజూ ఎక్కువెక్కువగా, నిరంతరంగా, వ్యక్తి ఎరుక లేకుండా లోనికి గ్రహించే అచేతనను తగ్గించివేయటానికి అసలైన కారణం ఇదే.

*

తనను తాను రక్షించుకోవడం ఎలా: ఒక వడపోత

జీవించటానికి మన శరీరం బలవంతంగా బయటి పదార్థం లోనికి తీసుకునేటంతకాలం, అదే సమయంలో అది చెప్పుకోదగినంత జడత్వాన్ని, అచేతనాశక్తులను లేదా చేతనకు ఎంతో హాని కలిగించేదానిని లోనికి పరిగ్రహిస్తుంది. ఈ రసాయనిక చర్య శరీరంలో తప్పక జరిగితీరుతుంది. మనం ఆహారంతో గ్రహించే వివిధ రకాల చైతన్యాలను గురించి మాట్లాడుకుంటున్నాముకాని, ఆహారంతో జడత్వం కూడా గ్రహించబడుతుంది. అదీ ఎక్కువ మొత్తంలోనే. అందువల్లనే చాలా యోగాలలో తాము తీసుకునే ఆహారాన్ని భుజించే ముందు, ఆ ఆహారాన్ని దైవానికి నివేదించమని సలహా ఇవ్వబడింది. ఆ విధంగా తినే ముందు ఆహారం లోనికి దైవాన్ని ఆహ్వానించడం





అంతర్భాగమవుతుంది. ఒక వ్యక్తి ఆ విధంగా దైవానికి నివేదిస్తే, అపుడతడు దానిని దైవంతో సంపర్కమొందేలా చేస్తాడు. అపుడు తిన్నది దివ్యంగా ఉంటుంది. ఇది ఉపయోగకరం, మంచిది. కాని మీకు తెలుసు కదా! ఇపుడున్న ప్రపంచ పరిస్థితిలో మన మందరం పరస్పరం ఒకరిపై ఒకరు ఆధారపడి ఉన్నాం. బహు రకాలైన ప్రకంపనలతో కూడిన గాలిని పీలుస్తుంటాం. మీరు చెక్కుచెదరకుండా ఉండాలంటే నేను చెప్తున్న విధంగా ఫిల్టరులా పనిచేయాలి. అదేమంటే — అపరిశుభ్రమయిన గాలి లోనికి పీల్చకుండా ఆచ్ఛాదనలా, దైవానికి పరిపూర్ణ సమర్పణభావంతో, చుట్టూ దట్టమైన దివ్యవాతావరణాన్ని దివ్య ఆచ్ఛాదనగా యేర్పర్చుకోవాలి. తనకు తానుగా ఫిల్టరు కావాలి. అపుడు ఏ మాత్రం అప్రియమైనది లోనికి ప్రవేశించదు. ఎక్కడి నుంచి వచ్చిందో చడీచప్పుడు లేకుండా అక్కడికి వెళ్లిపోతుంది.

ఇవన్నీ కూడా ఏ విధంగా చేయాలో ఒక విధమైన అధ్యయనం వల్లను, శాస్త్రి పరిజ్ఞానం ద్వారాను ఎవరైనా తెలుసుకొనవచ్చును. ఏ అధ్యయనము, శాస్త్రిపరిజ్ఞానం లేకపోయినా సంపూర్ణమైన, సర్వతోముఖమైన సమర్పణ కనుక ఉంటే అవన్నీ చేయవచ్చును. ఆకాంక్ష, సమర్పణ సర్వతోముఖంగా ఉంటే అది దానంతటదే జరిగిపోతుంది. కాని నీవు అవి సంపూర్తిగా ఉండేటట్లుగా ఉంచుకోవాలి. అంతేకాక, ఇంతకు ముందే చెప్పిన విధంగా, నీవు చాలా స్పష్టమైన ఎరుకతో ఉండాలి. ఏ క్షణానైనా ఆ సమర్పణ సర్వతోముఖంగా లేకపోతే, నీవు ఏమాత్రం సంతోషంగా ఉండలేవు. నీవు కలవరానికి, ఎంతో దుఃఖానికి, నిరుత్సాహానికి, కొంత అశాంతికి లోనవుతావు; "ఈ రోజు విషయాలు ఆహ్లాదకరంగా లేవు, కాని అవన్ని నిన్నటివరకు బాగానే ఉన్నాయి, నిన్న అవి చాలా అద్భుతంగా ఉన్నాయి, కాని ఈ రోజు అవి సంతోషం కలగించటం లేదు". అలా ఎందు కనిపిస్తోంది? ఎందువల్లనంటే నీవు నిన్న పరిపూర్ణంగా సమర్పణ చేతనాస్థితిలో ఉన్నావు, అది కొంత అటు ఇటు అయిన పరిపూర్ణత, కాని ఈ రోజు నీవు ఏ మాత్రం ఆ విధంగా లేవు. కాబట్టి నిన్నటి విషయం ఎంత అందంగా ఉన్నదో, అది ఈ రోజు ఏమాత్రం అందంగా లేదు. నీలో అప్పుడున్న సంతోషం, అంతా సవ్యంగా ఉంటుందని, ఒక గొప్ప పని పరిపూర్ణమవుతుందనే, ఆ ప్రగాఢమైన నమ్మకం, హామీ, ఆ ధృఢవిశ్వాసం, ఇవన్నీ కూడా మరుగుబడినాయి. వాటి స్థానంలో ఒక విధమైన అపనమ్మకం చోటు చేసుకుంది. ఒక అసంతృప్తితో అనే మాట ఇది, "పరిస్థితులు ఏమీ బాగా లేవు, ప్రపంచం

అసహ్యంగా ఉంది, మనుషులు ఆనందం కలిగించటం లేదు". అప్పుడప్పుడు ఈ విధంగా కూడా ఉంటుంది, "ఆహారం ఏమీ బాగా లేదు, నిన్న చాలా బ్రహ్మాండంగా ఉంది". అది ఒకే రకంగా ఉన్నా కాని, ఇవాళ బాగా లేదు! అదీ ప్రామాణికత! బెరామీటరు! వెంటనే నీకు నీవు చెప్పుకోవలసిన దేమంటే ఎక్కడో కాపట్యం చొచ్చుకు వచ్చిందని.

ఏ క్షణానైనా నీవు అశాంతికి లోనయితే, అప్పుడు నీవు ఈ విధంగా వ్రాసిపెట్టుకోవాలి: "నేను చిత్తశుద్ధితో లేను". ఈ రెండు వాక్యాలు ఒకదాని తరువాత ఒకటి కలసి ఉంటాయి.

"నేను అశాంతిగా ఉన్నాను".

"నేను చిత్తశుద్ధితో లేను"

ఇప్పుడు తెలుసుకోవలసిన విషయం, ఎక్కడ పొరపాటు జరిగిందనేది? అప్పుడా వ్యక్తి కారణాల కోసం వెతకడం మొదలుపెడతాడు. దానిని తెలుసుకోవడం చాలా తేలిక.

మూలం: శ్రీమాత

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ!

ఆశ, దురాశల నివారణోపాయము

సాధారణ మానవజీవిత మొక ఆశదురాశల వలయము. అవి మనసులో ఉన్నంతకాలం అతని పురోగమనం స్థిరంగా కొనసాగదు కాబట్టి ఆ వలయం నుంచి బయటపడే మార్గం చూసుకోవాలి. ఉదాహరణకు చెప్పాలంటే మామూలు జీవితంలో ప్రతివారూ నిరంతరం ఏమి తినాలో, ఎప్పుడు తినాలో, తిన్నది తమకు సరిపోతోందో లేదో అనే ఆలోచనల్లో మునిగి తేలుతూంటారు. ఆహారవిషయంలో పేరాశ లేకుండా ఉండాలంటే సమత్వదృష్టిని వృద్ధిచేసుకుని ఆహారం పట్ల నిరపేక్షభావం వహించాలి. ఆహారం దొరికితే తిను, లేకపోతే లేదు, దాని గురించి ఏ మాత్రం విచారించకూడదు, ఆలోచించకూడదు. అట్లాగని వ్యతిరేకత కూడా ఉండకూడదు. దాని గురించే ఆలోచిస్తూ సన్యాసి మాదిరిగా నిరాసక్తత పెంచుకునే మార్గాలను వెతుక్కోవడం కూడా భోజనం గురించి ఆలోచిస్తూ కలలుగనే ఆశపోతు కాలక్షేపమే అవుతుంది.

భోజనం విషయంలో నిరాపేక్ష వైఖరి అవలంబించి నీ చైతన్యంలో నుంచి తిండి విషయాన్ని తొలిగించేస్తే సరిపోతుంది. దానికే మాత్రం ప్రాముఖ్యత ఆపాదించకు.

ఇది చాలా తేలిక. నీ చైత్యపురుషునితో, అంటే నీలో ఉండే నీ నిజాత్మతో స్పర్శానుబంధం ఒక్కసారి ఏర్పరుచుకుంటే చాలు. వెంటనే నీకు తెలుస్తుంది, ఈ విషయాలన్నీ ఎంత అప్రధానమో, భగవంతుని గురించిన ఆలోచనే అన్నిటినీ మించిన ప్రధానవిషయమని, సర్వదా చైత్యసంస్పర్శలో నుండటమే దురాశ నుంచి బయటపడినట్లు. ఇక ఏ ఆరాటమూ, ఏ అత్యాశా, ఏ చింతా ఉండదు.

నిష్కళంకమైన ఆత్మార్పణచర్యయే వాస్తవంగా పొందే ప్రతిఫలం. దానివల్ల కలిగే ఆనందం, స్థైర్యము, భద్రత ఇక దేనితోనూ రావు. కానీ ఆత్మార్పణమనేది చైత్యపురుష భాగం నుంచి వచ్చేవరకూ కలతలు ఏర్పడుతూంటాయి. సంతోషంగా జరుగుతున్న రోజుల్లో మధ్య మధ్య చీకట్లు అలుముతూ ఉంటాయి. చైత్యపురుష భాగం మాత్రమే నిరంతరాయంగా పురోగమిస్తూంటుంది. అది అవిచ్ఛిన్నంగా సాగే ఆరోహణ చలనము. మిగిలినవన్నీ ముక్కలు ముక్కలుగా సాగేవే. అంతే కాకుండా ఆ చైత్యమే నీవు అనే భావం వచ్చేవరకూ నీ వొక వ్యక్తివి కావు, అదే నీ అసలైన వ్యక్తిత్వం. నీ ఆత్మస్వరూపం తెలిసేవరకూ నీ వొక వ్యక్తివి కావు, ఒక బహిరంగ ప్రదేశానివి మాత్రమే. పరస్పర సంఘర్షితశక్తులు అనేకం నీలో పనిచేస్తుంటాయి.

ఆత్మస్వరూపం తెలుసుకోవంట ఎలా అని అడుగుతున్నావు కదా? అలాగే అడగాలి, ఆకాంక్షించాలి. నీ కింకేమీ అక్కర్లేదన్నట్లు దాన్నే కోరుకో. అక్కణ్ణించే పరిపూర్ణత కావాలనే తపన వస్తుంది. అదెక్కణ్ణించి వస్తోందో నీకు తెలియదు కాబట్టి నీ ఎరుకతో నీవు దానితో సహకరించటం లేదు, ఆ వెలుగులో నీవు కలవటం లేదు. నేను ఇలా చైతన్యం గురించి మాట్లాడుతున్నప్పుడు నీ భావోద్వేగ విభాగం గురించి కాదు, భావోద్వేగాలనేవి ఉన్నత ప్రాణికానికి సంబంధించినవే కానీ శుద్ధ చైత్యకానివి కాదు. చైత్యకమనేది నీలో నిలకడగా రగులుతున్న జ్వాల. అది భగవంతుని వైపు జ్వలిస్తూ అన్ని ప్రతిఘటనలనూ ఎదుర్కోగల ఒక తేజస్సుతో ఉంటుంది. నీవు గనక దానితో తాదాత్మ్యతను పొందినప్పుడు దివ్యమైన సత్యానుభూతి కలుగుతుంది. అప్పుడిక నీకు ప్రపంచమతా అజ్ఞానంతో తలక్రిందులుగా నడుస్తున్న భావన ఉండదు.

నీ వ్యక్తిగత ఆత్మ అని నువ్వనుకునేదానిని నీ చైత్యక వ్యక్తిత్వంతో ఐక్యం

చేయడం నీవు నేర్చుకొని తీరాలి. నీ కున్న వ్యక్తిత్వం అనేక మార్పులు చేర్పులతో అవిరళ పరంపరగా ఉండే కలగూరగంప వంటిది; ఒక ప్రవాహంలో మధ్యన ఉండే సారూప్యచలనం వంటిది. ఇంకా చెప్పాలంటే ఏ విధంగా ఒక నదీప్రవాహం ఒకే మాదిరి కొనసాగకపోయినా తన కంటూ ఒక నిర్దష్ట లక్షణం. ఒక అభినివేశం ఉంటాయో ఇదీ అంతే. ప్రస్తుతం నువ్వనుకునే నీ ఆత్మ నీ నిజమైన వ్యక్తిత్వపు ఛాయ మాత్రమే. దాన్ని నీవు గుర్తించే సమయం ఎప్పుడంటే నీ వ్యక్తిత్వం వివిధ సమయాల్లో వివిధ స్థితుల్లో అంటే మానసిక, ప్రాణిక, దైహిక స్థితుల్లో చైత్యసంస్పర్శ పొందినప్పుడు అదే తానుగా, తన నిజరూపంగా అనుకున్నప్పుడన్న మాట. అప్పుడిక నీవు ఏకాంతంగా ఉంటావు, నిన్నేదీ కలతపెట్టలేదు. స్థిరంగా నిలిచే పురోగతిని పొంది తిండి పోతుతనం వంటి చిల్లర విషయాలకు అతీతుడవవుతావు.

మూలం: శ్రీమాత

అనువాదం: అమరవాది ప్రభావతి, అమరవాది వేంకటరామశాస్త్రి

ఆహారపుటలవాట్లు

మనసు తనలో నున్న భావాలనే అంటిపెట్టుకొని ఉన్నదనేగా! ఎన్నిసార్లు ఈ సంగతి ప్రస్తావించాను. 'ప్రాణికం' కోరికలను తీర్చాలనే అంటుంది. 'మనసు' దానికి వంత పాడుతుంది. తాను చేస్తున్నదాన్ని సమర్థించుకుంటుంది కూడా! సమర్థించుకోటానికి తర్కిస్తుంది. వివరిస్తుంది. ఇవన్నీ దానికి కావాలి. "కోరికలను వదిలించుకునే మార్గం వాటిని తీర్చుకోవటమే" అని నాకు కొంతమంది చెప్పారు. దీన్నొక సిద్ధాంతంగా వాళ్ళు తయారుచేశారు కూడా! ఇంకేం, కోరికలను తీరుస్తూనే వుండండి, క్రొత్తవి పుడుతూనే వుంటాయి. ఈ విధంగా నూరు జన్మలెత్తాల్సి వుంటుంది.

ఇక అలవాట్లను గురించా! దీని విషయమై ఎవరో శ్రీఅరవిందులను అడిగారట: "భౌతికం దాని అలవాట్లకే పరిమితం అవుతుందా? అసలు ఏ అలవాట్లను భౌతికం నుండి త్యజించాలి?" అని.

ముందుగా ఆహారపు అలవాట్లను తీసుకోండి. మనం చిన్నప్పటి నుండి తింటున్న ఆహారపు అలవాట్లను మార్చుకోగలమా? అలాంటి ఆహారం దొరకనపుడు 'తింటానికి ఏమీ లేదని' నిరాశ చెందకుండా సంయమనంతో ఉండగలమా? ఆశ్రమంలో అడుగు

పెట్టి, ఇక్కడి భోజనం చూచి, "నేను ఎప్పుడూ ఇలాంటిది చూడ లేదు,ఇది నా వల్ల కాదు," అనకుండా ఉండేవారు ఎంతమంది? ఆశ్రమపు ఆహారం తినకుండా ఎంతమంది స్వంతవంట చేసుకోవటం లేదూ (శ్రీమాత చేతుల్లో ఉన్న పుస్తకాన్ని బల్ల మీద విసరికొట్టారు). "నా ఆరోగ్యం పాడవుతుంది. నేను దీన్ని జీర్ణం చేసుకోలేను", అని సమర్ధించుకుంటారు కూడా! ఇదంతా వాళ్ళ ఊహ, భ్రమ. ఇందులో ఈషన్మాత్రం కూడా నిజం లేదు. ఇట్లా సత్యదూరమైన భావాలతోనే వాళ్ళు మనుగడ సాగిస్తూ వుంటారు. సాధారణ ప్రజల కంటె వాళ్లు సాధనలో ఏ విధంగా ముందుకు వెళ్ళినట్లు?

ఇందుకు భిన్నంగా ఉండేవాళ్ళను వ్రేళ్ళ మీద లెక్కించవచ్చు. దీన్ని ఎలా సాధించాలి. భోజనంలో మార్పు వస్తే జీవితాన్ని (సాధనను) కూడా త్యాగం చేయటానికి సిద్ధపడతారే!

నా మట్టుకు నేను దీనికొక చిట్కా చెపుతాను. మీరొక పడవలో ప్రయాణం చేస్తూ ప్రపంచం చుట్టూ అనేకసార్లు తిరగండి. ఏ దేశంలో దొరికే ఆహారాన్ని అక్కడ తినాల్సి వస్తుంది. ఇట్లా అలవాటుపడితే మీ మూర్ఖత్వం మీకే అర్థమవుతుంది. ఇది ఘోరమైన మూర్ఖత్వం కూడా. ఇక్కడ మనం కట్టుబడిపోయాము, ఉదరానికీ, దాని అలవాట్లకూ. (శ్రీమాత చేతితో సైగ చేస్తారు.)

బులెటిన్‌లో ఎక్కడో వ్రాసినట్లు గుర్తు. కొందరు సదుద్దేశంతోనే వస్తారు. వచ్చినపుడు అంతా సవ్యంగానే వుంటుంది. భోజనము బాగానే వుంటుంది; సదభిప్రాయం ఉన్నంతసేపూ. ఈ అభిప్రాయం కొద్దిగా తగ్గుముఖం పట్టిందంటే పాతవాసనలు మళ్ళీ పుట్టుకువస్తాయి. భోజనం బాగానే వున్నట్లు అనిపించిందే; కాని ప్రస్తుతం నాకు రుచించటం లేదు. ఇది బాగా లేదు అని, అది చెడిపోయింది అనీ వంకలు పెట్టటం మొదలౌతుంది. (శ్రీమాత వినీవినకుండా చెప్పారు) నా పాత అలవాటు ప్రకారం నేను ఉంటే! ఏమో నేను దీన్ని జీర్ణం చేసుకోలేకపోతున్నాను. (అందరూ నవ్వుతారు)

మూలం: శ్రీమాత

అనువాదం; కె. ఆర్ . యల్. నరశింహారావు

దేహసూచనలను పాటించు

వాస్తవానికి అన్నిటికంటె ఉత్తమమైన విషయం, ఆహారాన్ని గురించి ఆలోచించకుండా ఉండడం. కాని తినడాన్ని గురించి ఆలోచించే అవసరం లేకుండా అప్రయత్నంగా అది సాగిపోవడానికి తగినంతగా జీవితాన్ని నియమబద్ధం చేసుకోగలిగితే చాల బాగుంటుంది. నిర్ణీత సమయాల్లో భుజించాలి, మితంగా భుజించాలి. ఆహారాన్ని తీసుకొనే సమయంలో కూడా దానిని గురించి ఆలోచించవలసిన అగత్యం లేదు. వేగిరపాటు లేకుండా, ప్రశాంతంగా, సావధానుడవై భుజిస్తే చాలు. అదీ గాక భుజించని సమయంలో దానిని గురించి అసలు ఆలోచించగూడదు. అధికంగా తినకూడదు, అలా తింటే జీర్ణమౌతుందో లేదో అని ఆలోచించవలసి వస్తుంది. అప్పుడు తిన్నవానికి సుఖముండదు. పైగా చాలా సమయం కూడా వృధా అవుతుంది. సరిగ్గా ఎంత సరిపోతుందో అంతే తిను. కోరికకు, ఆకర్షణకు, ప్రాణికచలనాలన్నింటికీ స్వస్తి వాచకం పలుకు. తినవలసిన అవసరం దేహానికున్నది గనుక నీవు తింటున్నావు అంతే. సరిపోయినంత ఆహారం తీసుకోగానే, నిర్ద్వంద్వంగా, కచ్చితంగా దేహం నీకు ఇక చాలు అని చెప్తుంది. ప్రాణికమైన కోరికలు, లేక మానసిక ఆలోచనలకు లోబడకపోతే ఈ విషయాన్ని స్పష్టంగా గ్రహిస్తావు. దేహం, 'ఆ! ఇహ చాలు. నా కింకేమీ అవుసరం లేదు' అని చెప్తుంది. అందుచేత తినడం ఆపేస్తావు. ప్రాణికంలో ఏవో ఆలోచనలు, లేదా కోరికలు వుంటే, అంటే — ఉదాహరణకు ఏదో ఒకదాని మీద ప్రత్యేకమైన అభిరుచి వుంటే, అభిరుచి వుంది గనుక ముప్పూటలా దాన్నే అవసరాన్ని మించి సుష్టుగా భోంచేస్తావు. కొంతవరు నీ కిది బాగానే వుండవచ్చు. కాని తరువాత నీకిది గట్టి పొట్ట కాకపోతే అజీర్తిచేస్తుంది. తరువాత నీ అజీర్తికి కారణమైన దాని మీద నీకు ఏవగింపు కలుగుతుంది. అంతే కాదు, ఇంకా అధికంగా యిబ్బందులు కూడా కలుగుతాయి. అటువంటివాటి పాలబడకుండా, పురోగమించవచ్చు. అన్నింటికంటే, ఉత్తమం, దానిని గురించి అసలు ఆలోచించకపోవడం.

తమకు, ఇతరులకు, ఆహారాన్ని తయారుచేసేవాళ్ళు కొందరుంటారు. వాళ్లు దానిని గురించి ఆలోచించవలసివస్తుంది,కాదనను, కాని వాళ్ళు కూడా చాలా తక్కువే, ఎంతవరకు అవుసరమో అంతవరకే ఆలోచించాలి. అంతకంటే ఆసక్తికరమైనవాటిని గురించి ఆలోచిస్తూ కూడా ఆహారాన్ని తయారుచేయవచ్చు.

ఏదైనప్పటికీ దాన్ని గురించి ఎంత తక్కువ ఆలోచిస్తే అంత మంచిది. మానసికంగా గాని లేదా ప్రాణికంగా గాని దాన్ని గురించి పట్టించుకొనకుండా వున్నప్పుడు దేహం చాలా చక్కగా సూచిస్తుంది. దానికి ఆకలైనప్పుడు అది తెలుపుతుంది, లోపలి కేదైనా తీసుకోవలసిన అవసరం ఏర్పడినప్పుడు, అది నీకు చెప్తుంది. దానికి కావలసినంత తీసుకొనడం పూర్తి కాగానే, ఇంకెంత మాత్రం, అధికంగా దాని కవు సరం లేనపుడు, అది నీకు తెలుపుతుంది. దానికి ఆహారంతో అవసరం లేనపుడు, దానిని గురించి అది ఆలోచించదు. మరి దేన్ని గురించో ఆలోచిస్తుంది. తలకాయే అన్ని సమస్యలను సృష్టిస్తుంది. వాస్తవానికి సమస్యను సృష్టించేది తలకాయే. ఎందుకనంటే మనకు దాన్నెలా ఉపయోగించాలో తెలియదుగా. దాన్నెలా ఉపయోగించాలో తెలిస్తే అది కూడా సామరస్యతను సృజించగలుగుతుంది. కాని విచిత్రంగా ప్రజలు ఎప్పుడూ చెడును ఊహించడానికే ఉపయోగిస్తారు. మంగళకరమైనదాన్ని ఊహించేవాళ్ళు చాలా చాలా అరుదు. సమతూకంతో, సామరస్యంగా వుండేందుకు సాయపడే, సుఖప్రదమైన విషయాలను గురించి ఆలోచించడానికి బదులు, సంభవం కాగల సమస్త ఉపద్రవాలను గురించి ఆలోచిస్తుంటారు. అందుచేత సహజంగానే వాళ్ళు తమ అస్తిత్వపు సమతూకాన్ని తామే చెడగొట్టుకుంటారు. వాళ్ళు భయపడే దురదృష్టవంతులైతే, ఈ వ్యవహారంలోనికి, వాళ్ళు వేటికి భయపడుతుంటారో వాటినే ఆకర్షిస్తారు.

*

ప్రశ్న: కొన్ని విటమిన్లు ముఖ్యంగా వ్యాయామం చేసేవారికి అవసరం అని చెప్పి కొన్ని రకాలైన ఆహారపదార్థాలు అవసరం అని అంటారు. ఇదంతా...

అలా అని ఆధునిక విజ్ఞానశాస్త్రం అంటున్నది. అవును... సరే, మరో యాభై సంవత్సరాలు ఆగగలిగితే, అప్పుడు వాళ్ళు మరో విషయాన్ని కనుగొంటారు. అపుడది మారిపోతుంది, విటమిన్లను మరచిపోతాం.

ప్రశ్న: అమ్మా! మన జీవితానికి యదార్థంగా, ఇవి అనివార్యం అంటూ ఏవైనా ఉన్నాయా?

అందరికీ ఒకే విధమైనవి ఉంటాయని నేననుకోను. దేహం మీద, అలవాట్ల మీద ఆధారపడి ఉంటుంది. నిజం చెప్పాలంటే, దాన్ని సూక్ష్మంగా విశ్లేషిస్తే, అవి చాలా వున్నాయని నేననుకోను. ప్రపంచయాత్ర చేసావనుకో, ప్రతి దేశంలోని ప్రజలకు

విభిన్న మైన నిద్ర అలవాట్లు, ఆహారపుటలవాట్లు, వస్త్రధారణ, స్వీయ అలంకరణకు సంబంధించిన అలవాట్లు వున్నాయని తెలుసుకొంటావు. వాళ్ళు ఉపయోగించేవి అనివార్యమని వాళ్ళు చెప్పడం సహజం. నీవు గనుక దేశాలు మారి చూస్తే, అచటి ప్రజలకు, ఇదివరకటి దేశంలో నీవు చూసి వున్నవి, ఎంత మాత్రం పనికిరావని నీవు గ్రహిస్తావు. ఎందుకనంటే వాళ్ళ కుపయోగపడే మరోవిధమైన వాటిని, ఇవి తప్పవు అనుకొన్నవాటిని, వాళ్ళు ఉపయోగిస్తారు. మరోసారి నీవు మరో దేశానికి వెళ్తే, అక్కడ కూడా మళ్ళీ వేరేవే కనిపిస్తాయి. కాబట్టి ఎవరైనా కాస్త ప్రపంచయాత్ర చేసి వుంటే అతడు "అసలు నిజంగా ఉపయోగపడేది ఏది?" అనే సందేహానికి లోనవుతాడు. ఒక టూత్ బ్రష్ అనివార్యం అని నా కనిపిస్తుంది. నా పొరుగువాడు నా వంక చూసి "ఏమిటీ, టూత్ బ్రష్షా? దానికి బదులు నా చేతి వ్రేళ్ళ నుపయోగిస్తాను, అదే చక్కగా సరిపోతుంది" అంటాడు. ప్రతిదాని విషయంలోనూ అంతే, కాదా?

ఆహారం — అవసరమైన బలం పొందడానికి కొన్ని, కొంతవరకు అనివార్యమనీ, అవి ఫలానా ఫలానా అనీ నీకు అనిపిస్తుంది. ఎందుచేతనంటే, నీవు వాటికి అలవాటు పడివున్నావు, కాని మరో దేశంలో, అందుకు భిన్నంగా వుంటుంది.

అందుచేత దానికో నియమమంటూ లేదు. పూర్తిగా నియమబద్ధంగా కచ్చితంగా, ఉండాలనుకొంటే, అది అతనికే సంబంధించిన వ్యక్తిగత విషయం అవుతుంది. అది ప్రతి ఒక్కరి దేహం మీదా ఆధారపడి వుంటుంది. ఎందుచేతనంటే, నీ చేతనలో నీవు విశాలమైనకొలదీ నీకు అనివార్యం అనిపించినవి, అలా ఎంత మాత్రం కాదు, అవి లేకపోయినా బాగానే ఉండవచ్చుననీ, సక్రమంగానే అంతా జరిగిపోతుందనీ, అది వరకు అనివార్యంగా కన్పించినవి తీసుకొనకపోయినా ఎంతో బలం వుంటున్నదనీ గ్రహిస్తావు. నా వుద్దేశ్యంలో పదార్థ సంబంధ వస్తువులలో అనివార్యం అని చెప్పగలిగేవి అసలేమైనా మొత్తం ప్రపంచంలో ఎక్కడైనా వున్నాయా? అవును, స్వల్పంగానైనా ఆహారం తీసుకోవలసిన అవసరం వుంది అని చెప్పవచ్చు. నిజమే, కాని అందరికీ ఒకే ఆహారమనేది సర్వసామాన్య నియమంగా చెప్పలేం. అది అచటి వాతావరణాన్ని బట్టి వుంటుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: కె. వి. రావు

ఉపవాసం

ప్రశ్న: ఉపవాసం అతి త్వరగా విషయగ్రహణ చేసే శక్తి నెలా కలిగిస్తుంది?

శ్రీమాత: ఎలా కలిగిస్తుందంటే, ప్రాణికజీవి సాధారణంగా భౌతికశరీరం మీద యెక్కువ శ్రద్ధ పెడుతుంది. శరీరం చక్కగా పోషించబడినప్పుడు అది ఆహారం నుండి బలం పొందుతుంది. ఆహారం నుండే దానికి బలం లభిస్తుంది. అదొక మార్గం. చాలా వరకు అదొక్కటే మార్గం. నిజానికి అదొక్కటే కాదు. కాని ప్రస్తుత జీవనపరిస్థితుల్లో అదే అత్యంత ప్రధానమైనదని భావించబడుతున్నది. కాని శరీరం శక్తివంతం కావడానికి అది కేవలం తామసికమైన మార్గం మాత్రమే.

చూడు! దాని గురించి సరిగ్గా ఆలోచించి చూచినట్టయితే అది మొక్కల లోను, జంతువుల లోను వుండే ప్రాణికశక్తి. తార్కికంగా చెప్పాలంటే ప్రాణుల వర్గీకరణస్థాయిని బట్టి మొక్కలు, జంతువుల కంటె కాస్తయినా వున్నతజీవి అయిన మనిషిలో తప్పనిసరిగా వుండవలసిన ప్రాణికశక్తి కంటె తక్కువ వాసి కలిగినదిగా గమనిస్తావు. అదే సమయంలో దిగువనుంచి తీసుకున్నట్టయిన విచక్షణారాహిత్యంలో కూడా అదే స్థాయిలో తెలివితక్కువగా వుండడం చూస్తావు. విచక్షణా జ్ఞానం లేకపోతే తప్ప జీర్ణం కాకుండానే అతిగా తినడం అసాధ్యం. అది నిన్ను మోటుగాను, భారంగాను తయారుచేస్తుంది. అతిగా తిన్నావనుకో. నీ చైతన్యంలో యెక్కువ భాగం తిన్నదానిని జీర్ణం చేసుకోవండంలోను, యిముడ్చుకోవడం లోను నిమగ్నమయి పోతుంది. నువ్వు ఆహారం తీసుకోకపోయినట్టయితే యీ పనికిమాలిన పాట్లన్నీ తప్పిపోతాయి. పైగా నీ ఆంతర్యంలో పరిణామానికి అవకాశం దొరుకుతుంది. అది శక్తులన్నిటినీ స్వేచ్ఛగా విడుదల చేస్తుంది. అప్పుడు ప్రాణిలో వొక సహజప్రవృత్తి ఖర్చయిన శక్తులు తేరుకొనేట్లు చేస్తుంది. దిగువస్థాయి నించే ఆహారం నించి దృష్టి మళ్ళించకపోయినట్టయితే, సహజంగానే స్వేచ్ఛ పొందిన ఆ శక్తు లన్నింటినీ తీసుకుపోయి సార్వత్రిక ప్రాణికశక్తులతో కలపడానికి ప్రయత్నం చెయ్యి. దానిని వంటపట్టించుకోవడం యెలాగో తెలిసిన వ్యక్తి నేరుగా ఆ పని చేస్తాడు. అప్పుడు దానికి పరిమితులుండవు. జీర్ణం చేసుకోగలిగినంత పరిమితమైన ఆహారాన్ని మాత్రమే తీసుకుని, అంతకంటె యెక్కువ తీసుకోలేపోవడానికి అది నీ కడుపు లాంటిది కాదు. నువ్వు తీసుకున్న ఆహారమయినా చాలా స్వల్పంగా, చాలా తక్కువ పరిమాణంలో

ప్రాణికశక్తిని విడుదల చేస్తుంది. తినడం, జీర్ణంచేసుకోడం మొదలైన పనులన్నీ అయిన తరువాత మిగిలేదేమిటి? ఎక్కువేం వుండదని నీకూ తెలుసు. కాని నువ్వు తెలుసు కున్నట్టయితే యిది కూడా నీ సహజ ప్రవృత్తే. వ్యక్తి సహజంగానే తన ఆత్మ వైపు, విశ్వంలో స్వేచ్ఛగా కదలాడే సార్వత్రికశక్తుల వైపు లాగబడతాడు. అవి పరి మాణంలో పరిమితి లేనివి. ఎంత యెక్కువ వీలైతే అంతగా నువ్వు నీ వైపు వాటిని లాక్కునే సామర్థ్యం కలిగి వుంటావు. వాటిని నీలో లీనం చేసుకోగలవు. ఆహారం నించి వచ్చే నిమ్నస్థాయి మద్దతు అప్పుడు సహజంగానే వుండదు. ఈ శక్తు లన్నింటినీ కూడగట్టడానికి అవస రమయిన ప్రయత్నం చేయడానికి బయట నించే నువ్వు పని చెయ్యాలి. నీ సమర్థతని బట్టి, వొక్కొక్కప్పుడు అంతకు మించి కూడా ఎంత యెక్కువ వీలైతే అంత యెక్కువగా వాటిని జీర్ణించుకోవాలి. ఆ పరిస్థితి నిన్ను వొక రకంగా భావోద్రేకానికి గురిచేస్తుంది. నీ శరీరం బాగా బలిష్టమయి నదై, కొంతకాలం ఆహారం లేకపోయినా తట్టుకొని వుండగలిగితే అప్పుడీ శక్తులన్నటినీ అన్ని రకాలుగానూ ఉపయోగించుకోగలుగుతావు. వాటి సమతుల్యత కాపాడుకుం టావు. ఉదాహరణకి మీ ఆధ్యాత్మిక ప్రగతికి, యెక్కువ చైతన్యవంతం కావడానికి, స్వభావపరిణామానికి ఉపయోగించబడుతుంది. కాని ఆహారం తీసుకోకపోవడం వల్ల నీ శరీరం నీరసపడి, శరీరంలో తగినంత శక్తి నిల్వ లేకపోతే, ఈ శక్తుల గాఢత, నీ శరీరం జీర్ణించుకోగల సమర్థత మధ్య సమతుల్యత లోపిస్తుంది. దాని వల్ల లేని పోని సమస్య లొస్తాయి. నీ సమతుల్యత యెప్పుడైతే పోగొట్టుకుంటావో అప్పుడు ఆ శక్తుల మధ్య వుండే సమతుల్యత కూడా దెబ్బతింటుంది. దాని ఫలితంగా నీ కేదైనా జరగవచ్చు. సాధారణంగా ఆ పరిస్థితిలో నీకు నీ మీద అదుపు తప్పిపోయి వత్తిడి పెరిగిపోతుంది. అయితే యీ వత్తిడి ఫలితంగా నువ్వు అప్పటి కంటె వున్నతస్థాయి అందుకోవచ్చు. కాని సాధారణంగా యిది కేవలం అంతరంగ కల్లోలం తప్ప మరేమీ కాదు. అది నీ శీఘ్ర గ్రహణశక్తికి మరింత పదును పెడుతుంది. ఉదాహరణకి, ఉపవాసం వున్నవాళ్ళు యెప్పుడూ కూడ నిమ్నస్థాయి నించి శక్తి తీసుకోరు. సువాసనగల పుష్పసన్నిధిలో నువ్వు శ్వాస తీసుకుంటే అది నీ ప్రాణశక్తిని పెంచుతుంది. ఆ పరిమళం నీలో చైతన్యాన్ని వృద్ధిచేస్తుంది. ఆ విధంగా అది నీకు అపారమైన శక్తి నిస్తుంది. కాని ఇంకొక విధంగా అయితే నువ్వు దానిని గుర్తిం చలేవు. ముఖ్యంగా నీలో వున్న కొన్ని నైపుణ్యాలు బలపడతాయి. కాబట్టి వ్యక్తి

వాటిని తన ఆధ్యాత్మిక ఫలితానికి వాడుకోవాలి. తిండి గురించి అతిగా ఆలోచించే వాళ్ళు, అతిగా తినేవాళ్ళు, దానిలోనే చాలా లోతుగా కూరుకుపోతారు. వాళ్ళకి యెంతసేపూ బాగా తినడం తప్ప ఆధ్యాత్మిక జీవితంతో పని వుండదు. తిన్నదంతా అరిగించుకోవాలి కదా. అందుచేత వాళ్ళ శ్రద్ధంతా తిన్నదానిని జీర్ణం చేసుకోవడం యెలా? అన్న దాని మీదే. ఇలాంటివాళ్ళు మందబుద్ధులు. వీళ్ళు వున్న స్థాయి నించి పతనమై పదార్థం వైపు దిగలాగబడతారు. అందుచేత వాళ్ళు తిండి గురించి ఆలోచించడం తగ్గించి తిండి కూడా తగ్గించాలి. ఎందుకంటే వొక విషయం ఉంది. వాళ్ళు ఉపవాసం చేస్తే, అలా చేసినంత సేపూ ఆకలి గురించి, తిండి గురించి ఆలోచిస్తూ వుంటారు. అది మితిమీరి తినడంకంటె కూడా పదిరెట్లు చెడ్డది. కాని నిజమైన అంటే చిత్తశుద్ధితో చేసే ఉపవాసం యేవో యితర విషయాల గురించి ఆలోచిస్తుంది. అలా యితర ఆలోచనలో నిమగ్నమయినప్పుడు తిండి మీద ఆసక్తి వుండదు. అప్పుడది కొంచెం కొంచెంగా తన ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంచుకుని క్రమంగా భౌతికమైన కోర్కెల బానిసత్వం నుండి తనను తాను విముక్తం చేసుకొని స్వేచ్ఛ సాధిస్తుంది. ప్రతి విషయంలాగే నమ్మినవారికి వుపవాసం అన్నిటి కంటె యెంతో మేలు చేస్తుంది. నువ్వు నమ్మినట్టయితే అది నిన్ను ఆధ్యాత్మిక ప్రగతి పథంలో నడిపిస్తుంది. పరిశుద్ధంగా వుంచి మేలు చేస్తుంది. నమ్మ లేదనుకో, సన్నబడడం తప్ప పెద్దగా ప్రయోజనం యేమీ వుండదు.

'మాయేటర్ లింక్' అని వొకటుంది. మాయేటరక లింక్ పుస్తకాలు మీకు తెలిసే వుండవచ్చు. 'ది బ్లూ బర్డ్' మొదలయినవి. మీరు చదివి తీరాలి. ఒక లావు పాటి బలిష్టమయిన వాడొకడుంటాడు. వాడికి అందంగా వుండాలని ఆశ. లావెక్కడం వాడికి చాలా ఆందోళన కలిగిస్తుంది. అందుచేత వాడు వారానికి వొక రోజు ఉపవాసం చెయ్యాలనుకుంటాడు. వారంలో వొక రోజు వాడేమీ తినడు. తెలివైనవాడవడం చేత తిండి గురించేమీ ఆలోచించడు. బాధపడడు. ఉపవాసం వున్న రోజున వాడు యేదో వ్రాసుకొనేవాడు. కష్టపడి పని చేసేవాడు. అందుచేత వాడు చక్కగా అందంగా తయారయ్యాడు. ఆ విధంగా ఆలోచించినప్పుడు ఉపవాసం అతనికి యెంతో వుపయోగకరమైనది.

ఖచ్చితమైన ఫలితం యిది. ఎవరైనా తినడం మానేస్తే సన్నబడతారు. ఎవరైనా లావుగా వుండి సన్నబడాలనుకుంటే యిదొక మంచి మార్గం. అంటే తిండి గురించి

ఆలోచించకుండా వుండే షరతు మీద వుపవాసం చెయ్యొచ్చు. ఎందుకంటే వుపవాసం ముగిసీ ముగియకుండానే తిండి మీద దాడి చేసి రెట్టింపు లాగించేస్తే, తిరిగి ముందు కంటె రెట్టింపు లావయిపోతారు.

శ్రీమాత

*

ఉపవాసం వల్ల యదార్థం యిది. మనస్సు, నరాలు పటిష్టంగా వున్నట్లయితే యిచ్ఛాశక్తి చురుగ్గా పనిచేస్తుంది. వ్యక్తి కొంతకాలం వరకు వొక రకమైన అంతశ్శక్తి పొందగలుగుతాడు. అది మనిషిని ఆకర్షించి ప్రలోభపెట్టే సాధారణ ప్రతి క్రియలయిన ఆకలి, నీరసం, చిన్న, పెద్ద పేగులకు సంబంధించిన సమస్యల లాంటి వాటినన్నింటినీ దూరం చేస్తుంది. కాని శరీరం తగ్గిపోయి బాధపడుతుంది. అందుచేత సులభంగా శరీరం ప్రాణికమైన వ్యాధిగ్రస్తమవుతుంది. అధికశ్రమకు లోనైన స్థితి పెరిగి అలసట కలుగుతుంది. అత్యధికమైన శక్తి తీవ్రంగా శరీరంలో ప్రవేశించడం వల్ల ప్రాణికమైన శక్తి, నరాలు దీనిని తట్టుకోలేవు. సమన్వయం కాలేవు. నరాల బలహీనత కలవారు ఉపవాసం చెయ్యాలనే ప్రలోభం విడిచిపెట్టాలి. అలాంటి వారు ఉపవాసం చెయ్యడం వల్ల సమతుల్యత లోపించి మానసికారోగ్యం పాడవుతుంది. ఈ మధ్య ముఖ్యంగా నిరశన వ్రతాన్ని ప్రోత్సహించే విధానం అలవాటయింది. నిరశన వ్రతం వొక విపత్కర పరిస్థితిగా మారింది. ప్రాణిక స్పందనలకి పాపపరిహారంగా భావించడం చేత అది వొక హానికరమైన అలవాటుగా మారి సాధనకి ప్రాణాంతకమవుతున్నది. పోనీ యీ ప్రతిక్రియలన్నిటినీ పక్కకి తోసివేసినప్పటికీ ఉపవాసం వల్ల తగినంత వుపయోగం లేదు. ఉన్నతశక్తి, శీఘ్రగ్రహణశక్తి కృత్రిమమైన లేదా భౌతికమైన పద్ధతుల వల్ల రావు. సాధనకి కావలసినవి, గాఢమైన చైతన్యం, బలమైన సంకల్పం.

*

ప్రధానంగా నేను జనాలకి చెప్పేదేమిటంటే నిద్రాహారాలు మానకూడదు. తగినంత ఆహారం, నిద్ర లేకుండా యే యోగసాధన చెయ్యలేరు. (ఈ విషయంలో గీత చెప్పినది వొకసారి చూడండి.) ఉపవాసం, నిద్ర లేకుండా వుండడం నరాల్ని వ్యాధిగ్రస్తం చేస్తాయి. భావోద్రేకానికి, మెదడులో నరాలు బలహీనమవడానికి రకరకాల మనోవికారా లకి, చిత్తచాంచల్యానికి దారితీస్తుంది. అందుకే గీత చెప్తుంది: "యుక్తాహారి, యుక్త నిద్రాః" అని. అప్పుడు మనిషి యే పనైనా చక్కగా చెయ్యగలడు. యే విషయానికైనా

యిది వర్తిస్తుంది. ఎంతో తరచుగా నేనంటూ వుంటాను. అత్యధిక యేకాంతం నా కొక అనుమానం కలిగిస్తుంది. ధ్యానం చెయ్యడం తప్ప యే పనీ లేకుండా వుండడం అనేది సమతుల్యత లేనిదిగాను, దాని వల్ల సాధన కుంటుపడుతున్నదా? అని.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

మాంసాహారం — ఒక కథనం

ప్రశ్న: మాంసం తింటే ఏమవుతుంది?

శ్రీమాత: ఒక కథ చెప్పనా? నా కొక స్వీడన్ యువతితో పరిచయం ఉండేది. తను యోగసాధన చేస్తూ ఉండేది. ఆమె సహజంగా శాకాహారి. ఒక రోజు కొంతమంది స్నేహితులామెను విందుకు ఆహ్వానించారు. అక్కడ విందులో ఆమెకు చికెన్ వడ్డించారు. వాళ్ళని ఇబ్బంది పెట్టటం యిష్టం లేక ఆమె చికెన్ తినటం జరిగింది. తరువాత ఆ రోజు రాత్రి నిద్రలో హఠాత్తుగా తను ఒక బుట్టలో ఉన్నట్లుగా ఆ వెదురుబుట్ట మధ్యలో తన తలను ఎవరో విదిల్చివేస్తున్నట్లుగా, బాధాకరంగా దుర్భరంగా అనిపించింది. తర్వాత కాళ్ళు పట్టుకొని తలక్రిందులుగా వ్రేలాడదీసి కుదిపి కుదిపి కుదిపేస్తున్నట్లుగా అనిపించింది. (నవ్వు) ఆమె తీవ్రమైన వేదనకు లోనయింది. శరీరం నుండి ఎవరో ఈకలు పీకేస్తున్నట్లు భరించలేని బాధ కలిగింది. ఇంతలో మరొకరు చేతిలో కత్తి పట్టుకొని వచ్చి తన తల నరికివేసారు. అప్పుడు ఆమెకు నిద్ర నుండి మెలకువ వచ్చేసింది. ఆమెకు వచ్చిన ఈ కల వృత్తాంతమంతా నాకు చెప్పింది. జీవితంలో అంతకు మునుపెపుడూ ఇంత భయంకరమైన పీడకల తనకు రాలేదట. నిజానికి నిద్రపోయే ముందు ఆమెకు ఎలాంటి ఆలోచనలు లేవు. కేవలం చనిపోయిన ఆ కోడి చేతన ఆమెలోకి ప్రవేశించటం వలన ఆ కోడి పొందిన ఆవేదన, మార్కెట్టు నుంచి తీసుకురావటం, మెడ కోసివేయటం వంటి భయాందోళనలన్నిటినీ ఆమె అనుభూతి పొందింది (నవ్వు).

మీరు తినే మాంసంతో పాటుగా కొద్దో, గొప్పో పరిమాణంలో మీరు ఆ జీవి చేతనను కూడా స్వీకరిస్తారు. అది చాలా ప్రమాదకరం కాకపోయినా అంత ఆహ్లాదకరం మాత్రం కాదు. అది మానవత్వం వైపు కాకుండా పశుత్వం వైపుకే మొగ్గు చూపినట్లవు

తుంది. ఆధ్యాత్మికతకు కాక పశుత్వానికి దగ్గరగా వుండే ఆదిమానవులు వండిన మాంసం కంటే ఎక్కువ బలాన్నిచ్చే పచ్చి మాంసాన్ని తినేవారు. వాళ్ల పేగులలో 'అపెండిక్స్' (ఆంత్రము) పెద్దదిగా ఉండి ఆపక్వమయిన మాంసాన్ని జీర్ణించుకోవటా నికి ఉపయోగపడేది. క్రమంగా మనిషి మరింత రుచికరంగా ఆహారాన్ని వండుకొని తినటం మొదలుపెట్టాడు. పని లేకపోవటంతో కాలక్రమేణా అపెండిక్స్ (ఆంత్రము) కృశించి చిన్నదయిపోవటం జరిగింది. అది ప్రస్తుతం ఒక ప్రతిబంధకంగా మారి ఒక్కొక్కసారి అస్వస్థత కలుగుజేస్తుంది.

బహుశా ఇది తక్కువ మృగప్రాయమైన ఆహారానికి మారవలసిన సమయం, అది పూర్తిగా వారి వారి చేతనాస్థితిపై ఆధారపడి వుంటుంది. ఒక సామాన్యమైన జీవితాన్ని గడిపే సాధారణ కార్యకలాపాలుగల సాదాసీదా వ్యక్తి, కేవలం జీవనభత్యం గురించి కాక మరి ఏ ఆలోచనాలేని వ్యక్తి, తన కుటుంబ బాధ్యత వహిస్తూ, ఆరో గ్యాన్ని కాపాడుకోవాలనుకొనే వ్యక్తి మాంసాహారం తినటం మంచిదే — అతనికి రుచించేది, మంచిది అనిపించేది ఏది తిన్నా ఫర్వాలేదు.

కానీ సాధారణ జీవితం నుండి ఉన్నతమైన దానికి ఎదగాలనుకున్నప్పుడు ఈ విషయం ఆసక్తికరం అవుతుంది. ఉదాత్తమయిన జీవితాన్ని ఎన్నుకొని పరిణామానికి సంసిద్ధమవుతున్నప్పుడు మనం తీసుకొనే ఆహారం ప్రాముఖ్యతని సంతరించుకుం టుంది. ఎందుకంటే కొన్ని ఆహారాలు శరీరాన్ని సూక్ష్మతరం చేస్తాయి. అలాగే కొన్ని ఆహారాలు పాశవికతను పెంచుతాయి. కేవలం ఆధ్యాత్మికతస్థాయిలోనే, ఆ స్థాయిని చేరుకున్నప్పుడు మాత్రమే ఆహారం ప్రాధాన్యత వహిస్తుంది. అంతకు ముందు కాదు. అది కాక చేయవలసినవి చాలా ఉన్నాయి. శరీరంకన్నా ముందు మనస్సును, ప్రాణికచేతనను శుద్ధి చేసుకోవటం ఉత్తమం. మీ దైహిక చేతనను పరిశుద్ధి చేసుకోవటానికి అవసరమైన జాగ్రత్తలన్నీ తీసుకున్నా మీ మనఃప్రాణాలు అచేతన, అంధకారం, కోరికలు, ఉద్రేకాలతో నిండి ఉంటే ఏ మాత్రం ప్రయోజనం ఉండదు. మీ శరీరం నిర్వీర్యమై ఆధ్యాత్మిక జీవితం నుండి వేరుపడి ఏదో ఒక రోజు రోగగ్రస్తం అవుతుంది.

ముందు లోపల నుండి ప్రారంభించాలి. మీకు యింతకు మునుపే నేను చెప్పాను. ముందు పైనుండి మొదలుపెట్టి ఊర్ధ్వమైనవాటిని శుద్ధి చేసుకుంటూ క్రిందనున్నవాటిని కూడా స్వచ్ఛంగా ఉంచుకోండి. అలా అని శరీరంతో అన్ని

రకాలయిన దిగజారే పనులు చేయమని నేను చెప్పటం లేదు. మీ కోరికలను నియంత్రించుకోవద్దని నేను సలహా యివ్వటంలేదు. మీ మనఃప్రాణకోశాలలో యింకా దివ్యత్వం లేనపుడు కేవలం శారీరకంగా మీరు దేవతల్లా నటించకండి. అలా చెయ్యటం వలన మీరు సత్యం నుండి దూరంగా వెళ్తున్నారని గమనించండి.

సమతని కలిగి ఉండటం ఎంతో ముఖ్యం. అలా ఉండాలంటే మనలోని అన్ని భాగాలు ఒకేసారి ప్రగతిని సాధించాలి. మీలోని ఒక అంశాన్ని వెలుగులోకి నడిపించి మరొకదానిని చీకటిలో వదిలివేయవద్దు. ఏ కోశానా అంధకారం లేకుండా అత్యంత శ్రద్ధ వహించాలి. అపుడే మీరు గమ్యానికి చేరువౌతున్నట్లు....

మూలం: శ్రీమాత

అనువాదము: డా. సరోజా ప్రసాద్

టోకియో సుందరవనంలో శ్రీమాత అనుభవాలు

ప్రశ్న: ప్రియమైన శ్రీమాతా! ఓ చిన్న కోడిపిల్ల ఆకస్మిక భావోద్వేగం మన పైకి అకస్మాత్తుగా దాడి నెఱపగలిగితే, అదే రీతిగ కేరట్, బీటు దుంపల మానసిక వ్యధ మన్పై ఆకస్మిక దాడులు నెరపగలగటం సంభావ్యమే కదా! కాదనగలమా?

మీ సంశయం విన్న తరువాత నాలో వికసించిన విశ్వాసం, బీట్ దుంప కంటె కోడి పిల్ల అధికమైన నిర్నిద్రబుద్ధి గలదన్న భావన. (సమావేశంలో నవ్వుల జల్లులు) అయితే నేను నా స్వానుభవాన్ని మీతో అవశ్యం పంచుకోవాలి. నా ఏకైక ఆలోచన ఏమిటంటే, ఇది సర్వసాధారణమైన విషయం కాదని.

టోకియో నగరంలో నాకో తోట ఉండేది. అందులో నేనే స్వయంగా కూరగాయలు పండిస్తుండేదానిని. ఆ తోట సుమారుగా విశాలమైన ఉద్యానవనం. అందులో విరివిగా వివిధ రకములైన కూరగాయల వంగడాలు పండించబడుతుండేవి. అంచేత, ఆ తోటకు నేను ప్రతిదినం ప్రభాతవేళ తప్పకుండా వాహ్యాళికి వెళ్తుండేదాన్ని. మొక్కలకు నీరు పోసి, అవసరమైన ఇతర తోట అవసరాలను చూచిన తరువాత తోటంతా కలయదిరిగేదాన్ని. ఆహారం లోకి ఆనాడు ఏ ఏ కూరగాయలు ఎంపిక చేసుకొని తీసుకువెళ్ళాలో నిర్ణయించుకోటానికి. అవి, వాటిని కోసుకుంటున్న వేళలో నాతో

ఏమంటున్నావో ఊహించండి. అందులో కొన్ని కూరగాయలు గళమెత్తి "వద్దు, వద్దు, మమ్మల్ని తాకొద్దు, తుంచొద్దు. తల్లిమొక్క నుంచి, మట్టితల్లి నుండి వేరుచేయ వద్దని బావురమని విలపించేవి. అదే సమయంలో కొంత దవ్వున నున్న మొక్కలు కొన్ని నన్ను "రా, రా మా దరికి రా. వచ్చి మమ్మల్ని తీసుకెళ్ళు, తీసుకెళ్లు, ఆరగించు. ఆరగించి మా జన్మకు ధన్యత చేకూర్చు" అని ఆహ్వానించటం, నా వీనుల్లో ధ్వనించేది. ఇది చాలా సరళమైన విషయం. ఇది అత్యంత సహజమైన, కృత్రిమంగాని, తుల్యమైన క్రమం. నేను తమను తాము సమర్పించుకొన నిచ్చగించి నవాటినే స్వీకరించి, సేకరించి, తమను ముట్టవద్దంటున్నవాని జోలికి పోకుండా వదలివేసేదాన్ని ముట్టనైనా ముట్టకుండా. దీనిని నేను ఓ అపురూపమైన అంశంగా భావించేదాన్ని. అసాధారణ విషయంగా పరిగణించేదాన్ని. నేను నా మొక్కల్ని అత్యంత మక్కువగా ప్రేమించి, మన్నించేదాన్ని. వాటికి నీరు పెట్టేటప్పుడు, చీడ మొదలైనవాటిని దులిపి, శుభ్రపరచేటప్పుడు, అపురూపంగా చూచుకొంటూ, అనుపమాన శ్రద్ధాసక్తులతో స్పందించేదాన్ని. నా తోటంటే, అందలి మొక్కలంటే నాకు ప్రాణం. అనిర్వచనీయమైన మక్కువ. బహుశా, నా ఆలోచనలలో, అవి ప్రత్యేకమైన ధారణ, గ్రహణ ఉత్పాదక శక్తి సమన్వితాలు.

ఫ్రాన్స్ దేశంలో కూడా ఇదే పరిస్థితి. దక్షిణ ఫ్రాన్స్ దేశంలోనూ నాకో తోట ఉండేది. దానిలో నేను బఠాణీ, ముల్లంగి, కేరట్ పంటలు పండిస్తుండేదాన్ని. అది సరే. అక్కడ కూడా కొన్ని కూరలు సంతోషంగా మమ్మల్ని తీసుకెళ్ళి ఆరగించండని స్వాగతిస్తుండేవి. మరి కొన్ని మమ్మల్ని ముట్టకండి, త్రుంచకండి, ఆరగించకండి. మా మానాన మమ్మల్ని మనుగడ సాగించనివ్వండి అంటుండేవి. (సమావేశ మందిరంలో హాసాలు)

ప్రశ్న: మహితాభిలాషియైన దివ్యజననీ అవి ఎందుకలా వక్కాణిస్తున్నవి?

సమాధానం: మంచి ప్రశ్న. నేను ఆ విషయం కనుగొనటానికి, స్పష్టీకరించటానికి ఖచ్చితమైన రీతిలో ప్రయోగాలు చేశాను. కొన్ని సమయాలలో ఆ మొక్క భక్ష్య యోగ్యత కలిగి యుండేది కాదు. పచనయోగ్యత కలిగి యుండేది కాదు. అది గట్టి గానో, చేదుగానో దుస్సహంగా ఉండేది. తినటానికి యోగ్యత సంతరించుకొని వుండేది కాదు. మరి కొన్నిటి పట్ల అవి తినటానికి తగిన పరిపక్వదశలో ఉండేవి కాదు. పచ్చిగానో, దోరగానో ఉండేవి. ఒకటి రెండు రోజులు ఆగి పలుకరిస్తే, అవి

నాతో "స్వీకరించు, స్వీకరించు. స్వీకరించి ఆరగించు." అని ముచ్చటించేవి. (నవ్వులే నవ్వులు)

మూలము: శ్రీమాత

అనువాదము: అన్నవరం ఆదిశేషయ్య

ధూమపానం, మద్యపానం — రెండు కథలు

చాలాకాలం క్రితం ఇక్కడ ప్రభుత్వ ప్రతినిధిగా నిలబడడానికి వచ్చిన ఓ వ్యక్తి నాకు బాగా జ్ఞాపకం. అతని గురించి నా అభిప్రాయం చెప్పమని అతడిని నాకు పరిచయం చేశారు. అతడు ఈ ఆశ్రమం గురించి, ఇక్కడ జీవనవిధానం గురించి ప్రశ్నలు వేశాడు. క్రమశిక్షణ పాటించడానికి ఏది అత్యంత ఆవశ్యకమని నేను భావిస్తానో దాని గురించి నా అభిప్రాయం అడిగాడు. అతడు రోజంతా పొగత్రాగడమే కాదు, అవసరానికి మించి మద్యం సేవించేవాడు. దాని వల్ల తను అలసిపోతున్నానని, తెలివితప్పి అప్పుడప్పుడు అధీనంలో లేకుండా ఉంటున్నానని... నాతో చెప్పాడు. నేనతనికి "నీవు మొట్టమొదట పొగత్రాగడం, ఈ మద్యపానం మానేయాలని చెప్పాను", అతడు నమ్మశక్యంకాని దిగ్భ్రమతో నన్ను చూసి "పొగత్రాగక, మద్యం సేవించకుండా జీవించడం అంటె జీవితాన్ని కోల్పోయినట్లే కదా" అన్నాడు, జీవితానికింక అర్థం ఏముంది అన్నట్లుగా"అన్నాడు. "నీ వింకా ఆ దశలోనే ఉంటే నేను ఇంతకంటె ఎక్కువ చెప్పడం వృధా", అని అన్నాను.

మనం అనుకున్నదానికన్నా ఎక్కువగానే ఈ ఆలోచనా ధోరణి సాగుతుంది. చాలామంది ఇలాగే ఆలోచిస్తారు. ఆశ్రమంలో మనకి అది విపరీతంగా అనిపించవచ్చు. ఎందుకంటె మనకు ధూమపానంకన్న, మద్యపానంకన్న ఆసక్తికరమైన విషయాలున్నాయి. కాని సామాన్య మానవుడికి జీవిత పరమావధి తన కోరికలను తృప్తిపరచుకోవడమే. అదే వారి స్వతంత్రభావాల్ని, జీవితధ్యేయాన్ని ప్రతిపాదించగలదని భావిస్తారు. అయితే అది ఒక వక్రత... ఓ వికృతం. అది జీవిత సహజత్వాన్ని వ్యతిరేకిస్తుంది. అది భౌతికజీవనంలో ఆలోచన యొక్క, ప్రాణిక ప్రేరణల యొక్క అనారోగ్యకరమైన జోక్యం అని చెప్పాలి. అది మృగాలలో కూడా సామాన్యంగా కనిపించని అనారోగ్యమైన ప్రేరణ. ఈ విషయంలో... మనిషి సహజప్రేరణల

కన్న జంతువుల్లోని సహజప్రేరణలే యుక్తమైనవి. ఇప్పుడు మనుషుల్లో అ సహజప్రేరణ మరింత వికృతప్రేరణ ఆక్రమించింది.

(స్వభావంలో) వికృతత్వం మనిషికి మాత్రమే ఉన్న వ్యాధి. అది జంతువుల్లో చాలా అరుదుగా ఉంటుంది. అది కూడా మనుషులకు చేరికగా ఉన్న పెంపుడు జంతువుల్లో మాత్రమే కనపడుతుంది. అంటె ఆ మనిషి వికృతత్వంతో ఆ జంతువు కలుషితమౌతుంది.

నార్త్ ఆఫ్రికాలో ఉన్న కొందరు ఆఫీసర్ల గురించి ఓ కథ ఉంది. అది అల్జీరియాలో జరిగింది. వాళ్ళు ఓ కోతిని పెంచేవారు. ఆ కోతివాళ్ళతోనే ఉండేది. ఓ రోజు వాళ్ళకి ఓ భయంకరమైన ఆలోచన వచ్చింది. ఆ కోతిచేత మద్యం తాగించారు. వారితో బాటుగా ఆ కోతి ముందు మద్యం నింపిన గ్లాసు ఉంచారు. ఆ కోతి ముందుగా వాళ్ళు మద్యం తాగడం చూసింది. దానికి వాళ్ళు త్రాగే విధానం వింతగా, సరదాగా అనిపించి, అది గ్లాసు మద్యం పూర్తి చేసింది. ఆ తరువాత అది బాధతో విలవిలలాడుతూ బల్ల కింద పడి పొర్లుతూ, విపరీతమైన బాధపడింది. అది అక్కడ వారికి మద్యం యొక్క తక్షణ ప్రభావం ఎలా ఉంటుందో చూపే ప్రత్యక్ష నిదర్శనం అన్న మాట. అందులోనూ ఇంకా ఆ కోతి భౌతికతత్వంలో మద్యం యొక్క ప్రభావం ముందుగా లేనప్పుడు. అది విషప్రభావంతో చనిపోయినంత పనైంది. అయితే అది కొంతసేపటికి తెప్పరిల్లింది. కొంచెం సేపు తరువాత అది బాగానే ఉందని వారితో పాటు డిన్నర్ కి పిలిచారు. మళ్ళీ దాని ముందు ఓ గ్లాసు మద్యం ఉంచారు. అది కోపంతో, ఆ గ్లాసు ఎత్తి, ఆ గ్లాసు పెట్టిన వ్యక్తి నెత్తి మీద కొట్టింది. ఆ చేష్టవల్ల అది మనుషులకన్న వివేకం కలదని తెలిపింది.

నేర్పుతో సమర్థవంతంగా జీవించాలంటె... ఏది అభ్యసించినా చిన్నవయసులోనే ప్రారంభించాలి, మనిషి శరీరం ఎంతవరకూ సాగగలదో అంతా సాగనివ్వాలి. అంతా రాబట్టుకోవాలి. దానికి హేతువు మన ఇంటికి, వంటికి యాజమాన్యం వహించాలి. ఇక్కడ యోగం, లేదా ఉన్నత అనుభవం అన్నది ప్రశ్న కాదు.... ఇది అన్ని చోట్ల బోధించవలసిన విషయం. ప్రతి విద్యాలయంలో, ప్రతి కుటుంబంలో, ప్రతి ఇంట్లో హేతువును గురించి బోధించాలి. మనిషి మనిషిగా జీవించడానికే ఆలోచించే మనసు ఇవ్వబడింది. మనం మాట్లాడేది మరే విషయం గురించి కాదు. కేవలం మనిషి మనిషిగా ఉండాలంటే జీవితం హేతువు చేత నడపబడాలి,... ప్రాణికప్రేరణ

వలన కాదు. ఇది పిల్లలందరికి వారి పసితనంలోనే బోధించాలి. ఎవరు హేతువు ఏలుబడిని ఒప్పుకోరో వారు జంతువుకన్న దిగజారిన బుద్ధిహీనులన్న మాట. ఎందుకంటె జంతువులకు మనసుకాని, వాటిపై అధికారం చూపగల హేతువు కాని లేవు... అయితే అవి వాటి వాటి జాతులకు ఇవ్వబడిన సహజాతాలకు కట్టుబడి ఉంటాయి. ఆయా జాతులకు సంబంధించిన సహజ ప్రేరణలు వాటికి ఉపయోగపడేవిగా ఉంటాయి. అవే వారి కార్యకలాపాల్ని వారి కనుగుణంగా క్రమపరుస్తాయి. అందుకనె అవి స్వభావసిద్ధంగా ఆ జాతి సహజ లక్షణాల ననుసరించి మసలుకుంటాయి. ఏ జాతి ఆ జాతి సహజస్వభావాన్ని అనుసరిస్తూ, ఏదో ఒక కారణంచేత ఏ జంతువైనా తన సహజస్వభావం నించి విడివడినప్పుడు... అంటె మనం ఇందాకా చెప్పుకున్నట్టుగా.... మనిషికి దగ్గరగా ఉండి, తన సహజ లక్షణాన్ని వదిలి, మనిషి చెప్పినట్టు వింటే మాత్రం.... మనిషి వికృతతత్వం వాటికి శోకి వాటి జాతిలక్షణాన్ని కోల్పోతాయి. కాని ఏ జంతువులైనా సహజంగా జీవిస్తూ, మానవప్రభావానికి దూరంగా ఉంటె, అవి వాటి లక్షణాల ననుసరించి చాలా హేతుబద్ధంగా ఉంటాయని చెప్పవచ్చు. అవి చేసే పనులు తమ జాతిలక్షణాన్ని బట్టి ఉండడం వల్ల మంచినే చేస్తాయి. సహజంగా అపాయాలెదురౌతాయి. వాటికి ఎల్లప్పుడూ మరో జంతువుతో పోరాటం తప్పదు. అది స్వభావసిద్ధమైనదే కాని, తనంతట తానుగా తెలివితక్కువగా ప్రవర్తించడం మాత్రం కాదు. తెలివితక్కువ పనులు, వికృతచర్యలు, మనిషి మనసులోంచి పుట్టినవే. మానసికశక్తులను పొరపాట్లుగా వాడుకునే మనిషి చేసే తప్పులు. అందుకనే వికృతత్వం మానవజాతితోనే మొదలయ్యింది. అభివృద్ధి చెందుతున్న ప్రకృతిలో ఈ వికృతత్వాన్నే మానసిక చైతన్యం చూపిస్తోంది. అందుకే ప్రతి మనిషికి తప్పని సరిగా బోధించవలసిన విషయం ఇది. మనిషిలో ఆలోచన మొదలైన పసివయసు నించి అతనికి హేతువును పాటించమని చెప్పాలి. హేతువును ఆమోదించమని చెప్పాలి. అదే మానవజాతి యొక్క గొప్పదైన, సహజలక్షణం, విచక్షణా కౌశలం. అత్యంత గొప్పదైన బుద్ధి కుశలత. హేతువే మానవస్వభావానికి యాజమాన్యం వహించాలి.

ప్రతి వ్యక్తి హేతువుకు ఆధిపత్యాన్నిచ్చి, హేతువు ననుసరించి పూర్తిగా సహజ ప్రేరణలకు బానిస కాకుండా ఉండాలి. హేతువు చేతుల్లో మన జీవితాన్ని పెట్టాలి. ఇక్కడ నేను యోగం గురించి కాని, ఆధ్యాత్మిక జీవితం గురించికాని

మాట్లాడటం లేదు.... దానితో దీనికి సంబంధం లేదు. ఇది మానవజీవితం యొక్క తొలి వివేకం. పూర్తిగా మానవజీవితానికి సంబందించినది. ఏ మనిషైనా హేతువును కాదని మరిదేన్ని ఆశ్రయించినా అతడు జంతువుకన్న హీనస్థితికి దిగజారాడని అర్థం. అంతే. అందుకే దీనిని గురించి అన్ని చోట్లా బోధించాలి. పిల్లలకి అందించ వలసిన ప్రాథమిక విద్య అదే. నేర్పవలసిన తొలి పాఠం.

ఈ పృథ్విపై .... దివ్యసంకల్పాన్ని అభివ్యక్తం చేసే ఆత్మ ప్రభుత వహించిన ప్పుడు, ఆత్మ 'న్యాయ నిర్ణేతగా' ఉన్నప్పుడు, ఆ శక్తి ప్రకటితమైనపుడు మాత్రమే... హేతువు యొక్క పాలన అంతరిస్తుంది. అంతదాకా హేతువే పాలించాలి.

మూలము: శ్రీమాత

అనువాదము: సత్యవాణి

పిల్లలకు తగిన ఆహారమేది?

శరీర వ్యాయామశిక్షణ ఒక అవసరమైన విద్యగా గుర్తించినవారు తమ పిల్లల సాధారణ పెరుగుదలకు వలసిన అనుకూల పరిస్థితులను, తగిన సూచనలను సమాచారాన్ని సులభంగానే తెల్సుకుంటారు. ఈ విద్యకు సంబంధించిన విషయపరిజ్ఞానం కూలంక షంగా అధ్యయనం చేయబడి అనేక పుస్తకములు వెలువడినాయి. ఇంకా అధిక సమాచారంతో పొందుపరచిన మార్గదర్శకాలుగల పుస్తకాలు కూడా వస్తున్నాయి.

ఈ విషయం యొక్క సాధనాక్రమ వివరాలలోకి వెళ్ళే అవకాశం నాకు ఇక్కడ వీలు కాదు. ప్రతి ఒక సమస్య దేనికదే వేరుగా భిన్నంగా ఉంటుంది. వేటి పరిష్కారాలు ఎవరికి తగినట్లుగా వారికి ఉంటాయి. దీనికి సంబంధించిన ఆహారవిషయం చాలా లోతుగా సవివరంగా అధ్యయనం చేయబడింది. పిల్లల పెరుగుదలకు సహకరించే ప్రత్యేక ఆహారం గురించి సామాన్యంగా అందరికీ తెలిసిందే. వానిని ఆచరించటం తేలికైన విషయమే. కాని శరీరధర్మ మైన అంతఃప్రేరణ శరీరంలో మిగిలివున్నంత వరకు దానినే నమ్మాలి. దీనిని మించిన సిద్ధాంతం వేరే లేదన్న విషయాన్ని ముఖ్యంగా గుర్తించుకోవాలి. కావున తమ పిల్లలు సహజసిద్ధంగా పెరగాలని ఆశించేవారు పిల్లలకు రుచించని ఆహారాన్ని తినమని నిర్బంధించకూడదు. క్రమశిక్షణ లేని పిల్లలకు

ఇది వర్తించదు. శరీరానికి స్వతహాగానే తనకు హానికరమైనవాటిని గుర్తించే గుణం ఉంది.

సర్వసాధారణంగా మానసిక భావనల, లేక ప్రాణిక ప్రేరణల జోక్యం లేనపుడు శరీరానికి దానంతట అదే తనకు ఏది మంచిది, ఏది అవసరము అన్నది తెలుసు. ఈ విషయం తెలుసుకొనుటకు సాధన అవసరం. తమ ఇష్టాయిష్టాలకు, అవసరాలకు మధ్యగల తేడాను బిడ్డ గుర్తించేట్లు అతనికి తగిన శిక్షణ నిచ్చి దానిని సమర్థవంతంగా ఆచరించేట్లు చేయాలి. కృత్రిమం కాని ప్రకృతిసిద్ధమైన పోషకవిలువలు కల, ఆరోగ్య కరమైన, ఆకలిని పుట్టించే, ఆహారం తీసుకునే అభిరుచిని బాలల్లో పెంపొందేట్లు తల్లితండ్రులు సహకరించాలి వారికి. కాని నిరుపయోగమైన క్లిష్టపరిస్థితుల నుంచి పిల్లలను దూరంగా ఉంచాలి. తేలికగా జీర్ణంకాని, ఆహారపదార్థాలను బిడ్డకి రోజూ తినే ఆహారంలో ఉంచకూడదు. వీటితో పాటు ఎక్కువ తక్కువ మోతాదులలో ఆహారం తీసుకోవడం కాక, తమ ఆకలి అవసరం ననుసరించి బిడ్డలు తినేటట్లు వారికి నేర్పాలి. అమితంగా ఆశతో తిని తృప్తిచెందే విధంగా పిల్లలకు భోజనం ఉండకూడదు. జిహ్వ రుచిని ఆస్వాదించే బదులు శరీరానికి బలం ఆరోగ్యం చేకూర్చే ఆహారం తీసుకోవాలని చిన్నతనం నుంచే మనుషులు తెలుసుకోవాలి. శుచి శుభ్రంగా తయారుచేసిన పిల్లలకు ఆ శక్తిని కలిగించే ఆహ్లాదకరమైన సౌఖ్యమైన, సమతుల్యమైన శక్తి నిచ్చే పౌష్టికాహారాన్ని బాలల కివ్వాలి. ఇటువంటి ఆహారాన్ని ఎంచుకుని పిల్లవాని వయసును, అతని రోజూవారి కార్యక్రమాల ననుసరించి అతని కివ్వాలి. ఈ ఆహారం పోషకవిలువలు కలిగి బలవర్ధకమైనదిగా ఉండి ఆ బిడ్డ శరీరభాగాలన్నీ సమతుల్యంగా పెరుగుటకు దోహదపడాలి.

ఆహారం పిల్లవానికి కావలసిన శక్తి కోసం అతనిని ఆరోగ్యంగా ఉంచుటకు సహ కరించేదిగా ఉండాలి. పిల్లలు ఆరోగ్యంగా పెరగడానికి ఎటువంటి బెదిరింపులు, నిర్బంధాలతో కూడిన ఆహారపద్ధతులు ఉండరాదు. 'నీవు మంచిబిడ్డగా ఉండుట లేదు, కావున నీకు తీపిపదార్థాలు ఇవ్వబడవు' — అనే హాని కలిగించే మాటలు పిల్ల లకు చెప్పటం ఆపాలి. ఈ బెదిరింపులు వలన ఆ బిడ్డ సున్నితమైన చైతన్యంలో, అతని కందించే ఆహారం అతనిలో ముఖ్యంగా దురాశను తృప్తిపరచేదని ఆ బిడ్డ మనసులో ముద్రించబడుతుంది. కాని శరీరం సక్రమంగా పని చేయుటకు అవసరమైన, సరైన మోతాదులో ఆహారం అవసరం అనే విషయాన్ని పిల్లవానికి తెలియచేయాలి.

నా చిన్నతనంలో నేను ఆహారము, దానికి సంబంధించిన వాటి గురించి మా అమ్మతో ఫిర్యాదు చేసినపుడు, ఆమె నన్ను వారించి నా దృష్టిని వాటి నుంచి మరలించి చదువు మీద, చేయవలసిన పనుల మీద పెట్టమని చెప్పేది. నేను పుట్టింది భోగాలను అనుభవించటానికి కాదు. అత్యున్నతమైన ఆదర్శాలను పొందటానికి పుట్టానని ఆమె నాకు చెప్పింది.

మూలము: శ్రీమాత

అనువాదము: సిద్దులగారి త్రివేణి

అవశ్యమయిన విషయం ఒకటే

భోజనం మానుకున్నంత మాత్రాన ఆధ్యాత్మికాభివృద్ధి సాధించలేవు. కోర్కెల, వ్యామోహాల నుంచి స్వేచ్ఛ పొందటం వల్ల, తిండి మీద ధ్యాస లేకుండా ఉండటం వల్ల — ఇది సాధ్యమవుతుంది. ఇవన్నీ నీ చైతన్యానికి పరాయివి, వాటికి అక్కడ స్థానం లేదనే ధోరణిలో ఉండాలి. ఆ స్థితిలో నీ అంతట నీవే సహజ పరిణామంగా తిండి గురించి పట్టించుకోవు. భోజనం చేయటం మర్చిపోవటం అత్యావశ్యకమైన షరతా, అనిపిస్తుంది. ఎందుకంటే, నీ ధ్యాస యెంతసేపూ, అతిమానసశక్తుల ప్రతిస్పంద నలతో నీ సత్యము లోని ఏకాగ్రతాశక్తులు, శారీరకకణాలతో సహా, నీ పరిపూర్ణ సత్వ సమైక్యతయే నీకు అనివార్యమైన వ్యాపకంగా అభివ్యక్తమవుతూ అదే అంతరంగ సిద్ధి అవుతుంది. అదే జీవితానికి అత్యావశ్యకమైన అవసరం. అదే జీవితసారం, అనందం, అస్తిత్వ హేతువు. ఈ సంసిద్ధి సాధించినపుడు, ఇక ఆహార, నిద్రాదులకు ప్రాముఖ్యత ఉండదు. నీ చుట్టూ వ్యక్తులు, పరిస్థితులు ద్వారా, లయబద్ధమైన బాహ్య విశ్వశక్తుల కేళీవిన్యాసమే వ్యక్తమవుతుంది. అపుడు నీ శరీరం పరిపూర్ణంగా అంతరంగ సత్యంతో సమీకృతమవుతుంది. మృదులత సంతరించుకుంటుంది. తగిన రీతిలో, నిరంతరం మలుచుకోబడుతుంది. ఆహారం అక్కడ లభ్యమయితే తీసుకుంటుంది. లేకుంటే దానిని గురించి పట్టించుకోదు. మరితర అన్ని విషయాల లోనూ ఇదే రీతి... ఇది జీవితం కాదు! ఇవి అస్తిత్వ విధానాలు. వీటికి అనాలోచితంగా, నీ అంతట నీవే మలుచుకుంటావు. ఇది ఒక విధమైన వికాసం, కలుగుతూన్న సంవేదన కలిగిస్తుంది. మొక్కలోంచి పుష్పం పుష్పిస్తున్న ఒక క్రియాపరివర్తన.

ఇది ఏకాగ్రతతో కూడిన ఇచ్ఛాశక్తితో రాదు. నీ చుట్టూ ఉన్న శక్తులతో సామరస్యం. నీవు నివసిస్తూన్న పరిస్థితులతో నీ సత్వము యొక్క సమ్యక్సంయోజనం. వీటంతట వీటికేమంత ప్రాధాన్యత లేదు. అయితే ఎపుడో ఒక సమయం రాకపోదు. అపుడు దేని అవసరం లేకుండానే చైతన్య పరిస్థితిపై ఎలాటి ప్రభావం లేకుండా ఏమైనా చేయగలుగుతావు. వాస్తవానికి ఇదీ కావలసినది. మనోచైతన్యభూమిక నుంచి ఉన్నత తర జీవనానికి, బాహ్య హావభావాలు, హేతుబద్ధంకాని నిర్ణయాలు ద్వారా ఆకాంక్షిం చటం అంత సార్ధకమైనది కాదు. అయితే ఒకటి. పశుత్వానికి కంటె వేరైనది ఏదైతే ఉన్నదో ఆ సత్వము తప్పక కావాలి. కాని అదే కాదు. బాహ్యాంశాల ఆలోచన లేక పూర్తిగా అంతరంగ ఆకాంక్షలో లగ్నమై ఉంటూ, అందినదానిని స్వీకరించి, అందనిదాని కోసం అర్రులు సాచక (యోగ) మార్గంలో ఉన్నవాడు, సిద్ధి కోసం పాటుపడే సన్యాసి కంటె యెంతో ముందుంటాడు.

వాస్తవంగా సాఫల్యత చేకూర్చేది చైతన్య పరిణామం. ఇదీ అంతరంగ విముక్తి. అతిమానస శక్తుల స్పందనలతో తప్పనిసరియైన పరిపూర్ణ సన్నిహిత సమైక్యతల ద్వారా, అంతరంగ విముక్తి. అతిమానసశక్తులతో అనుక్షణము సమగ్రంగా తప్ప నిసరిగా, శరీరము కణాలతో సహా సర్వ సమత్వము, సమైక్యత ఉండాలి. పరిణామాల గురించిన ధ్యాస ఎంత మాత్రము అక్కర్లేదు. విశ్వశక్తుల విన్యాసాల అభివ్యక్తీకరణ స్వతసిద్ధంగా, సహజంగా, ఎలా ఉంటుందోనని పట్టించుకోనవసరం లేదు. కావల్సిందల్లా పరిపూర్ణ సంసర్గం. నిరంతరం. అవును. నిరంతరం — దివ్యశక్తికాంతులతో సంసర్గం. అవును. అనిర్వాచ్యమైన అతిమానస చైతన్యానంద హేల. అదే చిత్తశుద్ధి. మిగిలినదంతా అనుకరణ. పరిపూర్ణ స్వచ్ఛత — ఇతోధికంగా — సతతము — తనకు తానుగా రూపుదాల్చి ఉంటూండటమే. ఎన్నడూ నటించకు. నీకు నీవుగా సహజసుందరంగా అలా ఉండు. అదే చిత్తశుద్ధి.

మూలము: శ్రీమాత

అనువాదము: కర్రా వెంకటేశ్వర్లు

భౌతికచైతన్యానికి సంబంధించి అవసరాలు, సౌకర్యాల కోసం అత్యాశ పనికిరాదు. సాధనలో అవి చాలా తీవ్రమైన అవరోధాలు.

అత్యాశ ద్వారా లభించే ప్రతి అల్పసంతృప్తి లక్ష్యం నుండి ఒక వెనకడుగు.

*

నీకు కోరిక కలిగినప్పుడు, నువ్వు కోరిన వస్తువు నిన్ను తన అధీనంలోకి తీసుకొంటుంది. నీ మనస్సును, జీవితాన్ని స్వాధీనపరచుకొంటుంది. నీవు దానికి బానిస అవుతావు. ఆహారం కోసం అత్యాశకు పోతే నువ్వు ఆహారాన్ని నియంత్రించలేవు. అది నిన్ను నియంత్రిస్తుంది.

*

రాచరిక భోగాల వైపు తిరిగితే, భగవంతునితో సాయుజ్యం చెందడం సంగతి నేను చెప్పలేను. నీకు నువ్వు ఆలోచించుకోవాలి. దానికి నేను ఒప్పుకోను. అంతకు మించి నేను చెప్పలేను. తన నిమ్నప్రకృతిని అధిగమించి ఇంకా ఎత్తుకు ఎదగాలో, లేదా భౌతికమైన గోతిలో మునిగిపోవడమో ఎవరికి వారు నిర్ణయించుకోవాలి. ఉన్నతమార్గాన్ని అనుసరించేవారికి మాత్రమే నా సాయం అందుతుంది.

*

బంధనాల నుండి స్వేచ్ఛ, ఆహారం కోసం అత్యాశ, భోగాల కోసం కోరిక వాటి నుండి స్వేచ్ఛ పొందాలన్న అంతర్గత వైఖరి ముఖ్యం. ఆహారం తగ్గించివేయడంకానీ, వస్తులు ఉండడం — ఇవి కాదు. శరీరం నిలబడడానికి తగిన ఆహారం తీసుకోవాలి. శరీరం బలం, ఆరోగ్యం చూసుకొని, ఎటువంటి బంధనం, కోరిక లేకుండా ఆహారం తినాలి.

*

ప్రియమాతా,

ఆహారంలో చాలినన్ని పోషకపదార్థాలు లేవని ప్రజలు అంటుంటారు. అందువల్లనే శారీరక రుగ్మతలు వస్తున్నాయని వైద్యులు అంటారు. జీవితంలో ఆహారానికి అంత ప్రాముఖ్యం ఉందా?

చైతన్యం శరీరంలోనే కేంద్రీకృతమైతే, శరీరం కోసం, దాని కోరికలు, సంతృప్తి

కోసం బ్రతికేవారికి సత్యం శరీరంతో ప్రారంభమై శరీరంతో ముగుస్తుంది. వారు తినడానికే జీవిస్తారు. ఆహారం వారికి చాలా ముఖ్యం. బాహ్యమైన పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని మేము రోగాలు నయం చేస్తామని వైద్యులు తమ బాధ్యతలను తప్పించుకో చూస్తారు.

అసలు ఈ సమస్య వెనుక సత్యం ఇది — ప్రకాశవంతమైన శరీరం తీవ్రమైన కోరికల నుండి, మానసిక ఆపోహల నుండి, స్వేచ్ఛ పొందిన శరీరం తనకేం కావాలో, ఎంత ఆహారం కావాలో, ఎటువంటి ఆహారం కావాలో తెలుసుకోగల్గుతుంది. అటువంటి జ్ఞానసందీప్త దేహం చాలా అరుదు. దానిని గూర్చి చెప్పనవసరం లేదు.

అదీ కాకుండా ఉత్తమమైనదేదో దాని కోసం పాటుపడాలి. దానికి మితిమీరిన ప్రాముఖ్యం ఇవ్వకూడదు.

వైద్యులలో నమ్మకం ఉన్నవారు వారు ఇచ్చిన సలహా ప్రకారం నడుచుకోవచ్చును. ఆ సలహా వల్ల వారి రుగ్మతలు తగ్గుతాయేమో ప్రయత్నించవచ్చు.

*

(ఒక శిష్యుని ఉద్దేశించి)

నిన్న సాయంత్రం, నేటి రోజంతా భోజనం చేయలేదని, భోజనశాల నుండి నాకు సమాచారం అందింది. కారణం ఏమిటి? ఒక వేళ వంట్లో బాగుండకపోతే, దానికి చికిత్స చేయించుకోవాలి. నేను వైద్యుణ్ణి పంపుతాను. నీకు ఆరోగ్యం ఉంటే నువ్వు తిని తీరాలి. క్రమం తప్పకుండా అన్నం తినకపోతే, నీ మెదడు వృధా అవుతుంది. తెలివితేటలు కోల్పోతావు. తరువాత?

నువ్వు రోజూ అన్నం తినకపోతే నాకు బాధ కలుగుతుంది. నిన్ను ప్రేమించి, నీ క్షేమం కోరే తల్లిని బాధించాలనుకొంటున్నావా?

1943 ఏప్రిల్

(ఆ శిష్యుని సమాధానం)

ప్రియమాతా,

నేటినుంచి భోజనం క్రమం తప్పకుండా చేస్తాను. నాకు అనారోగ్యం లేదు. అదొక మబ్బు. నీకు తెలుసు. నేను ఇప్పుడే భోజనశాలకు వెళ్తున్నాను. కన్నతల్లీ, నేను మంచిగానే వుంటాను. అదంతా అదృశ్యమైంది. నేను మీ చిన్నారి శిశువుగా వుంటాను.

ప్రియమాతా,

ఇంతకు ముందు, నేను ప్రతి రోజూ మూడుసార్లు పాలు తీసుకునేవాడ్ని. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం. మజ్జిగ తాగితే తేలికగా అరుగుతుందని, బలహీనమైన శరీరానికి అది మంచిదని ఇద్దరు మిత్రులు చెప్పారు. అందువల్ల పాలు బదులు మజ్జిగ తీసుకుంటున్నాను.

ఈ సూచనలు అంత ముఖ్యం కాదు. మీరు ఏం చెపితే అదే చేస్తాను.

మజ్జిగ మంచిది. అదే తీసుకో. పస్తులు మాత్రం ఉండవద్దు. అది నా సలహా. చాలినంత పోషక ఆహారం తీసుకోవాలి.

*

నాకు కావలసినంత ఆహారం తీసుకోలేకపోతున్నాను. ఎక్కువ తింటే కడుపు భారంగా ఉంటోంది.

నువ్వు బహుశా వేగంగా అన్నం తీసుకొంటున్నావు. నమలకుండా నువ్వు మింగివేస్తున్నట్లున్నావు. అన్నాన్ని బాగా నమిలి, నెమ్మదిగా తినాలి. అప్పుడు అన్నం ఎక్కువ తినవచ్చు. కడుపు బరువు అనిపించదు.

*

అన్నం ఎటువంటి తొందరపాటు లేకుండా నెమ్మదిగా తినడం మంచిది. ఎవరికైనా భోజనం చేయడానికి సమయం లభిస్తుంది. అదంతా సమయ వినియోగ సామర్థ్యంపై ఆధారపడి వుంటుంది.

*

అన్నం తయారుచేసే చోట దెబ్బలాటల వల్ల ఆహారం అరగదు. వంట ఎప్పుడూ నిశ్శబ్దంగా, సామరస్య భావనతో వండాలి.

*

ఆహారం పట్లగల వ్యామోహాన్ని వదిలించుకోవడంలో పురోగతి సాధించాలని నువ్వు కోరుకుంటే ఈ సూచనలు పాటించు.

ఆహారం గురించి ఆలోచనలు నిరంతరాయంగా నీకు కలుగుతుంటాయి. ఏది తీసుకోవాలి, ఎలా తీసుకోవాలి, ఎలా తీసుకోకూడదు అన్న భావాలు కలుగుతాయి. అవి నీకు సహజ మనిపిస్తాయి.

'వీటి నుండి నేను ఎలా విముక్తి పొందుతాను. నా పురోగతికి ఎటువంటి అవరోధం

కలుగుతోంది' అని భావించే కొలదీ, ఆ ఆలోచనలు వస్తూనే వుంటాయి. నిజంగా పురోగతి సాధించి, చైతన్యంలో ఒక భూమిక చేరినప్పుడు, అక్కడ నుండి నువ్వు వాటిని వీక్షించడం, వాటిని వాటి స్థానంలో పెట్టేంతవరకు ఆ ఆలోచనలు ఆగవు. ప్రపంచంలో అదొక గొప్ప స్థానం కాదు. నీ వృత్తులు, నీ అభిరుచులు నిన్ను విరుద్ధమైన స్థితిలోనే వుంచుతాయి.

మొదటి నుండి నువ్వు నీ విచక్షణ వైఖరి, వివేచన కలిగి యుండకపోతే, నువు ఒక మానసిక యుద్ధభూమికగా మారిపోతావు.

*

మీలో ఎందరు బైబిల్ చదివారో తెలియదు నాకు. చదవడానికి అదేమంత వినోదదాయకం కాదు. అది సుదీర్ఘ మైనది. కాని బైబిలులో ఒక కథ వుంది. నాకు చాలా ఇష్టం. ఇద్దరు సోదరులున్నారు. వారి పేర్లు ఇసా, మరియు జాకబ్. వారిలో ఇసాపు చాలా ఆకలితో ఉంటాడు. అతనొక వేటగాడు. అదీ కథ. అతనొకసారి ఆకలితో ఇంటికి తిరిగి వస్తాడు. తనకు ఆకలేస్తున్నదని జాకోబ్‌తో అంటాడు. "నువ్వు వండిన ఆహారం నాకు ఇస్తే, నీకు జన్మహక్కు (birth-right) ఇస్తాను" అని అంటాడు. చాలామంది ఈ కథను లోతుగా అర్థం చేసుకోలేరు. దానికి చాలా గంభీరమైన అర్థం ఉంది. జన్మహక్కు అంటే భగవంతుని కుమారుడు కాగల హక్కు. తను ఆకలితో వున్నాను కాబట్టి, ఆహారం కోసం తన దివ్యహక్కును వదలుకొంటానని అతను అన్నాడు. ఇది చాలా పాత కథ, కాని అది నిత్యసత్యం.

మూలము: శ్రీమాత

అనువాదము: యజ్ఞన్న

యోగంపై శ్రీఅరవిందుల లేఖలు — కొన్ని భాగాలు

భోజనం కోసం వ్యామోహం, ఆత్రము, అత్యాసక్తి, దానికి అనవసరమైన ప్రాముఖ్యత నివ్వటం — ఇదంతా యోగ మౌలిక సిద్ధాంతానికి నిషిద్ధం. తినటానికి ఇది రుచిగా బాగుంటుంది అని అనుకోవటం తప్పు కాదు. కాకపోతే దాని పట్ల అత్యాశ, దేవిరింపు, అది లభ్యం కాకపోతే చింత ఉండకూడదు. భోజనం కావలసినంతగా లేకపోయినా, రుచిగా లేకపోయినా, అసంతృప్తితో తలక్రిందులై పోకూడదు. శాంతం, సమచిత్తం

కలిగి ఉండాలి. అవసరమైనంత మేరకే — ఎక్కువ, తక్కువ కాకుండా భుజించాలి. అత్యాసక్తి పనికిరాదు. అలాగని, అసలు యిష్టపడకపోవటమూ కూడదు.

భోజనప్రియత్వాన్ని వదుల్చుకోవటానికి, తిండి గురించి ఎప్పుడూ ఆలోచిస్తూ ఉండటం, దానిని గురించి బుర్ర పాడుచేసుకోవటం సక్రమమైన మార్గం కాదు.

జీవితంలో భోజనానికి సంబంధించిన అంశానికి ఎక్కడో ఒక మూల దాని స్థానాన్ని దానికి కేటాయించు. దాని మీదే దృష్టి కేంద్రీకరించక ఇతర విషయాలు గురించి ఆలోచించు.

*

నీవు యోగానికి అభిముఖుడవై యున్నపుడు — చిన్న, పెద్ద అనే తేడా లేకుండా — అన్ని విషయాలపైనా యోగదృక్పథం కలిగి ఉండాలి. ఈ మార్గం విషయవాంఛలను అణగద్రొక్కే దృక్పథం అవలంబించదు. కాకపోతే నిర్లిప్తత, సమభావం అవలంబిస్తుంది. బలవంతంగా కోర్కెలను అణగద్రొక్కడం, లేదా యథేచ్ఛావిహారం — ఈ రెండూ ఒకే స్థాయిలో ఉన్నప్పుడు, ఈ రెండు సందర్భాలలోను కోరిక మిగిలే ఉంటుంది. ఒక సందర్భంలో యథేచ్ఛా విహారానికి పాల్పడుతుంది. మరో సందర్భంలో అణచిపెట్టి ఉంచటంలో, గుప్తంగా పడి ఉండి, తర్వాత రెచ్చిపోతుంది. నిమ్నప్రాణికస్థాయి నుంచి విడివడి వేరయి ఉంటూ, కోర్కెల కోలాహలంతో నాకు ఏ సంబంధం లేదని వెనక్కి తగ్గినపుడు, వాటి విషయాల్లో, చైతన్యంలో శాంతిసామరస్య భావన నెలకొల్పుకుని ఉన్నపుడు — నిమ్న ప్రాణికం క్రమేపీ స్వచ్ఛతను సంతరించుకుంటుంది. శాంతి సిద్ధిస్తుంది. సమభావాన్ని కలిగి ఉంటుంది. పొంగిన ప్రతి కోర్కెను గమనించాలి. బయట యెక్కడో జరుగుతూన్నదానిని గమనించాలి. బయట యెక్కడో జరుగుతూన్నదానిని గమనించినట్లు దానిని నిశ్చల నిర్లిప్తభావనతో గమనించాలి. దాని నలానే సాగిపోనివ్వాలి. చైతన్యం నుంచి బహిష్కరించాలి. దాని స్థానంలో సత్యచేతనను సుస్థిరపర్చాలి.

మనుష్యులు యోగం కోసం తాము ఇక్కడ ఉన్నట్లు గుర్తించి మనసులో దానిని పదిలపర్చుకుని, తమ అస్తిత్వానికి అదే రుచి, అభిరుచి గావించుకొని, మిగిలిన అభిరుచుల పట్ల సమచిత్తాన్ని పాటిస్తూన్నప్పుడూ – ఓహ్! అది యెంత బాగుంటుంది!

*

తిండి కక్కుర్తి కూడదు. అదే ధ్యాస పనికిరాదు. ఒక రకమైన సమదృష్టితో ఉండాలి. ఆహారం శరీరపోషణ కోసం ఎంత కావాలో అంత భుజించాలి. తక్కువ అయితే శరీరం తన అవసరం కోసం తాపత్రయపడుతుంది. మరీ యెక్కువ అయితే అపుడు అది ప్రాణికాన్ని ముద్దుచేయటం అవుతుంది. తిండిలో అభిరుచులు గురించిన, మానసిక దృక్పథం ఎలా ఉండాలంటే — 'లభ్యమైనది స్వీకరిస్తాను, లేకపోతే పట్టించుకోను' అన్నట్లుగా ఉండాలి. దానిని గురించి మరీ యెక్కువగా ఆలోచించకూడదు. వ్యామోహం పనికి రాదు. అలాగని అనవసరంగా అణగద్రొక్కటమూ పనికిరాదు.

*

శారీరక అవసరాలకి, తినే ఆహారానికి మధ్య సక్రమమైన సమతుల్యత సామరస్యత నెలకొల్పుకోవాలి. అతిగా తినటం వల్ల శరీర భౌతికభారం పెరుగుతుంది. బరువెక్కుతుంది. తక్కువ తింటే బలహీనత. నీరసం.

*

స్వభావంలో ఏ విధమైన భోజనాపేక్ష అతిగా పెంచుకోకూడదు. అలా తగని ప్రాధాన్యత నీయకూడదు. ఈ ఆసక్తిని పరిశుద్ధపర్చుకుని, వశపర్చుకుని వ్యవహరించాలి. దీనిని వశపర్చుకోవటానికి రెండు మార్గాలు ఉన్నాయి. ఒకటి నిర్లిప్తత వహించటం. ఆహారం ఒక శారీరక అవసరంగా కడుపు నింపుకోవలసిన ఒక ప్రాణిక అవసరం, దాని ప్రయోజనాన్ని సంతృప్తిపర్చేదాకా మాత్రమే పరిగణించడం. రుచి, అభిరుచులకు అంత ప్రాధాన్యత నీయకపోవటం. మరొకటి — ఇదే కావాలని పట్టుపట్టకుండా స్వీకరించటం — ఇతరులు దానిని గురించి — మంచి, చెడు — ఏం మాట్లాడినా సమానమైన రసాస్వాదనతో — తిండి కేవలం తిండి కోసమని కాకుండా — వైశ్వానికమైన దివ్యానందస్ఫూర్తితో స్వీకరించటం.

శరీరాన్ని విస్మరించటం, దుర్వినియోగపర్చటం పొరపాటు. సాధనకి తోడ్పడేది శరీరం. సక్రమ పద్ధతిలో దానిని పోషించాలి. ఆలాగని దానిపై వ్యామోహంకూడదు. దానిని అసహ్యించుకోకూడదు. దాని యొక్క భౌతిక స్వాభావిక అంశని విస్మరించ కూడదు.

తిండి విషయంలో మక్కువ అవసరం లేదు. యోగి శరీరపోషణ కోసమే తింటాడు. కామనతో కాదు.

*

తిండి తినాలనే కోర్కెను అణచివేసినపుడు — మరింత ఎక్కువగా తినాలనే తిండి పట్ల అవసరం, పాత నెరవేరని కోర్కెలకి పరిహారంగా — మరింత యెక్కువ తినాలనే తీవ్రవాంఛ — నేనెప్పుడూ గమనిస్తూంటాను.

*

ఆధ్యాత్మిక దృక్పథం ప్రకారం సాత్విక ఆహారం యొక్క ప్రాముఖ్యతను గోరంతలు కొండంతలు చేయబడిందని నేను భావిస్తాను. ఆహారం ఆరోగ్యసూత్రాలకి సంబంధించిన సమస్య. ఆరోగ్యసూత్రాలకి అనుగుణంగా — ఆధ్యాత్మిక సూత్రాలకి నిబద్ధంగా, ప్రాచీన విధానాలు, ఆహారానికి సంబంధించిన కట్టుబాట్లను నిర్దేశించాయి. గీత చేసిన నిర్వచనాలు ఈ దిశలోనే సాగినట్లు కనిపిస్తాయి. నిలువ ఉండటం వల్ల, పాడైన ఆహారాన్ని తామసిక ఆహారంగాను, కారంగా, ఘాటైన, దేహంలో ఉష్ణోగ్రత పెంచేది అనారోగ్యకరమైనది — రాజసిక ఆహారంగాను, హితవుగా ఉండి, ఆరోగ్యకరమైనది — సాత్వికాహారమని — గీత నిర్వచనాలు తెలియచేస్తాయి. శారీరకంగా ఎలా పనిచేస్తాయి అనేదానిని పక్కన పెడితే — వివిధములైన ఆహారాలు వివిధ రకాలైన గుణకర్మలను పోషిస్తాయి. పరోక్షంగా అవి సహకరించేవిగా లేదా హాని కలిగించేవిగా ఉంటాయి. అంతే. అంతవరకే. తినే పదార్థాలు ఏవి సాత్వికమైనవి, సాత్వికం కానివి — నిర్ణయించటం — అది వేరే ప్రశ్న. నిర్ణయించటం కష్టం. ఆహారం యొక్క ఫలితం దానికి సంబంధించి, నిగూఢంగా దానికి చుట్టూ ఉన్న వాతావరణ ప్రభావాలపై — మరియే ఇతర వాటికంటె కూడా ఆధారపడి ఉంటుంది. శాకాహార విధానం ప్రత్యేకంగా — అది వేరే ప్రశ్న. నీ కడుపు కోసం చైతన్యరూపాల ప్రాణికోటికి హాని కలిగించకూడదు అనుకునే నీ ఇచ్ఛాశక్తిపై, ఇది, ఆధారపడి ఉంటుంది.

అన్ని రకాలైన ఆహారాన్ని సమానంగా ఆస్వాదించే సాధన చేయటం అనే ప్రశ్న అనవసరం. ఇది సాధన చేస్తే వచ్చేది కాదు. సమతను చైతన్యపరంగా ఆంతర్యంలో సాధించాలి. ఈ సమభావం పెంపొసగేకొలదీ, దీనిని, పలు రకాలైన చైతన్య క్రియాక్షేత్రాలకి విస్తరించటం, లేదా, అనుసంధానం కావించగలుగుతావు.

రుచికి, అభిరుచికి దాసోహం కానంతవరకు, అది, ఆమోదయోగ్యమే, సహజమే. వ్యామోహం లేనంతవరకు అది నీకు బంధం కాదు.

*

చూడటం, వినటం కంటె కూడా (దృశ్య, శ్రవణాలు) అభిరుచి, నేరం కాదు. వదిలించుకో వలసినది — దానిని ప్రేరేపించే కామనను.

*

అవచేతనా పదార్థానికి — గతం సృష్టించే ఒక కృత్రిమమైన అవసరాన్ని సంవేదించటం ఒక అలవాటు. నాడీమండలానికి (నరాలకి) అది హానికరమైనా, కలత పెట్టేదైనా పట్టించుకోదు. అన్ని పదార్థాలకి స్వాభావికంగా ఈ జబ్బు ఉంది. వాటి తాలూకు హానికర పరిణామాలు, తర్వాతా కూడా దానిని పట్టుకుని వ్రేలాడుతూనే ఉంటాయి. వాటి వల్ల పొందే వాస్తవ ప్రయోజనం నశించినా వదలరు. వాటి తాలూకు కృత్రిమ వ్యామోహం అలాంటిది. తమ అవచేతన స్థాయిలో కొనసాగే దాని ఉనికిని వారి ఇచ్ఛాశక్తి పట్టుకుని చెదరగొట్టాలి.

*

శ్రీఅరవిందుల 'యోగమూలములు' – 13 వ అధ్యాయం —'ఆహార, నిద్రా, మైధునములు' నుంచి:

ప్రశ్న: అల్పంగా ఆహారం తీసుకోవటం వల్ల అది ఇంద్రియ నిగ్రహానికి సహకరిస్తుందా?

సహకరించదు. వాటిని మరింత రెచ్చగొడుతుంది. పరిమిత పరిమాణంలో భుజించటం సర్వోత్కృష్టం. పదే పదే సులువుగా ఉపవాసాలు ఉండేవారు తమ సమతూకాన్ని కోల్పోయే ప్రమాదముంది.

ప్రశ్న: శాకాహారం మాత్రమే భుజించటం వల్ల, అది ఇంద్రియనిగ్రహానికి సహాయ పడుతుందా?

ఇది మాంసాహారులకు ఉండే కొన్ని ఇబ్బందులను వైదొలగిస్తుంది. కాని దాని కది చాలదు.

మూలము: శ్రీఅరవిందులు

అనువాదము: కర్రా వెంకటేశ్వర్లు